SIVA PURANA
SATA RUDRA SAMHITHA

7



KAUSIKI



శ్రీ శివ మహా పురాణము

శత రుద్ర సంహితము

1 – శివుని అయిదు అవతారములు

శ్రీ గణేశాయ నమః ।

అథ తృతీయా శతరుద్రసంహితా ప్రారభ్యతే ॥

వందే మహానంద మనంతలీలం మహేశ్వరం సర్వవిభుం మహాంతమ్ ।

గౌరీప్రియం కార్తిక విఘ్నరాజ సముద్భవం శంకర మాది దేవమ్ ॥

శ్రీ గణేశునకు నమస్కరించి మూడవదియగు శతరుద్ర సంహిత ఆరంభింపబడుచున్నది.

ఆనందఘనుడు, అనంతమగు లీలలు గలవాడు, మహేశ్వరుడు, సర్వవిభుడు, పరబ్రహ్మ, గౌరీపతి, కుమారస్వామి మరియు విఘ్నేశ్వరులకు తండ్రి, ఆదిదేవుడు అగు శంకరుని నమస్కరించుచున్నాను.

శౌనక ఉవాచః

వ్యాస శిష్య మహాభాగ సూత జ్ఞాన దయానిధే ।

వద శంభ్వవతారాంశ్చ యై రకార్షీత్సతాం శివమ్ ॥

శౌనకుడిట్లు పలికెను-

ఓయీ వ్యాస శిష్యా ! మహాత్మా ! సూతా! నీవు జ్ఞానమునకు, దయకు నిధివి. శంభుడు ఏ అవతారములలో సత్పురుషులకు మంగళములను కలిగించినాడో, వాటిని చెప్పుము.

సూత ఉవాచః

మునే శౌనక సద్భక్త్యా దత్త చిత్తో జితేంద్రియః ।

అవతారాన్ శివస్యాహం వచ్మి తే మునయే శృణు ॥

ఏతత్పృష్టః పురా నందీ శివమూర్తి స్సతాం గతిః ।

సనత్కుమారేణ మునే తమువాచ శివం స్మరన్ ॥

సూతుడిట్లు పలికెను –

ఓ శౌనకమహర్షీ ! నేను జితేంద్రియుడనై మనస్సును లగ్నముచేసి పరమభక్తితో శివుని అవతారములను మహర్షివగు నీ కొరకు చేప్పేదను వినుము (3). శివస్వరూపుడు, సత్పురుషులకు శరణ్యుడు అగు నందీశ్వరుని పూర్వము సనత్కుమారుడు ఇటులనే పృచ్ఛించెను. ఓ మహర్షీ! అపుడాయన శివుని స్మరించి సనత్కుమారునితో నిట్లనెను.

నందీశ్వర ఉవాచః

అసంఖ్యాతా హి కల్పేషు విభోస్సర్వేశ్వరస్య వై।
అవతారాస్త థాపీహ వచ్మ్యహం తాన్యథామతి ॥
ఏకోనవింశకః కల్పో విజ్ఞేయశ్శ్వేతలోహితః ।
సద్యో జాతావతారస్తు ప్రథమః పరికీర్తితః ॥
తస్మింస్తత్పరమం బ్రహ్మ ధ్యాయతో బ్రహ్మణస్తథా ।
ఉత్పన్నస్తు శిఖాయుక్తః కుమారశ్శ్వేతలోహితః ॥
తం దృష్ట్వా పురుషం బ్రహ్మా బ్రహ్మరూపిణ మీశ్వరమ్ ।
జ్ఞాత్వా ధ్యాత్వా స హృదయే వవందే ప్రయతాంజలిః ॥
సద్యోజాతం శివం బుద్ధ్వా జహర్ష భువనేశ్వరః ।
ముహుర్ముహుశ్చ సద్బుద్ధ్యా పరం తం సమచింతయత్ ॥
తతోఽస్య ధ్యాయతశ్శ్వేతాః ప్రాదుర్భూతా యశస్వినః ।
కుమారాః పరవిజ్ఞాన పరబ్రహ్మ స్వరూపిణః ॥
సునందో నందనశ్చైవ విశ్వనందోప నందనౌ ।
శిష్యాస్తస్య మహాత్మానో యైస్తద్బ్రహ్మ సమావృతమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

సర్వవ్యాపకుడు, సర్వేశ్వరుడు అగు శివుడు వివిధకల్పములలో స్వీకరించిన అవతారములకు లెక్క లేదు. అయిననూ, నా బుద్ధికి తోచిన వాటిని నేను చెప్పెదను (5). పందొమ్మిదవ కల్పమునకు శ్వేత లోహితమని పేరు. ఆ కల్పములో మొదటిది యగు సద్యోజాతావతారము సంపన్నమైనదని మహర్షులు చెప్పెదరు (6). ఆ కల్పములో పరబ్రహ్మను ధ్యానించుచున్న బ్రహ్మనుండి శిఖతో కూడినవాడు, తెలుపు, ఎరుపు రంగు గలవాడు నగు కుమారుడు జన్మించెను (7) బ్రహ్మ ఆ పురుషుని గాంచి, ఆతడు పరబ్రహ్మరూపుడగు ఈశ్వరుడని గుర్తించి హృదయములో ధ్యానించి చేతులు జోడించి నమస్కరించెను (8). జగత్ప్రభువగు బ్రహ్మ శివుడు సద్యో జాతరూపముగా అవతరించినాడని యెరింగి గొప్ప ఆనందమును పొంది, పవిత్రమగు మనస్సుతో ఆ పరమాత్మను పలుమార్లు ధ్యానించెను (9). బ్రహ్మ ఇట్లు ధ్యానించుచుండగా తెల్లని వర్ణము గలవారు, కీర్తిమంతులు, మహాజ్ఞానులు, పరబ్రహ్మస్వరూపులునగు కుమారులు జన్మించిరి (10). సునందుడు, నందనుడు, విశ్వనందుడు, ఉపనందనుడు అను పేర్లు గల ఆ మహాత్ములు బ్రహ్మకు శిష్యులైరి. వారిచే ఆ బ్రహ్మలోకము వ్యాపించబడెను.

సద్యోజాతశ్చ వై శంభుర్దదౌ జ్ఞానం చ వేధసే।
సర్గశక్తి మపి ప్రీత్యా ప్రసన్నః పరమేశ్వరః ॥
– ఇతి సద్యో జాతావతారః ॥

సద్యోజాతావతారుడు, పరమేశ్వరుడు అగు శంభుడు ప్రీతితో బ్రహ్మకు జ్ఞానమును మరియు సృష్టించే సామర్థ్యమును ఇచ్చెను.

తతో వింశతిమః కల్పో రక్తో నామ ప్రకీర్తితః ।
బ్రహ్మా తత్ర మహాతేజా రక్తవర్ణ మధారయత్ ॥
ధ్యాయతః పుత్రకామస్య ప్రాదుర్భూతో విధేస్సుతః ।
రక్తమాల్యాంబరధరో రక్తాక్షో రక్తభూషణః ॥
స తం దృష్ట్వా మహాత్మానం కుమారం ధ్యానమాశ్రితః ।
వామదేవం శివం జ్ఞాత్వా ప్రణనామ కృతాంజలిః ॥
తతస్తస్య సుతా హ్యాసంశ్చత్వారో రక్త వాససః ।
విరజాశ్చ వివాహశ్చ విశో కో విశ్వభావనః ॥
వామదేవస్స వై శంభుర్దదౌ జ్ఞానం చ వేధసే ।
సర్గశక్తి మపి ప్రీత్యా ప్రసన్నః పరమేశ్వరః ॥
- ఇతి వామదేవావతారః ॥

తరువాత ఇరువదియవ కల్పము వచ్చెను. దానికి రక్తకల్పమని పేరు. ఆ కల్పము నందు బ్రహ్మ ఎరుపు రంగును కలిగి యుండెను (13). బ్రహ్మ పుత్రుని గోరి ధ్యానించుచుండగా ఆతనికి పుత్రుడు కలిగినాడు. ఆ కుమారుడు ఎర్రని మాలను మరియు వస్త్రములను ధరించియుండెను. ఎర్రని కన్నులు గల ఆ కుమారుడు ఎర్రని ఆభరణములను ధరించెను.(14). బ్రహ్మ మహాత్ముడగు ఆ కుమారుని చూచి, ధ్యానమార్గములో ఆతడు శివుని వామదేవావతారమని యెరింగి చేతులు జోడించి నమస్కరించెను (15). తరువాత అతనికి విరజసుడు, వివాహుడు, విశోకుడు, విశ్వభావనుడు అను పేర్లు గల, ఎర్రని వస్త్రములను ధరించిన నల్గురు కుమారులు కలిగిరి (16). వామదేవరూపుడు, పరమేశ్వరుడునగు ఆ శంభుడు ప్రసన్నుడై బ్రహ్మకు జ్ఞానమును మరియు సృష్టి సామర్థ్యమును ప్రీతితో నొసంగేను.

ఏకవింశతిమః కల్పః పీత వాసా ఇతి స్మృతః।
బ్రహ్మా యత్ర మహాభాగః పీతవాసా బభూవ హ ॥
ధ్యాయతః పుత్రకామస్య విధేర్జాతః కుమారకః ।
పీతవస్త్రాదిక దేహో మహాతేజా మహాభుజః ॥
తం దృష్ట్వా ధ్యానసంయుక్తః జ్ఞాత్వా తత్పురుషం శివమ్ ।
ప్రణనామ తతో బుద్ధ్వా గాయత్రీం శాంకరీం విధిః ॥
జపిత్వా తు మహాదేవీం సర్వలోక నమస్కృతామ్ ।
ప్రసన్నస్తు మహాదేవో ధ్యానయుక్తేన చేతసా ॥
తతోఽస్య పార్శ్వతో దివ్యాః ప్రాదుర్భూతాః కుమారకాః ।
పీతవస్త్రా హి సకలా యోగమార్గ ప్రవర్తకాః ॥
- ఇతి తత్పురుషావతారః ॥

ఇరువది ఒకటవ కల్పమునకు పీతవాసః కల్పము అని పేరు. ఆ కల్పములో మహానుభావుడగు బ్రహ్మ పచ్చని వస్త్రమును ధరించెను (18). పుత్రుని గోరి ధ్యానమును చేయుచున్న బ్రహ్మకు పచ్చని వస్త్రము మొదలగు వాటితో గంభీరమైన వాడు, గొప్ప తేజశ్శాలి, మహాబాహుడునగు కుమారుడు జన్మించెను (19). బ్రహ్మ ఆ బాలకుని చూచి ధ్యానమార్గమును పొంది అతడు శివుని తత్పురుషావతారమని యెరింగి, ఆయనకు నమస్కరించి, శంకరగాయత్రిని జపించెను (20), సర్వలోకములచే నమస్కరింపబడే మహాదేవ గాయత్రిని మనస్సులో బ్రహ్మ ధ్యానించగా మహాదేవుడు ప్రసన్నుడాయెను (21), తరువాత ఆతని పార్శ్వ భాగమునుండి పచ్చని వస్త్రములను ధరించిన దివ్యకుమారులు ప్రకటమైరి. వారందరు యోగమార్గమును ప్రవర్తిల్లజేసిరి.

తతస్తస్మిన్ గతే కల్పే పీతవర్ణే స్వయంభువః ।
పునరన్యః ప్రవృత్తస్తు కల్పో నామ్నా శివస్తు సః ॥
ఏకార్ణవే సంవ్యతీతే దివ్యవర్ష సహస్రకే ।
స్రష్టుకామః ప్రజా బ్రహ్మ చింతయామాస దుఃఖితః ॥
తతోఽపశ్యన్మహాతేజాః ప్రాదుర్భూతం కుమారకమ్ ।
కృష్ణవర్ణం మహావీర్యం దీప్యమానం స్వతేజసా ॥
ధృతకృష్ణాంబరోష్ణీషం కృష్ణయజ్ఞోప వీతినమ్ ।
కృష్ణేన మౌళినా యుక్తం కృష్ణస్నానానులేపనమ్ ॥
స తం దృష్ట్వా మహాత్మానమ ఘోరం ఘోరవిక్రమమ్ ।
వవందే దేవదేవేశమద్భుతం కృష్ణపింగలమ్ ॥
అఘోరం తు తతో బ్రహ్మ బ్రహ్మరూపం వ్యచింతయత్ ।
తుష్టావ వాగ్భిరిష్టాభిర్భక్తవత్సల మవ్యయమ్ ॥

తరువాత స్వయంభువుడగు బ్రహ్మగారి పీతవర్ణకల్పము గడచిపోయెను. శివమను పేరు గల మరియొక కల్పము మరల ఆరంభమయ్యెను (23). సర్వము జలమయమై ఉన్న అవస్థలో వేయి దివ్య సంవత్సరములు గడచెను. అపుడు బ్రహ్మ ప్రజలను సృష్టించగోరి దుఃఖితుడై చింతిల్లెను (24). అపుడు బ్రహ్మ చూచుచుండగా గొప్ప తేజశ్శాలి, నల్లని రంగు గలవాడు, మహాపరాక్రమశాలీ, తన తేజస్సుచే వెలిగి పోవుచున్నవాడు, నల్లని వస్త్రముల తలపాగాను ధరించినవాడు, నల్లని యజ్ఞోపవీతముగలవాడు, నల్లని కిరీటమును ధరించినవాడు, స్నానము చేసి నల్లని చందనమును ధరించినవాడు అగు కుమారుడొకడు జన్మించుటను గాంచెను (25, 26), మహాత్ముడు, భయంకరమగు పరాక్రమము గలవాడు, దేవదేవేశుడు, ఆశ్చర్యమును కలిగించువాడు, కృష్ణపింగళ వర్ణములు గలవాడు అగు ఆ అఘోరుని బ్రహ్మ గాంచెను (27). అపుడు బ్రహ్మ పరబ్రహ్మస్వరూపుడగు అఘోరుని ధ్యానించెను. భక్తప్రియుడు, అక్షరుడునగు ఆ పరమేశ్వరుని ప్రియవచనములతో స్తుతించెను.

అథాస్య పార్శ్వతః కృష్ణాః కృష్ణస్నానానులేపనాః ।
చత్వారస్తు మహాత్మానస్సంబభూవుః కుమారకాః ॥
కృష్ణః కృష్ణ శిఖశ్చైవ కృష్ణాస్యః కృష్ణకంఠధృక్ ।
ఇతి తేఽవ్యక్తనామాన శ్శివరూపాస్సుతేజసః ॥
ఏవం భూతా మహాత్మానో బ్రహ్మణస్సృష్టిహేతవే ।
యోగం ప్రవర్తయామాసుర్ఘోరాఖ్యం మహదద్భుతమ్ ॥
- ఇతి అఘోరావతారః

అపుడాతని పార్శ్వమునుండి నల్లని వారు, స్నానముచేసి నల్లని చందనమును ధరించినవారు, మహాత్ములు అగు నల్గురు కుమారులు జన్మించిరి (29). కృష్ణుడు, కృష్ణశిఖుడు, కృష్ణాస్యుడు, కృష్ణకంఠధృక్ అనునవి వారి పేర్లు. అప్రసిద్ధమగు నామములు గల ఆ నలుగురు తేజశ్శాలురు శివస్వరూపులే (30). ఈ విధముగా బ్రహ్మగారి సృష్టికొరకై ఆవిర్భవించిన ఆ మహాత్ములు ఘోరమను పేరు గలది, గొప్పది, అద్భుతమైనది అగు యోగమును లోకములో ప్రవర్తిల్ల జేసిరి.

అథాన్యో బ్రహ్మణః కల్పః ప్రావర్తత మునీశ్వరాః ।
విశ్వరూప ఇతి ఖ్యాతో నామతః పరమాద్భుతః ॥
బ్రహ్మణః పుత్రకామస్య ధ్యాయతో మనసా శివమ్ ।
ప్రాదుర్భూతా మహానాదా విశ్వరూపా సరస్వతీ ॥
తథావిధస్స భగవానీశానః పరమేశ్వరః ।
శుద్ధస్ఫటిక సంకాశస్సర్వాభరణ భూషితః ॥
తం దృష్ట్వా ప్రణనామాసౌ బ్రహ్మేశానమజం విభుమ్ ।
సర్వగం సర్వదం సర్వం సురూపం రూపవర్జితమ్ ॥
ఈశానోఽపి తథాదిశ్య సన్మార్గం బ్రహ్మణే విభుః ।
సశక్తిః కల్పయాంచక్రే స బాలాంశ్చతురశ్శుభాన్ ॥
జటీ ముండీ శిఖండీ చ అర్ధముండశ్చ జజ్ఞిరే ।
యోగేనాదిశ్య సద్ధర్మం కృత్వా యోగగతిం గతాః ॥
- ఇతి ఈశానావతారః ॥

ఓ మహర్షులారా! తరువాత బ్రహ్మగారి మరియొక కల్పము ఆరంభమయ్యేను. గొప్ప అద్భుతమగు ఆ కల్పమునకు విశ్వరూపమని పేరు ప్రసిద్ధి గాంచెను (32). బ్రహ్మ పుత్రుని గోరి మనస్సులో శివుని ధ్యానించుచుండగా గొప్ప నాదముగలది, విశ్వము రూపముగా గలది యగు సరస్వతి ఆవిర్భవించెను (33). అదే విధముగా భగవానుడగు ఆ పరమేశ్వరుడు స్వచ్ఛమగు స్ఫటికమువలె ప్రకాశించువాడు, ఆభరణములన్నింటితో అలంకరింప బడినవాడు నగు ఈశాన రూపములో ఆవిర్భవించెను (34). పుట్టుక లేనివాడు, సర్వవ్యాపి, సర్వమును పొందువాడు, సర్వమును ఇచ్చువాడు, సర్వజగత్స్వరూపుడు, సుందరాకారుడు, కానీ రూపములేనివాడు అగు ఆ ఈశానుని గాంచి బ్రహ్మ ప్రణమిల్లెను (35). శక్తితో

గూడియున్నవాడు, సర్వవ్యాపి అగు ఈశానుడు కూడ బ్రహ్మకు ధర్మ మార్గమును ఆదేశించి మంగళస్వరూపులగు నలుగురు బాలకులను సృజించెను (36). అట్లు జన్మించిన ఆ నల్గురు బాలకులకు జటి, ముండి, శిఖండి మరియు అర్ధముండుడు అని పేర్లు. వారు యోగ బుద్ధితో సద్ధర్మమునునుష్ఠించి, యోగులు పొందు గతిని పొందిరి.

ఏవం సంక్షేపతః ప్రోక్తః సద్యాదీనాం సముద్భవః ।
సనత్కుమార సర్వజ్ఞ లోకానాం హితకామ్యయా ॥
అథ తేషాం మహాప్రాజ్ఞ వ్యవహారం యథా యథమ్ ।
త్రిలోకహితకారం హి సర్వం బ్రహ్మాండ సంస్థితమ్ ॥
ఈశానః పురుషో ఘోరో వామసంజ్ఞ స్తథైవ చ ।
బ్రహ్మ సంజ్ఞా మహేశస్య మూర్తయః పంచ విశ్రుతాః ॥
ఈశాన శ్శివరూపశ్చ గరీయాన్ ప్రథమస్స్మృతః ।
భోక్తారం ప్రకృతే స్సాక్షాత్ క్షేత్రజ్ఞ మధితిష్ఠతి ॥
శైవస్తత్పురుషాఖ్యశ్చ స్వరూపో హి ద్వితీయకః।
గుణాశ్రయాత్మకం భోగ్యం సర్వజ్ఞ మధితిష్ఠతి ॥
ధర్మాయ స్వాంగసంయుక్తం బుద్ధితత్త్వం పినాకినః।
అఘోరాఖ్య స్వరూపో యస్తిష్ఠత్యంతస్తృతీయకః ॥
వామదేవాహ్వయో రూపశ్చతుర్థశ్శంకరస్య హి ।
అహంకృతేరధి ష్ఠానో బహుకార్యకరస్సదా ॥
ఈశానాహ్వ స్వరూపో హి శంకరస్యేశ్వరస్సదా ।
శ్రోత్రస్య వచసశ్చాపి విభోర్వ్యోమ్న స్తథైవ చ ॥

ఓయీ! సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. నేను మానవుల హితమును గోరి సద్యోజాతాది అవతారముల ప్రాదుర్భావమును ఈ తీరున సంగ్రహముగా చెప్పితిని (38). ఓయీ మహాబుద్ధిశాలీ! వారు బ్రహ్మాండమునంతనూ వ్యాపించి ముల్లోకములకు హితమును చేయగోరి ఎట్టి విధముగా ప్రవర్తిల్లుచున్నారో యథాతథముగా ఇపుడు చెప్పెదను (39). ఈశానుడు, తత్పురుషుడు, అఘోరుడు, వామదేవుడు, బ్రహ్మ అను పేర్లు గల మహేశ్వరుని అయిదు రూపములు లోకప్రసిద్ధిని గాంచినవి (40). శివరూపములలో శ్రేష్ఠుడగు ఈశానుడు ప్రథమస్థానములో నుండునని మహర్షులు చెప్పినారు. ఆయన ప్రకృతిని అనుభవించు క్షేత్రజ్ఞుని స్వయముగా అధిష్ఠించి యుండును (41). శివుని రెండవ రూపమునకు తత్పురుషుడని పేరు. ఆయన గుణములకు ఆశ్రయమగు ప్రకృతియే స్వరూపముగా కలిగి భోగ్యమైన సర్వజ్ఞతత్త్వమును అధిష్ఠించి యుండును (42).

పినాకధారియగు శివుని మూడవ రూపమగు అఘోరుడు ధర్మము కొరకై అంగములతో గూడిన బుద్ధి తత్త్వము నాశ్రయించి ఉండును (43). శంకరుని నాల్గవ రూపమునకు వామదేవుడని పేరు. ఆయన అహంకారమునధిష్ఠించి, సర్వదా వివిధకార్యముల ననుష్ఠించుచుండును శంకరుని స్వరూపమగు ఈశానుడు శ్రోత్రేంద్రియమునకు, వాక్కునకు మరియు వ్యాపకమగు ఆకాశమునకు సర్వదా అధిష్ఠానదైవమై యుండును.

త్వక్పాణి స్పర్శ వాయూనామీశ్వరం రూపమేశ్వరమ్ ।
పురుషాఖ్యం విచారజ్ఞా మతిమంతః ప్రచక్షతే ॥
వపుషశ్చ రసస్యాపి రూపస్యాగ్నేస్తథైవ చ ।
అఘోరాఖ్య మధిష్ఠానం రూపమాహుర్మనీషిణః ॥
రసనాయాశ్చ పాయోశ్చ రసస్యాపాం తథైవ చ ।
ఈశ్వరం వామదేవాఖ్యం స్వరూపం శాంకరం స్మృతమ్ ॥
ఘ్రాణస్య చైవోపస్థస్య గంధస్య చ భువస్తథా ।
సద్యో జాతాహ్వయం రూపమీశ్వరం శాంకరం విదుః ॥
ఇమే స్వరూపాశ్శంభోర్హి వందనీయాః ప్రయత్నతః।
శ్రేయోఽర్థి భిర్న రైర్నిత్యం శ్రేయసామేక హేతవః ॥
యః పఠేచ్ఛృణు యాద్వాపి స ద్యాదీనాం సముద్భవమ్ ।
స భుక్త్వా సకలాన్ కామాన్ ప్రయాతి పరమాం గతిమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం శివస్య పంచావతార
వర్ణనం నామ ప్రథమోఽధ్యాయః.

చర్మము, చేతులు, స్పర్శ మరియు వాయువులకు పరమేశ్వరుని పురుషుడను పేరుగల రూపము అధీశ్వరుడని శాస్త్రమునెరింగిన బుద్ధిమంతులు చెప్పుచున్నారు (46). శరీరమునకు, రసమునకు, రూపమునకు మరియు అగ్నికి అఘోరరూపము అధిష్ఠానమని పండితులు చెప్పెదరు (47). వామదేవుడనే శంకరావతారము జిహ్వకు, విసర్జనేంద్రియమునకు, రసమునకు మరియు జలములకు అధీశ్వరుడని మహర్షులు చెప్పెదరు (48). ఘ్రాణేంద్రియము, ఉపస్థ, గంధము, మరియు భూమి అను వాటికి శంకరుని సద్యోజాతరూపము అధీశ్వరుడని చెప్పెదరు (49). ఈ శంభుని రూపములు. శ్రేయస్సునకు ఏకైక కారణములు గనుక, శ్రేయస్సును గోరు మానవులు ప్రతిదినము ఈ రూపములకు శ్రద్ధతో వందనమాచరించవలెను (50). సద్యోజాతాది అవతారముల ఉత్పత్తిని ఏ మానవుడు పఠించునో లేక వినునో, అట్టివాడు కోర్కెలనన్నిటినీ అనుభవించి పరమపదమును పొందును.

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహిత యందు శివుని పంచావతార వర్ణనమనే మొదటి అధ్యాయము ముగిసినది.

2 - అష్టమూర్తి తత్త్వము

నందీశ్వర ఉవాచః

శృణు తాత మహేశస్యావతారాన్ పరమాన్ ప్రభోః ।
సర్వకార్యకరాన్ లోకే సర్వస్య సుఖదాన్మునే ॥
తస్య శంభోః పరేశస్య మూర్త్యష్టకమయం జగత్ ।
తస్మిన్ వ్యాప్య స్థితం విశ్వం సూత్రే మణిగణా ఇవ ॥
శర్వో భవస్తథా రుద్ర ఉగ్రో భీమః పశోః పతిః ।
ఈశానశ్చ మహాదేవో మూర్తయశ్చాష్ట విశ్రుతాః ॥
భూమ్యంభోఽగ్నిమరుద్ వ్యోమక్షేత్రజ్ఞార్క నిశాకరాః ।
అధిష్ఠితాశ్చ శర్వాద్యైరష్ట రూపై శ్శివస్య హి ॥
ధత్తే చరాచరం విశ్వం రూపం విశ్వం భరాత్మకమ్ ।
శంకరస్య మహేశస్య శాస్త్ర స్యైవేతి నిశ్చయః ॥
సంజీవనం సమస్తస్య జగతస్సలిలాత్మకమ్ ।
భవ ఇత్యుచ్యతే రూపం భవస్య పరమాత్మనః ॥
బహిరంతర్జగద్విశ్వం బిభర్తి స్పందతే స్వయమ్ ।
ఉగ్ర ఇత్యుచ్యతే సదీ రూపముగ్రస్య సత్ప్రభోః ॥
సర్వావకాశదం సర్వవ్యాపకం గగనాత్మకమ్ ।
రూపం భీమస్య భీమాఖ్యం భూపబృందస్య భేదకమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

వత్సా ! మహర్షీ! మహేశ ప్రభుని గొప్ప అవతారములను వినుము. ఈ అవతారములు లోకము నందు కార్యముల నన్నిటినీ చక్కబెట్టి సర్వులకు సుఖమునిచ్చును (1). పరమేశ్వరుడగు ఆ శంభుని ఎనిమిది మూర్తులతో ఈ జగత్తు నిండియున్నది. దారము నందు మణుల పూసలువలె, ఈ జగత్తు అంతయూ ఆయన యందు ప్రతిష్ఠను పొంది ఆయనచే వ్యాప్తమై యున్నది (2). శర్వుడు, భవుడు, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, పశుపతి, ఈశానుడు మరియు మహాదేవుడు అనునవి అష్టమూర్తుల నామ ధేయములుగా ప్రసిద్ధి గాంచినవి (3). శర్వుడు మొదలగు ఈ శివుని అష్టమూర్తులచే క్రమముగా భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, క్షేత్రజ్ఞుడు (జీవుడు), సూర్యుడు మరియు చంద్రుడు అధిష్ఠింపబడి యున్నారు (4), మంగళకరుడగు మహేశునియొక్క భూమి అనే మూర్తి స్థావర జంగమాత్మకమగు ప్రాణి కోటిని అంతనూ ధరించి యున్నదనీ శాస్త్రము నిర్ణయించినది (5). పరమాత్మ, సద్గనుడు అగు శివుని భవ అనుపేరు గల మూర్తి జలరూపములో సర్వప్రాణులకు ప్రాణములను నిలబెట్టుచున్నదని మహర్షులు చెప్పుచున్నారు (6). పాపులకు భయంకరుడు, సత్పురుషులకు శరణు అగు శివుని రూపమైన ఉగ్రుడు ప్రాణుల లోపల, బయట తానే ఉండి క్రియా రూపములో విశ్వమును భరించుచున్నాడని సత్పురుషులు చెప్పుచున్నారు (7).

సర్వపదార్థములకు అవకాశము నిచ్చునది, సర్వమును వ్యాపించియున్నది, ప్రాణి సమూహములో భేదమునకు ఆలంబనమైనది అగు ఆకాశముయొక్క రూపములో భయంకరాకారుడగు శివుని మూర్తియే గలదు. ఆ మూర్తికి భీముడని పేరు.

సర్వాత్మనామధిష్ఠానం సర్వక్షేత్ర నివాసకమ్ ।
రూపం పశుపతేర్జ్ఞేయం పశుపాశవికృంతనమ్ ॥
సందీపయజ్జగత్సర్వం దివాకర సమాహ్వయమ్ ।
ఈశానాఖ్యం మహేశస్య రూపం దివి విసర్పతి ॥
ఆప్యాయయతి యో విశ్వమమృతాంశుర్నిశాకరః ।
మహాదేవస్య తద్రూపం మహాదేవస్య చాహ్వయమ్ ॥
ఆత్మా తస్యాష్టమం రూపం శివస్య పరమాత్మనః ।
వ్యాపికేతరమూర్తీనాం విశ్వం తస్మాచ్ఛివాత్మకమ్ ॥
శాఖాః పుష్యంతి వృక్షస్య వృక్షమూలస్య సేచనాత్ ।
తద్వదస్య వపుర్విశ్వం పుష్యతే చ శివార్చ నాత్ ॥
యథేహ పుత్రపౌత్రాదేః ప్రీత్యా ప్రీతో భవేత్పితా ।
తథా విశ్వస్య సంప్రీత్యా ప్రీతో భవతి శంకరః ॥
క్రియతే యస్య కస్యాపి దేహినో యది నిగ్రహః ।
అష్టమూర్తేరనిష్టం తత్కృతమేవ న సంశయః ॥

ఆత్మలన్నింటికీ అధిష్ఠానము, క్షేత్రము (దేహము) లన్నింటి యందు నివసించునది, జీవుల సంసార బంధములను తెగగోయునదీ అగు శంకరమూర్తికి పశుపతి యని పేరు (9). మహేశుని ఈశానుడను పేరు గల మూర్తి సూర్యరూపములో జగత్తు నంతనూ ప్రకాశింప జేయుచూ ద్యులోకమునందు సంచరించుచున్నది (10). మహాదేవుడను పేరుగల మహాదేవుని మూర్తి చంద్రరూపములో అమృత కిరణములను జగత్తుపై వెదజల్లి పుష్టిని, తృప్తిని కలిగించుచున్నది (11). శివపరమాత్మని ఎనిమిదివ రూపము ఆయన ఆత్మయే. ఆ రుద్రరూపము ఇతరమూర్తులన్నింటితో గూడిన జగత్తును వ్యాపించియుండును గనుక, అది శివుని స్వరూపమే (12). చెట్టు మొదట్లో నీరు పోసినచో కొమ్మలకు పుష్టి కలుగును. అటులనే, శివుని ఆరాధించినచో, ఆయన దేహము అయిన జగత్తునకు పుష్టి కలుగును (13). ఈ లోకములో పుత్రులు, పౌత్రులు మొదలగు వారి ఆనందమును గాంచి తండ్రి ఆనందించును. అటులనే, జగత్తు ఆనందించినచో శంకరుడు ప్రీతుడగును (14). ఏ ప్రాణికైననూ కష్టమును కలిగించినచో, అది ఆ అష్టమూర్తియగు శివునకు అప్రియమును చేసినట్లు అగును. సందేహము వలదు. ఇది నిశ్చయము.

అష్టమూర్త్యాత్మనా విశ్వమధిష్ఠాయాస్థితం శివమ్ ।

భజస్వ సర్వభావేన రుద్రం పరమకారణమ్ ॥

ఇతి ప్రోక్తాస్స్వరూపాస్తే వీధిపుత్రాష్ట విశ్రుతాః ।

సర్వోపకార నిరతాస్సేవ్యా శ్రేయోఽర్థి భిర్నరైః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం శివాష్టమూర్తి వర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః.

అష్టమూర్తుల రూపములో జగత్తును అధిష్టించి యున్నవాడు, మంగళస్వరూపుడు, సర్వకారణకారణుడు అగు రుద్రుని 'సర్వము రుద్రుడే' యను భావముతో భజించుము (16), ఓయీ సనత్కుమారా! నీకు ఇంతవరకు విఖ్యాతి గాంచిన అష్ట మూర్తులను గురించి చెప్పితిని. సర్వప్రాణులకు హితమును చేయుటలో సంలగ్నమై యున్న ఈ అష్టమూర్తులను శ్రేయస్కాములగు మానవులు సేవించవలెను.

శ్రీ శివమహాపురాణములోని శతరుద్రసంహితయందలి శివాష్టమూర్తి వర్ణనమనే రెండవ అధ్యాయము ముగిసినది.

3 – అర్ధనారీశ్వరుడు

నందీశ్వర ఉవాచః

శృణు తాత మహాప్రాజ్ఞ విధికామప్రపూరకమ్ ।
అర్ధనారీ నరాఖ్యం హి శివరూప మనుత్తమమ్ ॥
యదా సృష్టాః ప్రజాస్సర్వా న వ్యవర్ధంత వేధసా ।
తదా చింతాకులోఽభూత్స తేన దుఃఖేన దుఃఖితః ॥
నభో వాణీ తదా భూద్వై సృష్టిం మిథునజాం కురు ।
తచ్ఛ్రుత్వా మైథునీం సృష్టిం బ్రహ్మా కర్తుమమన్యత ॥
నారీణాం కులమీశానాత్ నిర్గతం న పురా యతః ।
తతో మైథునజాం సృష్టిం కర్తుం శేకే న పద్మభూః ॥
ప్రభావేణ వినా శంభోర్న జాయేరన్నిమాః ప్రజాః ।
ఏవం సంచింతయన్ బ్రహ్మా తపః కర్తుం ప్రచక్రమే ॥
శివయా పరయా శక్త్యా సంయుక్తం పరమేశ్వరమ్ ।
సంచింత్య హృదయే ప్రీత్యా తేపే స పరమం తపః ॥
తీవ్రేణ తపసా తస్య సంయుక్తస్య స్వయం భువః ।
అచిరేణైవ కాలేన తుతోష స శివో ద్రుతమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

వత్సా! నీవు మహాబుద్ధిశాలివి. బ్రహ్మయొక్క ఆకాంక్షను పరిపూర్తి చేసినది, సర్వశ్రేష్ఠమైనదీ, సగము పురుషుడు సగము స్త్రీ గలది అగు శివావతారమును గూర్చి వినుము (1). బ్రహ్మచే సృష్టింపబడిన ప్రజలు వృద్ధి చెందకుండిరి. అపుడు బ్రహ్మ ఆ దుఃఖముచే పీడింపబడి మిక్కిలి చింతిల్లెను (2). స్త్రీ పురుష సమాగమము వలన కలిగే సృష్టిని చేయుము అని అపుడు ఆకాశవాణి చెప్పగా ఆ మాటను విని బ్రహ్మ మిథున సంభవమగు సృష్టిని చేయ సంకల్పించెను (3). కాని స్త్రీల సమూహము పూర్వము ఈశానుని నుండి ప్రకటము కాలేదు. కావున పద్మసంభవుడగు బ్రహ్మ స్త్రీ పురుష సంయోగ పూర్వక సృష్టిని చేయలేకపోయెను (4). శంభుని అనుగ్రహము లేనిదే ఈ సృష్టి జరుగదని భావించి బ్రహ్మ తపస్సును. చేయుట మొదలిడెను (5). పరాశక్తియగు ఈశ్వరితో గూడియున్న పరమేశ్వరుని హృదయములో ప్రేమ పూర్వకముగా ధ్యానించి బ్రహ్మ ఘోరమగు తపస్సును చేసెను (6). బ్రహ్మ కఠినమగు తపస్సును చేయగా, శివుడు కొద్దికాలములో నసే ప్రసన్నుడాయెను.

తతః పూర్ణచిదీశస్య మూర్తి మావిశ్య కామదామ్ ।
అర్ధనారీనరో భూత్వా తతో బ్రహ్మాంతకం హరః ॥
తం దృష్ట్వా శంకరం దేవం శక్త్యా పరమయాన్వితమ్ ।
ప్రణమ్య దండవద్బ్రహ్మా స తుష్టావ కృతాంజలిః ॥
అథ దేవో మహాదేవో వాచా మేఘ గభీరయా ।
సంభవాయ సుసంప్రీతో విశ్వకర్తా మహేశ్వరః ॥

అపుడు హరుడు పూర్ణ చిత్స్వరూపుడగు ఈశుని కామముల నీడేర్చు రూపములో ప్ర(వే)వేశించి సగము పురుషుడు, సగము స్త్రీ గల రూపమును దాల్చి బ్రహ్మవద్దకు విచ్చేసెను (8). పరమశక్తితో గూడియున్న ఆ శంకరదేవుని చూచి ఆ బ్రహ్మ సాష్టాంగ నమస్కారమును చేసి చేతులు జోడించి స్తుతించెను (9). అపుడు మహాదేవుడు, జగత్కర్తయగు మహేశ్వరదేవుడు బ్రహ్మయందు మిక్కిలి ప్రీతి గలవాడై మేఘగర్జనవలె గంభీరమగు స్వరముతో నిట్లనెను.

ఈశ్వర ఉవాచః

వత్స వత్స మహాభాగ మమ పుత్ర పితా మహ ।
జ్ఞాతవా నస్మి సర్వం తత్తత్త్వతస్తే మనోరథమ్ ॥
ప్రజానామేవ వృద్ధ్యర్థం తపస్తప్తం త్వయాధునా ।
తపసా తేన తుష్టోఽస్మి దదామి చ తవేప్సితమ్ ॥
ఇత్యుక్త్వా పరమోదారం స్వభావమధురం వచః ।
పృథక్ చకార వపుషో భాగాద్దేవీం శివాం శివః ॥
తాం దృష్ట్వా పరమాం శక్తిం పృథగ్భూతాం శివాగతమ్ ।
ప్రణిపత్య వినీతాత్మా ప్రార్థయామాస తాం విధిః ॥

ఈశ్వరుడిట్లు పలికెను -

వత్సా! కుమారా ! మహాత్మా! పితామహా! నీవు నా పుత్రుడవు. నీ మనోరథము యొక్కక స్వరూపమును నేను పూర్తిగా తెలుసుకొంటిని (11). నీవిపుడు ప్రజావృద్ధి కొరకు మాత్రమే తపము నాచరించితివి. నీ తపస్సుచే నేను సంతుష్టుడనైతిని. నీ కోర్కెను నేను తీర్చెదను (12). శివుడు స్వభావముచే మధురమైన, మిక్కిలి దయాగుణముతో నిండియున్న ఈ పలుకులను పలికి, శరీర పార్శ్వమునుండి ఉమాదేవిని వేరుచేసెను. శివుని నుండి విడివడి బయటకు వచ్చిన ఆ పరమశక్తిని గాంచి బ్రహ్మ వినయముతో నిండిన. మనస్సుతో ప్రణమిల్లి ఆమెను ప్రార్థించెను.

బ్రహ్మోవాచ।

దేవ దేవేన సృష్టోఽహమదౌ త్వత్పతినా శివే ।
ప్రజాస్సర్వా నియుక్తాశ్చ శంభునా పరమాత్మనా ॥
మనసా నిర్మితాస్సర్వే శివే దేవాదయో మయా ।
న వృద్ధి ముపగచ్ఛంతి సృజ్యమానాః పునః పునః ॥
మిథున ప్రభవామేవ కృత్వా సృష్టిమతః పరమ్ ।
సంవర్ధయితు మిచ్ఛామి సర్వా ఏవ మమ ప్రజాః ॥
న నిర్గతం పురా త్వత్తో నారీణాం కులమవ్యయమ్ ।
తేన నారీకులం స్రష్టుం మమ శక్తిర్న విద్యతే ॥
సర్వాసామేవ శక్తీనాం త్వత్తః ఖలు సముద్భవః ।
తస్మాత్త్వాం పరమాం శక్తిం ప్రార్థయామ్య ఖిలేశ్వరీమ్ ॥
శివే నారీకులం స్రష్టుం శక్తిం దేహి నమోఽస్తు తే ।
చరాచరం జగద్వృద్ధి హేతో ర్మాత శ్శివ ప్రియే ॥
అన్యం త్వత్తః ప్రార్థయామి వరం చ వరదేశ్వరి ।
దేహి మే తం కృపాం కృత్వా జగన్మాతర్నమోఽస్తు తే ॥
చరాచర వివృద్ధ్యర్థ మీశేనైకేన సర్వగే ।
దక్షస్య మమ పుత్రస్య పుత్రీ భవ భవాంబికే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ భవానీ! సృష్ట్యాదియందు నీ భర్త నన్ను సృష్టించెను. దేవదేవుడగు శంభు పరమాత్మయే ప్రజల నందరినీ శాసించుచున్నాడు (15). ఓ పార్వతీ ! నేను దేవతలు మొదలగు వారినందరినీ మనస్సుచే సృజించితిని. నేను ఎన్ని పర్యాయములు సృష్టించిననూ వారు వృద్ధిని పొందుట లేదు (16). ఈ పైన స్త్రీపురుష సంయోగ పూర్వకమైన సృష్టిని మాత్రమే చేసి, నా ప్రజలనందరినీ వృద్ధి చేయ గోరుచున్నాను (17). పూర్వము నీనుండి వినాశములేని స్త్రీ సమూహము ఉద్భవించలేదు. అట్టి స్త్రీ సమూహమును సృష్టించే సామర్థ్యము నాకు లేదు (18). శక్తులన్నియు నీ నుండియే ఉద్భవించును గదా! కావున పరమశక్తివి, సర్వమునకు ఈశ్వరివి అగు నిన్ను ప్రార్థించుచున్నాను (19). ఓ పార్వతీ! స్త్రీ సమూహమును సృష్టించు శక్తిని ఇమ్ము, నీకు నమస్కారమగు గాక! ఓ తల్లీ! శివప్రియే! స్థావరజంగమాత్మకమగు. జగత్తునకు కారణము స్త్రీ యని ఎరుంగుము (20). వరములనిచ్చు ఓ ఈశ్వరీ! నీ నుండి మరియొక వరమును గోరుచున్నాను. ఓ జగన్మాతా! నీవు దయచేసి నాకు ఆ వరమును ఇమ్ము, నీకు నమస్కారమగు గాక ! (21) సర్వవ్యాపినీ! జగన్మాతా! స్థావరజంగ మాత్మకమగు సృష్టి యొక్క వృద్ధి కొరకై నీవు సర్వసమర్థమగు ఒక రూపమును గ్రహించవలెను. నా పుత్రుడగు దక్షునకు కుమార్తె వై జన్మించుము.

ఏవం సంయాచితా దేవీ బ్రహ్మణా పరమేశ్వరీ ।
తథాస్త్వితి వచః ప్రోచ్య తచ్ఛక్తిం విధయే దదౌ ॥
తస్మాద్ధి సా శివా దేవీ శివశక్తిర్జగన్మయీ ।
శక్తిమేకాం భ్రువో ర్మధ్యాత్స సర్జాత్మ సమ ప్రభామ్ ॥
తామహ ప్రహసన్ ప్రేక్ష్య శక్తిం దేవవరో హరః ।
కృపాసింధుర్మహేశానో లీలాకారీ భవాంబికామ్ ॥

పరమేశ్వరియగు ఆ దేవి బ్రహ్మచే ఈ తీరున ప్రార్థించబడి 'అటులనే అగుగాక!' అని పలికి అట్టి శక్తిని బ్రహ్మకు ఇచ్చెను (23). శివుని శక్తి, జగత్స్వరూపిణి అగు ఆ భవానీ దేవి కనుబొమల మధ్యనుండి తనతో సమానమగు కాంతులు గల ఒక శక్తిని సృష్టించెను (24). దేవశ్రేష్ఠుడు, దయాసముద్రుడు, మహేశ్వరుడు, లీలలను ప్రదర్శించువాడు అగు హరుడు ఆ శక్తిని చూచి జగన్మాతతో నిట్లనెను.

శివ ఉవాచః

తపసారాధితా దేవి బ్రహ్మణా పరమేష్ఠినా।
ప్రసన్నా భవ సుప్రీత్యా కురు తస్యాఖిలేప్సితమ్ ॥
తామాజ్ఞాం పరమేశస్య శిరసా ప్రతిగృహ్య సా ।
బ్రహ్మణో వచనాద్దేవీ దక్షస్య దుహితా భవత్ ॥
దత్త్వైవమతులాం శక్తిం బ్రహ్మణే సా శివా మునే ।
వివేశ దేహం శంభోర్హి శంభుశ్చాంతర్దధే ప్రభుః ॥
తదా ప్రభృతి లోకేఽస్మిన్ స్త్రియో భాగః ప్రకల్పితః ।
ఆనందం ప్రాప స విధి సృష్టిర్జాతా చ మైథునీ ॥
ఏతత్తే కథితం తాత విశ్వరూపం మహోత్తమమ్ ।
అర్ధనారీ నరార్ధం హి మహామంగలదం సతామ్ ॥
ఏతదాఖ్యాన మనఘం యః పఠేచ్ఛృణుయాదపి ।
స భుక్త్వా సకలాన్ భోగాన్ ప్రయాతి పరమాం గతిమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం అర్ధ
నారీశ్వరావతారవర్ణనం నామ తృతీయోఽధ్యాయః .

ఓ దేవీ ! పరమేష్ఠియగు బ్రహ్మ తపస్సు చేసి నిన్ను ఆరాధించినాడు. నీవు ప్రసన్నురాల వై ఆతని కోర్కెలనన్నిటినీ మిక్కిలి ప్రీతితో నెరవేర్చుము (26). పరమేశ్వరుని ఆ యాజ్ఞను ఆమె శిరసా వహించెను. బ్రహ్మ కోరిన విధముగా ఆ దేవి దక్షుని కుమార్తెయై జన్మించెను (27). ఓ మునీ ! ఈ తీరున పార్వతి బ్రహ్మకు సాటిలేని శక్తి నిచ్చి శంభుని దేహములో ప్రవేశించగానే, ఆ శంభు ప్రభుడు అంతర్ధానమును చెందెను (28). అప్పటినుండి ఈ లోకములో నారీ విభాగము కల్పించబడెను. ఆ బ్రహ్మ ఆనందించెను. స్త్రీ పురుష సమాగమ రూపమగు సృష్టి ప్రవర్తిల్లెను (29). వత్సా! ఈ తీరున నేను నీకు సర్వోత్తమమైనది, సత్పురుషులకు మహామంగళములనిచ్చునది, సగము పురుషుడు సగము స్త్రీ అనే జగత్స్వరూపమును చెప్పియుంటిని (30). పవిత్రమగు ఈ గాథను ఎవరు పఠించెదరో, మరియు వినెదరో, అట్టివాడు సమస్తభోగములనను భవించి పరమగతినీ పొందును.

శ్రీ శివమహాపురాణములోని శతరుద్రసంహిత యందు అర్ధ
నారీశ్వరావతార వర్ణనమనే మూడవ అధ్యాయము ముగిసినది.

4 – ఋషభ చరిత్ర

నందీశ్వర ఉవాచః

సనత్కుమార సర్వజ్ఞ చరితం శాంకరం ముదా ।
రుద్రేణ కథితం ప్రీత్యా బ్రహ్మణే సుఖదం సదా ॥

నందీశ్వరుడిట్లు పలికెను-

ఓయీ! సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. నిత్యసుఖమునొసంగు శంకర చరితమును రుద్రుడు ప్రీతితో బ్రహ్మకు చెప్పియుండెను.

శివ ఉవాచః

సప్తమే చైవ వారా హే కల్పే మన్వంతరాభిధే ।
కల్పేశ్వరోఽథ భగవాన్ సర్వలోక ప్రకాశనః ॥
మనోర్వైవస్వతస్యైవ తే ప్రపుత్రో భవిష్యతి ।
తదా చతుర్యుగాశ్చైవ తస్మి న్మన్వంతరే విధే ॥
అను గ్రహార్థం లో కానాం బ్రాహ్మణానాం హితాయ చ ।
ఉత్పశ్యామి విధే బ్రహ్మన్ ద్వాపరాఖ్య యుగాంతికే ॥

శివుడిట్లు పలికెను –

వారాహ కల్పమునందు ఏడవ మన్వంతరములో సర్వలోకములను ప్రకాశింపజేయు కల్పేశ్వర భగవానుడు వైవస్వత మనువు యొక్క పుత్రుడు, నీకు ప్రపౌత్రుడు కాగలడు. ఓ వీధీ! ఆ మన్వంతరములో మహాయుగములు కలవు గదా! (2,3) ఓ విధీ! బ్రహ్మ ! నేను ద్వాపర యుగము నందు లోకానుగ్రహము కొరకు, బ్రాహ్మణుల హితము కొరకు జన్మించగలను (4).

యుగప్రవృత్త్యా చ తదా తస్మింశ్చ ప్రథమే యుగే ।
ద్వాపరే ప్రథమే బ్రహ్మన్ యదా వ్యాసస్స్వయం ప్రభుః ॥
తదాహం బ్రాహ్మణార్థాయ కలౌ తస్మిన్ యుగాంతికే ।
భవిష్యామి శివాయుక్త శ్వేతో నామ మహామునిః ॥
హిమవచ్ఛి ఖరే రమ్యే ఛాగలే పర్వతోత్తమే ।
తదా శిష్యాశ్శిఖాయుక్తా భవిష్యంతి విధే మమ ॥
శ్వేత శ్శ్వేతశిఖశ్చైవ శ్వేతాశ్వ శ్శ్వేతలోహితః ।
చత్వారో ధ్యానయోగాత్తే గమిష్యంతి పురం మమ ॥
తతో భక్తా భవిష్యంతి జ్ఞాత్వా మాం తత్త్వతోఽవ్యయమ్ ।
జన్మమృత్యు జరాహీనాః పరబ్రహ్మ సమాధయః ॥
ద్రష్టుం శక్యో నరైర్నాహం ఋతే ధ్యానాత్పితామహ ।
దానధర్మాదిభిర్వత్స సాధనైః కర్మహేతుభిః ॥

ఓ బ్రహ్మా! యుగముల వరుస ననుసరించి, ప్రథమ మహాయుగములో మొదటి ద్వాపరయుగము()లో విష్ణు ప్రభుడు వ్యాసుడై జన్మించగలడు (5). అపుడు ద్వాపరము అంతమై కలి ప్రవేశించగానే నేను బ్రాహ్మణుల కొరకై పార్వతీదేవితో గూడి శ్వేతమహామునిగా అవతరించ గలను (6). అపుడు సుందరమగు హిమవచ్ఛిఖరమునందు ఛాగలమను పర్వతరాజమునందు నా శిష్యులు శిఖను ధరించి ఉద్భవించగలరు. ఓ విధీ! (7) శ్వేతుడు, శ్వేతశిఖుడు, శ్వేతాశ్వుడు, శ్వేతలోహితుడు అనునవి వారి పేర్లు. వారు నలుగురు ధ్యానయోగ ప్రభావముచే నా పురమును పొందగలరు (8). తరువాత వారు అవ్యయుడనగు నా స్వరూపమునెరింగి భక్తులు కాగలరు. వారు జన్మ మరణములనుండీ, వార్ధక్యము నుండి విముక్తిని పొంది పరబ్రహ్మ సమాధి యందు ఉండెదరు (9). ఓ పితామహా ! వత్సా! ధ్యానము లేకుండగా, మానవులు దాన ధర్మాది కర్మ ప్రధానమగు సాధనములచే నన్ను దర్శింపజాలరు (10).

ద్వితీయే ద్వాపరే వ్యాస స్సత్యో నామ ప్రజాపతిః ।
తదా తదా భవిష్యామి సుతారో నామతః కలౌ ॥
తత్రాపి మే భవిష్యంతి శిష్యా వేదవిదో ద్విజాః ।
దుందుభిశ్శతరూపశ్చ హృషీకః కేతుమాంస్తథా ॥
చత్వారో ధ్యానయోగాత్తే గమిష్యంతి పురం మమ ।
తతో ముక్తా భవిష్యంతి జ్ఞాత్వా మాం తత్త్వతోఽవ్యయమ్ ॥

రెండవ ద్వాపరయుగమునందు సత్య ప్రజాపతి వ్యాసుడై అవతరించగలడు(). ఆ తరువాతి ఏడను పేరుతో అవతరించగలను (11). ఆ అవతారమునందు కూడ దుందుభి, శతరూపుడు, హృషీకుడు, కేతుమాన్ అను వేదవేత్తలగు బ్రాహ్మణులు నాకు శిష్యులు కాగలరు (12). ఆ నలుగురు ధ్యానయోగముచే నా పురమును పొంది, తరువాత అవ్యయుడనగు నా స్వరూపమునెరింగి మోక్షమును పొందగలరు (13).

తృతీయే ద్వాపరే చైవ యదా వ్యాసస్తు భార్గవః ।
తదాప్యహం భవిష్యామి దమనస్తు పురాంతికే ॥
తత్రాపి చ భవిష్యంతి చత్వారో మమ పుత్రకాః ।
విశోకశ్చ విశేషశ్చ విపాపః పాపనాశనః ॥
శిష్యైస్సాహాయ్యం వ్యాసస్య కరిష్యే చతురానన ।
నివృత్తిమార్గం సుదృఢం వర్తయిష్యే కలావిహ ॥

మూడవ ద్వాపరయుగములో భార్గవుడు వ్యాసుడు కాగలడు. అపుడు కూడా()~ నేను నా నగరమునకు సమీపములో దమనుడను పేర అవతరించగలను (14). ఆ అవతారమునందు కూడా నాకు విశోకుడు, విశేషుడు, విపాపుడు, పాపనాశనుడు అను నల్గురు కుమారులు ఉండగలరు (15). హే చతుర్ముఖా! నేను శిష్యులతో గూడి వ్యాసునకు సహకరించెదను. ఇహలోకములో కలియుగమునందు జ్ఞానమార్గమును మిక్కిలి దృఢముగా ప్రవర్తిల్ల జేసెదను.

చతుర్థే ద్వాపరే చైవ యదా వ్యాసోఽంగిరాస్స్మృతః ।
తదాప్యహం భవిష్యామి సుహోత్రో నామ నామతః ॥
తత్రాహి మమ తే పుత్రా శ్చత్వారో యోగసాధకః ।
భవిష్యంతి మహాత్మానస్తన్నామాని బ్రువే విధే ॥
సుముఖో దుర్ముఖశ్చైవ దుదరో దురతిక్రమః ।
శిష్యై స్సాహాయ్యం వ్యాసస్య కరిష్యేఽహం తదా విధే ॥

నాల్గవ ద్వాపర యుగములో అంగిరసుడు వ్యాసుడనబడును. అపుడు కూడ నేఁనేను సుహోత్రుడను పేరుతో అవతరించగలను (17). ఆ అవతారములో కూడా నాకు యోగసాధకులగు నల్గురు పుత్రులు కలిగెదరు. ఓ విధీ! మహాత్ములగు వారి పేర్లను చేప్పెదను (18). సుముఖుడు, దుర్ముఖుడు, దుదర్భుడు, దురతిక్రముడు అనునవి వారి పేర్లు. ఓ విధీ! అపుడు నేను శిష్యులతో గూడి వ్యాసునకు సహకరించగలను (19).

పంచమే ద్వాపరే చైవ వ్యాసస్తు సవితా స్మృతః ।
తదా యోగీ భవిష్యామి కంకో నామ మహాతపాః ॥
తత్రాహి మమ తే పుత్రాశ్చత్వారో యోగసాధకాః ।
భవిష్యంతి మహాత్మానస్తన్నామాని శృణుష్వ మే ॥
సనకసనాతనశ్చైవ ప్రభుర్యశ్చ సనందనః ।
విభుస్సనత్కుమారశ్చ నిర్మలో నిరహంకృతిః ॥
తత్రాపి కంకనామాహం సాహాయ్యం సవితుర్విధే ।
వ్యాసస్య హి కరిష్యామి నివృత్తి పథవర్ధకః ॥

అయిదవ ద్వాపరములో వ్యాసునకు సవిత అని పేరు. అపుడు నేను మహాతపశ్శాలియగు కంకుడను యోగినై అవతరించెదను (20). ఆ అవతారములో కూడ నాకు యోగ సాధకులు, మహాత్ములు అగు నల్గురు పుత్రులు ఉండ గలరు. వారి నామములను. చెప్పెదను. వినుము (21). సనకుడు, సనాతనుడు, సనందనుడు, సనత్కుమారుడు అనునవి వారి పేర్లు. సనందనుడు గొప్ప సమర్థుడు. సనత్కుమారుడు సర్వవ్యాపకుడు, దోషరహితుడు మరియు అహంకారము లేని వాడు (22). ఓ బ్రహ్మా! ఆ అవతారములో కూడ కంకుడను పేరు గల నేను సవిత యను వ్యాసునకు సహకరించి జ్ఞానమార్గమును అభివృద్ధి చేసెదను.

పరివృత్తే పునష్షష్ఠే ద్వాపరే లోకకారకః ।

కర్తా వేదవిభాగస్య మృత్యుర్వ్యాసో భవిష్యతి ॥

తదాప్యహం భవిష్యామి లోకాక్షిర్నామ నామతః ।

వ్యాసస్య సుసాహాయ్యార్థం నివృత్తి పథవర్ధనః ॥

తత్రాపి శిష్యాశ్చత్వారో భవిష్యంతి దృఢ వ్రతాః ।

సుధామా విరజాశ్చైవ సంజయో విజయస్తథా ॥

మరల ఆరవ ద్వాపరయుగము ఆరంభము కాగానే లోకనియామకుడగు మృత్యువు వ్యాసునిగా అవతరించి వేదవిభాగమును చేయగలడు (24). అప్పుడు కూడా నేను లోకాక్షియను పేరుతో అవతరించి వ్యాసునకు చక్కగా సాహాయ్యమునందించి జ్ఞానమార్గమును వృద్ధి చేయగలను (25). ఆ అవతారములో, గూడా నాకు దృఢమగు వ్రతముగల నల్గురు శిష్యులు ఉండగలరు. సుధామ, విరజసుడు, సంజయుడు, విజయుడు అనునవి వారి పేర్లు (26).

సప్తమే పరివర్తేతు యదా వ్యాస శ్శతక్రతుః ।

తదాప్యహం భవిష్యామి జైగీషవ్యో విభుర్విధే ॥

యోగం సంద్యఢయిష్యామి మహాయోగ విచక్షణః ।

కాశ్యాం గుహాంతరే సంస్థో దివ్య దేశే కుశాస్తరిః ॥

సాహాయ్యం చ కరిష్యామి వ్యాసస్య హి శతక్రతోః।

ఉద్ధరిష్యామి భక్తాంశ్చ సంసారభయతో విధే ॥

తత్రాహి మమ చత్వారో భవిష్యంతి సుతా యుగే ।

సారస్వతశ్చ యోగీశో మేఘవాహస్సువాహనః॥

ఏడవ ద్వాపరయుగము ఆరంభము కాగానే శతక్రతువు అను వ్యాసుడు అవతరించును. హే విధీ! అప్పుడు సర్వవ్యాపకుడనగు నేను జైగీషవ్యుడు అను పేర అవతరించగలను (27). ఆ అవతారములో మహాయోగేశ్వరుడనగు నేను దివ్య దేశమగు కాశీనగరములో గుహ లోపలి దర్భాసనముపై ఆసీనుడనై యోగమును దృఢము చేసెదను (28). మరియు శతక్రతుడను వ్యాసునకు సాహాయ్యమును చేసెదను. ఓ బ్రహ్మా! భక్తులకు సంసారభయమునుండి రక్షణను కల్పించెదను (29). ఆ యుగము నందు కూడ నాకు నల్గురు కుమారులు ఉండగలరు. సారస్వతుడు, యోగీశుడు, మేఘవాహుడు, సువాహనుడు అనునవి వారి పేర్లు .

అష్టమే పరివర్తే హి వసిష్ఠో మునిసత్తమః ।

కర్తా వేదవిభాగస్య వేదవ్యాసో భవిష్యతి ॥

తత్రాప్యహం భవిష్యామి నామతో దధివాహనః ।

వ్యాసస్య హి కరిష్యామి సాహాయ్యం యోగవిత్తమః ॥

కపిలశ్చాసురిః పంచశిఖశ్చాల్వలపూర్వకః ।

చత్వారో యోగినః పుత్రా భవిష్యంతి సమా మమ ॥

ఎనిమిదవ ద్వాపరము ఆరంభమైన పిదప వసిష్ఠ మహర్షి వేదవిభాగమును చేసి వేదవ్యాసుడు కాగలడు (31). ఆ సమయమునందు కూడా నేను దధివాహనుడను పేరుతో అవతరించి యోగవేత్తలలో శ్రేష్ఠుడనై వ్యాసునకు సాహాయ్యమును చేయగలను (32). నాకు నాతో సమమగు యోగులు అయిన నల్గురు పుత్రులు ఉండగలరు. కపిలుడు, ఆసురీ, పంచశిఖుడు, శాల్వల పూర్వకుడు అనునవి వారి పేర్లు (33).

నవమే పరివర్తేతు తస్మిన్నేవ యుగే విధే।

భవిష్యతి మునిశ్రేష్ఠో వ్యాసస్సారస్వతాహ్వయః ॥

వ్యాసస్య ధ్యాయతస్తస్య నివృత్తి పథ వృద్ధయే ।

తదాప్యహం భవిష్యామి ఋషభో నామతస్స్మృతః ॥

పరాశరశ్చ గర్గశ్చ భార్గవో గిరిశస్తథా ।

చత్వారస్తత్ర శిష్యా మే భవిష్యంతి సుయోగినః ॥

తైస్సాకం ద్రఢయిష్యామి యోగమార్గం ప్రజాపతే ।

కరిష్యామి సాహాయ్యం వై వేదవ్యాసస్య సన్మునేః ॥

తొమ్మిదవ ద్వాపరయుగములో సారస్వతుడను మహర్షి వ్యాసుడుగా అవతరించగలడు (34). ఓ బ్రహ్మా ! ఆ వ్యాసుడు జ్ఞానమార్గ వృద్ధి కొరకు చింతిల్లుచుండగా, నేను ఆ యుగమునందు కూడా ఋషభుడను పేరుతో అవతరించగలను (35). గొప్ప యోగినగు నాకు ఆ అవతారములో పరాశరుడు, గర్గుడు, భార్గవుడు, గిరిశుడు అను నల్గురు శిష్యులు ఉండగలరు (36). ఓ ప్రజాపతీ! నేను వారితో కలిసి యోగమార్గమును దృఢము చేసెదను. మరియు వేదవ్యాస మహర్షికి సాహాయ్యమును చేయగలను.

తేన రూపేణ భక్తానాం బహూనాం దుఃఖినాం విధే ।

ఉద్ధారం భవతోఽహం వై కరిష్యామి దయాకరః ॥

సోఽవతారో విధే మే హి ఋషభాఖ్యస్సు యోగకృత్ ।

సారస్వతవ్యాసమనః పర్తా నానోతికారకః ॥

అవతారేణ మే యేన భద్రాయుర్నృపబాలకః।

జీవితో హి మృతః క్ష్వేడదోషతో జనకోజ్ఝితః ॥

ప్రాప్తేఽథ షోడశే వర్షే తస్య రాజశిశోః పునః ।

యయౌ తద్వేశ్మ సహసా ఋషభస్స మహాత్మకః ॥

పూజితస్తేన స ముని స్సద్రూపశ్చ కృపానిధిః ।

ఉపాదిదేశ తద్ధర్మాన్ రాజయోగ్యాన్ ప్రజాపతే ॥

తతస్స కవచం దివ్యం శంఖం ఖడ్గం చ భాస్వరమ్ ।

దదౌ తస్మై ప్రసన్నాత్మా సర్వశత్రు వినాశనమ్ ॥

తదంగభస్మనామృశ్య కృపయా దీనవత్సలః ।

స ద్వాదశసహస్రస్య గజానాం చ బలం దదౌ ॥

ఓ బ్రహ్మా! దయానిధినగు నేను ఆ రూపముతో దుఃఖమును పొందియున్న అనేక మంది భక్తులను, మరియు నిన్ను ఉద్ధరించగలను (38). ఓ విధీ! నేను ఆ ఋషభావతారములో గొప్ప యోగమార్గమును ప్రవర్తిల్ల జేసి, సారస్వతవ్యాసుని మనస్సునకు ఆనందమును కలిగించి అనేకలీలలను ప్రకటించగలను (39). ఆ అవతారములో విషదోషము వలన మరణించి తండ్రిచే పరిత్యజింపబడిన భద్రాయువను రాజకుమారుని నేను జీవింపజేసెదను (40). ఆ రాజకుమారుడు పదహారు సంవత్సరముల యువకుడు కాగానే, ఋషభ రూపములో నున్న నేను వెంటనే ఆతని గృహమునకు వెళ్లెదను (41). ఓ ప్రజాపతీ! పరమేశ్వరస్వరూపుడు, దయానిధి యగు ఆ ముని వానిచే పూజింపబడినవాడై రాజునకు యోగ్యమైన ధర్మములను ఉపదేశించును (4.2), తరువాత ప్రసన్నమగు అంతఃకరణముగల ఆ ఋషభుడు కవచమును, దివ్యశంఖమును, ప్రకాశించే కత్తిని ఆతనికి ఇచ్చాను. ఆ కత్తి శత్రువులనందరినీ సంహరించగలును (43). మరియు దీనవత్సలుడగు ఆ ఋషభుడు దయతో ఆ రాజకుమారుని శరీరమును భస్మతో లేపనము చేసి పన్నెండు వేల ఏనుగుల బలమును ఇచ్చెను.

ఇతి భద్రాయుషం సమ్య గనుశ్వాస్య సమాతృకమ్ ।
యయౌ స్వైరగతస్తా భ్యాం పూజితో ఋషభః ప్రభుః ॥
భద్రాయురపి రాజర్షిర్జిత్వా రిపుగణాన్ విధే ।
రాజ్యం చకార ధర్మేన వివాహ్య కీర్తిమాలినిం ॥
ఇత్థం ప్రభావ ఋషభోఽవతార శ్శంకరస్య మే ।
సతాం గతిర్దీనబంధుర్నవమః కథితస్తవ ॥
ఋషభస్య చరిత్రం హి పరమం పావనం మహత్ ।
స్వర్గ్యం యశస్యమాయుష్యం శ్రోతవ్యం చ ప్రయత్నతః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం ఋషభ చరిత్ర
వర్ణనం నామ చతుర్థోఽధ్యాయః.

ఆ ఋషభయోగీంద్రుడు ఈ తీరున భద్రాయుషుని, ఆతని తల్లిని సంతోష పెట్టి వారిచే పూజింపబడిన వాడై యథేచ్ఛగా వెళ్లెను (45). ఓ విధీ! రాజర్షియగు భద్రాయువు శత్రు మూకలను నిర్జించి కీర్తిమాలిని అను యువతిని వివాహమాడి ధర్మబద్ధముగా రాజ్యము నేలెను (46). శంకరుడనగు నా తొమ్మిదవ అవతారము, సత్పురుషులకు గతి, దీనులకు బంధువు అగు ఋషభుని మహిమను నీకు చెప్పితిని (47). ఋషభుని చరిత్ర పరమపావనమైనది, గొప్పది, స్వర్గమును యశస్సును ఆయుర్దాయమును ఇచ్చునది గాన దానిని ప్రయత్న పూర్వకముగా వినవలెను (48).

శ్రీ శివమహాపురాణములోని శతరుద్రసంహితయందు ఋషభచరిత్ర
వర్ణనమను నాల్గవ అధ్యాయము ముగిసినది (4).

5 - శివావతారములు

శివ ఉవాచః

దశమే ద్వాపరే వ్యాసస్త్రి ధామా నామతో మునిః ।
హిమవచ్ఛిఖరే రమ్యే భృగుతుంగే నగోత్తమే ॥
తత్రాపి మమ పుత్రాశ్చ భృంగాద్యాశ్శృతి సంమితాః ।
బలబంధుర్నరామిత్రః కేతుశృంగస్త పోధనః ॥
ఏకాదశే ద్వాపరే తు వ్యాసశ్చ త్రివృతో యదా ।
గంగా ద్వారే కలౌ నామ్నా తపోఽహం భవితా తదా ॥
లంబోదరశ్చ లంబాక్షః కేశలంబః ప్రలంబకః ।
తత్రాపి పుత్రాశ్చత్వారో భవిష్యంతి దృఢవ్రతాః ॥

శివుడిట్లు పలికెను -

పదవ ద్వాపర యుగములో త్రిధాముడు అను మహర్షి వ్యాసుడగును. నేను సుందరమగు హిమవత్పర్వత శిఖరమునందు భృగుతుంగమను పర్వత శ్రేష్ఠమునందు అవతరించెదను (1). ఆ అవతారము నందు కూడ నాకు బలబంధువు, నరామిత్రుడు, తపోధనుడగు కేతుశృంగుడు, మరియు భృంగుడు అను వేదవేత్తలగు నల్గురు పుత్రులు ఉండగలరు (2). పదకొండవ ద్వాపరమునందు త్రివృతుడు వ్యాసుడగును. అపుడు కలియుగమునందు గంగాద్వారమునందు నేను తపుడు అను పేర అవతరించెదను (3). ఆ అవతారమునందు కూడా నాకు దృఢమగు వ్రతముగల నల్గురు పుత్రులు ఉండగలరు. లంబోదరుడు, లంబాక్షుడు, కేశలంబుడు, ప్రలంబకుడు అనునవి వారి పేర్లు (4).

ద్వాదశే పరివర్తే తు శతతే జాశ్చ వేదకృత్ ।
తత్రాప్యహం భవిష్యామి ద్వాపరాంతే కలావిహ ॥
హేమకంచుక మాసాద్య నామ్నా హ్యత్రి: పరిప్లుతః ।
వ్యాసస్యైవ సాహాయ్యార్థం నివృత్తి పథరోపణః ॥
సర్వజ్ఞ స్సమబుద్ధిశ్చ సాధ్యశ్శర్వస్సుయోగినః ।
తత్రేతి పుత్రాశ్చత్వారో భవిష్యంతి మహామునే ॥

పన్నెండవ ద్వాపరయుగము ప్రవర్తిల్ల గానే శతతేజనుడు వేదవ్యాసుడగును. ఆ ద్వాపరము పూర్తి అయిన పిదప కలియుగమునందు నేను మరల భూమియందు అవతరించగలను (5), అపుడు నేను అత్రి అను పేరుతో హేమకంచుక నగరమునందు నివసిస్తూ వ్యాసునకు సాహాయ్యమొనరించి జ్ఞానమార్గమును ప్రతిష్ఠించెదను (6). ఓ మహర్షీ! ఆ అవతారములో నాకు గొప్ప యోగీశ్వరులగు నలుగురు పుత్రులు ఉండగలరు. సర్వజ్ఞుడు, సమబుద్ధి, సాధ్యుడు, శర్వుడు అనునవి వారి పేర్లు (7).

త్రయోదశే యుగే తస్మిన్ ధర్మో నారాయణస్సదా ।
వ్యాసస్తదాహం భవితా బలిర్నామ మహామునిః ॥
వాలఖిల్యాశ్రమే గంధమాదనే పర్వతోత్తమే ।
సుధామా కాశ్యపశ్చైవ వసిష్ఠో విరజాశ్శుభాః ॥

పదమూడవ ద్వాపర యుగములో నిత్య ధర్మస్వరూపుడగు నారాయణుడు వ్యాసుడు కా◌ాగలడు. అపుడు నేను బలి అను పేరు గల మహర్షినై (8), పర్వత శ్రేష్ఠమగు గంధమాదనమునందు వాల ఖిల్యుల ఆశ్రమములో అవతరించగలను. నాకు సుధాముడు, కాశ్యపుడు, వసిష్ఠుడు, విరజసుడు అను నల్గురు శుభకరులగు పుత్రులు ఉండెదరు (9).

యదా వ్యాసస్తు రక్షాఖ్యః పర్యాయే తు చతుర్దశే ।
వంశ ఆంగిరసే తత్ర భవితాహం చ గౌతమః ॥
తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి కలౌ తదా ।
అత్రిర్దవశదశ్చైవ శ్రవణోఽథ శ్శవిష్కటః ॥

పదునాల్గవ ద్వాపరయుగములో రక్షుడు వ్యాసుడు కాగా, నేను అంగిరసుని వంశములో గౌతముడనై అవతరించెదను (10). ఆ అవతారములో కూడా కలియుగమునందు నాకు అత్రి, దవశదుడు, శ్రవణుడు మరియు శ్శవిష్కటుడు అను నల్గురు కుమారులు కలుగగలరు (11).

వ్యాసః పంచదశే త్రయ్యారుణిర్వై ద్వాపరే యదా ।
తదాహం భవితా వేదశిరా వేదశిరస్తథా ॥
మహావీర్యం తదస్త్రం చ వేదశీర్షశ్చ పర్వతః ।
హిమవత్పృష్ఠ మాసాద్య సరస్వత్యాస్తథోత్తరే ॥
తత్రాపి మమ చత్వారో భవిష్యంతి సుతా దృఢాః ।
కుణిశ్చ కుణి బాహుశ్చ కుశశీరః కునేత్రకః ॥

పదునైదవ ద్వాపరయుగములో త్రయ్యారుణి వ్యాసుడు కాగా, నేను వేదశిరస్సు అను పేరుతో అవతరించగలను (12). వేదశిరస్సు అను పేరుతో మహాశక్తి గల అస్త్రము గలదు. హిమాలయములో సరస్వతీ నదియొక్క ఉత్తర తీరమునందు వేదశీర్షము అను పర్వతముగలదు. నేను అచట అవతరించెదను (13). ఆ అవతారములో కూడ నాకు కుణి, కుణిబాహుడు, కుశశీరుడు, కునేత్రకుడు అను బలవంతులగు నల్గురు కుమారులు కలిగెదరు (14).

వ్యాసో యుగే షోడశే తు యదా దేవో భవిష్యతి ।
తదా యోగప్రదానాయ గోకర్ణో భవితా హ్యహమ్ ॥
తత్రైవ చ సుపుణ్యం చ గోకర్ణం నామ తద్వనమ్ ।
తత్రాపి యోగినః పుత్రా భవిష్యం త్యంబుసంమితాః ॥
కాశ్యపోఽప్యుశనాశ్చైవ చ్యవనోఽథ బృహస్పతిః ।
తేఽపి తే నైవ మార్గేణ గమిష్యంతి శివాలయమ్ ॥

పదునారవ ద్వాపర యుగములో దేవ మహర్షి వ్యాసుడై అవతరించును. అప్పుడు నేను యోగ విద్యను గరపుటకై గోకర్ణుడనై అవతరించగలను (15). నేను అవతరించిన స్థలము గోకర్ణవనము అనబడును. ఆ అవతారములో కూడ నాకు జలమువలె నిర్మలమైన యోగులు పుత్రులగుదురు. గోకర్ణవనము పరమపవిత్రమైనది (16). కాశ్యపుడు, ఉశనసుడు, చ్యవనుడు మరియు బృహస్పతి అనునవి వారి పేర్లు. వారు కూడ అదే యోగ మార్గముననుసరించి శివుని ధామమును చేరగలరు (17).

పరివర్తే సప్తదశే వ్యాసో దేవకృతంజయః ।
గుహావాసీతి నామ్నాహం హిమవచ్ఛిఖరే శుభే ॥
మహాలయే మహోత్తుంగే శివక్షేత్రం హిమాలయమ్ ।
ఉతథ్యో వామ దేవశ్చ మహాయోగో మహాబలః ॥

పదునేడవ ద్వాపరములో దేవకృతంజయుడు వ్యాసుడగును. అప్పుడు నేను మిక్కిలి ఎత్తైనది, శుభకరము, మహాలయమను పేరు గలది అగు హిమాలయ శిఖరమునందు గుహావాసి అను పేరుతో అవతరించెదను. ఉతథ్యుడు, వామదేవుడు, మహాయోగుడు, మహాబలుడు అను వారు నాకు పుత్రులు కాగలరు (18, 19).

పరివర్తేఽష్టాదశే తు యదా వ్యాస ఋతంజయః ।
శిఖండీ నామతోఽహం తద్ధిమవచ్ఛి ఖరే శుభే ॥
సిద్ధక్షేత్రే మహాపుణ్యే శిఖండీ నామ పర్వతః ।
శిఖండినో వనం వాపి యత్ర సిద్ధనిషేవితమ్ ॥
వాచశ్శవా రుచీకశ్చ స్యావాస్యశ్చ యతీశ్వరః ।
ఏతే పుత్రా భవిష్యంతి తత్రాపి చ తపోధనాః ॥

పదునెనిమిదవ ద్వాపరయుగములో ఋతంజయుడు వ్యాసుడగును. అప్పుడు నేను పరమపవిత్రమైనది, శుభకరమైనది, సిద్ధ క్షేత్రమని ప్రసిద్ధిగాంచినది అగు హిమాలయ శిఖరమునందు శిఖండి యను పేరుతో అవతరించగలను. ఆ శిఖండి ఉండే వనమును కూడా సిద్ధులు సేవించెదరు (20, 21). ఆ అవతారమునందు కూడ నాకు వాచశ్శవసుడు, రుచీకుడు, స్యావాస్యుడు, మరియు యతీశ్వరుడు అను తపోధనులగు పుత్రులు కలుగగలరు (22).

ఏకోన వింశే వ్యాసస్తు భరద్వాజో మహామునిః ।
తదాప్యహం భవిష్యామి జటీ మాలీ చ నామతః ॥
హిమవచ్ఛిఖరే తత్ర పుత్రా మేంఽబుధి సంమితాః ।
హిరణ్యనామా కౌశల్యో లోకాక్షీ ప్రధిమిస్తథా ॥

పందొమ్మిదవ ద్వాపరములో భరద్వాజ మహర్షి వ్యాసుడు కాగలడు. అప్పుడు కూడ నేను జటాధారినై మాలియను పేరుతో అవతరించగలను (23). నేను హిమాలయ శిఖరమునందు అవతరించెదను. ఆ అవతారములో నాకు

సముద్రమువలె గంభీరస్వభావము గల నలుగురు పుత్రులు ఉండెదరు. హిరణ్యుడు, కౌశల్యుడు, లోకాక్షి మరియు ప్రధిమి అనునవి వారి పేర్లు (24).

పరివర్తే వింశతిమే భవితా వ్యాసో గోతమః ।
తత్రాట్టహాస నామాహమట్టహాస ప్రియా నరాః ॥
తత్రైవ హిమవత్పృష్ఠే అట్టహాసో మహాగిరి: ।
దేవమానుషయక్షేంద్ర సిద్ధచారణసేవితః ॥
తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి సుయోగినః ।
సుమంతుర్వర్వరి ర్విద్వాన్ కబంధః కుశికంధరః ॥

ఇరువదియవ ద్వాపరయుగములో గోతముడు వ్యాసుడు కాగలడు. అదే సమయములో నేను అట్టహాసుడను పేర అవతరించగలను. మానవులకు అట్టహాసమన్న ప్రీతి మెండు (25). హిమాలయములలో అట్ట హాసమను పెద్ద పర్వతము గలదు. దానిని దేవతలు, మనుష్యులు, యక్ష ప్రభువులు, సిద్ధులు మరియు చారణులు సేవించెదరు (26). ఆ అవతారములో కూడ నాకు సుమంతుడు, విద్వాంసుడగు వర్వరి, కబంధుడు, కుశికంధరుడు అను గొప్ప యోగులు పుత్రులు కాగలరు (27).

ఏకవింశే యుగే తస్మిన్ వ్యాసో వాచశ్శవా యదా ।
తదాహం దారుకో నామ తస్మా ద్దారువనం శుభమ్ ॥
తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి సుయోగినః ।
ప్లక్షో దార్భాయణిశ్చైవ కేతుమాన్ గౌతమస్తథా ॥

ఇరువది ఒకటవ ద్వాపరయుగములో వాచశ్రవసుడు వ్యాసుడగును. అపు◌ుడు నేను దారుకుడను పేర అవతరించెదను. నేను అవతరించిన శుభవనమునకు దారువనమని పేరు (28). ఆ అవతారము నందు కూడా నాకు ప్లక్షుడు, దార్భాయణి, కేతుమంతుడు మరియు గౌతముడు అనే యోగీశ్వరులగు పుత్రులు కలుగగలరు (29).

ద్వావింశే పరివర్తేతు వ్యాసశుష్మాయణో యదా ।
తదాప్యహం భవిష్యామి వారాణస్యాం మహామునిః ॥
నామ్నా వై లాంగలీ భీమో యత్ర దేవాస్సవాసవాః ।
ద్రక్ష్యంతి మాం కలౌ తస్మిన్ భవం చైవ హలాయుధమ్ ॥
తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి సుధార్మికాః ।
భల్లవీ మధుపింగశ్చ శ్వేతకేతు స్తథైవ చ ॥

ఇరువది రెండవ ద్వాపరములో శుష్మాయణుడు వ్యాసుడు కాగా, నేను కూడా అపుడు వారాణసిలో మహర్షినై అవతరించగలను (30). నా పేరు అపుడు లాంగలీ భీముడు అని ఉండగలదు. ఆ అవతారములో ఇంద్రాది దేవతలు ఆ కలియుగములో నాయందు నాగలి అను ఆయుధమును ధరించిన శివుని

దర్శించగలరు (31). ఆ అవతారము నందు కూడా నాకు భల్లవి, మధుపింగుడు, శ్వేతకేతువు అను పరమధార్మికులగు పుత్రులు కలుగగలరు (32).

పరివర్తే త్రయోవింశే తృణబిందుర్యదా మునిః ।
శ్వేతో నామ తదాహం వై గిరౌ కాలంజరే శుభే ॥
తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి తపస్వినః ।
ఉశికో బృహదశ్వశ్చ దేవలః కవిరేవ చ ॥

ఇరువది మూడవ ద్వాపరములో తృణబిందువు వ్యాసుడు కాగా, నేను శ్వేతుడను పేరుతో పవిత్రమగు కాలంజర పర్వతమునందు అవతరించెదను (33). ఆ అవతారమునందు కూడ నాకు ఉశికుడు, బృహదశ్వుడు, దేవలుడు మరియు కవి అను తపశ్శాలురగు నల్గురు కుమారులు కలుగగలరు (34).

పరివర్తే చతుర్వింశే వ్యాసో యక్షో యదా విభుః ।
శూలీ నామ మహాయోగీ తద్యుగే నైమిషే తదా ॥
తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।
శాలిహోత్రాగ్నివేశశ్చ యువనాశ్వశ్శరద్వసుః ॥

ఇరువది నాల్గవ ద్వాపరములో యక్షుడు వ్యాస విభుడు కాగా, అదే యుగములో నేను శూలియను పేరుగల మహాయోగినై నెమిషారణ్యమునందు అవతరించెదను (35). ఆ అవతారమునందు కూడా శాలిహోత్రుడు, అగ్నివేశుడు, యువనాశ్వుడు మరియు శరద్వసువు అను తపశ్శాలురగు శిష్యులు నాకు ఉండగలరు (36).

పంచవింశే యదా వ్యాసశ్శక్తిర్నామ్నా భవిష్యతి ।
తదాప్యహం మహాయోగీ దండి ముండీశ్వరః ప్రభుః ॥
తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।
ఛగలః కుండకర్ణశ్చ కుంభాండశ్చ ప్రవాహకః ॥

ఇరువది అయిదవ ద్వాపరములో శక్తియను మహర్షి వ్యాసుడు కాగలడు. అపుడు కూడా సర్వేశ్వరుడను, సర్వశక్తి మంతుడను అగు నేను ముండిత శిరస్కుడు, దండధారి అగు మహాయోగినై జన్మించెదను (37). ఆ అవతారమునందు కూడ నాకు ఛగలుడు, కుండ కర్ణుడు, కుంభాండుడు మరియు ప్రవాహకుడు అను నలుగురు తపశ్శాలురు శిష్యులు కాగలరు (38).

వ్యాసః పరాశరోయర్హి షడ్వింశో భవితాప్యహమ్ ।
పురం భద్రవటం ప్రాప్య సహిష్ణుర్నామ నామతః ॥
తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।
ఉలూకో విద్యుతశ్చైవ శంబూకో హ్యాశ్వలాయనః ॥

ఇరువది ఆరవ ద్వాపరములో పరాశరమహర్షి వ్యాసుడగును. అపుడు కూడ నేను సహిష్ణుడు అను పేర భద్రవట నగరములో అవతరించగలను (39). ఆ అవతారమునందు కూడ ఉలూకుడు, విద్యుతుడు, శంబూకుడు మరియు

ఆశ్వలాయనుడు అను తపశ్శాలురు నాకు. శిష్యులు కాగలరు (40).

సప్తవింశే యదా వ్యాసో జాతూ కర్ణ్యో భవిష్యతి ।
ప్రభాసతీర్థమాశ్రిత్య సోమశర్మా తదాప్యహమ్ ॥
తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।
అక్షపాదః కుమారశ్చోలూకో వత్సస్తథైవ చ ॥

ఇరువది ఏడవ ద్వాపరమునందు జాతూకర్ణ్యుడు వ్యాసుడు కాగలడు. అప్పుడు కూడ నేను సోమశర్మ అను పేరుతో ప్రభాసతీర్థమునందు అవతరించగలను (41). అచట కూడా నాకు అక్షపాదుడు, కుమారుడు, ఉలూకుడు మరియు వత్సుడు అను తపశ్శాలురగు శిష్యులు ఉండగలరు (42).

అష్టావింశే ద్వాపరే తు పరాశరసుతో హరిః ।
యదా భవిష్యతి వ్యాసో నామ్నా ద్వైపాయనః ప్రభుః ॥
తదా షష్ఠేన చాంశేన కృష్ణః పురుషసత్తమః ।
వసుదేవ సుత శ్రేష్ఠో వాసుదేవో భవిష్యతి ॥
తదాప్యహం భవిష్యామి యోగాత్మా యోగమాయయా ।
లోకవిస్మాపనార్థాయ బ్రహ్మచారి శరీరకః ॥
శ్మశానే మృతముత్సృష్ట్య దృష్ట్వా కాయమనామయమ్ ।
బ్రాహ్మణానాం హితార్థాయ ప్రవిష్టో యోగమాయయా ॥
దివ్యాం మేరుగుహాం పుణ్యాం త్వయా సార్ధం చ విష్ణునా ।
భవిష్యామి తదా బ్రహ్మన్ లకులీ నామ నామతః ॥
కాయావతార ఇత్యేవం సిద్ధక్షేత్రం పరం తదా ।
భవిష్యతి సువిఖ్యాతం యావద్భూమిర్ధరిష్యతి ॥
తత్రాపి మమ తే శిష్యా భవిష్యంతి తపస్వినః ।
కుశికశ్చైవ గర్గశ్చ మిత్ర స్తౌరుష్య ఏవ చ ॥
యోగినో బ్రాహ్మణా వేదపారగా ఊర్ధ్వరేతసః ।
ప్రాప్య మాహేశ్వరం యోగం గమిష్యంతి శివం పురమ్ ॥

ఇరవై ఎనిమిదవ ద్వాపరయుగములో విష్ణువు పరాశరుని కుమారుడై వ్యాసుడు కా◌ాగలడు. ఆ ప్రభునకు ద్వైపాయనుడని పేరు (43). అదే కాలములో పురుషోత్తముడగు విష్ణువు ఆరవ అంశముతో శ్రీకృష్ణుడై జన్మించును. వసుదేవుని శ్రేష్ఠ పుత్రుడగు ఆతడు వాసుదేవుడని ప్రసిద్ధిని గాంచును (44). ఆ యుగమునందు కూడా నేను లోకములను ఆశ్చర్యములో ముంచెత్తుటకై యోగమాయా ప్రభావముచే యోగస్వరూపుడనై బ్రహ్మచారి శరీరమును దాల్చి అవతరించెదను (4.5). నేను అపుడు శ్మశానములో గాయములు ఇతర దోషములు లేని మృతదేహమును గాంచి యోగమాయా ప్రభావముచే స్వశరీరమును విడిచి బ్రాహ్మణులకు హితమును చే గూర్చుట కొరకై దానిలో ప్రవేశించెదను (46). ఓ

బ్రహ్మా ! అపుడు నేను నీతో మరియు విష్ణువుతో గూడి దివ్యము, పవిత్రమునగు మేరు పర్వతగుహను ప్రవేశించెదను. అపుడు నేను లకులి అను పేరుతో ప్రసిద్ధిని గాంచెదను (47). ఈ తీరున నా ఈ కాయ ప్రవేశరూపమగు అవతారము లోకమునందు ప్రసిద్ధిని పొందును. ఆ స్థలము గొప్ప సిద్ధ క్షేత్రము కాగలదు. ఈ ఖ్యాతి మరియు పవిత్రత భూమి ఉన్నంతవరకు ఉండును (48). ఆ అవతారమునందు కూడా నాకు కుశికుడు, గర్గుడు, మిత్రుడు మరియు కౌరుష్యుడు అను తపశ్శాలురగు నల్గురు శిష్యులు ఉండగలరు (49). యోగులు, బ్రాహ్మణులు, వేదవేత్తలలో అగ్రగణ్యులు మరియు ఊర్ధ్వరేతస్కులునగు ఆ శిష్యులు మహేశ్వర యోగమును పొంది శివపురమును చేరుకొనగలరు (50).

వైవస్వతేంతరే సమ్యక్ ప్రోక్తా హి పరమాత్మనా ।
యోగేశ్వరావతారాశ్చ సర్వావర్తేషు సువ్రతాః ॥
వ్యాసాశ్చై వాష్ట వింశత్యా ద్వాపరే ద్వాపరే విభోః ।
యోగేశ్వరావతారశ్చ ప్రారంభే చ కలౌ కలౌ ॥
యోగేశ్వరావతారాణాం యోగమార్గ ప్రవర్ధకాః ।
మహాశైవాశ్చ చత్వారశ్శిష్యాః ప్రత్యేకమవ్యయాః ॥
ఏతే పాశుపతాశ్శిష్యా భస్మోద్ధూలిత విగ్రహాః ।
రుద్రాక్ష మాలాభరణాస్త్రి పుండ్రాంకిత మస్తకాః ॥
శిష్యా ధర్మరతాస్సర్వే వేదవేదాంగ పారగాః ।
లింగార్చనరతా నిత్యం బాహ్యాభ్యం తరతస్స్థితాః ॥
భక్త్యా మయి చ యోగేన ధ్యాననిష్ఠా జితేంద్రియాః ।
సంఖ్యయా ద్వాదశాధిక్యశతం చ గణితా బుధైః ॥

వైవస్వత మన్వంతరములోని అన్ని మహాయుగముల యందు శివుని గొప్ప వ్రతము గల యోగేశ్వరావతారములన్నియు పరమాత్మచేతనే చక్కగా వర్ణించ బడినవి (51). ప్రతిద్వాపరమునందు ఉండే ఇరవై ఎనిమిది వ్యాసులు మరియు ప్రతి కలియుగమునకు ఆరంభములో శివుని యోగేశ్వరావతారములు నిరూపించబడినవి (52). ప్రతి యోగేశ్వరావతారమునకు నల్గురు శిష్యులు గలరు. యోగమార్గమును వర్ధిల్లజేయువారు, మహాశైవులు, శాశ్వతపరబ్రహ్మస్వరూపులు అగు ఆ శిష్యులు చెప్పబడినారు (53). ఈ పశుపతి యొక్క శిష్యులు భస్మలేపనము గల దేహములతో, రుద్రాక్షమాలలను ఆభరణములగా దాల్చి లలాటమునందు త్రిపుండ్రము గల వారై శోభిల్లెదరు (54). ఆ శిష్యులందరు ధర్మనిష్ఠులు, వేదవేదాంగముల యందు దిట్టలు మరియు ప్రతిదినము బాహ్యమునందు, హృదయగుహ యందు కూడ లింగార్చన చేయుటలో అభిరుచిగలవారు (55). జితేంద్రియులై నాయందలి భక్తితో మరియు యోగముతో ధ్యానమునందు నిష్ఠను కలిగియున్న వారి సంఖ్య నూటపన్నెండు అని పండితులు గణించినారు (56).

ఇత్యేతద్వై మయా ప్రోక్త మవతారేషు లక్షణమ్ ।
మన్వాది కృష్ణ పర్యంత మష్టావింశద్యుగక్రమాత్ ॥
తత్ర శ్రుతి సమూహానాం విధానం బ్రహ్మలక్షణమ్ ।
భవిష్యతి తదా కల్పే కృష్ణ ద్వైపాయనో యదా ॥
ఇత్యేవముక్త్వా బ్రహ్మాణమనుగృహ్య మహేశ్వరః ।
పునస్సంప్రేక్ష్య దేవేశస్త త్రైవాంతరధీయత ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం శివావతార వర్ణనం నామ పంచమోఽధ్యాయః.

తన కుమారుని నేను ఇంతవరకు మనువుతో మొదలిడి శ్రీరీ కృష్ణుని వరకు ఇరువది ఎనిమిది మహాయుగములలో శివుని అవతార విశేషములను వర్ణించితిని (57), కృష్ణద్వైపాయనుడు వ్యాసుడైన ఆ మహాయుగములో వేదవాక్యములకు బ్రహ్మసూత్ర విధానము నిర్మాణమై, బ్రహ్మ ప్రతిపాదకమగు వేదాంత శాస్త్రము ప్రసిద్ధిని గాంచును (58). దేవదేవుడగు మహేశ్వరుడు బ్రహ్మతో నిట్లు పలికి బ్రహ్మను తన కృపాదృష్టితో అనుగ్రహించి అచటనే అంతర్ధానమయ్యెను (59).

శ్రీ శివమహాపురాణములోని శతరుద్ర సంహిత యందు
శివావతారవర్ణనమనే అయిదవ అధ్యాయము ముగిసినది (5).

6 - నందీశ్వరావతారము

అథ నందీశ్వరావతారమాహ ।

సనత్కుమార ఉవాచః

భవాన్ కథమను ప్రాప్తో మహాదేవాంశజశ్శివమ్ ।
శ్రోతుమిచ్ఛామి తత్సర్వం వక్తుమర్హసి మే ప్రభో ॥

తరువాత నందీశ్వరావతారము వర్ణింపబడుచున్నది.

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ ప్రభూ! నీవు మహాదేవుని అంశతో జన్మించి, ఆ తరువాత శివుని ఎట్లు పొందితివి? ఆ వృత్తాంతమునంతనూ వినగోరుచున్నాను. నాకు నీవు చెప్పదగుదువు (1).

నందీశ్వర ఉవాచః

సనత్కుమార సర్వజ్ఞ సావధానతయా శృణు ।
యథాహం చ శివం ప్రాప్తో మహాదేవాంశజోమునే ॥
ప్రజాకామశ్శిలా దోఽభూదుక్తః పితృభిరాదరాత్ ।
తదుద్ధర్తు మనా భక్త్యా సముద్ధారమ భీప్సుభిః ॥
అధోదృష్టిస్సుధర్మాత్మా శిలాదో నామ వీర్యవాన్ ।
తస్యాసీన్ముని కైర్వృత్తి శ్శివలోకే చ సోఽగమత్ ॥
శక్రముద్దిశ్య స మునిస్తపస్తేపే సుదుస్సహమ్ ।
నిశ్చలాత్మా శిలాదాఖ్యో బహుకాలం దృఢవ్రతః ॥
తపతస్తస్య తపసా సంతుష్టోఽభూచ్ఛతక్రతుః ।
జగామ చ వరం దాతుం సర్వదేవ ప్రభుస్తదా ॥
శిలాదమాహ సుప్రీత్యా శక్రస్తుష్టోఽస్మి తేఽనఘ ।
తేన త్వం మునిశార్దూల వరయస్వ వరానితి ॥
తతః ప్రణమ్య దేవేశం స్తుత్వా స్తుతిభిరాదరాత్ ।
శిలాదో మునిశార్దూలస్తమాహ సుకృతాంజలిః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

సనత్కుమారా ! నీవు సర్వజ్ఞుడవు. సావధానముగా వినుము. ఓ మహర్షీ! మహాదేవుని అంశతో జన్మించిన నేను శివుని పొందిన విధమును చెప్పెదను (2). శిలాదుడనే ధర్మాత్ముడగు మహర్షి ఉండెను. తమయొక్క ఉద్ధారమును కోరిన పితృదేవతలు ఆదరముతో శిలాదుని ప్రార్థించగా, ఆతడు వారియందలి భక్తిచే వారిని ఉద్ధరించ గోరి సంతానమును కాంక్షించెను (3,4). ఆ శిలాదమహర్షి దృఢమగు దీక్ష గలవాడై నిశ్చలమగు అంతఃకరణముతో ఇంద్రుని ఉద్దేశించి చిరకాలము కఠోరమగు తపస్సును చేసెను (5). ఆతడిట్లు తపస్సును

చేయుచుండగా, దేవతలందరికీ ప్రభువగు ఇంద్రుడు సంతసిల్లి వరమునిచ్చుటకు వెళ్లెను (6). ఇంద్రుడు. మిక్కిలి ప్రీతితో శిలాదుని ఉద్దేశించి ఇట్లు పలికెను. ఓయీ పుణ్యాత్మా ! మహర్షీ ! నేను చాల సంతోషించితిని. కావున నీవు వరములను కోరుకొనుము (7). అపుడు శిలాదమహర్షి దేవేంద్రునకు ప్రణమిల్లి స్తోత్రములతో సాదరముగా కొనియాడి చక్కగా చేతులను జోడించి ఇట్లు పలికెను (8). "

శిలాద ఉవాచః

శతక్రతో సురేశాన సంతుష్టో యది మే ప్రభో ।
అయోనిజం మృత్యుహీనం పుత్రమిచ్ఛామి సువ్రతమ్ ॥

శిలాదుడిట్లు పలికెను-

హే శతక్రతూ! సురేశ్వరా ! ప్రభూ ! నీవు నాయందు సంతుష్టుడవైనచో, అయోనిజుడు, అమరుడు, గొప్ప వ్రతము గలవాడునగు పుత్రుని గోరుచున్నాను (9).

శక్ర ఉవాచః

పుత్రం దాస్యామి పుత్రార్థిన్ యోనిజం మృత్యుసంయుతమ్ ।
అన్యథా తేన దాస్యామి మృత్యుహీనా న సంతి వై ॥
న దాస్యామి సుతం తేఽహం మృత్యుహీనమయోనిజమ్ ।
హరిర్విధిశ్చ భగవాన్ కి ముతాన్యే మహామునే ॥
తావపి త్రిపురార్యంగ సంభవౌ మరణాన్వితౌ ।
తయోరప్యాయుషాంమానం కథితం నిగమే పృథక్ ॥
తస్మాదయోనిజే పుత్రే మృత్యుహీనే ప్రయత్నతః ।
పరిత్యజాశాం విప్రేంద్ర గృహాణాత్మక్షమం సుతమ్ ॥
కిం తు దేవేశ్వరో రుద్రః ప్రసీదతి మహేశ్వరః ।
సుదుర్లభో మృత్యుహీనస్తవ పుత్రో హ్యయోనిజః ॥
అహం చ విష్ణుర్భగవాన్ ద్రుహిణశ్చ మహామునే ।
అయోనిజం మృత్యుహీనం పుత్రం దాతుం న శక్నుమః ॥
ఆరాధయ మహాదేవం తత్పుత్ర వినికామ్యయా ।
సర్వేశ్వరో మహాశక్తస్స తే పుత్రం ప్రదాస్యతి ॥

ఇంద్రుడిట్లు పలికెను -

పుత్రుని కోరు ఓ శిలాదా ! స్త్రీ గర్భమునుండి జన్మించువాడు, మర్త్యుడు అగు పుత్రుని నీకు ఇచ్చెదను. నీకు ఇష్టము కానిచో, నేను వరము నీయను. ఏలయన, మృత్యువు లేనివారు లేరు సుమా! (10) అయోనిజుడు, అమరుడు అగు పుత్రుని నేను నీకీయ జాలను. భగవాన్ విష్ణువు, మరియు బ్రహ్మకూడ ఈయజాలరు. ఓ మ హర్షీ! ఇతరుల గురించి చెప్పున దేమున్నది? (11) వారిద్దరు కూడ త్రిపురారి యగు శివుని దేహమునుండి పుట్టినవారే. మరియు వారికి కూడ మరణము గలదు. శాస్త్రము వారిద్దరి ఆయుర్దాయములను వేర్వేరుగా నిరూపించి

యున్నది (12). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా ! కావున అయోనిజుడు, అమరుడు అగు పుత్రునియందలి ఆశను ప్రయత్నపూర్వకముగా విడనాడి నీకు తగిన పుత్రుని స్వీకరించుము (13). కాని దేవదేవుడు, మహేశ్వరుడు అగు రుద్రుడు ప్రసన్నుడైనచో, అయోనిజుడు, అమరుడు అగు పుత్రుడు మిక్కిలి దుర్లభుడే అయినా, నీకు లభించవచ్చును (14). ఓ మహామునీ ! నేను గాని, విష్ణుభగవానుడు గాని, బ్రహ్మగాని నీకు అయోనిజుడు, అమరుడు అగు పుత్రుని అనుగ్రహింప జాలము (15). అట్టి పుత్రుని నీవు కోరినచో, మహాదేవుని ఆరాధించుము. సర్వశక్తిమంతుడు, సర్వేశ్వరుడు అగు ఆ శివుడు నీకు పుత్రుని అనుగ్రహించగలడు (16).

నందీశ్వర ఉవాచః

ఏవం వ్యాహృత్య విప్రేంద్ర మనుగృహ్యా చ తం ఘృణీ ।
దేవైర్వృతస్సురే శానస్స్వలోకం సమగాన్మునే ॥
గతే తస్మింశ్చ వరదే సహస్రాక్షే శిలాశనః ।
ఆరాధయన్మహాదేవం తపసాతోష యద్భవమ్ ॥
అథ తస్యై వమనిశం తత్పరస్య ద్విజస్య వై ।
దివ్యం వర్ష సహస్రం తు గతం క్షణమివాద్భుతమ్ ॥
వల్మీకేన వృతాంగశ్చ లక్ష కీట గణైర్మునిః ।
వజ్రసూచీ ముఖైశ్చాన్యై రక్త భుగ్భిశ్చ సర్వతః ॥
నిర్మాంస రుధిరత్వగ్వై జిలే తస్మిన్నవస్థితః ।
అస్థిశేషోఽ భవత్పశ్చాచ్ఛిలాదో మునిసత్తమః ॥
తుష్టః ప్రభుస్తదా తస్మై దర్శయామాస స్వాం తనుమ్ ।
దివ్యాం దివ్యగణైర్యుక్తామ లభ్యాం వామబుద్ధిభిః ॥
దివ్యవర్ష సహస్రేణ తప్యమానాయ శూలధృక్ ।
సర్వదేవాధిపస్తస్మై వరదోఽస్మీత్య భాషత ॥
మహాసమాధి సంలీనస్స శిలాదో మహామునిః ।
నాశృణోత్తద్గిరం శంభోర్భక్త్యధీన తరస్య వై ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ ! దయామయుడగు దేవేంద్రుడు ఆ బ్రాహ్మణ శ్రేష్ఠునితో నిట్లు పలి◌కి, ఆయనను అనుగ్రహించి, 'దేవతలతో గూడినవాడై తన లోకమునకు వెళ్లెను (17). వరములనిచ్చు ఆ ఇంద్రుడు అంతర్ధానమైన తరువాత, శిలాదుడు మహాదేవుడగు భవుని తపస్సుచే ఆరాధించి సంతోషపెట్టెను (18). ఇట్లు ఆ బ్రాహ్మణుడు నిరంతరము తపస్సును చేయుచుండగా, వేయి దివ్యసంవత్సరములు క్షణమువలె గడిచిపోయెను. ఇది అద్భుతము (19). ఆ మహర్షి యొక్క దేహము చుట్టూ పుట్టలు పెరిగెను. వజ్రము వలె పదునైన నోళ్లు గలిగి రక్తమును త్రాగే వివిధరకముల కీటకములు లక్షల సంఖ్యలో ఆతని దేహమునంతనూ వ్యాపించి

యుండెను (20). ఆతడు ఆ పుట్టల లోపల మాంసము, రక్తము మరియు చర్మమును కూడ కోల్పోయి తపమునా చరించెను. ఆ శిలాదమహర్షి యొక్క అస్థిపంజరము మాత్రమే మిగిలియుండెను (21). అపుడు శివ ప్రభుడు సంతసిల్లి ఆతనికి దివ్యమైనది, దివ్యమగు గణములతో కూడియున్నది, దుర్బుద్ధి గలవారికి లభింప శక్యము కానిది అగు తన స్వరూపమును చూపించెను (22). శూలధారి, సర్వదేవాధిదేవుడు అగు శివుడు వేయి దివ్య సంవత్సరములనుండి తపస్సు చేయుచున్న ఆతనితో 'వరమునిచ్చెదను' అని పలికెను (23). భక్తులకు అత్యంతము వశుడై ఉండే శంభుని ఆ మాటను మహాసమాధిలో లీనమైయున్న శిలాదమహర్షి వినలేదు (24).

యదా స్పృష్టో మునిస్తేన కరేణ త్రిపురారిణా ।

తదైవ మునిశార్దూల ఉత్ససర్జ తపః క్రమమ్ ॥

అథోన్మీల్య మునిర్నేత్రే సోమం శంభుం విలోకయన్ ।

ద్రుతం ప్రణమ్య సముదా పాదయోర్న్య పతన్మునే ॥

హర్షగద్గదయా వాచా నతస్కంధః కృతాంజలిః ।

ప్రసన్నాత్మా శిలాదస్స తుష్టావ పరమేశ్వరమ్ ॥

తతః ప్రసన్నో భగవాన్ దేవదేవస్త్రి లోచనః ।

వరదోఽస్మీతి తం ప్రాహ శిలాదం ముని పుంగవమ్ ॥

తపసానేన కిం కార్యం భవతే హి మహామతే ।

దదామి పుత్రం సర్వజ్ఞం సర్వశాస్త్రార్థ పారగమ్ ॥

తతః ప్రణమ్య దేవేశం తచ్ఛ్రుత్వా చ శిలాశనః ।

హర్షగద్గదయా వాచోవాచ సోమవిభూషణమ్ ॥

ఓ మహర్షీ! త్రిపురారియగు శివుడు ఆ మహర్షిని చేతితో స్పృశించిన తరువా◌ాత మాత్రమే ఆ మహర్షి క్రమముగా సమాధిని విడిచెపెట్టెను (25). ఓ మహర్షీ! అపుడా ముని కళ్లను తెరిచి పార్వతీసమేతుడగు పరమేశ్వరుని దర్శించి వెంటనే ప్రణమిల్లి ఆనందముతో వెంటనే పాదములపై బడెను (26). ఆ శిలాదుడు సాష్టాంగ ప్రణామమును చేసి చేతులు జోడించి, ప్రసన్నమగు మనస్సు గలవాడై, హర్షముతో గద్గదమైన స్వరముతో పరమేశ్వరుని స్తుతించెను (27). అపుడు దేవదేవుడు, ముక్కంటి యగు భగవానుడు ప్రసన్నుడై శిలాదమహర్షితో 'వరమునిచ్చెదను' అని పలికెను (28). ఓ మహాజ్ఞానీ! నీకు ఈ తపస్సుచే సాధింపదగినది ఏది గలదు? సర్వజ్ఞుడు, సర్వశాస్త్రములలో దిట్టయగు కుమారుని నీకు ఇచ్చెదను (29). అపుడా మాటను విని, శిలాదుడు దేవదేవుడగు ఆ సోమశేఖరునకు నమస్కరించి ఆనందముతో గద్గదమైన వచనముతో నిట్లు పలికెను (30).

శిలాద ఉవాచ:

మహేశ యది తుష్టోఽసి యది వా వరదశ్చ మే ।

ఇచ్ఛామి త్వత్సమం పుత్రం మృత్యుహీన మయోనిజమ్ ॥

శిలాదుడిట్లు పలికెను –

ఓ మహేశ్వరా! నీవు సంతసించి వరము నీయ గోరినచో, నేను నీతో సమానమైనవాడు, మరణము లేనివాడు, అయోనిజుడు అగు పుత్రుని గోరుచున్నాను (31).

నందీశ్వర ఉవాచ:

ఏవముక్తస్తతో దేవస్త్ర్యంబకస్తేన శంకరః ।

ప్రత్యువాచ ప్రసన్నాత్మా శిలాదం మునిసత్తమమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

శిలాద మహర్షి ఇట్లు పలుకగా ముక్కంటి దేవుడగు శంకరుడు ప్రసన్నమగు అంతఃకరణము గలవాడై ఇట్లు బదులిడెను (3 2).

శివ ఉవాచ:

పూర్వమారాధితో విప్ర బ్రహ్మణాహం తపోధన ।

తపసా చావతారార్థం మునిభిశ్చ సురోత్తమైః ॥

తవ పుత్రో భవిష్యామి నందీ నామ్నా త్వయోనిజః ।

పితా భవిష్యసి మమ పితుర్వై జగతాం మునే ॥

శివుడిట్లు పలికెను –

హే బ్రాహ్మణా! నీవు తపోధనుడవు. పూర్వము నన్ను బ్రహ్మ, మహర్షులు, దేవశ్రేష్ఠులు తపస్సుచే ఆరాధించి అవతరించుమని గోరియున్నారు (33). ఓ మహర్షీ! నేను నంది అను పేరుతో నీకు అయోనిజుడగు పుత్రుడను కాగలను. జగత్తులకు తండ్రిని అగు నాకు నీవు తండ్రివి కాగలవు (34).

నందీశ్వర ఉవాచః

ఏవముక్త్వా మునిం ప్రేక్ష్య ప్రణిపత్యాస్థితం ఘృణీ ।
సోమం తూర్ణం సమాదిశ్య తత్రైవాంతర్దధే హరః ॥
గతే తస్మిన్మహాదేవే స శిలాదో మహామునిః ।
స్వమాశ్రమముపాగమ్య ఋషిభ్యోఽకథయత్తతః ॥
కియతా చైవ కాలేన తదాసౌ జనకస్స మే ।
యజ్ఞాంగణం చకర్షాశు యజ్ఞార్థం యజ్ఞవిత్తమః ॥
తతః క్షణాదహం శంభోస్తనుజస్తస్య చాజ్ఞయా ।
సజాతః పూర్వమేవాహం యుగాంతాగ్ని సమప్రభః ॥
అవర్షంస్తదా పుష్కరావర్తకాద్యా జగుః ఖేచరాః కిన్నరాస్సిద్ధసాధ్యాః ।
శిలా దాత్మజత్వం గతే మయ్యృషీంద్రాః సమంతాచ్చ వృష్టిం వ్యధు:
కౌసుమీం తే ॥
అథ బ్రహ్మాదయో దేవా దేవపత్న్యశ్చ సర్వశః ।
తత్రాజగ్ముశ్చ సుప్రీత్యా హరిశ్చైవ శివోంఽబికా ॥
తదోత్సవో మహానాసీన్ననృతు శ్చాప్సరోగణాః ।
ఆదృత్య మాం తథా లింగన్ తుష్టువుర్హర్షితాశ్చ తే ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

దయా మయుడగు హరుడు ప్రణమిల్లి నిలబడియున్న మహర్షిని గాంచి ఇట్లు పలికి వెంటనే సోమయాగమును చేయుమని ఆదేశించి అచటనే అంతర్ధానమును చెందెను (35). ఆ మహాదేవుడు అంతర్ధానము కాగానే, ఆ శిలాదమహర్షి తన ఆశ్రమమునకు వచ్చి ఋషులతో జరిగిన వృత్తాంతమును చెప్పెను (36). కొంతకాలము గడిచిన తరువాత నా తండ్రి, యజ్ఞవేత్తలలో శ్రేష్ఠుడు అగు ఆ శిలాదుడు యజ్ఞము కొరకై శీఘ్రమే యజ్ఞశాలను నిర్మించెను (37). అపుడు నేను శంభుని ఆజ్ఞచే యజ్ఞమునకు పూర్వమే ప్రలయాకాలాగ్నితో సమమగు తేజస్సు గలవాడనై ఆతని శరీరము నుండి ఉద్భవించితిని (38). అపుడు పుష్కరావర్త కాది మేఘములు వర్షించినవి. ఆకాశమునందు సంచరించు కిన్నరులు, సిద్ధులు, సాధ్యులు గానము చేసిరి. నేను శిలాదుని పుత్రుడను కాగానే, మహర్షులు అన్నివైపుల నుండి పుష్పవృష్టిని గురిపించిరి (39). అపుడు బ్రహ్మాది దేవతలు, దేవపత్నులు .అందరు మిక్కిలి ప్రీతితో అచటకు విచ్చేసిరి. విష్ణువు, శివుడు మరియు పార్వతి కూడ విచ్చేసిరి (40). అపుడు గొప్ప ఉత్సవము జరిగెను. అప్సరసల గణములు నాట్యమును చేసిరి. వారందరు ఆనందముతో నన్ను సాదరముగా ఆలింగనము చేసి స్తుతించిరి (41).

సుప్రశస్య శిలాదం తం స్తుత్వా చ సుస్తవైశ్శివా ।
సర్వే జగ్ముశ్చ ధామాని శివావప్య ఖిలేశ్వరౌ ॥
శిలాదోఽపి చ మాం దృష్ట్వా కాలసూర్యానల ప్రభమ్ ।
త్ర్యక్షం చతుర్భుజం బాలం జటాముకుట ధారిణమ్ ॥
త్రిశూలాద్యాయుధం దీప్తం సర్వథా రుద్రరూపిణమ్ ।
మహానందభరః ప్రీత్యా ప్రణమ్యం ప్రణనామ చ ॥

పార్వతీ పరమేశ్వరులు మరియు సమస్త దేవతలు, ఇంద్రాది ప్రభువులు శిలాద మహర్షిని ప్రశంసించి స్తుతించి తమ తమ ధామములకు వెళ్లిరి (42). ప్రళయ కాలమునందలి సూర్యుని వలె అగ్నివలె ప్రకాశించునట్టియు, మూడు నేత్రములు నాల్గు భుజములు కలిగినట్టియు, జటలను కిరీటమును ధరించి నట్టియు, త్రిశూలము మొదలగు ఆయుధములు కలిగినట్టియు, సర్వవిధములుగా ప్రకాశించునట్టియు, రుద్రస్వరూపుడైనట్టియు, నమస్కరింపదగినవాడై నట్టియు, బాలకుడనగు నన్ను గాంచి మహానంద భరితుడై ప్రేమతో నమస్కరించెను (43,44).

శిలాద ఉవాచః

త్వయాహం నందితో యస్మాన్నందీ నామ్నా సురేశ్వర ।
తస్మాత్త్వాం దేవమానందం నమామి జగదీశ్వరమ్ ॥

శిలాదుడిట్లు పలికెను -

ఓ దేవశ్రేష్ఠా! నీవు నాకు ఆనందమును కలిగించితివి గాన నీకు నంది అను పేరు సార్థకము కాగలదు. ఆనందఘనుడవు, జగదీశ్వరుడవు, ప్రకాశస్వరూపుడవు అగు నీకు నమస్కారము (45).

నందీశ్వర ఉవాచః

మయా సహ పితా హృష్ట స్సు ప్రణమ్య మహేశ్వరమ్ ।
ఉటజం స్వం జగామాశు నిధిం లబ్ధ్వేవ నిర్ధనః ॥
యదా గతోఽహముటజం శిలాదస్య మహామునే ।
తదాహం తాదృశం రూపం త్యక్త్వా మానుష్య మాస్థితః ॥
మానుష్యమాస్థితం దృష్ట్వా పితా మే లోకపూజితః ।
విలలాపాతిదుఃఖార్త స్స్వజనైశ్చ సమావృతః ॥
జాతకర్మాది కాన్యేవ సర్వాణ్యపి చకార మే ।
శాలంకాయనపుత్రో వై శిలాదః పుత్రవత్సల ॥
వేదానధ్యాప యామాస సాంగోపాంగా నశేషతః ।
శాస్త్ర ణ్యన్యాన్యపి తథా పంచవర్షే పితా చ మామ్ ॥

సంపూర్ణే సప్తమే వర్షే మిత్రావరుణ సంజ్ఞకౌ।

మునీ తస్యా శ్రమం ప్రాప్తౌ ద్రష్టుం మాం చాజ్ఞయా విభోః ॥

సత్కృతౌ మునినా తేన సూపవిష్టౌ మహామునీ ।

ఊచతుశ్చ మహాత్మానౌ మాం నిరీక్ష్య ముహుర్ముహుః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

హర్షముతో గూడియున్న నా తండ్రి, దరిద్రునకు నిధి లభించినట్లు, నన్ను పొంది మహేశునకు ప్రణమిల్లి తన పర్ణశాలకు వెంటనే చేరుకొనెను (46). ఓ మహర్షీ! నేను శిలాదుని పర్ణశాలకు చేరుకోగానే అటువంటి దివ్యరూపమును విడిచి మనుష్య రూపమును దాల్చితిని (47). లోకవందితుడగు నా తండ్రి మనుష్య రూపమును దాల్చిన నన్ను గాంచి మిక్కిలి దుఃఖముతో గూడినవాడై తన బంధువులచే చుట్టువారబడి రోదించెను (48). శాలంకాయనుని కుమారుడగు ఆ శిలాదుడు పుత్రుని యందు ప్రేమ గలవాడై నాకు జాతకర్మ మొదలగు సంస్కారముల నన్నిటినీ జరిపించెను (49). నా తండ్రి నాకు అయిదవ ఏట అంగ, ఉపాంగములతో కూడిన సర్వవేదములను, మరియు ఇతరశాస్త్రములను కూడ నేర్పించెను (50). నాకు ఏడవ సంవత్సరము వయస్సు రాగానే, పరమేశ్వరుని ఆజ్ఞచే మిత్రావరుణులను, పేరు గల ఇద్దరు ఋషులు నన్ను చూచుటకై శిలాదుని ఆశ్రమమునకు విచ్చేసిరి (51). శిలాదమహర్షి ఆ మహామునులిద్దరినీ ఆసనమునిచ్చి సత్కరించెను. ఆ మహాత్ములిద్దరు నన్ను అనేకపర్యాయములు పరికించి ఇట్లు పలికిరి (52).

మిత్రావరుణావూచతుః ।

తాత నందీ తవాల్పాయుస్సర్వశాస్త్రార్థ పారగః ।

న దృష్టమేవ చాపశ్యం హ్యాయుర్వర్షాదతః పరమ్ ॥

ఇత్యుక్తవతో ర్వి ప్రయోశ్శిలాదః పుత్రవత్సలః ।

తమాలింగ్య చ దుఃఖార్తో రురోదాతీవ విస్వరమ్ ॥

మృతవత్పతితం దృష్ట్వా పితరం చ పితామహమ్ ।

ప్రత్యవోచత్ప్రసన్నాత్మా స్మృత్వా శివపదాంబుజమ్ ॥

కేన త్వం తాత దుఃఖేన వేపమానశ్చ రోదిషి ।

దుఃఖం తే కుత ఉత్పన్నః జ్ఞాతుమిచ్ఛామి తత్త్వతః ॥

మిత్రావరుణులు ఇట్లు పలికిరి -

వత్సా! నీ కుమారుడగు నంది సర్వశాస్త్రములలో నిష్ణాతుడే అయిననూ, అల్పాయుష్కుడు. మేము పరిశీలించి చూచితిమి. ఈతడు ఇప్పటినుండి సంవత్సరము తరువాత జీవించి యుండునని మాకు తోచుట లేదు (53). ఆ బ్రాహ్మణులు ఇట్లు చెప్పగా, పుత్రునియందు అనురాగము గల శిలాదుడు ఆ బాలుని కౌగిలించుకొని దుఃఖముచే పీడితుడై బిగ్గరగా రోదించెను (54).

మరణించిన వాడు వలె పడియున్న తండ్రిని, తాతను గాంచి, ప్రసన్నమగు మనస్సు గల ఆ బాలుడు శివుని పాదపద్మములను స్మరించి ఇట్లు పలికెను (55). తండ్రీ! నీవు దుఃఖముతో వణికిపోతూ ఏల ఏడ్చుచుంటివి? నీకు దుఃఖము కలుగుటకు కారణమేమి? నేను యథాతథముగా తెలియ గోరుచున్నాను (56).

పితో వాచ ।

తవాల్ప మృత్యు దుఃఖేన దుఃఖితోఽతీవ పుత్రక ।

కో మే దుఃఖం హరతు వై శరణం తం ప్రయామి హ ॥

తండ్రి ఇట్లు పలికెను-

కుమారా! నీ ఆయుర్దాయము అల్పమగుటచే నాకు అతిశయించిన దుఃఖము కలుగుచున్నది. నాదుఃఖమును ఎవరు పోగొట్టగలరో, వారిని నేను శరణు వేడెదను (57).

పుత్ర ఉవాచః

దేవో వా దానవో వాపి యమః కాలోఽథ వాపి హి ।

ఋధ్యేయుర్యద్యపి హ్యేతే మామన్యేఽపి జనాస్తథా ॥

అథాపి చాల్పమృత్యుర్మే న భవిష్యతి మా శుచః ।

సత్యం బ్రవీమి జనకం శపథం తే కరోమ్యహమ్ ॥

పుత్రుడిట్లు పలికెను -

దేవతలు, దానవులు, కాలపురుషుడగు యముడు, మరియు ఇతరులు విడివిడిగా గాని, కలిసి గాని నాకు మృత్యువును కలిగించలేరు (58). నాకు అల్పకాలములో మరణము కలుగదు. నీవు దుఃఖించకుము. తండ్రివగు నీకు నేను శపథము చేసి సత్యమును చెప్పుచున్నాను (59).

పితో వాచ ।

కిం తపః కిం పరిజ్ఞానం కో యోగశ్చ ప్రభుశ్చ తే ।

యేన త్వం దారుణం దుఃఖం వంచయిష్యసి పుత్ర మే ॥

తండ్రి ఇట్లు పలికెను -

నీ తపస్సు ఎట్టిది? పరిజ్ఞానమెట్టిది? నీ యోగమేది? నీ ప్రభువు ఎవరు? పుత్రా! నీవు ఏ బలముచే నా దారుణమగు దుఃఖమును పోగొట్టగలవు? (60)

పుత్ర ఉవాచః

న తాత తపసా మృత్యుం వంచయిష్యే న విద్యయా ।
మహాదేవస్య భజనాన్మృత్యుం జేష్యామి నాన్యథా ॥

పుత్రుడిట్లు పలికెను -

తండ్రీ! నేను తపస్సుచే గాని, విద్యచేగాని మృత్యువు నుండి తప్పించుకొన గోరుటలేదు. మహాదేవుని భజించి నేను మృత్యువును జయించెదను. మరియొక ఉపాయములేదు (61).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వాహం పితుః పాదౌ ప్రణమ్య శిరసా మునే ।
ప్రదక్షిణీ కృత్య చ తమగచ్ఛం వనముత్తమమ్ ॥
ఇతి శ్రీశివమహాపురాణే శతరుద్ర సంహితాయాం
నందికేశ్వరావతారవర్ణనం నామ షష్ఠోఽ ధ్యాయః .

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! నేను ఇట్లు పలికి తండ్రి పాదములకు ప్రణమిల్లి ఆయనకు ప్రదక్షిణము చేసి ఉత్తమమగు వనమునకు వెళ్లితిని (62).

శ్రీ శివమహాపురాణములోని శతరుద్రసంహితయందు నందీశ్వరావతారవర్ణనమనే ఆరవ అధ్యాయము ముగిసినది (6).

7 - నందీశ్వరుని అభిషేకము, వివాహము

నందికేశ్వర ఉవాచః

తత్ర గత్వా మునేఽహం వై స్థిత్వైకాంతస్థలే సుధీః ।
అతపం తప ఉగ్రం సన్మునీనామపి దుష్కరమ్ ॥
హృత్పుండరీకసుషిరే ధ్యాత్వా దేవం త్ర్యంబకమ్ ।
త్ర్యక్షం దశభుజం శాంతం పంచవక్త్రం సదాశివమ్ ॥
రుద్ర జాప్యమకార్షం వై పరమధ్యానమాస్థితః ।
సరితశ్చోత్తరే పుణ్యే హ్యే కచిత్త స్సమాహితః ॥
తస్మిన్ జాప్యేఽథ సంప్రీతః స్థితం మాం పరమేశ్వరః ।
తుష్టోఽబ్రవీన్మహాదేవః సోమస్సోమార్ధ భూషణః ॥

నందికేశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! బుద్ధిమంతుడనగు నేను అచటకు పోయి, ఏకాంతమగు స్థలమునందుండి, గొప్ప మహర్షులకైననూ శక్యము కాని ఉగ్రమగు తపస్సును చేసితిని (1). నేను హృదయ పుండరీకమునందు మూడు కన్నులు పది చేతులు గలవాడు, శాంతమూర్తి, ఐదు ముఖములు గలవాడు, అగు సదాశివదేవుని ధ్యానించి (2), పరమ ధ్యానమును ఆశ్రయించి నది యొక్క పవిత్రమగు ఉత్తర తటమునందు ఏకాగ్ర చిత్తముతో మనస్సమాధానము గలవాడనై రుద్రమంత్రమును జపించితిని (3). తరువాత ఆ జపములో దృఢముగా నున్న నన్ను గాంచి, పార్వతీ సమేతుడు, చంద్రవంక ఆభరణముగా గలవాడు, పరమేశ్వరుడు అగు మహాదేవుడు మిక్కిలి ప్రీతుడై సంతసముతో నిట్లనెను (4).

శివ ఉవాచః

శైలాదే వరదోఽహం తే తపసాఽనేన తోషితః ।
సాధు తప్తం త్వయా ధీమన్ బ్రూహి యత్తే మనోగతమ్ ॥
స ఏవముక్తో దేవేన శిరసా పాదయోర్నతః ।
అస్తవం పరమేశానం జరాశోకవినాశనమ్ ॥
అథ మాం నందినం శంభుర్భక్త్యా పరమయా యుతమ్ ।
అశ్రుపూర్ణేక్షణం సమ్యక్ పాదయోశ్శిరసా నతమ్ ॥
ఉత్థాప్య పరమేశానః పస్పర్శ పరమార్తిహా ।
కరాభ్యాం సమ్ముఖాభ్యాం తు సంగృహ్య వృషభధ్వజః ॥
నిరీక్ష్య గణపాంశ్చైవ దేవీం హిమవతస్సుతామ్ ।
ఉవాచ మాం కృపాదృష్ట్యా సమీక్ష్య జగతాం పతిః ॥
వత్స నందిన్ మహాప్రాజ్ఞ మృత్యోర్భీతిః కుతస్తవ ।
మయైవ ప్రేషితౌ విప్రౌ మత్సమస్త్వం న సంశయః ॥

అమరో జరయా త్యక్తోఽ దుఃఖీ గణ పతిస్సదా ।
అవ్యయశ్చాక్షయశ్చైవ్న స్సపితా ససుహృజ్జనః ॥
మద్బలః పార్శ్వగో నిత్యం మమేష్టో భవితానిశమ్ ।
న జరా జన్మ మృత్యుర్వై మత్ప్రసాదాద్భవిష్యతి ॥

శివుడిట్లు పలికెను -

ఓయీ శిలాదపుత్రా! నీ తపస్సునకు సంతసించితిని. నీకు వరమునిచ్చెదను. ఓయీ బుద్ధిశాలీ! నీవు చక్కగా తపస్సును చేసితివి. నీ మనస్సులోని కోరికను తెలుపుము (5). ప్రకాశస్వరూపుడు, జరాదుఃఖమును నాశము చేయువాడునగు పరమేశ్వరుడిట్లు పలుకగా నేను పాదములకు శిరస్సుతో ప్రణమిల్లి స్తుతించితిని (6). పరమభక్తితో కూడి కళ్ల వెంబడి నీటిని గార్చుచూ పాదములయందు శిరస్సునుంచి నమస్కరించిన నందీశ్వరుడనగు నన్ను అపుడు శంభుడు (7) లేవదీసెను. గొప్పదుఃఖములనైననూ పోగొట్టువాడు, వృషభధ్వజుడు అగు ఆ పరమేశ్వరుడు నన్ను రెండు చేతులతో పట్టుకుని లేవదీసెను (8). ఆయన గణాధ్యక్షులవైపు, పార్వతీదేవి వైపు చూచెను. అపుడా జగత్ప్రభువు నన్ను దయాదృష్టితో చూచి ఇట్లు పలికెను (9). కుమారా! నందీ! నీవు గొప్ప బుద్ధిశాలివి. నీకు మృత్యు భయమేల? ఆ బ్రాహ్మణులను నేనే పంపితిని. నీవు నాతో సముడవు. సందేహము లేదు (10). జరామరణములు లేనివాడవై దుఃఖమునెరుంగని వాడవై నీవు సర్వదా గణాధ్యక్షుడవై నాశముగాని, అపక్షయముగాని లేకుండా నాకు ఇష్టుడవై తండ్రితో మిత్రులతో గూడి ఆనందించెదవు (11). నాతో సమమగు బలము గల నీవు నిత్యము నా ప్రక్కనే ఉండెదవు. నీవు సర్వకాలములలో నాకు ప్రియుడవు కాగలవు. నా అనుగ్రహముచే వార్ధక్యము, పుట్టుక, మరణము అనునవి నీ దరికి జేరవు (12).

నందీశ్వర ఉవాచః

ఏవముక్త్వా శిరోమాలాం కుశేశయమయీం నిజామ్ ।
సమున్ముచ్య బబంధాశు మమ కంఠే కృపానిధిః ॥
తయాహం మాలయా విప్ర శుభయా కంఠసక్తయా ।
త్ర్యక్షో దశభుజశ్చాసం ద్వితీయ ఇవ శంకరః ॥
తత ఏవ సమాదాయ హస్తేన పరమేశ్వరః ।
ఉవాచ బ్రూహి కిం తేఽద్య దదామి వరముత్తమమ్ ॥
తతో జటాశ్రితం వారి గృహీత్వా హారనిర్మలమ్ ।
ఉక్త్వా నదీ భవేతీహ విససర్జ వృషధ్వజః ॥
తతః పంచమితా నద్యః ప్రావర్తంత శుభావహాః ।
సుతో యాశ్చ మహావేగా దివ్యరూపా చ సుందరీ ॥
జటోదకా త్రి స్రోతాశ్చ వృషధ్వని రితీవ హి ।
స్వర్ణోదకా జంబునదీ పంచనద్యః ప్రకీర్తితాః ॥

ఏతత్పంచనదం నామ శివపృష్టతమం శుభమ్ ।
జపేశ్వరసమీపే తు పవిత్రం పరమం మునే ॥
యః పంచనదమాసాద్య స్నాత్వా జపేశ్వరేశ్వరమ్ ।
పూజయేచ్ఛివసాయుజ్యం ప్రయత్యేవ న సంశయః ॥
అథ శంభు రువాచోమామభిషించామి నందినమ్ ।
గణేంద్రం వ్యాహరిష్యామి కిం వా త్వం మన్యసేఽవ్యయే ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఇట్లు పలికి దయానిధియగు శివుడు తన శిరస్సుపైనున్న కమలముల మాలను విడదీసి వెంటనే నా కంఠములో వేసెను (13). ఓ విదే! ఆ శుభకరమగు మాల నా కంఠములో పడగానే నేను మూడు కన్నులతో, పదిచేతులతో రెండవ శంకరుని వలె విరాజిల్లితిని (14). అపుడు పరమేశ్వరుడు చేతితో నన్ను పట్టుకొని 'నీకు ఉత్తమమగు వరమును దేనిని ఈయవలెనో చెప్పుము' అని పలికెను (15). అపుడు వృషభధ్వజుడగు ఆ శివుడు తన జటలయందున్న, ముత్యాల హారము వలె స్వచ్ఛమైన నీటిని తీసుకొని 'నీవు నదివి కమ్ము' అని పలికి చల్లెను (16). అపుడా నీరు మంగళకరములు, పవిత్రజలము గలవి, గొప్ప వేగము గలవి, దివ్యరూపము గలవి మరియు సుందరమైనవి యగు అయిదు నదుల రూపములో ప్రవహించెను (17). జటోదకా, త్రి స్రోతస్సు, వృషధ్వని, స్వర్ణోదకా మరియు జంబునది అనునవి ఆ నదుల పేర్లు (18). ఈ అయిదు నదులు శివుని దివ్యదేహముతో సమమైన పవిత్రత గలవి. ఓ మహర్షీ ! ఈ నామములను ఈశ్వరుని సన్నిధిలో జపించువాడు పరమపవిత్రుడగును (19). ఈ అయిదు నదులను దర్శించి స్నానము చేసి జపము చేసి దేవ దేవుడగు శివుని పూజించు వ్యక్తి శివసాయుజ్యమును పొందు ననుటలో సందేహము లేదు (20). అపుడు శంభుడు పార్వతితో నిట్లనెను: ఓ అవ్యయురాలా! నందిని గణాధ్యక్షుడని ప్రకటించెదను. నీ అభిప్రాయమేమి? (21)

ఉమోవాచ ।

దాతుమర్హసి దేవేశ నందినే పరమేశ్వర ।
మహాప్రియతమో నాథ శైలాదిస్తనయో మమ ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓ దేవదేవా! పరమేశ్వరా! నందికి అట్టి భాగ్యమును నీవు కలిగించవలెను. నాథా! శిలాదకుమారుడగు నంది నాకు అత్యంత ప్రియతముడగు పుత్రుడు (22).

నందీశ్వర ఉవాచః

తతస్స శంకరస్స్వీయాన్ సస్మార గణపాన్ వరాన్ ।
స్వతంత్రః పరమేశానస్సర్వదో భక్తవత్సలః ॥
స్మరణాదేవ రుద్రస్య సంప్రాప్తాశ్చ గణేశ్వరాః ।
అసంఖ్యాతా మహామో దాశ్శంకరాకృతయోఽఖిలా: ॥
తే గణేశాశ్శివం దేవీం ప్రణమ్యాహుశ్శుభం వచః ।
తే ప్రణమ్య కరౌ బద్ధ్వా నతస్కంధా మహాబలాః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

అపుడు స్వతంత్రుడు, సర్వమునిచ్చువాడు, భక్తప్రియుడు నగు ఆ శంకర పరమేశ్వరుడు తన శ్రేష్ఠ గణాధ్యక్షులను స్మరించెను (23). రుద్రుడు స్మరించగనే శంకరుని ఆకారముగల లెక్కలేనంతమంది గణాధ్యక్షులు మహానందముతో విచ్చేసిరి (24). మహాబలశాలురగు ఆ గణాధ్యక్షులు పార్వతీ పరమేశ్వరులకు సాష్టాంగ ప్రణామమాచరించి, చేతులు కట్టి నిలబడి ఈ శుభవాక్యమును పలికిరి (25).

గణేశా ఊచుః ।

కిమర్థం చ స్మృతా దేవ హ్యాజ్ఞాపయ మహాప్రభో ।
కింకరాన్న స్సమాయాతాంస్త్రీ పురార్దన కామద ॥
కిం సాగరాన్ శోషయామో యమం వా సహ కింకరైః ।
హన్మో మృత్యుం మహామృత్యుం విశేషం వృద్ధ పద్మజమ్ ॥
వృద్ధేంద్రం సమదేవైశ్చ విష్ణుం వా పార్ష దైస్సహ ।
ఆనయామస్సుసంక్రుద్ధాన్ దైత్యాన్వా దానవైస్సహ ॥
కస్యాద్య వ్యసనం ఘోరం కరిష్యామస్తవాజ్ఞయా ।
కస్య వాద్యోత్సవో దేవ సర్వకామ సమృద్ధయే ॥

గణాధ్యక్షులు ఇట్లు పలికిరి -

ఓ దేవా! మహాప్రభూ! మమ్ములను ఏల స్మరించితివి? త్రిపురములను నశింపజేసినవా◌ాడా! కోర్కెల నీడేర్చు వాడా! ఇచటకు వచ్చి యున్న కింకరులమగు మమ్ములను ఆజ్ఞాపించుము (26). మేము సముద్రములను ఎండింప జేయవలెనా? లేక మృత్యుదేవతయగు యముని కింకరులతో సహా సంహరించవలెనా? లేక మృత్యువునకు కూడ మృత్యువు మరియు చాల వృద్ధుడు అగు బ్రహ్మను (27) వృద్ధుడగు ఇంద్రుని కూడ దేవతలతో సహా తీసుకురావలెనా? పార్షదులతో గూడిన విష్ణువును లేక కోపశీలురగు దానవులను గొని రావలెనా? (28) నీ ఆజ్ఞచే మేమీనాడు ఎవనికి భయంకరమగు ఆపదను కలిగించవలెను?

లేదా, ఓ దేవా! ఎవనికి కోర్కెలనన్నిటినీ ఈడేర్చు సంపదలనిచ్చి ఉత్సవమును కలిగించవలెను? (29)

నందీశ్వర ఉవాచః

ఇత్యాకర్ణ్య వచస్తేషాం గణానాం వీరవాదినామ్ ।

ఉవాచ తాన్ స ప్రశంస్య గణేశాన్ పరమేశ్వరః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

వీరవచనములను పలుకుచున్న ఆ గణాధ్యక్షుల మాటలను విని ఆ పరమేశ్వరుడు వారిని ప్రశంసించి వారితో నిట్లనెను (30).

శివ ఉవాచః

నందీశ్వరోఽయం పుత్రో మే సర్వేషా మీశ్వరేశ్వరః ।

ప్రియో గణాగ్రణీస్సర్వైః క్రియతాం వచనం మమ ॥

సర్వే ప్రీత్యా భిషించధ్వం మద్గణానాం గతిం పతిమ్ ।

అద్య ప్రభృతి యుష్మాకమయం నందీశ్వరః ప్రభుః ॥

శివుడిట్లు పలికెను –

ఈ నందీశ్వరుడు నాకు పుత్రుడు. ప్రభువులందరికీ ఈతడు ప్రభువు. మీరు నా ఆజ్ఞానును పాలించుడు. మీరందరు నాకు ప్రియుడగు ఈతనిని గణాధ్యక్షుని చేయుడు (31). ఈతనిని మీరందరు ప్రీతితో నా గణములకు ప్రభువు అనే పదవిలో అభిషేకించుడు. ఈ నాటినుండియు ఈ నందీశ్వరుడే మీకు ప్రభువు (32).

నందీశ్వర ఉవాచః

ఏవముక్తాశ్శంకరేణ గణపాస్సర్వ ఏవ తే ।

ఏవమస్త్వితి సంప్రోచ్య సంభారానాహరంస్తతః ॥

తతో దేవాశ్చ సేంద్రాశ్చ నారాయణ ముఖాస్తథా ।

మునయస్సర్వతో లోకా ఆజగ్ముర్ముదితాననాః ॥

పితామహోఽపి భగవాన్ని యోగాచ్ఛంకరస్య వై ।

చకార నందినస్సర్వమభిషేకం సమాహితః ॥

తతో విష్ణు స్తతశ్శక్రో లోకపాలా స్తథైవ చ ।

ఋషయస్తుష్టువుశ్చైవ పితామహ పురోగమాః ॥

స్తుతిమత్సు తతస్తేషు విష్ణు స్సర్వజగత్పతిః ।

శిరస్యంజలి మాధాయ తుష్టావ చ సమాహితః ॥

ప్రాంజలి: ప్రణతో భూత్వా జయశబ్దం చకార చ ।

తతో గణాధిపాస్సర్వే తతో దేవాస్తతోఽసురాః ॥

ఏవం స్తుతశ్చాభిషిక్తో దేవైస్సు బ్రహ్మాద్యై స్తదా ।

నందీశ్వరోఽహం విప్రేంద్ర నియోగా త్పరమేశితుః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

శంకరుడిట్లు ఆజ్ఞాపించగా, ఆ గణాధ్యక్షులందరు " అటులనే అగుగాక!' అని పలికి, పిదప అభిషేకసామగ్రిని తీసుకొని వచ్చిరి (33). అపుడు ఇంద్రుడు, నారాయణుడు మొదలగు దేవతలు, మునులు మరియు ఇతరలోకములలోని జీవులు ఆనందముతో నిండిన ముఖములు గలవారై విచ్చేసిరి (34). శంకరుని ఆజ్ఞచే భగవానుడగు పితామహుడు మనస్సును లగ్నము చేసి నంది యొక్క అభిషేకకార్యము నంతనూ నడిపించెను (35). అపుడు విష్ణువు, ఇంద్రుడు, లోకపాలకులు, బ్రహ్మ, ఋషులు మొదలగు వారందరు స్తోత్రములను చేసిరి (36). వారందరు స్తుతించు చుండగా, సర్వజగత్తులకు ప్రభువు అగు విష్ణువు మనస్సును లగ్నముచేసి శిరస్సుపై చేతులను జోడించి స్తుతించెను (37). ఆయన చేతులను జోడించి ప్రణమిల్లి జయధ్వానమును చేసెను. అపుడు సర్వగణాధ్యక్షులు, దేవతలు మరియు రాక్షసులు కూడా వరుసగా జయధ్వానములను చేసిరి (38). ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా! పరమేశ్వరుని ఆజ్ఞచే నందీశ్వరుడనగు నేను దేవతల సమక్షములో బ్రహ్మచే అభిషేకింపబడి ఈ విధముగా స్తుతింపబడితిని (39).

ఉద్వాహశ్చ కృతస్తత్ర నియోగాత్పరమేష్ఠినః ।
మహోత్సవయుతః ప్రీత్యా విష్ణు బ్రహ్మాది భిర్మమ ॥
మరుతాం చ సుతా దేవీ సుయశాస్తు మనోహరా ।
పత్నీ సా మేఽభవద్దివ్యా మనోనయన నందినీ ॥
లబ్ధం శశిప్రభం ఛత్రం తయా తత్ర విభూషితమ్ ।
చామరైశ్చామరాసక్తహస్తా గ్రైస్త్రీ గణైర్యుతమ్ ॥
సింహాసనం చ పరమం తయా చాధిష్ఠితం మయా ।
అలంకృతో మహాలక్ష్మ్యా ముకుటాద్యైస్సు భూషణైః ॥
లబ్ధో హారశ్చ పరమో దేవ్యాః కంఠ గతస్తథా ।
వృషేంద్రశ్చ శితో నాగస్సింహస్సింహ ధ్వజస్తథా ॥
రథశ్చ హేమహారశ్చ చంద్రబింబ సమశ్శుభః ।
అన్యాన్యపి చ వస్తూని లబ్ధాని హి మయా మునే ॥
ఏవం కృతవివాహోఽహం తయా పత్న్యా మహామునే ।
పాదౌ వవందే శంభోశ్చ శివాయా బ్రహ్మణో హరేః ॥
తథా విధం త్రిలోకేశస్సపత్నీకం చ మాం ప్రభుః ।
ప్రోవాచ పరయా ప్రీత్యా స శివో భక్త వత్సలః ॥

అపుడు పరమేశ్వరుని ఆజ్ఞచే విష్ణు బ్రహ్మాదులు ప్రీతితో పెద్ద ఉత్సవమును చేసి నా వివాహమును జరిపించిరి (40). మరుద్దేవతల కుమార్తెయగు సుయశాదేవి నాకు భార్య ఆయెను. ఆ దివ్యస్త్రీ మనస్సును దోచి ఆనందమును కలిగించెడిది. ఆమె కన్నులకు హర్షమును కలిగించెడిది (41).

ఆమెతో బాటు నాకు చంద్రుని వలె కాంతులీను అలంకృత ఛత్రము లభించెను. స్త్రీ గణములు చామరములను ధరించి వీచిరి (42). నేను ఆమెతో గూడి ఉత్తమమగు సింహాసనము నధిష్ఠించితిని. మహాలక్ష్మి కిరీటము మొదలగు చక్కని ఆభరణములతో నన్ను అలంకరించెను (43). లక్ష్మీదేవి కంఠమునందున్న గొప్ప హారము నాకు ఈయబడెను. నాకు గొప్ప ఎద్దు, తెల్లని ఏనుగు, సింహము, మరియు సింహము గుర్తుగల ధ్వజము కూడ లభించెను (44). ఒక రథము, చంద్రబింబమువలె కాంతులీనుచున్న శుభహారము కూడ లభించెను. ఓ మహర్షీ ! నాకింకనూ ఇతరవస్తువులు కూడ లభించెను (45). ఓ మహర్షీ! ఈ విధముగా 'వివాహితుడనైన నేను ఆ భార్యతో గూడి శివపార్వతులకు, బ్రహ్మకు, విష్ణువునకు పాదాభివందనమును చేసితిని (46). ముల్లోకములకు ప్రభువు, భక్తవత్సలుడు అగు ఆ శివుడు ఆ విధముగా భార్యతో గూడి నమస్కరించిన నాతో పరమ ప్రీతితో నిట్లు పలికెను (47).

ఈశ్వర ఉవాచః

శృణు సత్పుత్ర తాత త్వం సుయశేయం తవ ప్రియా ।

దదామి తే వరం ప్రీత్యా యత్తే మనసి వాంఛితమ్ ॥

ఈశ్వరుడిట్లు పలికెను –

వత్సా! వినుము. నీవు నా యోగ్యమగు పుత్రుడవు. ఈ సుయశ నీ ప్రియురాలు. నేను ప్రేమతో నీకు వరము నిచ్చెదను. నీ మనస్సులోని కోరికను వెల్లడించుము (48).

సదాహం తవ నందీశ సంతుష్టోఽస్మి గణేశ్వర ।
దేవ్యా చ సహితో వత్స శృణు మే పరమం వచః ॥
సదేష్టశ్చ విశిష్టశ్చ పరమైశ్వర్య సంయుతః ।
మహాయోగీ మహేష్వాసః సపితా సపితామహః ॥
అజేయ స్సర్వజేతా చ సదా పూజ్యో మహాబలః ।
అహం యత్ర భవాంస్తత్ర యత్ర త్వం తత్ర చాప్యహమ్ ॥
అయం చ తే పితా పుత్ర పరమైశ్వర్య సంయుతః ।
భవిష్యతి గణాధ్యక్షో మమభక్తో మహాబలః ॥
పితామహోఽపి తే వత్స తథాస్తు నియమా ఇమే ।
మత్సమీపం గమిష్యంతి మయా దత్తవరాస్తథా ॥

ఓ నందీశ్వరా! నీ విషయములో నేను సర్వకాలములయందు సంతుష్టుడనై యుండెదను. ఓ గణాధ్యక్షా! వత్సా! నీవు నీ భార్యతో గూడి నేను చెప్పు శ్రేష్ఠవచనమును వినుము (49). నీవు నాకు సర్వదా ప్రియుడవు. నీవు విశిష్టవ్యక్తివి. నీకు సర్వైశ్వర్యములు లభించును. మహాయోగివగు నీవు గొప్ప ధనుర్ధారివి అగుదువు. నీ తండ్రి, తాత కూడ నీతో బాటు సుఖించెదరు (50). నిన్ను ఇతరులు జయించలేరు. కాని నీవు అందరినీ జయించెదవు. మహాబలశాలివగు నీవు సర్వదా

పూజనీయుడవు. నేను ఉన్నచోట నీవు ఉండెదవు. నీవు ఉన్న చోట నేను ఉండెదను (51). ఓ కుమారా! ఈ నీ తండ్రి పరమైశ్వర్యములను పొంది గణాధ్యక్షుడై గొప్ప బలశాలియై నాకు భక్తుడు కాగలడు (52). ఓ వత్సా ! ఈ వరములన్నియూ నీ పితామహునకు కూడ వర్తించగలవు. మరియు మీరందరు నేను ఇచ్చిన వరములను పొంది నా సమీపమునకు రాగలరు (53).

నందీశ్వర ఉవాచః

తతో దేవీ మహాభాగా నందినం వరదాబ్రవీత్ ।
వరం బ్రూహీతి మాం పుత్ర సర్వాన్ కామాన్ యథేప్సితాన్ ॥
తచ్ఛ్రుత్వా వచనం దేవ్యాః ప్రావోచత్సాంజలిస్తదా ।
భక్తిర్భవతు మే దేవి పాదయోస్తే సదా వరా ॥
శ్రుత్వా మమ వచో దేవీ హ్యేవమస్త్వితి సా బ్రవీత్ ।
సుయశాం తాం చ సుప్రీత్యా నంది ప్రియతమాం శివా ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

అప్పుడు మహాత్మురాలు, వరములనిచ్చు తల్లియగు పార్వతీదేవి నందీశ్వరునితో ' ఓ పుత్రా! వరమును కోరుకొనుము, నీ మనస్సులోని కోర్కెలన్నిటినీ ఈడేర్చెదను' అని పలికెను (54). అపుడా దేవి యొక్క ఆ మాటను విని ఆతడు చేతులు జోడించి ' ఓ దేవీ! నాకు సర్వదా నీ పాదములయందు గొప్ప భక్తి కలుగుగాక!' అని కోరెను (55). ఆ దేవి నా మాటను విని అటులనే యగుగాక! అని పలికెను. పార్వతీదేవి నందీశ్వరుని ప్రియురాలగు సుయశను ప్రీతితో లాలించెను (56).

దేవ్యువాచ।

వత్సే వరం యథేష్టం హి త్రినేత్రా జన్మవర్జితా ।
పుత్రపౌత్రైస్తు భక్తిర్మే తథా చ భర్తురేవ హి ॥

దేవి ఇట్లు పలికెను -

ఓ పుత్రీ! నీవు కూడ నచ్చిన వరమును కోరుకొనుము. నీకు మూడు నేత్రములు ఉండగలవు. నీవు జన్మబంధమునుండి విముక్తురాలవైతివి. నీవు పుత్రపౌత్రులతో ఆనందించెదవు. మరియు నీకు నాయందు, నీ భర్తయందు భక్తి ఉండగలదు (57).

నంద్యువాచ ।

తదా బ్రహ్మా చ విష్ణుశ్చ సర్వే దేవ గణాశ్చ వై ।
తాభ్యాం వసుం దదుః ప్రీత్యా సుప్రసన్నాశ్శివాజ్ఞయా ॥
సాన్వయం మాం గృహీత్వే శస్త తత్సంబంధి బాంధవైః ।
ఆరుహ్య వృషమీశానో గతో దేవ్యా నిజం గృహమ్ ॥
విష్ణ్వాదయ స్సు రాస్సర్వే ప్రశంసంతో హ్యుమీ తదా ।
స్వధామాని యయుః ప్రీత్యా సంస్తువంతశ్శివం శివామ్ ॥
ఇతి తే కథితో వత్స స్వావతారో మహామునే ।
సదానందకరః పుంసాం శివభక్తి ప్రవర్ధనః ॥
య ఇదం నందినో జన్మ వరదానం తథా మమ ।
అభిషేకం వివాహం చ శృణుయాచ్ఛ్రావయేత్తథా ॥
పఠేద్వా పాఠయే ద్వాపి శ్రద్ధావాన్ భక్తి సంయుతః ।
ఇహ సర్వసుఖం భుక్త్వా పరత్ర లభతే గతిమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం నందికేశ్వరాభిషేక
వివాహ వర్ణనం నామ సప్తమోఽధ్యాయః (7).

నందీశ్వరుడిట్లు పలికెను –

అపుడు బ్రహ్మ, విష్ణువు మరియు సర్వదేవగణములు మిక్కిలి ప్రసన్నులై శివుని ఆజ్ఞచే ఆ దంపతులకు ప్రేమతో సంపదలనిచ్చిరి (58). నన్ను నా కుటుంబ సభ్యులను, మరియు బంధు గణమును దోడ్కొని శివుడు అపుడు దేవితో గూడి తన వాహనమగు వృషభమునధిష్ఠించి తన గృహమునకు వెళ్లెను (59). అపుడు విష్ణువు మొదలగు వారందరు పార్వతీపరమేశ్వరులను ప్రీతితో పొగుడుకుంటూ తమ తమ స్థానములకు వెళ్లిరి (60). ఓ కుమారా ! మహర్షీ! ఇంతవరకు నీకు నా అవతారమును గురించి చెప్పితిని. ఈ గాథ మానవులకు సర్వదా ఆనందమును కలిగించి, శివభక్తిని వర్ధిల్లజేయును (61). నందీశ్వరుడనగు నా ఈ జన్మ, వరములను పొందుట, అభిషేకము మరియు వివాహము అను వృత్తాంతమును ఎవడైతే తాను విని, ఇతరులకు వినిపించునో (62), శ్రద్ధాభక్తులతో తాను పఠించి ఇతరులచే పఠింపజేయునో, అట్టివాడు. . ఇహలోకములో సర్వసుఖములనను భవించి పరలోకములో ఉత్తమ గతిని పొందును (63).

శ్రీ శివమహాపురాణములో శతరుద్ర సంహితయందు నందీశ్వరాభిషేక
వివాహ వర్ణనమనే ఏడవ అధ్యాయము ముగిసినది (7).

8 – భైరవావతారము

నందీశ్వర ఉవాచః

సనత్కుమార సర్వజ్ఞ శృణు త్వం భైరవీం కథామ్ ।
యస్యాశ్శ్రవణ మాత్రేణ శైవీ భక్తిర్దృఢా భవేత్ ॥
భైరవః పూర్ణరూపో హి శంకరస్య పరాత్మనః ।
మూఢాస్తం వైన జానంతి మోహితాశ్శివ మాయయా ॥
సనత్కుమార నో వేత్తి మహిమానం మహేశితుః ।
చతుర్భుజోఽపి విష్ణుర్వై చతుర్వక్త్రోపి వై విధిః ॥
చిత్రమత్ర న కించిద్వై దుర్ జ్ఞేయా ఖలు శాంభవీ ।
తయా సమ్మోహితాస్సర్వే నార్చ యంత్యపి తం పరమ్ ॥
వేద చేద్యది వాత్మానం స ఏవ పరమేశ్వరః ।
తదా విదంతి తే సర్వే స్వేచ్ఛయా నహి కేఽపి తమ్ ॥
సర్వగోఽపి మహేశానో నేక్ష్యతే మూఢ బుద్ధిభిః ।
దేవవద్బుధ్యతే లోకే యోఽతీతో మనసాం గిరామ్ ॥
అత్రేతిహాసం వక్ష్యేఽహం పరమర్షే పురాతనమ్ ।
శృణు తం శ్రద్ధయా తాత పరమం జ్ఞానకారణమ్ ॥
మేరు శృంగేఽద్భుతే రమ్యే స్థితం బ్రహ్మాణమీశ్వరమ్ ।
జగ్ముర్దేవర్షయస్సర్వే సుతత్త్వం జ్ఞాతుమిచ్ఛయా ॥
తత్రాగత్య విధిం నత్వా పప్రచ్ఛుస్తే మహాదరాత్ ।
కృతాంజలి పుటాస్సర్వే నతస్కంధా మునీశ్వరాః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓయీ సనత్కుమారా! సర్వజ్ఞా! నీవు భైరవుని గాథను వినుము. ఈ గాథను విన్నచో శివభక్తి దృఢమగును (1). భైరవుడు శంకరపరమాత్ముని పూర్ణావతారము. శివమాయచే మోహితులైన అజ్ఞానులు ఆతనిని ఎరుంగరు (2). ఓయీ సనత్కుమారా! చతుర్భుజుడగు విష్ణువు, మరియు చతుర్ముఖుడగు బ్రహ్మ కూడా మహేశ్వరుని మహిమను ఎరుంగరు (3). దీనిలో విచిత్రమేమియూ లేదు. శంభుని మాయను ఎరుంగుట అసంభవము. అందరు ఆ మాయచే మోహితులగుదురు. అట్లు మోహితులైన జనులు ఆ పరమేశ్వరుని అర్చించుట లేదు (4). ఆ పరమేశ్వరుడే స్వయముగా తన స్వరూపమును తెలిపినచో, అపుడు అట్టి భక్తులు ఆయనను తెలియగలరు. ఎవరైననూ తమ ఇచ్ఛచే ఆ పరమేశ్వరుని తెలియజాలరు (5). మహేశ్వరుడు సర్వవ్యాపకుడై యున్ననూ మూఢబుద్ధులు ఆయనను కనజాలరు. వాక్కునకు మనస్సునకు అందని ఆ పరమేశ్వరుని సామాన్య దేవతయని లోకులు భావించుచుందురు (6). ఓ మహర్షీ! ఈ విషయములో నేనొక

ప్రాచీన గాథను చెప్పెదను. వత్సా! జ్ఞానహేతువగు ఆ శ్రేష్ఠగాథను నీవు శ్రద్ధతో వినుము (7). దేవతలు, ఋషులు అందరు కలిసి అద్భుతము, సుందరమునగు మేరు. శిఖరమునందున్న భగవానుడగు బ్రహ్మ వద్దకు ఈశ్వరతత్త్వము నెరుంగ గోరి వెళ్లిరి (8). ఆ మహర్షులు, దేవతలు అందరు అచటకు వచ్చి బ్రహ్మకు సాష్టాంగ ప్రణామమును చేసి చేతులను జోడించి ఆదరముతో నిట్లు ప్రశ్నించిరి (9).

దేవర్షయ ఊచుః ।

దేవదేవ ప్రజానాథ సృష్టి కృల్లో కనాయక ।
తత్త్వతో వద చాస్మభ్యం కిమేకం తత్త్వమవ్యయమ్ ॥

దేవతలు, ఋషులు ఇట్లు పలికిరి –

ఓ దేవదేవా! ప్రజాపతీ! సృష్టికర్తవగు నీవే లోకములకు ప్రభుడవు. వినాశములేని ఏకైక తత్త్వము ఏది? ఈ విషయమును మాకు యథాతథముగా చెప్పుము (10).

నందీశ్వర ఉవాచః

సమాయయా మహేశస్య మోహితః పద్మసంభవః ।
అవిజ్ఞాయ పరం భావం సంభావం ప్రత్యువాచ హ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

మహేశ్వరుని మాయచే మోహితుడైన ఆ బ్రహ్మ పరమాత్మ స్వరూపమును, ప్రభావమును ఎరుంగక ఇట్లు బదులిడెను (11).

బ్రహ్మోవాచ ।

హే సురా ఋషయ స్సర్వే సుమత్యా శృణుతాదరాత్ ।
వచ్మ్యహం పరమం తత్త్వమవ్యయం వై యథార్థతః ॥
జగద్యోనిరహం ధాతా స్వయంభూరజ ఈశ్వరః ।
అనాది భాగహం బ్రహ్మ హ్యేక ఆత్మా నిరంజనః ॥
ప్రవర్తకో హి జగతా మహమేవ నివర్తకః ।
సంవర్తకో మదధికో నాన్యః కశ్చిత్సురోత్తమాః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓ దేవతలారా ! ఋషులారా ! మీరందరు మంచి మనస్సుతో ఆదరముతో వినుడు. వినాశము లేని పరమతత్త్వమును గురించి నేను యథార్థముగా చెప్పెదను (12). స్వయముగా ప్రకటమైనవాడను, జగత్కారణుడను, విధాతను, పుట్టుక లేనివాడను, జగత్పరిపాలకుడను, ఆది లేని వాడను, దోషములు లేని వాడను అగు నేనే పరబ్రహ్మ పరమాత్మను (13). జగత్తును ప్రవర్తిల్ల జేయువాడను నేనే. జగత్తును ఉపసంహరించే ప్రళయకాలాగ్నిని నేనే. ఓ దేవశ్రేష్ఠులారా ! నాకంటె శ్రేష్ఠుడు మరియొకడు లేడు (14).

నందీశ్వర ఉవాచః

తస్యైవం వదతో ధాతుర్విష్ణుస్తత్ర స్థితో మునే ।
ప్రోవాచ ప్రహసన్ వాక్యం సంక్రుద్ధో మోహితోఽజయా ॥
న చైతదుచితా బ్రహ్మన్ యోగయుక్తస్య మూర్ఖతా ।
అవిజ్ఞాయ పరం తత్త్వం వృథైతత్తే నిగద్యతే ॥
కర్తాహం సర్వలోకానాం పరమాత్మా పరః పుమాన్ ।
యజ్ఞో నారాయణో దేవీ మాయాధీశః పరా గతిః ॥
మమాజ్ఞయా త్వయా బ్రహ్మన్ సృష్టిరేషా విధీయతే ।
జగతాం జీవనం నైవ మామనాదృత్య చేశ్వరమ్ ॥
ఏవం త్రిప్రకృతౌ మోహాత్పరస్పర జయైషిణౌ ।
ప్రోచతుర్నిగమాంశ్చాత్ర ప్రమాణే సర్వథా తనౌ ॥
ప్రష్టవ్యాస్తే విశేషేణ స్థితా మూర్తి ధరాశ్చ తే ।
పప్రచ్ఛతుః ప్రమాణ జ్ఞానిత్యుక్త్వా చతురోఽపి తాన్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! బ్రహ్మ ఇట్లు పలుకుచుండగా అచటనున్న విష్ణువు కోపించి మాయామోహితుడై నవ్వుచూ ఒక వాక్యమును పలికెను (15). ఓ బ్రహ్మా ! నీ వంటి యోగీశ్వరునకు ఇట్టి మూర్ఖత్వము తగదు. నీవు సర్వోత్తమమగు తత్త్వము నెరుంగక ఇట్లు వ్యర్థవచనములను పలుకుచున్నావు (16). సర్వలోకములను సృష్టించు పరమాత్మను, పురుషోత్తముడను నేనే. యజ్ఞ స్వరూపుడనగు నారాయణుడను నేనే. నేను మాయాశక్తిని నా ఆధీనములో నుంచుకొనెదను. సర్వోత్తమగతియగు పరబ్రహ్మ నేనే (17). ఓ. బ్రహ్మా ! నీవీ సృష్టిని నా ఆజ్ఞచేతనే చేసియుంటివి. ఈశ్వరుడనగు నన్ను తిరస్కరించినచో, ఈ జగత్తులు క్షణకాలము జీవించియుండలేవు (18). త్రిగుణాత్మకమగు ప్రకృతియందు మోహమును పొంది ఒకరిపై నొకరు విజయమును పొందగోరి వారిద్దరు తమ వాదములకు ప్రామాణ్యమును సంపాదించుట కొరకై ఆ విషయములో వేదములను ప్రశ్నించిరి (19). నాల్గు వేదములు విగ్రహములను దాల్చి ఎదుటనున్నవి. అవి ప్రమాణ నిర్ణయమును చేయు సమర్థములు అని పలికి వారిద్దరు ఆ వేదములను ప్రశ్నించిరి (20).

విధివిష్ణూ ఊచతుః ।

వేదాః ప్రమాణం సర్వత్ర ప్రతి ష్ఠా పరమామితాః ।

యూయం వదత విశ్రబ్ధం కిమేకం తత్త్వ మవ్యయమ్ ॥

బ్రహ్మవిష్ణువులు ఇట్లు పలికిరి –

అన్ని విషయములలో వేదములే ప్రమాణము. అనంతములగు వేదముల ప్రతిష్ఠ సర్వోత్కృష్టమైనది. ఓ వేదములారా! వినాశములేని ఏకైక తత్త్వము ఏది? మీరు సత్యమును చెప్పుడు (21).

నందీశ్వర ఉవాచః

ఇత్యాకర్ణ్య తయోర్వాచం పునస్తే హి ఋగాదయః ।

అవదంస్తత్త్వతస్సర్వే పరేశం సంస్మర ప్రభుమ్ ॥

యది మాన్యా వయం దేవౌ సృష్టిస్థితికరౌ విభూ ।

తదా ప్రమాణం వక్ష్యామో భవత్సందేహ భేదకమ్ ॥

శ్రుత్యుక్త మిమాకర్ణ్య ప్రోచతుస్తౌ సురౌ శ్రుతిః ।

యుష్మదుక్తం ప్రమాణం నౌ కిం తత్త్వం సమ్యగుచ్యతామ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

వారిద్దరి ఆ మాటను విని ఋగాది నాల్గు వేదములు పరమాత్మయగు శివప్రభుని స్మరించి యథార్థమగు వచనమునిట్లు పలికినవి (22). ఓ దేవతలారా! మీరిద్దరు సృష్టిస్థితులను చేయు ప్రభువులు. మామాట మీకు అంగీకారమైనచో, మీ సందేహమును పోగొట్టే ప్రమాణవచనమును చెప్పగలము (23). వేదములు పలికిన ఈ మాటను విని ఆ దేవతలిద్దరు వేదములతో 'మీమాట మాకు ప్రమాణము. తత్త్వము ఎయ్యది? చక్కగా విచారించి చెప్పుడు' అని పలికిరి (24).

ఋగ్వేద ఉవాచః

యదంతస్థాని భూతాని యతస్సర్వం ప్రవర్తతే ।

యదాహుః పరమం తత్త్వం స రుద్రస్త్వేక ఏవ హి ॥

ఋగ్వేదము ఇట్లు పలికెను –

సర్వప్రాణులు ఎవని యందు ఉన్నవో, ఎవని నుండి సర్వ జగత్తు ఉద్భవించుచున్నదో ఆ రుద్రుడు ఒక్కడే పరమతత్త్వమని మహర్షులు చెప్పుచున్నారు (25).

యజుర్వేద ఉవాచః

యో యజ్ఞైరఖిలైరీశః యోగేన చ సమిజ్యతే ।

యేన ప్రమాణం ఖలు నస్స ఏకస్సర్వదృక్ శివః ॥

యజుర్వేదము ఇట్లు పలికెను -

ఏ ఈశ్వరుడు సర్వయజ్ఞములచే మరియు యోగముచే ఆరాధింప బడుచున్నాడో, ఎవనిచే మాకు ప్రామాణ్యము లభించుచున్నదో, అట్టి సర్వసాక్షియగు అద్వయ తత్త్వము శివుడే (26).

సామవేద ఉవాచః

యేనేదం భ్రామ్యతే విశ్వం యోగిభిర్యో విచింత్యతే ।

యద్భాసా భాసతే విశ్వం స ఏకస్త్ర్యంబకః పరః ॥

సామవేదము ఇట్లు పలికెను -

ఎవనిచే ఈ జగచ్చక్రము త్రిప్పబడుచున్నదో, ఎవనిని యోగులు ధ్యానించెదరో, ఎవని ప్రకాశముచే జగత్తు ప్రకాశించుచున్నదో, అట్టి అద్వయ పరమాత్మ ముక్కంటియే (27).

అథర్వణవేద ఉవాచః

యం ప్రపశ్యంతి దేవేశం భక్త్యానుగ్రహిణో జనాః ।

తమాహురేకం కైవల్యం శంకరం దుఃఖతః పరం ॥

అథర్వణవేదమిట్లు పలికెను -

ఏ దేవదేవుని కృపచే భక్తులగు జనులు ఆయనను చక్కగా దర్శించుచున్నారో, ఎవడు దుఃఃఖమునకు అతీతుడో, అట్టి అద్వయ నిర్గుణతత్త్వము శంకరుడని మహర్షులు చెప్పుచున్నారు (28).

నందీశ్వర ఉవాచః

శ్రుత్యుక్తమిద మాకర్ణ్యాతవ మాయావిమోహితౌ ।

స్మిత్వాహతుర్విధిహరీ నిగమాంస్తావ్విచేతనౌ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

వేదములు చెప్పిన ఈ మాటలను విని, మాయచే అత్యధికముగా మోహితులై వివేకమును గోల్పోయిన బ్రహ్మ విష్ణువులు నవ్వి వేదములతో నిట్లనిరి (29).

విధిహరీ ఊచతుః ।

హే వేదాః కిమిదం యూయం భాషంతే గతచేతనాః ।
కిం జాతం వోఽద్య సర్వం హి నష్టం సువయునం పరమ్ ॥
కథం ప్రమథనాథోఽసౌ రమమాణో నిరంతరమ్ ।
దిగంబరః పీతవర్ణో శివయా ధూలధూసరః ॥
విరూపవేషో జటిలో వృషగో వ్యాలభూషణః ।
పరం బ్రహ్మత్వమాపన్నః క్వ చ తత్సంగ వర్జితమ్ ॥
ఇత్యు దీరితమాకర్ణ్య ప్రణవస్సర్వగస్తయోః ।
అమూర్తో మూర్తి మాన్ ప్రీత్యా జృంభమాణ ఉవాచ తౌ ॥

బ్రహ్మ విష్ణువులు ఇట్లు పలికిరి –

ఓ వేదములారా! మీరు వివేకమును గోల్పోయి ఇట్లు మాటలాడుచుంటిరేల? మీకీనాడు ఏమైనది? మీ యొక్క చక్కని పరమాత్మ జ్ఞానమంతయు నశించినది (30). ప్రమథగణములకధిపతి, సర్వదా విహారశీలి, దిగంబరుడు, పచ్చని వర్ణముగలవాడు, పార్వతితో గూడి యుండువాడు, భస్మచే బూడిదరంగును కలిగియున్నవాడు (31), వికృతవేషములో నుండువాడు, జటాధారి, వృషభవాహనుడు, పాములే ఆభరణములుగా గలవాడు అగు ఈ శివుడు పరబ్రహ్మ ఎట్లు అయినాడు? సంగరహితమగు పరబ్రహ్మ ఎక్కడ? శివుడు ఎక్కడ? (32) వారిద్దరి ఈ మాటలను విని సర్వవ్యాపకము, ఆకారవిహీనమునగు ఓంకారము ప్రేమతో శరీరమును స్వీకరించి వారిద్దరితో బిగ్గరగా నిట్లనెను (33).

ప్రణవ ఉవాచః

నహీశో భగవాన్ శక్త్యా హ్యాత్మనో వ్యతిరిక్తయా ।
కదాచిద్రమతే రుద్రో లీలారూపధరో హరః ॥
అసౌ హి పరమేశానస్స్వయం జ్యోతిస్సనాతనః ।
ఆనందరూపా తస్యైషా శక్తి ర్నాగంతుకీ శివా ॥

ఓంకారము ఇట్లు పలికెను –

భగవంతుడు, ఈశ్వరుడు, లీలారూపములను ధరించువాడు మరియు పాపములను హరించువాడునగు రుద్రుడు ఏనాడైననూ తనకంటే భిన్నమగు శక్తితో విహరించుటలేదు (34). రుద్రుడు పరమేశ్వరుడు, స్వయంప్రకాశస్వరూపుడు మరియు సనాతనుడు. ఆయన యొక్క ఆనందస్వరూపమే పార్వతీ దేవి. ఆమె ఆయనయొక్క శక్తియే గాని బయటనుండి వచ్చినది గాదు (35).

నందీశ్వర ఉవాచః

ఇత్యేవముక్తోఽపి తదా విధేర్విష్ణోశ్చ వై తదా ।
నా జ్ఞానమగమన్నాశం శ్రీ కంఠస్యైవ మాయయా ॥
ప్రాదురాసీత్తతో జ్యోతి రుభయోరంతరే మహత్ ।
పూరయన్ని జయా భాసా ద్యావా భూమ్యోర్యదంతరమ్ ॥
జ్యోతిర్మండల మధ్య స్థో దదృశే పురుషాకృతిః ।
విధి క్రతుభ్యాం తత్రైవ మహాద్భుత తనుర్మునే ॥
ప్రజజ్వాలాథ కోపేన బ్రహ్మణః పంచమం శిరః ।
ఆవయోరంతరే కోఽసౌ బిభృయాత్పురుషాకృతిమ్ ॥
విధిస్సంభావయే ద్యావత్తావత్స త్రివిలోచనః ।
దృష్టః క్షణేన చ మహాపురుషో నీలలోహితః ॥
త్రిశూలపాణిర్భాలాక్షో నా గోడుప విభూషణః ।
హిరణ్య గర్భస్తం దృష్ట్వా విహసన్ ప్రాహ మోహితః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓంకారము ఇట్లు పలికిననూ శివుని మాయా ప్రభావముచే బ్రహ్మ విష్ణువుల అజ్ఞానము అప్పటికీ తొలగిపోలేదు (36). అపుడు వారిద్దరి మధ్య ఒక గొప్ప జ్యోతి ఉద్భవించెను. అది తన కాంతులచే భూమ్యాకాశముల మధ్య భాగమును నింపివేసెను (37). ఆ కాంతిమండలము యొక్క మధ్య భాగములో ఒక పురుషా కారమును గాంచి బ్రహ్మ విష్ణువులు అత్యంత విస్మయమును పొందిరి. ఓ మహర్షీ ! (38) అపుడు బ్రహ్మ యొక్క ఐదవ తల కోపముతో మండిపడెను. మా ఇద్దరి మధ్యలో పురుషాకృతిని దాల్చి ఆవిర్భవించిన ఈ తేజస్సు ఎవరు? (39) బ్రహ్మ ఊహ చేయులోపలనే ముక్కంటి, కంఠమునందు నీలవర్ణము ఇతరత్రా ఎర్రని రంగు గలవాడు అగు మహాపురుషుడు క్షణములో కానవచ్చెను (40). త్రిశూలమును చేతియందు ధరించినవాడు, లలాటమునందు కన్ను గలవాడు, సర్పములు చంద్రుడు అలంకారముగా గలవాడు అగు ఆ పురుషుని చూచి మోహితుడై యున్న బ్రహ్మ నవ్వుతూ ఇట్లు పలికెను (41).

బ్రహ్మోవాచ।

నీలలోహిత జానే త్వాం మా భైషీశ్చంద్రశేఖర ।
భాలస్థలాన్మమ పురా రుద్రః ప్రాదురభూద్భవాన్ ॥
రోదనా ద్రుద్రనామాపి యోజితోఽసి మయా పురా ।
మామేవ శరణం యాహి పుత్ర రక్షాం కరోమి తే ॥

బ్రహ్మ ఇట్లు పలికెను –

ఓయీ నీలలోహితా ! చంద్రశేఖరా! నేను నిన్ను ఎరుంగుదును. భయపడకుము. పూర్వము నీవు నా లలాట దేశమునుండి రుద్రరూపుడవై ఆవిర్భవించితివి (42). నీవు రోదించుటచే నేను పూర్వము రుద్రుడను నామధేయమునిచ్చి యుంటిని. నన్ను మాత్రమే శరణు పొందుము. పుత్రా! నేను నిన్ను రక్షించెదను (43).

నందీశ్వర ఉవాచః

అథేశ్వరః పద్మయోనే శ్శ్రుత్వా గర్వవతీం గిరమ్ ।
చు కోపాతీవ చ తదా కుర్వన్నివ లయం మునే ॥
స కోపతస్సముత్పాద్య పురుషం భైరవం క్వచిత్ ।
ప్రజ్వలంతం సుమహసా ప్రీత్యా చ పరమేశ్వరః ॥

నందిశ్వరుడిట్లు పలికెను –

అపుడు పద్మసంభవుడగు బ్రహ్మ యొక్క గర్వముతో గూడిన మాటలను విని ఈశ్వర్వరుడు మిక్కిలి కోపించెను. ఓ మునీ! అపుడాతడు ప్రళయమును చేయునా యన్నట్లుండెను (44). ఆ పరమేశ్వరుడు తన కోపమునుండి భయంకరాకారుడు, గొప్ప తేజస్సుతో వెలిగిపోవుచున్నవాడు నగు ఒక పురుషుని ప్రేమతో సృష్టించెను (45).

ఈశ్వర ఉవాచః

ప్రాక్ చ పంకజ జన్మాసా శాస్యస్తే కాలభైరవ ।
కాలవ ద్రాజసే సాక్షాత్ కాలరాజస్తతో భవాన్ ॥
విశ్వం భర్తుం సమర్థోఽసి భీషణాద్భైరవస్స్మృతః ।
త్వత్తో భేష్యతి కాలోఽపి తతస్త్వం కాలభైరవః ॥
ఆమర్దయిష్యతి భవాన్ రుష్టో దుష్టాత్మనో యతః ।
అమర్దక ఇతి ఖ్యాతిం తతస్సర్వత్ర యాస్యసి ॥
యతః పాపాని భక్తానాం భక్షయిష్యసి తత్ క్షణాత్ ।
పాపభక్షణ ఇత్యేవ తవ నామ భవిష్యతి ॥
యా మే ముక్తి పురీ కాశీ సర్వాభ్యోఽపి గరీయసీ ।
ఆధిపత్యం చ తస్యాస్తే కాలరాజ సదైవ హి ॥



తత్ర యే పాతకినరాస్తేషాం శాస్తా త్వమేవ హి ।
శుభాశుభం చ తత్కర్మ చిత్ర గుప్తో లిఖిష్యతి ॥

ఈశ్వరుడిట్లు పలికెను -

ఓ కాలభైరవా! పద్మమునుండి పుట్టిన ఈ బ్రహ్మను నీవు ముందుగా దండించవలెను. నీవు సాక్షాత్తు కాలుని వలె ప్రకాశించుచున్నావు గాన, నీకు కాలరాజు అని పేరు (46). నీవు జగత్తును భరించుటకు సమర్థుడవు. నిన్ను చూచినచో భయము కలుగును. కాన నీకు భైరవుడని పేరు (47). నీవు కోపించి దుష్ట బుద్ధులను సంహరించెదవు గాన, నీవు సర్వలోకములలో ఆమర్దకుడను ఖ్యాతిని పొందగలవు (48), నీవు భక్తుల పాపములను తత్ క్షణమే భక్షించెదవు గాన, నీకు పాపభక్షణుడను పేరు కలుగగలదు (49). ఓ కాలరాజా! సర్వనగరములకంటె గొప్పది, ముక్తిని ఇచ్చునది అగు నా కాశీ నగరమేది గలదో, దానిపై నీకు సర్వకాలములయందు ఆధిపత్యము గలదు (50). అచటనుండు పాపాత్ములను దండించువాడవు నీవే. మానవుల శుభాశుభకర్మల జాబితాను చిత్ర గుప్తుడు వ్రాయగలడు (51).

నందీశ్వర ఉవాచః

ఏతాన్ వరాన్ ప్రగృహ్యాథ తత్ క్షణాత్కాలభైరవః ।
వామాంగులి నఖాగ్రేణ చకర్త చ విధేశ్శిరః ॥
యదంగమపరా ధ్నోతి కార్యం తస్యైవ శాసనమ్ ।
అతో యేన కృతా నిందా తచ్ఛిన్నం పంచమం శిరః ॥
అథ ఛిన్నం విధిశిరో దృష్ట్వా భీతతరో హరిః ।
శాతరుద్రియ మంత్రైశ్చ భక్త్యా తుష్టావ శంకరమ్ ॥
భీతో హిరణ్య గర్భోఽపి జజాప శతరుద్రియమ్ ।
ఇత్థం తౌ గతగర్వౌ హి సంజాతౌ తత్ క్షణాన్మునే ॥
పరబ్రహ్మ శివస్సాక్షాత్సచ్చిదానంద లక్షణః ।
పరమాత్మా గుణా తీత ఇతి జ్ఞానమవాపతుః ॥
సనత్కుమార సర్వజ్ఞ శృణు మే పరమం శుభమ్ ।
యావద్గర్వో భవేతావత్ జానగుప్తిర్విశేషతః ॥
త్యక్త్వాభిమానం పురుషో జానాతి పరమేశ్వరమ్ ।
గర్విణం హంతి విశ్వేశో జాతో గర్వాపహారకః ॥



నందీశ్వరుడిట్లు పలికెను -

అపుడు కాలభైరవుడి వరములను స్వీకరించి వెనువెంటనే బ్రహ్మయొక్క తలను ఎడమచేతి వ్రేలి గోటితో దునిమి వేసెను (52). ఏ అంగము అపరాధమును చేయునో, ఆ అంగమును నిశ్చయముగా దండించవలెను. కావున ఏ శిరస్సు నిందించినదో, ఆ ఐదవ శిరస్సు ఖండించబడెను (53). బ్రహ్మ యొక్క తల నరుకబడుటను గాంచి విష్ణువు మరింత భయపడి భక్తి పూర్వకముగా శతరుద్రీయమంత్రములతో శంకరుని స్తుతించెను (54). భయపడియున్న బ్రహ్మ కూడా శతరుద్రీయమును జపించెను. ఈ విధముగా వారిద్దరు క్షణకాలములో గర్వమును విడిచి పెట్టిరి. ఓ మునీ! (55) సాక్షాత్తుగా శివుడే సచ్చిదానంద స్వరూపుడగు పరబ్రహ్మ. ఆయనయే గుణాతీతుడగు పరమాత్మ. వారీ జ్ఞానమును అపుడు పొందిరి (56). ఓయీ సర్వజ్ఞుడవగు సనత్కుమారా! నేను పలికే శుభకరమగు శ్రేష్ఠవచనమును వినుము. వ్యక్తిలో గర్వము ఉన్నంత వరకు, వానికి జ్ఞానము ప్రకాశించదు (57). అభిమానమును వీడిన పురుషుడు పరమేశ్వరుని ఎరుంగును. విశ్వేశ్వరుడు గర్విష్టిని సంహరించును. గర్వమును పోగొట్టువాడు జన్మించినాడు (58).

అథ విష్ణు విధీ జ్ఞాత్వా విగర్వౌ పరమేశ్వరః ।

ప్రసన్నోఽ భూన్మహాదేవోఽకరో త్తావభయౌ ప్రభుః ॥

ఆశ్వాస్య తౌ మహాదేవః ప్రీతః ప్రణతవత్సలః ।

ప్రాహ స్వాం మూర్తిమపరాం భైరవం తం కపర్దినమ్ ॥

అపుడు బ్రహ్మ విష్ణువులకు గర్వము తొలగినదని యెరింగి పరమేశ్వరుడగు మహాదేవ ప్ర[illegible]భుడు ప్రసన్నుడై వారికి అభయమునిచ్చెను (59). భక్త ప్రియుడగు మహాదేవుడు వారిని ఓదార్చి ప్రీతుడై తన అపరావతారమైన జటాధారియగు ఆ భైరవునితో నిట్లు పలికెను (60).

మహాదేవ ఉవాచః

త్వయా మాన్యో విష్ణురసౌ తథా శతధృతిస్స్వయమ్ ।
కపాలం వైధసం చాపి నీలలోహిత ధారయ ॥
బ్రహ్మ హత్యాపనోదాయ వ్రతం లోకాయ దర్శయ ।
చర త్వం సతతం భిక్షాం కపాలవ్రతమాశ్రితః ॥
ఇత్యుక్త్వా పశ్యతస్తస్య తేజోరూప శ్శివోఽబ్రవీత్ ।
ఉత్పాద్య చైకాం కన్యాం తు బ్రహ్మ హత్యా భివిశ్రుతామ్ ॥
యావద్వారాణసీం దివ్యాం పురీమేష గమిష్యతి ।
తావత్త్వం భీషణే కాలమనుగచ్ఛో గ్రరూపిణమ్ ॥
సర్వత్ర తే ప్రవేశోఽస్తి త్యక్త్వా వారాణసీం పురీమ్ ।
వారాణసీం యదా గచ్ఛేత్తన్ముక్తా భవ తత్ క్షణాత్ ॥
నియోజ్య తామితి తదా బ్రహ్మహత్యాం చ తాం ప్రభుః ।
మహాద్భుతశ్చ స శివోఽప్యంతర్ధాన మగాత్తతః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం భైరవావతారవర్ణనం నామ అష్టమోఽధ్యాయః(8).

మహాదేవుడిట్లు పలికెను -

ఈ విష్ణువును నీవు ఆదరించుము. మరియు నీవు స్వయముగా ఈ బ్రహ్మను కూడ మన్నించుము. ఓ నీలలోహితా! బ్రహ్మకపాలమును నీవు ధరించుము (61). బ్రహ్మ హత్యా దోష నివారణ కొరకై నీవు కపాలవ్రతము నాశ్రయించి నిత్యము భిక్షాటనము చేసి లోకమునకు ఆదర్శము కమ్ము (62). ఇట్లు పలికి తేజోమయుడగు శంభుడు ఆతడు చూచుచుండగా బ్రహ్మహత్యయని ప్రసిద్ధిగాంచిన ఒక కన్యను సృష్టించి ఇట్లు పలికెను (63). ఓ భయంకరాకారము గల బ్రహ్మ హత్యా ! ఉగ్రమగు రూపము గల ఈ కాలభైరవుడు దివ్యమగు వారాణసీ నగరమును ఆయనను అనుసరించి వెళ్లుము (64). వారాణసి నగరమును మినహాయించి నీకు అంతటా ప్రవేశము గలదు. ఓ భైరవా ! నీవు వారాణసిని ప్రవేశించగానే, నీకు వెంటనే బ్రహ్మహత్యనుండి విముక్తి కలుగును (65). మహాద్భుతుడగు శివ ప్రభుడు ఆ బ్రహ్మ హత్యను ఇట్లు ఆజ్ఞాపించి, తరువాత అంతర్ధానమును చెందెను (66).

శ్రీ శివమహాపురాణములోని శతరుద్రసంహితయందు
భైరవావతారవర్ణనమనే ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (8).

9 – భైరవ లీల

నందీశ్వర ఉవాచః

సనత్కుమార సర్వజ్ఞ భైరవీముపరాం కథామ్ ।
శృణు ప్రీత్యా మహాదోష సంహర్త్రీం భక్తి వర్ధినీమ్ ॥
తత్సాన్నిధ్యం భైరవోఽపి కాలోఽభూత్కాలకాలనః ।
స దేవదేవవాక్యేన బిభ్రత్కాపాలికం వ్రతమ్ ॥
కపాల పాణిర్విశ్వాత్మా చచార భువనత్రయమ్ ।
నా త్యాక్షీచ్చాపి తం దేవం బ్రహ్మ హత్యాపి దారుణా ॥
ప్రతితీర్థం భ్రమన్ వాపి విముక్తో బ్రహ్మహత్యయా ।
అతః కామారిమహిమా సర్వోఽపి హ్యవగమ్యతామ్ ॥
ప్రమథైస్సేవ్యమానోఽపి హ్యేకదా విహరన్ హరః ।
కాపాలికో యయౌ స్వైరీ నారాయణ నికేతనమ్ ॥
అథాయాంతం మహాకాలం త్రినేత్రం సర్పకుండలమ్ ।
మహాదేవాంశసంభూతం పూర్ణాకారం చ భైరవమ్ ॥
పపాత దండవద్భూమౌ తం దృష్ట్వా గరుడధ్వజః ।
దేవాశ్చ మునయశ్చైవ దేవ నార్యస్సమంతతః ॥
అథ విష్ణుం ప్రణమ్యైనం ప్రయాతః కమలాపతిః ।
శిరస్యంజలిమాధాయ తుష్టావ వివిధైస్సు వైః ॥
సానందోఽథ హరి: ప్రాహ ప్రసన్నాత్మా మహామునే ।
క్షీరోద మథనోద్భూతాం పద్మాం పద్మాలయాం ముదా ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓయీ సనత్కుమారా! సర్వజ్ఞా ! భైరవుని మరియొక గాథను ప్రీతితో వినుము. ఈ గాథ మహా పాపములను పోగొట్టి, భక్తిని వర్ధిల్ల జేయును (1). కాలునకు కాలుడు అగు భైరవుడు దేవదేవుడగు శివుని వాక్యముచే కాపాలికవ్రతమును అనుష్ఠించుచూ శివుని సన్నిధిలో చాల కాలమును గడిపెను (2). జగత్స్వరూపుడగు భైరవుడు కపాలమును చేతియందు ధరించి ముల్లోకములయందు తిరుగాడెను. దారుణమగు బ్రహ్మహత్య ఆ దేవుని కూడ విడిచిపెట్టలేదు (3). తీర్థములన్నియు తిరుగాడిన పిదప శివుని పట్టణములో బ్రహ్మహత్య ఆయనను విడిచిపెట్టెను. దీనిని బట్టి మన్మథ శత్రువగు శివుని మహిమను అందరు తెలియవచ్చును (4). శివస్వరూపుడగు ఆ భైరవుడు ప్రమథగణములచే సేవింపబడువాడే అయిననూ, ఒకనాడు యథేచ్ఛగా విహరించుచూ కపాలధారియై నారాయణుని నివాసమునకు వెళ్లెను (5). కాలునకు కాలుడు, ముక్కంటి, సర్పములే కుండలములుగా గలవాడు, మహాదేవుని

పూర్ణమగు అంశతో జన్మించినవాడు అగు భైరవుడు వచ్చుచుండుటను (6) గాంచి, గరుడధ్వజుడగు విష్ణువు, దేవతలు, మునులు మరియు దేవతా స్త్రీలు అన్ని వైపులనుండియు సాష్టాంగ ప్రణామముల నాచరించిరి (7). అపుడు లక్ష్మీపతియగు విష్ణువు భైరవునకు ప్రణమిల్లి శిరస్సుపై అంజలి ఘటించి అనేకస్తోత్రములతో స్తుతించెను (8). ఓ మహర్షీ! అపుడు ఆనందముతో నిండి ప్రసన్నముగా నున్న మనస్సు గల విష్ణువు క్షీరసాగర మథనమునందు జన్మించిన, పద్మము ఆసనముగా గల లక్ష్మీదేవిని ఉద్దేశించి ఆనందముతో నిట్లు పలికెను (9).

విష్ణురువాచ ।

ప్రియే పశ్యాబ్జనయనే ధన్యాసి సుభగేఽనఘే ।
ధన్యోఽహం దేవి సుశ్రోణి యత్పశ్యావో జగత్పతిమ్ ॥
అయం ధాతా విధాతా చ లోకానాం ప్రభురీశ్వరః ।
అనాదిశ్శరణశ్శాంతః పురః షడ్వింశసంమితః ॥
సర్వజ్ఞస్సర్వ యోగీశస్సర్వ భూతైకనాయకః ।
సర్వభూతాంత రాత్మాయం సర్వేషాం సర్వదస్సదా ॥
యే వినిద్రా వినిశ్వాసాశ్శాంతా ధ్యానపరాయణాః ।
ధియా పశ్యంతి హృదయే సోఽయం పద్మే సమీక్షతామ్ ॥
యం విదుర్వేదతత్త్వజ్ఞా యోగినో యతమానసా: ।
అరూపో రూపవాన్ భూత్వా సోఽయమాయాతి సర్వగః ॥
అహో విచిత్రం దేవస్య చేష్టితం పరమేష్ఠినః ।
యస్యాఖ్యాం బ్రువతో నిత్యం న దేహస్సోఽపి దేహభృత్ ॥
తం దృష్ట్వా న పునర్జన్మ లభ్యతే మానవైర్భువి ।
సోఽయామాయాతి భగవాన్ త్ర్యంబకశ్శశిభూషణః ॥

విష్ణువు ఇట్లు పలికెను –

ఓ ప్రియురాలా! పద్మముల వంటి కన్నులు గలదానా! సుందరీ! పుణ్యాత్మురాలా! నీ(వు) ధన్యురాలవు. ఓ దేవీ! సుందరీ! నేను కూడ ధన్యుడను. ఏలయన, మనము జగన్నాథుని చూచుచున్నాము (10). ఈ ఈశ్వరుడే సృష్టికర్త, కర్మఫలదాత, ముల్లోకములకు ప్రభువు, ఆది లేనివాడు, రక్షకుడు, శాంతస్వభావుడు, మరియు ఇరవై ఆరు తత్త్వములకు (10 ఇంద్రియములు+ స్థూలసూక్ష్మ భూతములు, 10+ మనోబుద్ధ్యహం కారములు+ జీవపురుషులు+ అదృష్టము=26) ఆయన అధిష్ఠానము (11). ఈయన సర్వప్రాణులలో అంతరాత్మయై వెలుగొందును. సర్వులకు సర్వకాలములయందు సర్వమును ఇచ్చునది ఈయనయే (12). ఓ లక్ష్మీ! యోగులు నిద్రను జయించి శ్వాసను నిరోధించి మనస్సును ఏకాగ్రము చేసి ధ్యాననిమగ్నులై బుద్ధితో హృదయమునందు ఏ పరమేశ్వరుని దర్శించెదరో, అట్టి ఈశ్వరుడు ఎదుట నున్నాడు. చూడుము (13).

వేదముల సారమునెరింగి మనస్సును నియంత్రించిన యోగులు మాత్రమే ఏ ఈశ్వరుని తెలియగల్గుదురో, అట్టి నిరాకారుడు, సర్వవ్యాపకుడు అగు ఈశ్వరుడు దేహధారియై మన ఎదుటకు వచ్చుచున్నాడు (14). దేవదేవుడగు ఈశ్వరుని చేష్టలు ఆశ్చర్యకరములు సుమా! ఎవని నామమును కీర్తించినచో జన్మరాహిత్యము కలుగునో, అట్టివాడు దేహమును ధరించియున్నాడు (15). ఈయనను దర్శించిన మానవులు మరల భూమిపై జన్మించరు. అట్టి భగవానుడు, ముక్కంటియగు చంద్రశేఖరుడు మన ఎదుటకు వచ్చుచున్నాడు (16).

పుండరీక దలాయామే ధన్యే మేఽద్య విలోచనే ।
యద్దృశ్యతే మహాదేవో హ్యాభ్యాం లక్ష్మి మహేశ్వరః ॥
ధిక్ ధిక్ పదం తు దేవానాం పరం దృష్ట్వా న శంకరమ్ ।
లభ్యతే యత్ర నిర్వాణం సర్వదుఃఖాంత కృత్తు యత్ ॥
దేవత్వా దశుభం కించిద్దేవలోకే న విద్యతే ।
దృష్ట్వాపి సర్వేదేవేశం యన్ముక్తిం న లభామహే ॥
ఏవముక్త్వా హృషీకేశస్సం ప్రహృష్టతనూరుహః ।
ప్రణిపత్య మహాదేవ మిదమాహ వృషధ్వజమ్ ॥
కిమిదం దేవదేవేన సర్వజ్ఞేన త్వయా విభో ।
క్రియతే జగతాం ధాత్రా సర్వపాప హరావ్యయ ॥
క్రీడేయం తవ దేవేశ త్రిలోచన మహామతే ।
కిం కారణం విరూపాక్ష చేష్టితం తే స్మరార్దన ॥
కిమర్థం భగవన్ శంభో భిక్షాం చరసి శక్తిప ।
సంశయో మే జగన్నాథ ఏషత్రైలోక్య రాజ్యద ॥

ఓ లక్ష్మీ ! మనమిద్దరము ఈనాడు మహేశ్వరుడగు మహాదే◌వుని గనినాము. పద్మ పత్రములవలె విశాలమగు నా కన్నులీనాడు ధన్యమైనవి (17). పరమాత్మ యగు శంకరుని దర్శనముచే సర్వదుఃఖములను నశింపజేయు మోక్షము లభించును. అట్టి మోక్షము నీయజాలని దేవపదవులకు నిందయగు గాక! (18) దేవలోకములో దేవపదవిని పొందుటకంటె అధికమగు అశుభము మరియొకటి లేదు. ఏలయన, మేమందరము దేవదేవుని దర్శించియూ ముక్తిని పొందలేకున్నాము (19). ఇంద్రియాధిపతి యగు విష్ణువు ఆనందముతో గగుర్పాటు గలవాడై ఇట్లు పలికి వృషభధ్వజుడగు మహాదేవునకు ప్రణమిల్లి ఇట్లు పలికెను (20). హేవిభూ! పాపములనన్నిటినీ హరించువాడా! వినాశము లేనివాడా! జగత్స్రష్టవు, దేవదేవుడవు, సర్వజ్ఞుడవు అగు నీవు ఈ పనిని ఏల చేయుచున్నావు? (21) ఓ దేవదేవా! ముక్కంటీ ! నీవు మహాబుద్ధిశాలివి. ఇది నీకు క్రీడ. ఓ వేసి కన్నులవాడా! మన్మథనాశకా! నీవిట్లు చేయుటకు కారణమేమి? (22) హే భగవాన్ ! శంభో! శక్తి నాథా ! నీవు భిక్షాటనమును చేయుటకు కారణమేమి? ఓ జగన్నాథా ! ముల్లోకములపై ఆధిపత్యమును ఇచ్చిన నీవు ఈ సంశయమును దీర్చుము (23).

నందీశ్వర ఉవాచః

ఏవముక్తస్తత శ్శంభుర్విష్ణునా భైరవో హరః ।
ప్రత్యువాచాద్భుతోఽతిస్మ విష్ణుం విహసన్ ప్రభుః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

విష్ణువు ఇట్లు పలుకగా, భైరవ రూపములో నున్నవాడు, పాపములను హరించువాడు, అద్భుతమగు లీలలు గలవాడు అగు శంభుప్రభుడు నవ్వి విష్ణువునకు ఇట్లు బదులిడెను (24).

భైరవ ఉవాచః

బ్రహ్మణస్తు శిరశ్ఛిన్నమంగుల్యాగ్ర నఖేన హ ।
తదఘం ప్రతిహంతుం హి చరామ్యేతద్వ్రతం శుభమ్ ॥

భైరవుడిట్లు పలికెను -

బ్రహ్మ యొక్క శిరస్సును వ్రేలిగోటితో దునిమియుంటిని. ఆ పాపమును పోగొట్టు కొనుటకై ఈ శుభవ్రతము నాచరించున్నాను (25).

నందీశ్వర ఉవాచః

ఏవముక్తో మహేశేన భైరవేణ రమాపతిః ।
స్మృత్వా కించిన్నత శిరాః పునరేవ మజిజ్ఞపత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

భైరవరూపములో నున్న మహేశ్వరుడిట్లు పలుకగా లక్ష్మీపతి ఆ వృత్తాంతమును స్మరించి కొద్దిగా తలను వంచుకొని, మరల ఇట్లు విన్నవించెను (26).

విష్ణురువాచ ।

యథేచ్ఛసి తథా క్రీడ సర్వవిఘ్నోపనోదక ।
మాయయా మాం మహాదేవ నాచ్ఛాదయితు మర్హసి ॥
నా భికమలకోశాత్తు కోటిశః కమలాసనాః ।
కల్పే కల్పే పురా హ్యాసన్ సత్యం యోగ బలాద్విభో॥
త్యజ మాయా మిమాం దేవ దుస్తరామ కృతాత్మభిః ।
బ్రహ్మాదయో మహాదేవ మాయయా తవ మోహితాః ॥
యథావదను గచ్ఛామి చేష్టితం తే శివాపతే ।
త్వమైవానుగ్రహాచ్ఛంభో సర్వేశ్వర సతాం గతే ॥
సంహారకాలే సంప్రాప్తే సదేవాన్ నిఖిలాన్మునీన్ ।
లోకాన్ వర్ణాశ్రమవతో హరిష్యసి యదా హర ॥



తదా కృతే మహాదేవ పాపం బ్రహ్మవధాదికమ్ ।
పారతంత్ర్యం న తే శంభో స్వైరం క్రీడత్యతో భవాన్ ॥
అర్థీశ బ్రహ్మణో హ్యస్థ్నాం స్రక్కంఠే తవ భాసతే ।
తథాద్యనుగతా శంభో బ్రహ్మహత్యా తవానఘ ॥

విష్ణువు ఇట్లు పలికెను -

విఘ్నముల నన్నిటినీ పోగొట్టే ఓ మహాదేవా! నీకు ఎట్లు అభీష్టమైనచో, అటు◌లనే క్రీడించుము. నన్ను నీ మాయతో కప్పివేయదగదు (27). ఓ విభూ! నా నాభిలోని పద్మము యొక్క కోశమునుండి ప్రతికల్పమునందు ఎందరో బ్రహ్మలు పూర్వము యోగబలముచే పుట్టియుండిరి. ఇది సత్యము (28). ఓ దేవా! మనోనియంత్రణ లేనివారు దాట శక్యము కాని నీ ఈ మాయను విడిచిపెట్టుము. ఓ మహాదేవా ! నీ మాయచే బ్రహ్మాదులు మోహితులగుచున్నారు (29). ఓ పార్వతీపతీ! శంభూ! సర్వేశ్వరా! సత్పురుషులకు శరణమైనవాడా! నీ అనుగ్రహముచేతనే నీ లీలలను నేను యథాతథముగా తెలియగల్గుచున్నాను (30). ఓ హరా ! సంహారకాలము రాగానే నీవు దేవతలతో .సర్వమహర్షులతో, వర్ణాశ్రమములతో గూడియున్న ఈ లోకములను ఉపసంహరించెదవు (31). నీవు. బ్రహ్మ శిరస్సును నరుకుట అను పాపమును లోకక్షేమముకొరకు మాత్రమే చేసి యుంటివి. హే శంభూ! నీకు పరాధీనత లేదు. కావుననే. నీవు యథేచ్ఛగా క్రీడించుచున్నావు (32). వేదవిహితములగు ఆహుతులకు ప్రభువైన శంకరా! నీ కంఠములో అస్థికల మాల ప్రకాశించుచున్నది. ఓ శంభూ! పాపరహితా! నిన్ను బ్రహ్మహత్య ఈ నాటికీ అనుసరించుచునే యున్నది (33).

కృత్వాపి సుమహత్పాపం యస్త్వాం స్మరతి మానవః ।
ఆధారం జగతా మీశ తస్య పాపం విలీయతే ॥
యథా తమో న తిష్ఠేత సన్నిధావంశు మాలినః ।
తథైవ తవ యో భక్తః పాపం తస్య ప్రణేత్ క్షయమ్ ॥
యశ్చింతయతి పుణ్యాత్మా తవ పాదాంబుజ ద్వయమ్ ।
బ్రహ్మహత్యా కృతమపి పాపం తస్య ప్రణేత్ క్షయమ్ ॥
తవ నామానురక్తా వాగ్యస్య పుంసో జగత్పతే ।
అప్యద్రికూట తులితం నైనస్తమను బాధతే ॥
పరమాత్మన్ పరం ధామ స్వేచ్ఛా ఇధృతవిగ్రహా ।
కుతూహలం తవేశేదం కృపణాధీనతేశ్వర ॥
అద్య ధన్యోఽస్మి దేవేశ యన్న పశ్యంతి యోగినః ।
పశ్యామి తం జగన్మూర్తిం పరమేశ్వర మవ్యయమ్ ॥
అద్య మే పరమో లాభస్త్వద్య మే మంగలం పరమ్ ।
తం దృష్ట్వా మృత తృప్తస్య తృణం స్వర్గా పవర్గకమ్ ॥

ఇష్టం వదతి గోవిందే విమలా పద్మయా తయా ।

మనోరథవతీ నామ భిక్షాపాత్రే సమర్పితా ॥

భిక్షాటనాయ దేవోఽపి నిరగాత్త్వరయా ముదా ।

అన్యత్రాపి మహాదేవో భైరవశ్చాత్త విగ్రహః ॥

దృష్ట్వానుయాయినీం తాం తు సమాహూయ జనార్దనః ।

సంప్రార్థయద్బ్రహ్మహత్యాం విముంచ త్వం త్రిశూలినమ్ ॥

మహాపాపమును చేసిన మానవుడైననూ జగత్తులకు ఆధారమగు నిన్ను స్మరించినచో ఆ పా◌ాపములు నశించి పోవును. ఓ ఈశా! (34) సూర్యుని సన్నిధిలో చీకటి ఉండలేదు. అటులనే నీ భక్తుని పాపము వినాశమును పొందును (35). ఏ పుణ్యాత్ముడు నీ పాద పద్మములను స్మరించునో, వాని బ్రహ్మ హత్యా పాపమైననూ నశించును (36). ఓ జగత్ప్రభూ ! ఏ పురుషుని వాక్కు నీ నామమునందు రుచిని కలిగియుండునో, వానిని పర్వత శిఖరమువంటి పెద్ద పాపమైననూ బాధించలేదు (37). ఓ పరమాత్మా ! పరంధామా ! స్వేచ్ఛచే దేహమును ధరించిన వాడా! ఈశ్వరా ! ఈశా! నీవు ఇట్టి దైన్యమునకు అధీనుడవగుట కేవలము కుతూహలము కొరకు మాత్రమే (38). ఓ దేవదేవా! పరమేశ్వరుడు, జగత్స్వరూపుడు, అవ్యయుడు అగు నిన్ను యోగులు కనజాలరు. అట్టి నిన్ను చూచి నేను ధన్యుడనైతి లాభము మరియు మంగళము కలిగినవి. నిన్ను చూచుట అనే అమృతముతో తృప్తిని చెందిన వానికి స్వర్గముగాని, మోక్షము గాని గడ్డి పోచతో సమానమగును (40). గోవిందుడిట్లు పలుకగా, ఆ లక్ష్మీదేవి భిక్షాపాత్రలో మనోరథనతి అనే స్వచ్ఛమగు మణిని (?) సమర్పించెను (41). భైరవరూపమును దాల్చిన దేవదేవుడగు ఆ మహాదేవుడు కూడ మహానందముతో భిక్షాటన కొరకు మరియొక స్థానమునకు వెడలెను (42). ఆయనను వెంటాడుచున్న ఆ బ్రహ్మ హత్యను వెనుకకు పిలిచి జనార్దనుడు 'నీవు త్రిశూలియగు శివుని విడిచి పెట్టుము' అని ప్రార్థించెను (43).

బ్రహ్మహత్యావాచ ।

అనేనాపి మిషేణాహం సంసేవ్యాముం వృషధ్వజమ్ ।

ఆత్మానం పావయిష్యామి త్వపునర్భవదర్శనమ్ ॥

బ్రహ్మహత్య ఇట్లు పలికెను –

నేను ఈ వ్యాజముతో ఈ వృషభధ్వజుని చక్కగా సేవించి నన్ను పవిత్రము చేసుకొని పునర్జన్మ లేని మోక్షమును పొందెదను (44).

నందీశ్వర ఉవాచః

సా తత్యా జ న తత్పార్శ్వం వ్యాహృతాపి మురారిణా ।

తమూచే ఽథ హరిం శంభుస్స్మేరాస్యో భైరవో వచః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

మురారి చెప్పిననూ ఆమె ఆతని సమీపము నుండి తొలగిపోలేదు. అపుడు భైరవుడగు శంభు◌ుడు చిరునవ్వుతో విష్ణువును ఉద్దేశించి ఇట్లు పలికెను (45).

భైరవ ఉవాచః

త్వద్వాక్ పీయూష పానేన తృప్తోఽస్మి బహు మానద ।

స్వభావోఽయం హి సాధూనాం యత్త్వం వదసి మాపతే ॥

వరం వృణీష్వ గోవింద వరదోఽస్మి తవానఘ ।

అగ్రణీర్మమ భక్తానాం త్వం హరే నిర్వికారవాన్ ॥

నో మాద్యంతి తథా భైక్ష్యై ర్భిక్షవోఽప్యతి సంస్కృతైః ।

యథా మానసుధాపానైర్నను భిక్షాటన జ్వరాః ॥

భైరవుడిట్లు పలికెను -

అభిమానమును కాపాడే హే లక్ష్మీపతీ! అమృతతుల్యములగు నీ వచనములను విని సంతుష్టుడనైతిని. నీవు మాటలాడు తీరు సాధుస్వభావమై యున్నది (46). ఓ గోవిందా! వరమును కోరుకొనుము. ఓయీ అనఘా ! నీకు వరమునిచ్చెదను. ఓ హరీ! వికారములు లేని నీవు నా భక్తులలో అగ్రగణ్యుడవు (47). భిక్షాటనము చేసి అలసిన సాధువులు ఆదరపూర్వకవచనములచే ఎట్టి సంతృప్తిని పొందెదరో, అట్టి సంతృప్తిని పరమమధురమగు భక్ష్యములతో గూడిన భిక్షాన్నము ఈయజాలదు (48).

నందీశ్వర ఉవాచః

ఇత్యాకర్ణ్య వచశ్శంభో ర్భైరవస్య పరాత్మనః ।

సుప్రసన్నతరో భూత్వా సమవోచన్మహేశ్వరమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

భైరవస్వరూపములోనున్న పరమాత్మయగు శంభుని ఈ మాటను విని, విష్ణువు మరింత ప్రసన్నుడై, మహేశ్వరునితో నిట్లనెను (49).

విష్ణురువాచ ।

ఏష ఏవ వరశ్శ్లాఘ్యో యదహం దేవతా ధిపమ్ ।
పశ్యామి త్వాం దేవదేవ మనోవాణీ పథాతిగమ్ ॥
అదభ్రేయం సుధాదృష్టిరనయా మే మహోత్సవః ।
అయత్ననిధిలా భోఽయం వీక్షణం హర తే సతామ్ ॥
అవియో గోఽస్తు మే దేవ త్వదంఘ్రియుగలేన వై ।
ఏష ఏవ వరశ్శంభో నాన్యం కంచిద్వృణే వరమ్ ॥

విష్ణువు ఇట్లు పలికెను -

ఓ దేవదేవా! దేవతలకు ప్రభువు, దేవదేవుడు, మనస్సునకు వాక్కులకు అందని జ్ఞానమార్గములో నుండువాడు అగు నిన్ను నేను చూడగల్గుచున్నాను. ఇదియే కొనియాడదగిన వరము (50). ఈ నీ శ్రేష్ఠదర్శనము నాకు అమృతతుల్యము. నిన్ను చూచుటయే నాకు పెద్ద పండుగ. ఓ హరా! సత్పురుషులకు నీ దర్శనము ప్రయత్నము లేకుండగా నిధి లభించుట వంటిది (51). ఓ దేవా! నాకు నీ పాదపద్మములనుండి వియోగము కలుగకుండు గాక ! ఓ శంభో! నేను కోరే వరమిదియే. నాకు మరియొక వరముతో పని లేదు (52).

శ్రీ భైరవ ఉవాచః

ఏవం భవతు తే తాత యత్త్వయోక్తం మహామతే ।
సర్వేషామపి దేవానాం వరదస్త్వం భవిష్యసి ॥

శ్రీ భైరవుడిట్లు పలికెను -

వత్సా! నీవు మహాబుద్ధిశాలివి. నీవు కోరిన విధముగానే సర్వము సంపన్నమగును గాక! నీవు దేవతలందరిలో కూడా వరములనిచ్చువాడవు కాగలవు (53).

నందీశ్వర ఉవాచః

అనుగృహ్యేతి దైత్యారిం కేంద్రాద్రి భువనే చరమ్ ।
భేజే విముక్త నగరీం నామ్నా వారాణసీం పురీమ్ ॥
క్షేత్రే ప్రవిష్టమాత్రేఽథ భైరవే భీషణాకృతౌ ।
హా హేత్యుక్త్వా బ్రహ్మహత్యా పాతాలం చావిశత్తదా ॥
కపాలం బ్రహ్మణస్సద్యో భైరవస్య కరాంబుజాత్ ।
పపాత భువి తత్తీర్థ మ భూత్కాపాల మోచనమ్ ॥
కపాలం బ్రహ్మణో రుద్రస్సర్వేషామేవ పశ్యతామ్ ।
హస్తాత్పతంతమాలోక్య ననర్త పరయా ముదా ॥
విధేః కపాలం నాముంచత్కరమత్యంత దుస్సహమ్ ।
పరస్య భ్రమతః క్వాపి తత్కాశ్యాం క్షణతోఽపతత్ ॥

శూలినో బ్రహ్మణో హత్యా నా పైతి స్మ చ యా క్వచిత్ ।

సా కాశ్యాం క్షణతో నష్టా తస్మాత్సేవ్యా హి కాశికా ॥

కపాలమోచనం కాశ్యాం యస్స్మరే త్తీర్థముత్తమమ్ ।

ఇహాన్యత్రాపి యత్పాపం క్షిప్రం తస్య ప్రణశ్యతి ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఈ విధముగా భైరవుడు భూమికి కేంద్రమగు మేరుపర్వతమునందు మరియొక వైంకుఠము నందు ఉండే, రాక్షస విరోధియగు విష్ణువును అనుగ్రహించి వారాణసి యని ప్రసిద్ధి గాంచిన ముక్తి దాయకమగు నగరమును చేరెను (54). భయంకరాకారుడగు భైరవుడా క్షేత్రములో అడుగు పెట్టగానే, బ్రహ్మహత్య హాహాకారమును చేయుచూ పాతాళములో ప్రవేశించెను (55). భైరవుని పద్మమువంటి చేతినుండి బ్రహ్మయొక్క కపాలము వెంటనే క్రింద బడెను. ఆ స్థానము కాపాలమోచనమనే తీర్థము ఆయెను (56). రుద్రుడు (భైరవుడు) తన చేతినుండి బ్రహ్మయొక్క కపాలము నేల బడుటను గాంచి పరమానందముతో అందరు చూచుచుండగా నాట్యమును చేసెను (57). బ్రహ్మ యొక్క కపాలము పరమాత్మయగు భైరవుని చేతిని ఆయన ఇతరత్రా పరిభ్రమించినంతవరకు విడిచిపెట్టలేదు. మిక్కిలి దుస్సహమగు ఆ కపాలము కాశీలో క్షణకాలములో నేలబడెను (58). ఏ బ్రహ్మహత్య శూల ధారిని ఇతరత్రా ఎక్కడైననూ విడిచిపెట్టలేదో, అది కాశీలో క్షణకాలములో నశించెను. కావున కాశీ నగరమును సేవించవలెను (5.9). ఎవడైతే కాశీలో కపాలమోచనమనే ఉత్తమ తీర్థమును స్మరించునో వాడు సర్వపాపములనుండి శీఘ్రమే విముక్తుడై ఇహపరములలో సుఖమును పొందును (60).

ఆగత్య తీర్థ ప్రవరే స్నానం కృత్వా విధానతః ।
తర్పయిత్వా పితౄన్ దేవాన్ ముచ్యతే బ్రహ్మహత్యయా ॥
కపాలమోచనం తీర్థం పురస్కృత్వా తు భైరవః ।
తత్రైవ తస్థౌ భక్తానాం భక్షయన్నఘ సంతతిమ్ ॥
కృష్ణాష్టమ్యాం తు మార్గస్య మాసస్య పరమేశ్వరః ।
ఆవిర్బభూవ సల్లీలో భైరవాత్మా సతాం ప్రియః ॥
మార్గశీర్షా సితాష్టమ్యాం కాలభైరవసన్నిధౌ ।
ఉపోష్య జాగరాం కుర్వన్ మహాపాపైః ప్రముచ్యతే ॥
అన్య త్రాపి నరో భక్త్యా తద్వ్రతం యః కరిష్యతి ।
స జాగరం మహాపాపైర్ముక్తో యాస్యతి సద్గతిమ్ ॥
అనేక జన్మ నియుతైర్యత్ కృతం జంతుభిస్త్వఘమ్ ।
తత్సర్వం విలయం యాతి కాలభైరవదర్శనాత్ ॥
కాలభైరవభక్తానాం పాతకాని కరోతి యః ।
సమూఢో దుఃఖితో భూత్వా పునర్దుర్గతి మాప్నుయాత్ ॥

మానవుడు ఈ శ్రేష్ఠమగు తీర్థమునకు వచ్చి విధి విధానముగా స్నానమును చేసి పితృదేవతలకు తర్పణములనిచ్చినచో, బ్రహ్మహత్యాపాపమునుండి విముక్తుడగును (61). భైరవుడు కపాలమోచన తీర్థమునకెదురుగా అచటనే ఉండి భక్తుల పాపసందోహములను నశింపజేసెను (62). సత్పురుషులకు ప్రియమైనవాడు, గొప్ప లీలలు గలవాడునగు పరమేశ్వరుడు మార్గశీర్షమాసములో కృష్ణపక్షాష్టమినాడు భైరవరూపముతో ఆవిర్భవించెను (63). మార్గశీర్షకృష్ణాష్టమి నాడు కాలభైరవుని సన్నిధిలో ఉపవసించి జాగరమును చేయు వ్యక్తి మహాపాపములనుండి విముక్తుడగును (64). ఇతరస్థలములయందైననూ జాగరముతో సహా ఈ వ్రతమునునుష్ఠించు మానవుడు మహాపాపములనుండి విముక్తుడై పుణ్య లోకములను పొందును (65). కాలభైరవదర్శనము వలన అనేక జన్మలనుండి సంచితమైన పాపములనుండి జీవులు పూర్తిగా విముక్తిని పొందెదరు (66). కాలభైరవుని భక్తులయెడ పాపమునాచరించు మూర్ఖుడు దుఃఖమును పొందుటయే గాక నరకమును కూడ అనుభవించును (67).

విశ్వేశ్వరేఽపి యే భక్తా నోభక్తాః కాలభైరవే ।
తే లభంతే మహాదుఃఖం కాశ్యాం చైవ విశేషతః ॥
వారాణస్యాముషిత్వా యో భైరవం న భజేన్నరః ।
తస్య పాపాని వర్ధంతే శుక్లపక్షే యథా శశీ ॥
కాలరాజం న యః కాశ్యాం ప్రతి భూతాష్టమీకుజమ్ ।
భజేత్తస్య క్షయం పుణ్యం కృష్ణపక్షే యథా శశీ ॥
శ్రుత్వాఖ్యానమిదం పుణ్యం బ్రహ్మహత్యా పనోదకమ్ ।
భైరవోత్పత్తి సంజ్ఞం చ సర్వపాపైః ప్రముచ్యతే ॥
బంధనాగారసంస్థోఽపి ప్రాప్తోఽపి విపదం పరామ్ ।
ప్రాదుర్భావం భైరవస్య శ్రుత్వా ముచ్యేత సంకటాత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం భైరవలీలావర్ణనం
నామ నవమోఽధ్యాయః(9).

విశ్వేశ్వరుని యందు భక్తి ఉండియూ, 'కాలభైరవుని యందు భక్తి లేనిచో, అట్టివారు కాశీలో విశేషించి మహాదుఃఖమును పొందెదరు (68). వారాణసి యందు నివసించు చుండియూ ఏ మానవుడు కాలభైరవుని సేవించడో, వాని పాపములు శుక్లపక్షచంద్రుని వలె వృద్ధిని పొందును (69). ఎవడైతే కాశీలో కృష్ణ పక్షాష్టమీ బుధవారమునాడు కాలభైరవుని సేవించడో, వాని పుణ్యము కృష్ణపక్షచంద్రుని వలె క్షీణించును (70). భైరవుని పుట్టుక, ఆతనికి బ్రహ్మహత్య నుండి విముక్తి అను ఈ పవిత్రమగు వృత్తాంతమును విన్న మానవుడు పాపములన్నింటినుండియు విముక్తిని పొందును (71). కారాగారములో బంధింపబడినవాడు గాని, గొప్ప ఆపదను పొందినవాడు గాని భైరవావిర్భావ వృత్తాంతమును విన్నచో ఆ కష్టమునుండి విముక్తుడగును (72).

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు భైరవ లీలావర్ణనమనే తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (9).

10 - నృసింహావతారము

నందీశ్వర ఉవాచః

విధ్వంసీ దక్షయజ్ఞస్య వీర భద్రాహ్వయః ప్రభో ।
అవతారశ్చ విజ్ఞేయ శ్శివస్య పరమాత్మనః ॥
సతీచరిత్రే కథితం చరితం తస్య కృత్స్నశః ।
శ్రుతం త్వయాపి బహుధా నాతః ప్రోక్తం సువిస్తరాత్ ॥
అతః పరం మునిశ్రేష్ఠ భవత్స్నేహాద్బ్రవీమి తత్ ।
శార్దూలాఖ్యావతారం చ శంకరస్య ప్రభోః శృణు ॥
సదాశివేన దేవానాం హితార్థం రూపమద్భుతమ్ ।
శారభం చ ధృతం దివ్యం జ్వలజ్జ్వాలా సమప్రభమ్ ॥
శివావతారా అమితాస్సద్భక్తి హితకారకాః ।
సంఖ్యా న శక్యతే కర్తుం తేషాం చ మునిసత్తమాః ॥
ఆకాశస్య చ తారాణాం రేణుకానాం క్షితేస్తథా ।
ఆసారాణాం చ వృద్ధేన బహుకల్పైః కదాపి హి ॥
సంఖ్యా విశక్యతే కర్తుం సుప్రాజ్ఞైర్బహుజన్మభిః ।
శివావతారాణాం నైవ సత్యం జానీహి మద్వచః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

దక్షయజ్ఞమును వినాశ మొనర్చిన వీరభద్రుడను వాడు పరమాత్మయగు శివ ప్రభుని అవతారమే యని తెలియదగును (1). ఆతని వృత్తాంత మంతయూ సతీ చరిత్రములో వర్ణింపబడినది. నీవు కూడా ఆ చరిత్రమును అనేక విధములుగా వినియుందువు. కావుననే నేను విస్తరముగా చెప్పుట లేదు (2). ఓ మహర్షీ ! నీయందలి ప్రేమచే నేనిపైన శంకరప్రభుని ప్రసిద్ధమగు శార్దూలావతారమును చెప్పెదను వినుము (3). మరియు సదాశివుడు దేవతల హితమును గోరి మండే అగ్ని వలె ప్రకాశించే అద్భుతమైన దివ్యమగు శరభరూపమును ధరించెను (4). ఓ మహర్షులారా! శివావతారములు అనంతములు. అవి గొప్ప భక్తిని, హితమును కలిగించును. వాటి సంఖ్యను నిర్ణయించుట సంభవము కాదు (5). ఆకాశములోని తారలను, భూమియందలి ఇసుక రేణువులను, కుంభవృష్టి లోని జలబిందువులను లెక్కించుట సంభవమగునేమో గాని, గొప్ప ప్రజ్ఞావంతులైననూ అనేక కల్పములలో బహుజన్మలను స్వీకరించి లెక్కించిననూ, శివావతారముల సంఖ్యను నిర్ణయించుట సంభవము కాదు. నా వచనము సత్యమని యెరుంగుము (6,7).

తథాపి చ యథా బుద్ధ్యా కథయామి యథా శ్రుతమ్ ।
చరిత్రం శారభం దివ్యం పరమైశ్వర్య సూచకమ్ ॥
జయశ్చ విజయశ్చైవ భవద్భి శ్శాపితౌ యదా ।
తదా దితి సుతౌ ద్వౌ తావభూతాం కశ్యపాన్మునే ॥
హిరణ్యకశిపుశ్చాద్యో హిరణ్యాక్షోఽనుజో బలీ ।
దేవర్షిపార్షదౌ జాతౌ తౌ ద్వావపి దితేస్సుతౌ ॥
పృథ్వ్యుద్ధారే విధాత్రా వై ప్రార్థితో హి పురా ప్రభుః ।
హిరణ్యాక్షం జఘానాసౌ విష్ణుర్వారాహ రూపధృక్ ॥
తం శ్రుత్వా భ్రాతరం వీరం నిహతం ప్రాణసన్నిభమ్ ।
చుకోప హరయేఽతీవ హిరణ్య కశిపుర్మునే ॥
వర్షాణామయుతం తప్త్వా బ్రహ్మణో వరమాప సః ।
న కశ్చి న్మారయేన్మాం వై త్వత్సృష్టావితి తుష్టతః ॥
శోణితాఖ్యపురం గత్వా దేవానాహూయ సర్వతః ।
త్రిలోకీం స్వవశే కృత్వా చక్రే రాజ్యమకంటకమ్ ॥

అయిననూ నేను విన్నంతవరకు నా బుద్ధిశక్తిని అనుసరించి శరభావతారమనే దివ్యగాథను చెప్పెదను. ఈ గాథ పరమైశ్వర్యమునిచ్చును (8). ఓ మహర్షీ! మీరు జయవిజయులను శపించగా వారు దితికశ్యపులకు పుత్రులై జన్మించిరి (9). మొదటివాడు హిరణ్యకశిపుడు. ఆతడి తమ్ముడగు హిరణ్యాక్షుడు బలశాలి. ఓ దేవర్షి ! ఈ తీరున విష్ణు సేవకులగు వారిద్దరు దైత్యులై జన్మించిరి (10). పూర్వము విష్ణు ప్రభుడు బ్రహ్మ ప్రార్థించగా భూమిని వరాహరూపముతో పైకి లేవదీసెను. ఆ సమయములో ఆయన హిరణ్యాక్షుని సంహరించెను (11). వీరుడు, ప్రాణ ప్రియుడు అగు తమ్ముడు సంహరింపబడుటచే హిరణ్యకశిపునకు విష్ణువుపై అత్యధికమగు కోపము కలిగెను. ఓ మునీ! (12) ఆతడు పది వేల సంవత్సరములు తపమునాచరించి బ్రహ్మను సంతోషపెట్టి, నీ సృష్టిలోని ఏ ప్రాణియైననూ నన్ను సంహరించకుండుగాక! అను వరమును పొందెను (13). ఆతడు శోణిత నగరమునకు వెళ్లి, దేవతలనందరినీ జయించి ముల్లోకములను వశమొనర్చుకొని నిష్కంటకముగా రాజ్యమునే లెను (14).

దేవర్షి కదనం చక్రే సర్వధర్మ విలోపకః ।
ద్విజపీడాకరః పాపీ హిరణ్యకశిపుర్మునే ॥
ప్రహ్లాదేన స్వపుత్రేణ హరిభక్తేన దైత్యరాట్ ।
యదా విద్వేషమకరోద్ధరివైరీ విశేషతః ॥
సభాస్తంభాత్తదా విష్ణురభూరావిర్భుతం మునే ।
సం ధ్యాయాం క్రోధమాపన్నో నృసింహవపుషా తతః ॥
సర్వథా మునిశార్దూల కరాలం నృహరేర్వపుః ।
ప్రజజ్వాలాతి భయదం త్రాసయన్ దైత్యసత్తమాన్ ॥

నృసింహేన తదా దైత్యా నిహతాశ్చైవ తత్క్షణమ్ ।
హిరణ్య కశిపుశ్చాథ యుద్ధం చక్రే సుదారుణమ్ ॥
మహాయుద్ధం తయోరాసీన్ముహూర్తం మునిసత్తమాః ।
వికరాలం చ భయదం సర్వేషాం రోమహర్షణమ్ ॥
సాయం చకర్ష దేవేశో దేహల్యాం దైత్యపుంగవమ్ ।
వ్యోమ్ని దేవేషు పశ్యత్సు నృసింహశ్చ రమేశ్వరః ॥

ధర్మములన్నిటినీ నశింపజేసి బ్రాహ్మణులకు పీడ కలుగజేసిన పాపియగు హిరణ్యకశిపుడు దేవతలతో యుద్ధమును చేసెను. ఋషులను హింసించెను. ఓ మునీ! (15) తీవ్రమగు విష్ణుద్వేషముగల ఆ రాక్షసరాజు హరి భక్తుడు, తన పుత్రుడు అగు ప్రహ్లాదునిపై కత్తిగట్టెను (16). ఓ మునీ ! అపుడు కోపించిన విష్ణువు సంధ్యాకాలమునందు నృసింహరూపముతో సభలోని స్తంభము మధ్యనుండి శీఘ్రమే ఆవిర్భవించెను (17). ఓ మహర్షీ! మిక్కిలి భయంకరమైనది, అత్యంత క్రూరమైనది అగు ఆ నృసింహశరీరము రాక్షసులకు భయమును గొల్పుచూ తీక్ష్ణముగా ప్రకాశించెను (18). అపుడా నృసింహుడు వెంటనే రాక్షసులను సంహరించెను. అపుడు హిరణ్యకశిపుడాయనతో దారుణమగు యుద్ధమును చేసెను (19). ఓ మహర్షులారా! వారిద్దరి మధ్య కొంతకాలము మిక్కిలి క్రూరమైనది, భయమును గొల్పునది, అందరికి గగుర్పాటును కలిగించునది అగు మహాయుద్ధము జరిగెను (20). ఆకాశమునందు దేవతలు గాంచుచుండగా దేవదేవుడు, లక్ష్మీపతి అగు నృసింహుడు ఆ రాక్షసరాజును సాయంకాల సమయమునందు సింహద్వారపు గడప వద్దకు లాగుకొని వెళ్లెను (21). .

అథోత్సంగే చ తం కృత్వా నఖైస్తదుదరం ధ్రుతమ్ ।
విదార్య మారయామాస పశ్యతాం త్రిదివౌకసామ్ ॥
హతే హిరణ్య కశిపౌ నృసింహేనైవ విష్ణునా ।
జగత్ స్వాస్థ్యం తదా లేభే న వై దేవా విశేషతః ॥
దేవదుందుభయో నేదుః ప్రహ్లాదో విస్మయం గతః ।
లక్ష్మీశ్చ విస్మయం ప్రాప్తా రూపం దృష్ట్వాద్భుతం హరేః ॥
హతో యద్యపి దైత్యేంద్ర స్తథాపి న పరం సుఖమ్ ।
యయుర్దేవా నృసింహస్య జ్వాలా సా న నివర్తితా ॥
తయా చ వ్యాకులం జాతం సర్వం చైవ జగత్పునః ।
దేవాశ్చ దుఃఖమాపన్నాః కిం భవిష్యతి వా పునః ॥
ఇత్యేవం చ వదంతస్తే భయాద్దూరము పస్థితాః ।
నృసింహ క్రోధజజ్వాలా వ్యాకులాః పద్మభూముఖాః ॥
ప్రహ్లాదం ప్రేషయామాసుస్తచ్ఛాంత్యై నికటం హరేః ।
సర్వాన్మిలిత్వా ప్రహ్లాదః ప్రార్థితో గతవాంస్తదా ॥

ఉరసా లింగయామాస తం నృసింహః కృపానిధిః ।
హృదయం శీతలం జాతం రుడ్ జ్వాలా న నివర్తితాః ॥
దుఃఖం ప్రాప్తాస్తతో దేవాశ్శంకరం శరణం యయుః ॥
తత్ర గత్వా సురాస్సర్వే బ్రహ్మాద్యా మునయస్తథా ।
శంకరం స్తవయామాసుర్లో కానాం సుఖహేతవే ॥

అపుడాయన వానిని తన ఒడిలో కూర్చుండ బెట్టుకుని వెంటనే గోళ్లతో వాని పొట్టను చీల్చి దేవతలు చూచుచుండగా సంహరించెను (22). నృసింహరూపుడగు విష్ణువు హిరణ్యకశిపుని సంహరించగా జగత్తు స్వస్థతను పొందెను. కాని దేవతలు విశేషసుఖమును పొందలేకపోయిరి (23). దేవదుందుభులు మ్రోగినవి. విష్ణువు యొక్క ఆ అద్భుత రూపమును గాంచి ప్రహ్లాదుడు, మరియు లక్ష్మీదేవి ఆశ్చర్యచకితులైరి (24). రాక్షసరాజు సంహరింపబడిననూ, దేవతలు పూర్ణసుఖమును పొందలేకపోయిరి. ఏలయన, నృసింహుని క్రోధాగ్ని ఇంకనూ చల్లారలేదు (25). మరల జగత్తు అంతయూ దానిచే కంగారు పడజొచ్చెను. ఏమి కానున్న దోయని దేవతలు దుఃఖమును పొందిరి (26). నృసింహుని కోపమునుండి పుట్టిన జ్వాలలకు భయపడి బ్రహ్మ మొదలగు వారు ఏమి ముప్పురానున్నదో అని పలుకుచూ భయముతో దూరముగా తప్పుకొనిరి (27). అపుడు వారందరు ఆ కోపమును శాంతింప జేయుట కొరకై ప్రహ్లాదుని ప్రార్థించి నృసింహుని వద్దకు పంపగా ఆతడు వెళ్లెను (28). దయానిధి యగు నృసింహుడు ప్రహ్లాదుని గుండెలకు హత్తుకొనెను. అపుడాయన హృదయము చల్లబడెను. కాని క్రోధ జ్వాల చల్లారలేదు (29). అపుడు దేవతలు దుఃఖితులై శంకరుని శరణు జొచ్చిరి (30). బ్రహ్మ మొదలగు దేవతలు మరియు మహర్షులు అందరు కలిసి శంకరుని వద్దకు వెళ్లి లోకములకు సుఖమును కలిగించుట కొరకై శంకరుని ప్రార్థించిరి (31).

దేవా ఊచుః ।

దేవదేవ మహాదేవ శరణాగతవత్సల ।
పాహి నశ్శరణాపన్నా సర్వాన్ దేవాన్ జగంతి చ ॥
నమస్తేఽస్తు నమస్తేఽస్తు నమస్తేఽస్తు సదాశివ ।
పూర్వం దుఃఖం యదా జాతం తదా తే రక్షితా వయమ్ ॥
సముద్రో మథితశ్చైవ రత్నానాం చ విభాగశః ।
కృతే దేవైస్తదా శంభో గృహీతం గరలం త్వయా ॥
రక్షితాస్స్మ తదా నాథ నీలకంఠ ఇతి శ్రుతః ।
విషం పాస్యసి నో చేత్త్వం భస్మీ భూతాస్త దాఖిలాః ॥
ప్రసిద్ధం చ యదా యస్య దుఃఖం చ జాయతే ప్రభో ।
తదా త్వన్నామమాత్రేణ సర్వదుఃఖం విలీయతే ॥



ఇదానీం నృహరి జ్వాలా పీడితాన్నస్సదాశివ ।
తాం త్వం శమయితుం దేవ శక్తోఽసీతి సునిశ్చితమ్ ॥

దేవతలిట్లు పలికిరి -

దేవదేవా! మహాదేవా! శరణు జొచ్చిన వారిని ప్రేమించువాడా! మేము దేవతలము అందరము మరియు జగత్తులు నిన్ను శరణు జొచ్చుచున్నవి. మమ్ములను కాపాడుము (32). హే సదాశివా ! నీకు అనేక నమస్కారములు. పూర్వము మాకు ఆపద కలిగినపుడు నీవే రక్షించితివి (33). దేవతలు రత్నములను వరుసగా పొందుట కొరకై సముద్రమును మథించినప్పుడు విషమును నీవే స్వీకరించితివి. హే శంభో! (34) నాథా! మమ్ములనప్పుడు అట్లు రక్షించి నీవు నీలకంఠుడను పేర ఖ్యాతిని గాంచితివి. నీవు అప్పుడు విషమును త్రాగి యుండనిచో సర్వులు భస్మ మైయుండెడివారు (35). హే ప్రభూ! ఎపుడు ఎవరికి ఏ దుఃఖము కలిగిననూ, నీ నామమును స్మరించినచో తన్మాత్రము చేతనే దుఃఖములన్నియు తొలగి పోవుననే విషయము లోకప్రసిద్ధము (36). ఓ సదాశివా! మేము ఇపుడు నృసింహుని క్రోధజ్వాలచే పీడితులమై యున్నాము. ఓ దేవా ! దానిని చల్లార్చుటకు నీవు సమర్థుడవనుటలో సందేహము లేదు (37).

నందీశ్వర ఉవాచః

ఇతి స్తుతస్తదా దేవైశ్శంకరో భక్త వత్సలః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మాఽభయం దత్వా పరం ప్రభుః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

దేవతలిట్లు ప్రార్థించగా అపుడు భక్తవత్సలుడగు శంకరప్రభుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై గొప్ప అభయమునిచ్చి ఇట్లు బదులిడెను (3-8).

శంకర ఉవాచః

స్వస్థానం గచ్ఛత సురాస్సర్వే బ్రహ్మాదయోఽభయాః ।
శమయిష్యామి యద్దుఃఖం సర్వథా హి వ్రతం మమ ॥
గతో మచ్ఛరణం యస్తు తస్య దుఃఖం క్షయం గతమ్ ।
మత్ప్రియశ్శరణాపన్నః ప్రాణే భ్యోఽపి న సంశయః ॥

శంకరుడిట్లు పలికెను -

బ్రహ్మాది దేవతలారా! మీరందరు నిర్భయముగా మీ స్థానములకు వెళ్లుడు. నేను మీ దుఃఖమును శాంతింపజేసెదను. ఏలయన, అట్లు చేయుట నాకు దృఢవ్రతమై యున్నది (39). ఎవరు నన్ను శరణు వేడెదరో, వారి దుఃఖము నశించును. నన్ను శరణు పొందినవాడు నాకు ప్రాణములకంటె ఎక్కువ ప్రియుడనుటలో సందేహము లేదు (40).

నందీశ్వర ఉవాచః

ఇతి శ్రుత్వ తదా దేవా హ్యానందం పరమం గతాః ।

యథాగతం తథా జగ్ముస్స్మరంత శ్శంకరం ముదా ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే శతరుద్ర సంహితాయాం నృసింహ చరిత వర్ణనం నామ దశమోఽధ్యాయః (10).

నందీశ్వరుడిట్లు పలికెను -

అపుడు దేవతలీమాటను విని పరమానందమును పొంది శంకరుని భక్తి పూర్వకముగా స్మరిస్తూ తమ స్థానములకు వెళ్లిరి (41).

శ్రీ శివమహాపురాణములోని శతురుద్రసంహితయందు నృసింహచరిత వర్ణనమనే పదియవ అధ్యాయము ముగిసినది (10).

11 – వీరభద్రుడు

నందీశ్వర ఉవాచః

ఏవమభ్యర్థితో దేవైర్మతిం చక్రే కృపాలయః ।
మహాతేజో నృసింహాఖ్యం సంహర్తుం పరమేశ్వరః ॥
తదూర్ధ్వం స్మృతవాన్ రుద్రో వీరభద్రం మహా బలమ్ ।
ఆత్మనో భైరవం రూపం ప్రాహ ప్రళయకారకమ్ ॥
ఆజగామ తతస్సద్యో గణానామ గ్రణీర్హసన్ ।
సాట్టహా సైర్గణ వరైరుత్పతద్భిరిత స్తతః ॥
నృసింహరూపా పైరత్యు గ్రైః కోటిభిః పరివారితః ।
మాద్యద్భిరభితో వీరైర్నృత్య ద్భిశ్చ ముదాన్వితైః ॥
క్రీడద్భిశ్చ మహావీరై ర్బ్రహ్మాద్యైః కందుకైరివ ।
అదృష్టపూర్వై రన్యైశ్చ వేష్టితో వీరవందితః ॥
కల్పాంత జ్వలన జ్వాలో విలసల్లో చనత్రయః ।
అశస్త్రో హి జటాజూటీ జ్వలద్బాలేందు మండితః ॥
బాలేందు వలయాకార తీక్ష్ణ దంష్ట్రాంకురద్వయః ।
ఆఖండల ధనుఃఖండా శని భభ్రూలతాన్వితః ॥
మహా ప్రచండహుంకార బధిరీకృత దిఙ్ముఖః ।
నీలమేఘాంజనశ్యామో భీషణశ్మశ్రులోఽద్భుతః ॥
వాద్య ఖండ మఖండా ఖాం భ్రామయంస్తి శిఖం ముహుః ।
వీరభద్రోఽపి భగవాన్ వీరశక్తి విజృంభితః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

దేవతలిట్లు ప్రార్థించగా, దయానిధియగు పరమేశ్వరుడు నృసింహరూపములోనున్న మహాతేజస్సును శమింపజేయ నిర్ణయించెను (1). తరువాత రుద్రుడు మహాబలశాలి, తనయొక్క భయావహమగు రూపము, ప్రళయమును చేయగలవాడు అగు వీరభద్రుని స్మరించెను (2). అపుడు వెంటనే ఆ గణాధ్యక్షుడు నవ్వుకుంటూ విచ్చేసెను. ఆతని చుట్టూ అట్ట హాసము చేయుచూ ఇటునటు గెంతుచున్న, భయంకరనృసింహరూపమును దాల్చియున్న. కోట్లాది గణవీరులు.. ఉండిరి. బలమదాన్వితులైన ఆ వీరులు ఆనందముతో నాట్యమును చేయుచుండిరి (3,4). ఆ మహావీరులు బ్రహ్మాదులను బంతి ఆట ఆడగల్గుదురు. వారింతకు ముందెన్నడు కనీవినని పరాక్రమమును కలిగి యుండిరి. ఆ వీరులు వీరభద్రుని చుట్టు ముట్టి వందనములాచరించుచుండిరి (5). ప్రళయకాలాగ్నితో సమమగు తేజస్సు గలవాడు, మూడునేత్రములతో ప్రకాశించువాడు, చేతిలో ఆయుధములు లేనివాడు, జటా జూటమును దాల్చినవాడు, ప్రకాశించే

బాలచంద్రుడు అలంకారముగా గలవాడు (6), చంద్రరేఖవలె వలయాకారముగా నున్న తీక్షమైన రెండు దంష్ట్రల అంకురములు గలవాడు, ఇంద్ర ధనస్సు యొక్క తునకలవలె భాసించు తీగలవంటి కనుబొమలు గలవాడు (7), మిక్కిలి ప్రచండమగు హుంకారముచే దిక్కులు చెముడు పొందునట్లు చేయువాడు, నల్లని మేఘమువలె, కాటుకవలె శ్యామలవర్ణము గలవాడు, భయంకర అద్భుతాకారుడు, మీసములు గలవాడు (8), అఖండ కాంతి గల త్రిశూలమును వాద్యవిశేషమును వలె పలుమార్లు త్రిప్పుచున్నవాడు అగు వీరభద్ర భగవానుడు వీరశక్తితో విజృంభించెను (9).

స్వయం విజ్ఞాపయామాస కిమత్ర స్మృతి కారణమ్ ।
ఆజ్ఞాపయ జగత్స్వామిన్ ప్రసాదః క్రియతామితి ॥
ఇత్యాకర్ణ్య మహేశానో వీరభద్రోక్త మాదరాత్ ।
విలోక్య వచనం ప్రీత్యా ప్రోవాచ ఖలదండధృక్ ॥

వీరభద్రుడు స్వయముగా శివునకు ఇట్లు విన్నవించెను: హే జగత్ప్రభూ! నన్ను స్మరించుటకు కారణమేమి? నన్ను అనుగ్రహించి ఆజ్ఞాపించుడు (10). దుష్టులను శిక్షించే మహేశ్వరుడు వీరభద్రుని ఈ పలుకులను విని ఆతనిని ఆదరముతో చూచి ప్రేమతో ఇట్లు పలికెను (11).

శంకర ఉవాచః

అకాలే భయముత్పన్నం దేవానామపి భైరవమ్ ।
జ్వలితస్య నృసింహాగ్ని శ్శమయైనం దురాసదమ్ ॥
సాంత్వయన్ బోధయాదౌ తం తేన కిం నోపశామ్యతి ।
తతో మత్పరమం భావం భైరవం సంప్రదర్శయ ॥
సూక్ష్మం సంహృత్య సూక్ష్మేణ స్థూలం స్థూలేన తేజసా ।
వక్త్రమానయ కృత్తిం చ వీరభద్ర మమాజ్ఞయా ॥

శంకరుడిట్లు పలికెను -

కాలము కాని కాలములో దేవతలకు కూడా మహాభయము సంప్రాప్తమైనది. నృసింహుని క్రోధాగ్ని మండుచునే యున్నది. సమీపింప శక్యము కాని ఆ అగ్నిని శాంతింప జేయుము (12). ముందు ఆతనికి మంచి మాటలతో నచ్చ జెప్పుము. అయిననూ ఆతడు శాంతించనిచో, అప్పుడు నా యొక్క పరమభయంకరమగు రూపమును ప్రదర్శించుము (13). ఆతని సూక్ష్మమగు పరాక్రమమును సూక్ష్మతేజస్సుతో మరియు స్థూలమగు పరాక్రమమును అదే విధమగు తేజస్సుతో ఉపశమింప జేయుము. ఓ వీరభద్రా! నా ఆజ్ఞచే ఆతని తలను, చర్మమును తీసుకొని రమ్ము (14).

నందీశ్వర ఉవాచః

ఇతి నిష్టో గణాధ్యక్షో(?) ప్రశాంతం వపురాస్థితః ।
జగామ రంహసా తత్ర యత్రాస్తే నరకేసరీ ॥
తతస్తం బోధయామాస వీరభద్రో హరో హరిమ్ ।
ఉవాచ వాక్యమీశానః పితా పుత్ర మివౌరసమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఈ విధముగా ఆదేశింపబడినవాడై గణాధ్యక్షుడగు వీరభద్రుడు ప్రసన్నమగు రూపమును దాల్చి నృసింహుడు ఉన్నచోటకు వేగముగా చేరుకొనెను (15). అపుడు పాపహరుడు, ఈశానస్వరూపుడు అగు వీరభద్రుడు ఆ నృసింహునకు కన్నకొడుకునకు వలె నచ్చచెప్పి ఇట్లు పలికెను (16).

వీరభద్ర ఉవాచః

జగత్సుఖాయ భగవన్నవతీర్ణోఽసి మాధవ ।
స్థిత్యర్థం త్వం ప్రయుక్తోఽసి పరేశః పరమేష్ఠినా ॥
జంతుచక్రం భగవతా ప్రచ్ఛిన్నం మత్స్యరూపిణా ।
పుచ్ఛేనైవ సమాబధ్య భ్రమన్నేకార్ణవే పురా ॥
బిభర్షి కర్మరూపేణ వారాహేణోద్ధృతా మహీ ।
అనేన హరిరూపేణ హిరణ్య కశిపుర్హతః ॥
వామనేన బలిర్బద్ధస్త్వయా విక్రమతా పునః ।
త్వమేవ సర్వభూతానాం ప్రభవః ప్రభురవ్యయః ॥
యదా యదా హి లోకస్య దుఃఖం కించిత్ ప్రజాయతే ।
తదా తదావతీర్ణస్త్వం కరిష్యసి నిరామయమ్ ॥
నాధికస్త్వత్సమోఽప్యస్తి హరే శివపరాయణః ।
త్వయా వేదాశ్చ ధర్మాశ్చ శుభమార్గే ప్రతిష్ఠితాః ॥
యదర్థమవతారోఽయం నిహతస్స హి దానవః ।
హిరణ్య కశిపుశ్చైవ ప్రహ్లాదోఽపి సురక్షితః ॥
అతీవ ఘోరం భగవన్నరసింహ వపుస్తవ ।
ఉపసంహర విశ్వాత్మంస్త్వమేవ మమ సన్నిధౌ ॥

వీరభద్రుడిట్లు పలికెను –

హే భగవాన్ ! లక్ష్మీపతీ! నీవు జగత్తుల సుఖము కొరకు అవతరించితివి. పరమేశ్వరుడు దేవదేవుడవగు నిన్ను జగద్రక్షణ కొరకు నియోగించినాడు (17). భగవంతుడవగు నీవు పూర్వము ప్రళయకాలములో సర్వము జలపూర్ణమై యుండగా మత్స్యరూపమును దాల్చి వివిధ ప్రాణులను నీ తోకతో ఒక చోటకు చేర్చి రక్షించితివి (18). నీవు యజ్ఞ వరాహరూపమును దాల్చి భూమిని పైకి లేవనెత్తితివి.

ఈ నృసింహరూపముతో హిరణ్యకశిపుని సంహరించితివి (19). నీవు వామనుడవై అడుగులతో బ్రహ్మాండమును కొలిచి బలిని బంధించితివి. ప్రాణులన్నింటికి ఉత్పత్తి స్థానము నీవే. అవినాశియగు నీవే జగత్ప్రభుడవు (20). ఏ ఏ సమయములలో జగత్తునకు కొంత దుఃఖము కలుగునో, ఆయా సమయములలో నీవు అవతరించి ఆ దుఃఖహేతువును తొలగించెదవు (21). ఓ హరీ! శివ భక్తిలో నీతో సమానమగువాడు గాని, నిన్ను మించినవాడు గాని లేడు. నీవు ధర్మములను, వేదములను మంగళకరమగు మార్గములో నిలబెట్టితివి (22). నీవీ అవతారమును ఎందులకు స్వీకరించితివో, ఆ హిరణ్యకశిపుడనే రాక్షసుడు సంహరింపబడి ప్రహ్లాదుడు చక్కగా రక్షింపబడినాడు (23). హే భగవాన్! నీ ఈ నృసింహ దేహము మిక్కిలి భయంకరముగానున్నది. హే జగద్రూపా! నీవు నా సన్నిధిలో నిశ్చయముగా దీనిని ఉపసంహరించుము (24).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తో వీరభద్రేణ నృసింహశ్శాంతయా గిరా ।
తతోఽధికం మహాఘోరం కోపం చక్రే మహామదః ॥
ఉవాచ చ మహాఘోరం కఠినం వచనం తదా ।
వీరభద్రం మహావీరం దంష్ట్రా భీషయన్ మునే ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

వీరభద్రుడు శాంతమగు వాక్కుతో నిట్లు పలుకగా, మిక్కిలి గర్వించియున్న నృసింహుడు అంతకు ముందున్న దానికంటే అధికముగా మిక్కిలి భయమును గొల్పు కోపమును ప్రదర్శించెను (25). ఓ మునీ! అపుడు నృసింహుడు తన దంష్ట్రలతో భయమును కలిగించుచూ మిక్కిలి ఘోరము కఠినము అగు వాక్కును మహావీరుడగు వీరభద్రుని ఉద్దేశించి పలికెను (26).

నృసింహ ఉవాచః

ఆగతోఽసి యతస్తత్ర గచ్ఛ త్వం మా హితం వద ।
ఇదానీం సంహరిష్యామి జగదేతచ్చరాచరమ్ ॥
సంహర్తుం నహి సంహారః స్వతో నా పరతోఽపి వా ।
శాసితం మమ సర్వత్ర శాస్తా కోఽపి న విద్యతే ॥
మత్ప్రసాదేన సకలమభయం హి ప్రవర్తతే ।
అహం హి సర్వశక్తీనాం ప్రవర్తక నివర్తకః ॥
యద్యద్విభూతిమత్సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।
తత్తద్విద్ధి గణాధ్యక్ష మమ తేజో విజృంభితమ్ ॥
దేవతా పరమార్థజ్ఞం మామేవ పరమం విదుః ।
మదంతా శ్శక్తి సంపన్నా బ్రహ్మ శక్రాదయస్సురాః ॥



మన్నాభికమలా జ్జాతః పురా బ్రహ్మో జగత్కరః ।
సర్వాధికస్స్వతంత్రశ్చ కర్తా హర్తాఖిలేశ్వరః ॥
ఇదం తు మత్పరం తేజః కిం పునశ్శ్రోతుమిచ్ఛసి ।
అతో మాం శరణం ప్రాప్య గచ్ఛ త్వం విగతజ్వరః ॥
అవేహి పరమం భావ మిదం భూతం గణేశ్వర ।
మామకం సకలం విశ్వం సదేవాసుర మానుషమ్ ॥
కాలోఽస్మ్యహం లోక వినాశహేతుః లో కాన్ సమాహర్తుమహం ప్రవృత్తః ।
మృత్యోర్మృత్యుం విద్ధి మాం వీరభద్ర జీవన్త్యైతే మత్ప్ర సాదేన దేవాః ॥

నృసింహుడిట్లు పలికెను -

ఎక్కనుండి వచ్చితివో, నీవు అచటికే పొమ్ము. నాకు హితమును బోధించకుము. ఈ స్థావరజంగమాత్మకమగు జగత్తును ఈ క్షణములో నశింపజేసెదను (27). నన్ను నేను గాని, ఇతరులు గాని ఉపసంహరించుట సంభవము గాదు. నా శాసనము సర్వత్రా ప్రసరించును. నన్ను ఏ విషయములోనైననూ శాసించగలవాడు లేనే లేడు (28). నా అనుగ్రహము చేతనే సర్వము భయము లేకుండగా నడుచుచున్నది. శక్తులనన్నిటినీ ప్రేరేపించువాడను, ఉపసంహరించువాడను నేనే (29). ఓ గణాధిపతీ! ఈ జగత్తులో మహిమ, శోభ, సంపద, శక్తి గల ఏ ప్రాణి గలదో, అవి అన్నియూ నా తేజస్సు యొక్క విలాసయేనని ఎరుంగుము (30). పరమతత్త్వము నెరింగిన పరమాత్మను నేనే నని దేవతలు ఎరుంగుదురు. బ్రహ్మ ఇంద్రుడు మొదలగు దేవతలు నా అంశంనుండి జన్మించి శక్తిని పొందియున్నారు (31). జగత్తుని సృజించే బ్రహ్మ పూర్వము నా నాభియందలి కమలమునుండి ఉద్భవించినాడు. సర్వులకంటె అధికుడు, స్వతంత్రుడు, సృష్టికర్త మరియు సంహర్త అగు సర్వేశ్వరుడు నేనే (32). ఈ అవతారము నా సర్వాధికతేజోరూపము. ఇంకనూ ఏమి వినగోరుచున్నావు? కావున నీవు నన్ను శరణు పొంది భయాది జ్వరములను తొలగించుకొని వెళ్లుము (33). ఓ గణాధ్యక్షా! ఈ విధముగ నున్న పరమసత్యమునెరుంగుము. దేవతలు, రాక్షసులు మరియు మనుష్యులతో గూడియున్న జగత్తు అంతయూ నాదే (34). లోకముల వినాశమునకు కారణమగు మృత్యువు నేనే. నేను లోక సంహారము కొరకు ప్రవర్తిల్లుచున్నాను. ఓ వీరభద్రా! నేను మృత్యువునకు కూడ మృత్యువునని యెరుంగుము. ఈ దేవతలు నా అనుగ్రహము చేతనే జీవించియున్నారు (35).

నందీశ్వర ఉవాచః

సాహంకారం వచః శ్రుత్వా హరేరమిత విక్రమః ।

విహ స్యోవాచ సావజ్ఞం తతో విస్ఫురితాధరః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

సాటిలేని పరాక్రమము గల వీరభద్రుడు అహంకారముతో గూడియున్న నృసింహుని యొక్క మాటలను విని కోపముతో వణకుచున్న క్రింది పెదవి గలవాడై అనాదరణ పూర్వకముగా నవ్వి ఇట్లు పలికెను (36).

వీరభద్ర ఉవాచః

కిం న జానాసి విశ్వేశం సంహర్తారం పినాకినమ్ ।

అసద్వాదో వివాదశ్చ వినాశస్త్వయి కేవల: ॥

తవాన్యాన్యవతారాణి కాని శేషాణి సాంప్రతమ్ ।

కృతాని యేన కేనైవ కథా శేషా భవిష్యతి ॥

దోషం తం వద యేన త్వమవస్థా మీదృశీం గతః ।

తేన సంహార దక్షేణ దక్షిణాశేష(శ)మేష్యసి ॥

ప్రకృతిస్త్వం పుమాన్ రుద్రస్త్వయి వీర్యం సమాహితమ్ ।

త్వన్నాభిపంక జాజ్జాతః పంచవక్త్రః పితామహః ॥

జగత్త యీ సర్జనార్థం శంకరం నీలలోహితమ్ ।

లలాటేఽచింతయత్సోఽయం తపస్యుగ్రేచ సంస్థితః ॥

తల్లలాటా దభూచ్ఛంభు స్సృష్ట్యర్థే తేన భూషణమ్ ।

అతోఽహం దేవదేవస్య తస్య భైరవరూపిణః ॥

త్వత్సంహారే నియుక్తోఽస్మి వినయేన బలేన చ ।

దేవదేవేన రుద్రేణ సకలప్రభుణా హరే ॥

వీరభద్రుడిట్లు పలికెను –

పినాకధారి, లయకర్త, విశ్వేశ్వరుడునగు శివుని యెరుంగవా? నీయందు చెడ్డ వాదము, కలహము మరియు వినాశలక్షణము మాత్రమే కానవచ్చుచున్నవి (37). నీవు స్వీకరించవలసిన అవతారములింకనూ ఇపుడు ఏమి మిగిలియున్నవి? ఎవరో ఒకరు వాటిని ధరించినచో కథ పరిసమాప్తమగును (38). నీవిట్టి అవస్థను పొందుటకు హేతువు అగు దోషమెయ్యదియో చెప్పుము. సంహారసమర్థుడగు ఆ ప్రభువు తలచుకున్నచో నీకు మిగిలిన దక్షిణ ముట్టగలదు లేదా, యముని వద్దకు చేరగలవు (39). నీవు ప్రకృతివి. శివుడు పురుషుడు. నీయందు బీజము నిక్షిప్తమైనది. నీ నాభియందలి పద్మమునుండి అయిదు మోముల పితామహుడు జన్మించినాడు (40). ఆతడు జగత్తును సృష్టించుట కొరకై ఉగ్రమగు తపస్సును చేసి నీలలోహితుడగు శంకరుని లలాటస్థానమునందు ధ్యానించినాడు (41). అపుడు

శంభుడు సృష్టికొరకై అతని లలాటమునుండి జన్మించినాడు. దేవదేవుడు, భైరవరూపుడు అగు ఆ శివునకు అలంకారము అగు నేను శివుని గణాధ్యక్షులలో ఒకడిని (42). ఓ నృసింహా! నీకు శాంతముగా నచ్చజెప్పుమనియు, లేదా బలమును ప్రయోగించుమనియు దేవదేవుడు, సర్వజగత్ప్రభుడు అగు రుద్రుడు నన్ను నియోగించినాడు (43).

ఏకం రక్షో విదార్యైవ తచ్ఛక్తి కలయా యుతః ।
అహంకారావలేపేన గర్జసి త్వమతంద్రితః ॥
ఉపకారో హి సాధూనాం సుఖాయ కిల సంమతః ।
ఉపకారో హ్యసాధూనామపకారాయ కేవలమ్ ॥
యన్నృసింహ మహేశానం పునర్భూతం తు మన్యసే ।
తర్హ్యజ్ఞానీ మహా గర్వీ వికారీ సర్వథా భవాన్ ॥
నత్వం స్రష్టా న సంహర్తా భర్తాపి న నృసింహక ।
పరతంత్రో విమూఢాత్మా న స్వతంత్రోహి కుత్రచిత్ ॥
కులాలచక్రవచ్ఛక్త్యా ప్రేరితోఽసి పినాకినా ।
నానావతారకర్తా త్వం తదధీనస్సదా హరే ॥
అద్యాపి తవ నిక్షిప్తం కపాలం కూర్మ రూపిణః ।
హరహారలతా మధ్యే దగ్ధః కశ్చిన్న వధ్యతే ॥
విస్మృతః కిం తదంశేన దంష్ట్రోత్పాడన పీడితమ్ ।
వారాహ విఘ్నహస్తేఽద్య యాక్రోశాం తారకారిణా ॥

ఆ శివుని శక్తిలోని లేశమును పొంది ఒకే ఒక రాక్షసుని చీల్చి చంపి శ్రమనెరుగని వాడవై అహంకారముతో, గర్వముతో గర్జించుచున్నావు (44). సాధువులకు ఉపకారమును చేసినచో సుఖము కలుగుననుట నిర్వివాదము. కాని దుష్టులకు ఉపకారమును చేసినచో కేవలము అపకారము మాత్రమే లభించును (45). ఓ నృసింహా! మహేశ్వరుడు జన్మించినాడని నీవు తలంచినచో, నీవు సర్వవిధములుగా అజ్ఞానివి, పెద్ద గర్వము గలవాడవు, మరియు మనోవికారము గలవాడవని స్పష్టమగుచున్నది (46). ఓయీ నృసింహా! నీవు సృష్టికర్తవు గాదు. లయకర్తవు గాదు, స్థితికర్తవు గాదు, నీవు అస్వతంత్రుడవు, మరియు మోహమును పొందిన బుద్ధి గలవాడవు. నీకు ఎచ్చటనైననూ. స్వాతంత్ర్యము లేదు (47). ఓ హరీ! పినాకి కుమ్మరి చక్రమును వలె నిన్ను తన శక్తిచే ప్రేరేపించగా, నీవు అనేక అవతారములను దాల్చితివి. సర్వకాలములలో నీవు ఆయనకు వశుడవై యున్నావు (48). కూర్మరూపధారివగు నీ కపాలము శివుని మెడలోని హారములో ఇంకనూ నిహితమై యున్నది. నీవు ఇంకనూ ఇతరులనెవ్వరినీ సంహరించలేదు గదా! (లేదా, దహింపబడిన వానిని మరల వధించుట సంభవము కాదు?) (49) నీవు వరాహావతారమును స్వీకరించినపుడు తారకసంహారియగు కుమారస్వామి నీ

కోరలను పీకి నీకు దుఃఖమును కలిగించినాడు. నీవావిషయమును కొంతవరకు విస్మరించితివా యేమి? (50)

దగ్ధోఽసి పశ్య శూలాగ్నేర్విష్వక్సేనచ్ఛలాద్భవాన్ ।
దక్షయజ్ఞే శిరశ్ఛిన్నం మయా తేజస్స్వరూపిణా ॥
అద్యాపి తవ పుత్రస్య బ్రహ్మణః పంచమం శిరః ।
ఛిన్నం న సజ్జితం భూయో హరే తద్విస్మృతం త్వయా ॥
నిర్జితస్త్వం దధీచేన సంగ్రామే సమరుద్గణమ్ ।
కండూయమానే శిరసి కథం తద్విస్మృతం త్వయా ॥
చక్రం విక్రమతో యస్య చక్రపాణే తవ ప్రియమ్ ।
కుతః ప్రాప్తం కృతం కేన త్వయా తదపి విస్మృతమ్ ॥
యే మయా సకల లోకా గృహీతాస్త్వం పయోనిధౌ ।
నిద్రపరవశశ్శేషే స కథం సాత్త్వికో భవాన్ ॥
త్వదాదిస్తంబపర్యంతం రుద్రశక్తి విజృంభితమ్ ।
శక్తిమానభితస్త్వం చ హ్యనలాత్త్వం విమోహితః ॥
తత్తే జసో హి మాహాత్మ్యం పుమాన్ ద్రష్టుం న హి క్షమః ।
అస్థూలా యే ప్రపశ్యంతి తద్విష్ణోః పరమం పదమ్ ॥

హే విష్ణో ! నీవు అస్త్ర మహిమచే అనేక నారాయణులను సృష్టించగా నేను త్రిశూలమునుండి పుట్టిన అగ్నితో దహించి వేసితిని. తేజస్స్వరూపుడనగు నేను దక్షయజ్ఞములో దక్షుని శిరస్సును నరికితిని (51). ఓ హరీ! నేను నీ కుమారుడగు బ్రహ్మ యొక్క అయిదవ తలను దునిమితిని. అది ఇంకనూ అతుకు కొనకుండగా అటులనే యున్నది. నీవా విషయమును విస్మరించితివి (52). దధీచమహర్షి దేవగణములతో గూడియున్న నిన్ను యుద్ధములో జయించినాడు. నీవు తలను గోకుకొనుచుంటివి. నీవా విషయమునెట్లు మరచితివి? (53) ఓ చక్రపాణీ! నీవు పరాక్రమించి ప్రయోగించిన చక్రము ఎచటకు పోయినది? ఎవరు దానిని ఏమి చేసిరి? నీవా విషయమును కూడా విస్మరించితివి (54). ఈ సకలలోకముల భారమును నేను స్వీకరించినాను. నీవు క్షీరసముద్రమునందు నిద్రలో మునిగియున్నావు. అట్టి నీవు సత్త్వగుణ ప్రధానుడవు ఎట్లు అయితివి? (55) నీతో మొదలిడి తృణము వరకు గల జగత్తు రుద్రుని శక్తిచే విజృంభించుచున్నది. చుట్టువారియున్న ఈ జ్వాలలతో గూడిన నీ శక్తి కూడా రుద్రుని నుండియే లభించినది. కాని నీవు మిక్కిలి మోహమును పొంది యున్నావు (56). ఆ తేజస్సు యొక్క మాహాత్మ్యమును మానవుడు దర్శింపజాలడు. విష్ణువు కంటె ఉత్కృష్టమైన శివుని ధామమును సూక్ష్మదృష్టిగలవారు మాత్రమే దర్శించెదరు (57).

ద్యావాపృథివ్యా ఇంద్రాగ్నేర్యమస్య వరుణస్య చ ।

ధ్వాంతో దరే శశాంకే చ జనితా పరమేశ్వరః ॥

కాలోఽసి త్వం మహాకాలః కాలకాలో మహేశ్వరః ।

అతస్త్వముగ్ర కలియా మృత్యోర్మృత్యుర్భ విష్యసి ॥

స్థిరోఽద్య త్వక్షరో వీరో వీరో విశ్వావకః ప్రభుః ।

ఉపహంతా జ్వరం భీమో మృగః పక్షీ హిరణ్మయః ॥

శాస్తాఽశేషస్య జగతస్త్వం నైవ చతుర్ముఖః ।

నాన్యే చ కేవలం శంభుస్సర్వశాస్తా న సంశయః ॥

ఇష్టం సర్వం సమాలోక్య సంహరాత్మానమాత్మనా ।

వినష్టం న త్వమాత్మానం కురు హే నృహరే బుధ ॥

నో చేది దానీం క్రోధస్య మహాభైరవరూపిణః ।

వజ్రాశనిరివ స్థాణౌ త్వయి మృత్యు: పతిష్యతి ॥

స్వర్గలోక భూలోకములను, ఇంద్రాగ్నియమవరుణాది దేవతలను సృష్టించి, చీకటి్తో నిండియున్న చంద్రుని యందు కాంతిని నింపినవాడు ఆ పరమేశ్వరుడే (58). నీవు కాలుడవు. కాని మహేశ్వరుడు మహాకాలుడు, మరియు కాలునకు కాలుడు. కావున నీవు ఉగ్రుడగు శివుని అంశను పొంది మృత్యువునకు మృత్యువు కాగలుదువు (59). నీవు వీరుడవు. ఇచట స్థిరముగ నుండుము. వీరుడు, జగద్రక్షకుడు, భయంకరుడు, తేజ్స్వరూపుడునగు శివ ప్రభుడు మృగపక్షుల సమాహార రూపమును దాల్చి నీ గర్వమునడంచగలడు (60). కావున సమస్త జగత్తు యొక్క శాసకుడవు నీవు గాని, చతుర్ముఖ బ్రహ్మ గాని కాదు. ఇతరులు కూడా కాదు. శంభుడొక్కడే సర్వశాసకుడనుటలో సందియము లేదు (61). కావున ఈ విషయమునంతనూ నీవు పరిశీలించి నీ అంతట నీవే ఉగ్రరూపమును ఉపసంహరించుము. ఓ నృసింహా! నీవు బుధుడవు. నీ వినాశమును నీవే కొని తెచ్చుకొనుట తగదు (62). నీవు అట్లు చేయనిచో, ఈ క్షణములోనే మహాభయంకరాకారుడగు శివుని క్రోధము యొక్క ప్రభావముచే చెట్టు పై పిడుగువలె నీపై మృత్యువు పడగలదు (63).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా వీరభద్రోఽపి విరరామాకుతో భయః ।

దృష్ట్వా నృసింహాభిప్రాయం క్రోధమూర్తి శ్శివస్య సః॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం శరభావతార వర్ణనం నామ ఏకాదశోఽధ్యాయః (11).

నందీశ్వరుడిట్లు పలికెను -

శివుని క్రోధమునుండి పుట్టినవాడు, దేనికీ భయపడనివాడు నగు ఆ వీరభద్రుడు ఇట్లు పలికి, నృసింహుని అభిప్రాయమును గని, మిన్నకుండెను (64).

12 - శరభావతారము

సనత్కుమార ఉవాచః

నందీశ్వర మహాప్రాజ్ఞ విజ్ఞాతం తదనంతరమ్ ।
మమోపరి కృపాం కృత్వా ప్రీత్యా త్వం తద్వదాధునా ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ నందీశ్వరా! నీవు మహాబుద్ధిశాలివి. తరువాతి వృత్తాంతము నీకు తెలియును. నా యందు దయను చేసి ప్రీతితో నాకా వృత్తాంతమును నీవు ఇపుడు చెప్పుము (1).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తో వీర భద్రేణ నృసింహః క్రోధవిహ్వలః ।
వినదన్నను వేగేన తం గ్రహీతుం ప్రచక్రమే ॥
అత్రాంతరే మహాఘోరం ప్రత్యక్ష భయకారణమ్ ।
గగనవ్యాపి దుర్ధర్షం శైవతేజస్స ముద్భవమ్ ॥
వీరభద్రస్య తద్రూప మదృశ్యం తు తతః క్షణాత్ ।
తద్వై హిరణ్మయం సౌమ్యం న సౌరం నాగ్ని సంభవమ్ ॥
న తడిచ్చంద్రసదృశ మనౌపమ్య మహేశ్వరమ్ ।
తదా తేజాంసి సర్వాణి తస్మింల్లీనాని శంకరే ॥॥
న తద్వ్యోమ మహత్తేజో వ్యక్తాంతశ్చా భవత్తతః ।
రుద్రసాధారణం చైవ చిహ్నితం వికృతాకృతి ॥
తతస్సంహార రూపేణ సువ్యక్తం పరమేశ్వరః ।
పశ్యతాం సర్వదేవానాం జయశబ్దాదిమంగలైః ॥
సహస్ర బాహుర్జటిలశ్చంద్రార్ధ కృతశేఖరః ।
సమృద్ధో గ్రశరీరేణ పక్షాభ్యాం చంచునా ద్విజః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

వీరభద్రుడిట్లు పలుకగా, క్రోధపీడితుడైన నృసింహుడు వెంటనే నినాదమును చేయుచూ వీరభద్రుని వేగముగా పట్టుకొనుటకు ప్రయత్నించెను (2). ఇంతలో వీరభద్రుని ఆ రూపము క్షణములో అంతర్ధానమయ్యెను. దాని స్థానములో మిక్కిలి క్రూరమైనది, చూడగనే భయమును గొల్పునది, ఆకాశము వలె వ్యాపకమైనది, అడ్డుకొన శక్యము కానిది, శివుని తేజస్సునుండి పుట్టినది అగు ఆకారము ప్రత్యక్షమయ్యెను. ఆ ఆకారము తేజస్సుతో నిండి యుండెను. ఆ తేజస్సు అగ్ని సూర్యచంద్రుల తేజస్సు కంటే విలక్షణముగ నుండెను (3,4). మెరుపుతోనైననూ దానిని పోల్చుట కుదరదు. మహేశ్వర స్వరూపమగు ఆ

తేజస్సునకు సాటిలేదు. అపుడు తేజస్సులన్నియు ఆ శంకర తేజస్సునందు విలీనమయ్యెను (5). ఆ మహాతేజస్సును దాల్చుటకు ఆకాశమునకైననూ సాధ్యము కాకుండెను. ఆ తేజస్సు వికృతమగు ఆకారమును దాల్చియున్ననూ రుద్రునితో సమమగు చిహ్నములను కలిగియుండెను (6). ఇట్లు దేవతలందరు గొంతి జయశబ్దమును, ఇతరమంగళధ్వనులను చేయుచుండగా పరమేశ్వరుడు సంహారరూపముతో ఆవిర్భవించెను (7). వేయి బాహువులు కలది, జటలు కలది, చంద్రవంకచే అలంకరింపబడిన శిరస్సు గలది అగు ఆ ఆకారము భయంకరమగు పెద్ద శరీరముతో రెండు రెక్కలతో ముక్కుతో పక్షి ఆకారములో నుండెను (8).

అతితీక్ష్ణోక్షే మహాదంష్ట్రో వజ్రతుల్య నఖాయుధః ।
కంఠే కాలో మహాబాహు శ్చతుష్పాద్వహ్ని సన్నిభః ॥
యుగాంతో ద్యత జీమూత భీమ గంభీర నిస్వనః ।
మహాకుపిత కృత్యాగ్ని వ్యావృత్త నయనత్రయః ॥
స్పష్ట దంష్ట్రా స్వరూపశ్చ హ్యుగ్ర ఆవిర్బభూవ హ ॥
హరిస్తద్దర్శనా దేవ వినష్టబలవిక్రమః ।
బిభ్రద్ధామ సహస్రాంశో రధః ఖద్యోత విభ్రమమ్ ॥
అథ విభ్రమ్య పక్షాభ్యాం నాభిపాదాన్ విదారయన్ ।
పాదాన్ బబంధ పుచ్ఛేన బాహు భ్యాం బాహుమండలమ్ ॥
భిందన్నురసీ బాహుభ్యాం నిజగ్రాహ హరో హరిమ్ ।
తతో జగామ గగనం దేవైస్సహ మహర్షిభిః ॥
సహసైవాభ్యయాద్విష్ణుం స హి శ్యేన ఇవోరగమ్ ।
ఉత్ క్షిప్యోత్ క్షిప్య సంగృహ్య ని పాత్య చ నిపత్య చ ॥

మిక్కిలి వాడియగు పెద్ద దంష్ట్రలు గలది, వజ్రముల వంటి నఖములే ఆయుధములుగా గలది, కంఠమునందు నల్లని మచ్చ గలది, పెద్ద బాహువులు గలది, నాలుగుపాదములు గలది, అగ్ని వలె ప్రకాశించునది (9), ప్రళయకాలములో వర్షించుటకు సిద్ధముగా నున్న మేఘముల గర్జనల వలే భయమును గొల్పు ఘీంకారము గలది. మిక్కిలి కోపించిన రాక్షసస్త్రీ వలె నిప్పులు గ్రక్కుచున్న మూడు కన్నులను ఇటునటు త్రిప్పుచున్నది (10), దంష్ట్రలు పొడుచుకువచ్చిన క్రింది పెదవి గలది, హుంకార శబ్దమును చేయుచున్నది, భయంకరమైనది అగు ఇట్టి ఆకారముతో శివుడు ఆవిర్భవించెను (11). ఆ ఆకారమును చూచిన మాత్రముననే విష్ణువు తన బలపరాక్రమములను గోల్పోయెను. సూర్యమండలమును స్పృశించే ఆ రూపము సూర్యుని ప్రకాశము వెల వెలబోవునట్లు చేసెను (12). అపుడా ఆకారము నృసింహుని రెక్కలతో త్రిప్పి పాదములను నేలపై కొట్టి, తోకతో పాదములను, బాహువులతో బాహువులను వక్షస్థలమును బంధించివేసెను (13). అపుడు శివుడు బాహువులతో వక్షస్థలముపై కొట్టి నృసింహుని ఒడిసి పట్టెను. కాని నృసింహుడు దేవతలతో మరియు మహర్షులతో .గూడి ఆకసమున ఎగసెను (14). అపుడు శివుడు వెంటనే విష్ణువు వెనుక వేగముగా వెళ్లి గ్రద్ద పామును వలే పట్టుకొని అనేక పర్యాయములు పైకి ఎత్తి నేలపై పారవైచెను (15).

ఉడ్డియోడ్డీయ భగవాన్ పక్షఘాత విమోహితమ్ ।
హరిం హరస్తం వృషభం వివేశానంత ఈశ్వరః ॥
అనుయాంతం సురాస్సర్వే నమోవాక్యేన తుష్టువుః ।
ప్రణేముస్సాదరం ప్రీత్యా బ్రహ్మాద్యాశ్చ మునీశ్వరాః ॥
నీయమానః పరవశో దీనవక్త్రః కృతాంజలిః ।
తుష్టావ పరమేశానం హరిస్తం లలితాక్షరైః ॥
నామ్నామష్టశతేనైవ స్తుత్వా తం మృడమేవ చ ।
పునశ్చ ప్రార్థయామాస నృసింహశ్శర భేశ్వరమ్ ॥
యదా యదా మమా జ్ఞేయం మతిస్స్యాద్గర్వదూషితా ।
తదా తదాపనే తవ్యా త్వయైవ పరమేశ్వర ॥
ఏవం విజ్ఞాపయన్ ప్రీత్యా శంకరం నరకేసరీ ।
నత్వా శక్తోఽభవద్విష్ణు ర్జీవి తాంతపరాజితః ॥
తద్వక్త్రం శేషగా త్రాం తం కృత్వా సర్వస్వవిగ్రహమ్ ।
శక్తియుక్తం తదీయాంగం వీరభద్రః క్షణాత్తతః ॥
అథ బ్రహ్మాదయో దేవాశ్శారభం రూపమాస్థితమ్ ।
తుష్టువు శ్శంకరం దేవం సర్వలోకైక శంకరమ్ ॥

గాలిలో ఎగురుతూ అనంతుడు, ఈశ్వరుడు అగు హరభగవానుడు శ్రేష్ఠుడగు ఆ హరిని లాగుకొని పోయి తన రెక్కలతో కొట్టి మూర్ఛిల్లునట్లు చేసి ఆకాశమును ప్రవేశించెను (16). నృసింహుని వెనుక పడిన శివుని బ్రహ్మాది దేవతలు మరియు మహర్షులు అందరు సాదరముగా ప్రీతితో నమస్కరించి స్తోత్రపాఠము (నమకము) లతో స్తుతించిరి (17). శివునిచే బలాత్కారముగా తీసుకొని వెళ్లబడుచున్న హరి దీనముఖుడై చేతులు జోడించి ఆ పరమేశ్వరుని సుందరమగు పదములతో గూడిన స్తోత్రములతో స్తుతించెను (18). నృసింహుడు శరభేశ్వరుని రూపములోనున్న శివుని అష్టోత్తరశతనామములతో స్తుతించి మరల ఇట్లు ప్రార్థించెను (19). ఓ పరమేశ్వరా ! అజ్ఞానముతో నిండియున్న నా ఈ మనస్సు ఏ ఏ సమయములలో గర్వముచే కలుషితమగునో, ఆయా సమయములలో నీవే ఆ గర్వమును తొలగించుచుండుము (20). పరాజితుడై ప్రాణాంతక స్థితిలోనున్న ఆ నృసింహుడు శంకరునికి ప్రీతితో ఇట్లు విన్నవించుకొని మరల శక్తిని పొంది విష్ణురూపమును పొందెను (21). అపుడు వీరభద్రుడు ఆ నృసింహదేహము యొక్క తలను మిగిలిన దేహము నుండి క్షణకాలములో వేరుచేసి శక్తిమంతుడగు ఆతనిని నిర్వీర్యుని చేసెను (22). సర్వలోకములకు ఏకైక మంగళ ప్రదాత, శరభావతారములో నున్నవాడు అగు ఆ శంకరదేవుని అపుడు బ్రహ్మాది దేవతలు స్తుతించిరి (23).

దేవా ఊచుః ।

బ్రహ్మవిష్ణ్వింద్ర చంద్రాది సురాస్సర్వే మహర్షయః ।
దితి జాద్యా సంప్రసూతాస్త్వత్తస్సర్వే మహేశ్వర ॥
బ్రహ్మవిష్ణు మహేంద్రాంశ్చ సూర్యా ద్యానసురాన్ సురాన్ ।
త్వం వై సృజసి పాస్యత్సి త్వమేవ సకలేశ్వరః ॥
యతో హరసి సంసారం హర ఇత్యుచ్యతే బుధైః ।
నిగృహీతో హరిర్యస్మాద్ధర ఇత్యుచ్యతే బుధైః ॥
యతో బిభర్షి సకలం విభజ్య తనుమష్టధా ।
అతోఽస్మాన్ పాహి భగవన్ సురాన్ దానై రభీప్సితైః ॥
త్వం మహాపురుషశ్శంభు స్సర్వే శస్సురనాయకః ।
నిస్స్వాత్మా నిర్వికారాత్మా పరబ్రహ్మ సతాంగతిః ॥
దీనబంధుర్దయాసింధు రద్భుతోతిః పరాత్మదృక్ ।
ప్రాజ్ఞో విరాట్ విభుస్సత్య స్సచ్చిదానంద లక్షణః ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ మహేశ్వరా! బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, చంద్రుడు మొదలగు సకల దేవతలు, మహర్షులు, రాక్షసులు మొదలగు వారందరు నీనుండియే జన్మించిరి (24). బ్రహ్మ, విష్ణువు, మహేంద్రుడు, సూర్యుడు మొదలగు దేవతలను మరియు అసురులను నీవే సృష్టించి, పాలించి, ఉపసంహరించుచున్నావు. నీవు సర్వేశ్వరుడవు (25). నీవు సంసారమును పోగొట్టెదవు గాన నీకు హరుడని పేరు వచ్చినదని పండితులు చెప్పెదరు. నీవు హరిని నిగ్రహించినావు గాన హరుడవైనావనియు పండితులు చెప్పెదరు (26). ఓ భగవాన్! నీవు నీ శరీరమును అష్టమూర్తులుగా విభజించి బ్రహ్మాండము నంతనూ ధరించియున్నావు. కావున దేవతలమగు మమ్ములను అభీష్టవరములనిచ్చి కాపాడుము (27). నీవు పురుషోత్తముడవు, మంగళస్వరూపుడవు, సర్వేశ్వరుడవు, దేవదేవుడవు, స్వార్థమునెరుంగని వాడవు, వికారహీనమగు స్వరూపము గలవాడవు, పరబ్రహ్మవు, సత్పురుషులకు శరణ్యుడవు (28). దీనులకు బంధుడవు, దయా సముద్రుడవు, అద్భుతమగు లీలలు గలవాడవు, ధ్యానములో పరాత్మను దర్శించువాడవు, జ్ఞానస్వరూపుడవు, విరాట్ స్వరూపుడవు, సర్వవ్యాపివి, సత్యరూపుడవు, సచ్చిదానంద స్వరూపుడవు అయి ఉన్నావు (29).

నందీశ్వర ఉవాచః

ఇత్యాకర్ణ్య వచశ్శంభుర్దేవానాం పరమేశ్వరః ।
ఉవాచ తాన్ సురాన్ దేవ మహర్షింశ్చ పురాతనాన్ ॥
యథా జలం జలే క్షిప్తం క్షీరే క్షీరం ఘృతే ఘృతమ్ ।
ఏక ఏవ తథా విష్ణుశ్శివే లీనో న చాన్యథా ॥
ఏకో విష్ణుర్నృసింహాత్మా సదర్పశ్చ మహాబలః ।
జగత్సంహారకరణే ప్రవృత్తో నరకేసరీ ॥
ప్రార్థనీయో నమస్తస్మై మద్భక్తైస్సిద్ధి కాంక్షిభిః ।
మద్భక్త ప్రవరశ్చైవ మద్భక్తవరదాయకః ॥
ఏతావదుక్త్వా భగవాన్ పక్షి రాజో మహాబలః ।
పశ్యతాం సర్వదేవానాం తత్రైవాంతర ధీయత ॥
వీరభద్రోఽపి భగవాన్ గణాధ్యక్షో మహాబలః ।
నృసింహకృత్తిం నిష్కృష్య సమాదాయ యయౌ గిరిమ్ ॥
నృసింహ కృత్తి వసనస్తదా ప్రభృతి శంకరః ।
తద్వక్త్రం ముండమాలాయాం నాయకత్వేన కల్పితమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

పరమేశ్వరుడగు శంభుడు దేవతల ఈ మాటను విని, ఆ దేవతలను దేవర్షులను మరి◌ియు పురాతనులగు మహర్షులను ఉద్దేశించి ఇట్లు పలికెను (30). జలమును జలములో, పాలను పాలలో మరియు నేతిని నేతిలో పోసినచో అవి ఏకమగును. అటులనే విష్ణువు శివునిలో లీనమై ఏకమగును. ఈ విషయములో సందేహము వలదు (3 1). విష్ణువు నృసింహరూపమును దాల్చి మహాబలముచే గర్వితుడై ఒంటరిగా జగత్తును సంహరించే కార్యమును ఆరంభించబోయెను (32). నృసింహునకు నమస్కారము. ఈ నృసింహుడు నిశ్చయముగా సిద్ధిని పొందు నా భక్తులచే ప్రార్థింపబడగలడు. నా భక్తులలో శ్రేష్ఠుడగు ఈతడు నా భక్తులకు వరముల నీయగలడు (33). మహాబలశాలియగు పక్షిరూపములో నున్న ఆ భగవానుడు ఇంతమాత్రమే పలికి దేవతలందరు చూచుచుండగా అచటనే అంతర్ధానమయ్యేను (34). గణాధ్యక్షుడు, మహాబలవంతుడు నగు వీరభద్ర భగవానుడు కూడా నృసింహ చర్మమును ఊడబీకి దానిని తీసుకొని కైలాసమునకు వెళ్లెను (35). ఆ నాటినుండియు శంకరుడు నృసింహచర్మను ధరించెను. నృసింహుని తలను తలల మాలికయందు ప్రముఖ స్థానములో గ్రుచ్చి ధరించెను (36).

తతో దేవా నిరాతంకాః కీర్తయంతః కథా మిమామ్ ।
విస్మయోత్ఫుల్ల నయనా జగ్ముస్సర్వే యథాగతమ్ ॥
య ఇదం పరమాఖ్యానం పుణ్యం వేదరసాన్వితమ్ ।
పఠతి శృణుయాచ్చైవ సర్వాన్ కామానవాప్నుయాత్ ॥
ధన్యం యశస్య మాయుష్యమారోగ్యం పుష్టివర్ధనమ్ ।
సర్వవిఘ్న ప్రశమనం సర్వవ్యాధి వినాశనమ్ ॥
దుఃఖ ప్రశమనం వాంఛాసిద్ధిదం మంగలాలయమ్ ।
అపమృత్యుహరం బుద్ధిప్రదం శత్రు వినాశనమ్ ॥
ఇదం తు శరభాకారం పరం రూపం పినాకినః ।
ప్రకాశనీయం భక్తేషు శంకరస్య చరేషు వై ॥
తైరేవ పఠితవ్యం చ శ్రోతవ్యం చ శివాత్మభిః ।
నవధా భక్తిదం దివ్యమంతః కరణ శుద్ధిదమ్ ॥
శివోత్సవేషు సర్వేషు చతుర్దశ్యష్టమీషు చ ।
పఠేత్ప్రతిష్ఠాకాలే తు శివసన్నిధి కారణమ్ ॥

అపుడు తొలగిన దుఃఖము గల దేవతలు ఆశ్చర్యముతో విప్పారిన నేత్రములు గలవారై అందరు ఈ గాథను కీర్తించుచూ వచ్చిన దారిన వెళ్లిరి (37). శ్రేష్ఠము, పుణ్యము, వేదసారముతో గూడినది అగు ఈ వృత్తాంతమును చదువువాడు,మరియు వినువాడు కోర్కెలనన్నిటినీ పొందును (38). ఈ గాథ ధన్యమైనది, యశస్సును ఆయురారోగ్యములను ఇచ్చి పుష్టిని వర్ధిల్ల జేయునది, విఘ్నములనన్నిటినీ పోగొట్టునది, వ్యాధులనన్నిటినీ నశింపజేయునది (39), దుఃఖములను పోగొట్టునది, కోర్కెలనీడేర్చునది, మంగళములకు నిలయమైనది, అపమృత్యువును పోగొట్టునది, బుద్ధిని ఇచ్చి శత్రువులను నశింపజేయునది (40). పినాకియగు శివుని యొక్క శ్రేష్ఠమగు ఈ శరభావతారమును శంకరుని భక్తులలో, మరియు పూజకులలో ప్రచారమును చేయవలెను (41). శివస్వరూపులగు వారు మాత్రమే దీనిని పఠించవలెను. ఈ దివ్య గాథ 'నవవిధముల భక్తిని కలిగించి అంతఃకరణమును శుద్ధి జేయును (42). శివోత్సవములన్నిటి యందు, చతుర్దశినాడు, అష్టమినాడు, ఆలయ ప్రతిష్ఠ చేయు కాలములో దీనిని పఠించినచో, శివుని సన్నిధి లభించును (43).

చౌరవ్యాఘ్ర నృసింహాత్మ కృతరాజ భయేషు చ ।
అన్యేషూత్పాత భూకంప దస్యాది పాంశువృష్టిషు ॥
ఉల్కాపాతే మహావాతే వినా వృష్యతి వృష్టిషు ।
పఠేద్యః ప్రయతో విద్వాన్ శివభక్తో దృఢవ్రతః ॥
యః పఠేచ్ఛృణుయాద్వాపి నిష్కామో వృత్తమైశ్వరమ్ ।
రుద్రలో కం సమాసాద్య రుద్రస్యాను చరో భవేత్ ॥
రుద్రలోకమను ప్రాప్య రుద్రేణ సహ మోదతే ।
తతస్సాయుజ్యమాప్నోతి శివస్య కృపయా మునే ॥
ఇతి శ్రీ శివ మహాపురాణే శతరుద్రసంహితాయాం శరభావతార వర్ణనం
నామ ద్వాదశోఽధ్యాయః (12).

చోరులు, వ్యాఘ్రములు, దుష్టులగు మానవులు, సింహములు మొదలగు వాటి వలన భయము కలిగినప్పుడు, రాజువలన భయము కలిగినప్పుడు, భూకంపము, దొంగలు పడుట ఇత్యాది ఉత్పాతములయందు, ధూళివర్షముకురిసినప్పుడు (44), ఉల్కలు పడినప్పుడు, తుఫాను, అనావృష్టి, అతి వృష్టి కలిగినప్పుడు శివభక్తుడగు విద్వాంసుడు దృఢమగు నిష్ఠగలవాడై శ్రద్ధతో పఠించవలెను (45). ఈ ఈశ్వర గాథను ఎవడైతే నిష్కామ బుద్ధితో పఠించునో, వాడు రుద్రలోకమును పొంది రుద్రుని అనుచరుడగును (46). ఆతడు రుద్రలోకమును పొంది రుద్రునితో కలిసి ఆనందించును. ఓ మునీ! అట్టి భక్తుడు ఆ తరువాత శివుని కృపచే సాయుజ్యమును పొందును (47).

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు
శరభావతారవర్ణనమనే పన్నెండవ అధ్యాయము ముగిసినది (12).

13 – విశ్వానరుని తపస్సు

నందీశ్వర ఉవాచః

శృణు బ్రహ్మసుత ప్రీత్యా చరితం శశిమౌలినః ।
సోఽవతీర్ణో యథా ప్రీత్యా విశ్వానరగృహే శివః ॥
నామ్నా గృహపతి స్సోఽభూదగ్నిలోక పతిర్మునే ।
అగ్నిరూపస్తైజసశ్చ సర్వాత్మా పరమః ప్రభుః ॥
నర్మదాయాస్తటే రమ్యే పురే నర్మపురే పురా ।
పురారిభక్తః పుణ్యాత్మాభవద్విశ్వానరో మునిః ॥
బ్రహ్మచర్యాశ్రమే నిష్ఠో బ్రహ్మయజ్ఞ రతస్సదా ।
శాండిల్యగోత్రః శుచిమాన్ బ్రహ్మతే జో నిధిర్వశీ ॥
విజ్ఞాతాఖిల శాస్త్రార్థస్సదా చారరతస్సదా ।
శైవాచరప్రవీణోఽ తి లౌకికా చారవిద్వరః ॥
చిత్తే విచార్య గృహిణీ గుణాన్ విశ్వానరశ్శుభాన్ ।
ఉదువాహ విధానేన స్వోచితాం కాలకన్యకామ్ ॥
అగ్ని శుశ్రూషణరతః పంచయజ్ఞ పరాయణః ।
షట్ కర్మనిరతో నిత్యం దేవపిత్రతిథి ప్రియః ॥
ఏవం బహుతిథే కాలే గతే తస్యా గ్రజన్మనః ।
భార్యా శుచిష్మతీ నామ భర్తారం ప్రాహ సువ్రతా ॥
నాథ భోగా మయా సర్వే భుక్తా వై త్వత్ప్ర సాదతః ।
స్త్రీ ణాం సముచితా యే స్యుస్త్యాం సమేత్య ముదావహాః ॥
ఏవం మే ప్రార్థితం నాథ చిరాయ హృది సంస్థితమ్ ।
గృహస్థానాం సముచితం త్వమేతద్దాతుమర్హసి ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓ బ్రహ్మపుత్రా! చంద్రశేఖరుని గాథను ప్రీతితో వినుము. ఆ శివుడు ప్రేమతో విశ్వానరుని గృహములో అవతరించిన గాథను వినుము (1). సర్వాత్ముడగు ఆ పరమప్రభుడు తేజోమయుడై అగ్ని స్వరూపముతో అగ్నిలోకమునకు ప్రభువై గృహపతియను పేరుతో అవతరించెను (2). పూర్వము సుందర నర్మదానదీతీరమునందు నర్మపురములో త్రిపురాంతకుడగు శివుని భక్తుడు, పుణ్యాత్ముడు అగు విశ్వానరుడనే ముని ఉండెను (3). శాండిల్య గోత్రీకుడు, శుచిమంతుడు, బ్రహ్మతేజస్సునకు నిధి, జితేంద్రియుడు అగు నాతడు బ్రహ్మచర్యాశ్రమమునందు నిష్ఠ గలవాడై నిత్యము వేదాధ్యయనమనే యజ్ఞమునందు రతుడై యుండెను (4). సకలశాస్త్రముల సారము తెలిసినవాడు, సర్వదా సదాచారమునందు నిష్ఠ గలవాడు, శైవాచారములో సమర్థుడు, లౌకికాచారముల నెరింగిన వారిలో మిక్కిలి శ్రేష్ఠుడునగు (5) ఆ విశ్వానరుడు శుభకరమగు గృహిణీ ధర్మములను మనస్సులో విచారణ చేసి తనకు దగిన యుక్త

వయస్కురాలగు కన్యను యథావిధిగా వివాహమాడెను (6). అతడు అగ్నిసేవయందు నిష్ఠ గలవాడై, పంచ యజ్ఞములను శ్రద్ధగా ఆచరించుచూ, షట్కర్మలను ఏకాగ్రతతో అనుష్ఠిస్తూ నిత్యము దేవతలకు పితరులకు అతిథులకు ప్రీతిని కలిగించుచుండెను (7). ఆ బ్రాహ్మణుడు ఇట్లు జీవించుచుండగా చిరకాలము గడచిన తరువాత శుచిష్మతియను ఆతని భార్య గొప్ప వ్రతముతో జీవిస్తూ ఒకనాడు ఆతనితో నిట్లనెను (8). ఓ నాథా ! నీ అనుగ్రహముచే నేను భోగములనన్నిటినీ అనుభవించితిని. నేను నిన్ను పొంది స్త్రీలకు యోగ్యమైన, ఆనందదాయకమగు సుఖములను భోగించితిని (9). చిరకాలమునుండియు నా హృదయములో ఒక కోరిక మిగిలి యున్నది. ఓ నాథా! గృహస్థులకు ఉచితమగు ఈ కోర్కెను నీవు తీర్చదగును (10).

విశ్వానర ఉవాచః

కిమదేయం సుశ్రోణి తవ ప్రియహితైషిణి ।

త త్ప్రార్థయ మహాభాగే ప్రయచ్ఛామ్య విలంబితమ్ ॥

మహేశితుః ప్రసాదేన మమ కించిన్న దుర్లభమ్ ।

ఇహాముత్ర చ కళ్యాణి సర్వకల్యాణ కారిణః ॥

విశ్వానరుడిట్లు పలికెను -

ఓ సుందరీ ! ప్రియుని హితమును గోరు నీకు ఈయదగనిది ఏమి గలదు? ఓ పుణ్యాత్మురాలా! నీవు కోరుకొనుము. నేను వెనువెంటనే నీ కోర్కెను తీర్చెదను (11). ఓ కళ్యాణీ ! పుణ్య కార్యములను అన్నింటినీ చేయు నాకు మహేశ్వరుని అనుగ్రహముచే ఇహపరలోకములలో దుర్లభమగునది ఏదియూ లేదు (12).

నందీశ్వర ఉవాచః

ఇత్యాకర్ణ్య వచః పత్యుస్తస్య సా పతిదేవతా ।

ఉవాచ హృష్టవదనా కరౌ బద్ధ్వా వినీతికా ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ పతివ్రత భర్తయొక్క ఆ మాటను విని సంతోషముతో గూడిన ముఖము గలదై వినయముతో చేతులు జోడించి ఇట్లు పలికెను (13).

శుచిష్మత్యువాచ ।

వరయోగ్యాస్మి చేన్నాథ యది దేయో వరో మమ ।

మహేశసదృశం పుత్రం దేహి నాన్యం వరం వృణే ॥

శుచిష్మతి ఇట్లు పలికెను -

ఓ నాథా! నేను వరమునకు యోగ్యురాలనైనచో, నాకు వరమునీయ దలచినచో, మహేశ్వరుని బోలు పుత్రుని ఇమ్ము, మరియొక వరమును నేను కోరను (14).

నందీశ్వర ఉవాచః

ఇతి తస్యా వచశ్శ్రుత్వా బ్రాహ్మణస్స శుచి వ్రతః ।
క్షణం సమాధి మాధాయ హృద్యేతత్సమ చింతయత్ ॥
అహో కిం మే తయా తన్వ్యా ప్రార్థితం హ్యతిదుర్లభమ్ ।
మనోరథ పథా ద్దూరమస్తు వా స హి సర్వకృత్ ॥
తేనావాస్యా ముఖే స్థిత్వా వాక్ స్వరూపేణ శంభునా ।
వ్యాహృతం కోఽన్యథా కర్తుముత్సహేత భవేదిదమ్ ॥
ఇతి సంచింత్య స మునిర్వైశ్వానర ఉదారధీః ।
తతః ప్రోవాచ తాం పత్నీమేక పత్నీవ్రతే స్థితః ॥
ఇత్థమాశ్వాస్య తాం పత్నీం జగామ తపసే మునిః ।
యత్ర విశ్వేశ్వర స్సాక్షాత్కాశీనాథోఽధితిష్ఠతి ॥
ప్రాప్య వారాణసీం తూర్ణం దృష్ట్వా తాం మణి కర్ణికామ్ ।
తత్యాజ తాపత్రితయమపి జన్మశతార్జితమ్ ॥
దృష్ట్వా సర్వాణి లింగాని విశ్వేశ ప్రముఖాని చ ।
స్నాత్వా సర్వేషు కుండేషు వాపీ కూపసరస్సు చ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

శౌచముతో గూడిన వ్రతము గల ఆ బ్రాహ్మణుడు ఆమెయొక్క ఈ మాటను విని క్షణకాలము మనస్సును ఏకాగ్రము చేసి హృదయములో నిట్లు తలపోసెను (15). ఆశ్చర్యము ! ఈ సుందరి అతి దుర్లభమగు వరమును కోరినది యేమి? ఈ వరము ఊహాకైననూ అందునది కాదు. కానిమ్ము. సర్వమును చేయువాడు ఆయనయే గదా! (16) ఆ శంభుడు ఈమె నోటిలో వాగ్రూపముతో నుండి పలికినాడు. అట్లు గానిచో ఇట్లు పలుకు సామర్థ్యము ఎవరికి గలదు? (17) విశాలహృదయుడగు ఆ విశ్వానరమహర్షి ఇట్లు తలపోసి, ఏకపత్నీ వ్రతమునందున్నవాడై, తరువాత తన భార్యకు నచ్చచెప్పి, (18) తపస్సు కొరకు బయలు దేరెను. ఎచట విశ్వేశ్వరుడు కాశీనాథుడై స్వయముగా వెలసి యున్నాడో (19), అట్టి వారాణసీ నగరమును చేరి, వెంటనే మణికర్ణికను దర్శించి అనేక జన్మలనుండి సంప్రాప్తమైన త్రివిధ తాపములను విడిచిపెట్టెను (20). విశ్వేశ్వరుడు మొదలగు లింగములనన్నిటినీ దర్శించి, సర్వకుండములయందు, దిగుడు బావులయందు, బావులయందు మరియు సరస్సులయందు స్నానమును చేసెను (21).

నత్వా వినాయకాన్ సర్వాన్ గౌరీం శర్వాం ప్రణమ్య చ ।
సంపూజ్య కాలరాజం చ భైరవం పాపభక్షణమ్ ॥
దండనాయకముఖ్యాంశ్చ గణాన్ స్తుత్వా ప్రయత్నతః ।
ఆదికేశవ ముఖ్యాంశ్చ కేశవం పరితోష్య చ ॥

లో లార్కముఖసూర్యాంశ్చ ప్రణమ్య స పునః పునః ।
కృత్వా చ పిండదానాని సర్వతీర్థేష్వతంద్రితః ॥
సహస్ర భోజనాద్యైశ్చ మునీన్ విప్రాన్ ప్రతర్ప్య చ ।
మహాపూజోప చారైశ్చ లింగాన్య భ్యర్చ్య భక్తితః ॥
అసక్య ఛ్చింతయామాస కిం లింగం క్షిప్రసిద్ధిదమ్ ।
యత్ర నిశ్చలతామేతి తపస్తనయ కామ్యయా ॥
క్షణం విచార్య సమునిరితి విశ్వానరస్సుధీః ।
క్షిప్రం పుత్ర ప్రదం లింగం వీరేశం ప్రశశంస హ ॥
అసంఖ్యాతాస్సహస్రాణి సిద్ధాస్సిద్ధిం గతాస్తతః ।
సిద్ధలింగమితి ఖ్యాతం తస్మా ద్వీరేశ్వరం పరమ్ ॥

వినాయకులకందరికీ ప్రణమిల్లి, శివుని పత్నియగు గౌరికి వందనమాచరించి, పాపములను పోగొట్టువాడు కాలరాజు అగు భైరవుని చక్కగా పూజించి (22), దండనాయకులను గణాధ్యక్షులను శ్రద్ధతో స్తుతించి, ఆదికేశవుడు మొదలగు దేవతలను మరియు కేశవుని సంతోషపెట్టి (23), లోలార్కుడు మొదలగు సూర్యులకు అనేకపర్యాయములు ప్రణమిల్లి, తీర్థములన్నిటియందు అలసట నెరుంగక పిండదానములను చేసి (24), వేయి మంది మునులకు బ్రాహ్మణులకు భోజనసంతర్పణ చేసి, మహాపూజోపచారములతో భక్తిపూర్వకముగా లింగములనర్చించెను (25). ఏ లింగము శీఘ్రముగా ఫలము నిచ్చును? పుత్రుని కోరి చేయు తపస్సు ఏ లింగమునందు నిశ్చలముగా కొనసాగును? (26) అను విషయమును బుద్ధిశాలియగు ఆ విశ్వానరమహర్షి క్షణకాలము ఆలోచించి, వీరేశలింగము నారాధించినచో శీఘ్రమే పుత్రుడు కలుగునని ప్రశంసించెను (27). లెక్క లేనంతమంది సిద్ధులు ఆరాధించి సిద్ధిని పొందుటచే శ్రేష్ఠమగు ఆ వీరేశలింగమునకు సిద్ధలింగమను ఖ్యాతి కలిగినది (28).

వీరేశ్వరం మహాలింగ మబ్ధమభ్యర్చ్య భక్తితః ।
ఆయుర్మనోరథం సర్వం పుత్రాదిక మనేకశః ॥
అహమప్యత్ర వీరేశం సమారాధ్య త్రికాలతః ।
ఆశు పుత్ర మవాప్స్యామి యథాభిలషితం శ్రియా ॥
ఇతి కృత్వా మతిం ధీరో విప్రో విశ్వానరః కృతీ ।
చంద్రకూపజలే స్నాత్వా జగ్రాహ నియమం వ్రతీ ॥
ఏకాహారోఽభవన్మా సం మాసం నక్తాశనోఽభవత్ ।
అయాచితాశనో మాసం మాసం త్యక్తాశనః పునః ॥
పయోవ్రతోఽభవన్మాసం మాసం శాకఫలాశనః ।
మాసం ముష్టి తిలాహారో మాసం పానీయ భోజనః ॥
పంచగవ్యాశనో మాసం మాసం చాంద్రాయణ వ్రతీ ।
మాసం కుశాగ్రజల భుక్ మాసం శ్వసన భక్షణః ॥

ఏవమబ్దమితం కాలం తతాప స తపోఽద్భుతమ్ ।

త్రికాలమర్చ యద్భక్త్యా వీరేశం లింగముత్తమమ్ ॥

అథ త్రయోదశే మాసి స్నాత్వా త్రిపథగాంభసి ।

ప్రత్యూష ఏవ వీరేశం యావదాయాతి స ద్విజః ॥

వీరేశ్వర మహాలింగమును సంవత్సరకాలము భక్తితో అర్చించినచో, ఆయుర్దాయము, పుత్రుడు ఇత్యాది మనోరథములన్నియు సిద్ధించును (29). నేను కూడా ఇచట మూడు కాలములయందు వీరేశుని ఆరాధించి నాభార్య కోరిన విధంబుగా శీఘ్రమే పుత్రుని పొందగలను (30). ధీరుడు, కృతార్థుడు అగు విశ్వానరముని ఇట్లు నిర్ణయించుకొని, చంద్రకూపముయొక్క నీటిలో స్నానము చేసి వ్రతనియమమును చేపట్టెను (31). ఆతడు ఒక నెల ఒక పూట, రెండవనెల రాత్రి మాత్రమే భోజనము చేసెను. ఒక నెల అయాచితముగా లభించిన ఆహారమును మాత్రమే భోజనము చేసెను. ఒక నెల ఉపవాసమును చేసెను (32). ఒక నెల పాలు త్రాగి, మరియొక్క నెల కూరలను, పళ్లను తిని, మరియొక నెల గుప్పెడు తిలలను మాత్రమే తిని, ఒక నెల నీరు త్రాగి తపస్సును చేసెను (33). ఒక నెల పంచగవ్యమును భుజించెను. ఒక నెల చాంద్రాయణ వ్రతము నాచరించెను. దర్భల అగ్రమునందలి జలమును మాత్రమే ఒక నెల త్రాగెను. ఒక నెల గాలిని మాత్రమే ఆహారముగా తీసుకొనెను (34). ఈ విధముగా ఆతడు ఒక సంవత్సరము అద్భుతమగు తపస్సును చేసెను. అతడు ఉత్తమమగు వీరేశలింగమును త్రికాలములయందు భక్తితో అర్చించెను (35). తరువాత పదమూడవ మాసములో ఆ బ్రాహ్మణుడు తెల్లవారుజామున గంగాజలముతో స్నానము చేసి వచ్చుచుండెను (36).

తావద్విలోకయాం చక్రే మధ్యే లింగం తపోధనః ।

విభూతి భూషణం బాలమష్ట వర్షాకృతిం శిశుమ్ ॥

ఆ కర్ణాయతనేత్రం చ సురక్తదశనచ్ఛదమ్ ।

చారు పింగజటామౌలిం నగ్నం ప్రహసితాననమ్ ॥

శైశవో చితనేపథ్య ధారిణం చితిధారిణమ్ ।

పఠంతం శ్రుతిసూక్తాని హసంతం చ స్వలీలయా ॥

తమాలోక్య ముదం ప్రాప్య రోమకంచుకితో మునిః ।

ప్రోచ్చచార హృదాలాపాన్నమోస్త్వితి పునః పునః ॥

అభిలాషప్రదైః పద్యైరష్ట భిర్బాలరూపిణమ్ ।

తుష్టావ పరమానందం శంభుం విశ్వానరః కృతీ ॥

అను ఇంతలో ఆ తపోనిధికి లింగమధ్య భాగమునందు విభూతియే అలంకారముగా గలవాడు, ఎనిమిది సంవత్సరముల వయస్సు గలవాడు (37), ఆకర్ణ విశాలమగు కన్నులు గలవాడు, ఎర్రని పెదవులు గలవాడు, సుందరమైన నల్లని జటలతో గూడిన శిరస్సు గలవాడు, వస్త్రములు లేనివాడు, చిరునవ్వు మోమువాడు (38), బాల్యమునకు తగిన ఆభరణములను ధరించినవాడు, చితా

భస్మను ధరించినవాడు, తన లీలతో నవ్వుతూ వేదసూక్తములను పఠించుచున్నవాడు అగు బాలకుడు కనబడెను (39). ఆ మహర్షికి ఆ బాలుని చూచుట తోడనే ఆనందముతో శరీరము గగుర్పాటును చెందెను. ఆయన తన హృదయానందమును అనేకపర్యాయములు "నమస్కారమగు గాక!' అని బిగ్గరగా పలుకుతూ ప్రకటించెను (40). కృతార్థుడైన విశ్వానరుడు బాలరూపములోనున్న పరమానందస్వరూపుడగు శివుని భక్తిని కలిగించే ఎనిమిది పద్యములతో స్తుతించెను (4 1).

విశ్వానర ఉవాచః

ఏకం బ్రహ్మైవాద్వితీయం సమస్తం సత్యం సత్యం నేహ నానాస్తి కించిత్ ।
ఏకో రుద్రో న ద్వితీయోఽవతస్థే తస్మాదేకం త్వాం ప్రపద్యే మహేశమ్ ॥
కర్తా హర్తా త్వం హి సర్వస్య శంభో నానారూపే ష్వేకరూపోఽప్య రూపః ।
యద్వ త్ప్రత్యగ్ధర్మ ఏకోఽప్యనేక స్తస్మాన్నాన్యం త్వాం వినేశం ప్రపద్యే ॥
రజ్జౌ సర్పశ్శుక్తికాయాం చ రౌప్యం నైరః పూరస్తన్మృగాఖ్యే మరీచౌ ।
యద్వత్తద్వద్విష్వగేవ ప్రపంచో యస్మిన్ జ్ఞాతే తం ప్రపద్యే మహేశమ్ ॥
తోయే శైత్యం దాహకత్వం చ వహ్నౌ తాపో భానౌ శీతభానౌ ప్రసాదః ।
పుష్పే గంధో దుగ్ధమధ్యేఽపి సర్పిర్యత్తచ్ఛంభో త్వం తతస్త్వాం ప్రపద్యే ॥
శబ్దం గృహ్ణాస్య శ్రవాస్త్వం హి జిఘ్రే స్యఘ్రాణస్త్వం వ్యంఘ్రిరాయసి దూరాత్ ।
వ్యక్షః పశ్యేస్త్వం రసజ్ఞోఽప్య జిహ్వః కస్త్వాం సమ్యగ్వేత్త్యతస్త్వాం ప్రపద్యే ॥
నో వేద త్వామీశ సాక్షాద్ధి వేదో నో వా విష్ణుర్నో విధాతాఖిలస్య ।
నో యోగీంద్రా కేంద్రముఖ్యాశ్చ దేవా భక్తో వేద త్వామతస్త్వాం ప్రపద్యే ॥
నో తే గోత్రం నో సజన్మాపి నాశో నోవా రూపం నైవ శీలం న దేశః ।
ఇత్థం భూతోఽ పీశ్వరస్త్వం త్రిలో క్యాస్సర్వాన్ కామాన్ పూరయేస్త్వం భజే త్వామ్ ॥
త్వత్తస్సర్వం త్వం హి సర్వం స్మరారే త్వం గౌరీశస్త్వంచ నగ్నోఽతిశాంతః ।
త్వం వై వృద్ధస్త్వం యువా త్వం చ బాలస్తత్త్వం యత్కిం నాస్త్యతస్త్వాం నతోఽహమ్ ॥

విశ్వానరుడిట్లు పలికెను -

బ్రహ్మ సజాతీయ జాతీయ స్వగత భేదములు లేని పూర్ణ సత్యతత్త్వము. ఈ నానాత్వము కన్పట్టునదియే గాని సత్యము గాదు. రుద్రుడు ఒక్కడే గలడు. రెండవ తత్త్వము లేదు. కావున అద్వయుడవు, మహేశుడవు అగు నిన్ను శరణు జొచ్చుచున్నాను (42). హే శంభో! సర్వమును సృష్టించి లయము చేయువాడవు నీవే. వివిధరూపములలో అఖండసత్తా రూపములో నుండే నీకు రూపము లేదు. ప్రత్యగాత్మ స్వరూపుడవగు నీవు అద్వయుడవైననూ అనేకముగ కన్పట్టు చున్నావు.

కావున ఈశ్వరుడవగు నిన్ను తక్క ఇతరమును నేను శరణు పొందుట లేదు (43). త్రాడు నందు పాము, ముత్యపు చిప్ప యందు వెండి, ఎండమావుల యందు నీరు ఎట్లు మిథ్యయో, అటులనే సర్వజ్ఞుడవగు నీ యందు విశ్వము మిథ్యయగును. దీనిని తెలిసినచో ప్రపంచము తత్త్వతః తెలిసినట్లు యగునో, అట్టి మహేశుని శరణు పొందుచున్నాను (44). నీటియందలి చల్లదనము, నిప్పుయందలి వేడి, సూర్యుని యందలి తాపము, చంద్రుని యందలి ఆహ్లాదకత్వము, పుష్పమునందలి పరిమళము, పాలలోని వెన్న నీవే. కావున, హే శంభో! నిన్ను నేను శరణు వేడుచున్నాను (45). నీవు శబ్దమును వినెదవు. కాని నీకు చెవులు లేవు. నీవు ఆఘ్రాణించెదవు. కాని నీకు ముక్కు లేదు. నీకు పాదము లేకున్ననూ. దూరమునుండి వచ్చెదవు. కన్నులు లేని నీవు చూచుచున్నావు. జిహ్వ లేని నీవు రుచిని తెలియుచున్నావు. నీ స్వరూపమును పూర్ణముగా ఎవరు ఎరుంగగలరు? కావున నిన్ను శరణు వేడుచున్నాను (46). ఓ ఈశ్వరా! వేదము సాక్షాత్తుగా నిన్ను ఎరుంగ జాలదు. విష్ణువు గాని, సర్వమును సృజించు బ్రహ్మగాని నిన్ను యెరుంగరు. యోగి శ్రేష్ఠులు, ఇంద్రాదిదేవతలు నిన్ను ఎరుంగరు. కాని, భక్తుడు నిన్ను తెలియగల్గును. కావున నిన్ను శరణు పొందుచున్నాను (47). నీకు గోత్రము లేదు. జన్మనాశములు లేవు. నీకు రూపము లేదు. శీలము లేదు. దేశము లేదు. ఇట్టివాడవైననూ, నీవు ముల్లోకములకు ప్రభుడవు. నేను నిన్ను సేవించుచున్నాను. నాకోర్కెలనన్నిటినీ ఈడేర్చుము (48). ఓ మన్మథాంతకా! సర్వము నీ నుండి ఉద్భవించినది. సర్వము నీవే. గౌరీపతివి నీవు. దిగంబరుడవు అగు నీవు పరమ శాంత స్వరూపుడవు. వృద్ధుడవు నీవే. యువకుడవు నీవే. బాలుడవు నీవే.. నీచే వ్యాప్తము కాని తత్త్వము ఏది గలదు? నేను నిన్ను నమస్కరించుచున్నాను (49).

నందీశ్వర ఉవాచః

స్తుత్వేతి విప్రో నిపపాత భూమౌ సంబద్ధ పాణిర్భవతీహ యావత్ ।

తావత్స బాలోఽఖిల వృద్ధవృద్ధః ప్రోవాచ భూదేవమతీవ హృష్టః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఆ బ్రాహ్మణుడు ఇట్లు స్తుతించి చేతులను కట్టుకొని సాష్టాంగ ప్రణామము నాచరించునంతలో, వృద్ధులందరిలో వృద్ధుడగు ఆ బాలుడు మిక్కిలి ఆనందించి ఆ బ్రాహ్మణునితో నిట్లనెను (50).

బాల ఉవాచః

> **విశ్వానర మునిశ్రేష్ఠ భూదేవాహం త్వయాద్య వై ।**
> **తోషితస్సు ప్రసన్నాత్మా వృణీష్వ వరముత్తమమ్ ॥**
> **తత ఉత్థాయ హృష్టాత్మా మునిర్విశ్వానరః కృతీ ।**
> **ప్రత్య బ్రవీన్ముని శ్రేష్ఠ శ్శంకరం బాలరూపిణమ్ ॥**

బాలుడిట్లు పలికెను -

ఓ మహర్షీ ! విశ్వానరా ! బ్రాహ్మణా! నేను నీ తపస్సునకు సంతోషించితిని. నా మనస్సు మిక్కిలి ప్రసన్నమైనది. నీవు ఉత్తమమగు వరమును కోరుకొనుము (51). అపుడు కృతార్థుడైన విశ్వానరమహర్షి ఆనందముతో నిండిన మనస్సు గలవాడై లేచి నిలబడి బాలుని రూపములో నున్న శంకరునకు ఇట్లు బదులిడెను (52).

విశ్వానర ఉవాచః

> **మహేశ్వర కిమజ్ఞాతం సర్వజ్ఞస్య తవ ప్రభో ।**
> **సర్వాంతరాత్మా భగవాన్ శర్వ స్సర్వ ప్రదో భవాన్ ॥**
> **యా చ్ఞాం ప్రతి నియుక్తం మాం కిం బ్రూషే దైన్యకారిణీమ్ ।**
> **ఇతి జ్ఞాత్వా మహేశాన యథేచ్ఛసి తథా కురు ॥**

విశ్వానరుడిట్లు పలికెను -

మహేశ్వర ప్రభూ! సర్వజ్ఞుడవగు నీకు తెలియనది ఏమున్నది? నీవు సర్వుల అంతరంగములో నుండే భగవానుడవు. సర్వమును ఇచ్చే శర్వుడవు (53). అయిననూ, నీవు నన్ను దైన్యమును కలిగించే యాచనయందు ఏల నియోగించుచున్నావు? ఓ మహేశ్వరా! సర్వము నీకు తెలియును. కావున నీకు తోచినట్లు చేయుము (54).

నందీశ్వర ఉవాచః

ఇతి శ్రుత్వా వచస్త దేవో విశ్వానరస్య హి ।
శుచిశ్శుచివ్రతస్యాథ శుచిం స్మిత్వా బ్రవీచ్ఛిశుః ॥
త్వయా శుచే శుచిష్మత్యాం యోఽభిలాషః కృతో హృది ।
అచిరేణైవ కాలేన స భవిష్యత్య సంశయమ్ ॥
తవ పుత్రత్వమేష్యామి శుచిష్మత్యాం మహామతే ।
ఖ్యాతో గృహపతిర్నామ్నా శుచి స్సర్వామరప్రియః ॥
అభిలాషాష్టకం పుణ్యం స్తోత్రమేతత్త్వయేరితమ్ ।
అబ్దత్రికాల పఠనాత్కామదం శివసన్నిధౌ ॥
ఏతత్ స్తోత్రపఠనం పుత్ర పౌత్ర ధన ప్రదమ్ ।
సర్వశాంతి కరశ్చాపి సర్వాపత్తి వినాశనమ్ ॥
స్వర్గాపవర్గ సంపత్తి కారకం నాత్ర సంశయః ।
సర్వస్తోత్రసమం హ్యేతత్సర్వ కామప్రదం సదా ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

శుద్ధవ్రతుడగు ఆ విశ్వానరుని ఈ మాటను విని పవిత్ర శిశురూపములోనున్న శివదేవుడు చిరునవ్వుతో అపుడిట్లనెను (55). ఓయీ పవిత్రుడా! నీవు ఎట్టి పుత్రుని శుచిష్మతియందు బడయవలెనని హృదయములో కోరుకుంటివో, అట్టి పుత్రుడు శీఘ్రముగా నిస్సంశయముగా లభించగలడు (56). ఓ మహాత్మా! నేను శుచిష్మతి యందు నీ పుత్రుడనై జన్మించి గృహపతి యను పేరుతో ప్రసిద్ధిని గాంచి పావనుడనై దేవతలందరికీ ప్రియుడను కాగలను (57). నీవు పలికిన అభిలాషాష్టకమను పేరు గల పవిత్రమగు ఈ స్తోత్రమును శివుని సన్నిధిలో మూడు కాలములయందు సంవత్సరకాలము పఠించినచో కోర్కెలు ఈడేరును (58). ఈ స్తోత్రమును పఠించినచో పుత్రులు, పౌత్రులు, ధనము లభించి ఆపదలన్నియు దూరమై సంపూర్ణమగు శాంతి కలుగును (59). ఈ స్తోత్రము స్వర్గమోక్షములను, సంపదను ఇచ్చుననుటలో సందేహము లేదు. సర్వదా కోర్కెలనన్నిటినీ ఈడేర్చు ఈ ఒక్క స్తోత్రము ఇతర స్తోత్రములన్నింటితో సమమైనది (60).

ప్రాతరుత్థాయ సుస్నాతో లింగమభ్యర్చ్య శాంభవమ్ ।
వర్షం జపన్నిదం స్తోత్రమపుత్రః పుత్రవాన్ భవేత్ ॥
అభిలాషాష్టక మిదం న దేయం యస్య కస్యచిత్ ।
గోపనీయం ప్రయత్నేన మహావంధ్యా ప్రసూతికృత్ ॥
స్త్రియా వా పురుషేణాపి నియమాల్లింగ సన్నిధౌ ।
అబ్దం జప్తమిదం స్తోత్రం పుత్రదం నాత్ర సంశయః ।
ఇత్యుక్త్వాం తర్ధధే శంభుర్బాలరూపస్సతాం గతిః ।
సోఽపి విశ్వానరో విప్రో హృష్టాత్మా స్వగృహం యయౌ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం గృహపత్య
వతారవర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః (13).

సంవత్సరకాలము ఉదయమే నిద్ర లేచి చక్కగా స్నానము చేసి శంభుని లింగమును పూజించి ఈ స్తోత్రమును జపించినచో, పుత్రుడు లేని వానికి పుత్రుడు కలుగును (61). ఈ అభిలాషాష్టకమును ఎవడు కనబడితే వానికి చెప్పరాదు. దీర్ఘకాల వంధ్యయైననూ ప్రసవించునట్లు చేయగల ఈ స్తోత్రమును శ్రద్ధతో పరిరక్షించవలెను (62). స్త్రీ గాని, పురుషుడు గాని లింగసన్నిధిలో నియమపూర్వకముగా సంవత్సరకాలము ఈ స్తోత్రమును జపించినచో, నిస్సంశయముగా పుత్రుడు కలుగును (63). సత్పురుషులకు శరణ్యుడు, బాలరూపములో నున్న వాడు అగు శంభుడు ఇట్లు పలికి అంతర్ధానమయ్యెను. ఆ విశ్వానర మహర్షి కూడా ఆనందముతో నిండిన మనస్సు గలవాడై తన ఇంటికి చేరుకొనెను

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు గృహపత్యవతార వర్ణనమనే పదమూడవ అధ్యాయము ముగిసినది (13).

14 – గృహపత్యవతారము

నందీశ్వర ఉవాచః

స విప్రో గృహమాగత్య మహాహర్ష సమన్వితః ।
ప్రియాయై కథయామాస తద్ వృత్తాంతమశేషతః ॥
తచ్ఛ్రుత్వా విప్రపత్నీ సా ముదం ప్రాప శుచిష్మతీ ।
అతీవ ప్రేమ సంయుక్తా ప్రశశంస విధిం నిజమ్ ॥
అథ కాలేన తద్యోషి దంతర్వత్నీ బభూవ హ ।
విధివద్విహితే తేన గర్భాధానాఖ్య కర్మణి ॥
తతః పుంసవనం తేన స్పందనాత్ప్రా గ్విపశ్చితా ।
గృహ్యోక్త విధినా సమ్యక్ కృతం పుంస్య వివృద్ధయే ॥
సీమంతోఽథాష్టమే మాసే గర్భరూప సమృద్ధికృత్ ।
సుఖ ప్రసవసిద్ధ్యై చ తేనాకారి కృపావిదా ॥
అథాతశ్శుభతారాసు తారాధిపవరాననః ।
కేంద్రే గురౌ శుభే లగ్నే సుగ్రహేషు యుగేషు చ ॥
అరిష్టదీప నిర్వాణస్సర్వారిష్టవినాశకృత్ ।
తనయో నామ తస్యాం తు శుచిష్మత్యాం బభూవ హ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఆ బ్రాహ్మణుడు మహానందముతో కూడినవాడై ఇంటికి వచ్చి ఆ వృత్తాంతమునంతనూ ప్రియురాలికి చెప్పెను (1). ఆ బ్రాహ్మణుని భార్యయగు శుచిష్మతి ఆ వృత్తాంతమును విని ఆనందించెను. ఆమె మిక్కిలి ప్రేమ గలదియై తన భాగ్యమును కొనియాడెను (2). తరువాత కొంతకాలమునకు ఆయన యథావిధిగా గర్భాధాన సంస్కారము ననుష్ఠించగా ఆమె గర్భవతి ఆయెను (3). తరువాత పూర్ణ గర్భవికాసమునకు పూర్వమునందు విద్వాంసుడగు ఆ విశ్వానరుడు గృహ్యసూత్రములో చెప్పిన విధానముతో పురుషత్వ వృద్ధి కొరకై పుంసవనమును చక్కగా అనుష్ఠించెను (4). తరువాత ఎనిమిదవ మాసములో దయాళువగు ఆ బ్రాహ్మణుడు గర్భరూపమును సమృద్ధము చేయునది, సుఖ ప్రసవమును కలిగించునది యగు సీమంతమును జరిపించెను (5). తరువాత నక్షత్రములు శుభకరములై యుండగా, బృహస్పతి కేంద్రమునందుండగా, శుభగ్రహ యోగములయందు శుభలగ్నములో చంద్రుని వంటి మోము గలవాడు (6), విపత్తులను నశింపజేయువాడు, మృత్యురూపమగు అమంగళమును తొలగించువాడు అగు శివుడు, ఆ శుచిష్మతికి పుత్రుడై ప్రకటమయ్యెను (7).

శర్వస్సమస్త సుఖదో భూర్భువస్స్వర్ని వాసినామ్ ।
గంధవాహన వాహాశ్చ దిగ్వధూర్ముఖవాససః ॥
ఇష్టగంధ ప్రసూనౌఘైర్వ వృషుస్తే ఘనా ఘనాః ।
దేవదుందుభయో నేదు: ప్రసేదుస్సర్వతో దిశః ॥
పరితస్సరితస్స్వచ్ఛా భూతానాం మానసైస్సహ ।
తమోఽతామ్యత్తు నితరాం రజోఽపి విరజోఽభవత్ ॥
సత్త్వాస్సత్త్వ సమాయుక్తా స్సుధావృష్టిర్బభూవ వై ।
కల్యాణీ సర్వథా వాణీ ప్రాణినః ప్రియవత్య భూత్ ॥
రంభాముఖ్యా అప్సరసో మంగల ద్రవ్యపాణయః ।
విద్యాధర్యశ్చ కిన్నర్యస్త థామర్యస్సహస్రశః ॥
గంధర్వోరగయక్షాణాం సుమానిన్య శ్శుభస్వరాః ।
గాయంత్యో మంగలం గీతం తత్రా జగ్మురనేకశః ॥
మరీచిరత్రిః పులహః పులస్త్య: క్రతురంగిరాః ।
వసిష్ఠః కశ్యపోఽగస్త్యో విభాండో మాండవీసుతః ॥

భూర్భువస్సువ ర్లోకములలో నివసించువారికి సమస్త సుఖములను ఇచ్చే శర్వుడు అవతరించెను. ఆ సమయములో సుగంధమును కలిగియున్న వాయువులు దిక్కులు అనే యువతుల ముఖములపై వస్త్రములైనవి (8). మహామేఘములు అభీష్టమగు సుగంధముగల పుష్పములను అధికముగా వర్షించినవి. దేవదుందుభులు మ్రోగినవి. దిక్కులన్నియు నిర్మలమైనవి (9). జలాశయములన్నియు తేటపడెను. ప్రాణుల మనస్సులు ప్రసన్నమయ్యెను. చీకట్లు తొలగిపోయెను. ధూళి అణగారి దిక్కులు స్వచ్ఛమయ్యెను (10). ప్రాణులు ఆనందమును పొందినవి. అమృతవర్షము కురిసెను. మానవుల వాక్కు అన్ని విధములుగా మంగళకరము, ప్రియమైనది ఆయెను (11). రంభాద్యప్సరసలు, విద్యా. ధరయువతులు, కిన్నర స్త్రీలు, వేలాది మంది దేవతా స్త్రీలు, గంధర్వ నాగ యక్షుల యువతులు మంగళద్రవ్యములను చేత బట్టి మధురస్వరముతో మంగళ గీతములను పాడుతూ పెద్ద సంఖ్యలో అచటకు విచ్చేసిరి (12, 13). మరీచి, అత్రి, పులహుడు , పులస్త్యుడు, క్రతువు, అంగిరస్సు, వసిష్ఠుడు, కశ్యపుడు, అగస్త్యుడు, మాండవీ పుత్రుడగు విభాండుడు విచ్చేసిరి (14).

లోమశో రోమచరణో భరద్వాజోఽథ గౌతమః ।
భృగుస్తు గాలవో గర్గో జాతూకర్ణః పరాశరః ॥।
ఆపస్తంబో యాజ్ఞవల్క్యో దక్షవాల్మీకి ముద్గలాః ।
శాతాతపశ్చ లిఖితశ్శిలా దశ్శంఖ ఉంఛభుక్ ॥
జమదగ్నిశ్చ సంవర్తో మతంగో భరతోంశుమాన్ ।
వ్యాసః కాత్యాయనః కుత్సశ్శౌనకస్సు శ్రుతశ్శుకః ॥
ఋష్యశృంగోఽథ దుర్వాసాశ్శుచి ర్నారదతుంబురూ ।
ఉత్తంకో వామ దేవశ్చ పవనోఽశితదేవలౌ ॥

సాలంకాయన హారీతౌ విశ్వామిత్రోఽథ భార్గవః ।
మృకండుస్సహ పుత్రేణ పర్వతో దారుకస్తథా ॥
ధౌమ్యోపమన్యువత్సాద్యా మునయో మునికన్యకాః ।
తచ్ఛాంత్యర్థం సమాజగ్ముర్ధన్యం విశ్వానరాశ్రమమ్ ॥
బ్రహ్మా బృహస్పతియుతో దేవో గరుడవాహనః ।
నందిభృంగి సమాయుక్తో గౌర్యా సహ వృషధ్వజః ॥

ఈ లోమశుడు, రోమచరణుడు, భరద్వాజుడు, గౌతముడు, భృగువు, గాలవుడు, గర్గుడు, జాతూ కర్ణుడు, పరాశరుడు (15), ఆపస్తంబుడు, యాజ్ఞవల్క్యుడు, దక్షుడు, వాల్మీకి, ముద్గలుడు, శాతాతపుడు, లిఖితుడు, శిలాదుడు, ఉంఛవృత్తి చే జీవించు శంఖుడు (16), జమదగ్ని, సంవర్తుడు,మతంగుడు, భరతుడు, అంశుమంతుడు, వ్యాసుడు, కాత్యా యనుడు, కుత్సుడు, శౌనకుడు, సువ్రతుడు, శుకుడు (17), ఋష్యశృంగుడు, దూర్వాసుడు, శుచి, నారదుడు, తుంబురుడు, ఉత్తంకుడు, వామదేవుడు, పవనుడు, అశితుడు, దేవలుడు (18), సాలంకాయనుడు, హారీతుడు, విశ్వామిత్రుడు, భార్గవుడు, మృకండుడు, ఆతని పుత్రుడగు మార్కండేయుడు, పర్వతుడు, దారుకుడు (19), ధౌమ్యుడు, ఉపమన్యుడు, వత్సుడు మొదలగు మహర్షులు, మునికన్యకలు జన్మకాలమందు చేయబడే శాంతికొరకై విశ్వానరుని పవిత్రమగు ఆశ్రమమునకు విచ్చేసిరి (20). బ్రహ్మ, బృహస్పతి, గరుడ వాహనుడగు విష్ణు దేవుడు, నంది భృంగులతో గూడి పార్వతీపరమేశ్వరులు విచ్చేసిరి (21).

మహేంద్రముఖ్యా గీర్వాణా నాగాః పాతాల వాసినః ।
రత్నాన్యాదాయ బహుశస్సరిత్కా మహోబ్ధయః ॥
స్థావరా జంగమం రూపం ధృత్వాయాతాస్సహస్రశః ।
మహామహోత్సవే తస్మిన్ బభూవాకాలకౌముదీ ॥
జాతకర్మ స్వయం తస్య కృతవాన్ విధిరానతః ।
శ్రుతిం విచార్య తద్రూపం నామ్నా గృహపతిస్త్వయమ్ ॥
ఇతి నామ దదౌ తస్మై దేయమేకాదశేఽహని ।
నామకర్మ విధానేన తదర్థం శ్రుతిముచ్చరన్ ॥
చతుర్నిగమ మంత్రోక్తై రాశీర్భిర భినంద్య చ ।
సమయార్థం సమారుహ్య సర్వేషాం చ పితామహ ॥
కృత్వా బాలోచితాం రక్షాం లౌకికీం గతిమాశ్రితః ।
ఆరుహ్య యానం స్వం ధామ హరోకపి హరిణా యయౌ ॥
అహో రూపమహో తేజస్సహో సర్వాంగలక్షణమ్ ।
అహో శుచిష్మతీ భాగ్యమావి రాసీత్స్వయం హరః ॥

అథవా కిమిదం చిత్రం సర్వభక్త జనేష్వహో ।
స్వయమావిరభూద్రుద్రో యతో రుద్రస్త దర్చితః ॥
ఇతి స్తువంతస్తే ఽన్యోన్యం సంప్రహృష్టతనూరుహాః ।
విశ్వానరం సమాపృచ్ఛ్య జగ్ముస్సర్వే యథాగతమ్ ॥

మహేంద్రుడు మొదలగు దేవతలు, పాతాళమునందు నివసించు నాగులు, నదులు, సముద్రములు అనేక రత్నములను తీసుకొని వచ్చిరి (22). పర్వతములు పురుషరూపమును దాల్చి వేల సంఖ్యలో వచ్చిరి. ఆ మహోత్సవమునందు కాలము కాని కాలములో వెన్నెలలు కురిసినవి (23). బ్రహ్మ వినయపూర్వకముగా ఆ బాలునకు జాతకర్మను స్వయముగా చేయించెను.' ఆ బాలుని రూపమును మరియు వేదమును పరిశీలించి ఆతనికి స్వయముగా గృహపతి యని పేరిడెను (24). పదకొండవ రోజున వేదమంత్రముల నుచ్చరిస్తూ నామకర్మ విధానముతో ఆ పేరును పెట్టెను (25). ఆ తరువాత అందరికీ పితామహుడగు బ్రహ్మ నాల్గు వేదములలోని మంత్రములతో ఆశీర్వదించి అభినందించి హంసారూఢుడై తన లోకమునకు వెళ్లెను (26). లోకపు పోకడనను సరించి శివవిష్ణువులు కూడా బాలునకు తగిన రక్షను చేసి తమ వాహనములపై తమ ధామములకు వెడలిరి (27). అహో ! ఏమి రూపము ! ఏమి తేజస్సు! అవయవములన్నియు ఎంత చక్కగా నున్నవియో! అహో! శుచిష్మతి భాగ్యవంతురాలు. శివుడు స్వయముగా ఆమెకు పుత్రుడై అవతరించినాడు (28). అయిననూ, భక్తజనుల విషయములో ఇట్లు జరుగుటలో ఆశ్చర్యమేమున్నది? వారు రుద్రుని అర్చించినారు. కాన రుద్రుడు స్వయముగా ఆవిర్భవించినాడు (29). వారందరు ఇట్లు స్తుతిస్తూ, తమలో తాము మాటలాడు కొనుచూ, గగుర్పాటుతో గూడిన దేహములు గలవారై విశ్వానరుని వద్ద సెలవు తీసుకొని వచ్చిన దారిన వెళ్లిరి (30).

అతః పుత్రం సమీహంతే గృహస్థాశ్రమవాసినః ।
పుత్రేణ లో కాన్ జయతి శ్రుతిరేషా సనాతనీ ॥
అపుత్రస్య గృహం శూన్యమపుత్ర స్యార్జనం వృథా ।
అపుత్రస్య తపశ్ఛిన్నం నో పవిత్రత్వ పుత్రతః ॥
న పుత్రాత్పర లాభో న పుత్రాత్పరమం సుఖమ్ ।
న పుత్రాత్పరమం మిత్రం పరత్రేహ చ కుత్రచిత్ ॥
నిష్క్రమోఽథ చతుర్థేఽ స్య మాసి పిత్రా కృతో గృహాత్ ।
అన్నప్రాశనమబ్దేహ చూడార్థే చార్థవత్కృతా ॥
కర్ణవేధం తతః కృత్వా శ్రవణర్క్షే స కర్మవిత్ ।
బ్రహ్మతేజోఽ భివృద్ధ్యర్థం పంచమేఽబ్దే వ్రతం దదౌ ॥

ఉపాకర్మ తతః కృత్వా వేదానధ్యాపయత్సుధీః ।

అబ్దం వేదాన్ స విధినాఽధ్యైష్ట సాంగపద క్రమాన్ ॥

విద్యా జాతం సమస్తం చ సాక్షిమాత్రం గురోర్ముఖాత్ ।

వినయాది గుణానావిష్కుర్వన్ జగ్రాహ శక్తి మాన్ ॥

ఇందువలననే గృహస్థాశ్రమములో నున్నవారు పుత్రుని కాంక్షించెదరు. పుత్రుడు పుణ్యలోకములను పొందుటలో కారణమగునని సనాతనమగు వేదము చెప్పుచున్నది (31). పుత్రుడు లేని వాని ఇల్లు శూన్యముగా నుండును. వాని సంపాదన వ్యర్థము. వాని తపస్సు చెడిపోవును. పుత్రుడు లేని వానికి పవిత్రత ఉండదు (32). పుత్రుని కంటె గొప్ప లాభము గాని, గొప్ప సుఖము గాని లేదు. ఇహపరలోకములలో పుత్రునికంటె గొప్ప మిత్రుడు లేడు (33). తండ్రి ఆ బాలునకు నాల్గవ మాసములో ఇంటి గడపను దాటుట అను ఉత్సవమును, ఆరవమాసములో అన్నప్రాశనమును, సంవత్సరము దాటిన తరువాత కేశవపనమును చేయించెను (34). కర్మవేత్తయగు ఆ తండ్రి శ్రవణా నక్షత్రమునాడు ఆ బాలునకు చెవులను కుట్టించెను. అయిదవయేట ఆ బాలునిచే బ్రహ్మతేజస్సును వర్ధిల్లజేయు వ్రతమును చేయించెను (35). తరువాత ఉపాకర్మను జరిపించి ఆ సబ్రాహ్మణుడు ఆ బాలునకు వేదములను చెప్పించెను. ఆతడు ఒక సంవత్సరకాలము అంగములతో పదక్రమములతో గూడిన వేదములను యథావిధిగా అధ్యయనము చేసెను (36). శక్తిమంతుడగు ఆ బాలుడు విద్యలనన్నిటిని గురుముఖమునుండి నియమ రక్షణకొరకు మాత్రమే గ్రహించుటయే గాక వినయము మొదలగు సద్గుణములను కూడ ప్రకటించెను (37).

తతోఽథ నవమే వర్షే పిత్రో శ్శు శ్రూషణే రతమ్ ।

వైశ్వానరం గృహపతిం ద్రష్టు మాయాచ్చ నారదః ॥

విశ్వానరోటజం ప్రాప్య దేవర్షిస్తం తు కౌతుకీ ।

అపృచ్ఛత్కుశలం తత్ర గృహీతార్ఘ్యాసనః క్రమాత్ ॥

తతస్సర్వం చ తద్భాగ్యం పుత్రధర్మం చ సమ్ముఖే ।

వైశ్వానరం సమవదత్ స్మృత్వా శివపదాంబుజమ్ ॥

ఇత్యుక్త మునినా బాలః పిత్రోరాజ్ఞామవాప్య సః ।

ప్రణమ్య నారదం శ్రీమాన్ భక్త్యా ప్రహ్వ ఉపావిశత్ ॥

వైశ్వానర సమత్యే హి మమోత్సంగే నిషీద భోః ।

లక్షణాని పరీక్షేఽహం పాణిం దర్శయ దక్షిణమ్ ॥

తతో దృష్ట్వా తు సర్వం హి తాలు జిహ్వాది నారదః ।

విశ్వానరం సమవదచ్ఛి వప్రేరణయా సుధీః ॥

తరువాత తొమ్మిదవ యేట తల్లిదండ్రుల సేవలో నిమగ్నుడై యున్న విశ్వానరపుత్రుఁడగు గృహపతిని దర్శించుటకు నారదుడు వచ్చెను. (38). అట్టి కుతూహలముతో దేవర్షియగు నారదుడు విశ్వానరుని పర్ణశాలను చేరుకొని అర్ఘ్యము మొదలగు వాటిని స్వీకరించి ఆసనముపై గూర్చుండి

కుశలప్రశ్నలనడిగెను (39). ఆయన శివుని పాదపద్మములను స్మరించి విశ్వానరుని పుత్రుని యెదుటనే ఆ బాలుని భాగ్యమును, ఆతడు పాటించే పుత్రధర్మమును గూర్చి విస్తారముగా చెప్పెను (40). మహర్షి ఇట్లు చెప్పగా ఆ బాలుడు తల్లిదండ్రుల యాజ్ఞచే నారదమహర్షికి సవినయముగా భక్తితో నమస్కరించి కూర్చుండెను. అపుడా మహర్షి మిక్కిలి శోభిల్లే బాలునితో నిట్లనెను (41). ఓయీ! విశ్వానరకుమారా! ఇటు రమ్ము. నా ఒడిలో గూర్చుండుము. నీ కుడిచేతిని చూపుము. నేను లక్షణములను పరీక్షించెదను (42). నారదుడు అపుడు బాలుని హస్తరేఖలను, నోటిలోపలి భాగమును, నాలుకను ఇతరము సర్వమును చూచెను. బుద్ధి శాలియగు నారదుడు అపుడు శివుని ప్రేరణను పొంది విశ్వానరునితో నిట్లనెను (43).

నారద ఉవాచః

విశ్వానరమునే వచ్మి శృణు పుత్రాంక మాదరాత్ ।
సర్వాంగస్థ్యంకవాన్ పుత్రో మహాలక్షణ వానయమ్ ॥
కింతు సర్వగుణోపేతం సర్వలక్షణ లక్షితమ్ ।
సంపూర్ణనిర్మల కలం పాలయేద్విధు వద్విధిః ॥
తస్మాత్సర్వ ప్రయత్నేన రక్షణీయస్స సా శిశుః ।
గుణోఽపి దోషతాం యాతి వక్రీ భూతే విధాతరి ॥
శంకేఽస్య ద్వాదశే మాసి ప్రత్యూహో విద్యుదగ్నితః ।
ఇత్యుక్త్వా నారదోఽగచ్ఛద్దేవలోకం యథాగతమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం
గృహపత్యవతారవర్ణనం నామ చతుర్దశోఽధ్యాయః (14).

నారదుడిట్లు పలికెను -

ఓ విశ్వానరమహర్షీ! నీ పుత్రుని యందు గల చిహ్నములను గురించి చెప్పెదను\. ఆదరముతో వినుము. గొప్ప లక్షణములు గల ఈ నీ పుత్రుని యందు చిహ్నములు సర్వావయవములయందు గలవు (44). కాని సర్వగుణములతో గూడినవాడు, సర్వలక్షణములతో ప్రకాశించువాడు, చంద్రుని వలె పూర్ణస్వచ్ఛ కళలు గలవాడు అగు ఈ బాలుని విధాత రక్షించుగాక! (45) కావున నీవు ప్రయత్నములన్నిటినీ ఆచరించి ఈ శిశువును రక్షించుము. విధి వక్రించినచో గుణము కూడా దోషము అగును (46). ఈ బాలునకు పన్నెండవ సంవత్సరములో గృహపతి తపస్సును చేయుట విద్యుత్తు (మెరుపు) వలన, లేక అగ్ని వలన గండము గలదని నాకు శంక కలుగుచున్నది. ఇట్లు పలికి నారధుడు వచ్చిన దారిన దేవలోకమునకు వెళ్లెను (47).

శ్రీ శివమహాపురాణములోని శతరుద్ర సంహితయందు గృహ పత్యవతారవర్ణనమనే పదునాల్గవ అధ్యాయము ముగిసినది (14).

15 – గృహపతి తపస్సును చేయుట

నందీశ్వర ఉవాచః

విశ్వానరస్సపత్నీ కస్తచ్ఛ్రుత్వా నారదేరితమ్ ।
తదేవం మన్యమానోఽభూద్వజ్రపాతం సుదారుణమ్ ॥
హా హతోఽస్మీతి వచసా హృదయం సమతాడయత్ ।
మూర్ఛామవాప మహతీం పుత్ర శోకసమాకులః ॥
శుచిష్మత్యపి దుఃఖార్తా రురోదాతీవ దుస్సహమ్ ।
అతిస్వరేణ హాహారావైరత్యంతం వ్యాకులేంద్రియా ॥
శ్రుత్వార్త నాదమితి విశ్వనరోపి మోహం హిత్వోత్థితః కిమితి కిం త్వితి కిం కిమేతత్ ।
ఉచ్చైర్వదన్ గృహపతిః క్వ స మే బహిస్స్థః ప్రాణోంతరాత్మ నిలయస్సకలేంద్రియేశః ॥
తతో దృష్ట్వా స పితరౌ బహుశోక సమావృతౌ ।
స్మిత్వోవాచ గృహపతిస్స బాలశ్శంకరాంశజః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

విశ్వానరుడు భార్యతో గూడి నారదుని పలుకులను విని, ఆ పలుకులు మిక్కిలి దారుణమగు వజ్రపు దెబ్బవంటివని భావించెను (1). "అయ్యో ! నేను హతుడనైతిని' అని పలికి ఆతడు గుండెలను బాదుకొనెను. పుత్ర శోకముచే పీడితుడై ఆతడు గాఢమగు మూర్ఛను పొందెను (2). శుచిష్మతి కూడ సహింప శక్యము కాని దుఃఖముచే పీడింపబడి మిక్కిలి వ్యాకులమైన ఇంద్రియములు గలదై బిగ్గరగా హాహారావముతో ఏడ్చెను (3). ఆమె యొక్క ఇట్టి ఆర్తనాదమును విని విశ్వానరుడు మోహమునుండి బయటకు వచ్చి లేచి నిలబడి ' ఇట్లు అగుటకు కారణమేమి ? నాకు బహిః ప్రాణమైనవాడు, నా అంతరాత్మలో సర్వదా ఉండువాడు, ఇంద్రియములన్నింటికీ ప్రభువు అగు ఆ నాగృహపతి ఎక్కడ ఉన్నాడు? అని బిగ్గరగా పలుక జొచ్చెను (4). శంకరుని అంశవలన జన్మించిన గృహపతియను ఆబాలుడు మిక్కిలి దుఃఖముతో గూడియున్న తల్లిదండ్రులను గాంచి చిరునవ్వుతో అపుడు ఇట్లనెను (5).

గృహపతిరువాచ ।

హే మాతస్తాత కిం జాతం కారణం తద్వధునా ।
కిమర్థం రుదితోఽత్యర్థం త్రాసస్తాద్భృక్కుతో హి వామ్ ॥
న మాం కృతవపుస్త్రాణం భవచ్చరణరేణుభిః ।
కాలః కలయితుం శక్తో వరాకీ చంచలాల్పికా ॥
ప్రతిజ్ఞాం శృణుతాం తాతౌ యది వాం తనయో హ్యహమ్ ।
కరిష్యేఽహం తథా యేన మృత్యుస్త్రస్తో భవిష్యతి ॥

మృత్యుంజయం సమారాధ్య సర్వజ్ఞం సర్వదం సతామ్ ।
జయిష్యామి మహాకాలం సత్యం తాతౌ వదామ్యహమ్ ॥

గృహపతి యిట్లు పలికెను -

ఓ తల్లీ! తండ్రీ! ఏమైనది? ఇపుడీ స్థితికి కారణమేమి? చెప్పుడు. మీరు అధికముగా ఏల దుఃఖించుచున్నారు? మీకీ భయమునకు కారణమేమి? (6) మీ పాదధూళిచే రక్షణ కల్పించబడిన దేహముగల నన్ను కాలుడు స్పృశించుటకైననూ సమర్థుడు కాడు. అల్ప తుచ్ఛ చంచల మృత్యువు గురించి చెప్పనదేమున్నది? (7) తల్లితండ్రులారా! నా ప్రతిజ్ఞను వినుడు. నేను మీపుత్రుడనైనచో, మృత్యువు కూడ భయపడునట్లు నేను చేయగలను (8). తల్లి దండ్రులారా! సర్వజ్ఞుడు, సత్పురుషులకు సర్వమునిచ్చువాడు అగు మృత్యుంజయుని ఆరాధించి నేను మహాకాలుని కూడ జయించెదను. నేను సత్యమును పలుకుచున్నాను (9).

నందీశ్వర ఉవాచః

ఇతి శ్రుత్వా వచస్తస్య జారితౌ ద్విజదంపతీ ।
అకాలామృత వర్షౌఘైర్గతతా పౌ తదోచతుః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ బాలుని ఈ మాటలను విని, నీరసపడి యున్న ఆ బ్రాహ్మణ దంపతులు అకాలములో సంభవించి.. అమృతవర్షధారలచే తొలగిన దుఃఖముగలవారై అపుడు ఇట్లు పలికిరి (10).

పునర్బ్రూహి పునర్బ్రూహి కీ దృక్ కీ దృక్ పునర్వద ।
కాలః కలయితుం నాలం వరాకీ చంచలాస్తి కా ॥
అపమృత్యోపనాశాయ మహోపాయస్త్వయేరితః ।
మృత్యుంజయాఖ్య దేవస్య సమారాధాన లక్షణః ॥
తద్వచ్చ శరణం శంభోర్నాతః పరతరం హి తత్ ।
మనోరథ పథాతీత కారిణః పాపహారిణః ॥
కిం న శ్రుతం త్వయా తాత శ్వేతకేతుం యథా పురా ।
పాశితం కాల పాశేన రరక్ష త్రిపురాంతకః ॥
శిలాదతనయం మృత్యు గ్రస్తమష్టాబ్దమాత్రకమ్ ।
శివో నిజజనం చక్రే నందినం విశ్వనందినమ్ ॥
క్షీరోద మథనోద్భూతం ప్రలయానల సన్నిభమ్ ।
పీత్వా హాలాహలం ఘోరమరక్షద్భువనత్రయమ్ ॥
జలంధర మహాదర్పం హృత త్రైలోక్య సంపదమ్ ।
రుచిరాంగుష్ఠరేఖోత్థ్ చక్రేణ నిజఘాన యః ॥



య ఏకేషు నిపాతోత్థ జ్వలనైస్త్రీ పురం పురా ।
త్రైలోక్యైశ్వర్యసమ్మూఢం శోషయామాస భానునా ॥
కామం దృష్టి నిపాతేన త్రైలోక్య విజయోర్జితమ్ ।
నినాయానంగపదవీం వీక్ష్యమాణేష్వజాదిషు ॥
తం బ్రహ్మాద్యైక కర్తారం మేఘవాహనమచ్యుతమ్ ।
ప్రయాహి పుత్ర శరణం విశ్వరక్షామణిం శివమ్ ॥

బ్రాహ్మణ దంపతులిట్లు పలికిరి –

మరల చెప్పుము. అది యెట్లు? మరల చెప్పుము. ఏమది? కాలుడు నిన్ను నశింపజేయుటకు సమర్థుడు కాడా? తుచ్ఛము, చంచలము అయినది ఏది? (11) మా ఇద్దరి దుఃఖమును తొలగించుటకు నీవు గొప్ప ఉపాయమును చెప్పితివి. మృత్యుంజయుడను ఈశ్వరుని కొలుచుట అనునది శ్రేష్ఠమగు ఉపాయము (12). మనకు శంభుడే శరణు, మనోరథమునకు కూడా అందని కార్యములను చేయువాడు, పాపములను హరింపజేయువాడునగు శంభుని కంటే గొప్ప దైవము లేదు (13). పుత్రా! నీవు వినలేదా యేమి? పూర్వము మృత్యుపాశముచే బంధింపబడిన శ్వేతకేతువును త్రిపురాంతకుడగు శివుడు రక్షించియున్నాడు (14). ఎనిమిది సంవత్సరముల వయస్సులో మృత్యువుచే కబళింపబడుటకు సిద్ధముగా నున్న శిలాదపుత్రుని శివుడు రక్షించెను. జగత్తునకు ఆనందము నిచ్చే ఆ నంది శివుని గణములకు అధిపతి యైనాడు (15). క్షీరసముద్రమును మథించగా పుట్టిన, ప్రళయకాలాగ్నిని బోలియున్న ఘోరమగు హాలా హల విషమును భక్షించి ఆయన ముల్లోకములను రక్షించినాడు (16). ముల్లోకముల సంపదను అపహరించి మిక్కిలి గర్వించియున్న జలంధరుని శివుడు తన అందమైన అంగుష్ఠముతో చక్రమును ప్రయోగించి సంహరించెను (17). శివుడు పూర్వము ముల్లోకముల ఐశ్వర్యముతో మోహమును పొందియున్న త్రిపురాసురులను ఒకే బాణమును ప్రయోగించి దానినుండి పుట్టిన అగ్ని జ్వాలలలో దహించివేసెను (18). ముల్లోకములను జయించి గర్వితుడైయున్న మన్మథుని శివుడు బ్రహ్మాదులు చూచుచుండగా తన కంటి నుండి ఉద్భవించిన జ్వాలతో దహించి శరీరము లేనివానిగా చేసెను (19). ఓ పుత్రా! బ్రహ్మాది స్తంబపర్యంతమునకు ఏకైక స్రష్ట, ఇంద్ర-ఉపేంద్రులకు తండ్రి, వినాశము లేని వాడు, విశ్వమును రక్షించే శ్రేష్ఠదైవము అగు శివుని శరణు పొందుము (20).

నందీశ్వర ఉవాచః

పిత్రోరనుజ్ఞాం ప్రాప్యేతి ప్రణమ్య చరణౌ తయోః ।
ప్రదక్షిణ్యముపావృత్య బహ్వాశ్వాస్య వినిర్యయౌ ॥
సంప్రాప్య కాశీం దుష్ప్రాపాం బ్రహ్మ నారాయణాదిభిః ।
మహాసంవర్త సంతాప హంత్రీం విశ్వేశపాలితామ్ ॥
స్వర్ధున్యా హారయష్ట్యేవ రాజితాం కంఠ భూమిషు ।
విచిత్రగుణశాలిన్యా హరపత్న్యా విరాజితామ్ ॥

తత్ర ప్రాప్య స విప్రేశః ప్రాగ్యయౌ మణి కర్ణికామ్ ।
తత్ర స్నాత్వా విధానేన దృష్ట్వా విశ్వేశ్వరం ప్రభుమ్ ॥
సాంజలిర్నతశీర్షోఽసౌ మహానందాన్వితస్సుధీః ।
త్రైలోక్య ప్రాణ సంత్రాణ కారిణం ప్రణనామ హ ॥
ఆలో క్యాలో క్య తల్లింగం తుతోష హృదయే ముహుః ।
పరమానంద కందాఢ్యం స్ఫుటమేతన్న సంశయః ॥
అహో న మత్తో ధన్యోఽస్తి త్రైలోక్యే సచరాచరే ।
యద ద్రాక్షిష మద్యాహం శ్రీ మద్విశ్వేశ్వరం విభుమ్ ॥
మమ భాగ్యోదయాయైవ నారదేన మహర్షిణా ।
పురాగత్య తథోక్తం యత్ కృతకృత్యోఽ స్మ్యహం తతః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఈ విధముగా ఆతడు తల్లి దండ్రుల అనుమతిని పొంది వారి పాదములకు నమస్కరించి, ప్రదక్షిణము చేసి వారిని చాలా సేపు ఓదార్చి బయలుదేరెను (21). బ్రహ్మ, నారాయణుడు మొదలగు వారికైనను పొంద శక్యము కానిది, మహాప్రళయ తాపమును పోగొట్టునది, విశ్వేశ్వరునిచే పాలింపబడునది (22), కంఠ ప్రదేశము నందలి హారము వలె శోభిల్లు గంగానదితో కూడి యున్నది, విచిత్ర గుణములతో ప్రకాశించు పార్వతీదేవితో కూడియున్నది (23) అగు కాశీ నగరమును చేరుకొని ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడు ముందుగా మణికర్ణికకు వెళ్లి, అచట యథావిధి గా స్నానము చేసి, విశ్వేశ్వర ప్రభుని దర్శించి (24), చేతులు జోడించి తలవంచి మహానందముతో, ముల్లోకములలోని ప్రాణులను రక్షించే ఆ దేవునకు ప్రణమిల్లెను (25). ఆ లింగమును అనేక పర్యాయములు దర్శించి ఆ విద్వాంసుడు హృదయములో చాల ఆనందించెను. ఈ లింగము పరమానందఘనము అను విషయము స్పష్టమగుచున్నది. దీనిలో సంశయము లేదు (26). స్థావరజంగమములగు ప్రాణులతో గూడిన ఈ ముల్లోకములలో నాకంటె గొప్ప ధన్యుడు లేడు గదా! ఏలయన, నేనీనాడు శ్రీ మద్విశ్వేశ్వర విభుని దర్శించగల్గితిని (27). నా భాగ్యము పండుట చేతనే నారదమహర్షి మా ఇంటికి వచ్చి అట్లు చెప్పినాడు. అట్లు చెప్పుట వలన నేను ఇపుడు కృతార్థుడ.నైతిని (28)

ఇ త్యానందామృతర సైర్విధాయ స హి పారణమ్ ।
తతశ్చ ఖేఽహ్ని సంస్థాప్య లింగం సర్వహిత ప్రదమ్ ॥
జగ్రాహ నియమాన్ ఘోరాన్ దుష్కరానకృతాత్మభిః ।
అష్టోత్తరశతైః కుంభైః పూర్ణైర్గంగాంభసా శుభైః ॥

సంస్నాప్య వాససా పూతైః పూతాత్మా ప్రత్యహం శివమ్ ।
నీలోత్పలమయీం మాలాం సమర్పయతి సోఽన్వహమ్ ॥
అష్టాధిక సహస్రైస్తు సుమనోభిర్వినిర్మితామ్ ।
స పక్షే వాథ వా మాసే కందమూల ఫలాశనః ॥
శీర్ణపర్ణాశనైర్ధీరః షణ్మాసం సంబభూవ సః ।
షణ్మాసం వాయుభక్షోఽభూత్ షణ్మాసం జలబిందుభుక్ ॥
ఏవం వర్ష వయస్తస్య వ్యతిక్రాంతం మహాత్మనః ।
శివైకమనసో విప్రాస్తప్యమానస్య నారద ॥
జన్మతో ద్వాదశే వర్షే తద్వచో నారదేరితమ్ ।
సత్యం కరిష్యన్నివ తమభ్య గాత్కులిశాయుధః ॥
ఉవాచ చ వరం బ్రూహి దద్మి త్వన్మనసి స్థితమ్ ।
అహం శతక్రతుర్విప్ర ప్రసన్నోఽస్మి శుభవ్రతైః ॥
ఇత్యాకర్ణ్య మహేంద్రస్య వాక్యం మునికుమారకః ।
ఉవాచ మధురం ధీరః కీర్త యన్మధురాక్షరమ్ ॥

ఆతడీ తీరున ఆనందమనే అమృతరసమునే ఆహారముగా స్వీకరించి, తరువాత శుభముహూర్తమునందు సర్వులకు హితమును కలిగించే లింగమును స్థాపించి (29), ఇంద్రియజయము లేని మానవులు స్వీకరింప శక్యము కాని నియమములను చేపట్టెను. మంగళకరమగు నూటయెనిమిది కుంభములలో వస్త్ర పూతమైన గంగా జలమును నింపి (30), ఆతడు ప్రతిదినము పవిత్రమగు అంతఃకరణ గలవాడై శివునకు అభిషేకమును చేసెను. ఆతడు ప్రతిదినము నల్ల కలువల మాలను సమర్పించెడివాడు (31). మరియు వెయ్యి ఎనిమిది పుష్పములతో కట్టిన మాలను సమర్పించెడివాడు. ఆతడు పదిహేను రోజులకు, లేదా నెలకు ఒక సారి దుంపలను, పళ్లను తినెడివాడు (32). ఆ ధీరుడు ఆరు మాసములు ఎండుటాకులను భక్షించెను. ఆరు మాసములు గాలిని, ఆరు మాసములు నీటి బిందువులను మాత్రమే స్వీకరించెను (33). ఓ నారదా! ఓ బ్రాహ్మణులారా! ఆ మహాత్ముడు ఇట్లు శివునియందు మనస్సును దృఢముగా నిలిపి తపస్సు చేయుచుండగా ఒక సంవత్సరము గడిచెను (34). పుట్టిన నాటినుండి పన్నెండవ సంవత్సరమునందు గండమున్నదని నారదుడు చెప్పిన వచనమును సత్యము చేయుట కొరకా యన్నట్లు వజ్రము ఆయుధముగా గల ఇంద్రుడు ఆతనిని సమీపించెను (35). 'ఓయీ! బ్రాహ్మణా! నీ శుభకరమగు వ్రతములచే నేను ప్రసన్నుడనైతిని, నేను ఇంద్రుడను. నీ మనసులోని వరమును కోరుకొనుము. ఇచ్చెదను' అని అతడు పలికెను (36). మహేంద్రుని ఈ వాక్యమును విని ధీరుడగు ఆ మునికుమారుడు మధురమగు వచనమును ఈ తీరున మధురముగా పలికెను (37).

గృహపతిరువాచ।

మఘవన్ వృత్రశత్రో త్వాం జానే కులిశపాణినమ్ ।

నాహం వృణే వరస్త్వత్త శ్శంకరో వరదోఽస్తిమే ॥

గృహపతి ఇట్లు పలికెను –

ఓ ఇంద్రా! వృత్ర సంహారకా! వజ్రాయుధుడవగు నిన్ను నేను ఎరుంగుదు(ఁ)ను. నేను నీ నుండి వరమును కోరను. నాకు శంకరుడు వరము నీయగలడు (38).

ఇంద్ర ఉవాచః

న మత్త శ్శంకరస్త్వన్యో దేవదేవోఽస్మ్యహం శిశో ।

విహాయ బాలిశత్వం త్వం వరం యాచస్వ మా చిరమ్ ॥

ఇంద్రుడిట్లు పలికెను –

ఓయీ! బాలకా! శంకరుడు నాకంటే భిన్నముగా లేడు. నేనే దేవదేవుడను. నీవు ఈ చిన్నతనపు లక్షణమును విడనాడి శీఘ్రముగా వరమును కోరుకొనుము (39).

గృహపతి రువాచ ।

గచ్ఛాహల్యాపతేఽ సాధో గోత్రారే పాకశాసన ।

న ప్రార్థయే పశుపతేరన్యం దేవాంతరం స్ఫుటమ్ ॥

గృహపతి ఇట్లు పలికెను –

ఓయీ! అహల్యా జారా ! దుష్టా! పర్వత శత్రూ! దానవశిక్షకా! వెళ్లుము. పశుపతి తక్క మరియొక దైవమునుండి నేను వరమును కోరను. ఇది స్పష్టము (40).

నందీశ్వర ఉవాచః

ఇతి తస్య వచశ్శ్రుత్వా క్రోధసంరక్తలోచనః ।

ఉద్యమ్య కులిశం ఘోరం భీషయామాస బాలకమ్ ॥

స దృష్ట్వా బాలకో వజ్రం విద్యుజ్జ్వాలా సమాకులమ్ ।

స్మరన్నారద వాక్యంచ ముమూర్ఛ భయవిహ్వలః ॥

అథ గౌరీపతి శ్శంభురావి రాసీత్తమోనుదః ।

ఉత్తిష్ఠోత్తిష్ఠ భద్రం తే స్పర్శైస్సంజీవయన్నివ ॥

ఉన్మీల్య నేత్రకమలే సుప్తే ఇవ దినక్షయే ।

అపశ్యదగ్రే చోత్థాయ శంభుమర్క శతాధికమ్ ॥



భాలే లోచనమాలోక్య కంఠేకాలం వృషధ్వజమ్ ।
వామాంగసన్నివిష్టాద్రితనయం చంద్రశేఖరమ్ ॥
కపర్దేన విరాజంతం త్రిశూలా జగవాయు ధమ్ ।
స్ఫురన్ కర్పూరగౌరాంగం పరిణద్ధ గజాజినమ్ ॥
పరిజ్ఞాయ మహాదేవం గురువాక్యత ఆగమాత్ ।
హర్ష బాష్పాకులాసన్న కంఠ రోమాంచకంచుకః ॥
క్షణం చ గిరివత్తస్థౌ చిత్రకూట త్రిపుత్రకః ।
యథా యథా సుసంపన్నో విస్మృత్యాత్మానమేవ చ ॥
నస్తోతుం న నమస్కర్తుం కించిద్విజ్ఞప్తిమేవ చ ।
యదా స న శశాకాలం తదా స్మిత్వాహ శంకరః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

వాని ఈ మాటను విని కోపముతో ఎర్రనైన కన్నులు గలవాడై భయంకరమగు వజ్రాయుధమును పైకెత్తి ఆ బాలకుని భయపెట్టెను (41). మెరుపుల మంటలతో భయమును గొల్పు ఆ వజ్రమును చూచి ఆ బాలకుడు నారదుని వాక్యమును స్మరించి భయపీడితుడై మూర్ఛనొందెను (42). అపుడు తమోగుణమును పోగొట్టువాడు, గౌరీపతియగు శంభుడు ఆవిర్భవించి, లెమ్ము, లెమ్ము, నీకు మంగళమగుగాక ! అని పలుకుతూ ప్రాణమును పోయుచున్నాడా యన్నట్లు ఆ బాలుని పలుపర్యాయములు స్పృశించెను (43). రాత్రి నిద్రించి ఉదయమే లేచినాడా యన్నట్లు ఆ బాలుడు కలువకన్నులను తెరచి లేచి ఎదుట వంద సూర్యుల కంటే అధికముగా ప్రకాశించుచున్న శంభుని గాంచెను (44). లలాటమునందు నేత్రము, కంఠమునందు నల్లని మచ్చ గలవాడు, వృషభధ్వజుడు, వామ పార్శ్వమునందు పార్వతితో ప్రకాశించువాడు, చంద్రుని శిరముపై ధరించువాడు (45), జటాజూటముతో ప్రకాశించువాడు, త్రిశూలము, ధనస్సు ఆయుధములుగా గలవాడు, కర్పూరమువలె పచ్చని దేహకాంతితో ప్రకాశించువాడు, గజచర్మను వస్త్రముగా ధరించినవాడు (46) అగు మహాదేవుని గాంచి గురువాక్యమును బట్టి, వేదవచనములను బట్టి గుర్తుపట్టి ఆనందముతో కంఠము బొంగురు పోగా, కళ్లవెంబడి నీరు గారుచుండగా, శరీరమునందు రోమాంచము కలుగగా (47), ఆతడు క్షణకాలము చిత్రకూట త్రిపుత్రక పర్వతములవలె కదలిక లేకుండగా తనను తాను మరచి నిలబడెను. అకస్మాత్తుగా ధనలాభమును పొందనవానివలె స్తబుడాయెను (48). ఆతడు స్తోత్రమును చేయుటకు గాని, నమస్కరించుటకు గాని, ఏదైననూ విన్నవించుటకు గాని సమర్థుడు కాలేకపోయెను. అపుడు శంకరుడు చిరునవ్వుతో నిట్లనెను (49).

శంకర ఉవాచః

శిశో గృహపతే శక్రాద్వజ్రోద్యతకరాదహో ।
జ్ఞాతం భీతోఽసి మా భైషీర్జిజ్ఞాసా తే మయా కృతా ॥
మమ భక్తస్య నో శక్రో న వజ్రం చాంతకోఽపి చ ।
ప్రభవేదింద్రరూపేణ మయైవ త్వం విభీషితః ॥
వరం దదామి తే భద్ర త్వమగ్నిపదభాగ్భవ ।
సర్వేషామేవ దేవానాం వరదస్త్వం భవిష్యసి ॥
సర్వేషామేవ భూతానాం త్వమగ్నేంతశ్చరో భవ ।
ధర్మరాజేంద్రయోర్మధ్యే దిగీశో రాజ్యమాప్నుహి ॥
త్వయేదం స్థాపితం లింగం తవ నామ్నా భవిష్యతి ।
అగ్నీగ్నేశ్వర ఇతి ఖ్యాతం సర్వతేజో వివృంహణమ్ ॥
అగ్నీశ్వరస్య భక్తానాం న భయం విద్యుదగ్నిభిః ।
అగ్నిమాంద్య భయం నైవ నాకాలమరణం క్వచిత్ ॥
అగ్నీశ్వరం సమభ్యర్చ్య కాశ్యాం సర్వసమృద్ధి దమ్ ।
అన్యత్రాపి మృతో దైవా ద్వహ్నిలోకే మహీయతే ॥

శంకరుడిట్లు పలికెను -

ఓయీ బాలకా! గృహపతీ! వజ్రమును చేతబట్టిన ఇంద్రుని చూచి నీవు భయపడితివి. నాకు ఇది తెలిసినది. భయపడ కుము. నిన్ను నేను పరీక్షించితిని (50). ఇంద్రుడు గాని, వజ్రము గాని, యముడు గాని నా భక్తునకు హానిని కలిగించలేరు. నేనే ఇంద్రరూపములో వచ్చి నిన్ను భయపెట్టితిని (51). ఓయీ వత్సా! నేను నీకు వరమునిచ్చెదను. నీవు అగ్ని పదవిని పొందుము. నీవు దేవతలందరికీ వరములనిచ్చు వాడవు కాగలవు (52). ఓ అగ్నీ! నీవు సర్వప్రాణుల లోపల సంచరించువాడవు కాగలవు. ధర్మరాజునకు, ఇంద్రునకు మధ్యలో దిక్పాలక రాజ్యమును నీవు పొందుము (53). తేజస్సులనన్నిటిని మించి వ్యాపకమైన ఈ లింగము నీచే స్థాపించబడినది అగుటచే నీ పేర అగ్నీశ్వరుడని ఖ్యాతిని గాంచగలదు (54). అగ్నీశ్వరుని భక్తులకు విద్యుత్తు, అగ్ని, అజీర్ణవ్యాధి మరియు అకాలమరణముల భయము ఏకాలమునందైననూ ఉండబోదు (55). సర్వ సమృద్ధులను ఇచ్చే అగ్నీశ్వరుని కాశీలో అర్చించి విధిబలముచే ఇతర ప్రదేశమునందు మరణించిననూ, అట్టి మానవుడు అగ్ని లోకములో మహిమను గాంచును (56).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వానీయ తద్బంధూన్ పిత్రోశ్చ పరిపశ్యతో : ।
దిక్పతిత్వేఽభిషింవ్యాగ్నిం తత్ర లింగే శివోఽవిశత్ ॥
ఇష్టమగ్న్యవతారస్తే వర్ణితో మే జనార్దనః ।
నామ్నా గృహపతిస్తాత శంకరస్య పరాత్మనః ॥
చిత్రహోత్రపురీ రమ్యా సుఖదార్చిష్మతీ వరా ।
జాతవేదసి యే భక్తాస్తే తత్ర నివసంతి వై ॥
అగ్ని ప్రవేశం యే కుర్యుర్దృఢసత్వా జితేంద్రియాః ।
స్త్రియో వా సత్వసంపన్నాస్తే సర్వేఽప్యగ్ని తేజసః ॥
అగ్నిహోత్రరతా విప్రా స్స్థిపితా బ్రహ్మచారిణః ।
పంచాగ్నివర్తినోఽప్యేవ మగ్నిలో కేఽగ్ని వర్చసః ॥
శీతే శీతాపనుత్యై యస్త్వేధోభాగాన్ ప్రయచ్ఛతి ।
కుర్యాదగ్నీష్టికాం వాథ సవసే దగ్ని సన్నిధౌ ॥
అనాథస్యాగ్ని సంస్కారం యః కుర్యాచ్ఛ్రద్ధయాన్వితః ।
అశక్తః ప్రేరయేదన్యం సోఽ గ్నిలోకే మహీయతే ॥
అగ్నిరేకో ద్విజా తీనాం నిశ్శ్రేయసకరః పరః ।
గురుర్దేవో వ్రతం తీర్థం సర్వమగ్నిర్వినిశ్చితమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

శివుడు ఇట్లు పలికి ఆతని బంధువులను రప్పించి తల్లిదండ్రులు చూచుచుండగా ఆతనిని అగ్ని దిక్పాలక పదవియందు అభిషేకించి అచటి లింగములో ప్రవేశించెను (57). వత్సా! నేనీ తీరున దుష్టజనులను శిక్షించే, గృహపతియను పేరుగల, శంకరపరమాత్మని యొక్క అగ్ని అవతారమును నీకు వివరించితిని (58). చిత్రహోత్రమను నగరము సుందరమైనది, సుఖమునిచ్చునది. అది ప్రకాశించే శ్రేష్ఠనగరము. అగ్ని హోత్రుని భక్తులు అచట నివసించెదరు (59). దృఢమగు అంతఃకరణము గలవారు, ఇంద్రియ జయము గలవారు అగు పురుషులు గాని, స్త్రీలు గాని ఎవరైతే అగ్నిని ప్రవేశించెదరో వారు అందరు సత్వగుణము గలవారై అగ్నితో సమానమగు తేజస్సును పొందెదరు (60). అగ్నిహోత్రమునందు శ్రద్ధ గల బ్రాహ్మణులు, బ్రహ్మచారులు, పంచాగ్ని మధ్యములో తపస్సును చేయువారు అగ్నిలోకమును పొంది అగ్నితో సమమగు తేజస్సును పొందెదరు (61). ఎవరైతే శీతకాలములో చలిని పోగొట్టుట కొరకై ఇతరులకు కట్టెల మోపులను దానము చేయునో, మరియు ఎవరైతే అగ్నియందు ఇష్టిని చేయునో, అట్టివాడు అగ్ని సన్నిధిలో నివసించును (62). ఎవరైతే శ్రద్ధతో గూడినవాడై అనాథశవమునకు అగ్ని సంస్కారమును చేయునో, లేదా స్వయముగా అశక్తుడైనచో అట్లు చేయుటకు ఇతరుని ప్రోత్సహించునో, అట్టివాడు స్వర్గలోకములో మహిమను గాంచును (63). బ్రాహ్మణులకు మోక్షమునిచ్చే పరదైవము, గురువు, తీర్థము అగ్నిహోత్రుడొక్కడే. విద్వాంసునకు సర్వము అగ్నియేననుటలో సందేహము లేదు (64).

అపావనాని సర్వాణి వహ్నా సంసర్గతః క్షణాత్ ।
పావితాని భవంత్యేవ తస్మాద్యః పావకస్స్మృతః ॥
అంతరాత్మా హ్యయం సాక్షాన్నిశ్చయో హ్యేశుశుక్షణిః ।
మాంసగ్రాసాన్ పచేత్ కుక్షౌ స్త్రీణాం నో మాంసపేశికామ్ ॥
తైజసీ శాంభవీ మూర్తిః ప్రత్యక్షా దహనాత్మికా ।
కర్త్రీ హర్త్రీ పాలయిత్రీ వినైతాం కిం విలోక్యతే ॥
చిత్ర భానురయం సాక్షాన్నేత్రం త్రిభువనేశితుః ।
అంధం తమోమయే లోకే వినైనం కః ప్రకాశనః ॥
ధూ పప్రదీపనైవేద్య పయోదధిఘృతై క్షవమ్ ।
ఏతద్భుక్తం నిషేవంతే సర్వే దివి దివౌకసః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం గృహపత్యవతార
వర్ణనం నామ పంచదశోఽధ్యాయః(15).

అపవిత్ర వస్తువులన్నియు అగ్ని సోకి నంతనే క్షణములో పవిత్రములగు◌ను గనుక, అగ్నికి పావకుడని పేరు వచ్చినది (65). ఈ అగ్నిదేవుడు అందరికీ నిశ్చయముగా అంతరాత్మయై ఉన్నాడు. అగ్ని జఠరమునందుండి మాంసాదులను పచనము చేయును. కాని ఈతడు స్త్రీల కండరములను జీర్ణము చేయలేడు (66?) శంభుని తేజోమయ, దహనస్వరూప ప్రత్యక్షమూర్తియగు అగ్ని లోకములను సృష్టించి పాలించి ఉపసంహరించుచున్నది. ఈ మూర్తి లేనిచో దేనిని చూడగలము? (67) ఈ అగ్ని హోత్రుడు సాక్షాత్తుగా ముల్లోకములకు ప్రభువగు శివుని మూడవ కన్ను అగుచున్నాడు. చీకటితో నిండియున్న ఈ లోకములో చీకటిని పారద్రోలి ప్రకాశమునిచ్చునది అగ్నియే గదా! (68) అగ్ని భక్షించిన ధూపదీపనైవేద్యములను, పాలు పెరుగు నెయ్యి చెరుకురసము మొదలగు వాటిని మాత్రమే స్వర్గములోని దేవతలందరు సేవించుచున్నారు (69).

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు గృహపత్యవతార
వర్ణనమనే పదునైదవ అధ్యాయము ముగిసినది (15).

16 – యక్షేశ్వరావతారము

నందీశ్వర ఉవాచః

యక్షేశ్వరావతారం చ శృణు శంభోర్మునీశ్వర ।
గర్విణాం గర్వహంతారం సతాం భక్తి వివర్ధనమ్ ॥
పురా దేవాశ్చ దైత్యాశ్చ పీయూషార్థం మహాబలాః ।
క్షీరోదధిం మమంథుస్తే సుకృతస్వార్థ సంధయః ॥
మథ్యమానేనఽ మృతే పూర్వం క్షీరాబ్ధేస్సుర దానవైః ।
అగ్నే స్సముత్థితం తస్మాద్విషం కాలానల ప్రభమ్ ॥
తం దృష్ట్వా నిఖిలా దేవా దైత్యాశ్చ భయవిహ్వలా: ।
విద్రుత్య తరసా తాత శంభోస్తే శరణం యయుః ॥
దృష్ట్వా తం శంకరం సర్వే సర్వ దేవశిఖామణిమ్ ।
ప్రణమ్య తుష్టువుర్భక్త్యా సాచ్యుతా నతమస్తకా: ॥
తతః ప్రసన్నో భగవాన్ శంకరో భక్తవత్సలః ।
పపౌ విషం మహాఘోరం సురాసుర గణార్దనమ్ ॥
పీతం తం విషమం కంఠే నిదధే విషముల్బణమ్ ।
రేజే తేనాతి స విభుర్నీల కంఠో బభూవ హ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓ మునీశ్వరా! గర్విష్ఠుల గర్వమును అడంచునది, సత్పురుషుల భక్తిని వర్ధిల్ల జేయునది అగు శంభుని యక్షేశ్వరావతారమును గూడ వినుము (1). పూర్వము మహాబలశాలురగు దేవదానవులు తమ తమ స్వార్థమును సంపాదించు కొనవలెననే పట్టు దల గలవారై అమృతము కొరకు క్షీర సముద్రమును మథించిరి (2). పూర్వము ఇట్లు దేవదానవులు క్షీరసముద్రమును అమృతము కొరకు మథించుచుండగా ఆ అగ్నినుండి కాలాగ్నివలే దహించే విషము పుట్టెను (3). వత్సా! దానిని చూచి సమస్త దేవదానవులు భయముతో కంగారుపడి తొందరగా పరుగెత్తి శంభుని శరణు పొందిరి (4). విష్ణువుతో సహా వారందరు దేవతలందరిలో శ్రేష్ఠుడగు శంకరుని గాంచి సాష్టాంగ ప్రణామమాచరించి భక్తితో స్తుతించిరి (5). అపుడు భక్తవత్సలుడగు శంకరభగవానుడు ప్రసన్నుడై, దేవరాక్షసుల నందరినీ పీడించుచున్న మహాఘోరమగు విషమును త్రాగెను (6). విషమును త్రాగి ఆ భయంకర పదార్థమును తన కంఠమునందు దాల్చియుండెను. ఆ విభుడు దానిచే నీలవర్ణముగల కంఠము గలవాడై మిక్కిలి ప్రకాశించెను (7).

తతస్సు రాసురగణా మమంథుః పునరేవ తమ్ ।
విషదాహ వినిర్ముక్తాః శివానుగ్రహతోఽఖిలాః ॥
తతో బహూని రత్నాని విస్సృతాని తతో మునే ।
అమృతం చ పదార్థం హి సురదానవయోర్మునే ॥
తం పపుః కేవలం దేవా నాసురాః కృపయా హరేః ।
తతో బభూవ సుమహాన్ రత్నం తేషాం మిథోఽకదమ్ ॥
ద్వంద్వయుద్ధం బభూవాథ దేవదానవయోర్మునే ।
తత్ర రాహుభయాచ్చంద్రో విదు ద్రావ తదర్దితః ॥
జగామ సదనం శంభోశ్శరణం భయవిహ్వలః ।
సుప్రణమ్య చతుష్టావ పాహి పాహీతి సంవదన్ ॥
తతస్సతామభయదశ్శంకరో భక్తవత్సలః ।
దధ్రే శిరసి చంద్రం స విభుశ్శరణమాగతమ్ ॥
అథాగతస్తదా రాహు స్తుష్టావ సుప్రణమ్య తమ్ ।
శంకరం సకలాధీశం వాగ్భిరిష్టాభిరాదరాత్ ॥

శివానుగ్రహముచే వారందరు విషబాధనుండి విముక్తిని పొందిరి. తరువాత మరల ఆ దేవదానవులు సముద్రమును మథింప జొచ్చిరి (8). ఓ మహర్షీ! తరువాత దానినుండి అనేకరత్నములు బయల్వెడలినవి. ఓ మునీ! దేనిని పొందుట కొరకై దేవదానవులు శ్రమపడుచుండిరో, ఆ అమృతము కూడ పుట్టెను (9). విష్ణువు కృపచే ఆ అమృతమును దేవతలు మాత్రమే త్రాగిరి. రాక్షసులకు అమృతము దక్కలేదు. ఆతరువాత మరియొక గొప్ప రత్నము పుట్టెను. అది రెండు పక్షములవారికి దుఃఖమును కలిగించినది (10). ఓ మహర్షీ! అపుడు దేవదానవులకు ద్వంద్వయుద్ధము జరిగెను. అపుడు రాహువుచే పీడింపబడిన .చంద్రుడు ఆతనికి భయపడి అచటనుండి పారిపోయెను (11). ఆతడు భయముచే పీడను పొంది శంభుని గృహమునకు వెళ్లి చక్కగా ప్రణమిల్లి రక్షింపుము అని పలికి శరణు జొచ్చి స్తుతించెను (12). అపుడు సత్పురుషులకు అభయమునిచ్చువాడు, భక్తవత్సలుడు అగు ఆ శంకరవిభుడు శరణు జొచ్చిన చంద్రుని శిరముపై దాల్చెను (13). అపుడు రాహువు అచటకు వచ్చి సకలాధీశ్వరుడగు శంకరుని నమస్కరించి అభీష్టములగు వచనములతో సాదరముగా ఆయనను స్తుతించెను (14).

శంభుస్తన్మతమాజ్ఞాయ తచ్ఛిరాం స్య చ్యుతేన హ ।
పురా ఛిన్నాని వైకేతు సంజ్ఞాని నిదధే గలే ॥
తతో యుద్ధేఽసురాస్సర్వే దేవైశ్చైవ పరాజితాః ।
పీత్వామృతం సురాస్సర్వే జయం ప్రాపుర్మహాబలాః ॥
విష్ణు ప్రభృతయస్సర్వే బభూవుశ్చాతి గర్వితాః ।
బలాని చాంకురం తోంత శ్శివమాయా విమోహితాః ॥
తతస్స శంకరో దేవస్సర్వాధీశోఽథ గర్వహా ।
యక్షో భూత్వా జగమాశు యత్ర దేవాశ్స్థితా మునే ॥

సర్వాన్ దృష్ట్వాచ్యుతముఖాన్ దేవాన్యక్షపతిస్స వై ।

మహాగర్వాఢ్య మనసా మహేశః ప్రాహ గర్వహా ॥

శంభుడు ఆతని అభిప్రాయమునెరింగి పూర్వము విష్ణువుచే నరుకబడిన కేతువు అను పేరుగల ఆతని శిరస్సును తన మెడలో ధరించెను (?15). తరువాత యుద్ధములో రాక్షసులందరు పరాజయమును పొందిరి. వారిపై విజయమును సాధించిన మహాబలశాలురగు దేవతలందరు అమృతమును గ్రోలిరి. అది వారి విజయమునకు కారణమాయెను (16). అపుడు విష్ణువు మొదలగు దేవతలందరు శివమాయచే మోహితులై మిక్కిలి గర్వమును పొందియుండిరి. వారిలోపల శక్తి అంకురించుచుండెను (17). ఓ మునీ! అపుడు సకలాధీశుడు, గర్వమును పోగొట్టు వాడు అగు శంకరుడు యక్ష రూపమును దాల్చి దేవతలు ఉన్న స్థానమునకు వెళ్లెను (18). గర్వమును పోగొట్టే మహేశ్వరుడు యక్షేశ్వరుని రూపములోనున్న వాడై మిక్కిలి గర్వముతో నిండియున్న మనస్సుగల విష్ణువు మొదలగు దేవతలనందరినీ గాంచి ఇట్లు పలికెను (19).

యక్షేశ్వర ఉవాచః

కిమర్థం సంస్థితా యూయమత్ర సర్వే సురా మిథః ।

కిము కాష్ఠా ఇలం బ్రూత కారణం మేఽను పృచ్ఛతే ॥

యక్షేశ్వరుడిట్లు పలికెను –

దేవతలారా! మీరందరు కబుర్లాడుకొనుచూ ఇచట నిలబడి యుండుటకు వి◌ేశేషమేమి? నేను కారణమునడుగుచున్నాను. వివరముగా చెప్పుడు (20).

దేవా ఊచుః ।

అభూదత్ర మహాన్ దేవ రణః పరమదారుణః ।

అసురా నాశితాస్సర్వేఽవశిష్టా విద్రుతా గతాః ॥

వయం సర్వే మహావీరా దైత్యఘ్నా బలవత్తరా: ।

అగ్రే ఽస్మాకం కియంతస్తే దైత్యాః క్షుద్రబలాస్సదా ॥

దేవతలిట్లు పలికిరి –

ఇచట మిక్కిలి భయంకరమగు దేవదానవ యుద్ధము జరిగినది. రాక్షసులందరు నశించి◌ిరి. మిగిలిన వారు పలాయితులైరి (21). మేము అందరము మహావీరులము, రాక్షసులను సంహరించిన బలశాలురము. మా ముందు సర్వదా అల్పబలులైన ఆ రాక్షసులు ఎంత? (22)

నందీశ్వర ఉవాచః

ఇతి శ్రుత్వా వచస్తేషాం సురాణాం గర్వగర్భితమ్ ।

గర్వహా సా మ హాదేవో యక్ష రూపో వచోఽబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

గర్వముతో నిండియున్న ఆ దేవతల ఈ పలుకులను విని, యక్షరూపములో నున్ననవాడు, గర్వమునడంచువాడు అగు ఈ మహాదేవుడు ఇట్లు పలికెను (23).

యక్షేశ్వర ఉవాచః

హే సురా నిఖిలా యూయం మద్వచ శ్శృణుతా దరాత్ ।

యథార్థం వచ్మి నాసత్యం సర్వగర్వాపహారకమ్ ॥

గర్వమేనం న కురుత కర్తా హర్తాఽ పరః ప్రభుః ।

విస్మృతాశ్చ మహేశానం కథయ ధ్వం వృథాబలాః ॥

యుష్మాకం చేత్స హి మదో జానతాం స్వబలం మహత్ ।

మత్ స్థాపితం తృణమిదం ఛింత స్వాస్త్రైశ్చ తైస్సురా: ॥

యక్షేశ్వరుడిట్లు పలికెను -

ఓ దేవతలారా! మీరందరు నామాటను ఆదరముతో వినుడు. అందరి గర్వమును పోగొట్టే సత్యవచనమును నేను పలికెదను. అసత్యమును చెప్పను (24). మీరిట్లు గర్వమును పొందకుడు. సర్వమును సృష్టించి లయమును చేయు పరమ ప్రభుడు గలడు. మహేశ్వరుని మరచిపోయినారా? చెప్పుడు. మీ బలము వ్యర్థము (25). మీకు గర్వమున్నచో, మీ బలము ఎంత గొప్పదియో తెలుసుకొనుడు. నేనిచట గడ్డి పోచను ఉంచుతున్నాను. ఓ దేవతలారా! మీ మీ అస్త్రములతో దీనిని త్రెంపుడు (26). "

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వైకం తృణం తేషాం నిచిక్షేప పురస్తతః ।
జహ్రే సర్వమదం యక్ష రూపస్సతాం గతిః ॥
అథ సర్వే సురా విష్ణు ప్రముఖా వీరమానినః ।
కృత్వా స్వపౌరుషం తత్ర స్వాయుధాని విచిక్షిపుః ॥
తత్రాసన్ విఫలాన్యాశు తాన్యస్త్రాణి దివౌకసామ్ ।
శివ ప్రభావతస్తేషాం మూఢ గర్వాపహారిణః ॥
అథాసీత్తు నభోవాణీ దేవవిస్మయహారిణీ ।
యక్షోఽయం శంకరో దేవా స్సర్వగర్వాపహారకః ॥
కర్తా హర్తా తథా భర్తాఽయమేవ పరమేశ్వరః ।
ఏతద్బలేన బలినో జీవాస్సర్వేఽన్యథా న హి ॥
అస్య మాయా ప్రభావాద్వై మోహితాస్స్వ ప్రభుం శివమ్ ।
మదతో బుబుధుర్నైవా ద్యాపి బోధతనుం ప్రభుమ్ ॥
ఇతి శ్రుత్వా నభోవాణీం బుబుధుస్తే గతస్మయాః ।
యక్షేశ్వరం ప్రణేముశ్చ తుష్టువుశ్చ తమీశ్వరమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

సత్పురుషులకు శరణము అగు శివుడు యక్షుని రూపములో నున్నవాడై ఇట్లు పలికి ఒక గడ్డి పోచను వారి ముందు ఉంచి వారందరి మదమును అడంచెను (27). అపుడు విష్ణువు మొదలగు దేవతలందరు తాము వీరులమనే అభిమానము గలవారై తమ పరాక్రమమును ప్రదర్శించి దానిపై తమ ఆయుధములను ప్రయోగించిరి (28). మూర్ఖుల గర్వమునడంచు శివుని ప్రభావము వలన ఆ దేవతల అస్త్రములు దానియందు శీఘ్రమే వ్యర్థమైనవి (29). అపుడు దేవతల గర్వమును తొలగించుచూ ఆకాశవాణి ఇట్లు పలికెను. ఓ. దేవతలారా! ఈయన అందరి గర్వమును పోగొట్టే శంకరుడు (30). ఈయనయే సృష్టిని నిర్మించి, పాలించి పోషించి, లయమును చేయు పరమేశ్వరుడు . శంకరుడు యక్షరూపమును దాల్చియున్నాడు. ఈయనయొక్క బలముచేతనే సర్వప్రాణులు బలమును కలిగియున్నవి. లేనిచో జీవులలో బలము లేకుండును (3 1). ఈ శివుని మాయచే మోహితులైన మీరందరు గర్వించి మీకు ప్రభువు జ్ఞానస్వరూపుడు అగు శివుని ఇప్పటికైననూ తెలియజాలకున్నారు (32). ఈ ఆకాశవాణిని విని వారు తెలివి దెచ్చుకొని గర్వమును వీడి యక్షేశ్వరుని రూపమునందున్న ఆ శివునకు నమస్కరించి స్తుతించిరి (33).

దేవా ఊచుః ।

దేవదేవ మహాదేవ సర్వగర్వాపహారక ।
యక్షేశ్వర మహాలీల మాయా తేత్యద్భుతా ప్రభో ॥
మోహితా మాయయా ద్యాపి తవ యక్షస్వరూపిణః ।
సగర్వమభిభాషంతస్త్వత్పురో హి పృథజ్ఞయాః ॥
ఇదానీం జ్ఞాన మాయాతం తవైవ కృపయా ప్రభో ।
కర్తా హర్తా చ భర్తా చ త్వమేవాన్యో న శంకర ॥
త్వమేవ సర్వశక్తినాం సర్వేషాం హి ప్రవర్తకః ।
నివర్తకశ్చ సర్వేశః పరమాత్మా వ్యయోఽ ద్వయః ॥
యక్షేశ్వర స్వరూపేణ సర్వేషాం నో మదో హృతః ।
కృతో మన్యామహే తత్తేఽనుగ్రహో హి కృపాలునా ॥
అథో స యక్షనా థోఽను గృహ్య వై సకలాన్ సురాన్ ।
విబోధ్య వివిధైర్వాక్యై స్తత్రైవాంతరధీయత ॥
ఇత్థం స వర్ణితశ్శంభో రవతారః సుఖావహః ।
యక్షేశ్వరాఖ్యస్సుఖద స్సతాం తుష్టోఽభయంకరః ॥
ఇద మాఖ్యాన మమలం సర్వగర్వాపహారకమ్ ।
సతాం సుశాంతిదం నిత్యం భుక్తి ముక్తి ప్రదం నృణామ్ ॥
య ఇదం శృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సుధీః పుమాన్ ।
సర్వకామానవాప్నోతి తతశ్చ లభతే గతిమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే రుద్రసంహితాయాం యక్షేశ్వరావతార వర్ణనం నామ షోడశోఽధ్యాయః (16).

దేవతలిట్లు పలికిరి -

ఓ దేవదేవా! మహాదేవా! అందరి గర్వమును పోగొట్టువాడా! యక్షేశ్వరా! నీ లీలలు గొప్పవి, ప్రభూ! నీ మాయ అత్యద్భుతము (34). యక్షస్వరూపుడవగు నీ మాయ మమ్ములను ఈ నాడు కూడ మోహింపజేయుటచే నీ ఎదుట మేము నీనుండి విడివడి (భేదబుద్ధితో) సగర్వముగా మాటలాడి యుంటిమి (35). ఓ ప్రభూ! నీ అనుగ్రహము చేతనే మాకు ఇపుడు జ్ఞానోదయమైనది. ఓ శంకరా! జగత్తు యొక్క సృష్టిస్థితిలయకర్త నీవు తక్క మరియొకరు కాదు (36). సర్వశక్తులను ప్రవర్తింప జేయువాడవు, మరియు నివర్తింప జేయువాడవు నీవే. నీవే సర్వేశ్వరుడవు, పరమాత్మవు, వినాశరహితుడవు, అద్వితీయుడవు (37). నీవు యక్షేశ్వర రూపమును దాల్చి మా అందరి గర్వమును పోగొట్టితివి. అట్లు చేసి దయానిధివగు నీవు మాయందు అనుగ్రహమునే చూపించితివని మేము భావించుచున్నాము (38). అపుడా యక్షేశ్వరుడు దేవతలనందరినీ అనుగ్రహించి, అనేక వచనములను వారికి బోధించి అచటనే అంతర్ధానమయ్యెను (39). ఈ విధముగా, సుఖమును కలిగించునది, సత్పురుషులకు ఆనందమును అభయమును ఇచ్చునది అగు శంభుని యక్షేశ్వరావతారము వర్ణింపబడినది (40). పవిత్రమగు ఈ గాథ అందరి గర్వమును పోగొట్టి, సత్పురుషులకు మంచి శాంతిని, మానవులకు సర్వదా భుక్తిని, ముక్తిని ఒసంగును (41). బుద్ధిమంతుడగు ఏ పురుషుడు ఈ గాథను భక్తితో వినునో, లేదా వినిపించునో, అట్టివాడు కోర్కెలనన్నిటినీ పొంది, దేహత్యాగము తరువాత పుణ్యగతిని పొందును (42).

శ్రీ శివ మహాపురాణములో శతరుద్ర సంహిత యందు యక్షేశ్వరావతార వర్ణనమనే పదునారవ అధ్యాయము ముగిసినది (16).

17 - శివుని దశావతారములు

శృణ్వథో గిరిశస్యా ద్యావతారాన్ దశసంఖ్య కాన్ ।
మహాకాలముఖాన్ భక్త్యోపాసనా కాండసేవితాన్ ॥
త ద్యో హి మహాకాలో భుక్తి ముక్తి ప్రదస్సతామ్ ।
శక్తిస్తత్ర మహాకాలీ భక్తేప్సిత ఫలప్రదా ॥
తారనామా ద్వితీయశ్చ తారా శక్తి స్తథైవ సా ।
భుక్తిముక్తి ప్రదౌ చో భౌ స్వసేవక సుఖ ప్రదౌ ॥
భువనేశో హి బాలాహ్వస్తృతీయః పరికీర్తితః ।
భువనేశీ శివా తత్ర బాలాహ్వా సుఖదా సతామ్ ॥
శ్రీవిద్యేశష్షోడ శాహ్వశ్రవిద్యా షోడశీ శివా ।
చతుర్థో భక్త సుఖదో భుక్తి ముక్తి ఫలప్రదః ॥
పంచమో భైరవః ఖ్యాత స్సర్వదా భక్తకామదః ।
భైరవీ గిరిజా తత్ర సదుపాసక కామదా ॥
ఛిన్నమస్తక నామాసౌ శివష్షష్ఠః ప్రకీర్తితః ।
భక్త కామప్రదా చైవ గిరజా ఛిన్నమస్తకా ॥

ఉపాసనా కాండ ద్వారా సేవింపబడే, మహాకాల మొదలగు పది శివుని అవతారములను గూర్చి ఇపుడు భక్తితో వినుము (1). సత్పురుషులకు భుక్తిని, ముక్తిని ఇచ్చే మహాకాలావతారము వాటిలో మొదటిది. అపుడు శక్తి మహాకాలియై భక్తులకు ఫలములనిచ్చి కోర్కెల నీడేర్చును (2). 'తార' అను అవతారము రెండవది. దానియందు శక్తి 'తారా' యనబడును. వీరిద్దరు తమ సేవకులకు భుక్తిని ముక్తిని, సుఖమును ఇచ్చెదరు (3). బాలభువనేశుడు మూడవ అవతారము. ఆ అవతారములో పార్వతి బాలభువనేశ్వరియై సత్పురుషులకు సుఖమునిచ్చును (4). భక్తులకు భుక్తిని, ముక్తిని, సుఖమును, ఫలమును ఇచ్చే షోడశ శ్రీవిద్యేశుడు నాల్గవ అవతారము. దానిలో పార్వతి షోడశీ శ్రీ విద్యాదేవి యగును (5). సర్వకాలములలో భక్తుల కోర్కెల నీడేర్చు భైరవుడు ప్రసిద్ధిగాంచిన అయిదవ అవతారము. దానియందు పార్వతి భైరవియై మంచి ఉపాసకుల కోర్కెలనీడేర్చును (6). శివుని ఆరవ అవతారమునకు ఛిన్నమస్తకుడని పేరు. గిరిజాదేవి ఛిన్నమస్తకయై భక్తుల కోర్కెల నీడేర్చును (7).

ధూమవాన్ సప్తమశ్శంభు స్సర్వకామ ఫలప్రదః ।
ధూమావతీ శివా తత్ర సదుపాసక కామదా ॥
శివావతారస్సుఖదో హ్యష్టమో బగలాముఖః ।
శక్తిస్తత్ర మహానందా విఖ్యాతా బగలాముఖీ ॥
శివావతారో మాతంగో నవమః పరికీర్తితః ।
మాతంగీ తత్ర శర్వాణీ సర్వకామ ఫలప్రదా ॥
దశమః కమలశ్శంభు ర్భుక్తి ముక్తి ఫలప్రదః ।
కమలా గిరిజా తత్ర స్వభక్తపరిపాలినీ ॥
ఏతే దశమితాశ్శైవా అవతారాస్సుఖప్రదాః ॥
భుక్తి ముక్తి ప్రదాశ్చైవ భక్తానాం సర్వదాస్సతామ్ ॥
ఏతే దశావతారా హి శంకరస్య మహాత్మనః ।
నానాసుఖప్రదా నిత్యం సేవతాం నిర్వికారతః ॥
ఏతద్దశావతారాణాం మాహాత్మ్యం వర్ణితం మునే ।
సర్వకామప్రదం జ్ఞేయం తంత్రశాస్త్రాది గర్భితమ్ ॥

సర్వకామనలనీడేర్చి ఫలములనిచ్చే ధూమవంతుడు శివుని ఏడవ అవతారము. ఆ అవతారములో పార్వతి ధూమావతియై సత్పురుషులగు ఉపాసకుల కోర్కెలనీడేర్చును (8). సుఖమునిచ్చు బగలాముఖుడు ఎనిమిదవ శివావతారము. దానిలో శక్తి మహానందా, బగలాముఖీయను పేర్లతో ఖ్యాతిని పొందును (9). తొమ్మిదవ శివావతారము మాతంగుడు. దానిలో పార్వతి మాతంగియై సర్వకామనల నీడేర్చును (10). భుక్తిని ముక్తిని ఇచ్చే కమలుడు శంభుని పదియవ అవతారము. దానిలో పార్వతి కమలయై తన భక్తులను రక్షించును (11). ఈ పది శివావతారములు సత్పురుషులగు భక్తులకు సుఖమును, భుక్తిని, ముక్తిని, సర్వమును ఇచ్చును (12). మహాత్ముడగు శంకరుని ఈ పది అవతారములను వికారములు లేకుండగా నిత్యము సేవించువారికి అనేక సుఖములు లభించును (13). ఓ మహర్షీ! తంత్ర శాస్త్రము మొదలగు వాటియందు నిగూఢముగా నున్న ఈ పది అవతారముల మహిమను వర్ణించితిని. ఈ వర్ణన కోర్కెల నన్నిటిని ఈడేర్చునని యెరుంగవలెను (14).

ఏతాసామపి శక్తి నామద్భుతో మహిమా మునే ।
సర్వకామప్రదో జ్ఞేయ స్తంత్రశాస్త్రాది గర్భితః ॥
శత్రుమారణకార్యాదౌ తత్తచ్ఛక్తి: పరా మతా ।
ఖలదండకరీ నిత్యం బ్రహ్మతేజో వివర్ధినీ ॥
ఇత్యుక్తాస్తే మయా బ్రహ్మన్నవతారా మహేశితుః ।
సశక్తికా దశమితా మహాకాల ముఖాశ్శుభాః ॥
శైవపర్వేషు సర్వేషు యోఽధీతే భక్తి తత్పరః ।
ఏతదాఖ్యానమమలం సోఽతి శంభుప్రియో భవేత్ ॥
బ్రాహ్మణో బ్రహ్మవర్చస్వీ క్షత్రియో విజయీ భవేత్ ।
ధనాధిపో హి వైశ్య స్స్యాచ్ఛూద్రస్సుఖమవాప్నుయాత్ ॥
శాంకరం నిజధర్మస్థాశ్శృణ్వం తశ్చరితం త్విదమ్ ।
సుఖినస్స్యుర్విశేషేణ శివభక్తా భవంతు చ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం శివదశావతార వర్ణనం నామ సప్తదశోఽధ్యాయః (17).

ఓ మహర్షీ! తంత్ర శాస్త్రాదులలో నిగూఢముగా నున్న ఈ శక్తుల మహిమ అద్భుతము, కో◌ోర్కెలనన్నిటినీ ఈడేర్చునది అని తెలియవలెను (15). ఆ యాశక్తులు శత్రు సంహారము మొదలగు వాటిలో శ్రేష్ఠఫలము నిచ్చుననియు, దుష్టులను శిక్షించి నిత్యము బ్రహ్మవర్చస్సును వృద్ధి పొందించుననియు చెప్పబడినది (16). ఓ బ్రాహ్మణా! శక్తితో గూడినవి, శుభకరమైనవి అగు మహాకాలాది పది మహేశ్వరావతారములను నేను నీకు చెప్పితిని (17). ఎవడైతే, భక్తి తత్పరుడై శైవపర్వదినములన్నిటి యందు ఈ పవిత్రమగు గాథను పఠించునో, వాడు శంభునకు మిక్కిలి ప్రియుడగును (18). బ్రాహ్మణుడు బ్రహ్మవర్చస్సు గలవాడగును. క్షత్రియుడు వినయమును పొందును. వైశ్యుడు ధనాఢ్యుడగును. శూద్రుడు సుఖమును పొందును (19). శివభక్తులు తమ ధర్మమును పాటిస్తూ ఈ చరితమును వినుచున్నచో విశేషసుఖమును పొందెదరు. వారి భక్తి వర్ధిల్లును (20).

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు శివదశావతార వర్ణనమనే పదిహేడవ అధ్యాయము ముగిసినది(17).

18 - ఏకాదశరుద్రుల అవతారము

నందీశ్వర ఉవాచః

ఏకాదశావతారాన్ వై శృణ్వథో శాంకరాన్ వరాన్ ।
యాన్ శ్రుత్వా న హి బాధ్యేత బాధాఽసత్యాది సంభవా ॥
పురా సర్వే సురాశ్శక్రముఖా దైత్యపరాజితాః ।
త్యక్త్వామరావతీం భీత్యాఽపలాయంత నిజాం పురీమ్ ॥
దైత్య ప్రపీడితా దేవా జగ్ముస్తే కశ్యపాంతికమ్ ।
బద్ధ్వా కరాన్నతస్కంధాః ప్రణే ముస్తం సువిహ్వాలమ్ ॥
సునుత్వా తం సురాస్సర్వే కృత్వా విజ్ఞప్తి మాదరాత్ ।
సర్వం నివేదయామాసుస్స్వదుఃఖం తత్పరాజయమ్ ॥
తతస్స కశ్యపస్తాత తత్పితా శివసక్తధీః ।
తదాకర్ణ్యామరాకం నైదుఃఖితోఽభూన్న చాధికమ్ ॥
తానాశ్వాస్య మునిస్సోఽథ ధైర్యమాధాయ శాంతధీః ।
కాశీం జగామ సుప్రీత్యా విశ్వేశ్వరపురీం మునే ॥
గంగాంభసి తతస్స్నాత్వా కృత్వా తం విధిమా దరాత్ ।
విశ్వేశ్వరం సమానర్చ సాంబం సర్వేశ్వరం ప్రభుమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

తరువాత శంకరుని శ్రేష్ఠమగు పదకొండు అవతారములను వర్ణించెదను. వినుము. వీటిని విన్నచో అసత్యము మొదలగు వాటి వలన పీడ కలుగదు (1). పూర్వము ఇంద్రాది దేవతలందరు రాక్షసులచే పరాజితులై స్వీయనగరమగు అమరావతిని విడిచి భయముతో పారిపోయిరి (2). రాక్షసులచే పీడింపబడిన ఆ దేవతలు కశ్యపుని వద్దకు వెళ్లి శిరసువంచి చేతులు కట్టుకొని మిక్కిలి దుఃఖముతో నమస్కరించిరి (3). దేవతలందరు ఆయనను చక్కగా స్తుతించి రాక్షసుల చేతిలో తాము ఓడిపోవుట ఇత్యాది తమ దుఃఖమునంతనూ సాదరముగా విన్నవించుకొని రక్షించుమని విజ్ఞప్తి చేసిరి (4). వత్సా! అపుడు దేవతలకు తండ్రి, శివుని యందు లగ్నమైన బుద్ధి గలవాడునగు ఆ కశ్యపుడు దేవతల ఆ దుఃఖమును గూర్చి విని అధికముగా దుఃఖితుడు కాలేదు (5). శాంతమగు మనస్సుగల ఆ మహర్షి వారికి ధైర్యమును చెప్పి ఓ దార్చెను. ఓ మునీ! అపుడాయన మిక్కిలి ప్రీతితో విశ్వేశ్వరుని నగరమగు కాశీకి వెళ్లెను (6). తరువాత గంగానదిలో స్నానమాచరించి సర్వేశ్వరుడు, పార్వతీ సనాథుడు అగు ఆ విశ్వేశ్వర ప్రభుని యథావిధిగా భక్తితో చక్కగా అర్చించెను (7).

శివలింగం సుసంస్థాప్య చకార విపులం తపః ।
శంభుముద్దిశ్య సుప్రీత్యా దేవానాం హితకామ్యయా ॥
మహాన్ కాలో వ్యతీయాయ తపతస్తస్య వై మునే ।
శివపాదాంబుజా సక్తమనసో ధైర్యశాలినః ॥
అథ ప్రాదురభూచ్ఛంభుర్వరం దాతుం తదర్షయే ।
స్వపదాసక్త మనసే దీన బంధుస్సతాం గతిః ॥
వరం బ్రూహీతి చోవాచ సుప్రసన్నో మహేశ్వరః ।
కశ్యపం ముని శార్దూలం స్వభక్తం భక్తవత్సలః ॥
దృష్ట్వాథ తం మహేశానం సుప్రణమ్య కృతాంజలి: ।
తుష్టావ కశ్యపో హృష్టో దేవతాతః ప్రసన్నధీః ॥

ఆయన దేవతలకు హితమును చేయగోరి శివలింగమును చక్కగా స్థాపించి శంభుని ఉద్దేశించి మిక్కిలి ప్రీతితో విస్తృతమగు తపస్సును చేసెను (8). ఓ మునీ! ఆ ధైర్యశాలి శివపాదపద్మములపై మనస్సును నిలిపి తపస్సును చేయుచుండగా చాలకాలము గడిచెను (9). తరువాత సత్పురుషులకు శరణ్యుడు, దీనులకు బంధువు అగు శంభుడు ఆ మహర్షికి వరమునిచ్చుట కొరకై ఆవిర్భవించెను. ఆ ఋషి శివుని పాదముల పై మనస్సును నిలిపి యుండెను (10). భక్తవత్సలుడగు మహేశ్వరుడు మిక్కిలి ప్రసన్నుడై తన భక్తుడగు కశ్యపమహర్షిని ఉద్దేశించి వరమును కోరుకొనుము అని పలికెను (11). అపుడు దేవతలకు తండ్రియగు కశ్యపుడు ఆనందముతో ప్రసన్నమగు మనస్సుగల వాడై ఆ మహేశ్వరునకు చేతులు జోడించి నమస్కరించి స్తుతించెను (12).

కశ్యప ఉవాచః

దేవదేవ మహేశాన శరణాగతవత్సల ।
సర్వేశ్వరః పరాత్మా త్వం ధ్యానగమ్యోఽద్వయోఽవ్యయః ॥
ఖలనిగ్రహకర్తా త్వం మహేశ్వర సతాం గతిః ।
దీన బంధుర్దయాసింధుర్భక్తరక్షణ దక్షధీః ॥
ఏతే సురాస్త్వదీయా హి త్వద్భక్తాశ్చ విశేషతః ।
దైత్యైః పరాజితాశ్చాద్య పాహి తాన్ దుఃఖితాన్ ప్రభో ॥
అసమర్థో రమేశోఽపి దుఃఖదస్తే ముహుర్ముహుః ।
అతో సురా మచ్ఛరణా వేదయంతోఽసుఖం చ తత్ ॥
తదర్థం దేవదేవేశ దేవదుఃఖ వినాశకః ।
తత్పూరితం తపోనిష్ఠాం ప్రసన్నార్థం తవాసదమ్ ॥

శరణం తే ప్రపన్నోఽస్మి సర్వథాహం మహేశ్వర ।
కామం మే పూరయ స్వామిన్ దేవదుఃఖం వినాశయ ॥
పుత్ర దుః ఖైశ్చ దేవేశ దుః ఖితోఽహం విశేషతః ।
సుఖినం కురు మామీశ సహాయస్త్వం దివౌకసామ్ ॥
భూత్వా మమ సుతో నాథ దేవా యక్షాః పరాజితాః ।
దైత్యైర్మహాబలైశ్శంభో సురానంద ప్రదో భవ ॥
సదైవాస్తు మహేశాన సర్వలేఖ సహాయకృత్ ।
యథా దైత్య కృతా బాధా న బాధేత సురాన్ ప్రభో ॥

కశ్యపుడిట్లు పలికెను -

ఓ దేవదేవా! మహేశ్వరా! శరణా గత వత్సలా! నీవు సర్వేశ్వరుడవు, పరమాత్మవు, ధ్యానముచే పొందదగినవాడవు, అద్వితీయుడవు, వినాశము లేనివాడవు (13). ఓ మహేశ్వరా! సత్పురుషులకు శరణ్యుడవగు నీవు రాక్షసబలమును నిగ్రహించవలెను. దీనబంధుడవు, దయాసముద్రుడవునగు నీవు భక్తులను రక్షించుటలో సమర్థమైన బుద్ధి గలవాడవు (14), ఈ దేవతలు నీ వారు. విశేషించి నీ భక్తులు. ఈ నాడు రాక్షసుల చేతిలో పరాజితులై దుఃఖించుచున్నారు. ఓ ప్రభూ! వారిని రక్షించుము (15). అసమర్థుడగు లక్ష్మీపతి కూడా నీకు పలుమార్లు దుఃఖమును కలిగించు చున్నాడు. అందువలననే, ఆ దేవతలు నన్ను శరణు జొచ్చినారు. వారి దుఃఖమును నాకు విన్నవించినారు (16). ఓ దేవదేవా! ఈశ్వరా! నేను దేవతల దుఃఖమును నశింపజేయగోరి నిన్ను ప్రసన్నుని చేసుకొనుట కొరకై తపోనిష్ఠను సలిపితిని (17). ఓ మహేశ్వరా! నేను అన్ని విధములుగా నిన్ను శరణు జొచ్చితిని. ఓ స్వామీ! దేవతల దుఃఖమును నశింపజేసి నా కోర్కెను దీర్చుము (18). ఓ దేవ దేవా! నేను పుత్రుల దుఃఖమును గాంచి మిక్కిలి దుఃఖించుచున్నాను. ఓ ఈశా! నన్ను సుఖిని చేయుము. నీవు దేవతలకు సాహాయ్యమొనర్చుము (19). ఓ నాథా! దేవతలు, యక్షులు మహాబలశాలురగు రాక్షసుల చేతిలో పరాజితులై యున్నారు. నీవు నా కుమారుడవై జన్మించి దేవతలకు ఆనందమును కలిగించుము (20), ఓ మహేశ్వరా! ప్రభూ! రాక్షసుల పీడ దేవతలకు తొలగు విధముగా నీవు సర్వదా దేవతలకు సహాయమును చేయుచుండుము (21).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తస్య తు సర్వేశస్తథేతి ప్రోచ్య శంకరః ।
పశ్యతస్తస్య భగవాన్ తత్రైవాంతర్దధే హరః ॥
కశ్యపోఽపి మహాహృష్టః స్వస్థాన మగమద్ద్రుతమ్ ।
దేవేభ్యః కథయామాస సర్వవృత్తాంతమాదరాత్ ॥
తతస్స శంకరశ్శర్వ స్సత్యం కర్తుం స్వకం వచః ।
సురభ్యాం కశ్యపాజ్జజ్ఞే ఏకాదశ స్వరూపవాన్ ॥
మహోత్సవస్తదాసీద్వై సర్వం శివమయం త్వభూత్ ।
ఆసన్ హృష్టా స్సురాశ్చాథ మునినా కశ్యపేన చ ॥
కపాలీ పింగలో భీమో విరూపాక్షో విలోహితః ।
శాస్తాఽజపా దహిర్బుధ్న్యశ్శంభుశ్చండో భవస్తథా ॥
ఏకాదశైతే రుద్రాస్తు సురభీతనయాస్స్మృతాః ।
దేవకార్యార్థముత్పన్నా శ్శివరూపా స్సుఖాస్పదమ్ ॥
తే రుద్రాః కాశ్యపా వీరా మహాబల పరాక్రమాః ।
దైత్యాన్ జఘ్నుశ్చ సంగ్రామే దేవసాహాయ్య కారిణః ॥
తద్రుద్రకృపయా దేవా దైత్యాన్ జిత్వా చ నిర్భయాః ।
చక్రుస్స్వరాజ్యం సర్వే తే శక్రాద్యాస్స్వస్థమానసాః ॥
అద్యాపి తే మహారుద్రా స్సర్వే శివస్వరూపకాః ।
దేవానాం రక్షణార్థాయ విరాజంతే సదా దివి ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

కశ్యపుడిట్లు పలుకగా, సర్వేశ్వరుడు మంగళకరుడు అగు హరభగవానుడు 'అటులనే' అని పలికి ఆతడు చూచుచుండగా అచటనే అంతర్ధానమయ్యెను (22). కశ్యపుడు కూడ మహానందమును పొంది శీఘ్రముగా తన స్థానమునకు మరలి వచ్చి జరిగిన వృత్తాంతమునంతనూ ఆదరముతో దేవతలకు చెప్పెను (23). అపుడు మంగళకరుడగు ఆ శర్వుడు తన వచనమును సత్యము చేయుటకై కశ్యపుని వలన సురభియందు పదకొండు రూపములలో అవతరించెను (24). అపుడు గొప్ప ఉత్సవము జరిగెను. సర్వము శివమయమయ్యెను. కశ్యపమహర్షి వలన దేవతలందరు మహానందమును పొందిరి (25), కపాలి, పింగలుడు, భీముడు, విరూపాక్షుడు, విలోహితుడు, శాస్త, అజపాత్, అహిర్బుధ్న్యుడు, శంభుడు, చండుడు మరియు భవుడు (26) అను శివస్వరూపులగు ఈ పదకొండు రుద్రులకు సురభీతనయులని పేరు. వీరు దేవకార్యము కొరకు అవతరించి సుఖమునకు నిధానమైరి (27). కశ్యప పుత్రులు, వీరులు, గొప్ప బల పరాక్రమములు గలవారు అగు ఆ రుద్రులు యుద్ధములో దేవతలకు సహాయులై రాక్షసులను సంహరించిరి (28). ఆ రుద్రుల అనుగ్రహముచే ఇంద్రాది దేవతలు రాక్షసులను జయించి, అందరు నిర్భయులై స్వస్థమగు మనస్సు గలవారై తమ రాజ్యమునేలిరి (29). ఇప్పటికి శివస్వరూపులగు ఆ

మహోరుద్రులందరు దేవతలను రక్షించుట కొరకై సర్వదా స్వర్గలోకమునందు విరాజిల్లు చున్నారు (30).

ఐశాన్యాం పురి తే వాసం చక్రిరే భక్త వత్సలాః ।
విరమంతే సదా తత్ర నానాలీలా విశారదాః ॥
తేషామనుచరా రుద్రాః కోటిశః పరికీర్తితాః ।
సర్వత్ర సంస్థితాస్తత్ర త్రిలోకేష్వఖి భాగశః ॥
ఇతి తే వర్ణితాస్తాతావతారాశ్శంకరస్య వై ।
ఏకాదశమితా రుద్రా స్సర్వలోక సుఖావహాః ॥
ఇదమాఖ్యానమమలం సర్వపాప ప్రణాశకమ్ ।
ధన్యం యశస్యమాయుష్యం సర్వకామ ప్రదాయకమ్ ॥
య ఇదం శృణుయాత్తాత శ్రావయేద్వై సమాహితః ।
ఇహ సర్వసుఖం భుక్త్వా తతో ముక్తిం లభేత సః ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం ఏకాదశావ
తారవర్ణనం నామ అష్టాదశో ఽధ్యాయః (18).

భక్తవత్సలురు, అనేక లీలలను ప్రకటించుటలో సమర్థులు నగు ఆ రుద్రులు ఈశాన్య దిక్కునందు నివసించి సర్వదా అచటనే రమించెదరు (31). వారి అనుచరులగు రుద్రులు కోట్ల సంఖ్యలో నున్నారు. వారు ముల్లోకములలో ఆయా భాగములయందు సర్వత్రా వ్యాపించియున్నారు (32). వత్సా! ఈ విధముగా సర్వప్రాణులకు సుఖమును కలిగించే శంకరుని ఏకాదశ రుద్రావతారములను నీకు వర్ణించితిని (33). ఈ వృత్తాంతము పవిత్రమైనది, పాపములను అన్నిటినీ నశింప జేయునది, ధన్యమైనది, యశస్సును కలిగించునది, ఆయుర్దాయమును ఇచ్చునది మరియు కోర్కెలనన్నిటినీ ఇచ్చునది (34). వత్సా! ఎవరైతే ఈ గాథను మనస్సు లగ్నముచేసి వినునో, అట్టివాడు ఇహలోకములో సర్వసుఖములననుభవించి, దేహత్యాగము తరువాత ముక్తిని పొందును (35).

శ్రీ శివమహాపురాణములోని శతరుద్ర సంహిత యందు ఏకాదశావతార వర్ణనమనే పదునెనిమిదవ అధ్యాయము ముగిసినది (18).

19 - దూర్వాసావతారము

నందీశ్వర ఉవాచః

అథాన్యచ్చరితం శంభోశ్శృణు ప్రీత్యా మహామునే ।
యథా బభూవ దుర్వాసాశ్శంకరో ధర్మ హేతవే ॥
బ్రహ్మపుత్రో బభూవాత్రి: తపస్వీ బ్రహ్మ విత్ప్రభుః ।
అనసూయాపతిర్ధీమాన్ బ్రహ్మాజ్ఞా ప్రతిపాలకః ॥
సునిర్దేశాద్బ్రహ్మణో హి సస్త్రీ కః పుత్రకామ్యయా ।
స త్ర్యక్షకులనామానం యయౌ చ తపసే గిరిమ్ ॥
ప్రాణానాయమ్య విధివన్ని ర్వింధ్యాతటినీ తటే ।
తపశ్చచార సుమహా దద్వం ద్వోఽబ్ద శతం మునిః ॥
య ఏక ఈశ్వరః కశ్చి దవికారో మహా ప్రభుః ।
సమే పుత్రవరం దద్యాదితి నిశ్చిత మానసః ॥
బహుకాలో వ్యతీయాయ తస్మింస్తపతి సత్తపః ।
ఆవిర్బభూవ తత్కాత్తు శుచిర్జ్వాలా మహీయసీ ॥
తయాసన్నిఖిలా లోకా దగ్ధప్రాయా మునీశ్వరాః ।
తథా సురర్షయస్సర్వే పీడితా వాసవాదయః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! శంభుని మరియొక గాథను కూడా ప్రీతితో వినుము. ధర్మము కొరకు శంకరుడే దుర్వాసుడై అవతరించిన గాథను చెప్పెదను (1). బ్రహ్మ కుమారుడు, తపశ్శాలి, బ్రహ్మవేత్త, సమర్థుడు, అనసూయకు భర్త, బుద్ధిశాలి, బ్రహ్మ యొక్క ఆజ్ఞను పాలించు వాడు అగు అత్రి మహర్షి ఉండెను (2). ఆతడు బ్రహ్మగారి చక్కని ఆదేశమును పొంది భార్యతో గూడి, పుత్రులను బడయగోరి తపస్సును చేయుటకై త్ర్యక్ష కులమను పేరు గల పర్వతమునకు వెళ్లెను (3). ఆ మహర్షి నిర్వింధ్యానదీ తీరము నందు ఒంటరిగా నుండి యథావిధిగా ప్రాణాయామమును చేసి వంద సంవత్సరములు గొప్ప తపస్సును చేసెను (4). అద్వితీయుడు, వర్ణింప శక్యము కానివాడు, మహాప్రభుడు అగు ఏ ఈశ్వరుడు గలడో, ఆ అవికారియగు శివుడే నాకు పుత్రుని పొందే వరమునీయవలెనని అతడు మనస్సులో నిశ్చయమును చేసుకొనెను (5). ఆతడు గొప్ప తపస్సును చేయుచుండగా చాల కాలము గడిచెను. ఆతని శిరస్సునుండి గొప్ప అగ్నిజ్వాల ఆవిర్భవించెను (6). దానిచే లోకములన్నియు దహింపబడుచుండెను. మహర్షులు, దేవర్షులు మరియు ఇంద్రాది దేవతలు అందరు దుఃఖమును పొందిరి (7).

అథ సర్వే వాస వాద్యా సురాశ్చ మునయో మునే ।
బ్రహ్మ స్థానం యయుశ్శీఘ్రం తజ్జ్వాలాతి ప్రపీడితాః ॥
నుత్వా నుత్వా విధిం దేవాస్తత్ స్వదుఃఖం న్యవేదయన్ ।
బ్రహ్మో సహ సురైస్తాత విష్ణులోకం యయావరమ్ ॥
తత్ర గత్వా రమానాథం నత్వా నుత్వా విధిస్సురైః ।
స్వదుఃఖం తత్సమాచ ఖ్యౌ విష్ణవేఽనంతకం మునే ॥
విష్ణుశ్చ విధినా దేవై రుద్రస్థానం యయౌ ధ్రుతమ్ ।
హరం ప్రణమ్య తత్రైత్య తుష్టావ పరమేశ్వరమ్ ॥
స్తుత్వా బహుతయా విష్ణుస్స్వదుఃఖం చ న్యవేదయత్ ।
శర్వం జ్వాలాసముద్భూత మత్రేశ్చ తపసః పరమ్ ॥
అథ తత్ర సమేతాస్తు బ్రహ్మా విష్ణు మహేశ్వరాః ।
మునే సంమంత్రయాంచ క్రురన్యోన్యం జగతాం హితమ్ ॥
తదా బ్రహ్మాదయో దేవాస్త యస్తే వరదర్షభాః ।
జగ్ముస్తదా శ్రమం శీఘ్రం వరం దాతుం తదర్షయే ॥
స్వ చిహ్న చిహ్నితాంస్తాన్ స దృష్ట్వాత్రిర్మునిసత్తమః ।
ప్రణనామ చ తుష్టావ వాగ్భిరిష్టా భిరాదరాత్ ॥
తతస్స విస్మితో వి ప్రస్తా నువాచ కృతాంజలిః ।
బ్రహ్మాపుత్రో వినీతాత్మా బ్రహ్మా విష్ణు హరాభిధాన్ ॥

ఓ మహర్షీ! అపుడు ఇంద్రాది దేవతలు మరియు మునులు అందరు ఆ జ్వాలలచే మిక్కిలి పీ◌ిడింపబడినవారై శీఘ్రముగా బ్రహ్మలోకమునకు వెళ్లిరి (8). వత్సా! దేవతలు బ్రహ్మను పలుమార్లు స్తుతించి ఆ తమ దుఃఖమును విన్నవించుకొనిరి. బ్రహ్మ దేవతలతో గూడి శీఘ్రముగా విష్ణులోకమునకు వెళ్లెను (9), బ్రహ్మ దేవతలతో గూడి అచటకు వెళ్లి లక్ష్మీపతియగు విష్ణువునకు నమస్కరించి స్తుతించి తమకు సంప్రాప్తమైన అంతము లేని దుఃఖము గూర్చి చెప్పెను (10). విష్ణువు బ్రహ్మతో మరియు దేవతలతో గూడి శీఘ్రమే రుద్రలోకమునకు వెళ్లి, పరమేశ్వరుడగు హరునకు నమస్కరించి స్తుతించెను (1 1). విష్ణువు శివుని పలిపలి విధముల స్తుతించి అత్రి యొక్క తపస్సునుండి పుట్టిన జ్వాల వలన తమకు సంప్రాప్తమైన తీవ్రదుఃఖమును గురించి విన్నవించెను (1 2). ఓ మహర్షీ! అపుడచట బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సమకూడి జగత్తులకు హితమును చేయు విధమును గూర్చిఒకరితోనొకరు సంప్రదించుకొనిరి (13). అపుడు వరముల నిచ్చుటలో శ్రేష్ఠులగు ఆ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురు కలిసి ఆ మహర్షికి వరమునిచ్చుటకై శీఘ్రముగా ఆతని ఆశ్రమమునకు వెళ్లిరి (14). అత్రి మహర్షి తమ తమ చిహ్నములతో గూడియున్న ఆ త్రిమూర్తులను గాంచి ప్రణమిల్లి భక్తితో

అభీష్టవచనములతో స్తుతించెను (15). అపుడు బ్రహ్మపుత్రుడగు ఆ మహర్షి ఆశ్చర్యచకితుడై చేతులు జోడించి వినయముతో నిండిన మనస్సుతో బ్రహ్మవిష్ణుమహేశ్వరులనుద్దేశించి ఇట్లు పలికెను (16).

అత్రిరువాచ ।

హే బ్రహ్మన్ హే హరే రుద్ర పూజ్యాస్త్రి జగతాం మతాః ।
ప్రభవశ్చేశ్వరా స్సృష్టి రక్షా సంహార కారకాః ॥
ఏక ఏవ మయా ధ్యాత ఈశ్వరః పుత్రహేతవే ।
యః కశ్చి దీశ్వరః ఖ్యాతో జగతాం స్త్రియా సహ ॥
యూయం త్రయస్సు రాః కస్మాదాగతా వరదర్షభాః ।
ఏతన్మే సంశయం ఛిత్వా తతో దత్తేప్సితం వరమ్ ॥
ఇతి శ్రుత్వా వచస్తస్య ప్రత్యూచుస్తే సురాస్త్ర యః ।
యాదృక్ కృతస్తే సంకల్ప స్త థైవా భూన్మునీశ్వర ॥
వయం త్రయో భవే శానాస్సమానా వరదర్షభాః ।
అస్మదంశ భవాస్తస్మాద్భ విష్యంతి సుతాస్త్ర యః ॥
విదితా భువనే సర్వే పిత్రో: కీర్తి వివర్ధనాః ।
ఇత్యుక్త్వాస్తే త్రయో దేవాస్స్వధామాని యయుర్ముదా ॥
వరం లబ్ధ్వా ముని స్సోఽథ జగామ స్వాశ్రమం ముదా ।
యుతోఽనసూయయా ప్రీతో బ్రహ్మానంద ప్రదో మునే ॥

అత్రి ఇట్లు పలికెను -

ఓ బ్రహ్మా! ఓ హరీ! రుద్రా! మీరు ముగ్గురు ముల్లోకములకు పూజనీయులు, సర్వ‌సమర్థులగు ఈశ్వరులు, మరియు సృష్టిస్థితి సంహారములను చేయువారు (17). నేను పుత్రుని గోరి ఈశ్వరుని ఒక్కని మాత్రమే ధ్యానించితిని. లోకములలో ఈశ్వరుడను ఖ్యాతి పార్వతీసమేతుడగు శివునకు మాత్రమే గలదు (18). వరములనిచ్చుటలో శ్రేష్ఠులగు మీరు ముగ్గురు దేవతలు ఏల విచ్చేసిరి? నా ఈ సంశయమును పోగొట్టి, తరువాత నాకు అభీష్టమగు వరమునిండు (19). ఆతని ఈ మాటను విని వారు ముగ్గురు దేవులు ఇట్లు సమాధానమును చెప్పిరి. ఓ మహర్షీ! నీవు ఎట్లు సంకల్పించితివో, అటులనే అయినది (20). వరములనిచ్చు వారిలో శ్రేష్ఠులము, సంసారమునకు ఈశ్వరులము అగు మేము ముగ్గురము ఒక్కటియే. నీకు మా అంశలచే ముగ్గురు పుత్రులు జన్మించగలరు (21). వారు ముగ్గురు లోకములో ఖ్యాతిని గడించి, తల్లి దండ్రుల కీర్తిని వర్ధిల్ల జేయగలరు. ఆ ముగ్గురు దేవులు ఇట్లు పలికి ఆనందముతో తమ ధామములకు వెళ్లిరి (22). ఆ మహర్షి ఈ విధముగా వరమును పొంది బ్రహ్మానందము ననుభవించెను. ఓ మహర్షీ! ఆతడు అనసూయతో గూడి ఆనందముతో తన ఆశ్రమమునకు వెళ్లెను (23).

అథ బ్రహ్మో హరిశ్శంభురవతే రుస్మి యాం తతః ।

పుత్రరూపైః ప్రసన్నాత్మ నానా లీలా ప్రకాశకాః ॥

విధేరంశా ద్విధుర్జజ్ఞేఽనసూయాయాం మునీశ్వరాత్ ।

ఆవిర్బభూవోదధితః క్షిప్తో దేవైస్స ఏవ హి ॥

విష్ణోరంశాత్ స్త్రీయాం తస్యా మత్రేర్దత్తో వ్యజాయత ।

సన్న్యాస పద్ధతిర్యేన వర్థితా పరమా మునే ॥

దుర్వాసా ముని శార్దూలశ్శివాంశాన్మునిసత్తమ ।

జజ్ఞే తస్యాం స్త్రియా మత్రేర్వరధర్మ ప్రవర్తకః ॥

భూత్వా రుద్రశ్చ దుర్వాసా బ్రహ్మతేజో వివర్ధనః ।

చక్రే ధర్మపరీక్షాం చ బహూనాం స దయాపరః ॥

సూర్యవంశే సముత్పన్నో యోంఽబరీషో నృపోఽభవత్ ।

తత్పరీక్షామకార్షీత్స తాం శృణు త్వాం మునీశ్వర ॥

సోంబరీషో నృపవరస్సప్తద్వీపరసాపతిః ।

నియమం హి చకారాసావే కాదశ్యా వ్రతే దృఢమ్ ॥

తరువాత బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురు ప్రసన్నమగు అంతఃకరణములు గలవారై వివిధలీలలను ప్రకటించుచూ అత్రి అనసూయలకు పుత్రులై అవతరించిరి (24). బ్రహ్మ యొక్క అంశవలన చంద్రుడు అత్రి అనసూయలకు పుత్రుడై జన్మించెను. దేవతలాతనిని సముద్రములో పారవేయగా, అచటనుండి మరల ఆవిర్భవించెను (25). విష్ణువు యొక్క అంశవలన అత్రి అనసూయలయందు దత్తుడు జన్మించెను. ఓ మహర్షీ! ఆ దత్తుడు సన్న్యాస పద్ధతిని వర్ధిల్ల జేసెను (26). ఓ మహర్షి ! శివుని అంశవలన అత్రి అనసూయలకు దుర్వాసమహర్షి జన్మించి శ్రేష్ఠమగు ధర్మమును ప్రవర్తిల్ల జేసెను (27). దయానిధియగు ఆ రుద్రుడు దుర్వాస మహర్షియై అవతరించి బ్రహ్మతేజస్సును వృద్ధి పొందింపజేయువాడై చాలమంది యొక్క ధర్మనిష్ఠను పరీక్షించెను (28. ఓ మహర్షీ! ఆయన సూర్యవంశమునందు జన్మించిన అంబరీష మహారాజును పరీక్షించిన గాథను నీవు వినుము (29). సప్తద్వీపములతో గూడిన ఈ భూమిని ఆ అంబరీష మహారాజు పాలించెడివాడు. ఆయన ఏకాదశీ వ్రతమును దృఢముగా అనుష్ఠించుటకు నిర్ణయించు కొనెను (30).

ఏకాదశ్యా వ్రతం కృత్వా ద్వాదశ్యాం చైవ పారణామ్ ।
కరిష్యామీతి సుదృఢ సంకల్పస్తు నరాధిపః ॥
జ్ఞాత్వా తన్నియమం తస్య దుర్వాసా మునిసత్తమః ।
తదంతికం గతశ్శిష్యైర్బహు భిశ్శంకారాంశజః ॥
పారణే ద్వాదశీం స్వల్పాం జ్ఞాత్వా యావత్స భోజనమ్ ।
కర్తుం వ్యవసితస్తావదా గతం స న్యమంత్రయత్ ॥
తతస్స్నా నార్థమగమద్దుర్వాసా శ్శిష్యసంయుతః ।
విలంబం కృతవాంస్తత్ర పరీక్షార్థం మునిర్బహు ॥
ధర్మవిఘ్నం తదా జ్ఞాత్వా స నృపశ్శాస్త్ర శాసనాత్ ।
జలం ప్రాశ్యాస్థితస్తత్ర తదా గమనకాంక్షయా ॥
ఏతస్మిన్నంతరే తత్ర దుర్వాసా మునిరా గతః ।
కృతాశనం నృపం జ్ఞాత్వా పరీక్షార్థం ధృతాకృతిః ॥
చుక్రోధాతి నృపే తస్మిన్ పరీక్షార్థం వృషస్య సః ।
ప్రోవాచ వచనం తూగ్రం సమునిశ్శంకరాంశజః ॥

ఏకాదశినాడు వ్రతము చేసి ద్వాదశినాడు పారణమును చేసెదనని ఆ మహారాజు దృఢముగా నిర్ణయించుకొనెను (31). ఆతని ఆ నియమమునెరింగి, శంకరుని అంశవలన జన్మించిన దూర్వాస మహర్షి చాలమంది శిష్యులతో గూడి ఆతని వద్దకు వెళ్లెను (3 2). పారణమునకు ద్వాదశీ తిథి అల్పకాలము మాత్రమే గలదని గ్రహించి ఆ మహారాజు భోజనము చేయబోవునంతలో విచ్చేసిన ఆ మహర్షిని ఆయన భోజనమునకు ఆహ్వానించెను (33). అపుడు దుర్వాసుడు శిష్యులతో గూడి స్నానముకొరకు వెళ్లెను. ఆ మహర్షి రాజును పరీక్షించగోరి అచట చాల ఆలస్యమును చేసెను (34). ఆ రాజు ధర్మమునకు విఘ్నము కలుగునని తలంచి శాస్త్రము యొక్క ఆదేశమునసుసరించి నీటిని త్రాగి ఆ మహర్షి కొరకు ఎదురు చూచుచూ వేచియుండెను (35). పరీక్ష కొరకు దేహమును దాల్చిన దూర్వాసుడు ఇంతలో అచటకు వచ్చి రాజు నీటిని త్రాగినాడని తెలుసుకొనెను (36). ధర్మపరీక్ష కొరకై శంకరుని అంశవలన జన్మించిన ఆ మహర్షి ఆ రాజుపై చాల కోపించి క్రూరమగు పలుకులను పలికెను (37).

దుర్వాసా ఉవాచః

మాం నిమంత్ర్య నృపా భోజ్య జలం పీతం త్వయాధమ ।
దర్శయామి ఫలం తస్య దుష్టదండధరో హ్యహమ్ ॥
ఇత్యుక్త్వా క్రోధతా మ్రాక్షో నృపం దగ్ధుం సముద్యతః ।
సముత్త స్థా ద్రుతం చక్రం తత్ స్థం రక్షార్థమైశ్వరమ్ ॥
ప్రజజ్వాలాతి తం చక్రం మునిం దగ్ధుం సుదర్శనమ్ ।
శివరూపం తమజ్ఞాత్వా శివమాయా విమోహితమ్ ॥
ఏతస్మిన్నంతరే వ్యోమవాణ్యువాచా శరీరిణీ ।
అంబరీషం మహాత్మానం బ్రహ్మభక్తం చ వైష్ణవమ్ ॥

దుర్వాసుడిట్లు పలికెను -

ఓ రాజా! కలిసి భోజనము చేయుటకు నీవు దగవు. ఓయీ అధమా! నన్ను ఆహ్వానించి నాకు ఆహారమునీయకుండగా నీవు నీటిని త్రాగినావు. దాని ఫలమును నీకు చూపించెదను. దుష్టులకు శిక్షను విధించుటయే నా పని (38). ఇట్లు పలికి కోపముతో ఎర్రనైన కన్నులు గల వాడై ఆ మహర్షి రాజును దహించుటకు సిద్ధపడెను. వెంటనే రాజునందు ఉన్న ఈశ్వర స్వరూపమగు చక్రము రాజును రక్షించుట కొరకై సంసిద్ధమయ్యెను (39). శివమాయచే వ్యామోహమును పొందియున్న ఆ సుదర్శన చక్రము ఆ దూర్వాసుడు శివస్వరూపుడని యెరుంగక ఆయనను దహించుటకై ప్రజ్వరిల్లెను (40). ఇంతలో ఆకాశమునుండి అశరీరవాణి మహాత్ముడు, వేదభక్తుడు, మరియు వైష్ణవుడు అగు అంబరీషునితో నిట్లు పలికెను (41).

వ్యోమవాణ్యువాచ ।

సుదర్శనమిదం చక్రం హరయే శంభునార్పితమ్ ।
శాంతం కురు ప్రజ్వలితమద్య దుర్వాససే నృప ॥
దుర్వాసోఽయం శివ స్సాక్షాద్యచ్చక్రం హరయే ఽర్పితమ్ ।
ఏనం సాధారణమునిం న జానీహి నృపోత్తమ ॥
తవ ధర్మ పరీక్షార్థ మాగతోఽయం మునీశ్వరః ।
శరణం యాహి తస్యాశు భవిష్యత్యన్యథా లయః ॥

ఆకాశవాణి ఇట్లు పలికెను -

ఈ సుదర్శన చక్రమును శంభుడు హరునకిచ్చినాడు. ఓ రాజా! ఇప్పుడు దుర్వాసునిపై మంటలను గ్రక్కుచున్న ఈ చక్రమును శాంతింపజేయుము (42). ఈ దూర్వాసుడు సాక్షాత్తు శివస్వరూపుడు. ఈయనయే చక్రమును విష్ణువునకు ఇచ్చియున్నాడు. ఓ మహారాజా! ఈయన సాధారణమగు ముని యని తలంచకుము (43). ఈ మహర్షి నీ ధర్మమును పరీక్షించుటకు వచ్చినాడు. వెంటనే అతనిని శరణు వేడుము. లేనిచో, సర్వము వినాశము కాగలదు (44).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా చ న భోవాణీ విరరామ మునీశ్వర ।
అస్తావీత్స హరాంశం తమంబరీషోఽపి చాదరాత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! ఆకాశవాణి ఇట్లు పలికి విరమించెను. అపుడా అంబరీషుడు శివుని అంశావతారమగు ఆయనను స్తుతించెను (45).

అంబరీష ఉవాచః

యద్యస్తి దత్తమిష్టం చ స్వధర్మో వా స్వనుష్ఠితః ।
కులం నో విప్రదైవం చేద్ద్విజోరస్త్రం ప్రశామ్యతు ॥
యది నో భగవాన్ ప్రీతో మద్భక్తో భక్తవత్సలః ।
సుదర్శనమిదం చాస్త్రం ప్రశా మ్యతు విశేషతః ॥

అంబరీషుడిట్లు పలికెను -

నేను దానములను, యజ్ఞములను చేసియున్నచో, స్వధర్మమును అనుష్ఠించిన వాడనైనచో, మా కులము బ్రాహ్మణుని దైవముగా ఆరాధించినదైనచో, ఈ విష్ణువు యొక్క ఆయుధము శాంతించుగాక ! (46) భక్తవత్సలుడగు భగవానునకు నాయందు ప్రీతి యున్నచో, భక్తుడనైనచో, ఈ సుదర్శనాస్త్రము శీఘ్రమే చల్లారును గాక ! (47)

నందీశ్వర ఉవాచః

ఇతి స్తువతి రుద్రాగ్రే శైవం చక్రం సుదర్శనమ్ ।
అశామ్యత్సర్వథా జ్ఞాత్వా తం శివాంశం సులబ్ధధీః ॥
అథాంబరీష స్స నృపః ప్రణనామ చ తం మునిమ్ ।
శివావతారం సంజ్ఞాయ స్వపరీక్షార్థ మాగతమ్ ॥
సుప్రసన్నో బభూవాథ స మునిశ్శంకరాంశజః ।
భుక్త్వా తస్మై వరం దత్త్వా స్వాభీష్టం స్వాలయం యయౌ ॥
అంబరీష పరీక్షాయాం దుర్వాస శ్చరితం మునే ।
ప్రోక్త మన్యచ్చరిత్రం త్వం శృణు తస్య మునీశ్వర ॥
పునర్దాశరథేశ్చ క్రే పరీక్షాం నియమేన వై ।
మునిరూపేణ కాలేన యః కృతో నియమో మునే ॥
తదైవ మునినా తేన సౌమిత్రి: ప్రేషితో హఠాత్ ।
తం తత్యాజ ధ్రుతం రామో బంధుం పణ వశాన్మునే ॥
సా కథా విదితా లోకే మునిభిర్బహు ధోదితా ।
నాతో మే విస్తరాత్ప్రోక్తా జ్ఞాతా యత్సర్వథా బుధైః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆతడు ఈ విధముగా రుద్రుని యెదుట స్తుతించగా సుదర్శనమనే ఆ శివచక్రము పూర్తిగా చల్లారెను. దుర్వాసుడు శివుని అంశ యని యెరింగి పొందబడిన వివేకము గలవాడై (48), ఆ అంబరీష మహారాజు అపుడాయనకు నమస్కరించెను. తనను పరీక్షించుటకై శివుడే దుర్వాస రూపములో వచ్చి యున్నాడని ఆ రాజునకు తెలిసెను (49). శంకరుని అంశవలన జన్మించిన ఆ మహర్షి అపుడు మిక్కిలి ప్రసన్నుడై భుజించి ఆతనికి వరమునిచ్చి యథేచ్ఛగా తన ఆశ్రమమునకు వెళ్లెను (50). ఓ మహర్షీ ! అంబరీష పరీక్ష యనే దుర్వాసవృత్తాంతమును నీవు వినియుంటివి. ఓ మునీశ్వరా! ఆ మహర్షి యొక్క మరియొక చరిత్రను కూడ నీవు వినుము (51). ఇంకనూ ఆయన శ్రీరాముని కూడ పరీక్షించెను. కాలుడు ముని రూపమును దాల్చి శ్రీరామునితో ఒక నియమమును చేసెను (52). అదే సమయములో ఆ మహర్షి పట్టుబట్టి లక్ష్మణుని ఆయన వద్దకు పంపెను. ఓ మహర్షీ ! వెంటనే శ్రీరాముడు శపథమును పాటించి సోదరుడగు లక్ష్మణుని పరిత్యజించెను (53). ఈ కథ లోకములో ప్రఖ్యాతముగా నున్నది. మహర్షులు దీనిని విస్తరము చెప్పియున్నారు. విద్వాంసులు అందరికీ తెలిసిన గాథ యగుటచే నేను వివరముగా చెప్పుట లేదు (54).

నియమం సుదృఢం దృష్ట్వా సుప్రసన్నోఽభవన్మునిః ।
దుర్వాసా స్తు ప్రసన్నాత్మా వరం తస్మై ప్రదత్తవాన్ ॥
శ్రీ కృష్ణ నియమస్యాపి పరీక్షాం స చకార హ ।
తాం శృణు త్వం మునిశ్రేష్ఠ కథయామి కథాం చ తామ్ ॥
బ్రహ్మ ప్రార్థనయా విష్ణుర్వసుదేవసుతోఽభవత్ ।
ధరాభారావతారార్థం సాధూనాం రక్షణాయ చ ॥
హత్వా దుష్టాన్మహా పాపాన్ బ్రహ్మద్రోహకరాన్ ఖలాన్ ।
రరక్ష నిఖిలాన్ సాధూన్ బ్రాహ్మణాన్ కృష్ణనామ భాక్ ॥
బ్రహ్మ భక్తిం చకారాతి స కృష్ణో వసుదేవజః ।
నిత్యం హి భోజయామాస సురసాన్ బ్రాహ్మణాన్ బహూన్ ॥
బ్రహ్మభక్తో విశేషేణ కృష్ణ శ్చేతి ప్రథామగాత్ ।
సంద్రష్టు కామస్స మునిః కృష్ణాంతిక మగాన్మునే ॥
రుక్మిణీ సహితం కృష్ణం మగ్నం కృత్వా రథే స్వయమ్ ।
సంయోజ్య సంస్థితో వాహం సుప్రసన్న ఉవాహ తమ్ ॥

శ్రీరాముని మిక్కిలి దృఢమగు నియమమును గాంచి దుర్వాస మహర్షి మిక్కిలి ప్రసన్నుడై ఆయనకు వరము నిచ్చియుండెను (55). ఆ మహర్షి శ్రీకృష్ణుని నియమమును కూడ పరీక్షించెను. ఓ మహర్షీ! ఆ కథను చెప్పెదను వినుము (56).

భూభారమును తగ్గించి సాధువులను రక్షించుట కొరకై బ్రహ్మ యొక్క ప్రార్ధనమేరకు విష్ణువు వసుదేవుని కుమారుడై అవతరించెను (57). ఆయన కృష్ణుడను పేరుతో విఖ్యాతిని గాంచి మహాపాపులు వేదద్రోహమును చేయువారు అగు దుష్టులను సంహరించి సమస్త సాధువులను, బ్రాహ్మణులను రక్షించెను (58). వసుదేవుని కుమారుడగు ఆ శ్రీకృష్ణుడు బ్రాహ్మణులయందు అధికమగు భక్తిని కలిగియుండెను. ఆయన నిత్యము అనేక మంది బ్రాహ్మణులకు రుచ్యములగు పదార్థములతో భోజనమునిడెను (59). శ్రీకృష్ణుడు గొప్ప బ్రాహ్మణ భక్తుడని కీర్తిని గాంచెను. ఓ మహర్షీ ! ఆ మహర్షి శ్రీ కృష్ణుని దర్శించుటకై ఆయన వద్దకు వెళ్లెను (60), రుక్మిణీ సమేతుడగు శ్రీకృష్ణుని ఆయన స్వయముగా రథము నెక్కించి మిక్కిలి ప్రసన్నమగు మనస్సు గలవాడై ఆ రథమునకు గుర్రమును పూన్చి స్వయముగా నడిపించెను (61) (?)

మునీ రథాత్సముత్తీర్య దృష్ట్వా తాం దృఢతాం పరామ్ ।
తస్మై భూత్వా సుప్రసన్నో వంగత్వవరం దదౌ ॥
ద్యునద్యామేకదా స్నానం కుర్వన్నగ్నో బభూవ హ ।
లజ్జితోఽభూన్ముని శ్రేష్ఠో దుర్వాసాః కౌతుకీ మునే ॥
తద్ జ్ఞాత్వా ద్రౌపదీ స్నానం కుర్వతీ తత్ర చాదరాత్ ।
తల్లజ్జాం ఛాదయామాస ఛిన్న స్వాంచలదానతః ॥
తదాదాయ ప్రవాహేనాగతం స్వనికటం మునిః ।
తేనాచ్ఛాద్య స్వగుహ్యం చ తస్యై తుష్టో బభూవ సః ॥
ద్రౌపద్యై చ వరం ప్రాదాత్తదంచల వివర్ధనమ్ ।
పాండవాన్ సుఖినశ్చ క్రే ద్రౌపదీం తద్వరాత్పునః ॥
హంసడింభౌ నృపౌ కౌచిత్ స్వావమానకరౌ ఖలౌ ।
దత్త్వా నిదేశం చ హరే ర్నాశయామాస స ప్రభుః ॥
బ్రహ్మతేజో విశేషేణ స్థాపయామాస భూతలే ।
సన్న్యాసపద్ధతిం చైవ యథా శాస్త్ర విధి క్రమమ్ ॥

ఆ మహర్షి రథమునుండి దిగి శ్రీకృష్ణుని శ్రేష్ఠమగు దృఢవ్రతత్వమును గాంచి మిక్కిలి ప్రసన్నమగు మనస్సు గలవాడై ఆయనకు సంపదతో బాటు వజ్రము వలె దృఢమగు దేహమును వరముగా నిచ్చెను (62). ఆయన ఒకనాడు గంగానదిలో స్నానము చేయుచుండగా వస్త్రము కొట్టుకు పోయెను. ఓ మహర్షీ! అపుడా దుర్వాస మహర్షి సిగ్గుపడి ఉత్కంఠతో ఇటునటు చూచెను (63). సమీపములో స్నానము చేయుచున్న ద్రౌపది విషయమును గ్రహించి తన వస్త్రమును చింపి ఆ శకలమును ఆదరముతో ఆయనకు ఇచ్చి పరువును కాపాడెను (64). ప్రవాహ వేగముచే తన వద్దకు వచ్చిన వస్త్ర శకలమును స్వీకరించి ఆ మహర్షి దానిని ధరించి ఆమెయందు మిక్కిలి ప్రసన్నుడాయెను (65). ఆయన ద్రౌపదికి వస్త్ర వృద్ధియను వరమునిచ్చి, ఆ వరప్రభావముచే ద్రౌపదికి మరియు పాండవులకు సుఖము కలుగునట్లు చేసెను (66). సమర్థుడగు ఆ మహర్షి విష్ణువును ఆదేశించి, రెండు హంసల పిల్లల రూపములో తనను అవమానించిన దుష్టులగు ఇద్దరు రాజులను ముట్టు పెట్టెను (67). ఆయన తన బ్రహ్మతేజస్సు యొక్క మహిమచే భూలోకమునందు యథాశాస్త్రముగా కర్మలను చేయు క్రమమును, మరియు సన్న్యాస పద్ధతిని కూడ ప్రవేశపెట్టెను (68).

బహూనుద్ధారయామాస సూపదేశం విబోధ్య చ ।
జ్ఞానం దత్త్వా విశేషేణ బహూన్ ముక్తాంశ్చకార సః ॥
ఇత్థం చక్రే స దుర్వాసా విచిత్రం చరితం బహు ।
ధన్యం యశస్యమాయుష్యం శృణ్వతస్సర్వ కామదమ్ ॥।
య ఇదం శృణుయాద్భక్త్యా దుర్వాసశ్చరితం ముదా ।
శ్రావయేద్వా పరాన్ యశ్చ స సుఖీహ పరత్ర చ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం దుర్వాసశ్చరిత్రవర్ణనం నామైకోనవింశోఽధ్యాయః (19).

ఆయన చక్కని ఉపదేశమును బోధించి అనేక మందిని ఉద్ధరించెను. ఆయన విశేషించి అనేకమందికి జ్ఞానమును ఇచ్చి వారిని ముక్తులను చేసెను (69). ఈ విధముగా ఆ దూర్వాస మహర్షి అనేకములగు విచిత్ర చరితములను ప్రకటించెను. ఈ చరిత్ర పవిత్రమైనది, యశస్సును ఆయుర్దాయమును మాత్రమే గాక వినువారికి కోర్కెలనన్నిటినీ ఇచ్చును (70). ఎవడైతే ఈ దూర్వాస చరితమును భక్తితో ఆనందముతో వినునో, లేదా ఇతరులకు వినిపించునో, ఆతడు ఇహపర లోకములలో సుఖమును బడయును (71).

శ్రీ శివమహాపురాణములో శతరుద్ర సంహిత యందు దూర్వాస చరితమనే పందొమ్మిదవ అధ్యాయము ముగిసినది (19).

20 – హనుమచ్చరిత్ర

నందీశ్వర ఉవాచః

అతః పరం శృణు ప్రీత్యా హనుమచ్చరితం మునే ।
యథా చకారాశు హరో లీలాస్తద్రూపతో వరాః ॥
చకార సుహితం ప్రీత్యా రామస్య పరమేశ్వరః ।
తత్సర్వం చరితం విప్ర శృణు సర్వ సుఖావహమ్ ॥
ఏకస్మిన్ సమయే శంభురద్భుతో తికరః ప్రభుః ।
దదర్శ మోహినీ రూపం విష్ణోస్స హి వసద్గుణః ॥
చక్రే స్వం క్షుభితం శంభుః కామబాణ హతో యథా ।
స్వం వీర్యం పాతయామాస రామకార్యార్థమీశ్వరః ॥
తద్వీర్యం స్థాపయామాసుః పత్రే సప్తర్షయశ్చ తే ।
ప్రేరితా మనసా తేన రామ కార్యార్థ మాదరాత్ ॥
తైర్గౌతమసుతాయాం తద్వీర్యం శంభోర్మహర్షి భిః ।
కర్ణద్వారా తథాంజన్యాం రామకార్యార్థ మాహితమ్ ॥
తతశ్చ సమయే తస్మాద్ధ నూమానితి నామభాక్ ।
శంభుర్జజ్ఞే కపితనుర్మహా బలపరాక్రమః ॥
హనూమాన్ స కపీశానశ్శిశురేవ మహాబలః ।
రవిబింబం బభక్షాశు జ్ఞాత్వా లఘుఫలం ప్రగే ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓ మహర్షీ ! దీని తరువాత నీవు హనుమచ్చరితమును ప్రీతితో వినుము. శివుడు హనుమద్రూపమును దాల్చి గొప్ప లీలలను ప్రకటించిన తీరును తెలుసుకొనుము (1). ఆ పరమేశ్వరుడు ప్రేమతో శ్రీరామునకు గొప్ప హితమును చేసెను. ఓ విదే! సర్వులకు సుఖమును కలిగించు ఆ వృత్తాంతమునంతనూ వినుము (2). ఒకానొక సమయములో అద్భుతమగు లీలలను నెరపువాడు, సకలగుణాభిరాముడు అగు శంకరప్రభుడు విష్ణువు యొక్క మోహినీ రూపమును గాంచెను (3). ఈశ్వరుడగు శంభుడు తన అంతఃకరణమును కాముని బాణములచే కొట్టబడినదా యన్నట్లు చేసి రామకార్యము కొరకై తన వీర్యమును స్ఖలనము చేసెను (4). సప్తర్షులు ఆ శివుని చేత హృదయమునందు ప్రేరేపించబడినవారై రామకార్యము కొరకు ఆ వీర్యమును సాదరముగా పత్రమునందు స్థాపించిరి (5). ఆ మహర్షులు రామకార్యముకొరకై శంభుని ఆ వీర్యమును గౌతముని కుమార్తెయగు అంజనీదేవియందు చెవిద్వారా ప్రవేశపెట్టిరి. (6). తరువాత కొంతకాలమునకు శంభుడు ఆ వీర్యము వలన వానర దేహము గలవాడై జన్మించెను. మహాబలపరాక్రమములు గల ఆ వానరునకు

హనుమాన్ అను పేరు కలిగెను (7). మహాబలుడు, కపిశ్రేష్ఠుడు అగు ఆ హనుమంతుడు బాలుడుగ నుండగనే సూర్యోదయకాలములో సూర్యుని పండు అని తలపోసి వేగమే తేలికగా ఆ సూర్య బింబమును భక్షించెను (8).

దేవ ప్రార్థనయా తం సోఽత్యజత్ జ్ఞాత్వా మహాబలమ్ ।
శివావతారం చ ప్రాప వరాన్ దత్తాన్ సురర్షిభిః ॥
స్వజనన్యంతికం ప్రాగాదథ సోఽతి ప్రహర్షితః ।
హనూమాన్ సర్వమాచఖ్యౌ తస్యై తద్వృత్త మాదరాత్ ॥
తదాజ్ఞయా తతో ధీరస్సర్వ విద్యామయత్నతః ।
సూర్యాత్పపాఠ స కపిర్గత్వా నిత్యం తదంతికమ్ ॥
సూర్యాజ్ఞయా తదంశస్య సుగ్రీవస్యాంతికం యయౌ ।
మాతురాజ్ఞామను ప్రాప్య రుద్రాంశః కపిసత్తమః ॥
జేష్ఠభ్రాత్రా వాలినా హి స్వస్త్రీ భోక్త్రా తిరస్కృతః ।
ఋష్యమూకగిరౌ తేన న్యవసత్స హ నూమతా ॥
తతోఽభూత్స సుకంఠస్య మంత్రీ కపివరస్సు ధీః ।
సర్వథా సుహితం చక్రే సుగ్రీవస్య హరాంశజః ॥
తత్రా గతేన సభ్రాత్రా హృతభార్యేణ దుఃఖినా ।
కారయామాస రామేణ తస్య సఖ్యం సుఖావహమ్ ॥
ఘాతయామాస రామశ్చ వాలినం కపికుంజరమ్ ।
భ్రాతృపత్న్యాశ్చ భోక్తారం పాపినం వీరమానినమ్ ॥

మహాబలశాలి, శివావతారము అని యెరింగి దేవతలు ప్రార్థించగా, ఆతడు సూర్యుని విడిచిపెట్టి దేవతలనుండి, ఋషులనుండి వరములను పొందెను (9). అపుడు హనుమంతుడు మిక్కిలి ఆనందముతో తన తల్లి వద్దకు వెళ్లి ఆ వృత్తాంతమునంతనూ శ్రద్ధతో ఆమెకు విన్నవించెను (10). ధీరుడగు ఆ వానరుడు తరువాత తల్లి యానతిని పొంది ప్రతిదినము సూర్యుని వద్దకు వెళ్లి ఆయన వద్ద విద్యలనన్నిటినీ తేలికగా అభ్యసించెను (11). రుద్రాంశసంభూతుడగు ఆ వానరవీరుడు తల్లియాజ్ఞను పొంది సూర్యుని ఆజ్ఞచే సూర్యుని అంశతో జన్మించిన సుగ్రీవుని వద్దకు వెళ్లెను (12). సుగ్రీవుని అన్నయగు వాలి తమ్ముని భార్యను అపహరించి ఆతనిని తరిమివేసెను. ఆ సుగ్రీవుడు హనుమంతునితో గూడి ఋష్యమూక పర్వతమునందు నివసించెను (13). బుద్ధిశాలి, శివుని అంశతో జన్మించిన వాడు అగు ఆ వానరశ్రేష్ఠుడు తరువాత సుగ్రీవునకు మంత్రియై ఆయనకు అన్ని విధములుగా హితమును చేగూర్చెను (14). భార్య అపహరింపబడగా దుఃఖిస్తూ సోదరునితో కలిసి అచటకు వచ్చిన రామునితో హనుమంతుడు సుగ్రీవునకు సఖ్యమును చేయించెను. దాని వలన సుగ్రీవునకు సుఖము లభించెను (15). వానరవీరుడు, సోదరుని భార్యను అపహరించినవాడు,

పాపి, వీరుడననే గర్వము గలవాడు అగు వాలిని రాముడు సంహరించెను (16).

తతో రామాజ్ఞయా తాత హనూమాన్ వానరేశ్వరః ।
ససీతాన్వేషణం చక్రే బహుభిర్వానరై స్సుధీః ॥
జ్ఞాత్వా లంకాగతాం సీతాం గతస్తత్ర కపీశ్వరః ।
ద్రుతముల్లంఘ్య సింధుం తమనిస్తీర్యం పరైస్స వై ॥
చక్రేఽద్భుత చరిత్రం స తత్ర విక్రమ సంయుతమ్ ।
అభిజ్ఞానం దదౌ ప్రీత్యా సీతాయై స్వప్రభోర్వరమ్ ॥
సీతా శోకం జహారాశు స వీరః కపినాయకః ।
శ్రావయిత్వా రామవృత్తం తత్ప్రాణావన కారకమ్ ॥
తదభిజ్ఞానమాదాయ నివృత్తో రామసన్నిధిమ్ ।
రావణో ద్యాన మాహత్య జఘాన బహురాక్షసాన్ ॥
తదైవ రావణసుతం హత్వా సబహు రాక్షసమ్ ।
స మహోపద్రవం చక్రే మహోతిస్తత్ర నిర్భయః ॥
యదా దగ్ధో రావణే నావగుంఠ్య వసనాని చ ।
తైలా భ్యక్తాని సుదృఢం మహాబలవతా మునే ॥
ఉత్ప్లుత్యోత్ప్లుత్య చ తదా మహాదేవాంశజః కపిః ।
దదాహ లంకాం నిఖిలాం కృత్వా వ్యాజం తమేవ హి ॥

వత్సా! అపుడు వానరశ్రేష్ఠుడు, బుద్ధిశాలియగు ఆ హనుమంతుడు అనేక వానరులతో గూడి రాముని యాజ్ఞచే సీతను వెదుకనారంభించెను (17). ఆ వానరవీరుడు లంక యందు సీత గలదని యెరింగి ఇతరులకు లంఘింప శక్యము కాని సముద్రమును శీఘ్రముగా లంఘించి లంకను చేరెను (18). ఆతడచట పరాక్రమముతో నిండియున్న అద్భుతమగు చరిత్రను సృష్టించి, తన ప్రభువగు శ్రీరామునియొక్క శ్రేష్ఠమగు అంగుళీయకమును సీతా దేవికి ప్రీతితో గుర్తుగా నొసంగెను (19). వీరుడగు ఆ కపీశ్వరుడు రాముని వృత్తాంతమును వినిపించి ఆమె ప్రాణములను కాపాడెను. ఆమె వెంటనే దుఃఖము విడనాడెను (20). ఆతడు ఆమెనుండి గుర్తుగా చూడామణిని తీసుకొని అనేక మంది రాక్షసులను సంహరించి, రావణుని ఉద్యాన వనమును ధ్వంసము చేసి, రాముని సన్నిధికి తిరిగి వచ్చెను (21). అదే సమయములో రావణుని కుమారుడగు అక్షయ కుమారుని చాలమంది రాక్షసులతో సహా సంహరించి అచట నిర్భయముగా గొప్ప లీలలను ప్రకటించి ఆయన గొప్ప ఉపద్రవమును సృష్టించెను (22). ఓ మునీ ! రావణుడు ఆయన తోకకు నూనెలో ముంచిన గుడ్డలను చుట్టించి నిప్పు ముట్టించెను. కాని మహాబలశాలియగు ఆ హనుమంతుడు వారి బారినుండి తప్పించుకొని (23) ఒక భవనము నుండి మరియొక భవనముపైకి దుముక జొచ్చెను. మహాదేవుని అంశవలన జన్మించిన ఆ వానరుడు అదే మిషతో లంకానగరమునంతనూ దహించెను (24).

దగ్ధ్వా లంకాం వంచయిత్వా విభీషణ గృహం తతః ।
అపతద్వారిదౌ వీర స్తతస్స కపికుంజరః ॥
స్వపుచ్ఛం తత్ర నిర్వాప్య ప్రాప తస్య పరం తటమ్ ।
అఖిన్న స్వియయౌ రామసన్నిధిం గిరిశాంశజః ॥
అవిలంబేన సుజవో హనూమాన్ కపిసత్తమః ।
రామోపకంఠమాగత్య దదౌ సీతా శిరోమణిమ్ ॥
తతస్తదాజ్ఞయా వీరస్సింధౌ సేతుమ బంధయత్ ।
వానరైస్స సమానీయ బహూన్ గిరివరాన్ బలీ ॥
గత్వా తత్ర తతో రామస్తర్తు కామో యథా తతః ।
శివలింగం సమానర్చ ప్రతిష్ఠాప్య జయేప్సయా ॥
తద్వరాత్స జయం ప్రాప్య వరం తీర్త్వోదధిం తతః ।
లంకామావృత్య కపిభీ రణం చక్రే స రాక్షసైః ॥
జఘానాథాసురాన్ వీరో రామసైన్యం రరక్ష సః ।
శక్తి క్షతం లక్ష్మణం చ సంజీవిన్యా హ్య జీవయత్ ॥
సర్వథా సుఖినం చక్రే సరామం లక్ష్మణం హి సః ।
సర్వసైన్యం రరక్షాసౌ మహాదేవాత్మజః ప్రభుః ॥
రావణం పరివారాఢ్యం నాశయామాస విశ్రమః ।
సుఖీచకార దేవాన్ స మహాబలగృహః కపిః ॥

వీరుడగు ఆ కపిశ్రేష్ఠుడు అపుడు విభీషణుని ఇల్లు తక్క మిగిలిన లంకను దహించి, తరువాత సముద్రములో చేరి (25), తన తోకయందలి నిప్పును చల్లార్చుకొని ఆవలి తీరమును చేరుకొనెను. శివుని అంశతో జన్మించిన ఆ వీరుడు ఉత్సాహముతో రాముని సన్నిధికి చేరెను (26). మహావేగము గలవాడు, వానరవీరుడు అగు హనుమంతుడు విలంబము లేకుండగా రాముని సన్నిధికి వచ్చి సీతాదేవి యొక్క చూడామణిని ఇచ్చెను (27). అపుడా వీరుడు ఆయన ఆజ్ఞను గైకొని వానరులతో గూడి అనేక పెద్ద పర్వతములను దెచ్చి సముద్రమునందు సేతువును నిర్మించెను (28). అపుడు శ్రీరాముడు అచటకు వెళ్లి సముద్రమును దాటగోరెను. ఆయన జయమును గోరి అచట శివలింగమును ప్రతిష్ఠించి చక్కగా పూజించెను (29). శివుని వరముచే ఆయన జయమును పొందుట నిశ్చయము. ఆయన అపుడు ఆ గొప్ప సముద్రమును దాటి వానరులతో గూడి లంకను చుట్టు ముట్టి రాక్షసులతో యుద్ధమును చేసెను (30). అపుడా వీరుడు రాక్షసులను సంహరించి రాముని సైన్యమును రక్షించెను. శక్తిచే కొట్టబడి నేలగూలిన లక్ష్మణుని సంజీవినితో బ్రతికింప జేసెను (31). మహాదేవుని పుత్రుడగు ఆ హనుమత్ప్రభుడు రామలక్ష్మణులకు సర్వ విధములుగా సుఖమును కలిగించి సైన్యము నంతనూ రక్షించెను (32). శ్రమను ఎరుంగని వాడు, మహాబలసంపన్నమగు దేహము గలవాడు అగు ఆ హనుమంతుడు సకుటుంబముగా రావణుని వశింపజేసి దేవతలకు మోదమును గూర్చెను (33).

మహిరావణ సంజ్ఞం సహత్వా రామం సలక్ష్మణమ్ ।
తత్ స్థానాదానయామాస స్వస్థానం పరిపాల్య చ ॥
రామకార్యం చకారాశు సర్వథా కపిపుంగవః ।
అసురాన్న మయామాస నానా లీలాం చకార చ ॥
స్థాపయామాస భూలోకే రామభక్తిం కపీశ్వరః ।
స్వయం భక్తవరో భూత్వా సీతారామ సుఖ ప్రదః ॥
లక్ష్మణ ప్రాణదాతా చ సర్వదేవ ముదావహః ।
రుద్రావతారో భగవాన్ భక్తోద్ధారకరస్స వై ॥
హనుమాన్ స మహావీరో రామకార్య కరస్సదా ।
రామదూతాభిధో లోకే దైత్య ఘ్నో భక్తవత్సలః ॥
ఇతి తే కథితం తాత హనుమచ్చరితం వరమ్ ।
ధన్యం యశస్యమాయుష్యం సర్వకామ ఫలప్రదమ్ ॥
య ఇదం శృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
స భుక్త్వేహాఖిలాన్ కామానంతే మోక్షం లభేత్పరమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం హనుమదవతార
వర్ణనం నామ వింశోఽధ్యాయః(20).

హనుమంతుడు మహిరావణుడను రాక్షసుని సంహరించి వాని వద్ద బందీలుగానున్నన రామలక్ష్మణులను రక్షించి తీసుకొని వచ్చెను (34). ఆ వానరవీరుడు సర్వవిధములుగా రామకార్యమును చేయుచూ రాక్షసులను నిర్జించి వివిధలీలలను ప్రకటించెను (35). ఆ కపివీరుడు తాను గొప్ప భక్తుడై సీతారాములకు సుఖమును కలిగించి భూలోకములో రామభక్తిని సుస్థిరము చేసెను (36). రుద్ర భగవానుడు ఈ విధముగా అవతరించి లక్ష్మణుని ప్రాణములను కాపాడి, దేవతలందరికీ ఆనందమును కలిగించి, భక్తుల నుద్ధరించెను (37). మహావీరుడు, సర్వదా రామకార్యమును చేసినవాడు, రాక్షససంహారి మరియు భక్తప్రియుడు నగు ఆ హనుమంతుడు రామదూతయను ప్రఖ్యాతిని గాంచెను (38). వత్సా! నీకీ తీరున శ్రేష్ఠమైనది, ధన్యమైనది, యశస్సును ఆయుర్దాయమును ఇచ్చునది మరియు కోర్కెలనన్నిటినీ ఈడేర్చునది యగు హనుమచ్చరిత్రను చెప్పితిని (39). ఎవడైతే దీనిని భక్తితో మనస్సును లగ్నము చేసి వినునో, లేక వినిపించునో వాడు ఇహలోకములో సమస్తభోగముల ననుభవించి మరణించిన తరువాత సర్వ శ్రేష్ఠమగు మోక్షమును పొందును (40).

శ్రీ శివమహా పురాణములో శతరుద్ర సంహితయందు హనుమదవతార
వర్ణనమనే ఇరువదియవ అధ్యాయము ముగిసినది (20).

21 - మహేశావతారము

నందీశ్వర ఉవాచః

అథ ప్రీత్యా శృణు మునేఽవతారం పరమం ప్రభోః ।
శంకరస్యాత్మ భూపుత్ర శృణ్వతాం సర్వకామదమ్ ॥
ఏకదా మునిశార్దూల గిరిజా శంకరావుభౌ ।
విహర్తుకామౌ సంజాతౌ స్వేచ్ఛయా పరమేశ్వరౌ ॥
భైరవం ద్వారపాలం చ కృత్వాభ్యం తరమాగతౌ ।
నానాసఖిగణైః ప్రీత్యా సేవితా నరశీలితౌ ॥
చిరం విహృత్య తత్ర ద్వౌ స్వతంత్రౌ పరమేశ్వరౌ ।
బభూవతుః ప్రసన్నౌ తౌ నానాలీలాకరౌ మునే ॥
అథోన్మత్తా కృతిర్దేవీ స్వతంత్రా లీలయా శివా ।
ఆగతా ద్వారి తద్రూపా ప్రభోరాజ్ఞామవాప సా ॥
తాం దేవీం భైరవస్సోఽథ నారీ దృష్ట్యా విలోక్య చ ।
నిషిషేధ బహిర్గంతుం తద్రూపేణ విమోహితః ॥
నారీదృష్ట్యా సుదృష్టా సాభైరవేణ యదా మునే ।
క్రుద్ధా భవచ్ఛివా దేవీ తం శశాప తదాంబికా ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మునీ! బ్రహ్మపుత్రా! ఇపుడు పరమప్రభుడగు శంకరుని మరియొక అవతారమును గురించి వినుము. ఇది వినువారికి కోర్కెల నన్నిటినీ ఈడేర్చును (1). ఓ మహర్షీ! పరమేశ్వరులగు గిరిజాశంకరులిద్దరు ఒకప్పుడు యథేచ్ఛగా విహరించవలెనని నిశ్చయించుకొనిరి (2). అనేకమంది సఖురాండ్రచే సేవింపబడే వారిద్దరు లోకాచారము ననుసరించి భైరవుని ద్వారపాలకునిగా నుంచి లోపలకు వెళ్లిరి (3). ఓ మహర్షీ! స్వతంత్రులు, పరమేశ్వరులు, వివిధలీలలను ప్రకటించువారు నగు వారిద్దరు ప్రసన్నమగు మనస్సు గలవారై చిరకాలము విహరించిరి (4). తరువాత పార్వతీదేవి అతి సుందరరూపమును దాల్చి ప్రభువు యొక్క ఆజ్ఞను పొంది లీలను ప్రకటించుటలో స్వతంత్రురాలై ద్వారము వద్దకు వచ్చెను (5). భైరవుడు అపుడా దేవిని గాంచి ఆమెయొక్క రూపముచే వ్యామోహితుడై ఆమెను సామాన్యస్త్రీ యను దృష్టితో పరికించి బయటకు వెళ్లుటకు అడ్డగించెను (6). ఓ మహర్షీ ! భైరవుడు ఆమెను సామాన్యస్త్రీ యను భావముతో పరికించుటను గాంచి జగన్మాతయగు పార్వతీదేవి మిక్కిలి కోపించి ఆతనిని శపించెను (7).

శివోవాచ ।

నారీ దృష్ట్వా పశ్యసి త్వం యతో మాం పురుషాధమ ।

అతో భవ ధరాయాం హి మానుష స్త్వం చ భైరవ ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓయీ పురుషాధమా ! నీవు నన్ను స్త్రీ యను దృష్టితో గాంచితివి. భైరవా! ఈ కారణముచే నీవు భూమియందు మానవుడవై జన్మించుము (8).

నందీశ్వర ఉవాచః

ఇత్థం యదాభవచ్ఛ ప్తో భైరవశ్శివయా మునే ।

హాహాకారో మహానాసీ ద్దుః ఖమాప స లీలయా ॥

తతశ్చ శంకరశ్శీఘ్రం తమాగత్య మునీశ్వర ।

ఆశ్వాసయ ద్భైరవం హి నానాశ్నునయ కోవిదః ॥

తచ్ఛాపాద్భైరవస్సోఽథ క్షితావవతరన్మునే ।

మనుష్యయోన్యం వైతాల సంజ్ఞక శ్శంకరేచ్ఛయా ॥

తత్ స్నేహతశ్శివస్సోఽపి క్షితావవతర ద్విభుః ।

శివయా సహ సల్లీలో లౌకికీం గతి మాశ్రితః ॥

మహేశాహ్వశ్శివశ్చా సీ చ్ఛారదా గిరిజా మునే ।

సులీలాం చక్రతుః ప్రీత్యా నానాలీలా విశారదౌ ॥

ఇతి తే కథితం తాత మహేశచరితం వరమ్ ।

ధన్యం యశస్యమాయుష్యం సర్వకామ ఫలప్రదమ్ ॥

య ఇదం శృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।

స భుక్త్వేహాఖిలాన్ భోగానంతే మోక్షమవాప్నుయాత్ ॥

ఇతి శ్రీ శివ మహాపురాణే శతరుద్ర సంహితాయాం మహేశావ తార వర్ణనం నామ ఏక వింశోఽధ్యాయః (20).

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ ! పార్వతి భైరవుని ఇట్లు శపించగా, పెద్ద హాహాకారము చెలరేగెను◌ు. ఆతడు లీలచే దుఃఖమును పొందెను (9). ఓ మహర్షీ! అపుడు వివిధ పద్ధతులలో అనునయించుట యందు నిపుణుడగు శంకరుడు శీఘ్రమే అచటకు వచ్చి ఆ భైరవుని ఓదార్చెను (10). ఓ మహర్షీ ! తరువాత శంకరుని ఇచ్ఛచే భైరవుడు ఆ శాపము వలన భూమియందు వైతాలుడను పేరుతో మానవుడై అవతరించెను (11). ఆతని యందలి ప్రేమచే, శివవిభుడు గూడ పార్వతితో గూడి భూమిపై అవతరించి లోకపు పోకడననుసరించి ఉత్తమమగు లీలలను ప్రకటించెను (12). ఓ మునీ ! శివుడు మహేశుడను పేరుతో, పార్వతి శారదయను పేరుతో అవతరించిరి. అనేక లీలలను ప్రకటించుటలో దక్షులగు వారిద్దరు ప్రీతితో చక్కటి లీలను నెరపిరి (13). వత్సా! నేను నీకింతవరకు శ్రేష్ఠము, ధన్యము, యశస్యము, ఆయుష్యము, సర్వకామములను ఫలములను ఇచ్చునది అగు మహేశచరిత్రను చెప్పియుంటిని (14). ఎవడైతే దీనిని భక్తితో వినునో, లేక ఏకాగ్రమగు మనస్సుతో వినిపించునో, వాడు ఈ లోకములో సకలభోగముల ననుభవించి, మరణించిన తరువాత మోక్షమును పొందును (15).

శ్రీ శివమహాపురాణములో శతరుద్ర సంహితయందు మహేశావతార వర్ణనమనే ఇరువది ఒకటవ అధ్యాయము ముగిసినది (21).

22 - సముద్ర మథనము

నందీశ్వర ఉవాచః

శృణు బ్రహ్మసుత ప్రాజ్ఞ వృషేశాఖ్యం మునీశ్వర ।
శివావతారం సల్లీలం హరి గర్వహరం వరమ్ ॥
పురా దేవాసురాస్సర్వే జరామృత్యు భయార్దితా: ।
పరస్పరం చ సంధాయ రత్నా న్యా దిత్సవోఽభవన్ ॥
తతస్సు రాసురాస్సర్వే క్షీరోదం సాగరోత్తమమ్ ।
ఉద్యతా మథితుం తం చ బభూవుర్మునినందన ॥
ఆసన్ శుచిస్మితాస్సర్వే కేనేదం మంథనం భవేత్ ।
స్వకార్యసిద్ధయే తస్య బ్రహ్మన్నితి సురాసురాః ॥
తదా నభోగతా వాణీ మేఘ గంభీరనిస్స్వనా ।
ఉవాచ దేవాన్ దైత్యాం శ్చా శ్వాసయంతీశ్వరాజ్ఞయా ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ బ్రహ్మపుత్రా! బుద్ధి శాలి యగు మహర్షీ! శివుని వృషేశ్వరావతారమును గూర్చి వినుము. శ్రేష్ఠమగు ఈ అవతారములో శివుడు విష్ణుని గర్వమును పోగొట్టి మంచి లీలలను ప్రదర్శించినాడు (1). పూర్వము దేవాసురులందరు జరామరణముల భయముచే పీడింపబడిన వారై పరస్పరము సంప్రదించుకొని రత్నములను సంపాదించవలెనని నిర్ణయించిరి (2). ఓ మహర్షీ! తరువాత రాక్షసులు, దేవతలు అందరు కలిసి సముద్రములలో ఉత్తమమగు క్షీరసముద్రమును మథించుటకు సిద్ధమైరి (3). ఓ మహర్షీ ! తాము కోరు శ్రేష్ఠవస్తువులు లభించుట కొరకై ఈ సముద్రమును దేనితో మథించవలెనో? యని దేవతలు, రాక్షసులు అందరు పరస్పర మైత్రీ భావనతో ఆలోచించ మొదలిడిరి (4). అపుడు ఈశ్వరాజ్ఞచే మేఘము వలె గంభీరముగా ధ్వనించే ఆకాశవాణి దేవతలను, రాక్షసులను ఓదార్చుచూ ఇట్లు పలికెను (5).

నభవాణ్యువాచ ।

హే దేవా అసురాశ్చైవ మంథధ్వం క్షీరసాగరమ్ ।

భవతాం బలబుద్ధిర్హి భవిష్యతి న సంశయః ॥

మందరం చైవ మంథానం రజ్జుం కురుత వాసుకిమ్ ।

మిథస్సర్వే మిలిత్వా తు మథనం కురుతాదరాత్ ॥

ఆకాశవాణి ఇట్లు పలికెను -

ఓ దేవతలారా! మరియు రాక్షసులారా! క్షీరసముద్రమును మథించుడు. మీ బలము, బుద్ధి సఫలము కాగలవు. సందేహము లేదు (6). మందర పర్వతమును కవ్వముగా, వాసుకిని త్రాడుగా చేసి, మీరందరు 'పరస్పర సహకారముతో శ్రద్ధా పూర్వకముగా మథించుడు (7).

నందీశ్వర ఉవాచః

నభోగతాం తదా వాణీం నిశమ్యాథ సురాసురాః ।

ఉద్యోగం చక్రిరే సర్వే తత్కర్తుం మునిసత్తమ ॥

సుసంధాయాఖిలాస్తే వై మందరం పర్వతోత్తమమ్ ।

కనకాభం చ సరలం నానాశోభార్చితం యయుః ॥

సుప్రసాద్య గిరీశం తం తదాజ్ఞప్తాస్సు రాసురాః ।

బలాదుత్పాటయామాసుర్నేతు కామాః పయోఽర్ణవమ్ ॥

భుజైరుత్పాట్య తే సర్వే జగ్ముః క్షీరార్ణవం మునే ।

అశక్తా అభవంస్తత్ర తమానేతుం హతౌ జసః ॥

తద్భుజైస్స పరిభ్రష్టః పతితో మందరో గిరిః ।

సహసాతిగురుస్సద్యో దేవదైత్యోపరి ధ్రువమ్ ॥

ఏవం భగ్నోద్యమా భగ్నాస్సంబభూవు స్సురాసురా: ।

చేతనాః ప్రాప్య చ తతస్తుష్టువుర్జగదీశ్వరమ్ ॥

తదిచ్ఛయోద్యతాస్సర్వే పునరుత్థాప్య తం గిరిమ్ ।

ని చిక్షిపుర్జలే నీత్వా క్షీరో దస్యోత్తరే తటే ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! అపుడా దేవతలు, రాక్షసులు ఆకాశవాణిని విని అందరు కలిసి మథించుటకు ప్రయత్నముల నారంభించిరి (8). వారు అందరు చక్కగా నిర్ణయించుకొని, బంగారము వలె ప్రకాశించునది, అనేక శోభలతో నలరారునది, పర్వతములలో గొప్పది యగు మందర పర్వతము వద్దకు తేలికగా చేరుకొనిరి (9). దేవతలు, రాక్షసులు ఆ పర్వతరాజును ప్రసన్నము చేసుకొని ఆయన అనుమతిని పొంది క్షీరసముద్రమునకు గొని పోవుట కొరకై బలాత్కారముగా ఊడ బెరికిరి (10). ఓ మహర్షీ! వారు అందరు ఆ పర్వతమును ఊడబెరికి భుజములపై

క్షీరసముద్రమునకు గొనిపోవుటకు ఉద్యమించిరి. కాని సన్నగిల్లిన బలముగల వారు ఆ పర్వతమును సముద్రము వరకు గొని రాలేకపోయిరి (11).మిక్కిలి అధికమగు భారము గల ఆ మందర పర్వతము వారి భుజములనుండి జారి వెంటనే దేవదానవులపై నిశ్చయముగా పడెను (12). ఈ విధముగా దేవదానవుల ఉద్యమము విఫలమాయెను. వారు తెలివిని దెచ్చుకొని, తరువాత జగదీశ్వరుని స్తుతించిరి (13). ఆ పరమేశ్వరుని ఇచ్ఛచే వారందరు మరల ఉద్యమించి ఆ పర్వతమును పైకి ఎత్తి క్షీరసముద్రము యొక్క ఉత్తరతీరము వరకు తీసుకువచ్చి నీటిలో బడవేసిరి (14).

తతస్సురాసురగణా రజ్జుం కృత్వా చ వాసుకిమ్ ।
రత్నా న్యాదాతు కామాస్తే మమంథుః క్షీరసాగరమ్ ॥
క్షీరోదే మథ్య మానే తు శ్రీ స్స్వర్లో కమహేశ్వరీ ।
సముద్భూతా సముద్రాచ్చ భృగుపుత్రీ హరిప్రియా ॥
ధన్వంతరిశ్శశాంకశ్చ పారిజాతో మహాద్రుమః ।
ఉచ్చైశ్శ్రవాశ్చ తురగో గజ ఐరావతస్తథా ॥
సురా హరిధనుశ్శంఖో గావః కామదుఘాస్తతః ।
కౌస్తుభాఖ్యో మణిశ్చైవ తథా పీయూషమేవ చ ॥
పునశ్చ మథ్యమానే తు కాలకూటం మహావిషమ్ ।
యుగాంతానలభం జాతం సురాసుర భయావహమ్ ॥
పీయూష జన్మకాలే తు బిందవో యే బహిర్గతాః ।
తేభ్యః కాంతా స్సముద్భూతా బహ్వ్యో హ్యద్భుతదర్శనాః ॥
శరత్పూర్ణేందు వదనాస్తడిత్సూర్యానల ప్రభాః ।
హారకేయూర కటకైర్దివ్యరత్నైరలం కృతాః ॥

తరువాత దేవదానవ సమూహములు రత్నములను సంపాదించవలెననే కోరిక గలవారై వాసుకి౦ని త్రాడుగా చేసి క్షీరసముద్రమును మథించిరి (15). క్షీరసముద్రమును మథించుచుండగా స్వర్గలోక మహేశ్వరియగు లక్ష్మీదేవి సముద్రమునుండి పుట్టి భృగుమహర్షి పుత్రికయై విష్ణువునకు పత్నియైనది (16). ధన్వంతరి, చంద్రుడు, పారిజాతమనే మహావృక్షము, ఉచ్చైశ్రవమనే గుర్రము, తరువాత కోర్కెలను వర్షించే గోవులు, ఐరావతమనే ఏనుగు, వారుణి, విష్ణువు యొక్క ధనస్సు మరియు శంఖము, కౌస్తుభమనే మణి, ఆ తరువాత అమృతము కూడ పుట్టినవి (17, 18). మరల మథించుచుండగా ప్రళయాకాలాగ్నిని బోలి దేవరాక్షసులకు భీతిని గొల్పిన కాలకూట మహావిషము పుట్టినది (19). అమృతము పుట్టిన సమయములో బయట పడిన బిందువులనుండి సుందరమగు ఆకారముగల యువతులు అనేకమంది జన్మించిరి (2.0). వారు శరత్కాలము నందలి పూర్ణిమచంద్రుని వంటి ముఖములు గలవారై, మెరుపు సూర్యుడు మరియు

అగ్నిని బోలిన కాంతులు గలవారై, హారములు కేయూరములు కటకములు మరియు దివ్యరత్నములతో అలంకరింపబడినవారై శోభిల్లిరి (21).

లావణ్యామృతతోయేన తాప్యంచంత్యో దిశో దశ ।
జగదున్మాదయంత్యేవ భ్రూభంగాయత వీక్షణాః ॥
కోటీశస్తా స్సముత్పన్నా స్త్వమృతాత్కా మునిస్సృతాః ।
తతోఽమృతం సముత్పన్నం జరామృత్యు నివారణమ్ ॥
లక్ష్మీం శంఖం కౌస్తుభం చ ఖడ్గం జగ్రాహ కేశవః ।
జగ్రాహార్కో హయం దివ్య ముచ్చైశ్శ్ర వసమా దరాత్ ॥
పారిజాతం తరువర మైరావత మిభేశ్వరమ్ ।
శచీపతిశ్చ జగ్రాహ నిర్జరేశో మహాదరాత్ ॥
కాలకూటం శశాంకం చ దేవత్రాణాయ శంకరః ।
స్వకంఠే ధృతవాన్ శంభుస్స్వేచ్ఛయా భక్తవత్సలః ॥
దైత్యా స్సురాభ్యాం రమణీ మీశ్వరాజ్ఞా విమోహితాః ।
జగృహుస్సకలా వ్యాస సర్వే ధన్వంతరిం జనాః ॥
జగృహుర్ము నయస్సర్వే కామధేనుం మునీశ్వరాః ।
సామాన్య తస్త్రియస్తాశ్చ స్థితా ఆసన్ విమోహికాః ॥

వారు తమ సౌందర్య కాంతులలో పదిదిక్కులను నింపుతూ, కనుబొమల విరుపులతో విశాలమగు నేత్రములతో జగత్తునకు ఉన్మాదమును కలిగించుచుండిరి (22). బయటపడిన అమృత బిందువుల నుండి వీరు కోట్ల సంఖ్యలో జన్మించిరి. ఆ తరువాత జరామరణములను నివారించే అమృతము పుట్టెను (23). విష్ణువు లక్ష్మిని, శంఖమును, కౌస్తుభమును మరియు ఖడ్గమును స్వీకరించెను. సూర్యుడు ఉచ్చైశ్రవసమనే దివ్యాశ్వమును ఆదరముతో స్వీకరించెను (24). దేవతలకు ప్రభువు, శచీపతి అగు ఇంద్రుడు పారిజాత మహావృక్షమును, మరియు ఐరావతమనే గొప్ప ఏనుగును మహాదరముతో స్వీకరించెను. (25). శంకరుడు చంద్రుని స్వీకరించెను. మరియు భక్తవత్సలుడగు ఆ శంభుడు దేవతలను రక్షించవలెననే ఆకాంక్షతో కాలకూటమును గ్రహించి తన కంఠములో ధరించెను (26). ఓ వ్యాసా! ఈశ్వరుని మాయచే విమోహితులైన రాక్షసులు అందరు సురను స్వీకరించిరి. సామాన్యజనులందరు ధన్వంతరిని స్వీకరించిరి (27). ఓ మహర్షులారా! మునులందరు కామధేనువును . స్వీకరించిరి. మోహమును కలిగించు ఆ స్త్రీలు సామాన్య రూపములో నిలచి యుండిరి (28).

అమృతార్థం మహాయుద్ధం సంబభూవ జయైషిణామ్ ।
సురాణామసురాణాం చ మిథస్సంక్షుబ్ధ చేతసామ్ ॥
హృతం సోమం చ దైతేయైర్బలా ద్దేవాన్ విజిత్య చ ।
బలప్రభృతి భిర్వ్యాస యుగాంతాగ్న్యర్క సుప్రభైః ॥
దేవాశ్శంకర మాపన్నా విహ్వలా శ్శివమాయయా ।
సర్వే శక్రాదయస్తాత దైతేయైరర్దితా బలాత్ ॥
తతస్తదమృతం యత్నాత్ స్త్రీ స్వరూపేణ మాయయా ।
శివాజ్ఞయా రమేశేన దైత్యే భ్యశ్చ హృతం మునే ॥
ఆపాయయత్సు రాంస్తాంశ్చ మోహినీ స్త్రీ స్వరూపధృక్ ।
మోహయిత్వాఽసురాన్ సర్వాన్ హరిర్మాయావినాం వరః ॥
గత్వా నికట మేతస్యా ఊచిరే దైత్యపుంగవా ।
పాయయస్వ సుధామేతాం మా భూద్భేదోఽత్ర పంక్తిషు ॥
ఏతదుక్త్వా దదుస్తస్మై విష్ణవే ఛలరూపిణే ।
తే దైత్యా దానవా స్సర్వే శివమాయావి మోహితా: ॥
ఏతస్మిన్నంతరే దృష్ట్వా స్త్రియో దానవపుంగవాః ।
అనయన్నమృతో ద్భూతా యథాస్థానం యథాసుఖమ్ ॥

దేవదానవులు మిక్కిలి శోభిల్లిన మనస్సు గలవారై అమృతము కొరకై ఒకరినొకరు జయించవలెననే ఆకాంక్షతో గొప్ప యుద్ధమును చేసిరి (29). ఓ వ్యాసా! కల్పాంతమందలి అగ్ని వలె, మరియు సూర్యుని వలె ప్రకాశించే బలుడు మొదలగు రాక్షసులు తమ బలముచే దేవతలను జయించి అమృతమును లాగుకొనిరి (30). వత్సా! శివమాయచే దుఃఖితులైనవారు, రాక్షసులచే బలముగా పీడింపబడిన వారునగు ఇంద్రాది దేవతలందరు శంకరుని శరణు వేడిరి (31). ఓ మునీ! అపుడు శివుని ఆజ్ఞచే విష్ణువు తన మాయా ప్రభావముచే స్త్రీ రూపమును దాల్చి ఆ అమృతమును జాగ్రత్తగా రాక్షసుల వద్దనుండి తీసుకొని వచ్చెను (32). మాయావులలో శ్రేష్ఠుడగు విష్ణువు మోహిని యను స్త్రీ రూపమును దాల్చి రాక్షసులనందరినీ మోహింపజేసి దేవతలచే అమృతమును త్రాగించెను (33). ఆమె వద్దకు వెళ్లి రాక్షసవీరులు ఇట్లు పలికిరి. ఈ అమృతమును పంక్తి భేదము లేని విధముగా పంచిపెట్టుము (34). శివమాయచే మిక్కిలి మోహితులై యున్న ఆ దైత్యదానవులందరు ఇట్లు పలికి మాయారూపమును దాల్చి యున్న ఆ విష్ణువునకు అప్పజెప్పిరి (35). ఇంతలో ఆ రాక్షసవీరులకు అమృతమునుండి పుట్టిన స్త్రీలు కానవచ్చిరి. వారు వారిని సుఖముగా తమ తమ స్థానములకు దోడ్కొని పోయిరి (36).

తాసాం పురాణి దివ్యాని స్వర్గాచ్ఛతగుణాన్యపి ।
ఘోరైర్యం త్రైస్సు గుప్తాని మయమాయా కృతాని చ ॥
సురక్షితాని సర్వాణి కృత్వా యుద్ధాయ నిర్యయుః ।
ఆస్పృష్టవక్షసో దైత్యాః కృత్వా సమయమేవ హి ॥
న స్పృశామః స్త్రియశ్చేమా యది దేవైర్వినిర్జితాః ।
ఇత్యుక్త్వా తే మహావీరా దైత్యా స్సర్వే యుయుత్సవః ॥
సింహనాదం తతశ్చ క్రుశ్శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్ ।
పూరయంత ఇవాకాశం తర్పయంతో వలాహకాన్ ॥
యుద్ధం బభూవ దేవానా మసురైస్సహ భీకరమ్ ।
దేవాసురాఖ్యమతులం ప్రసిద్ధం భువనత్రయే ॥
జయం ప్రాపుస్సు రాస్సర్వే విష్ణునా పరిరక్షితాః ।
దైత్యాః పలాయితాస్తత్ర హతాస్సామరవిష్ణునా ॥
దైత్యా స్సంమోహితా దేవైర్విష్ణునా చ మహాత్మనా ।
హతావశిష్టాః పాతాలం వివిశుర్వివరాణి చ ॥

మయుని మాయచే నిర్మింపబడి భయంకరమగు యంత్రములచే గొప్పగా రక్షింపబడియున్న వారి నగరములు స్వర్గము కంటె వందరెట్లు దివ్యముగా నుండెను (37). రాక్షసులు తమ నగరములన్నిటికి రక్షణ వ్యవస్థను చక్కగా చేసి, గుండెలపై చేతులతో స్పృశించి, ప్రతిజ్ఞను చేసి యుద్ధమునకు బయలుదేరిరి (38). మేము దేవతల చేతిలో ఓడిపోయినచో ఈ స్త్రీలను స్పృశించము అని పలికి మహావీరులగు ఆ రాక్షసులందరు యుద్ధోత్సాహముతో (39) సింహనాదమును చేసి తరువాత వేర్వేరుగా శంఖములనూదిరి, వారి శంఖధ్వని ఆకాశము నిండునట్లు సర్వత్రా వ్యాపించెను. వారు వర్షముకొరకు మేఘములను ప్రార్థించుచున్నారా అన్నట్లు ఉండిరి (40). దేవతలకు రాక్షసులతో భీకరమగు పోరు జరిగెను. ఆ పోరు దేవాసుర యుద్ధమను పేర ముల్లోకములలో ఖ్యాతిని గాంచెను (41). విష్ణువుచే పరిరక్షింపబడిన దేవతలందరు విజయమును పొందిరి. దేవతలతో గూడియున్న విష్ణువుచే కొట్టబడినవారై రాక్షసులచటనుండి పలాయనమును చిత్తగించిరి (42). మహాత్ముడగు విష్ణువు, మరియు దేవతలు రాక్షసులను సమ్మోహితులను చేసిరి. చావగా మిగిలిన వారు గుహలలో దాగిరి. కొందరు పాతాళమును ప్రవేశించిరి (43).

అను వవ్రాజ తాన్ విష్ణుశ్చక్ర పాణిర్మహాబలః ।
పాతాలం పరమం గత్వా సంస్థితాన్ భీత భీతవత్ ॥
ఏతస్మిన్నంతరే విష్ణుర్దదర్శామృత సంభవాః ।
కాంతాః పూర్ణేందువదనా దివ్య లావణ్య గర్వితాః ॥
సమ్మోహితః కామ బాణైర్లేభే తత్రైవ నిర్వృతిమ్ ।
తా భిశ్చ వరనారీభిః క్రీడమానో బభూవ హ ॥
తాభ్యః పుత్రా నజనయ ద్విష్ణుర్వర పరాక్రమాన్ ।
మహీం సర్వాం కంపయతో నానా యుద్ధ విశారదాన్ ॥
తతో వై హరిపుత్రాస్తే మహాబల పరాక్రమాః ।
మహోపద్రవ మాచేరుస్స్వర్గే భువి చ దుఃఖదమ్ ॥
లో కోపద్రవమాలక్ష్య నిర్జరా మునయోఽథవా ।
చక్రుర్నివేదనం తేషాం బ్రహ్మణే ప్రణి పత్య చ ॥
తచ్ఛ్రుత్వాదాయ తాన్ బ్రహ్మా యయౌ కైలాస పర్వతమ్ ।
తత్ర దృష్ట్వా శివం దేవైః ప్రణనామ పునః పునః ॥
తుష్టావ వివిధైస్స్తో త్రైర్నతస్కంధః కృతాంజలిః ।
జయదేవ మహాదేవ సర్వస్వామిన్నితి బ్రువన్ ॥

పాతాళపు కోనలలోనికి పోయి మహాభయముతో దాగియున్న ఆ రాక్షసుల వెనుక మహాబలుడగు విష్ణువు చక్రమును చేతబట్టి అనుసరించెను (44). ఇంతలో అమృతమునుండి పుట్టినట్టియు, పూర్ణచంద్రుని వంటి ముఖములు కలిగి దివ్యమగు సౌందర్యముతో గర్వించియున్న యువతులను విష్ణువు గాంచెను (45). ఆతడు మన్మథుని బాణములచే సమ్మోహితుడై ఆ సుందరయువతులతో క్రీడిస్తూ ఆచటనే ఆనందముగా నుండజొచ్చెను (46). విష్ణువు వారితో గూడి గొప్ప పరాక్రమము గల పుత్రులను గనెను. వివిధ యుద్ధములలో దక్షులగు వారు భూమినంతనూ వణికింప జొచ్చిరి (47). వారు స్వర్గమునందు మరియు భూలోకమునందు దుఃఖమును, గొప్ప ఉపద్రవమును కలిగించిరి. ఆ విష్ణు పుత్రులు గొప్ప బలమును పరాక్రమమును కలిగియుండిరి (48). దేవతలు మరియు మునులు లోకములకు సంప్రాప్తమైన ఉపద్రవమును గాంచి బ్రహ్మకు ప్రణమిల్లి వారి గురించి ఆయనకు నివేదించిరి (49). వారి మాటలను విని బ్రహ్మ వారిని దోడ్కొని కైలాస పర్వతమునకు వెళ్లి అచట శివుని గాంచి దేవతలతో సహా పలుమార్లు ప్రణమిల్లెను (50). తలను వంచి చేతులను జోడించి "దేవా! మహాదేవా! సర్వప్రభూ! జయమగుగాక!' అని పలుకుచూ వివిధస్తోత్రములతో స్తుతించెను (51).

బ్రహ్మోవాచ ॥

దేవదేవ మహాదేవ లోకాన్ రక్షాఖిలాన్ ప్రభో ।
ఉపద్రుతాన్ విష్ణుపుత్రైః పాతాల స్థైర్వికారిభిః ॥
నారీష్వమృతభూతాసు సంసక్తాత్మా హరిర్విభో ।
పాతాలే తిష్ఠతీదానీం రమతే హి వికారవాన్ ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

ఓ దేవ దేవా! మహాదేవా! ప్రభూ! పాతాలమునందు నివసించి గర్వాది మనో వికారములు గలవారై విష్ణు పుత్రులు లోకములన్నింటికి ఉపద్రవమును కలిగించుచున్నారు. ఈ ఉపద్రవమునుండి రక్షింపుము (52). ఓ విభూ! అమృతము నుండి జన్మించిన యువతులయందు లగ్నమైన మనస్సు గల విష్ణువు ఇపుడు కామ వికారము గలవాడై పాతాళములో నివసించి రమించుచున్నాడు (53).

నందీశ్వర ఉవాచః

ఇత్థం బహుస్తుతశ్శంభుర్బ్రహ్మణా సర్షి నిర్జరై : ।
లోక సంరక్షణార్థాయ విష్ణో రానయనాయ చ ॥
తతస్స భగవాన్ శంభుః కృపా సింధుర్మహేశ్వరః ।
తదుపద్ర వమాజ్ఞాయ వృషరూపో బభూవ హ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం వృషావతార వర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః (22).

నందీశ్వరుడిట్లు పలికెను -

బ్రహ్మ, ఋషులు మరియు దేవతలు శంభుని లోకములను సంరక్షించుమనియు, విష్ణువును వెనుకకు తీసుకుని రమ్మనియు పలుపలు విధముల ప్రార్థించిరి (54). అపుడు దయానిధి, మహేశ్వరుడు అగు ఆ శంభుభగవానుడు ఆ ఉపద్రవమును గుర్తించి వృషభావతారమును దాల్చెను (55).

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహిత యందు వృషావతార వర్ణనమనే ఇరువది రెండవ అధ్యాయము ముగిసినది (22).

23 - వృషభావతారము

నందీశ్వర ఉవాచః

తతో వృషభరూపేణ గర్జమానః పినాకధృక్ ।
ప్రవిష్టో వివరం తత్ర నినదన్ భైరవాన్ రవాన్ ॥
నిపేతుస్తస్య నినదైః పురాణి నగరాణి చ ।
ప్రకంపో హి బభూవాథ సర్వేషాం పురవాసినామ్ ॥
తతో వృషో హరేః పుత్రాన్ సంగ్రామోద్యత కార్ముకాన్ ।
శివమాయావి మూఢాత్మ మహాబల పరాక్రమాన్ ॥
హరిపుత్రాస్తతస్తేఽథ ప్రాకు పృన్ముని సత్తమ ।
ప్రదుద్రువుః ప్రగర్జ్యో చ్చైర్వీరాశ్శం కరసన్ముఖమ్ ॥
ఆయాతాంస్తాన్ హరేః పుత్రాన్ రుద్రో వృషభరూపధృక్ ।
ప్రాకుప్య ద్విష్ణుపుత్రాంశ్చ ఖురైశ్శృంగై ర్వ్య దారయత్ ॥
విదారితాంగా రుద్రేణ సర్వే హరిసుతాశ్చ తే ।
నష్టా ద్రుతం సంబభూవుర్గతప్రాణా విచేతసః ॥
హతేషు తేషు పుత్రేషు విష్ణుర్బలవతాం వరః ।
నిష్క్రమ్యాథ ప్రణమ్యోచ్చైర్యయౌ శీఘ్రం హరాంతికమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ తరువాత పినాకధారియగు శివుడు వృషభరూపముతో భీకరముగా గర్జిస్తూ పాతాళ వివరమును ప్రవేశించెను (1). ఆ వృషభము యొక్క నినాదములచే పురములు నేల గూలినవి. పురవాసులందరు భయముతో కంపించి పోయిరి (2). అపుడు యుద్ధము కొరకు సంసిద్ధము చేయబడిన ధనస్సులు గలవారు, శివమాయచే వ్యామోహమును పొందిన మనస్సు గలవారు, మహాబలపరాక్రమవంతులు అగు విష్ణుపుత్రులను ఆ వృషభము ఎదుర్కొనెను (3). ఓ మహర్షీ! అపుడా విష్ణుపుత్రులు మిక్కిలి కోపించి బిగ్గరగా గర్జించి శంకరునకు అభిముఖముగా పరువులెత్తిరి (4). వృషభరూపమును దాల్చియున్న ఆ రుద్రుడు కోపించి తనపై దండెత్తిన విష్ణుపుత్రులను గిట్టలతో, మరియు కొమ్ములతో చీల్చెను (5). రుద్రునిచే చీల్చబడిన అవయవములు గల ఆ విష్ణుపుత్రులందరు శీఘ్రముగా ప్రాణములను గోల్పోయి మరణించిరి (6). బలవంతులలో శ్రేష్ఠుడగు విష్ణువు తన పుత్రులు నశించగా బయటకు వచ్చి బిగ్గరగా గర్జించి శీఘ్రముగా శివుని వద్దకు వెళ్లెను (7).

దృష్ట్వా రుద్రం ప్రవ్రజంతం హతవిష్ణుసుతం వృషమ్ ।
శరైస్సంతాడయామాస దివ్యైరస్త్రైశ్చ కేశవః ॥
తతః క్రుద్ధో మహాదేవో వృషరూపీ మహాబలః ।
అస్త్రాణి తాని విష్ణోశ్చ జగ్రాస గిరిగోచరః ॥
అథ కృత్వా మహాకోపం వృషాత్మా స మహేశ్వరః ।
విననాద మహా ఘోరం కంపయంస్త్రి జగన్మునే ॥
తత ఉత్ప్లుత్య తరసా ఖురైశ్శృంగై ర్వ్య దారయత్ ।
విష్ణుం క్రోధాకులం మూఢమ జానంతం నిజం హరిమ్ ॥
తతస్స శిథిలాత్మా హి వ్యథితాంగో బభూవ హ ।
తత్ప్రహారమసహ్యేశు హరిర్మాయా విమోహితః ॥
గతగర్వో హరీశ్చైవ విచేతా గత చేతనః ।
జ్ఞాతవాన్ పరమేశానం విహరంతం వృషాత్మనా ॥
అథ విజ్ఞాయ గౌరీశమాగతం వృషరూపతః ।
ప్రాహ గంభీరయా వాచా నతస్కంధః కృతాంజలిః ॥

విష్ణుసుతులను సంహరించి వృషభాకారముతో ముందుకు సాగుచున్న రుద్రుని గాంచి కేశవుడు దివ్యమగు శస్త్రములతో ఆయనను కొట్టెను. (8). మహాబలశాలి, కైలాసగిరివాసి, వృషభరూపుడు అగు మహాదేవుడు అపుడు కోపించి విష్ణువు యొక్క ఆ అస్త్రములను మ్రింగివేసెను (9). ఓ మహర్షీ! అపుడు వృషభరూపములోనున్న ఆ మహేశు డు గొప్ప కోపమును పొంది, ముల్లోకములు కంపించునట్లు అతి భయంకరమగు నాదమును చేసెను (10). తరువాత ఆయన పైకి ఎగిరి విష్ణువును గిట్టలతో, మరియు కొమ్ములతో చీల్చి వేసెను. మూఢుడు, కోపముతో భ్రాంతిని పొందినవాడు అగు విష్ణువు తాను విష్ణువునను సంగతిని విస్మరించి యుండెను (11). మాయచే వ్యామోహితుడైయున్న విష్ణువు అపుడు శిథిలమగు దేహము గలవాడై పీడించే అవయవములు గలవాడై, ఆ రుద్రుని దెబ్బలకు తాళలేకపోయెను (12). తొలగిన గర్వము గలవాడు, నశించిన శక్తి గలవాడు, ఆకులితమగు బుద్ధి గలవాడునగు విష్ణువు వృషభరూపములో విహరించుచున్న పరమేశ్వరుని గుర్తు పట్టెను (13), గౌరీపతియే వృషభరూపములో వచ్చియున్నాడని యెరింగి విష్ణువు అపుడు తలవంచి చేతులు జోడించి గంభీరమగు వాక్కుతో నిట్లు పలికెను (14).

హరిరువాచ ।

దేవదేవ మహాదేవ కరుణాసాగర ప్రభో ।
మాయయా తే మహేశాన మోహితోఽహం విమూఢధీః ॥
కృతం యుద్ధం త్వయేశేన స్వనాథేన మయా ప్రభో ।
కృపాం కృత్వా మయి స్వామిన్ సోఽపరాధో హి సహ్యతామ్ ॥

విష్ణువు ఇట్లు పలికెను -

ఓ దేవదేవా! మహాదేవా! కరుణాసముద్రా ! ప్రభూ! మహేశ్వరా! నీ మాయచే నేను మో◌ోహితుడనై వివేకమును గోల్పోయితిని (15) ప్రభూ! నా ప్రభువు అగు నీతో నేను యుద్ధమును చేసితిని. స్వామీ! ఈశ్వరా! నాయందు దయను చూపి ఆ అపరాధమును సహించుము (16).

నందీశ్వర ఉవాచః

తస్య తద్వచనం శ్రుత్వా హరేర్దీనతయా మునే ।
భగవాన్ శంకరః ప్రాహ రమేశం భక్తవత్సలః ॥
హే విష్ణో హే మహాబుద్ధే కథం మాం జ్ఞాతవాన్న హి ।
యుద్ధం కృతం కుతస్తేఽద్య జ్ఞానం సర్వం చ విస్మృతమ్ ॥
ఆత్మానం కిన్న జానాసి మదధీన పరాక్రమమ్ ।
త్వయా నాత్ర రతిః కార్యా నివర్తస్వ కుచారతః ॥
కామాధీనం కథం జ్ఞానం స్త్రీషు సక్తో విహారకృత్ ।
నోచితం తవ దేవేశ స్మరణం విశ్వతారణమ్ ॥
తచ్ఛృత్వా శంభువచనం విజ్ఞాన ప్రదమాదరాత్ ।
వ్రీడయన్ స్వమనసా విష్ణుః ప్రాహ వాచం మహేశ్వరమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! ఆ విష్ణువు యొక్క ఈ దీనవచనములను విని భక్తవత్సలుడగు శంకర భగవానుడు లక్ష్మీపతితో నిట్లనెను (17). ఓ విష్ణూ! మహాబుద్ధీ! నన్ను నీవు గుర్తుపట్టలేక. పోవుట ఎట్లు సంభవమయ్యెను? నీవీ నాడు నాతో యుద్ధమును చేయుటకు కారణమేమి? నీవు సర్వజ్ఞానమును విస్మరించితివి (18). నీ పరాక్రమము నా ఆధీనములోనున్నదని నీవు ఏల గుర్తించవు? నీవిచట ఇంద్రియభోగములలో మునిగి యుండరాదు. ఈ దురాచారమునుండి వెనుకకు మరలుము (19). నీ జ్ఞానము కామమునకు వశమైనది. స్త్రీ లయందు ఆసక్తిని కలిగి విహరించుట నీకు తగదు. ఓ దేవదేవా! జగద్రక్షణ గురించి స్మరించుట నీకు దగును (20). జ్ఞానదాయకమగు శంభుని ఆ మాటలను విని విష్ణువు తన మనస్సులో సిగ్గుపడి మహేశ్వరుని ఉద్దేశించి ఆదరముతో నిట్లు పలికెను (21).

విష్ణురువాచ ।

మమాత్ర విద్యతే చక్రం తద్ గృహీత్వేతదాదరాత్ ।

గమిష్యామి స్వలోకం తం త్వదాజ్ఞా పరిపాలకః ॥

విష్ణువు ఇట్లు పలికెను -

నా చక్రము ఇచట గలదు. దానిని తీసుకొని నేను సాదరముగా నాలోకమునకు వెళ్లి నీ ఆజ్ఞను పాలించగలను (22).

నందీశ్వర ఉవాచః

తదాకర్ణ్య మహేశానో వచనం వైష్ణవం హరః ।

ప్రత్యువాచ వృ షాత్మా హి వృషరక్షః పునర్హరిమ్ ॥

న విలంబః ప్రకర్తవ్యో గంతవ్యమిత ఆశు తే ।

మచ్ఛాసనా ద్ధరే లోకే చక్రమ త్రైవ తిష్ఠతామ్ ॥

సంతానాదిత్య సంస్థానాచ్ఛివత్వ వచనాదపి ।

అహం ఘోరతరం తస్మాచ్చ క్రమన్య ద్దదామి తే ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ పాపహారి, వృషభరూపుడు, ధర్మరక్షకుడు అగు మహేశ్వరుడు ఆ మాటను విని విష్ణువునకు ఇట్లు బదులిడెను (23). నీవు ఆలస్యము చేయవద్దు. ఇచట నుండి వెంటనే బయలుదేరుము. ఓ హరీ! నా ఆజ్ఞచే విష్ణులోకమునకు వెళ్లుము. చక్రమును ఇచటనే ఉండనిమ్ము (24). ప్రళయకాల సూర్యుని కంటె, శివుని వచనము కంటే కూడా అధికమగు సంహారశక్తి గల మరియొక చక్రమును నేను నీకు ఇచ్చుచున్నాను (? 25).

నందీశ్వర ఉవాచః

ఏతదుక్త్వా హరోऽలేఖద్దివ్యం కాలానల ప్రభమ్ ।
పరం చక్రం ప్రదీప్తం హి సర్వదుష్ట వినాశనమ్ ॥
విష్ణవే ప్రదదౌ చక్రం ఘోరార్కాయుత సుప్రభమ్ ।
సర్వామర మునీంద్రాణాం రక్షకాయ మహాత్మనే ॥
లబ్ధ్వా సుదర్శనం చాన్యచ్చ క్రం పరమదీప్తిమత్ ।
ఉవాచ విబుధాంస్తత్ర విష్ణుర్బుద్ధిమతాం వరః ॥
సర్వదేవవరా యూయం మద్వాక్యం శృణుతా దరాత్ ।
కర్తవ్యం తత్తథా శీఘ్రం తతశ్శం వో భవిష్యతి ॥
దివ్యాంబరాంగనాస్సంతి పాతాలే యౌవనాన్వితాః ।
తాభిస్సార్ధం మహా క్రీడాం యః కరోతు కరోతు సః ॥
తచ్ఛ్రుత్వా కేశవా ద్వాక్యం శూరాస్త్రి దశయోనయః ।
ప్రవేష్టు కామాః పాతాలం బభూవుర్విష్ణునా సహా ॥
విచారమథ విజ్ఞాయ తం తదా భగవాన్ హరః ।
క్రోధాచ్ఛాపం దదౌ ఘోరం దేవ యోన్యష్టకస్య చ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఇట్లు పలికి శివుడు కాలాగ్నివంటి కాంతులతో జ్వలించే, దుష్టులనందరినీ సంహరించే, శ్రేష్ఠమగు దివ్యచక్రమును సృష్టించెను (26). పదివేల ప్రళయకాల సూర్యులను బోలియున్న ఆ చక్రమును మహర్షులను దేవాదుల నందరినీ రక్షించే మహాత్ముడగు విష్ణువునకు ఇచ్చెను (27). బుద్ధిమంతులలో శ్రేష్ఠుడగు విష్ణువు గొప్ప కాంతులనీనే మరియొక సుదర్శన చక్రమును పొంది అచటనున్న దేవతలతో నిట్లనెను (28). ఓ దేవశ్రేష్ఠులారా! మీరందరు నా మాటను శ్రద్ధతో వినుడు. వెంటనే నేను చెప్పినట్లు చేయుడు. మీకు మంగళము కలుగగలదు (29). పాతాళములో దివ్యమగు వస్త్రములను ధరించిన యౌవనవతులగు సుందర స్త్రీలు గలరు. వారిలో కలిసి ఎవరు క్రీడించగోరెదరో, వారు క్రీడించెదరు గాక! (30) విష్ణువు యొక్క ఆ పలుకులను విని శూరులగు దేవతలు విష్ణువుతో గూడి పాతాలమును ప్రవేశించగోరిరి (31). అపుడు హరభగవానుడు వారి ఆ ఆలోచనను యెరింగి కోపముతో ఎనిమిది దేవయోనులకు ఘోరమగు శాపమునిచ్చెను (32).

హర ఉవాచః

వర్జయిత్వా మునిం శాంతం దానవాన్ వా మదంశజమ్ ।
ఇదం యః ప్రవిశేత్ స్థానం తస్య స్యాన్నిధనం క్షణాత్ ॥
శ్రుత్వా వాచమిదం ఘోరం మనుష్య హితవర్ధనమ్ ।
ప్రత్యాఖ్యాతాస్తు రుద్రేణ దేవాస్స్వగృహా మాయయుః ॥
ఏవం స్త్రీలంపటో విష్ణుశ్శివేన ప్రతి శాసితః ।
స్వర్లోకమగమద్వ్యా స స్వాస్థ్యం ప్రాప జగచ్చ తత్ ॥
వృషేశ్వరోఽపి భగవాన్ శంకరో భక్తవత్సలః ।
ఇత్థం కృత్వా దేవకార్యం జగామ స్వగిరీశ్వరమ్ ॥
వృషేశ్వరావతారస్తు వర్ణితశ్శంకరస్య చ ।
విష్ణు మోహహర శ్శర్వంస్త్రైలోక్య సుఖకారకః ॥
పవిత్రమిద మాఖ్యానం శత్రు బాధాహరం పరమ్ ।
స్వర్గ్యం యశస్యమాయుష్యం భుక్తిముక్తి ప్రదం సతామ్ ॥
య ఇదం శృణుయాద్భక్త్యా శ్రావయేద్వై సమాహితః ।
స భుక్త్వా సకలాన్ కామానంతే మోక్షమవాప్నుయాత్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం వృషేశ్వరావతార
వర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః (23).

శివుడు ఇట్లు పలికెను -

జితేంద్రియుడగు మునిని, రాక్షసులను, మరియు నా అంశవలన జన్మించిన వారిని మినహాయించి, ఎవరైననూ ఈ స్థానమును ప్రవేశించినచో, వారు వెంటనే మృత్యువు వాత పడెదరు (33). మనుష్యుల హితమును వర్ధిల్ల జేయు ఈ ఘోరమగు శాపవచనమును విని రుద్రునిచే తిరస్కరింపబడిన వారై, దేవతలు తమ గృహములకు వెళ్లిరి (34). ఓ వ్యాసా! స్త్రీ లంపటుడగు విష్ణువు ఈ విధముగా శివునిచే శాసింపబడినవాడై, స్వర్గలోకమునకు వెళ్లెను. జగత్తునకు స్వస్థత సమకూరెను (35). భక్త వత్సలుడగు శంకరుడు వృషభావతారములో ఈ తీరున దేవకార్యమును చేసి శ్రేష్ఠమగు తన కైలాసమునకు వెళ్లెను (36). విష్ణువు యొక్క మోహమును పోగొట్టి ముల్లోకములకు సుఖమును కలిగించిన మంగళకరుడగు శివుని వృషేశ్వరావతారము వర్ణించబడెను (37). పవిత్రమగు ఈ వృత్తాంతము నిశ్చితముగా శత్రుబాధను పోగొట్టి సత్పురుషులకు స్వర్గమును, యశస్సును, ఆయుర్దాయమును, భుక్తిని మరియు ముక్తిని ఇచ్చును (38). ఎవడైతే దీనిని భక్తితో వినునో, మనస్సును లగ్నము చేసి వినిపించునో, అట్టివాడు సమస్త సుఖములను అనుభవించి, దేహత్యాగానంతరము మోక్షమును పొందును (39).

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు
వృషేశ్వరావతార వర్ణనమనే ఇరువది మూడవ అధ్యాయము ముగిసినది (23).



24 - దధీచి ఎముకలను దానము చేయుట

నందీశ్వర ఉవాచ:

పిప్పలా దాఖ్య పరమమవతారం మహేశితుః ।
శృణు ప్రాజ్ఞ మహాప్రీత్యా భక్తి వర్ధన ముత్తమమ్ ॥
యః పురా గదితో విప్రో దధీచిర్మునిసత్తమః ।
మహాశైవస్సు ప్రతాపీ చ్యావనిర్భృగువంశజః ॥
క్షువేణ సహ సంగ్రామే యేన విష్ణుః పరాజితః ।
సనిర్జరోఽథ సంశప్తో మహేశ్వర సహాయనా ॥
తస్య పత్నీ మహాభాగా సువర్చా నామ నామతః ।
మహాపతివ్రతా సాధ్వీ యయా శప్తా దివౌకసః ॥
తస్మాత్తస్యాం మహాదేవో నానాలీలా విశారదః ।
ప్రాదుర్బభూవ తేజస్వీ పిప్పలాదేతి నామతః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ బుద్ధిశాలీ! పిప్పలాదుడు అనే మహేశ్వరుని మరియొక శ్రేష్ఠ అవతారము గలదు. భక్తిని వర్ధిల్ల జేయు ఉత్తమమగు ఆ అవతారమును నీవు మహాప్రీతితో వినుము (1). బ్రాహ్మణుడు, గొప్ప శైవుడు, గొప్ప ప్రతాపము గలవాడు, చ్యవనుని పుత్రుడు, భృగు వంశములో జన్మించినవాడు అగు దధీచి మహర్షి గురించి పూర్వమే వర్ణించబడినది (2). ఆయన యుద్ధములో మహేశ్వరుని సాహాయ్యముతో, క్షువుని మరియు దేవతలతో గూడియున్న విష్ణువును నిర్జించి శపించినాడు (3). ఆయన భార్య పేరు సువర్చ. ఆమె పుణ్యాత్మురాలు, మహాపతివ్రత, సాధ్వి. ఆమె దేవతలను శపించినది (4). ఆ దంపతులకు అనేక లీలానిపుణుడగు మహాదేవుడు పుత్రుడై జన్మించెను. తేజశ్శాలి యగు ఆ బాలుని పేరు పిప్పలాదుడు (5).

సూత ఉవాచ:

ఇత్యాకర్ణ్య మునిశ్రేష్ఠో నందీశ్వరవచోఽద్భుతమ్ ।
సనత్కుమారః ప్రోవాచ నతస్కంధః కృతాంజలిః ॥

సూతుడిట్లు పలికెను -

నందీశ్వరుని ఈ అద్భుతమగు వచనమును విని మహర్షి శ్రేష్ఠుడగు సనత్కుమారుడు తలవంచి, చేతులను జోడించి ఇట్లు పలికెను (6).

సనత్కుమార ఉవాచః

నందీశ్వర మహాప్రాజ్ఞ సాక్షా ద్రుద్ర స్వరూపధృక్ ।
ధన్యస్త్వం సద్గురుస్తాత శ్రావితేయం కథా ద్భుతా ॥
క్షువేణ సహ సంగ్రామే శ్రుతో విష్ణు పరాజయః ।
బ్రహ్మణా మే పురా తాత తచ్ఛాపశ్చ శిలాదజ ॥
అధునా శ్రోతుమిచ్ఛామి దేవశాపం సువర్చయా ।
దత్తం పశ్చాత్పిప్పలాద చరితం మంగలాయనమ్ ॥

సనత్కుమారుడిట్లు పలికెను -

ఓ నందీశ్వరా! మహాబుద్ధిశాలీ! సాక్షాత్తుగా రుద్రుని స్వరూపమైన నీవు ధన్యు◌ిడవు. తండ్రీ! సద్గురుడవగు నీవు అద్భుతమగు కథను వినిపించితివి (7). క్షువునితో విష్ణువు యుద్ధమును చేసి పరాజయమును పొందిన గాథను వింటిని. ఓయీ శిలాదపుత్రా! తండ్రీ ! దధీచి విష్ణువునకు శాపమునిచ్చిన గాథను కూడా పూర్వము బ్రహ్మ చెప్పగా వింటిని (8). 'సువర్చ దేవతలకు శాపమునిచ్చిన గాథను ఇపుడు వినగోరుచున్నాను. తరువాత మంగళనిధానమగు పిప్పలాద చరితమును వినగోరుచున్నాను (9).

సూత ఉవాచః

ఇతి శ్రుత్వాథ శైలాది ర్విధిపుత్ర వచశ్శుభమ్ ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా స్మృత్వా శివ పదాంబుజమ్ ॥

సూతుడిట్లు పలికెను -

శిలాదపుత్రుడగు నందీశ్వరుడు బ్రహ్మపుత్రుని ఈ శుభవచనమును విని ప్రసన్నమగు మనస్సుతో శివుని పాదపద్మములను స్మరించి ఇట్లు బదులిడెను (10).

నందీశ్వర ఉవాచః

ఏకదా నిర్జరాస్సర్వే వాసవాద్యా మునీశ్వర ।
వృత్రాసుర సహాయైశ్చ దైత్యై రాసన్ పరాజితాః ॥
స్వాని స్వాని వరాస్త్రాణి దధీచస్యా శ్రమేఽఖిలాః ।
నిక్షిప్య సహసా సద్యోఽభవన్ దేవాః పరాజితాః ॥
తదా సర్వే సురాస్సేంద్రా వధ్యమానా స్తథర్షయః ।
బ్రహ్మలోకం గతాశ్శీఘ్రం ప్రోచుస్స్వం వ్యసనం చ తత్ ॥
తచ్ఛృత్వా దేవవచనం బ్రహ్మా లోకపితామహః ।
సర్వం శశంస తత్త్వేన త్వష్టుశ్చైవ చికీర్షితమ్ ॥
భవద్వధార్థం జనితస్త్వష్ట్రాయం తపసాసురః ।
వృత్రో నామ మహాతేజాస్సర్వ దైత్యాధిపో మహాన్ ॥
అథ ప్రయత్నః క్రియతాం భవేదస్య వధో యథా ।
తత్రోపాయం శృణు ప్రాజ్ఞ ధర్మహేతోర్వదామి తే ॥
మహాముని ర్దధీచిర్యస్తు తపస్వీ జితేంద్రియః ।
లేభే శివం సమారాధ్య వజ్రాస్థిత్వవరం పురా ॥
తస్యాస్థీన్యేవ యాచధ్వం స దాస్యతి న సంశయః ।
నిర్మాయ తైర్దండవజ్రం వృత్రం జహి న సంశయః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓ మహర్షీ! ఒకప్పుడు ఇంద్రాది దేవతలందరు వృత్రాసురుడు సహాయముగా గల రాక్షసులచే ఓడింపబడిరి (11). అపుడు పరాజితులైన దేవతలందరు తమ తమ శ్రేష్ఠమగు అస్త్రములను శీఘ్రముగా దధీచుని ఆశ్రమమునందు భద్రపరిచిరి (12). రాక్షసులచే వధింపబడుచున్న దేవతలు మరియు మునులు ఇంద్రుని ముందిడుకొని శీఘ్రముగా బ్రహ్మలోకమునకు వెళ్ళి తమ దుఃఖమును విన్నవించిరి (13). లోకపితామహుడగు బ్రహ్మ దేవతల ఆ వచనములను విని, త్వష్ట యొక్క ఆకాంక్ష యొక్క స్వరూపమును వివరముగా వారికి తెలిపెను (14). త్వష్ట తపస్సు చేసి మిమ్ములను వధించుట కొరకై ఈ రాక్షసుని సృష్టించెను. మహాతేజశ్శాలి, సర్వరాక్షసులకు ప్రభువు, మహాత్ముడు అగు ఈ రాక్షసుని పేరు వృత్రుడు (15). కావున ఈ వృత్రుని వధకొరకై ప్రయత్నమును చేయవలెను. ఓ ప్రాజ్ఞా! ధర్మరక్షణ కొరకై నేను నీకు వృత్రవధోపాయమును చెప్పెదను. వినుము (16). తపశ్శాలి, జితేంద్రియుడు అగు దధీచ మహాముని పూర్వము శివుని ఆరాధించి వజ్రము వంటి ఎముకలను వరముగా పొంది యుండెను (17). మనము ఆతని ఎముకలను యాచించెదము. ఆతడు నిస్సంశయముగా ఇచ్చును. వాటితో వజ్రదండమును నిర్మించి వృత్రుని సంహరించుము. దీనిలో సంశయము లేదు (18).

నందీశ్వర ఉవాచః

తచ్ఛ్రుత్వా బ్రహ్మవచనం శక్రో గురుసమన్వితః ।
ఆగచ్ఛ త్సామరస్సద్యో దధీచ్యాశ్రమ ముత్తమమ్ ॥
దృష్ట్వా తత్ర మునిం శక్ర స్సువర్చా న్వితమాదరాత్ ।
ననామ సాంజలిర్న మ్రస్స గురుస్సామరశ్చ తమ్ ॥
తదభిప్రాయమాజ్ఞాయ సముని ర్బుధసత్తమః ।
స్వపత్నీం ప్రేషయామాస సువర్చాం స్వాశ్రమాంతరమ్ ॥
తతస్స దేవరాజశ్చ సామరస్స్వార్థసాధకః ।
అర్థ శాస్త్ర పరో భూత్వా మునీశం వాక్యమబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

బృహస్పతితో గూడియున్న ఇంద్రుడు బ్రహ్మయొక్క ఆ మాటను విని వెంటనే దేవతలతో కలిసి ఉత్తమమగు దధీచి ఆశ్రమము నకు వెళ్లెను (19). అచట సువర్చతో కూడియున్న దధీచి మహర్షిని గాంచి దేవతలతో బృహస్పతితో సహా ఇంద్రుడు ఆదరముతో వినయముతో చేతులు జోడించి ప్రణమిల్లెను (20). జ్ఞానులలో శ్రేష్ఠుడగు ఆ మహర్షి ఆతని అభిప్రాయము నెరింగి తన భార్యయగు సువర్చను ఆశ్రమము లోపలికి పంపించెను (21). అపుడు స్వార్థమును సాధించుటలో సమర్థుడు, నీతి శాస్త్ర కోవిదుడు అగు దేవరాజు దేవతలతో గూడి మహర్షితో ఇట్లు పలికెను (22).

శక్ర ఉవాచః

త్వష్ట్రా విప్రకృతాస్సర్వే వయం దేవాస్తథర్షయః ।
శరణ్యం త్వాం మహాశైవం దాతారం శరణం గతాః ॥
స్వాస్థీని దేహి నో విప్ర మహావజ్రమయాని హి ।
అస్థ్నా తే స్వపవిం కృత్వా హనిష్యామి సురద్రుహమ్ ॥
ఇత్యుక్తస్తేన సమునిః పరోపకరణే రతః ।
ధ్యాత్వా శివం స్వనాథం హి విససర్జ కలేవరమ్ ॥
బ్రహ్మలోకం గతస్సద్యస్స మునిర్ధ్వస్తబంధనః ।
పుష్పవృష్టిరభూత్తత్ర సర్వే విస్మయమా గతాః ॥
అథ గాం సురభిం శక్ర ఆహూయాశు హ్యలేహయత్ ।
అస్థ నిర్మితయే త్వష్ఠం నిది దేశ తదస్థిభిః ॥
విశ్వకర్మా తదాజ్ఞ ప్తశ్చ క్లుప్తేఽస్త్రాణి కృత్స్నశః ।
తదస్థిభిర్వ జ్రమయై స్సుదృఢై శ్శివవర్చసా ॥

తస్య వంశోద్భవం వజ్రం శరో బ్రహ్మశిరస్తథా ।
అన్యాస్థిభిర్భహూని స్వపరాణ్య స్త్రాణి నిర్మమే ॥

ఇంద్రుడిట్లు పలికెను -

దేవతలమగు మేము మరియు మహర్షులు త్వష్టచే మోసగింపబడితిమి. శరణు పొంద దగినవాడవు, గొప్ప శివభక్తుడవు మరియు దాతవు అగు నిన్ను శరణు పొందుచున్నాము (23). ఓ విప్రా! గొప్ప వజ్రముతో సమమగు నీ ఎముకలను మాకు ఇమ్ము. నీ ఎముకతో నేను వజ్రమును చేసి దానితో దేవ ద్రోహియగు వృత్రుని సంహరించెదను (24). ఇంద్రుడు ఇట్లు పలుకగా, పరోపకార పారీణుడగు ఆ మహర్షి తన ప్రభువగు శివుని ధ్యానించి దేహమును విడిచిపెట్టెను (25). సర్వ బంధముల నుండి విముక్తుడైన ఆ మహర్షి వెంటనే బ్రహ్మలోకమును చేరెను. అచట ఆతనిపై పుష్పవర్షము గురిసెను. అందరు ఆశ్చర్య చకితులైరి (26). అపుడు ఇంద్రుడు వెంటనే సురభి ధేనువును పిలిపించి దేహము నుండి ఎముకలను వేరు చేయించెను. ఆ ఎముకలతో అస్త్రములను నిర్మించమని ఇంద్రుడు విశ్వకర్మను ఆదేశించెను (27). ఇంద్రునిచే ఆజ్ఞాపించబడిన విశ్వకర్మ శివుని తేజస్సుచే మిక్కిలి దృఢముగా నున్న ఆ వజ్రమయమగు ఎముకలతో పూర్ణముగా అస్త్రములను నిర్మించెను (28). ఆయన వెన్నెముకతో వజ్రమును, బ్రహ్మశిరమను బాణమును నిర్మించెను. మరియు మిగిలిన ఎముకలతో ఇతరములగు అనేక అస్త్రములను నిర్మించెను (29).

తమింద్రో వజ్రముద్యమ్య వర్ధితశ్శివవర్చసా ।
వృత్రమభ్య ద్రవత్ క్రుద్ధో మునే రుద్ర ఇవాంతకమ్ ॥
తతశ్శక్రస్సు సన్నద్ధస్తేన వజ్రేణ స ద్రుతమ్ ।
ఉచ్చకర్త శిరో వార్త్రం గిరిశృంగ మివౌజసా ॥
తదా సముత్సవస్తాత బభూవ త్రిదివౌక సామ్ ।
తుష్టువుర్నిర్జరాశ్శక్రం పేతుః కుసుమ వృష్టయః ॥
ఇతి తే కథితం తాత ప్రసంగాచ్చరితం త్విదమ్ ।
పిప్పలాదావతారం మే శృణు శంభోర్మహాదరాత్ ॥
సువర్చా సా మునేః పత్నీ దధీచస్య మహాత్మనః ।
యయౌ స్వమాశ్ర మాభ్యంతస్తదాజ్ఞప్తా పతివ్రతా ॥
ఆగత్య తత్ర సా దృష్ట్వా న పతిం స్వం తపస్వినీ ।
గృహకార్యం చ సా కృత్వా ఖిలం పతినిదేశతః ॥
ఆజగామ పునస్తత్ర పశ్యంతీ బహ్వ శోభనమ్ ।
దేవాంశ్చ తాన్ మునిశ్రేష్ఠ సువర్చా విస్మితాఽభవత్ ॥
జ్ఞాత్వా చ తత్సర్వమిదం సురాణాం కృత్యం తదానీం చ చుకోప సాధ్వీ ।
దదౌ తదా శాపమతీవ రుష్టా తేషాం సువర్చా ఋషివర్య భార్యా ॥

శివుని తేజస్సుచే పెరిగిన శక్తి గల ఇంద్రుడు కోపముతో వజ్రమును చేత బట్టి వృత్రురుని వైపు పరుగెత్తెను. ఓ మహర్షీ ! ఆతడు యముని వెంట పడిన రుద్రుని వలె నుండెను (30). యుద్ధమునకు పూర్తిగా సంసిద్ధుడై యున్న ఆ ఇంద్రుడు అపుడు శీఘ్రమే వృత్రాసురుని శిరస్సును పర్వత శిఖరమును వలె బలముగా నరికెను (31). వత్సా! అపుడు దేవతలు ఉత్సవమును చేసుకొనిరి. ఇంద్రుని కొనియాడిరి. పుష్పవర్షములు కురిసెను (32). వత్సా! ఈ తీరున నేను ప్రసంగ వశమున నీకు ఈ గాథను చెప్పితిని. ఇప్పుడు శంభుని పిప్పలాద అవతార గాథను మహాదరముతో వినుము (33). మహాత్ముడగు దధీచమహర్షి యొక్క పత్నియగు ఆ సువర్చ పతివ్రత గనుక భర్తయొక్క ఆజ్ఞను పాలించి తన ఆశ్రమము యొక్క లోపలికి వెళ్లియుండెను (34). ఆమె భర్త యొక్క ఆజ్ఞను పాలించి ఇంటి పనులనన్నిటినీ చక్క బెట్టుకొని అచటకు వచ్చెను. కాని తపస్విని యగు సువర్చకు తన భర్త కానరాలేదు (35). ఆమె మరల అచటకు వచ్చినపుడు ఆమెకు సర్వము అమంగళరూపముగా కన్పట్టెను. ఓ మహర్షీ! ఆమె ఆ దేవతలను గాంచి చకితురాలయ్యెను (36). ఆ పతివ్రత ఆ క్షణములో దేవతలు చేసిన ఆ పనిని గురించి పూర్తిగా ఎరింగినది. మహర్షి భార్యయగు సువర్చ వారిపై మిక్కిలి కోపించి శాపమునిచ్చెను (37).

సువర్చో వాచ ।

అహో సురా దుష్టతరాశ్చ సర్వే స్వకార్యదక్షా హ్య బుధాశ్చ లుబ్ధాః।
తస్మాచ్చ సర్వే పశవో భవంతు సేంద్రాశ్చ మేఽద్య ప్రభృతీత్యువాచ ॥
ఏవం శాపం దదౌ తేషాం సురాణాం సా తపస్వినీ ।
సశక్రాణాం చ సర్వేషాం సువర్చా మునికామినీ ॥
అనుగంతుం పతేర్లోక మథైచ్ఛత్సా పతివ్రతా ।
చితాం చక్రే సమేధోభిస్సు పవిత్రైర్మన స్వినీ ॥
తతో నభోగిరా ప్రాహ సువర్చాం తాం ముని ప్రియామ్ ।
ఆశ్వాసయంతీ గిరిశప్రేరితా సుఖదాయినీ ॥

సువర్చ ఇట్లు పలికెను –

అహో! దేవతలు ఎంతటి దుష్టులో! వీరందరు తమ కార్యమును నెరవేర్చుకొనుటలో సమర్థులు. అపండితులు, లుబ్ధులు అగు ఈ ఇంద్రాది దేవతలందరు ఈ నాటి నుండియు నా శాపముచే పశువులు అగుదురు గాక! (38) తపశ్శాలిని, మునిపత్నియగు ఆ సువర్చ ఆ. ఇంద్రాది దేవతలందరికీ ఇట్లు శాపమునిచ్చెను (39). తరువాత ఆ పతివ్రత పతి వెళ్లిన లోకమునకు పతి వెనుకనే వెళ్లుటకు నిశ్చయించుకొనెను. అభిమానవతి యగు ఆమె మిక్కిలి పవిత్రమగు సమిధలతో చితిని ఏర్పాటు చేసెను (40). అపుడు శివునిచే ప్రేరితమై ఆకాశవాణి ఆ ముని పత్నియగు సువర్చను ఓదార్చి సుఖమును కలిగించుచూ ఇట్లు పలికెను (41).

ఆకాశవాణ్యువాచ ।

సాహసం న కురు ప్రాజ్ఞే శృణు మే పరమం వచః ।
మునితేజస్త్వదుదరే తదుత్పాదయ యత్నతః ॥
తతస్స్వా భీష్ట చరణం దేవి కర్తుం త్వమర్హసి ।
సగర్భాన దహే ద్గా త్రమితి బ్రహ్మనిదేశనమ్ ॥

ఆకాశవాణి ఇట్లు పలికెను -

ఓ బుద్ధిమంతులారా! సాహసమును చేయకుము. నేను చెప్పే శ్రేష్ఠమగు వచనమును వినుము. నీ గర్భములో ముని యొక్క తేజస్సు గలదు. దానికి ప్రయత్న పూర్వకముగా జన్మను ఇమ్ము (42). ఓ దేవీ! ఆ తరువాత నీకు నచ్చిన విధముగా చేయవచ్చును. గర్భిణియగు స్త్రీ తన దేహమును నశింపజేయరాదని వేదము నిషేధించుచున్నది (43).

ఇత్యుక్త్వా సా నభవాణీ విరరామ మునీశ్వర ।
తాం శ్రుత్వా సా మునేః పత్నీ విస్మితాఽభూత్ క్షణం చసా ॥
సువర్చా సా మహాసాధ్వీ పతిలోక మభీప్సతీ ।
ఉపవిశ్యాశ్మనా భూయ స్వోదరం విదదార హ ॥
నిర్గతో జఠరాత్తస్యా గర్భో మునివరస్య సః ।
మహాదివ్య తనుర్దీప్తో భాసయంశ్చ దిశో దశ ॥
సాక్షా ద్రుద్రావతారోఽసా దధీచవరతేజసః ।
ప్రాదుర్భూతస్స్వయం తాత స్వలీలాకరణే క్షమః ॥
తం దృష్ట్వా స్వసుతం దివ్య స్వరూపం మునికామినీ ।
సువర్చాజ్ఞాయ మనసా సాక్షాద్రుద్రావతారకమ్ ॥
ప్రహృష్టా భూన్మహాసాధ్వీ ప్రణమ్యాశు నునావ సా ।
స్వహృది స్థాపయామాస తత్ స్వరూపం మునీశ్వర ॥
సువర్చా తనయం తం చ ప్రహస్య విమలేక్షణా ।
జననీ ప్రాహ సుప్రీత్యా పతిలోకమభీప్సతీ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! ఆ ఆకాశవాణి ఇట్లు పలికి విరమించెను. ఆ వచనములను విని ఆ మునిపత్ని క్షణకాలము చకితురాలయ్యేను (44). పతిలోకమును పొందగోరే మహాపతివ్రత యగు ఆ సువర్చ కూర్చుండి రాతితో తన గర్భమును పలు పర్యాయములు కొట్టుకొనెను (45). ఆమె ఉదరమునుండి దధీచి మహర్షి యొక్క పుత్రుడు మహాదివ్య శరీరముతో, పది దిక్కులను తన తేజస్సుచే ప్రకాశింప జేయుచూ ఉదయించెను (46). ఓ వత్సా! తన లీలలను నెరపుటలో సమర్థుడగు రుద్రుడు స్వయముగా దధీచుని శ్రేష్ఠపుత్రుడై ఉదయించెను (47). దివ్య

స్వరూపుడగు ఆ తన పుత్రుని గాంచి ముని పత్నియగు సువర్చ తన మనస్సులో ఆ బాలుడు సాక్షాత్తుగా రుద్రావతారమే నని గుర్తించెను (48). ఓ మహర్షి! మహాసాధ్వియగు ఆమె చాల సంతసిల్లి వెంటనే ప్రణమిల్లి స్తుతించెను. ఆమె ఆ రూపమును తన హృదయములో పదిలపరచుకొనెను (49). నిర్మలమగు చూపులు గలది, పతి లోకమును పొందగోరునది, ఆ బాలుని తల్లి యగు సువర్చ నవ్వి మిక్కిలి ప్రీతితో ఆ పుత్రుని ఉద్దేశించి ఇట్లు పలికెను (50).

సువర్చోవాచ।

హే తాత పరమేశాన చిరం తిష్ఠాస్య సన్నిధౌ ।

అశ్వత్థస్య మహాభాగ సర్వేషాం సుఖదో భవేః ॥

మామాజ్ఞాపయ సుప్రీత్యా పతిలోకాయ చాధునా ।

తత్రస్థాహం చ పతినా త్వాం ధ్యాస్యే రుద్రరూపిణమ్ ॥

సువర్చ ఇట్లు పలికెను -

ఓ పుత్రా! పరమేశ్వరా ! మహాత్మా! ఈ రావి చెట్టు యొక్క సన్నిధి లో చిరకాలము ఉన్నవాడవై అందరికీ సుఖమును కలిగించుము (51). ఇప్పుడు నేను నా భర్త యొక్క సన్నిధికి పయనమగుటకు ప్రీతితో అనుమతి నిమ్ము. నేనచట పతితో గూడి రుద్రరూపుడవగు నిన్ను ధ్యానించెదను (52).

నందీశ్వర ఉవాచః

ఇత్యేవం సా బభాషేఽథ సువర్చా తనయం ప్రతి ।
పతిమన్వగమత్సాధ్వీ పరమేణ సమాధినా ॥
ఏవం దధీచ పత్నీ సా పతినా సంగతా మునే ।
శివలోకం సమాసాద్య సిషేవే శంకరం ముదా ॥
ఏతస్మిన్నంతరే దేవాస్సేంద్రాశ్చ మునిభిస్సహ ।
తత్రాజగ్ముస్త్వరా తాత ఆహూతా ఇవ హర్షితాః ॥
హరిర్బ్రహ్మా చ సుప్రీత్యా వతీర్ణం శంకరం భువి ।
సువర్చాయాం దధీచా ద్వా యయతు స్వగణైస్సహ ॥
తత్ర దృష్ట్వా వతీర్ణం తం మునిపుత్ర త్వమాగతమ్ ।
రుద్రం సర్వే ప్రణేముశ్చ తుష్టువుర్బద్ధపాణయః ॥
తదోత్సవో మహా నాసీ ద్దేవానాం మునిసత్తమ ।
నేదుర్దుందు భయస్తత్ర నర్తక్యో నన్నృతుర్ముదా ॥
జగుర్గంధర్వపుత్రాశ్చ కిన్నరా వాద్య వాదకాః ।
వాదయామా సురమరాః పుష్పవృష్టిం చ చక్రిరే ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

సాధ్వియగు ఆ సువర్చ కుమారునితో నిట్లు పలికి గొప్ప సమాధిని పొంది భర్తవద్దకు చేరుకొనెను (53). ఓ మునీ! ఈ విధముగా దధీచుని భార్య భర్తతో గూడి శివలోకమును పొంది ఆనందముతో శంకరుని సేవించెను (54). ఓ వత్సా! ఇంతలో ఇంద్రాది దేవతలు మహర్షులతో గూడి ఆహ్వానింప బడిన వారు వలె ఆనందముతో శీఘ్రముగా అచటకు వచ్చిరి (55). సువర్చాదధీచుల పుత్రుడై భూమి యందు అవతరించిన శంకరుని దర్శించుటకై బ్రహ్మ విష్ణువులు తమ గణములతో గూడి ఆనందముతో విచ్చేసిరి (56).. అచట ముని పుత్రుడై అవతరించిన ఆ రుద్రుని గాంచి వారందరు చేతులు కట్టుకొని నమస్కరించి స్తుతించిరి (57). ఓ మహర్షీ! అపుడు దేవతలు గొప్ప ఉత్సవమును చేసిరి. అచట దుందుభులు మ్రోగినవి. నర్తకస్త్రీ లు ఆనందముతో నాట్యమును చేసిరి (58). గంధర్వ పుత్రులు మరియు కిన్నరులు గానము చేయగా వాద్య గాండ్రు వాద్యములను మ్రోగించిరి. దేవతలు పుష్పవృష్టిని కురిపించిరి (59).

పిప్పలస్య శర్వపితుర్విలసంతం సుతం చ తమ్ ।

సంస్కృత్య విధివత్సర్వే విష్ణ్వాద్యాస్తుష్టువుః పునః ॥

పిప్పలాదేతి తన్నామ చక్రే బ్రహ్మా ప్రసన్నధీః ।

ప్రసన్నో భవ దేవేశ ఇత్యూచే హరిణా సురైః ॥

ఇత్యుక్త్వా తమను జ్ఞాయ బ్రహ్మా విష్ణుస్సు రాస్తథా ।

స్వం స్వం ధామ యయుస్సర్వే విధాయ చ మహోత్సవమ్ ॥

అథ రుద్రః పిప్పలాదోఽశ్వత్థమూలే మహా ప్రభుః ।

తతాప సుచిరం కాలం లో కానాం హితకామ్యయా ॥

ఇత్థం సుతపతస్తస్య పిప్పలాదస్య సమ్ముఖే ।

మహాకాలో వ్యతీయాయ లోక చర్యానుసారిణః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం పిప్పలాద అవతార వర్ణనం నామ చతుర్వింశోఽధ్యాయః (24).

రుద్రునకు తండ్రి అయిన ఆ అశ్వత్థ వృక్షమును, ప్రకాశించుచున్న ఆ బాలకుని, యథావిధిగా సంస్కారములను చేసిన తరువాత విష్ణువు మొదలగు వారందరు పలుమార్లు స్తుతించిరి (60). ప్రసన్నమగు మనస్సు గల బ్రహ్మ ఆ బాలునకు పిప్పలాదుడు అని నామకరణము చేసెను. విష్ణువుతో మరియు దేవతలతో గూడి ఓ దేవ దేవా! ప్రసన్నుడవు కమ్ము అని ప్రార్థించెను (61). బ్రహ్మ విష్ణువులు మరియు దేవతలు అందరు ఇట్లు పలికి ఆయన వద్ద సెలవు తీసుకొని మహోత్సవమును చేసి తమ తమ స్థానములకు వెళ్లిరి (62), అపుడు రుద్రావతారుడగు పిప్పలాదమహాప్రభుడు రావిచెట్టు మూలమునందు లోకముల హితమును గోరి చాలకాలము తపస్సును చేసెను. (63). లోకపు పోకడననుసరించి ఈ తీరున పిప్పలాదుడు గొప్ప తపస్సును చేయుచుండగా చాలకాలము గడచెను (64).

శ్రీ శివమహాపురాణములోని శతరుద్ర సంహితయందు పిప్పలాదావతార వర్ణనమనే ఇరువది నాల్గవ అధ్యాయము ముగిసినది (24).

25 - పద్మా పిప్పలాదుల చరితము

నందీశ్వర ఉవాచః

అథ లోకే వ్యవస్థాయ ధర్మస్య స్థాపనేచ్ఛయా ।
మహాలీలాం చకారేశస్తామహో సన్మునే శృణు ॥
ఏకదా పుష్పభద్రాయాం స్నాతుం గచ్ఛన్మునీశ్వరః ।
దదర్శ పద్మాం యువతీం శివాంశాం సుమనోహరామ్ ॥
తల్లిప్సుస్తత్పితు స్స్థాన మనరణ్యస్య భూపతేః ।
జగామ భువనాచారీ లోకతత్త్వ విచక్షణః ॥
రాజా నరాణాం తం దృష్ట్వా ప్రణమ్య చ భయాకులః ।
మధుపర్కాదికం దత్త్వా పూజయామాస భక్తితః ॥
స్నేహాత్సర్వం గృహీత్వా స యయాచే కన్యకాం మునిః ।
మౌనీ బభూవ నృపతిః కించిన్నిర్వక్తు మక్షమః ॥
మునిః ప్రోవాచ నృపతిం కన్యాం మే దేహి భక్తితః ।
అన్యథా భస్మ సాత్సర్వం కరిష్యేఽహం త్వయా సహ ॥
అథో బభూవురాచ్ఛన్నా స్సర్వే రాజజనాస్తదా ।
తేజసా పిప్పలాదస్య దాధీచస్య మహామునేః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! తరువాత ఈశ్వరుడు లోకములో నున్నవాడై ధర్మమును స్థాపించదలచి గొప్ప అద్భుతమగు లీలను చేసెను. ఆ వృత్తాంతమును వినుము (1). ఒకనాడు ఆ మహర్షి పుష్పభద్రానదిలో స్నానము చేయుటకు వేళ్లుచూ, పార్వతి అంశతో జన్మించిన పద్మయను సుందర యువతిని గాంచెను (2). లోకస్వభావమునెరింగి లోకాచారము ననుసరించి ఆ మహర్షి ఆమెను పొందగోరి ఆమె తండ్రియగు అనరణ్య మహారాజు వద్దకు వెళ్లెను (3). రాజు ఆయనను గాంచి భయముతో కంగారుపడి నమస్కరించి భక్తితో మధుపర్కాదులనిచ్చి పూజించెను (4). ఆ మహర్షి ప్రేమతో వాటినన్నిటినీ స్వీకరించి కన్యనిమ్మని గోరెను. ఆ రాజు ఏమియు మాటలాడే సామర్థ్యములేని వాడై మౌనముగా నిలబడెను (5). అపుడా మహర్షి ఇట్లు పలికెను. రాజా! నాకు భక్తితో కన్యను సమర్పించుము. అట్లు ఈయనిచో, నేను నీతో సహా సర్వమును భస్మము చేసెదను (6). ఓ మహర్షీ! అపుడు దధీచుని పుత్రుడగు పిప్పలాదమహర్షి యొక్క తేజస్సుచే రాజపరివారమంతయూ కప్పి వేయబడెను (7).

అథ రాజా మహా భీతో విలప్య చ ముహుర్ముహుః ।
కన్యామలంకృతాం పద్మాం వృద్ధాయ మునయే దదౌ ॥
పద్మాం వివాహ్యా స ముని శ్శివాంశాం భూపతేస్సు తామ్ ।
పిప్పలాదో గృహీత్వా తాం ముదితస్స్వాశ్రమం యయౌ ॥
తత్ర గత్వా మునివరో వయసా జర్జరోఽధికః ।
ఉవాస నార్యా స తయా తపస్వీ నాతిలంపటః ॥
అథోఽనరణ్య కన్యా సా సిషేవే భక్తితో మునిమ్ ।
కర్మణా మనసా వాచా లక్ష్మీర్నారాయణం యథా ॥
ఇత్థం స పిప్పలాదో హి శివాంశో మునిసత్తమః ।
రేమే తయా యువత్యా చ యువా భూయ స్వలీలయా ॥
దశ పుత్రా మహాత్మానో బభూవుస్సుతపస్వినః ।
మునేః పితుస్సమాస్సర్వే పద్మాయాస్సు ఖవర్ధనాః ॥
ఏవం లీలా వతారో హి శంకరస్య మహాప్రభో ।
పిప్పలాదో మునివరో నానా లీలాకరః ప్రభుః ॥

తరువాత ఆ రాజు మిక్కిలి భీతిల్లి పలుపర్యాయములు విలపించి వృద్ధుఁడగు మహర్షికి పద్మయను పేరు గల అలంకృతయగు ఆ కన్యను ఇచ్చి వివాహము చేసెను (8). ఆ మహర్షి పార్వతి అంశతో మహారాజపుత్రికయై జన్మించిన పద్మను వివాహమాడి, ఆమెను తీసుకొని ఆనందముతో తన ఆశ్రమమును చేరుకొనెను (9). వయస్సు పై బడినవాడు, తపశ్శాలి, అధికమగు ఇంద్రియాసక్తి లేనివాడు అగు ఆ మహర్షి ఆశ్రమమునకు వెళ్లి ఆమెతో కలిసి జీవింప జొచ్చెను (10). అపుడు అనరణ్యుని కుమార్తెయగు ఆమె నారాయణుని లక్ష్మివలె ఆ మునిని మనోవాక్కాయ కర్మలతో భక్తి పూర్వకముగా సేవించెను (11). అపుడు శివాంశసంభూతుడగు ఆ పిప్పలాదమహర్షి తన లీలచే యువకుడుగా మారి ఆ యువతితో గూడి రమించెను (12). పద్మా పిప్పలాదులకు మహాత్ములు, గొప్ప తపశ్శాలులు, తండ్రితో సమానమైన వారు అగు పదిమంది పుత్రులు కలిగిరి. వారందరు తల్లిదండ్రుల సుఖమును ఇనుమడింప జేసిరి (13). ఈ విధముగా లీలతో అవతారములను గ్రహించు శంకరమహా ప్రభుడు పిప్పలాదమహర్షిగా అవతరించి అనేక లీలలను ప్రకటించెను (14).

యేన దత్తో వరః ప్రీత్యా లోకేభ్యో హి దయాలునా ।
దృష్ట్వా లోకే శనేః పీడాం సర్వేషామ నివారిణీమ్ ॥
షోడశాబ్దావధి నృణాం జన్మతో న భవేచ్చ సా ।
తథా చ శివభక్తానాం సత్యమేతద్ధి మే వచః ॥
అథానాదృత్య మద్వాక్యం కుర్యాత్పీడాం శనిః క్వచిత్ ।
తేషాం నృణాం తదా స స్యాద్భస్మసాన్న హి సంశయః ॥
ఇతి తద్భయతస్తాత వికృతోఽపి శనైశ్చరః ।
తేషాం న కురుతే పీడాం కదాచిత్ గ్రహసత్తమః ॥
ఇతి లీలామనుష్యస్య పిప్పలాదస్య సన్మునే ।
కథితం సుచరిత్రం తే సర్వకామ ఫలప్రదమ్ ॥
గాధిశ్చ కౌశికశ్చైవ పిప్పలాదో మహామునిః ।
శనైశ్చరకృతాం పీడాం నాశయంతి స్మృతాస్త్ర యః ॥
పిప్పలాదస్య చరితం పద్మా చరిత సంయుతమ్ ।
యః పఠేచ్ఛృణుయాద్వాపి సుభక్తో భువి మానవః ॥
శని పీడా వినాశార్థమేతచ్చరిత ముత్తమమ్ ।
యః పఠేచ్ఛృణుయా ద్వాపి సర్వాన్ కామాన వాప్నుయాత్ ॥

దయాళువగు ఆ మహర్షి లోకములో సర్వులకు శని బాధ అనివార్యముగా నుండుటను గాంచి ప్రేమతో జనులకు ఒక వరము నొసంగెను (15). పుట్టినప్పటినుండి పదునారు సంవత్సరముల వయస్సు వచ్చువరకు మానవులకు శని బాధ ఉండదు. ఈ నా వచనము సత్యము (16). నా ఈ వచనమును లెక్క సేయకుండా శని ఎక్కడైననూ మానవులకు పీడను కలిగించినచో, ఆ శని నిస్పందేహముగా భస్మమగును (17). గ్రహరాజమగు శని పీడాకరుడే అయిననూ ఇట్లు శివుని భయము ఉండుట వలన వారికి ఎన్నడైననూ పీడను కలిగించుటలేదు (18). ఓ వత్సా! మహర్షీ! లీలచే పిప్పలాదుడై మనుష్యావతారమును దాల్చిన శివుని పవిత్ర గాథను నీకీ తీరున వివరించితిని. ఈ గాథ సర్వకామనలను, ఫలములను ఇచ్చును (19). గాధి, కౌశికుడు మరియు పిప్పలాదమహర్షి అను ముగ్గురినీ స్మరించినచో శనివలన కలిగిన పీడ దూరమగును (20). పద్మాపిప్పలాదుల చరితమును భూలోకములో ఏ మానవుడు మంచి భక్తితో పఠించునో, లేక వినునో వాని కోర్కెలన్నియు ఈడేరును. ఉత్తమమగు ఈ చరితము శని బాధను తొలగించును (21, 22).

ధన్యో మునివరో జ్ఞానీ మహాశైవస్సతాం ప్రియః ।
అస్య పుత్రో మహేశానః పిప్పలాదాఖ్య ఆత్మవాన్ ॥
ఇదమాఖ్యానమనఘం స్వర్గ్యం కుగ్రహదోషహృత్ ।
సర్వకామప్రదం తాత శివభక్తి వివర్ధనమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం పిప్పలాద అవతార
చరితవర్ణనం నామ పంచవింశోఽధ్యాయః(25).

జ్ఞాని, మహాశివభక్తుడు, సత్పురుషులకు ప్రియుడు అగు దధీచ మహర్షి ధన్యుడు. మహేశ్వరుడే ఆయనకు పుత్రుడై జన్మించెను. ఆయనయే ఆత్మజ్ఞానియగు పిప్పలాదుడు (23). పవిత్రమైనది, స్వర్గమునిచ్చునది, చెడు గ్రహముల దోషము నపహరించునది అగు ఈ గాథ కోర్కెల నన్నిటినీ ఈడేర్చును. వత్సా! ఈ గాథ శివభక్తిని వర్ధిల్ల జేయును (24). .

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు పిప్పలాద
అవతార చరిత వర్ణనమనే ఇరువది అయిదవ అధ్యాయము ముగిసినది (25).

26 - వైశ్యనాథ అవతారము

నందీశ్వర ఉవాచః

శృణు తాత ప్రవక్ష్యామి శివస్య పరమాత్మనః ।
అవతారం పరానందం వైశ్యనాథాహ్వయం మునే ॥
నంది గ్రామే పురా కాచిన్మహానందేతి విశ్రుతా ।
బభూవ వారవనితా శివభక్తా సుసుందరీ ॥
మహావిభవసంపన్నా సుధనాఢ్యా మహోజ్జ్వలా ।
నానారత్న పరిచ్ఛిన్న శృంగార రసనిర్భరా ॥
సర్వసంగీత విద్యాసు నిపుణాతి మనోహరా ।
తస్యా గేయేన హృష్యంతి రాజ్ఞ్యో రాజాన ఏవ చ ॥
సమానర్చ సదా సాంబం సా వేశ్యా శంకరం ముదా ।
శివనామ జపాసక్తా భస్మరుద్రాక్ష భూషణా ॥
శివం సంపూజ్య సా నిత్యం సేవంతీ జగదీశ్వరమ్ ।
ననర్త పరయా భక్త్యా గాయంతీ శివసద్యశః ॥
రుద్రాక్షై ర్భూషయిత్వైకం మర్కటం చైవ కుక్కుటమ్ ।
కరతాలైశ్చ గీతైశ్చ సదా నర్తయతి స్మ సా ॥
నృత్యమానౌ చ తౌ దృష్ట్వా శివభక్తి రతా చ సా ।
వేశ్యా స్మ విహసత్యుచ్చైః ప్రేమ్ణా సర్వసఖీయుతా ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

వత్సా! మునీ! శివపరమాత్మ యొక్క పరమానంద ఘనమగు వైశ్యనాథావతారమును గూర్చి చెప్పెదను. వినుము (1). పూర్వము నంది గ్రామములో మహానందయను వారవనిత ఒకతె ఉండెడిది. ఆమె గొప్ప సుందరి, మరియు శివభక్తురాలు (2). ఆమె చాల ధనముతో, మరియు గొప్ప వైభవముతో గూడి అద్భుతముగా ప్రకాశించెడిది. అనేకరకముల రత్నములను పొదిగిన ఆభరణములను దాల్చి ఆమె మూర్తీభవించిన శృంగారమువలె నుండెను (3). అతి మనోహారిణియగు ఆమె సంగీత విద్యలన్నిటియందు సమర్థురాలు. ఆమె పాడినచో రాజులు, రాణీలు కూడ హర్షించెడివారు (4). ఆ వేశ్య సర్వదా పార్వతీ సమేతుడగు శంకరుని ఆనందముతో కొలిచెడిది. ఆమె భస్మను, రుద్రాక్షలను ఆభరణములుగా దాల్చి శివనామమును జపించుటయందు ఆసక్తి కలిగి యుండెడిది (5). ఆమె నిత్యము జగదీశ్వరుడగు శివుని పూజించి సేవించి శివుని పవిత్రకీర్తిని పరమ భక్తితో గానము చేయుచూ నాట్యము చేసెడిది (6). ఆమె ఒక కోతిని, కోడిని రుద్రాక్షలతో అలంకరించి చప్పట్లతో మరియు పాటలతో ఎల్లవేళలా వాటిచే నాట్యము చేయించెడిది (7). శివభక్తి పరాయణురాలగు ఆ వేశ్య సఖురాండ్రందరితో గూడి వాటి నాట్యమును చూచి ప్రేమతో బిగ్గరగా నవ్వెడిది (8).

రుద్రాక్షైః కృతకేయూర కర్ణాభరణమండనః ।
మర్కటః శిక్షయా తస్యాః పురో నృత్యతి బాలవత్ ॥
శిఖా సంబద్ధరు ద్రాక్షః కుక్కుటః కపినా సహ ।
నిత్యం న నర్త నృత్యజ్ఞః పశ్యతాం హితమావహన్ ॥
ఏవం సా కుర్వతీ వేశ్యా కౌతుకం పరమాదరాత్ ।
శివభక్తిరతా నిత్యం మహానందభరాఽభవత్ ॥
శివభక్తిం ప్రకుర్వంత్యా వేశ్యాయా ముని సత్తమ ।
బహుకాలో వ్యతీయాయ తస్యాః పరమసౌఖ్యతః ॥
ఏకదా చ గృహే తస్యా వైశ్యో భూత్వా శివస్స్వయమ్ ।
పరీక్షితుం చ తద్భావమాజగామ శుభ వ్రతీ ॥
త్రిపుండ్రవిలసద్భాలో రుద్రాక్షాభరణః కృతీ ।
శివనామజపాసక్తో జటిలశ్చైవ వేషభృత్ ॥
సబిభ్రద్భస్మ నిచయం ప్రకోష్ఠేకౌతుకీ ॥
తమాగతం సుసంపూజ్య సా వేశ్యా పరయా ముదా ।
స్వస్థానే సాదరం వైశ్యం సుందరీ హి న్యవేశయత్ ॥
తత్ప్రకోష్ఠే వరం వీక్ష్య కంకణం సుమనోహరమ్ ।
తస్మిన్ జాతస్పృహా సా చ తం ప్రోవాచ సువిస్మితా ॥

రుద్రాక్షలచే చేయబడిన కేయూరము, కర్ణాభరణము ఇత్యాది అభరణములను దాల్చి ఆ కోతి ఆమె ఎదుట శిక్షణను పొంది బాలుని వలె నాట్యమాడెడిది (9). శిఖపై కట్టబడిన రుద్రాక్ష గల కోడి కూడా కోతితో గలసి నృత్యము నెరింగిన దానివలె ప్రతిదినము చూచువారలకు ఉల్లాసమును కలిగిస్తూ నాట్యమును చేసెడిది (10). ఆ వేశ్య ఈ విధముగా అధికమగు ఉత్సాహముతో ఆదరముతో ప్రతిదినము శివభక్తి పరాయణురాలై మహానందమునసుభవించెడిది (11). ఓ మహర్షీ! శివభక్తి యందు లగ్నురాలై ఆ వేశ్య ఉండగా చాల కాలము ఆమెకు చాల సుఖముగా గడిచిపోయెను (12). ఒకనాడు శివుడు ఆమె భక్తిని స్వయముగా పరీక్షించుటకై శుభకరమగు వ్రతమును పాటించే ఒక వైశ్యుని రూపమును దాల్చి విచ్చేసెను (13). ఆయన త్రిపుండ్రముతో ప్రకాశించే లలాటము గలవాడై, రుద్రాక్షలే ఆభరణములుగా గలవాడై, జటాజూటధారియై, శివనామమును జపించుటయందు ఆసక్తి గలవాడై, కృతార్థుడగు శివభక్తుని వేషమును దాల్చి యుండెను (14). ఆతడు దేహమంతయు భస్మను దాల్చి, మిక్కిలి ఉత్కంఠను రేకెత్తిస్తూ ప్రకాశించెను (15). సుందరియగు ఆ వేశ్య తన ఇంటికి విచ్చేసిన ఆ వైశ్యుని పరమానందముతో సాదరముగా చక్కగా పూజించి కూర్చుండ బెట్టెను (16). ఆతని ముంజేతియందు శ్రేష్ఠమైన మనోహరమగు కంకణమును గాంచి ఆమె మిక్కిలి విస్మయమును పొంది దానియందు ఉదయించిన కోరిక గలదై ఆయనతో నిట్లనెను (17).

మహానందోవాచ।

మహారత్నమయశ్చాయం కంకణస్త్వత్కరే స్థితః ।

మనో హరతి మే సద్యో దివ్యస్త్రీ భూషణోచితః ॥

మహానంద ఇట్లు పలికెను -

గొప్ప రత్నములు పొదిగినది, దివ్య స్త్రీలు అలంకరించుకొన దగినది అగు ఈ నీ చేతి యందు గల కంకణము నా మనస్సును వెనువెంటనే లాగి వేయుచున్నది(18).

నందీశ్వర ఉవాచః

ఇతి తాం నవరత్నాఢ్యే సస్పృహాం కరభూషణే ।

వీక్ష్యో దారమతిర్వైశ్యస్సస్మితం సమభాషత ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

నవరత్నములు పొదిగిన ఆ హస్త భూషణమునందు కోరిక గల ఆమెను గాంచి ఆ వైశ్యుడు పెద్ద మనస్సు గలవాడై చిరునవ్వుతో నిట్లు పలికెను (19).

వైశ్యనాథ ఉవాచః

అస్మిన్ రత్నవరే దివ్యే యది తే సస్పృహం మనః ।

త్వమేవాధత్స్వ సుప్రీత్యా మౌల్యమస్య దదాసి కిమ్ ॥

వైశ్యనాథుడు పలికెను -

రత్నములు పొదిగిన ఈ దివ్యాభరణముపై నీ మనస్సునందు కోరిక యున్నచో, నీవే దీనిని ప్రీతితో ధరించుము. దీనికి నీవు ఏమి వెలను ఇచ్చెదవు? (20)

వేశ్యావాచ ।

వయం హి స్వైరచారిణ్యో వేశ్యాస్తు న పతి వ్రతాః ।

అస్మత్కులోచితో ధర్మో వ్యభిచారో న సంశయః ॥

యద్యేతదఖిలం చిత్తం గృహ్ణాతి కరభూషణమ్ ।

దినత్రయమహోరాత్రం పత్నీ తవ భవామ్యహమ్ ॥

వేశ్య ఇట్లు పలికెను -

మేము స్వేచ్ఛా సంచారులమగు వేశ్యలమే గాని, పతివ్రతలము గాము. వ్యభిచారము మా కులమునకు అనురూపమైన ధర్మమనుటలో సందేహము లేదు (21). ఇది నీకు అంగీకారమై నా మనస్సునకు నచ్చిన ఈ హస్త భూషణమును నాకు ఇచ్చినచో, నేను నీకు మూడు రాత్రులు, మూడు పగళ్లు భార్యను కాగలను (22).

వైశ్య ఉవాచః

తథాస్తు యది తే సత్యం వచనం వీరవల్లభే ।

దదామి రత్నవలయం త్రిరాత్రం భవ మే వధూః ॥

ఏతస్మిన్ వ్యవహారే తు ప్రమాణం శశిభాస్కరౌ ।

త్రివారం సత్యమిత్యుక్త్వా హృదయం మే స్పృశ ప్రియే ॥

వైశ్యుడిట్లు పలికెను -

వీరులచే ప్రేమించబడే ఓ సుందరీ! అటులనే యగుగాక! నీ మాట సత్యమైనచో రత్నకంకణమును నీకిచ్చెదను. మూడు రాత్రులు నాకు భార్యవు అగుము (23). ఈ ఒప్పందమునకు సూర్యచంద్రులు సాక్షులు. 'సత్యమే' అని ముమ్మారు పలుకుము. ఓ ప్రియురాలా! తరువాత నా హృదయమును స్పృశించుము (24).

వేశ్యావాచ ।

దినత్రయ మహోరాత్రం పత్నీ భూత్వా తవ ప్రభో ।

సహధర్మం చరామీతి సత్యం సత్యం న సంశయః ॥

వేశ్య ఇట్లు పలికెను -

ఓ ప్రభూ! నేను మూడు రోజులు రాత్రింబగళ్లు నీకు భార్య, సహధర్మ చారిణిని అగుదును. ఇది ముమ్మాటికీ సత్యము. సంశయము లేదు (25).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా హి మహానందా త్రివారం శశి భాస్కరౌ ।

ప్రమాణీకృత్య సుప్రీత్యా సా తద్ధృదయమస్పృశత్ ॥

అథ తస్మై స వైశ్యస్తు ప్రదత్వా రత్న కంకణమ్ ।

లింగం రత్నమయం తస్యా హస్తే దత్వేదమబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

మహానంది ఇట్లు పలికి సూర్య చంద్రులు సాక్షిగా మూడు మార్లు ప్రతిజ్ఞను చేసి, మిక్కిలి ప్రీతితో ఆతని హృదయమును స్పృశించెను (26). అపుడు ఆ వైశ్యుడు ఆమెకు రత్నకంకణమునిచ్చి ఒక రత్న లింగమును ఆమె చేతికి ఇచ్చి ఇట్లు పలికెను (27). .

వైశ్యనాథ ఉవాచః

> ఇదం రత్నమయం లింగం శైవం మత్ప్రాణవల్లభమ్ ।
> రక్షణీయం త్వయా కాంతే గోపనీయం ప్రయత్నతః ॥

వైశ్యనాథుడిట్లు పలికెను -

ఓ సుందరీ! ఈ రత్నమయమగు శివలింగము నాకు ప్రాణ ప్రియమైనది. నీవు దీనిని శ్రద్ధగా దాచి రక్షించుము (28).

నందీశ్వర ఉవాచః

> ఏవమస్త్వితి సా ప్రోచ్య లింగమాదాయ రత్నజమ్ ।
> నాట్య మండపి కామధ్యే నిధాయ ప్రావిశద్గృహమ్ ॥
> సా తేన సంగతా రాత్రౌ వైశ్యేన విటధర్మిణా ।
> సుఖం సుష్వాప పర్యంకే మృదుతల్పే పశో ఖతే ॥
> తతో నిశీథ సమయే మునే వైశ్య పతీచ్ఛయా ।
> అకస్మాదుత్థితా వాణీ నృత్యమండపి కాంతరే ॥
> మహా ప్రజ్వలితో వహ్ని స్సుసమీర సహాయవాన్ ।
> నాట్యమండపికాం తాత తామేవ సహసావృణోత్ ॥
> మండపే దహ్యమానే తు సహసోత్థాయ సంభ్రమాత్ ।
> మర్కటం మోచయామాస సా వేశ్యా తత్ర బంధనాత్ ॥
> స మర్కటో ముక్త బంధః కుక్కుటేన సహామునా ।
> భియా దూరం హి దుద్రావ విధూయాగ్నికణాన్ బహూన్ ॥
> స్తంభేన సహ నిర్దగ్ధం తల్లింగం శకలీకృతమ్ ।
> దృష్ట్వా వేశ్యా స వైశ్యశ్చ దురంతం దుఃఖమాపతు: ॥
> దృష్ట్వా హ్యాత్మసమం లింగం దగ్ధం వైశ్యపతిస్తదా ।
> జ్ఞాతుం తద్భావమంతస్స్థం మరణాయ మతిం దదౌ ॥
> నిభిశ్యేతితరాం ఖేదా ద్వైశ్యస్త్రామాహ దుఃఖితామ్ ।
> నానాలీలో మహేశానః కౌతుకాన్నర దేహవాన్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆమె 'అటులనే' అని పలికి ఆ రత్నలింగమును తీసుకొని నాట్యమండప మధ్యములో నుంచి తాను ఇంటిలోనికి వెళ్లెను (29). ఆమె రాత్రి యందు విట స్వభావముతో వచ్చి యున్న ఆ వైశ్యునితో గూడి మెత్తని పరుపులతో శోభిల్లే మంచముపై సుఖముగా నిద్రించెను (30). ఓ మహర్షీ! అపుడు అర్ధరాత్రి సమయమునందు ఆ వైశ్య ప్రభుని సంకల్పముచే నృత్యమండపము లోపలనుండి అకస్మాత్తుగా శబ్దము బయల్వెడలెను (31). వత్సా ! పెద్ద జ్వాలలతో గూడిన అగ్ని పెద్ద గాలి తోడు కాగా ఆ నాట్యమండపము నంతనూ శీఘ్రముగా ఆవరించి వేసెను

(32), మండపము తగులబడుచుండగా ఆ వేశ్య తొందరపాటుతో నిద్రలేచి శీఘ్రమే అచట ఉన్న కోతిని బంధమునుండి విడిపించెను (33). బంధమునుండి విడిపింపబడిన ఆ కోతి కోడితో కలిసి మీద పడుచున్న అగ్ని కణములను దులుపుకొనుచూ భయముతో దూరముగా పారిపోయెను (34). ఆ లింగము పానువట్టముతో సహా నిప్పులలో కాలి ముక్కలయ్యెను. దానిని చూచి ఆ వైశ్యుడు మరియు వేశ్య పట్టరాని దుఃఖము ననుభవించిరి (35). ప్రాణ ప్రియమగు లింగము కాలిపోవుటను గాంచిన ఆ వైశ్య ప్రభువు అపుడు ఆమె హృదయములోని భావమును తెలియగోరి మరణించుటకు నిశ్చయించుకొనెను (36). అతిశయించిన దుఃఖముతో ఆ వైశ్యుడు కూర్చుండిపోయెను. అనేక లీలలు గలవాడు, కుతూహలముచే మానవదేహమును దాల్చినవాడు అగు మహేశ్వరుడు దుఃఖితురాలైయున్న ఆమెతో నిట్లనెను (37).

వైశ్యపతిరువాచ।

శివలింగే తు నిర్భిన్నే దగ్ధే మత్ప్రాణ వల్లభే ।
సత్యం వచ్మిన సందేహో నాహం జీవితుముత్సహే ॥
చితాం కారయ మే భద్రే స్వభృత్యైస్త్వం వరైర్లఘు ।
శివే మనస్సమావేశ్య ప్రవేక్ష్యామి హుతాశనమ్ ॥
యది బ్రహ్మేంద్రవిష్ణ్వాద్యా వారయేయుస్సమేత్య మామ్ ।
తథాప్యస్మిన్ క్షణే భద్రే ప్రవిశామి త్యజామ్యసూన్ ॥

వైశ్యనాథుడిట్లనెను -

నాకు ప్రాణప్రియమగు శివలింగము దగ్ధమై పగిలినది. నాకు జీవించవలెననే ఉత్సాహము లేదు. దీనిలో సందియము లేదు. నేను సత్యమును పలుకుచున్నాను (38). ఓ పుణ్యాత్మురాలా! నీవు నీ భృత్యులలో శ్రేష్ఠమైన వారిని నియోగించి శీఘ్రముగా చితిని ఏర్పాటు చేయించుము. నేను శివునియందు మనస్సును నిలిపి అగ్నిలో ప్రవేశించెదను (39). ఓ పుణ్యాత్మురాలా! బ్రహ్మ, ఇంద్రుడు, విష్ణువు మొదలగు వారందరు గూడి వచ్చి నన్ను వారించిననూ, నేను ఇదే క్షణములో అగ్నిని ప్రవేశించి ప్రాణములను విడిచెదను.

తమేవం దృఢనిర్బంధం సా విజ్ఞాయ సుదుఃఖితా ।
స్వభృత్యైః కారయామాస చితాం స్వ భవనా ద్బహిః ॥
తతస్స వైశ్య శ్శివ ఏక ఏవ ప్రదక్షిణీకృత సమిద్ధమగ్నిమ్ ।
వివేశ పశ్యత్సు నరేషు ధీర స్సు కౌతుకీ సంగతి భావమిచ్ఛుః ॥
దృష్ట్వా సా తద్గతిం వేశ్యా మహానందాతి విస్మితా ।
అనుతాపం చ యువతీ ప్రపేదే మునిసత్తమ ॥
అథ సా దుఃఖితా వేశ్యా స్మృత్వా ధర్మం సునిర్మలమ్ ।
సర్వాన్ బంధుజనాన్ వీక్ష్య బభాషే కరుణం వచః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆయన ఇట్లు గట్టిగా పట్టు పట్టగా ఆమె ఆతని దృఢనిశ్చయము నెరింగి మిక్కిలి దుఃఖించి తన భవనమునకు బయట తన సేవకులచేత చితిని ఏర్పాటు చేయించెను (41). ఆ వైశ్యరూపములో ఉన్న శివుడు మిక్కిలి కుతూహలముతో పుణ్యగతిని కోరువాడై ధైర్యముతో తాను ఒక్కడే ప్రజ్వరిల్లుచున్న ఆ అగ్నికి ప్రదక్షిణము చేసి, తరువాత జనులు చూచుచుండగా దానిలో ప్రవేశించెను (42). వేశ్య యగు మహానంద ఆతని అగ్ని ప్రవేశమును గాంచి మిక్కిలి ఆశ్చర్యమును పొందెను. ఓ మహర్షీ! ఆ యువతి తరువాత మహాదుఃఖమును పొందెను (43). అపుడా వేశ్య దుఃఖితురాలై పరమపవిత్రమగు ధర్మమును స్మరించి బంధుజనుల నందరినీ చూచి కరుణతో నిండిన ఈ వచనమును పలికెను (44).

మహానందోవాచ।

రత్నకంకణమాదాయ మయా సత్యముదాహృతమ్ ।
దినత్రయమహం పత్నీ వైశ్యస్యాముష్య సంమతా ॥
కర్మణా మత్కృతేనాయం మృతో వైశ్యశ్శివవ్రతీ ।
తస్మాదహం ప్రవేక్ష్యామి సహానేన హుతాశనమ్ ॥
స్వధర్మ చారిణీత్యుక్త మాచార్యై స్సత్యవాదిభిః ।
ఏవం కృతే మమ ప్రీత్యా సత్యం మయి న నశ్యతు ॥
సత్యాశ్రయః పరో ధర్మ స్సత్యేన పరమా గతిః ।
సత్యేన స్వర్గమోక్షౌ చ సత్యే సర్వం ప్రతిష్ఠితమ్ ॥

మహానంద ఇట్లు పలికెను -

నేను రత్నకంకణమును స్వీకరించి సత్యమును పలికి యుంటిని. నేను మూడు రోజులు ఈ వైశ్యునకు పత్ని యగుటకు అంగీకరించితిని (45). నేను చేసిన పని వలన శివభక్తవరుడగు ఈ వైశ్యుడు మరణించినాడు. కావున అతని వెనుకనే నేను కూడ అగ్నిలో ప్రవేశించెదను (46). నేను అట్లు చేసినచో, సత్యవాదులగు ఆచార్యులు నా గురించి 'ఈమె స్వధర్మమును ఆచరించినది' అని ప్రేమతో పలికెదరు. నాయందు సత్యము నశించకుండు గాక! (47) శ్రేష్ఠమగు ధర్మము సత్యము నాశ్రయించి యుండును. సత్యముచే మానవుడు పరమపదమును పొందును. సత్యముచే స్వర్గమోక్షములు లభించును. సర్వము సత్యమునందు ప్రతిష్ఠితమై యున్నది (48).

నందీశ్వర ఉవాచః

ఇతి సా దృఢ నిర్బంధా వార్యమాణాపి బంధుభిః ।
సత్యలోకపరా నారీ ప్రాణాంస్త్యక్తుం మనో దధే ॥
సర్వస్వం ద్విజముఖ్యే భ్యో దత్త్వా ధ్యాత్వా సదాశివమ్ ।
తమగ్నిం త్రిః పరిక్రమ్య ప్రవేశాభిముఖీ హ్యభూత్ ॥
తాం పతంతీం సమిద్ధేఽగ్నౌ స్వపదార్పిత మానసామ్ ।
వారయామాస విశ్వాత్మా ప్రాదుర్భూతస్స వై శివః ॥
సా తం విలోక్యాఖిల దేవదేవం త్రిలోచనం చంద్రకలావతంసమ్ ।
శశాంక సూర్యానల కోటి భాసం స్తబ్ధేవ భీతేవ తథైవ తస్థౌ ॥
తాం విహ్వలాం సువిత్రస్తాం వేపమానాం జడీకృతామ్ ।
సమాశ్వాస్య గలద్బాష్పాం కరౌ ధృత్వాఽబ్రవీద్వచః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

సత్యమును మాత్రమే దర్శించుటయందు నిమగ్నురాలైన ఆ యువతి ఇట్లు దృఢముగా నిశ్చయించుకున్నదై, బంధువులు వారించుచున్ననూ, ప్రాణములను విడిచి పెట్టుటకు నిర్ణయించుకొనెను (49). ఆమె తన సర్వ సంపదలను శ్రేష్ఠులగు బ్రాహ్మణులకు దానము చేసి సదాశివుని ధ్యానించి ఆ అగ్నికి ముమ్మారు ప్రదక్షిణము చేసి దానిలో ప్రవేశించుటకు సంసిద్ధురాలయ్యెను (50). తనయందు మనస్సును అర్పించి ప్రజ్వరిల్లే అగ్నియందు పడబోవుచున్న ఆమెను, విశ్వస్వరూపుడగు ఆ శివుడు ఆవిర్భవించి నివారించెను (51), దేవతలందరికీ దేవుడు, ముక్కంటి, చంద్రకళ శిరోభూషణముగా గలవాడు, కోట్లాది చంద్రుల, సూర్యుల మరియు అగ్నుల కాంతి గలవాడు నగు ఆ శివుని గాంచి ఆమె స్తంభించినదా యన్నట్లు, భయపడినదా యన్నట్లు అటులనే నిలబడి యుండెను (52). దుఃఖముతో మరియు భయముతో వణికి పోతూ స్తబ్ధురాలై నిలబడి కళ్లవెంబడి బాష్పములను కార్చుచున్న ఆమెను ఓదార్చి చేతులను పట్టుకొని శివుడిట్లు పలికెను. (53).

శివ ఉవాచః

> సత్యం ధర్మం చ ధైర్యం చ భక్తిం చ మయి నిశ్చలామ్ ।
> పరీక్షితుం త్వత్సకాశం వైశ్య భూత్వాఽహమాగతః ॥
> మాయయాగ్నిం సముద్దీప్య దగ్ధంతే నాట్యమండపమ్ ।
> దగ్ధం కృత్వా రత్నలింగం ప్రవిష్టోఽ హం హుతాశనమ్ ॥
> సా త్వం సత్యమనుస్మృత్య ప్రవిష్టా గ్నిం మయా సహ ।
> అతస్తే సంప్రదాస్యామి భోగాంస్త్రి దశదుర్లభాన్ ॥
> యద్యదిచ్ఛ సి సుశ్రోణి తదేవ హి దదామి తే ।
> త్వద్భక్త్యాఽహం ప్రసన్నోఽస్మి తవాదేయం న విద్యతే ॥

శివుడిట్లు పలికెను -

నేను నీయందు సత్యమును, ధర్మమును, నాపై గల నిశ్చల భక్తిని పరీక్షించగోరి వైశ్యరూపములో నీవద్దకు వచ్చితిని (54). నేను మాయచే అగ్నిని ప్రజ్వరిల్ల జేసి నీ నాట్యమండపమును తగులబెట్టితిని. ఆ రత్నలింగమును దహించి, అగ్నిలో ప్రవేశించితిని (55). నీవు సత్య వచనమును స్మరించి నా వెనుక అగ్నిలో ప్రవేశింప బోతివి. కావున నేను నీకు దేవతలకైననూ లభింప శక్యము కాని భోగముల నిచ్చెదను (56). ఓ సుందరీ! నీవు దేనిని కోరిననూ నేను ఇచ్చెదను. నేను నీ భక్తికి మిక్కిలి ప్రసన్నుడనైతిని. నీకు ఈ యరానిది లేదు (57).

నందీశ్వర ఉవాచః

> ఇతి బ్రువతి గౌరీశే శంకరే భక్త వత్సలే ।
> మహానందా చ సా వేశ్యా శంకరం ప్రత్య భాషత ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

భక్త వత్సలుడు, గౌరీపతియగు శంకరుడిట్లు పలుకగా వేశ్యయగు ఆ మహానంద శంకరుని ఉద్దేశించి ఇట్లు బదులిడెను (58).

వేశ్యావాచ ।

నమే వాంఛాస్తి భోగేషు భూమౌ స్వర్గే రసాతలే ।
తవ పాదాంబుజస్పర్శాదన్యత్ కించిన్న కామయే ॥
యే మే భృత్యాశ్చ దాస్యశ్చ యే వాన్యే మమ బాంధవాః ।
సర్వే త్వద్దర్శనపరాస్త్వయి సన్న్యస్తవృత్తయః ॥
సర్వానేతాన్మయా సార్ధం నినీయాత్మపరం పదమ్ ।
పునర్జన్మభయం ఘోరం విమోచయ నమోఽస్తుతే ॥

వేశ్య ఇట్లు పలికెను -

నాకు భూలోక, స్వర్గలోక, పాతాళలోకములలోని భోగములయందు కోరిక లేదు. నీ పాదపద్మములను స్పృశించుట కంటె మరియొకదానిని నేను కోరుటలేదు (59). నా సేవకులు, దాసీలు మరియు నా ఇతరబంధువులు అందరు కూడా నీ యందు లగ్నమైన మనస్సు గలవారై నీ దర్శనము కొరకు తహతహలాడుచున్నారు (60), నాతో సహా వీరినందరినీ నీ పరమపదమునకు గొనిపోయి ఘోరమగు పునర్జన్మ భయమునుండి విముక్తిని కలిగించుము. నీకు నమస్కారమగుగాక! (61)

నందీశ్వర ఉవాచ ।

తతస్స తస్యా వచనం ప్రతినంద్య మహేశ్వరః ।
తాస్సర్వాశ్చ తయా సార్ధం నినాయ స్వం పరం పదమ్ ॥
వైశ్యనాథావతారస్తే వర్ణితః పరమో మయా ।
మహానందాసుఖకరో భక్తానంద ప్రదస్సదా ॥
ఇదం చరిత్రం పరమం పవిత్రం సతాం చ సర్వప్రదమాశు దివ్యమ్ ।
శివావతారస్య విశాంపతేర్మహానందా మహాసౌఖ్యకరం విచిత్రమ్ ॥
ఇదం యశ్శృణుయాద్భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
చ్యవతే న స్వధర్మాత్స పరత్ర లభతే గతిమ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం వైశ్యనాథా వతారవర్ణనం నామ షడ్వింశోఽధ్యాయః (26).

నందీశ్వరుడిట్లు పలికెను -

తరువాత ఆ మహేశ్వరుడు ఆమె పలుకుల నభినందించి ఆమెతో బాటు వారినందరినీ కూడా తన పరమపదమునకు గొనిపోయెను (62). మహానందకు సుఖమును కలిగించినది, భక్తులకు సదా ఆనందమునిచ్చునది, శ్రేష్ఠమైనది అగు వైశ్యనాథావతారమును నేను నీకు వర్ణించితిని (63). ఈ దివ్య చరిత్రము పరమపవిత్రమైనది, మరియు సత్పురుషులకు శీఘ్రముగా సర్వమును ఇచ్చునది. శివుని ఈ విచిత్రమగు వైశ్యనాథావతారము మహానందకు మహాసౌఖ్యమునను్గ్రహించినది (64). ఎవడైతే దీనిని భక్తితో వినునో, లేదా మనస్సును లగ్నము చేసి వినిపించునో, వాడు తన ధర్మమునుండి పతితుడు కాడు. మరియు దేహత్యాగానంతరము ఉత్తమగతిని పొందును (65).

శ్రీ శివమహా పురాణములోని శతరుద్ర సంహితయందు వైశ్య నాథావతార వర్ణనమనే ఇరువది ఆరవ అధ్యాయము ముగిసినది (26).

27- ద్విజేశ్వరావతారము

నందీశ్వర ఉవాచః

శృణు తాత ప్రవక్ష్యామి శివస్య పరమాత్మనః ।
ద్విజేశ్వరావతారం చ సశివం సుఖదం సతామ్ ॥
యః పూర్వం వర్ణితస్తాత భద్రాయుర్నృపసత్తమః ।
యస్మిన్నృష భరూపేణానుగ్రహం కృతవాన్ శివః ॥
తద్ధర్మస్య పరీక్షార్థం పునరావిర్బభూవ సః ।
ద్విజేశ్వర స్వరూపేణ తదేవ కథయామ్యహమ్ ॥
ఋషభస్య ప్రభావేణ శత్రూన్ జిత్వా రణే ప్రభుః ।
ప్రాప్తసింహాసనస్తాత భద్రాయుస్సంబభూవ హ ॥
చంద్రాంగదస్య తనయా సీమంతిన్యాశ్శుభాంగజా ।
పత్నీ తస్యా భవద్ధృష్మాన్ సుసాధ్వీ కీర్తి మాలినీ ॥
స భద్రాయుః కదాచిత్స్వప్రియయా గహనం వనమ్ ।
ప్రావిశత్సం విహారార్థం వసంతసమయే మునే ॥
అథ తస్మిన్ వనే రమ్యే విజహార స భూపతిః ।
శరణాగత పాలిన్యా తయా స్వప్రియయా సహ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

వత్సా! వినుము. పరమాత్మ యగు శివుడు పార్వతితో గూడి, సత్పురుషులకు సుఖమునొసంగు ద్విజేశ్వరావతారమును దాల్చిన గాథను చెప్పెదను (1). వత్సా! భద్రాయుడను నృపశ్రేష్ఠుని గూర్చి, శివుడు ఆయనపై ఋషభరూపముతో అనుగ్రహమును చూపిన వృత్తాంతమును పూర్వము వర్ణించి యుంటిని (2). ఆయన ఆతని ధర్మమును పరీక్షించుటకై మరల ద్విజేశ్వరరూపముతో అవతరించెను. ఆ వృత్తాంతమును నేను నీకు చెప్పుచున్నాను (3). వత్సా! భద్రాయు మహారాజు ఋషభుని ప్రభావముచే యుద్ధములో శత్రువులను జయించి సింహాసనము నధిష్ఠించెను (4). సీమంతినీ చంద్రాంగదుల కుమార్తె, శుభలక్షణములు గలది, గొప్ప సాధ్వి యగు కీర్తిమాలిని ఆతనికి భార్య ఆయెను. ఓయీ బ్రహ్మన్ ! (5) మహర్షీ! ఒకనాడు ఆ భద్రాయుడు తన ప్రియురాలితో గూడి వసంత కాలములో విహారముకొరకై దట్టమగు అడవిలో ప్రవేశించెను (6). శరణు జొచ్చినవారిని రక్షించే స్వభావము గల ఆ తన ప్రియురాలితో గూడి ఆ రాజు ఆ సుందరమగు వనములో విహరించెను (7).

అథ తద్ధర్మదృఢతాం ప్రతీక్షన్ పరమేశ్వరః ।

లీలాం చకార తత్రైవ శివయా సహ శంకరః ॥

శివా శివశ్చ భూత్వైతౌ తద్వనే ద్విజదంపతీ ।

వ్యాఘ్రం మాయామయం కృత్వాత ఆవిర్భూతౌ నిజలీలయా ॥

అథా విదూరే తస్యైవ ద్రవంతౌ భయవిహ్వలౌ ।

అన్వీయమానౌ వ్యాఘ్రేణ రుదంతౌ తౌ బభూవతుః ॥

అథ విద్ధౌ చ తౌ తాత భద్రాయుస్స మహీపతిః ।

దదర్శ క్రందమానౌ హి శరణ్యః క్షత్రియర్షభః ॥

అథ తౌ మునిశార్దూల స్వమాయాద్విజదంపతీ ।

భద్రాయుషం మహారాజమూచతుర్భయ విహ్వలౌ ॥

అపుడు రాజు యొక్క ధర్మదృఢత్వమును చూడగోరి పరమేశ్వరుడగు శంకరుడు పార్వతీ దేవితో గూడి అచటనే ఒక లీలను నెరవెను (8). పార్వతీ పరమేశ్వరులు బ్రాహ్మణ దంపతులుగా మారి ఆ వనములో ఆవిర్భవించిరి. వారు తమ లీలచే మాయారూపమగు పెద్దపులిని సృష్టించిరి (9). వారు ఆ పులికి కొద్ది దూరములో మాత్రమే ఉండి దానిచే తరుమబడుచున్నవారై భయముతో కంగారుపడుతూ దుఃఖిస్తూ పరుగెత్తుచుండిరి (10). పెద్దపులి వారిని సంహరించుటకై తరుముచుండగా వారు బిగ్గరగా అరచుచుండిరి. శరణు జొచ్చిన వారిని రక్షించే వీరక్షత్రియుడగు ఆ భద్రాయు మహారాజు వారిని గాంచెను. ఓ వత్సా ! (11) మహర్షీ ! అపుడు తమ మాయచే బ్రాహ్మణ దంపతుల రూపములో నున్న వారిద్దరు భయముచే దుఃఖించుచున్నవారై భద్రాయు మహారాజుతో నిట్లనిరి (12).

ద్విజదంపతీ ఊచతుః ।

పాహి పాహి మహారాజ నావు భో ధర్మవిత్తమ ।

ఏష ఆయాతి శార్దూలో జ గ్ధుమావాం మహాప్రభో ॥

ఏష హింస్రః కాలసమః సర్వప్రాణి భయంకరః ।

యావన్న ఖాదతి ప్రాప్య తావన్నౌ రక్ష ధర్మవిత్ ॥

బ్రాహ్మణ దంపతులిట్లు పలికిరి -

మహారాజా! మమ్ములనిద్దరినీ రక్షింపుము. నీవు ధర్మవేత్తలలో శ్రేష్ఠుడవు. ఓ మహాప్రభూ! ఈ పెద్దపులి మమ్ములనిద్దరినీ తినివేయుటకై మీదకు వచ్చుచున్నది (13). యమునితో సమముగా సర్వప్రాణులకు భయమును గొల్పు ఈ క్రూరమృగము మమ్ములను తినివేయు లోపులో, ధర్మవేత్తవగు నీవు వచ్చి మమ్ములనిద్దరినీ రక్షింపుము (14).

నందీశ్వర ఉవాచః

ఇత్థమాక్రందితం శ్రుత్వా తయోశ్చ నృపతీశ్వరః ।
అతిశీఘ్రం మహావీరస్స యావద్ధనురాదదే ॥
తావదభ్యేత్య శార్దూల స్వర మాణోఽతిమాయికః ।
స తస్య ద్విజవర్యస్య మధ్యే జగ్రాహ తాం వధూమ్ ॥
హే నాథ నాథ హే కాంత హా శంభో హా జగద్గురో ।
ఇతి రోరూయమానాం తాం వ్యాఘ్రో జగ్రాస భీషణః ॥
తావత్స రాజా నిశితైర్భల్లై ర్వ్యా ఘ్ర మతాడయత్ ।
న స తైర్వ్యథే కించిత్ గిరీంద్ర ఇవ వృష్టిభిః ॥
సశార్దూలో మహాసత్వో రాజ్ఞ స్సైరకృత వ్యథః ।
బలాదాకృష్య తాం నారీ మపాక్రామత సత్వరః ॥
వ్యాఘ్రేణాపహృతాం నారీం వీక్ష్య విప్రోఽతి విస్మితః ।
లౌకికీం గతిమాశ్రిత్య రురోదాతి ముహుర్ముహుః ॥
రుదిత్వా చిరకాలం చ స విప్రో మాయయే శ్వరః ।
భద్రాయుషం మహీపాలం ప్రోవాచ మదహారకః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

వారిద్దరి ఈ ఆర్తనాదమును విని మహావీరుడగు ఆ మహారాజు మహావేగముతో ధనస్సును తీసుకొనెను (15). కాని ఇంతలోనే మాయామయమగు ఆ పెద్దపులి వేగముగా వచ్చి మహారాజునకు, బ్రాహ్మణోత్తమునకు మధ్యలోనున్న ఆతని భార్యను ఎత్తుకొని పోయెను (16). హే నాథా! నాథా ! ప్రియా! హే శంభూ! హే జగద్గురూ! అని కేకలు పెడుతూ ఏడ్చుచున్న ఆమెను ఆ భయంకరమగు పెద్దపులి భక్షించివేసెను (17). అదే సమయములో ఆ రాజు వాడి బాణములతో పులిని కొట్టెను. కాని వర్షధారలు పర్వతమునకు వలె, ఆ బాణములు పెద్ద పులికి లేశమైననూ వ్యథను కలిగించలేదు (18). మహాబలము గల ఆ పెద్దపులి రాజుయొక్క బాణములను లెక్క చేయకుండగా శీఘ్రముగా ఆ యువతిని బలాత్కారముగా లాగుకొనుచూ, అక్కడనుండి వెడలెను (19). పెద్దపులి తన భార్యను అపహరించుచుండగా గాంచి, ఆ బ్రాహ్మణుడు మిక్కిలి ఆశ్చర్యమును పొందెను. ఆ శివుడు లోకపు పోకడ ననుసరించి అనేక పర్యాయములు బిగ్గరగా రోదిల్లెను (20). గర్వమునడంచువాడగు శివుడు మాయచే ఆ బ్రాహ్మణరూపములో నున్నవాడై చిరకాలము దుఃఖించి భద్రాయుష మహారాజుతో నిట్లనెను (21).

ద్విజేశ్వర ఉవాచః

రాజన్ క్వ తే మహాస్త్రాణి క్వతే త్రాణం మహద్ధనుః ।
క్వ తే ద్వాదశ సాహస్రమహా నా గాయుతం బలమ్ ॥
కిం తే ఖడ్గేన శంఖేన కిం తే మంత్రాస్త్ర విద్యయా ।
కిం సత్త్వేన మహాస్త్రాణాం కిం ప్రభావేణ భూయసా ॥
తత్సర్వం విఫలం తం యచ్చాన్యత్త్వయి తిష్ఠతి ।
యస్త్వం వనౌకసాం ఘాతం న నివారయితుం క్షమః ॥
క్షత్రస్యాయం పరో ధర్మో క్షతాచ్చ పరిరక్షణమ్ ।
తస్మిన్ కులో చితే ధర్మే నష్టే త్వ జ్జీవితేన కిమ్ ॥
ఆర్తానాం శరణాప్తానాం త్రాణం కుర్వంతి పార్థివాః ।
ప్రాణైరర్థైశ్చ ధర్మజ్ఞాస్తద్వినా చ మృతో పమాః ॥
ఆర్తత్రాణ విహీనానాం జీవితాన్మరణం వరమ్ ।
ధనినాం దానహీనానాం గార్హ స్థ్యాద్భిక్షుతా వరమ్ ॥
వరం విషాశనం ప్రాజ్ఞైర్వరమగ్ని ప్రవేశనమ్ ।
కృపణానామనాథానాం దీనానామ పరక్షణాత్ ॥

ద్విజేశ్వరుడిట్లు పలికెను –

ఓ రాజా! నీ గొప్ప అస్త్రములు ఎక్కడనున్నవి? ఇతరులను రక్షించే నీ గొప్ప ధనస్సు ఏది? పన్నెండు వేల పెద్ద ఏనుగులతో సమానమగు నీ బలము ఎక్కడ? (22) నీ వద్దనున్న ఖడ్గముతో గాని, శంఖముతో గాని, మంత్రములతో గాని, అస్త్ర విద్యతో గాని, అస్త్రముల ప్రభావముతో గాని, గొప్ప మహిమతో గాని ప్రయోజనమేమి గలదు? (23) అది అంతయూ వ్యర్థమైనది. ఇవి గాక ఇంకనూ నీవద్ద విద్యలు ఉన్నచో అవి కూడ వ్యర్థమైనవి. ఏలయన, నీవు వనములో నివసించువారిని ఆపదనుండి రక్షించలేకపోతివి (24). ఆపదలో నున్న వారిని రక్షించుట క్షత్రియులకు శ్రేష్ఠమగు ధర్మము. కులోచితమగు ఆ ధర్మము నశించిన తరువాత నీవు జీవించి ఉపయోగమేమున్నది ? (25) ఆపదలోనుండి శరణు జొచ్చినవారిని ధర్మమునెరింగిన రాజులు తమ ప్రాణములను మరియు సంపదలను బలిపెట్టియైననూ రక్షించెదరు. అట్లు రక్షించనివారు మరణించిన వారితో సమానమగుదురు (26). కష్టములో నున్న వారిని రక్షించలేని జీవితము కంటె మరణము శ్రేష్ఠము. ధనము ఉండియు దానము చేయని గృహస్థాశ్రమము కంటే బిచ్చమెత్తుకొనుట మేలు (27). దీనులను, అనాథలను రక్షించలేక పోయినచో, ప్రాజ్ఞుడగు రాజు విషమును మ్రింగి లేక అగ్నిలో ప్రవేశించి మరణించుట మేలు అగును (28).

నందీశ్వర ఉవాచః

ఇత్థం విలపితం తస్య స్వవీర్యస్య చ గర్హణమ్ ।
నిశమ్య నృపతి శోకాదాత్మన్యేవ మచింతయత్ ॥
అహో మే పౌరుషం నష్టమద్య దైవవిపర్యయాత్ ।
అద్య కీర్తిశ్చ మే నష్టా పాతకం ప్రాప్తముత్కటమ్ ॥
ధర్మః కులో చితో నష్టో మందభాగ్యస్య దుర్మతేః ।
నూనం మే సంపదో రాజ్యమాయుష్యం క్షయమేష్యతి ॥
అద్య చైనం ద్విజన్మానం హతదారం శు చార్దితమ్ ।
హతశోకం కరిష్యామి దత్వా ప్రాణానపి ప్రియాన్ ॥
ఇతి నిశ్చిత్య మనసా స భద్రాయుర్నృపోత్తమః ।
పతిత్వా పాదయోస్తస్య బిభాషే పరి సాంత్వయన్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

తన పరాక్రమమును నిందిస్తూ ఆ బ్రాహ్మణుడు దుఃఖించుటను గాంచి ఆతని మాటలను విని ఆ రాజు శోకముతో తన మనస్సులో నిట్లు తలంచెను (29). అయ్యో! దైవము ప్రతికూలించుటచే ఈనాడు నా పౌరుషము, కీర్తి నశించి, ఘోరమగు పాపము చుట్టుకున్నది (30). దురదృష్టవంతుడను, దుర్బుద్ధిని అగు నా క్షత్రియకులోచితమగు ధర్మము నశించినది. నా సంపదలు, రాజ్యము, ఆయుర్దాయము నిశ్చయముగా క్షీణించి పోవును (31). ఈనాడు భార్యను పోగొట్టుకొని దుఃఖ పీడితుడైయున్న ఈ బ్రాహ్మణుని నేను మిక్కిలి ప్రియమగు ప్రాణములనర్పించి యైననూ శోకవిముక్తుని చేసెదను (32). ఆ భద్రాయు మహారాజు మనస్సులో నిట్లు నిశ్చయించుకొని ఆ బ్రాహ్మణుని పాదములపై బడి ఓదార్చుచూ నిట్లు పలికెను (33).

భద్రాయురువాచ ।

కృపాం కృత్వా మయి బ్రహ్మన్ క్షత్రబంధౌ హతౌజసి ।
శోకం త్యజ మహాప్రాజ్ఞ దాస్యామ్యద్య తు వాంఛితమ్ ॥
ఇదం రాజ్యమియం రాజ్ఞీ మమేదం చ కలేవరమ్ ।
త్వదధీనమిదం సర్వం కిం తేఽభిలషితం వరమ్ ॥

భద్రాయువు ఇట్లు పలికెను -

ఓ బ్రహ్మా! భగ్నమైన పరాక్రమము గల క్షత్రియాధముడనగు నాయందు దయను చూపుము. ఓ మహాబుద్ధిశాలీ ! శోకమును విడిచిపెట్టుము. నీవు కోరిన దానిని ఇపుడే ఇచ్చెదను (34). ఈ రాజ్యము , ఈ మహారాణి, ఈ నా దేహము అన్నీ నీ ఆధీనములో నున్నవి. నీవు ఏమి వరమును కోరుచున్నావు? (35)

బ్రాహ్మణ ఉవాచః

కిమాదర్శేన చాంధస్య కిం గృహైర్భైక్ష్యజీవినః ।
కిం పుస్తకేన మూఢస్య నిస్త్రీ కస్య ధనేన కిమ్ ॥
అతోఽహం హతపత్నీకో భుక్తభోగో న కర్హిచిత్ ।
ఇమాం తవాగ్రమహిషీం కామయే దీయతామితి ॥

బ్రాహ్మణుడిట్లు పలికెను –

గ్రుడ్డివానికి అద్దముతో పనియేమి? భిక్షాటనముతో జీవించు వానికి ఇంటి◌తో పని యేమి? మూర్ఖునకు పుస్తకముతో పనియేమి? భార్యలేని వానికి ధనముతో పనియేమి? (36) నా భార్య అపహరింపబడినది. నేను ఎన్నడైననూ భోగముల ననుభవించలేదు. నేను ఈ నీ పట్టమహిషిని కామించుచున్నాను. ఆమెను నాకు ఇమ్ము (37).

భద్రాయురువాచ ।

దాతా రసాంతవిత్తస్య రాజ్యస్య గజవాజినామ్ ।
ఆత్మదేహస్య కస్యాపి కలత్రస్య న కర్హిచిత్ ॥
పరదారోపభోగేన యత్పాపం సముపార్జితమ్ ।
న తత్ క్షాలయితుం శక్యం ప్రాయశ్చిత్త శతైరపి ॥

భద్రాయువు ఇట్లు పలికెను –

రాజ్యమును, ఏనుగులను, గుర్రములను, నా దేహమును కూడా ఇచ్చెదను. కాని ఎట్టి పరిస్థితులలోనైననూ, ఎవనికైననూ భార్యను ఈయను (38). పరభార్యా సంభోగమువలన లభించే పాపమును వందప్రాయశ్చిత్తములైననూ క్షాళన చేయజాలవు (39).

బ్రాహ్మణ ఉవాచః

ఆస్తాం బ్రహ్మవధం ఘోరమపి మద్య నిషేవణమ్ ।
తపసా విధమిష్యామి కిం పునః పారదారికమ్ ॥
తస్మా త్త్వయచ్ఛ భార్యాం స్వామిమాం కామో నమేఽ పరః ।
అరక్షణాద్భయార్తానాం గంతాసి నిరయం ధ్రువమ్ ॥

బ్రాహ్మణుడిట్లు పలికెను –

ఆ విషయమును అట్లు ఉండనిమ్ము. భయంకరమగు బ్రహ్మహత్యాపాపమును, మద్యపాన పాపమును నేను తపశ్శక్తిచే నశింపచేయగలను. పరదారా భిగమనము గురించి చెప్పునది యేమున్నది? (40) కావున, నీ ఈ భార్యను నాకు ఇమ్ము. నాకు మరియొక కోరిక లేదు. భయపీడితులైన వారిని రక్షించని నీవు నరకమును పొందుట నిశ్చయము (41).

నందీశ్వర ఉవాచః

ఇతి విప్రగిరా భీతశ్చింత యామాస పార్థివః ।
అరక్షణాన్మహాపాపం పత్నీదానం తతో వరమ్ ॥
అతః పత్నీం ద్విజాగ్ర్యాయ దత్వా నిర్ముక్తకిల్బిషః ।
సద్యో వహ్నిం ప్రవేక్ష్యామి కీర్తిశ్చ విదితా భవేత్ ॥
ఇతి నిశ్చిత్య మనసా సముజ్జ్వాల్య హుతాశనమ్ ।
తమాహూయ ద్విజం చక్రే పత్నీదానం సహోదకమ్ ॥
స్వయం స్నాతశ్శుచిర్భూత్వా ప్రణమ్య విబుధేశ్వరాన్ ।
తమగ్నిం త్రిః పరిక్రమ్య శివం దధ్యౌ సమాహితః ॥
తమథాగ్నిం పతిష్యంతం స్వపదాసక్త చేతసమ్ ।
ప్రత్య షేధత విశ్వేశః ప్రాదుర్భూతో ద్విజేశ్వరః ॥
తమీశ్వరం పంచముఖం త్రినేత్రం పినాకినం చంద్రకలావతంసమ్ ।
ప్రలంబపింగాసు జటాకలాపం మధ్యాహ్న సద్భాస్కర కోటి తేజసమ్ ॥
మృణాల గౌరం గజచర్మవాససం గంగా తరంగోక్షిత మౌలి దేశకమ్ ।
నాగేంద్రహారావలి కంఠ భూషణం కిరీట కాంచ్యంగద కంకణోజ్జ్వలమ్ ॥
శూలాసిఖట్వాంగ కుఠారచర్మమృగా భయాష్టాంగ పినాకహస్తమ్ ।
వృషపరిస్థం శితికంఠ భూషణం ప్రోద్భూతమ గ్రే నృపతి ర్దదర్శ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ బ్రాహ్మణుని ఈ వచనములకు భయపడిన మహారాజు ఇట్లు తలపోసెను: ఆమెను రక్షించలేకపోవుట మహాపాపము. కావున భార్యను సమర్పించుటయే మేలు (42). కావున భార్యను ఈ బ్రాహ్మణ శ్రేష్ఠునకు సమర్పించి, నేను పాపము నుండి విముక్తిని పొంది, వెనువెంటనే అగ్నిలో ప్రవేశించెదను. నా కీర్తి నలుదెసలయందు వ్యాపించగలదు (43). అతడిట్లు మనస్సులో నిశ్చయించుకొని, అగ్నిని ప్రజ్వరిల్ల జేసి, ఆ బ్రాహ్మణుని పిలిచి, నీటిని వదలి భార్యను సమర్పించెను (44).. ఆయన అపుడు తాను స్నానము చేసి శుచియై శ్రేష్ఠులగు విద్వాంసులకు ప్రణమిల్లి మనస్సును శివునిపై ఏకాగ్రము చేసి అగ్నికి ముమ్మారు ప్రదక్షిణము చేసెను (45). తన పాదములయందు మనస్సును లగ్నము చేసి అగ్నిలో పడబోవుచున్న ఆ మహారాజును, బ్రాహ్మణ శ్రేష్ఠుని రూపములో నున్న విశ్వేశ్వరుడు ఆవిర్భవించి పట్టుకొని నిలిపివేసెను (46). అయిదు మోములవాడు, మూడు కన్నులవాడు, పినాకమనే ధనస్సును ధరించినవాడు, చంద్రవంకయే శిరోభూషణముగా గలవాడు, వ్రేలాడే పింగవర్ణముగల సుందరమైన జటా జూటము గలవాడు, కోటి ప్రచండ మధ్యాహ్న సూర్యులతో సమమగు కాంతి గలవాడు (47), తామరతూడువలె గౌరవర్ణము గలవాడు, గజ చర్మమును వస్త్రముగా దాల్చినవాడు, గంగా తరంగములతో తడుపబడుచున్న శిరోభాగము

గలవాడు, అనేక సర్పములను కంఠహారములుగా ధాల్చినవాడు, కిరీటము కాంతి అంగదములు మరియు కంకణములతో వెలిగిపోవుచున్నవాడు (48), శూలము ఖడ్గము ఖట్వాంగము గొడ్డలి డాలు మృగము అభయముద్ర వరదముద్ర మరియు పినాకము అనువాటిని చేతులలో ధాల్చిన వాడు, వృషభము నధిష్ఠించి యున్నవాడు, తెల్లని కంఠాభరణములు గలవాడు అగు ఈశ్వరుడు తన ఎదుట ఆవిర్భవించగా ఆ మహారాజు గనెను (49).

తతోంబరాద్భుతం పేతుర్దివ్యాః కుసుమవృష్టయః ।
ప్రణేదుర్దేవతూర్యాణి దేవ్యశ్చ ననృతుర్జగుః ॥
తత్రాజగ్ముస్స్తూయమానా హరిర్బ్రహ్మా తథా సురాః।
ఇంద్రాదయో నారదాద్యా మునయశ్చాప రేఽపి చ ॥
తదోత్సవో మహానాసీత్తత్ర భక్తి ప్రవర్ధనః ।
సతి పశ్యతి భూపాలే భక్తి నమ్రీకృతాంజలౌ ॥
తద్దర్శ నానంద విజృంభితాశయః ప్రవృద్ధబాష్పాంబు లిప్త గాత్రః ।
ప్రహృష్టరోమా స హి గద్గదాక్షరస్తుష్టావ గీర్భిర్ముకులీ కృతాంజలిః ॥
తతస్స భగవాన్ రాజ్ఞా సంస్తుతః పరమేశ్వరః ।
ప్రసన్నస్సహ పార్వత్యా తమువాచ దయానిధిః ॥
రాజంస్తే పరితుష్టోఽహం భక్త్యా త్వద్ధర్మతోఽధికమ్ ।
వరం బ్రూహి సపత్నీకం ప్రయచ్ఛామి న సంశయః ॥
తవ భావ పరీక్షార్థం ద్విజో భూత్వాహమాగతః ।
వ్యాఘ్రేణ యా పరిగ్రస్తా సాక్షాద్దేవీ శివా హి సా ॥
వ్యాఘ్రో మాయామయో యస్తే శరైరక్షతవిగ్రహః ।
ధీరతాం ద్రష్టుకామస్తే పత్నీం యాచితవానహమ్ ॥
ఇత్యాకర్ణ్య ప్రభోర్వాక్యం స భద్రాయుర్మహీపతిః ।
పునః ప్రణమ్య సంస్తూయ స్వామినం నతకోఽబ్రవీత్ ॥

అపుడు ఆకాశమునుండి దివ్యమగు పుష్పవృష్టి కురిసినది. దేవదుందుభులు మ్రోగినవి. దేవతాస్త్రీలు గానము చేసి నాట్యమాడిరి (50). విష్ణువు, బ్రహ్మ, ఇంద్రాది దేవతలు, నారదదాది మహర్షులు మరియు ఇతరులు కూడ స్తోత్రములను చేయుచూ అచటకు విచ్చేసిరి (51). అపుడు భక్తితో వినయముతో చేతులను జోడించి మహారాజు చూచుచుండగా అచట భక్తిని పెంపొందింప చేయు గొప్ప ఉత్సవము జరిగెను (52). శివుని దర్శనమువలన కలిగిన ఆనందముతో నిండియున్న హృదయము గలవాడు, కళ్లవెంబడి జారిన ఆనందబాష్పములతో తడిసిన అవయవములు గలవాడు, రోమాంచము గద్గదమగు కంఠము గలవాడునగు ఆ రాజు చేతులను జోడించి వాక్కులతో భగవానుని స్తుతించెను (53). పార్వతీ సమేతుడు, దయాసముద్రుడు,

పరమేశ్వరుడునగు శివభగవానుడు రాజు యొక్క స్తోత్రముచే మిక్కిలి ప్రసన్నుడై అపుడాతనితో నిట్లనెను (54). ఓ రాజా! నీ భక్తికి, నీ ధర్మబుద్ధికి నేను చాల సంతసించితిని.. భార్యతో గూడి వరమును కోరుకొనుము. నిస్సందేహముగా నిచ్చెదను (55). నేను నీ హృదయమును పరీక్షించుట కొరకై బ్రాహ్మణవేషములో వచ్చితిని. పెద్దపులిచే అపహరింపబడిన యువతి సాక్షాత్తుగా పార్వతియే (56). ఆ పెద్దపులి మాయచే సృష్టింపబడినది. అందువలననే, నీ బాణములు దానికి హానిని చేయలేక పోయినవి. నేను నీ ధైర్యమును పరీక్షింపగోరి, నీ భార్యను ఇమ్మని అడిగితిని (57). ఆ భద్రాయు మహారాజు శివప్రభుని ఈ మాటలను విని, మరల ఆ ప్రభునికి ప్రణమిల్లి చక్కగా స్తుతించి ఇట్లు పలికెను (58).

భద్రాయురువాచ ।

ఏక ఏవ వరో నాథ యద్భవాన్ పరమేశ్వరః ।
భవతాపప్రతప్తస్య మమ ప్రత్యక్షతాం గతః ॥
యద్దదాసి పునర్నాథ వరం స్వకృపయా ప్రభో।
వృణేఽహం పరమం త్యక్తో వరం హి వరదర్శభాత్ ॥
వజ్రబాహుః పితా మే హి సపత్నీకో మహేశ్వర ।
సపత్నీకస్త్వహం నాథ సదా త్వత్పాదసేవకః ॥
వైశ్యః పద్మాకరో నామ తత్పుత్రస్సునయాభిధః ।
సర్వానేతాన్మహేశాన సదా త్వం పార్శ్వగాన్ కురు ॥

భద్రాయువు ఇట్లు పలికెను -

ఓ నాథా! సంసార తాపముచే పీడితుడనై యున్న నా యెదుట పరమేశ్వరుడవగు నీవు ప్రత్యక్షమైతివి. ఇదియే శ్రేష్ఠమగు వరము (59). ఓ ప్రభూ! కాని, వరములనిచ్చు వారిలో శ్రేష్ఠుడవగు నీవు నీ కృపతో వరమును ఇచ్చుచున్నావు గాన, నేను నిన్ను ఒకే వరమును కోరెదను (60). ఓ మహేశ్వరా! నా తండ్రియగు వజ్రబాహుడు, నా తల్లి, సర్వదా నీ పాదములను సేవించే నేను, నా భార్య (61), పద్మాకరుడను వైశ్యుడు, సునయుడను ఆతని కుమారుడు అనే ఈ ఆర్గురినీ సర్వదా నీ ప్రక్కన ఉండు వారినిగా అనుగ్రహించుము (62).

నందీశ్వర ఉవాచః

అథ రాజ్ఞీ చ తత్పత్నీ ప్రమత్తా కీర్తి మాలినీ ।
భక్త్యా ప్రసాద్య గిరిశం యయాచే వరముత్తమమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

తరువాత ఆతని భార్య, మహారాణియగు కీర్తిమాలిని మిక్కిలి ఆనందించినదై భక్తితో శివుని ప్రసన్నము చేసుకొని ఉత్తమమగు వరమును కోరెను (63).

రాజ్ఞ్యువాచ।

చంద్రాంగదో మమ పితా మాతా సీమంతినీ చ మే ।

తయోర్యాచే మహాదేవ త్వత్పార్శ్వే సన్నిధిం ముదా ॥

రాణి ఇట్లు పలికెను -

ఓ మహాదేవా! నా తండ్రియగు చంద్రాంగదునకు, తల్లియగు సీమంతినికి నీ సన్నినిధిలో నీ ప్రక్కన ఆనందముగా ఉండే వరమును ఇమ్మని కోరుచున్నాను (64).

నందీశ్వర ఉవాచః

ఏవమస్త్వితి గౌరీశః ప్రసన్నో భక్తవత్సలః ।
తయోః కామవరం దత్త్వా క్షణాదంతర్హితోఽభవత్ ॥
భద్రాయురపి సుప్రీత్యా ప్రసాదం ప్రాప్య శూలినః ।
సహితః కీర్తి మాలిన్యా బుభుజే విషయాన్ బహూన్ ॥
కృత్వా వర్షాయుతం రాజ్యమవ్యాహత పరాక్రమః ।
రాజ్యం నిక్షిప్య తనయే జగామ శివసన్నిధిమ్ ॥
చంద్రాంగదోఽపి రాజేంద్రో రాజ్ఞీ సీమంతినీ చ సా ।
భక్త్యా సంపూజ్య గిరిశం జగ్మతుశ్శాంభవం పదమ్ ॥
ద్విజేశ్వరావతారస్తే వర్ణితః పరమో మయా ।
మహేశ్వరస్య భద్రాయు పరమానందదః ప్రభో ॥
ఇదం చరిత్రం పరమం పవిత్రం శివావతారస్య పవిత్రకీర్తేః ।
ద్విజేశసంజ్ఞస్య మహాద్భుతం హి శృణ్వన్ పఠన్ శంభుపదం ప్రయాతి ॥
య ఇదం శృణుయాన్నిత్యం శ్రావయేద్వా సమాహితః ।
న చ్యోతతి స్వధర్మాత్స పరత్ర లభతే గతిమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం ద్విజే శ్వరావతార
వర్ణనం నామ సప్తవింశోఽధ్యాయః (27).

నందీశ్వరుడిట్లు పలికెను -

మన భక్తవత్సలుడగు పార్వతీపతి ప్రసన్నుడై 'అటులనే యగుగాక!' అని పలికి, వారు కోరిన వరములనిచ్చి, క్షణములో అంతర్ధానమును చెందెను (65). భద్రాయువు పరమేశ్వరుని అనుగ్రహమును పొంది, కీర్తిమాలినితో కలిసి అనేక భోగములను మిక్కిలి ప్రీతితో అనుభవించెను (66). ఎదురులేని పరాక్రమముగల ఆ మహారాజు పదివేల సంవత్సరముల కాలము రాజ్యమేలి, రాజ్యమును కుమారునకు అప్పచెప్పి, శివుని సన్నిధిని చేరుకొనెను (67). చంద్రాంగద మహారాజు మరియు మహారాణి యగు సీమంతిని భక్తితో శివుని పూజించి శంభుని పదమును చేరుకొనిరి (68). ఓ ప్రభూ! భద్రాయువునకు పరమానందమునను గ్రహించిన మహేశ్వరుని శ్రేష్ఠమగు ద్విజేశ్వరావతారమును నేను నీకు వర్ణించితిని (69). పవిత్రమగు కీర్తిగల శివుని ఈ ద్విజేశ్వరావతార గాథ మిక్కిలి పావనము, గొప్ప అద్భుతము. దీనిని విన్నవారు, చదివిన వారు శంభుపదమును పొందెదరు (70). ఎవడైతే దీనిని నిత్యము వినునో, శ్రద్ధతో ఇతరులకు వినిపించునో, అట్టివాడు ధర్మమునుండి పతితుడు గాడు. ఆతడు దేహత్యాగము తరువాత పరమ గతిని పొందును (71).

శ్రీ శివమహా పురాణములోని శతరుద్ర సంహితయందు
ద్విజేశ్వరావతారమనే ఇరవై ఏడవ అధ్యాయము ముగిసినది (27).

28 - యతినాథ హంసావతారములు,

నలు దమయంతుల పూర్వ జన్మ చరితము

నందీశ్వర ఉవాచః

శృణు ప్రాజ్ఞ ప్రవక్ష్యామి శివస్య పరమాత్మనః ।
అవతారం పురానందం యతి నా థాహ్వయం మునే ॥
అర్బుదాచల సంజ్ఞే తు పర్వతే భిల్లువంశజః ।
ఆహుకశ్చ తదభ్యాసే వసతి స్మ మునీశ్వర ॥
తత్పత్నీ హ్యాహుకా నామ బభూవ కిల సువ్రతా ।
ఉభావపి మహాశైవావాస్తాం తౌ శివపూజకౌ ॥
కస్మింశ్చిత్సమయే భిల్ల శ్శివభక్తి రతస్సదా ।
ఆహారార్థం స్వపత్న్యాశ్చ సుదూరం స గతో మునే ॥
ఏతస్మిన్నంతరే తత్ర గేహే భిల్లస్య శంకరః ।
భూత్వా యతివపుస్సాయం పరీక్షార్థం సమాయయౌ ॥
తస్మిన్నవసరే తత్రాజగామ స గృహాధిపః ।
పూజనం చ యతీశస్య చకార ప్రేమతస్సుధీః ॥
తద్భావస్య పరీక్షార్థం పతిరూపస్స శంకరః ।
మహాలీలాకరః ప్రీత్యా భీతం ప్రోవాచ దీనగీః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ ప్రాజ్ఞా! పూర్వము పరమాత్మయగు శివుడు ఆనందదాయకమగు యతినాథావతారమును స్వీకరించెను. ఓ మునీ! ఆ వృత్తాంతమును చెప్పెదను వినుము (1). ఓ మహర్షి అర్బుదాచలమనే పర్వతమునకు సమీపములో భిల్ల వంశమునకు చెందిన ఆహుకుడను వ్యక్తి నివసించెడివాడు (2). ఆతని భార్యయగు ఆహుక మంచి నిష్ఠ గలది. వారిద్దరు శివపూజను చేయు గొప్ప శివభక్తులు (3). ఓ మహర్షీ! సర్వదా శివభక్తి నిష్ఠుడై ఉండే ఆ భిల్లుడు ఒకనాడు తన భార్య యొక్క ఆహారము కోరకు చాల దూరము వెళ్లెను (4). ఇంతలో సాయంకాలమునందు శంకరుడు ఆతనిని పరీక్షించుటకై యతివేషమును దాల్చి ఆ భిల్లుని ఇంటికి వచ్చెను (5). అదే సమయములో గృహయజమాని, పవిత్రమగు బుద్ధి గలవాడునగు ఆ భిల్లుడు అచటకు చేరుకుని ఆ యతీశ్వరుని ప్రేమతో పూజించెను (6). గొప్ప లీలలను ప్రకటించే శంకరుడు ప్రేమతో ఆతని భావమును పరీక్షింపగోరి భయపడిపోతూ ఆ భిల్లునితో దీనవచనములతో నిట్లనెను (7).

యతినాథ ఉవాచః

అద్య స్థలం నివాసార్థం దేహి మే ప్రాతరేవ హి ।

యాస్యామి సర్వథా భిల్ల స్వస్తి స్యాత్తవ సర్వదా ॥

యతినాథుడిట్లు పలికెను –

ఓ భిల్లా! నాకు ఈ నాడు నివసించుటకు చోటును ఇమ్ము. ఉదయమే నేను తప్పని సరిగా నిష్క్రమించెదను. నీకు సర్వకాలములలో శుభమగు గాక! (8)

భిల్ల ఉవాచః

సమ్యక్ ప్రోక్తం త్వయా స్వామిన్ శృణు మద్వచనం చతే ।

అతి స్వల్పం స్థలం మే హి స్యాన్నివాసః కథం తవ ॥

భిల్లుడిట్లు పలికెను –

ఓ స్వామీ! మీరు చక్కగా మాటలాడితిరి. కాని నామాటను కూడ వినుడు. నా ఇల్లు చాల చిన్నది. మీరు నివసించుట ఎట్లు సంభవమగును?(9)

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త స్స యతిస్తేన గమనాయ మతిం దధే ।

తావద్భిల్ల్యా వచః ప్రోక్తం స్వామినం సంవిచార్య వై ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

అతడిట్లు పలుకగా, ఆ యతి మరలి పోవుటకు నిశ్చయించుకొనెను. ఇంతలో ఆ భిల్లుని భార్య ఆలోచించి తన భర్తతో నిట్లనెను (10).

భిల్ల్యువాచ ।

స్వామిన్ దేహి యతే స్స్థానం విముఖం కురు మాతిథిమ్ ।

గృహధర్మం విచార్య త్వ మన్యథా ధర్మసంక్షయః ॥

స్థీయతాం తే గృహాభ్యంత స్సుఖేన యతినా సహ ।

అహం బహి స్స్థితిం కుర్యామాయుధాని బృహంత్యపి ॥

భిల్లుని భార్య ఇట్లు పలికెను –

స్వామీ! ఈ యతికి స్థానమునిమ్ము. అతిథి మరలి వెళ్లునట్లు చేయకుము. నీవు గృహస్థధర్మమును గురించి ఆలోచించుము. నీవు అతిథిని ఆదరించనిచో, ధర్మము తొలగిపోవును (11). నీవు ఈ యతితో కలిసి లోపల సుఖముగా నుండుము. నేను గొప్ప ఆయుధములను చేతబట్టి బయట నిలబడి యుండెదను (12).

నందీశ్వర ఉవాచః

తస్యాస్తద్వచనం శ్రుత్వా భిల్లా ధర్మాన్వితం శివమ్ ।
స్వపత్న్యా మనసా తేన భిల్లేన చ విచారితమ్ ॥
స్త్రియం బహిశ్చ నిష్కాస్య కథం స్థేయం మయా గృహే ।
యతేరన్యత్ర గమనమధర్మ కరమాత్మనః ॥
ద్వయమప్యుచితం నైవ సర్వథా గృహమేధినః ।
యద్భావి తద్భవేదేవ మయా స్థేయం గృహాద్బహిః ॥
ఇత్యా గ్రహం తదా కృత్వా గృహాంతస్స్థాప్య తౌ ముదా ।
స్వాయుధాని చ సంస్థాప్య భిల్లోఽ తిష్ఠ ద్గృహాద్బహిః ॥
రాత్రౌ తం పశవః క్రూరా హింసకాస్సము పీడయన్ ।
తేనాపి చ యథా శక్తి కృతో యత్నో మహాంస్తదా ॥
ఏవం యత్నం ప్రకుర్వాణస్స భిల్లో బలవానపి ।
ప్రారబ్ధాత్ప్రేరితైర్హింస్రైర్బలా దాసీచ్చ భక్షితః ॥
ప్రాతరుత్థాయ స యతిర్దృష్ట్వా హింస్రైశ్చ భక్షితమ్ ।
భిల్లం వనేచరం తం వై దుఃఖితో ఽ భూదతీవ హి ॥
దుఃఖితం తం యతిం దృష్ట్వా భిల్లీ సా దుఃఖితాపి హి ।
ధైర్యాత్సుదుఃఖం సంహృత్య వచనం చేదమబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ భిల్లుడు తన భార్యయగు ఆ భిల్లి యొక్క ధర్మయుక్తము శుభకరమునగు ఆ మాటను విని తన మనస్సులో నిట్లు తలపోసెను (13). స్త్రీని బయటకు నెట్టి నేను ఇంటిలోపల ఎట్లు ఉండగల్గుదును? ఈ యతి మరి యొక స్థలమునకు వెడలినచో, నాకు అధర్మము చుట్టుకొనును (14). గృహస్థుడనగు నాకు ఈ రెండు వికల్పములు కూడా ఉచితమైనవి గావు. జరుగవలసినది జరిగితీరును. నేను ఇంటికి బయట నుండెదను (15). ఆతడు ఇట్లు దృఢముగా నిశ్చయించుకొని వారినిద్దరినీ లోపల ఉంచి తాను ఆయుధములను ధరించి ఇంటికి బయటనుండెను (16). రాత్రియందు క్రూర మృగములాతనిని చాల పీడించినవి. అయిననూ ఆతడు యథాశక్తిగా వాటిని ఎదుర్కొనుటలో గొప్ప యత్నమును చేసెను (17). ఆ భిల్లుడు బలవంతుడే అయిననూ, ఈ తీరున ప్రయత్నమును చేసియున్ననూ, ప్రారబ్ధముచే ప్రేరితములైన క్రూరమృగములు బలముగా ఆతనిని భక్షించి వేసినవి (18). ఆ యతి ఉదయమే నిద్రలేచి, ఆ వనవాసియగు భిల్లుడు క్రూరమృగములచే భక్షింపబడుటను గాంచి మిక్కిలి దుఃఖితుడాయెను (19). ఆ భిల్లి తాను స్వయముగా దుఃఖితురాలై యున్ననూ, దుఃఖితుడైయున్న ఆ యతిని గాంచి, ధైర్యముతో తన మహాదుఃఖమును నిలదొక్కుకొని, ఇట్లు పలికెను (20).

ఖిల్ల్యువాచ ।

కిమర్థం క్రియతే దుఃఖం భద్రం జాతం యతోఽధునా ।
ధన్యోఽయం కృతకృత్యశ్చ యజ్జాతో మృత్యురీదృశః ॥
అహం చైనం గమిష్యామి భస్మ భూత్వానలే యతే ।
చితాం కారయ సుప్రీత్యా స్త్రీణాం ధర్మస్సనాతనః ॥
ఇతి తద్వచనం శ్రుత్వా హితం మత్వా స్వయం యతిః ।
చితాం వ్యరచయత్సా హి ప్రవివేశ స్వధర్మతః ॥
ఏతస్మిన్నంతరే సాక్షాత్పురః ప్రాదురభూచ్ఛివః ।
ధన్యే ధన్యే ఇతి ప్రీత్యా ప్రశంసన్ తాం హరోఽబ్రవీత్ ॥

ఖిల్లయువతి ఇట్లు పలికెను -

ఏల దుఃఖించుచుంటిరి? ఇప్పుడు మంగళమే జరిగినది. ఈ విధమగు మృత్యువును పొందిన ఈతడు ధన్యుడు, కృతార్థుడు అయినాడు (21). ఓ యతీ! నేనుకూడా అగ్నిలో బూడిదయై ఈతని వెనుక వెళ్లెదను. మిక్కిలి ప్రీతితో చితిని ఏర్పరుచుడు. ఇది స్త్రీలకు సనాతన ధర్మము (22). ఆమె ఈ మాటలను విని ఆ యతి అట్లు చేయుట హితకరమని తలంచి స్వయముగా చితిని ఏర్పరచగా, ఆమె తన ధర్మమునను సరించి ప్రవేశించెను (23). ఇంతలో ఆమె ఎదుట పాపహారియగు శివుడు స్వయముగా ప్రత్యక్షమై ' ఓ ధన్యురాలా! ధన్యురాలా!' అని ప్రీతితో ప్రశంసించి ఇట్లు పలికెను (24).

హర ఉవాచః

వరం బ్రూహి ప్రసన్నోఽ స్మి త్వదా చరణతోఽన ఘే ।
తవాదేయం న వై కించి ద్వశ్యోఽహం తే విశేషతః ॥

శివుడిట్లు పలికెను -

ఓ పుణ్యాత్మురాలా! నీ ఆచరణచే ప్రసన్నుడనైతిని. వరమును కోరుకొనుము. నీకు ఈయదగని వరము ఏదియూ లేదు. నేను నీకు పూర్ణముగా వశుడనైతిని (25).

నందీశ్వర ఉవాచః

తచ్ఛ్రుత్వా శంభువచనం పరమానంద దాయకమ్ ।
సుఖం ప్రాప్తం విశేషేణ న కించిత్ స్మరణం య యౌ ॥
తస్యాస్తద్గతి మాలక్ష్య సుప్రసన్నో హరోఽభవత్ ।
ఉవాచ చ పునశ్శంభుర్వరం బ్రూహీతి తాం ప్రభుః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

పరమానందమును కలిగించు ఆ శంభుని వచనమును విని ఆమె మహాసుఖమును పొంది, సర్వ్వమును విస్మరించెను (26). ఆమె యొక్క ఆ స్థితిని గాంచి పాపహారియగు శంభు ప్రభుడు మిక్కిలి ప్రసన్నుడై మరల ఆమెతో వరమును కోరుకొనుమని చెప్పి ఇంకనూ ఇట్లు పలికెను (27).

శివ ఉవాచః

అయం యతిశ్చ మద్రూపో హంసరూపో భవిష్యతి ।
పరజన్మని వాం ప్రీత్యా సంయోగం కారయిష్యతి ॥
బిల్లశ్చ వీరసేనస్య నైషధే నగరే వరే ।
మహాన్ పుత్రో నలో నామ భవిష్యతి న సంశయః ॥
త్వం సుతా భీమరాజస్య వైదర్భే నగరేఽనఘే ।
దమయంతీ చ విఖ్యాతా భవిష్యసి గుణాన్వితా ॥
యువాం చోభౌ మిలిత్వా చ రాజభోగం సువిస్తరమ్ ।
భుక్త్వా ముక్తిం చ యోగీంద్రైర్ల ప్సేథౌ దుర్లభాం ధ్రువమ్ ॥

శివుడిట్లు పలికెను -

నా అవతారమైన ఈ యతి మీ మరుజన్మలో హంసరూపమును దాల్చి మీ ఇద్దరికీ ప్రీ్తీ పూర్వకముగా సంధానమును చేయగలడు (28). వీరసేనుని నైషధరాజ్యములో శ్రేష్ఠమగు రాజధాని నగరమునందు ఈ బిల్లుడు ఆ రాజునకు పుత్రుడై జన్మించి, నలుడను పేర ప్రఖ్యాతిని గాంచుననుటలో సందేహము లేదు (29). భీమ రాజు యొక్క విదర్భ దేశరాజధానిలో నీవాతని కుమార్తె వై జన్మించగలవు. ఓ పుణ్యాత్మురాలా! సద్గుణములతో విలసిల్లు నీవు దమయంతి అను పేరుతో ఖ్యాతిని పొందగలవు (30). మీరిద్దరు కలిసి మహారాజభోగముల ననుభవించి యోగీశ్వరులకైె ననూ లభ్యము కాని ముక్తిని నిశ్చయముగా పొందగలరు (31).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా చ స్వయం శంభుర్లింగరూపోఽభవత్తదా ।
తస్మాన్న చలితో ధర్మాదచలేశ ఇతి స్మృతః ॥
స ఖిల్ల ఆహుకశ్చాపి వీరసేనసుతోఽభవత్ ।
నైషధే నగరే తాత నలనామా మహానృపః ॥
ఆహుకా సా మహాఖిల్లీ భీమస్య తనయాఽభవత్ ।
వైదర్భే నగరే రాజ్ఞో దమయంతీతి విశ్రుతా ॥
యతినా థా హ్వాయ స్సోఽ పి హంసరూపోఽభవచ్ఛివః ।
వివాహం కారయామాస దమయంత్యా నలేన వై ॥
పూర్వసత్కారరూపేణ మహాపుణ్యేన శంకరః ।
హంసరూపం విధాయైవ తాభ్యాం సుఖమదాత్ప్రభుః ॥
శివో హంసావతారో హి నానావార్తా విచక్షణః ।
దమయంత్యా నలస్యాపి పరమానంద దాయకః ॥
ఇదం చరిత్రం పరమం పవిత్రం శివావతారస్య పవిత్రకీర్తేః ।
యతీశసంజ్ఞస్య మహాద్భుతం హి హంసాహ్వయస్యాపి విముక్తిదం హి ॥
యతీశబ్రహ్మ హంసా ఖ్యావతార చరితం శుభమ్ ।
శృణుయాచ్ఛ్రావయేద్యో హి స లభేత పరాం గతిమ్ ॥
ఇదమాఖ్యానమనఘం సర్వకామ ఫలప్రదమ్ ।
స్వర్గ్యం యశస్యమాయుష్యం భక్తివర్ధన ముత్తమమ్ ॥
శ్రుత్వైతచ్చరితం శంభోర్యతి హంసస్వరూపయోః ।
ఇహ సర్వ సుఖం భుక్త్వా సోంఽతే శివపురం వ్రజేత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం యతినాథ బ్రహ్మహంసావతార వర్ణనం నామ అష్టావింశోఽధ్యాయః (28).

నందీశ్వరుడిట్లు పలికెను -

శంభుడు ఇట్లు పలికి తాను స్వయముగా అపుడు లింగరూపమును దాల్చెను. ఆ భిల్లుడు ధర్మమును తప్పలేదు గనుక, ఆయనకు అచలేశుడని పేరు కలిగెను (32). ఆహుకుడను ఆ భిల్లుడు నైషధనగరములో వీరసేనుని పుత్రుడై జన్మించెను. వత్సా! ఆతడు మహారాజై నలుడని ప్రఖ్యాతిని గాంచెను (33). ఆహుకయను ఆ మహాభిల్ల యువతి వైదర్భ నగరములో భీమ మహారాజునకు కుమార్తెయై జన్మించి, దమయంతి యను పేరుతో ప్రఖ్యాతిని గాంచెను (34). యతినాథునిగా అవతరించిన ఆ శివుడు కూడా హంసరూపమును దాల్చి దమయంతీ నలుల వివాహమును జరిపించెను (35). పూర్వజన్మలో చేసిన సత్కారము అనే మహాపుణ్యముచే శంకరప్రభుడు హంసరూపమును దాల్చి వారిద్దరికీ సుఖమును కలిగించెను (36). అనేక సందేశములను అందజేయుటలో సమర్థమగు శివుని ఆ హంసావతారము దమయంతీనలులకు పరమానందమును కలిగించెను (37). పవిత్రమగు కీర్తిగల శివుడు యతినాథునిగా, హంసగా అవతరించిన ఈ చరిత్ర పరమ పవిత్రమైనది, ముక్తిని ఇచ్చునది, మరియు మహాద్భుతమైనది (38). యతీశ్వరుడు, మరియు బ్రహ్మ యొక్క హంస అనే ఈ రెండు అవతారముల శుభచరిత్రను ఎవడు వినిపించునో, వాడు పరమగతిని పొందును (39). ఈ వృత్తాంతము పవిత్రమైనది, సర్వకామనలను ఫలములను ఈడేర్చునది, స్వర్గమును కీర్తిని ఆయుర్దాయమును ఇచ్చునది. ఉత్తమమగు ఈ గాథ భక్తిని వర్ధిల్లజేయును (40). శంభుని యతినాథ హంసావతారముల ఈ చరితమును విను వ్యక్తి ఇహలోకములో సుఖములనన్నిటినీ అనుభవించి, మరణించిన పిదప శివుని పదమును పొందును (41).

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు యతినాథ హంసావతార వర్ణనమనే ఇరువది ఎనిమిదవ అధ్యాయము ముగిసినది (28).

29 - కృష్ణ దర్శనావతారము

నందీశ్వర ఉవాచః

సనత్కుమార శంభోస్త్వ వతారం పరమం శృణు ।
నభగజ్ఞానదం కృష్ణ దర్శనాహ్వాయ ముత్తమమ్ ॥
ఇక్ష్వాకు ప్రముఖా ఆసన్ శ్రాద్ధదేవసుతాశ్చ యే ।
నభగస్తత్ర నవమో నాభగస్తత్సుత స్స్మృతః ॥
అంబరీషస్సు తస్తస్య విష్ణు భక్తో బభూవ సః ।
యస్యోపరి ప్రసన్నోఽభూద్దుర్వాసా బ్రహ్మభక్తితః ॥
పితామహోంబరీషస్య నభగో యః ప్రకీర్తితః ।
తచ్చరిత్రం శృణు మునే యస్మై జ్ఞానమదాచ్ఛివః ॥
నభగో మనుపుత్రస్తు పఠనార్థం సుబుద్ధిమాన్ ।
చక్రే గురుకులే వాసం బహుకాలం జితేంద్రియః ॥
ఏతస్మిన్ సమయే తే వా ఇక్ష్వాకు ప్రముఖాస్సుతాః ।
తస్మై భాగమకల్ప్యైవ భేజుర్భాగాన్ని జాన్ క్రమాత్ ॥
స్వం స్వం భాగం గృహీత్వా తే బుభుజూ రాజ్యముత్తమమ్ ।
అవిషాదం మహాభాగా పిత్రాదేశాత్సు బుద్ధయః ॥
స పశ్చాదాగతస్తత్ర బ్రహ్మచారీ గురుస్థలాత్ ।
నభగోఽధీత్య సర్వాశ్చ సాంగోపాంగాశ్రుతీః క్రమాత్ ॥
భ్రాతౄన్ విలోక్య నభగో విభక్తాన్ సకలాన్ని జాన్ ।
దాయార్థీ ప్రాహ తాన్ స్నేహాది క్ష్వాకు ప్రముఖాన్మునే ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ సనత్కుమారా! నభగునకు జ్ఞానమునొసంగిన, కృష్ణ దర్శనమను పేరుగల శంభుని పరమోత్త మావతారమును గూర్చి వినుము (1). శ్రాద్ధదేవుడను మనువునకు ఇక్ష్వాకువు మొదలగు పుత్రులు గలరు. వారిలో నభగుడు తొమ్మిదవవాడు. ఆతని కుమారుడు నాభగుడు (2). విష్ణు భక్తుడగు అంబరీషుడు నాభగుని కుమారుడు. ఆతని బ్రాహ్మణ భక్తిని గాంచి దుర్వాసుడాతనిపై మిక్కిలి ప్రసన్నుడాయెను (3). ఓ మునీ! అంబరీషుని పితామహుడగు నభగునకు శివుడు జ్ఞానమునిచ్చి యుండెను. ఆ వృత్తాంతమును వినుము (4). మనువు యొక్క పుత్రుడగు నభగుడు చాల బుద్ధిమంతుడు. ఆతడు విద్యాభ్యాసము కొరకై చిరకాలము జితేంద్రియుడై గురుకులమునందు నివసించెను (5). ఆ సమయములో ఇక్ష్వాకుడు మొదలగు మిగిలిన సోదరులు ఆతనికి వాటాను ఈయకుండగనే తమ తమ భాగములను పంచుకొనిరి (6). మంచి బుద్ధిమంతులు, మహాత్ములు అగు వారు తండ్రి ఆదేశముచే తమ తమ భాగములను స్వీకరించి దుఃఖము నెరుంగక ఉత్తమమగు రాజ్యమునను భవించిరి (7). బ్రహ్మచారియగు నభగుడు అంగములతో, ఉపాంగములతో గూడిన వేదములనన్నిటినీ క్రమముగా అధ్యయనము చేసి, తరువాత గురుకులమునుండి ఇంటికి విచ్చేసెను (8). ఓ మునీ! నభగుడు తమ తమ భాగముల ననుభవించుచున్న ఇక్ష్వాకువు మొదలగు తన సోదరులను గాంచి, తన వాటాను గోరి వారితో ప్రేమపూర్వకముగా నిట్లు పలికెను (9).

నభగ ఉవాచః

భ్రాతరోఽభక్తకం మహ్యం దాయం కృత్వా యథాతథమ్ ।
సర్వే విభక్తాస్సు ప్రీత్యా స్వదాయార్థా గతాయ చ ॥
తదా విస్మృతమస్మాభిరిదానీం పితరం తవ ।
విభజామో వయం భాగం తం గృహాణ న సంశయః ॥
తచ్ఛ్రుత్వా భ్రాతృవచనం నభగః పరవిస్మృతః ।
తదోపకంఠ మాగత్య పితరం సమభాషత ॥
హే తాత భ్రాతరస్సర్వే త్యక్త్వా మాం వ్యభజంశ్చ తే ।
పఠనార్థం గతశ్చాహం బ్రహ్మచారీ గురోః కులే ॥
తత ఆ గత్య మే పృష్టా దాయదానార్థ మాదరాత్ ।
తే త్వామూచుర్విభాగం మే తదర్థ మహమాగతః ॥

నభగుడిట్లు పలికెను -

సోదరులారా! నాకు వాటాను పంచి యివ్వకుండగనే మీరు అందరు ఆనందముగా సర్వమును పంచుకొనినారు. నేను నా వాటా కొరకు వచ్చితిని (10). అపుడు నీకు వాటాను ఇచ్చుట మాచే విస్మరింపబడినది. ఇపుడు నీవు తండ్రిని నీ భాగముగా స్వీకరింపుము. సందేహము వలదు (11). సోదరుల ఆ మాటను విని నభగుడు మిక్కిలి ఆశ్చర్యమును పొంది తండ్రి వద్దకు వచ్చి ఇట్లు పలికెను (12). ఓ తండ్రీ! బ్రహ్మచారినగు నేను విద్యాభ్యాసముకొరకు గురుకులమునకు వెళ్లియుండగా, సోదరులందరు నన్ను విడిచిపెట్టి వాటాలను పంచుకొనిరి (13). నేను మరలి వచ్చి నా వాటాను ఇమ్మని ప్రేమపూర్వకముగా కోరితిని. నీవు నా వాటాయని వారు చెప్పితిరి. అందుకొరకై నేను నీవద్దకు వచ్చితిని (14).

నందీశ్వర ఉవాచః

తదాకర్ణ్య వచస్తస్య పితా తం ప్రాహ విస్మితః ।
ఆశ్వాస్య శ్రాద్ధదేవస్స సత్య ధర్మరతం మునే ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆతని ఆ మాటలను ఆతని తండ్రియగు శ్రాద్ధదేవుడు విని ఆశ్చర్యపడెను. ఓ మునీ! ఆయన సత్యమునందు ధర్మమునందు నిష్ఠగల తన కుమారుని ఓదార్చి ఇట్లు పలికెను (15).

మనురువాచ ।

తదుక్తం మాద్రృథాస్తాత ప్రతారణకరం హి తత్ ।
న హ్యహం పరమం దాయం సర్వథా భోగసాధనమ్ ॥
తథాపి దాయభావేన దత్తోఽహం తైః ప్రతారిభిః ।
తవ వై జీవనోపాయం వదామి శృణు తత్త్వతః ॥
సత్రమాంగిరసా విప్రాః కుర్వంత్యద్య సుమేధసః ।
తత్ర కర్మణి ముహ్యంతి షష్ఠం షష్ఠమహః ప్రతి ॥
తత్ర త్వం గచ్ఛ నభగ తాన్ సుశంస మహాకవే ।
సూక్తే ద్వే వైశ్వదేవే హి సత్రం శుద్ధం హి తద్భవేత్ ॥
తత్కర్మణి సమాప్తే హి స్వర్యాంతో బ్రాహ్మణాశ్చ తే ।
ధనం దాస్యంతి తే తుష్టాస్స్వసత్రపరిశేషితామ్ ॥

మనువు ఇట్లు పలికెను -

కుమారా! వారు పలికిన మోసపు మాటలను లెక్క చేయకుము. అన్ని విధములుగా అనుభవింపదగిన ఉత్తమమగు దాయభాగము నేను గాను (16). అయిననూ ఆ మోసగాండ్రు నన్ను నీకు దాయభాగరూపములో అప్పజెప్పిరి. నేను నీకు జీవనోపాయమును చెప్పెదను. శ్రద్ధగా వినుము (17). అంగిరోవంశమునందు జన్మించిన ప్రజ్ఞాశాలురగు బ్రాహ్మణులు ఇపుడు సత్రయాగమునను ష్ఠించుచున్నారు. వారు ప్రతి షష్ఠాహస్సు (ఆరవ రోజు) నందు చేయదగిన కర్మ విషయములో మోహమును పొందుచున్నారు (18). ఓ నభగా! నీవు అచటకు .. వెళ్లుము. ఆ మహాయజ్ఞములో వారిని సమీపించి రెండు వైశ్వదేవసూక్తములను చక్కగా పఠించుము. దానివలన ఆ సత్రయాగము సుసంపన్నమగును (19). ఆ కర్మ పూర్తి కాగానే ఆ బ్రాహ్మణులు స్వర్గమునకు వెళ్లబోవుచూ చాల సంతసించిన వారై తమ సత్రయాగములో మిగిలిన ధనమును నీకు ఈయగలరు (20).

నందీశ్వర ఉవాచ:

తదాకర్ణ్య పితుర్వాక్యం నభగస్సత్య సారవాన్ ।
జగామ తత్ర సుప్రీత్యా యత్ర తత్సత్ర ముత్తమమ్ ॥
తదాహః కర్మణి మునే సత్రే తస్మిన్ స మానవః ।
సూకే ద్వే వైశ్వదేవే హి ప్రోవాచ స్పష్టతస్సుధీః ॥
సమాప్తే కర్మణి తతో విప్రా ఆంగిరసాశ్చ తే ।
తస్మై దత్త్వా యయుస్స్వర్గం స్వం స్వం సత్రావశేషితమ్ ॥
తత్తదా స్వీకరిష్యంతం సుసత్ర పరిశేషితమ్ ।
విజ్ఞాయ గిరిశస్సద్య ఆవిర్భూతస్సదూతికృత్ ॥
సర్వాంగ సుందరశ్శ్రమాన్ పురుషః కృష్ణ దర్శనః ।
భావం సమీక్షితుం భాగం దాతుం జ్ఞానం పరం చ తత్ ॥
అథో స శంకరశ్శంభుః పరీక్షాకర ఈశ్వరః ।
ఉవాచోత్తరతోఽభ్యేత్య నభగం తం హి మానవమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

సత్యము యొక్క సారము నెరింగిన నభగుడు తండ్రి యొక్క ఆ మాటను విని, ఉత్తమమగు ఆ సత్రయాగము జరుగుచున్న స్థలమునకు మహానందముతో వెళ్లెను (21). విద్వాంసుడగు ఆ మను పుత్రుడు ఆ దినము యొక్క కర్మ జరుగుచుండగా ఆ సత్రయాగములో రెండు వైశ్వదేవసూక్తములను స్పష్టముగా చెప్పెను (22). ఆ యాగము సమాప్తము కాగానే, ఆ ఆంగిరస బ్రాహ్మణులు సత్రములో మిగిలిపోయిన తమ సంపదను ఆతనికి ఇచ్చి స్వర్గమునకు వెళ్లిరి (23). ఆ గొప్ప సత్రములో మిగిలిపోయిన సంపదనాతడు స్వీకరించుచుండగా, అపుడా విషయమునెరింగి, చక్కని లీలలను ప్రకటించే శివుడు వెంటనే ఆవిర్భవించెను (24). కృష్ణ దర్శనుడను పేరు గలవాడు, సర్వావయవములలో సుందరుడు, శోభాయుకుడు నగు పురుషుని రూపములో శివుడు నభాగుని నిష్ఠను పరీక్షించి ఆతనికి ఉత్తమ జ్ఞానము నొసంగుటకై ఆవిర్భవించెను (25). మంగళకరుడు, పరీక్షలను చేయువాడు, ఈశ్వరుడునగు ఆ శంభుడు అపుడు ఉత్తరమునుండి సమీపించి మనుపుత్రుడగు ఆ నభగునితో నిట్లనెను (26).

ఈశ్వర ఉవాచ:

కస్త్వం గృహ్ణాసి పురుష మమేదం వాస్తుకం వసు ।
ప్రేషితః కేన తత్సర్వం సత్యం వద మమాగ్రతః ॥

ఈశ్వరుడిట్లు పలికెను -

ఓయీ! పురుషా! నీవెవరివి? నీవు నా ఈ వస్తురూపమగు సంపదను ఏల గొని పోవుచుంటివి? నిన్ను పంపినవారెవరు? నా ఎదుట సర్వమును యథార్థముగా చెప్పుము (27).

నందీశ్వర ఉవాచః

త చ్ఛ్రుత్వా తద్వచస్తాత మానవో నభగః కవిః ।

ప్రత్యువాచ వినీతాత్మా పురుషం కృష్ణ దర్శనమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

మనుపుత్రుడు, జ్ఞానియగు నభగుడు ఆ మాటను వినెను. వత్సా! ఆతడు వినయముతో గూడిన మనస్సు గలవాడై కృష్ణ దర్శనుడు అనే ఆ పురుషునికి ఇట్లు బదులిడెను (28).

నభగ ఉవాచః

మమేద మృషిభిర్దత్తం వసు యజ్ఞగతం ఖలు ।

కథం వారయసే మాం త్వం గృహ్ణంతం కృష్ణ దర్శన ॥

నభగుడిట్లు పలికెను –

ఓయీ కృష్ణ దర్శనా (నల్లని కన్నులు గలవాడా)! యజ్ఞములో మిగిలిన ఈ సంపదను నాకు ఋషులు ఇచ్చి యున్నారు. నేను తీసుకొనుచుండగా నీవు నన్నేల వారించుచుంటివి? (29)

నందీశ్వర ఉవాచః

ఆ కర్ణ్య నాభగం వాక్యమిదం సత్యము దీరితమ్ ।

ప్రత్యువాచ ప్రసన్నాత్మా పురుషః కృష్ణ దర్శనః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

నభగుడు పలికిన ఈ సత్యవాక్యమును విని కృష్ణ దర్శనుడను ఆ పురుషుడు ప్రసన్నమగు అంతఃకరణము గలవాడై ఇట్లు బదులిడెను (30).

కృష్ణ దర్శన ఉవాచః

వివాదే ఒ స్మిన్ హి నౌ తాత ప్రమాణం జనకస్తవ ।

యాహి తం పృచ్ఛ స బ్రూయాత్త త్ప్రమాణం తు సత్యతః ॥॥

కృష్ణదర్శనుడిట్లు పలికెను –

వత్సా! మన ఇద్దరి ఈ వివాదమును తీర్చగల యోగ్యుడు నీ తండ్రి. నీవు ఆతని వద్దకు వెళ్లి అడుగుము. ఆతడు ధర్మమును యథాతథముగా చెప్పును (31).

నందీశ్వర ఉవాచః

తదాకర్ణ్య వచస్తస్య నభగో మానవః కవిః ।

ఆగచ్ఛత్పితరం ప్రీత్యా తదుక్తం పృష్టవాన్ మునే ॥

పుత్రోదితం సమాకర్ణ్య శ్రాద్ధదేవస్స వై మనుః ।

స్మృత్వా శివపదాం భోజం ప్రాప్త స్మృతిరువాచ తమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓ మునీ! ఆతని ఆ మాటను విని మనుపుత్రుడు, జ్ఞాని యగు నభగుడు ఆనందముతో తండ్రి వద్దకు వెళ్లి కృష్ణ దర్శనుడు చెప్పిన విధముగా చెప్పెను (32). ఆ శ్రాద్ధదేవమనువు పుత్రుని వచనములను విని శివుని పాదపద్మములను స్మరించి గుర్తునకు తెచ్చుకొని అతనితో నిట్లనెను (33).

మనురువాచ ।

హే తాత శృణు మద్వాక్యం స దేవః పురుషశ్శివః ।

తస్యైవ సకలం వస్తు యజ్ఞప్రాప్తం విశేషతః ॥

అధ్వరోర్వరితం వస్తు రుద్రభాగః ప్రకీర్తితః ।

ఇత్యపి ప్రాజ్ఞవాదో హి కృచి జ్ఞాతస్తదిచ్ఛయా ॥

స దేవ ఈశ్వరస్సర్వం వస్త్వర్హతి న సంశయః ।

యజ్ఞావశిష్టం కిముత పరే తస్యేచ్ఛయా విభోః ॥

అనుగ్రహార్థ మాయాతస్తవ తద్రూపతః ప్రభుః ।

తత్ర త్వం గచ్ఛ నభగ ప్రసన్నం కురు సత్వతః ॥

క్షమాపయ స్వాపరాధం సుప్రణమ్య స్తుతిం కురు ।

సర్వ ప్రభుస్స ఏవేశో యజ్ఞాధీశోఽఖిలేశ్వరః ॥

విష్ణు బ్రహ్మాదయో దేవాస్సిద్ధాస్సర్వర్షయోఽపి హి ।

తదనుగ్రహతస్తాత సమర్థాస్సర్వకర్మణి ॥

కిం బహూక్త్యాత్మజ శ్రేష్ఠ గచ్ఛ తత్రాశు మా చిరమ్ ।

ప్రసాదయ మహాదేవం సర్వథా సకలేశ్వరమ్ ॥

మనువు ఇట్లు పలికెను –

ఓ కుమారా! నా మాటను వినుము. ఆ పురుషుడు శివదేవుడే. జగత్తులోని సర్వవస్తువులు ఆయనకు మాత్రమే చెందును. యజ్ఞమునకు సంబంధించిన వస్తువులు విశేషించి ఆయనకు చెందును (34). యజ్ఞము తరువాత మిగిలిన వస్తువులన్నియు రుద్రభాగములని చెప్పబడును. ఇట్టి పండితుల వచనములు ఆ శివుని సంకల్పము చేతనే అక్కడక్కడ ప్రచారములోనికి వచ్చినవి (35). ఆ ఈశ్వర దేవుడే వస్తువులన్నింటికీ అధికారి యనుటలో సందేహము లేదు. యజ్ఞములో మిగిలిన వాటిని గురించి చెప్పనదేమున్నది? ఆయన యొక్క ఇచ్ఛ చేతనే ఇతర దేవతలు తమ భాగములను పొందుచున్నారు (36). ఆ ప్రభుడు నిన్ను

అనుగ్రహించుటకై అచటకు ఆ రూపములో వచ్చియున్నాడు. ఓ నభగా! నీవు అచటకు వెళ్లి నీ సత్యవచనముతో ఆయనను ప్రసన్నుని చేసుకొనుము (37). అపరాధమును మన్నించుమని వేడుకొనుము. చక్కగా ప్రణమిల్లి స్తుతించుము. ఆ అఖిలేశ్వరుడే యజ్ఞమునకు ప్రభువు, మరియు సర్వమునకు ప్రభువు (38). వత్సా! విష్ణు బ్రహ్మాది దేవతలు, సిద్ధులు, సకలమహర్షులు ఆయన అనుగ్రహము చేతనే కర్మలన్నింటియందు సమర్థులగుచున్నారు (39). నీవు నా పుత్రులలో శ్రేష్ఠుడవు. ఇన్ని మాటలేల? నీవు వెంటనే అచటకు వెళ్లుము. సకలప్రభుడగు ఆ మహాదేవుని అన్ని విధములుగా ప్రసన్నుని చేయుము (40).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా స మను శ్శ్రాద్ధదేవశ్చ తనయం ద్రుతమ్ ।
ప్రేషయామాస నికటం శంభోస్సోఽపి సమేత్య తమ్ ॥
నభగశ్చ ప్రణమ్యాశు సాంజ లిర్నతమస్తకః ।
ప్రోవాచ సుప్రసన్నాత్మా వినయేన మహామతిః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ శ్రాద్ధదేవమనువు ఇట్లు పలికి వెంటనే కుమారుని శంభుని వద్దకు పంపెను. ఆ నభగుడు శంభుని వద్దకు వచ్చి (41), వెంటనే చేతులను జోడించి తలవంచి నమస్కరించెను. గొప్ప బుద్ధిశాలియగు ఆ నభగుడు మిక్కిలి ప్రసన్నమగు మనస్సు గలవాడై వినయముతో నిట్లనెను (42).

నభగ ఉవాచః

ఇదం తవేశ సర్వం హి వస్తు త్రిభువనే హియత్ ।
ఇత్యాహ మే పితా నూనం కిముతో ధ్వరశేషితమ్ ॥
అజానతా మయా నాథ యదుక్తం తద్వచో భ్రమాత్ ।
అపరాధం త్వం క్షమస్వ శిరసా త్వాం ప్రసాదయే ॥
ఇత్యుక్త్వా నభగస్సోఽతి దీన ధీస్తు కృతాంజలిః ।
తుష్టావ తం మహేశానం కృష్ణ దర్శనమానతః ॥
శ్రాద్ధదేవోఽపి శుద్ధాత్మ నతకస్సాంజలి స్సు ధీః ।
తుష్టావ తం ప్రభుం నత్వా స్వాపరాధం క్షమాపయత్ ॥
ఏతస్మిన్నంతరే తత్ర విష్ణుర్బ్రహ్మా ఖిలస్సురీః ।
వాసవాద్యాస్సమాజగ్ము స్సిద్ధాశ్చ మునయోఽపి హి ॥
మహోత్సవం ప్రకుర్వంతస్సు కృతాంజలయోఽఖిలాః ।
తుష్టువుర్నతకా భక్త్యా సుప్రణమ్య పృథక్ పృథక్ ॥
అథ రుద్రః ప్రసన్నాత్మా కృపాదృష్ట్యా విలోక్య తాన్ ।
ఉవాచ నభగం ప్రీత్యా సస్మితం కృష్ణ దర్శనః ॥

నభగుడిట్లు పలికెను -

ఓ ఈశ్వరా! ముల్లోకములలో గల వస్తువులన్నియూ నీవేనని నా తండ్రి చెప్పినాడు. యజ్ఞములో మిగిలినది నీదేననీ వేరుగా చెప్పవలెనా? (43). ఓ నాథా! నేను అజ్ఞానముచే పలికిన మాటలు భ్రమపూర్ణములు. నా అపరాధమును మన్నించుము. నేను తలవంచి ప్రణమిల్లీ నిన్ను ప్రసన్నుని చేయుచున్నాను (44). మిక్కిలి దీనమగు బుద్ధిగల నభగుడు తలవంచి చేతులు జోడించి ఇట్లు పలికి కృష్ణ దర్శన రూపములోనున్న ఆ మహేశ్వరుని స్తుతించెను (45). శుద్ధమగు అంతఃకరణము గలవాడు, విద్వాంసుడునగు శ్రాద్ధదేవుడు కూడ చేతులు జోడించి నమస్కరించి, తన అపరాధమును మన్నించుమని ఆ ప్రభువును స్తుతించెను (46). అదే సమయములో అచటకు సర్వస్వరూపుడగు విష్ణువు, జ్ఞానియగు బ్రహ్మ, ఇంద్రాది దేవతలు, సిద్ధులు మరియు మునులు విచ్చేసిరి (47). వారందరు చక్కగా చేతులు జోడించి వేర్వేరుగా సాష్టాంగ ప్రణామములనాచరించి మహోత్సవమును చేయుచూ భక్తితో స్తుతించిరి (48). అపుడు కృష్ణ దర్శన రూపములో నున్న రుద్రుడు ప్రసన్నమగు అంతఃకరణము గలవాడై వారిని దయాదృష్టితో వీక్షించి చిరునవ్వుతో ప్రేమతో నభగుని ఉద్దేశించి ఇట్లు పలికెను (49).

కృష్ణ దర్శన ఉవాచః

యత్తే పితావదద్ధర్మ్యం వాక్యం తత్తు తథైవ హి ।
త్వయాఽపి సత్యముక్తం తత్సాధుస్త్వం నాత్ర సంశయః ॥
అతోఽహం సుప్రసన్నోఽస్మి సర్వథా సువ్రతేన తే ।
దదామి కృపయా తే హి జ్ఞానం బ్రహ్మ సనాతనమ్ ॥
మహాజ్ఞానీ భవ త్వం హి సవిప్రో నభగ ద్రుతమ్ ।
గృహాణ వస్త్విదం సర్వం మద్దత్తం కృపయాధునా ॥
ఇహ సర్వసుఖం భుంక్ష్వ నిర్వికారం మహామతే ।
సుగతిం ప్రాప్స్యసి త్వం హి సవిప్రః కృపయా మమ ॥

కృష్ణ దర్శనుడిట్లు పలికెను -

నీ తండ్రి ధర్మమునకు అనురూపముగా పలికిన వచనము యథార్థము. నీవు కూడ సత్యమును పలికి తివి. కావున నీవు సాధుపురుషుడవనుటలో సందేహము లేదు (50). కావున నేను నీ సత్యవ్రతముచే చాల ప్రసన్నుడనైతిని. నేను దయతో నీకు సనాతనమగు బ్రహ్మజ్ఞానమునిచ్చెదను (51). ఓ నభగా! నీవు మహాజ్ఞానివి అగుదువు. నేను దయతో ఇప్పుడీ సర్వ వస్తువులను ఇచ్చుచున్నాను. బ్రాహ్మణులతో గూడి నీవు వెంటనే స్వీకరింపుము (52). ఓ మహాబుద్ధిశాలీ! ఇహలోకములో నిర్వికారముగా సర్వసుఖములనను భవించుము. నా దయచే నీవు బ్రాహ్మణ ధర్మములతో గూడి ఉత్తమ గతిని పొందగలవు (53).

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా తాత భగవాన్ స రుద్ర స్సత్యవత్సలః ।
సర్వేషాం పశ్యతాం తేషాం తత్రైవాంతర్దధే హరః ॥
విష్ణుర్బ్రహ్మాపి దేవాద్యాస్సర్వే తే మునిసత్తమ ।
స్వం స్వం ధామ యయుః తస్యై నత్వా దిశే ముదా ॥
స పుత్ర శ్శ్రాద్ధదేవోఽపి స్వస్థానమ గమన్ముదా ।
భుక్త్వా భోగాన్ సువిపులాన్ సోంతే శివపురం యయౌ ॥
ఇత్థం తే కీర్తితో బ్రహ్మన్నవతా రశ్శివస్య హి ।
కృష్ణ దర్శననామా వై నభగా నందదాయకః ॥
ఇద మాఖ్యానమనఘం భుక్తిముక్తి ప్రదం సతామ్ ।
పఠతాం శృణ్వతాం వాపి సర్వకామ ఫలప్రదమ్ ॥
య ఏతచ్చరితం ప్రాతస్సాయం చ స్మరతే సుధీః ।
కవిర్భవతి మంత్రజ్ఞో గతిమంతే లభేత్పరామ్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం కృష్ణ దర్శనావతార వర్ణనం నామ ఏకోనత్రింశోఽధ్యాయః (29).

నందీశ్వరుడిట్లు పలికెను –

వత్సా! సత్యమునందు ప్రేమ గలవాడు, పాపములను హరించువాడు నగు ఆ రుద్ర భగవానుడు ఇట్లు పలికి వారందరు చూచుచుండగా అచటనే అంతర్ధానమాయెను (5 4). ఓ మహర్షీ! విష్ణువు, బ్రహ్మ, దేవతలు మొదలగు వారందరు ఆ దిక్కునకు ఆనందముతో నమస్కరించి తమ తమ స్థానములకు వెళ్లిరి (55). శ్రాద్ధదేవుడు కూడా పుత్రునితో గూడి ఆనందముతో తన స్థానమునకు వెళ్లెను. ఆతడు విస్తారమగు భోగముల ననుభవించి, దేహమును వీడిన పిదప శివుని పదమును చేరెను (56). ఓ సనత్కుమారా! నభగునకు ఆనందమును కలిగించిన శివుని కృష్ణ దర్శనావతారమును నీకు ఈ తీరున వివరించి యుంటిని (57). ఈ గాథ పవిత్రమైనది, సత్పురుషులకు భుక్తిని, ముక్తిని ఇచ్చునది. దీనిని చదువు వారికి వినువారికి కూడా సర్వకామనలు, ఫలములు సిద్ధించును (58). ఏ బుద్ధిమంతుడు ఈ వృత్తాంతమును ఉదయము మరియు సాయంకాలమునందు స్మరించునో, ఆతడు కవి, మంత్రవేత్త యగుటయే గాక, దేహత్యాగానంతరము పరమగతిని పొందును (59).

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు కృష్ణ దర్శనావతార వర్ణనమనే ఇరువది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది (29).

30 – అవధూతేశ్వరావతారము

నందీశ్వర ఉవాచః

శృణు త్వం బ్రహ్మపుత్రా ద్యావతారం పరమేశితుః ।
అవధూతేశ్వరాహ్వం వై శక్రగర్వాప హారకమ్ ॥
శక్రః పురా హి సగురుస్సర్వ దేవసమన్వితః ।
దర్శనం కర్తుమీశస్య కైలాస మగమన్మునే ॥
అథ గుర్వింద్రయోర్ జ్ఞాత్వా గమనం శంకరస్తయోః ।
పరీక్షితుం చ తద్భావం స్వదర్శన రతాత్మనోః ॥
అవధూత స్వరూపోఽ భూన్నానాలీలాకరః ప్రభుః ।
దిగంబరో మహా భీమో జ్వలదగ్ని సమప్రభః ॥
సోఽవధూతస్వరూపో హి మార్గమారుధ్య సద్గతిః ।
లంబమానపటశ్శంభుర తిష్ఠచ్ఛోభితాకృతిః ॥
అథ తౌ గురు శక్రౌ చ గచ్ఛంతౌ శివసన్నిధిమ్ ।
అద్రాష్టాం పురుషం భీమం మార్గమధ్యేఽద్భుతాకృతిమ్ ॥
అథ శక్రో మునేఽపృచ్ఛత్ స్వాధికారేణ దుర్మదః ।
పురుషం తం స్వమార్గాంత స్థ్సితమజ్ఞాయ శంకరమ్ ॥

నందీశ్వరుడు ఇట్లు పలికెను –

బ్రహ్మపుత్రుడవగు ఓ సనత్కుమారా ! నీవు ఇపుడు పరమేశ్వరుని అవధూతేశ్వరుడు అను పేరుతో ప్రసిద్ధిని గాంచిన అవతారమును గురించి వినుము. ఈ అవతారములో శివుడు ఇంద్రుని గర్వమును అణచినాడు (1). ఓ మహర్షీ ! పూర్వము ఇంద్రుడు సకలదేవతలతో మరియు బృహస్పతితో గూడి శివుని దర్శనము కొరకై కైలాసమునకు వెళ్లెను (2). అపుడు అనేకలీలలను చేసే శంకరుడు, ఆ ఇంద్రబృహస్పతులు ఇద్దరు తన దర్శనమునందు ప్రీతితో నిండిన మనస్సులు గలవారై బయలు దేరినారని తెలిసి వారి భక్తిని పరీక్షించుట కొరకై అవధూతరూపమును దాల్చెను. దిగంబరుడగు ఆ అవధూత జ్వలించే అగ్ని వలె ప్రకాశిస్తూ గొప్ప భయమును గొల్పుచుండెను (3-4). సత్పురుషులకు శరణు అగు శంభుడు ఆ అవధూత రూపములో ప్రకాశించువాడై మార్గమునకు అడ్డుగా నిలిచెను. ఆయన భుజమునుండి ఉత్తరీయము వ్రేలాడుచుండెను (5). అపుడు శివుని సన్నిధికి వెళ్లుచున్న ఆ ఇంద్రబృహస్పతులు మార్గమధ్యములో ఆశ్చర్యమును కలిగించే ఆకారముతో భయమును గొల్పుచున్న ఒక పురుషుని చూచిరి (6). అపుడు తన అధికారముచే గర్వించియున్న ఇంద్రుడు తన దారికి అడ్డుగా నిలబడియున్న పురుషుడు శంకరుడేనని తెలియక, ఆయనను ఇట్లు ప్రశ్నించెను

శుక్ర ఉవాచః

కస్త్వం దిగంబరాకారావధూతః కుత ఆగతః ।
కిం నామ తవ విఖ్యాతం తత్త్వతో వద మే ఽచిరమ్ ॥
స్వస్థానే సంస్థితశ్శంభుః కిం వాన్యత్ర గతోఽధునా ।
దర్శనార్థం హి తస్యాహం గచ్ఛామి సగురుస్సురైః ॥

శుక్రుడు ఇట్లు పలికెను –

దిగంబరాకారుడవగు ఓయీ అవధూతా! నీవెవరివి? ఎక్కడనుండి వచ్చితివి? నీ ప్రసిద్ధమైన పేరు ఏది? నాకు వెంటనే ఉన్నది ఉన్నట్లుగా చెప్పుము (8). శంభుడు తన స్థానములోనున్నాడా? లేక ఇప్పుడు ఎక్కడికైన వెళ్లినాడా? నేను దేవతలతో మరియు బృహస్పతితో గూడి ఆయన దర్శనము కొరకై వెళ్లుచున్నాను (9).

నందీశ్వర ఉవాచః

శక్రేణేత్థంస పృష్టశ్చ కించిన్నో వాచ పూరుషః ।
లీలాగృహీత దేహస్స శంకరో మదహా ప్రభుః ॥
శక్రః పునరపృచ్ఛత్తం నోవాచ స దిగంబరః ।
అవిజ్ఞాతగతి శ్శంభుర్మహా కౌతుక కారకః ॥
పునః పురందరోఽపృచ్ఛ త్త్రైలోక్యాధిపతిస్స్వరాట్ ।
తూష్ణీమాస మహాయోగీ మహాలీలా కరస్స వై ॥
ఇత్థం పునః పునః పృష్టశ్శక్రేణ స దిగంబరః ।
నోవాచ కించి ద్భగవాన్ శక్ర దర్పజిఘాంసయా ॥
అథ చుక్రోధ దేవేశస్త్రై లోక్యై శ్వర్య గర్వితః ।
ఉవాచ వచనం క్రోధాత్తం నిర్భర్త్స్య జటాధరమ్ ॥

నందీశ్వరుడు ఇట్లు పలికెను –

లీల కొరకై ఆ అవధూత వేషమును దాల్చియున్న ఆ శంకర ప్రభుడు ఇంద్రుని గర్వమును అణచవలెనని తలచెను. ఇంద్రుడు ఈ విధముగా ప్రశ్నించగా, ఆయన బదులు చెప్పలేదు (10). ఎవ్వరి చేతనైననూ తెలియబడనీ స్వరూపము గలవాడు, గొప్ప ఉత్కంఠను రేకెత్తించే లీలలను ప్రదర్శించువాడు నగు శంభుడు దిగంబరాకారములోనున్నవాడై, ఇంద్రుడు మరల ప్రశ్నించిననూ సమాధానము చెప్పలేదు (11). ముల్లోకములకు అధిపతి, స్వర్గలోకాధ్యక్షుడు అగు ఇంద్రుడు మరల ప్రశ్నించెను. కాని గొప్ప లీలలను ప్రదర్శించే ఆ మహాయోగి మిన్నకుండెను (12). ఈ విధముగా ఇంద్రుడు ఆ దిగంబరుని పలు మార్లు ప్రశ్నించిననూ, ఇంద్రుని గర్వమును అణచవలెనని తలపోసిన భగవానుడు ఏమియు సమాధానమును చెప్పలేదు (13). అపుడు తన ఐశ్వర్యమును చూచి గర్వించియున్న, ముల్లోకములకు అధిపతియగు ఇంద్రుడు కోపించి జటాధారియగు ఆ అవధూతను భయపెడుతూ ఇట్లు పలికెను (14).

ఇంద్ర ఉవాచ:

పృచ్ఛ్యమానోఽపి రే మూఢ నోత్తరం దత్తవానసి ।
అతస్త్వాం హన్మి వజ్రేణ కస్తే త్రాతాస్తి దుర్మతే ॥
ఇత్యు దీర్య తతో వజ్రీ సంనిరీక్ష్య క్రుధా హి తమ్ ।
హంతుం దిగంబరం వజ్రముద్యతం స చకార హ ॥
వజ్రహస్తం చ తం దృష్ట్వా శక్రం శీఘ్రం సదాశివః ।
చకార స్తంభనం తస్య వజ్రపాతస్య శంకరః ॥
తతస్స పురుషః క్రుద్ధః కరాలాక్షో భయంకరః ।
ద్రుతమేవ ప్రజజ్వాల తేజసా ప్రదహన్నివ ॥
బాహు ప్రతిష్టంభ భువా మన్యునాంతశ్శచీ పతిః ।
సమదహ్యత భోగీవ మంత్రరుద్ధపరాక్రమః ॥
దృష్ట్వా బృహస్పతిస్త్వేనం ప్రజ్వలంతం స్వతేజసా ।
పురుషం తం ధియామాస ప్రణనామ హరం ద్రుతమ్ ॥
కృతాంజలిపుటో భూత్వా తతో గురురుదారధీః ।
దండవత్కో పునర్నత్వా ప్రభుం తుష్టావ భక్తితః ॥

ఇంద్రుడు ఇట్లు పలికెను -

ఓ మూర్ఖా ! దుర్బుద్ధీ ! నేను అడుగుచున్ననూ నీవు సమాధానము చెప్పకుం(డ)ంటివి. కావున, నేను నిన్ను వజ్రముతో సంహరించెదను. నిన్ను రక్షించువాడు ఎవడు గలడు ? (15) వజ్రధారియగు ఇంద్రుడు ఇట్లు పలికి, ఆ దిగంబరుని కోపముతో చూచి వజ్రమును సన్నద్ధము చేసెను (16), నిత్యమంగళస్వరూపుడగు శంకరుడు వజ్రమును చేతబట్టియున్న ఆ ఇంద్రుని చూచి వెంటనే ఆ వజ్రపు దెబ్బ తనపై పడని విధముగా స్తంభింప జేసెను (17). అపుడు భయంకరమగు ఆకారము గల ఆ పురుషుడు క్రోధముతో వికటముగా నున్న కన్నులు గలవాడై, తన తేజస్సుతో వెనువెంటనే తగులబెట్టనున్నాడా యన్నట్లు మండిపడెను (18). చేయి స్తంభించుటచే కలిగిన కోపము గల శచీపతియగు ఇంద్రుడు మంత్రముతో అడ్డుకొనబడిన పరాక్రమము గల పాము వలె లోలోపల మండి పడెను (19). బృహస్పతి మాత్రము, తన తేజస్సుతో గొప్పగా ప్రకాశించుచున్న ఆ పురుషుని చూచి వెంటనే ఆయన శివుడేనని గుర్తు పట్టి నమస్కరించెను (20). అపుడు గొప్ప బుద్ధిమంతుడగు బృహస్పతి చేతులను జోడించి ఆ ప్రభునకు సాష్టాంగ నమస్కారమును చేసి, భక్తితో స్తుతించెను (21).

గురు రువాచ।

దేవ దేవ మహా దేవ శరణా గతవత్సల ।

ప్రసన్నో భవ గౌరీశ సర్వేశ్వర నమోఽస్తు తే ॥

మాయయా మోహితాస్సర్వే బ్రహ్మవిష్ణ్వాదయోఽపి తే ।

త్వాం న జానంతి తత్త్వేన జానంతి త్వదనుగ్రహాత్ ॥

బృహస్పతి ఇట్లు పలికెను -

ఓ దేవదేవా ! మహాదేవా ! శరణు పొందినవారియందు వాత్సల్యము గలవాడా ! ఓ గౌరీపతీ ! సర్వేశ్వరా ! నీకు నమస్కారము. ప్రసన్నుడవు కమ్ము (22). బ్రహ్మ, విష్ణువు మొదలగు వారు అందరు కూడా నీ మాయచే మోహమును పొందుచుందురు. నీ స్వరూపమును వారు యథార్థముగా తెలియకున్నారు. ఒక వేళ తెలిసిననూ, అది నీ అనుగ్రహము మాత్రమే (23).

నందీశ్వర ఉవాచః

బృహస్పతిరితి స్తుత్వా సతదా శంకరం ప్రభుమ్ ।

పాదయోః పాతయామాస తస్యేశస్య పురందరమ్ ॥

తతస్తాత సురాచార్యః కృతాంజలి రుదారధీః ।

బృహస్పతి రువాచేదం ప్రశ్రయావనతస్సుధీః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

అపుడా బృహస్పతి శంకరప్రభుని ఈ విధముగా స్తుతించి, ఇంద్రుడు ఆ ఈశ్వరుని కాళ్లపై పడునట్లు చేసెను (24). ఓయీ కుమారా ! తరువాత గొప్ప బుద్ధిమంతుడు, దేవతలకు ఆచార్యుడు, జ్ఞాని అగు బృహస్పతి చేతులను జోడించి వినయముతో వంగి ఇట్లు పలికెను (25).

బృహస్పతి రువాచ ।

దీననాథ మహాదేవ ప్రణతం తవ పాదయోః ।

సముద్ధర చమాం తత్త్వం క్రోధం న ప్రణయం కురు ॥

తుష్టో భవ మహాదేవ పాహీంద్రం శరణాగతమ్ ।

వహ్నిరేష సమాయాతి భాలనేత్ర సముద్భవః ॥

బృహస్పతి ఇట్లు పలికెను -

ఓ దీనప్రభూ ! మహాదేవా ! నీ పాదములను నమస్కరించే నన్ను ఉద్ధరించుము. కావున, నీవు కోపమును చేయకుము. ప్రేమను చూపుము (26). ఓ మహాదేవా ! తుష్టుడవు కమ్ము. శరణు పొందిన ఇంద్రుని రక్షింపుము. ఇదిగో ! నీ లలాటమునందలి నేత్రమునుండి అగ్ని పుట్టి మా వైపు వచ్చుచున్నది (27)

నందీశ్వర ఉవాచః

ఇత్యాకర్ణ్య గురోర్వాక్యమవధూతాకృతిః ప్రభుః ।

ఉవాచ కరుణా సింధుర్విహసన్ స సదూతికృత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

కరుణాసముద్రుడగు శంకరప్రభుడు మంచి లీలలను చేయుచుండును. అవధూతరూపములోనున్న ఆయన బృహస్పతి యొక్క ఈ మాటను విని నవ్వుతూ ఇట్లు పలికెను (28).

అవధూత ఉవాచః

క్రోధాచ్చ నిస్సృతం తేజో ధారయామి స్వనేత్రతః ।

కథం హి కంచుకీం సర్పస్సంధత్తే చో జ్ఝితాం పునః ॥

అవధూత ఇట్లు పలికెను –

కోపము వలన నా కంటినుండి బయటకు వచ్చియున్న తేజస్సును మరల ముందుకు రాకుండా నిలబెట్టుట ఎట్లు సంభవమగును ? పాము విడిచిపెట్టిన కుబుసమును మరల ఎట్లు ధరించగల్గును ? (29)

నందీశ్వర ఉవాచః

ఇతి శ్రుత్వా వచస్త స్య శంకరస్య బృహస్పతిః ।

ఉవాచ సాంజలిర్భూయో భయవ్యాకుల మానసః ॥

బృహస్పతి ఆ శంకరుని ఆ మాటను విని, భయముతో ఆందోళనను చెందియున్న మనస్సు గలవాడై, మరల చేతులను జోడించి, ఇట్లు పలికెను (30).

బృహస్పతిరువాచ।

హే దేవ భగవన్ భక్తా అనుకంప్యాస్సదైవ హి ।

భక్తవత్సలనామేతి త్వం సత్యం కురు శంకర ॥

క్షేప్తుమన్యత్ర దేవేశ స్వతేజోఽత్యు గ్రమర్హ సి ।

ఉద్ధర్తా సర్వభక్తానాం సముద్ధర పురందరమ్ ॥

బృహస్పతి ఇట్లు పలికెను –

ఓ దేవా ! భగవన్ ! నీవు ఎల్లవేళలా భక్తులపై దయను చూపదగును గదా ! ఓ శంకరా ! నీకు భక్తవత్సలుడను పేరు గలదు. దానిని నీవు సార్థకము చేయుము (31). ఓ దేవదేవా ! మిక్కిలి భయంకరమగు నీ తేజస్సును మరియొక చోట పారవేయుము. భక్తులందరినీ ఉద్ధరించే నీవు ఇంద్రుని ఉద్ధరించుము (32).



నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తో గురుణా రుద్రో భక్తవత్సల నామ భాక్ ।

ప్రత్యువాచ ప్రసన్నాత్మా సురేజ్యం ప్రణతార్తిహా ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

బృహస్పతి ఇట్లు పలుకగా, భక్తవత్సలుడు అని ప్రసిద్ధిని గాంచినవాడు, నమస్కరించువారి కష్టములను పారద్రోలువాడు అగు రుద్రుడు దేవగురువుతో నిట్లనెను (33).

రుద్ర ఉవాచః

ప్రీతస్తేఽహం సురాచార్య దదామి వరముత్తమమ్ ।

ఇంద్రస్య జీవదానేన జీవేతి త్వం ప్రథాం వ్రజ ॥

సముద్భూతోఽనలో యోఽయం భాలనే త్రాత్సురాసహః ।

ఏనం త్యక్ష్యామ్యహం దూరే యథేంద్రం నైవ పీడయేత్ ॥

రుద్రుడు ఇట్లు పలికెను -

ఓ దేవగురూ ! నీపై నాకు ప్రీతి కలిగినది. నీకు ఉత్తమమగు వరమునిచ్చెదను. నీవు ఇంద్రుని జీవితమును కాపాడితివి. కావున, నీకు 'జీవుడు అను పేరు ప్రసిద్ధిని పొందగలదు (34). నా లలాటనేత్రమునుండి పుట్టిన ఈ అగ్నిని దేవతలు సహించలేరు. ఇది ఇంద్రుని ఏ మాత్రము పీడించని విధముగా, దీనిని నేను దూరముగా విడిచి పెట్టెదను (35):

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వాసకరే ధృత్వా స్వతేజోఽనల మద్భుతమ్ ।

భాలనేత్ర సముద్భూతం ప్రాక్షిపల్ల వణాంభసి ॥

అథో శివస్య తత్తేజో భాలనేత్ర సముద్భవమ్ ।

క్షిప్తం చ లవణాంభోధౌ సద్యో బాలో బభూవ హ ॥

స జలంధర నామాభూత్సింధు పుత్రో సురేశ్వరః ।

తం జఘాన మహేశానో దేవ ప్రార్థనయా ప్రభుః ॥

ఇత్థం కృత్వా సుచరితం శంకరో లోకశంకరః ।

అవధూతస్వరూపేణ తతశ్చాంతర్హితోఽభవత్ ॥

బభూవుస్సకలా దేవాస్సుఖిన శ్చాతినిర్భయాః ।

గురుశక్రౌ భయాన్ముక్తౌ జగ్మతుస్సుఖ ముత్తమమ్ ॥

యదర్థే గమనోద్యుక్తౌ దర్శనం ప్రాప్య తస్య తౌ ।

కృతార్థౌ గురుశక్రౌ హి స్వస్థానం జగ్మతుర్ముదా ॥



అవధూతే శ్వరాహ్వోఽవతారస్తే కథితో మయా ।

పరమేశస్య పరమానందదః ఖలదండదః ॥

ఇద మాఖ్యానమనఘం యశస్యం స్వర్గ్యమేవ చ ।

భుక్తి ముక్తి ప్రదం దివ్యం సర్వకామ ఫలప్రదమ్ ॥

య ఇదం శృణుయాన్నిత్యం శ్రావయేద్వా సమాహితః ।

ఇహ సర్వసుఖం భుక్త్వా సోఽన్తే శివగతిం లభేత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం అవధూతేశ్వరావతార వర్ణనం నామ త్రింశోఽధ్యాయః(30).

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ శంకరుడు ఇట్లు పలికి, లలాటమునందలి నేత్రమునుండి పుట్టిన తన తేజోరూపమగు అగ్నిని చేతితో పట్టుకొని ఉప్పుసముద్రమునందు పారవైచెను (36). శివుని లలాటమునందలి నేత్రమునుండి పుట్టి ఉప్పు సముద్రములో పారవేయబడిన ఆ శివుని తేజస్సు వెంటనే పిల్లవాడుగా మారెను (37). రాక్షసనాయకుడగు ఆ సముద్రపుత్రునకు జలంధరుడు అను పేరు ప్రసిద్ధిని గాంచెను. దేవతలు ప్రార్థించగా మహేశ్వరప్రభుడు ఆతనిని సంహరించెను (38). లోకములకు మంగళములను కలిగించే శంకరుడు ఈ విధముగా అవధూతరూపమును దాల్చి చక్కని లీలను ప్రకటించి, తరువాత అంతర్ధానమయ్యెను (32). దేవతలు అందరు పూర్తిగా భయమును విడనాడి సుఖమును పొందిరి. ఇంద్రబృహస్పతులు భయమునుండి విముక్తిని పొందినవారై, ఉత్తమమగు సుఖమును అనుభవించిరి (40). ఆ ఇంద్రబృహస్పతులు ఏ ఈశ్వరుని దర్శనము కొరకు బయలు దేరిరో, అట్టి ఈశ్వరుని దర్శించుకొని కృతార్థులై ఆనందముతో తమ స్థానములకు వెడలిరి (41). పరమానందస్వరూపుడగు పరమేశ్వరుడు దుష్టులను శిక్షించును. ఆయనయొక్క అవధూతేశ్వరావతారమును నేను నీకు చెప్పితిని (42). పవిత్రమైనది, కీర్తిని స్వర్గమును భుక్తిని మరియు ముక్తిని ఇచ్చునది, కోరికలనన్నింటినీ ఈడేర్చునది అగు ఈ దివ్యమగు గాథను (43) ఎవడైతే నిత్యము వినునో, లేదా ఏకాగ్రమగు మనస్సుతో వినిపించునో, అట్టివాడు ఇహలోకములో సకలసుఖములను అనుభవించి, మరణించిన పిదప శివుని సాయుజ్యమును పొందును .

శ్రీ శివమహాపురాణములోని శతరుద్ర సంహితయందు
అవధూతేశ్వరావతారమును వర్ణించే ముప్పదియవ అధ్యాయము ముగిసినది.

31 – భిక్షు వర్యావతారము

నందీశ్వర ఉవాచః

అథ వక్ష్యే ముని శ్రేష్ఠ శంభో శ్శృణ్వవతారకమ్ ।
స్వభక్తదయయా విప్ర నారీ సందేహభంజకమ్ ॥
ఆసీత్సత్యరథో నామ్నా విదర్భ విషయే నృపః ।
ధర్మాత్మా సత్యశీలశ్చ మహాశైవ జన ప్రియః ॥
తస్య రాజ్ఞ స్సుధర్మేణ మహీం పాలయతో మునే ।
మహాన్ కాలో వ్యతీయాయ సుఖేన శివధర్మతః ॥
కదాచిత్తస్య రాజ్ఞస్తు శాల్వైశ్చ పురరోధిభిః ।
మహాన్ రణో బభూవాథ బహుసైన్యైర్బ లోద్ధతైః ॥
స విదర్భనృపః కృత్వా సార్ధం తైర్దారుణం రణమ్ ।
ప్రనష్టోరు బలశ్శాల్వైర్నిహతో దైవయోగతః ॥
తస్మిన్ నృపే హతే యుద్ధే శాల్వైస్తు భయవిహ్వలాః।
సైనికా హతశేషాశ్చ మంత్రిభిస్సహ దు ద్రువుః ॥
అథ తస్య మహారాజ్ఞీ రాత్రౌ స్వపురతో మునే ।
సంరుద్ధా రిపుభిర్యత్నా దంతర్వత్నీ బహిర్యయౌ ॥

నందీశ్వరు డిట్లు పలికెను –

ఓ మహర్షీ! విప్రా! శంభుడు తన భక్తునిపై గల దయతో స్త్రీ సందేహములను పోగొట్టే అవతారమును స్వీకరించి యుండెను. ఆ గాథను చెప్పెదను వినుము (1). సత్యరథుడనే విదర్భ దేశపు రాజు ఉండెను. ఆయన ధర్మాత్ముడు, సత్యస్వభావము గలవాడు, శివభక్తులయందు గొప్ప ప్రీతి గలవాడు (2). ఓ మునీ! చక్కని శివధర్మముతో ధర్మబద్ధముగా సుఖముగా ఆ రాజు భూమిని పాలించుచుండగా చాల కాలము గడిచేను (3). ఒకనాడు బలముతో గర్వించి పెద్ద సైన్యములతో నగరమును ముట్టడించిన శాల్వరాజులతో ఆ రాజునకు గొప్ప యుద్ధము జరిగెను (4). ఆ విదర్భ మహారాజు ఆ శాల్వులతో దారుణమగు యుద్ధమును చేసెను, ఆతని పెద్ద సైన్యము ఆ యుద్ధములో నశించగా దైవవైపరీత్యము చే ఆతడు సంహరించబడెను (5). యుద్ధములో ఆ రాజు మరణించగానే, మరణించగా మిగిలిన సైనికులు శాల్వుల వలని భయముచే పీడింపబడినవారై మంత్రులతో కలిసి పారిపోయిరి (6). ఓ మునీ! ఆ రాజుయొక్క పట్టపురాణి గర్భవతియై యుండెను. శత్రువులచే ముట్టడించబడిన తన నగరమునుండి ఆమె రాత్రి యందు మిక్కిలి శ్రమతో బయట పడెను .

నిర్గతా శోక సంతప్తా సా రాజమహిషీ శనైః ।
ప్రాచీం దిశం యయౌ దూరం స్మరంతీశ పదాంబుజమ్ ॥
అథ ప్రభాతే సా రాజ్ఞీ దదర్శ విమలం సరః ।
అతీతా దూరమధ్వానం దయయా శంకరస్య హి ॥

తత్రాగత్య ప్రియా రాజ్ఞ స్సంతప్తా సుకుమారిణీ ।
నివాసార్థం సరస్తీరే ఛాయావృక్షము పాశ్రయత్ ॥
తత్ర దైవవశాద్రాజ్ఞీ ముహూర్తే సద్గుణాన్వితే ।
అసూత తనయం దివ్యం సర్వలక్షణ లక్షితమ్ ॥
అథ తజ్జననీ దైవాత్తృషితాతి నృపాంగనా ।
సరోఽవతీర్ణా పానార్థం గ్రస్తా గ్రాహేణ పాథసి ॥
స సుతో జాతమాత్రస్తు క్షుత్పిపాసార్దితో భృశమ్ ।
రురోద చ సరస్తీరే వినష్ట పితృ మాతృకః ॥
తస్మిన్ వనే క్రందమానే జాతమాత్రే సుతే మునే ।
కృపాన్వితో మహేశోఽభూదంతర్యామీ స రక్షకః ॥

శోకముతో మిక్కిలి బాధపడుచున్న ఆ పట్టపురాణి మెల్లగా బయటపడి ఈశ్వరుని పాదపద్మములను స్మరిస్తూ తూర్పు దిక్కువైపునకు కొంతదూరము వెల్లెను (8). తెల్లవారుసరికి ఆమె శంకరుని దయచే చాల దూరము వెళ్లి స్వచ్ఛమగు సరస్సునొకదానిని పొడగనేను (9). సుకుమారిణి, దుఃఖితురాలు అగు ఆ రాణి అచటకు చేరి సరస్సు ఒడ్డున ఉన్న ఒక చెట్టు యొక్క నీడలో విశ్రాంతి కొరకు కూర్చుండెను (10). ఆ రాణి దైవానుగ్రహముచే అచట మంచి లక్షణములతో గూడిన ముహూర్తమునందు సర్వలక్షణ సంపన్నుడు, ప్రకాశించువాడు నగు పుత్రుని గనెను (11). అపుడా తల్లియగు మహారాణి దాహమునకు తాళలేక నీరు త్రాగుటకై సరస్సులోనికి దిగగా, దైవవశముచే ఒక మొసలి ఆమెను పట్టుకొని చంపివేసెను (12). ఆ బాలుడు పుట్టుటతోడనే తల్లి దండ్రులను గోల్పోయి ఆ సరస్సు ఒడ్డున ఆకలి దప్పికలచే మిక్కిలి పీడింపబడినవాడై ఏడ్చుచుండెను (13). ఓ మహర్షీ! ఆ కుర్రవాడు ఆ అడవిలో జన్మించి ఏడ్చుచుండగా అంతర్యామి, రక్షకుడు అగు ఆ మహేశ్వరునకు జాలి కలిగేను.

ప్రేరితా మనసా కాచి దీశేన త్రాసహారిణా ।
అకస్మాదాగతా తత్ర భ్రమంతీ భైక్ష్య జీవినీ ॥
సా ఏకహాయనం బాలం వహంతీ విధవా నిజమ్ ।
అనాథమేకం క్రందంతం శిశుం తత్ర దదర్శ హ ॥
సా దృష్ట్వా తత్ర తం బాలం వనే నిర్మనుజే మునే ।
విస్మితాతి ద్విజస్త్రీ సా చిచింత హృదయే బహు ॥
అహో సుమహదాశ్చర్యమిదం దృష్టం మయాధునా ।
అసంభావ్య మకథ్యం చ సర్వథా మనసా గిరా ॥
అచ్ఛిన్న నాభినాలోఽయం రసాయాం కేవలం శిశుః ।
శేతే మాతృవిహీనశ్చ క్రందంస్తేజస్వినాం వరః ॥
అస్య పిత్రాదయః కేఽపి న సంతీహ సహాయినః ।
కారణం కిం బభూవాథ హ్యహో దైవబలం మహత్ ॥

న జానే కస్య పుత్రోఽయమస్య జ్ఞాతాత్ర కోఽపి న।
యతః పృచ్ఛా మ్యస్య జన్మ జాతా చ కరుణా మయి ॥
ఇచ్ఛామ్యేనం పోషితుం హి బాలమౌరసపుత్రవత్
సంప్రష్టుం నోత్సహేఽజ్ఞాత్వా కులజన్మాది చాస్య వై॥
ఇతి సంచింత్యమానాయాం తస్యాం విప్రవరస్త్రీ యామ్।
కృపాం చకార మహతీం శంకరో భక్తవత్సలః ॥
దధ్రే భిక్షుస్వరూపం హి మహాలీలో మహేశ్వరః ।
సర్వథా భక్తసుఖదో నిరుపాధిస్స్వయం సదా ॥
తత్రాజగామ సహసా స భిక్షుః పరమేశ్వరః ।
యత్రాస్తి సందేహవతీ ద్విజస్త్రీ జ్ఞాతుమిచ్ఛతీ ॥
భిక్షు వర్య స్వరూపోఽసా వవిజ్ఞాతగతిః ప్రభుః ।
తామహ విప్రవనితాం విహస్య కరుణానిధి: ॥

భిక్షాటనచే జీవించే ఒకానొక స్త్రీ భయమును పాగొట్టే ఈశ్వరునిచే మనస్సునందు ప్రేరేపింపబడినదై హఠాత్తుగా అచటకు వచ్చెను (15). ఆమె విధవరాలు. ఆమెకు ఒక సంవత్సరము వయస్సుగల బిడ్డ గలడు. ఆచట ఆమె ఏడ్చుచున్న అనాథ శిశువును గాంచెను (16). ఓ మునీ! నిర్జనమగు ఆ వనమునందు అచట ఆ బాలుని గాంచి ఆ బ్రాహ్మణస్త్రీ మిక్కిలి చకితురాలై హృదయములో పరి పరి విధముల తలపోసెను (17). అహో! నేను ఈ నాడు గొప్ప ఆశ్చర్యము నిచట గాంచితిని. ఇది మనస్సునకు ఎట్టిననూ ఊహింప శక్యము కానిది, మాటలకు అందనిది (18). నాభినాళమైననూ ఛేదింపబడని ఈ శిశువు నేలపై పడియున్నాడు. తేజశ్శాలురలో శ్రేష్ఠుడగు ఈ బాలుడు తల్లిలేక ఏడ్చుచూ పరుండి యున్నోడు (19). ఈ బాలునకు సాహాయ్యమును చేయుటకు తండ్రి మొదలగు వారెవ్వరూ ఇచట లేరు. కారణమేమై యుండును? అహో! దైవబలము గొప్పది (20). ఈ శిశువు ఎవరి పుత్రుడో నాకు తెలియదు. ఈ శిశువుయొక్క జన్మ గురించి ఎవరిని ప్రశ్నించవలెను? తెలిసినవారు ఇచట ఒకరైననూ లేరు. నాకీ బాలునిపై దయ కలుగుచున్నది (21). నేనీ బాలుని స్వంత బిడ్డ వలే పెంచవలెనని కోరుచున్నాను. కానీ ఈ బాలుని కులము, జన్మ ఇత్యాదులు తెలియక పోవుటచే సమీపించుటకు ఉత్సాహము కలుగటలేదు (22). ఆ బ్రాహ్మణ స్త్రీ ఇట్లు తలపోయుచుండగా, భక్తవత్సలుడగు శంకరుడు గొప్ప దయను చేసెను (23). సర్వ విధములుగా భక్తునకు సుఖములనిచ్చువాడు, తాను సర్వదా దేహోపాధిలేని నిర్గుణుడు, కానీ గొప్ప లీలలను నేరపువాడు అగు మహేశ్వరుడు భిక్షుకరూపమును దాల్చెను (24). ఆ బాలుని గురించి వివరములను తెలియగోరి తటపటాయించుచూ అచటనే ఉన్న బ్రాహ్మణస్త్రీ వద్దకు పరమేశ్వరుడు ఆ భిక్షుకరూపముతో విచ్చేసెను (25). ఎవని చేష్టలను తెలియ శక్యము గాదో అట్టి దయానిధి యగు శివప్రభుడు. శ్రేష్టుడగు భిక్షుకరూపములో విచ్చేసి ఆ బ్రాహ్మణస్త్రీ తో నిట్లు పలికెను

భిక్షువర్య ఉవాచః

> **సందేహం కురు నో చిత్తే విప్రభామిని మా ఖిద ।**
> **ర క్షైనం బాలకం ప్రీత్యా సుపవిత్రం స్వపుత్రకమ్ ॥**
> **అనేన శిశునా శ్రేయః ప్రాప్స్యసే న చిరాత్పరమ్ ।**
> **పుష్ణీహి సర్వథా హ్యేనం మహాతేజస్వినం శిశుమ్ ॥**

శ్రేష్ఠుడగు ఆ భిక్షువు ఇట్లు పలికెను –

ఓ బ్రాహ్మణయువతీ! మనస్సులో సందేహించకుము. దుఃఖించకుము. మిక్కిలి పవిత్రుడగు ఈ బాలకుని ప్రేమతో స్వంత పుత్రుని వలె రక్షించుము (27). నీవు ఈ శిశువు నిమిత్తముగా శీఘ్రముగనే పరమ శ్రేయస్సును పొందగలవు. మహాతేజశ్శాలి యగు ఈ శిశువును అన్ని విధములుగా పోషించుము .

నందీశ్వర ఉవాచః

> **ఇత్యుక్తవంతం తం భిక్షు స్వరూపం కరుణానిధిమ్ ।**
> **సా విప్రవనితా శంభుం ప్రీత్యా పప్రచ్ఛ సాదరమ్ ॥**

నందీ్వరుడిట్లు పలికెను –

భిక్షురూపములో నున్న కరుణాసముద్రుడగు శంభుడు ఇట్లు పలుకగా, ఆ బ్రాహ్మణస్త్రీ శంభునకు ప్రీతితో ఆదరముతో ఇట్లు బదులిడెను .

విప్రవనితో వాచ।

> **త్వదాజ్ఞయైనం బాలం పా రక్షిష్యామి స్వపుత్రవత్ ।**
> **పోక్ష్యామి నాత్ర సందేహో మద్భాగ్యాత్త్వ మహాగతః ॥**
> **తథాపి జ్ఞాతుమిచ్ఛామి విశేషేణ తు తత్త్వతః ।**
> **కోఽయం కస్య సుతశ్చాయం కస్త్వమత్ర సమాగతః ॥**
> **ముహుర్మమ సమాయాతి జ్ఞానం భిక్షువర ప్రభో ।**
> **త్వం శివః కరుణాసింధు స్త్వద్భక్తోఽయం శిశుః పురా ॥**
> **కేన చిత్కర్మదో షేణ సంప్రాప్తోఽయం దశామితమ్ ।**
> **తద్భు క్త్వా పరమం శ్రేయః ప్రాప్స్యతే త్వదనుగ్రహాత్॥**
> **త్వన్మాయయైవ సాహం పై మార్గభ్రష్టా విమోహితా ।**
> **ఆగతా ప్రేషితా త్వత్తో హ్యస్య రక్షణహేతుతః ॥**

బ్రాహ్మణ యువతి ఇట్లు పలికెను-

నీ ఆజ్ఞచే నేనీ బాలుని నా పుత్రుని వలె రక్షించి నిస్సందేహముగా పోషిం◌ిరిచెదను. నీవు నా భాగ్యముచే ఇచటకు వచ్చితివి (30). అయిననూ నేను వివరములను యథాతథముగా తెలియగోరుచున్నాను. ఈ బాలుడు ఎవరి కుమారుడు ? ఇచటకు విచ్చేసిన నీవు ఎవరివి? (31) ఓ భిక్షుక శ్రేష్ఠా! ప్రభూ! నాకు మరల జ్ఞానము కలుగుచున్నది. నీవు దయాసముద్రుడవగు శివుడవు. ఈ

బాలకుడు పూర్వజన్మలో నీ భక్తుడు (32). ఒకానొక దుష్టకర్మను చేయుటచే ఈ దుర్దశను పొందియున్నాడు. దానిని అనుభవించి నీ అనుగ్రహముచే పరమశ్రేయస్సును పొందగలడు (33). నేను నీ మాయచే మోహితురాలనై దారి తప్పితిని. నీవే నన్ను ఈ బాలుని రక్షించుటకు ఇచటకు పంపగా నేను వచ్చియుంటిని .

నందీశ్వర ఉవాచః

ఇతి తద్దర్శన ప్రాప్త విజ్ఞానాం విప్రకామినీమ్ ।
జ్ఞాతుకామాం విశేషేణ ప్రోచే భిక్షుతనుశ్శివః ॥

నందీశ్వరుడిట్లు పలికెను-

ఈ విధముగా శివుని దర్శనముచే ఆమెకు జ్ఞానము కలిగెను. అయిననూ ఆ బ్రాహ్మణ పత్ని వివరములను తెలియగోరెను. భిక్షుకరూపములో నున్న శివుడు ఆమెతో నిట్లనెను.

భిక్షువర్య ఉవాచః

శృణు ప్రీత్యా విప్రపత్ని బాలస్యాస్య పురోహితమ్ ।
సర్వమన్యస్య సుప్రీత్యా వక్ష్యతే తత్త్వతోఽనఘే ॥
సుతో విదర్భరాజస్య శివభక్తస్య ధీమతః ।
అయం సత్యరథస్యైవ స్వధర్మ నిరతస్య హి ॥
శృణు సత్యరథో రాజా హతశ్శాల్వై రణే పరైః ।
తత్పత్నీ నిశి సువ్య గ్రా నిర్యయౌ స్వగృహాద్ద్రుతమ్ ॥
అసూత తనయం చైనం సమాయాతా ప్రగేఽ త్ర హి ।
సరోఽవతీర్ణా తృషయా గ్రస్తా గ్రహేణ దైవతః ॥

మహాత్ముడగు భిక్షుకుడు ఇట్లు పలికెను -

ఓ బ్రాహ్మణ పత్నీ! పుణ్యాత్మురాలా ! ఈ బాలకుని పూర్వవృత్తాంతమును, అతని బంధువుల వివరములను సర్వమును యథార్థముగా చెప్పెదను, మిక్కిలి ప్రీతితో వినుము (36), శివభక్తుడు, బుద్ధిమంతుడు, స్వధర్మమునందు నిష్ఠ గలవాడు, విదర్భదేశాధీశ్వరుడు అగు సత్యరథుని పుత్రుడే ఈ బాలకుడు (37). వినుము. సత్యరథమహారాజు యుద్ధములో బలవత్తరులగు శాల్వులచే సంహరింపబడగా, ఆతని భార్య మిక్కిలి కంగారు పడుతూ రాత్రియందు తన గృహము నుండి శీఘ్రమే బయల్వెడలెను (38). ఆమె తెల్లవారుసరికి ఇచటకు చేరి ఈ బాలుని గనెను. ఆమె దప్పిక తీర్చుకొనుటకై సరస్సులో దిగగానే దైవవశముచే మొసలి ఆమెను భక్షించెను .

నందీశ్వర ఉవాచః

ఇతి తస్య సముత్పత్తిం తత్పితుస్సంగతే మృతిమ్ ।
తన్మాతృమరణం గ్రాహాత్సర్వం తస్యై న్యవేదయత్ ॥
అథ సా బ్రాహ్మణీ సా హి విస్మితాతి మునీశ్వర ।
పునః పప్రచ్ఛ తం భిక్షుం జ్ఞానినం సిద్ధరూపకమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఈ విధముగా, ఆ పిల్లవాని పుట్టుక, ఆ బాలుని తండ్రి యుద్ధములో మరణించుట, మొసలికి చిక్కి ఆ బాలుని తల్లి మరణించుట అను వివరములనన్నిటినీ ఆమెకు చెప్పెను (49). ఓ మహర్షీ! అపుడా బ్రాహ్మణస్త్రీ మిక్కిలి ఆశ్చర్యమును పొందినదై, జ్ఞాని సిద్ధుడు అగు ఆ భిక్షుకుని మరల ఇట్లు ప్రశ్నించెను .

బ్రాహ్మణ్యువాచ ।

స రాజాస్య పితా భిక్షో వరభోగాంతరైవ హి ।
కస్మాచ్ఛాల్వైః స్వరిపుభిస్సలే హ్యేశ్చ విఘాతితః ॥
కస్మాదస్య శిశోర్మాతా గ్రా హేణాశు సుభక్షితా ।
యస్మాద నా థో౽ యం జ్ఞాతో విబంధుశ్చైవ జన్మతః ॥
అకస్మాత్సుతో మమాపీహ సుదరిద్రో హి భిక్షు కః ।
భవేత్కథం సుఖం భిక్షో పుత్రయోరనయోర్వద ॥

ఆ బ్రాహ్మణస్త్రీ ఇట్లు పలికెను –

ఓ భిక్షూ! ఈ బాలుని తండ్రియగు ఆ రాజు గొప్ప భోగముల ననుభవించు చుండగా మధ్యలో, ఆతని శత్రువులు అల్ప ప్రజ్ఞగల వారు అగు శాల్వులు ఆతనిని సంహరించుటకు కారణమేమి? (42) ఈ బాలుని తల్లిని మొసలి శీఘ్రమే భక్షించుటకు కారణమేమి? ఈ బాలుడు పుట్టుటతోడనే బంధువులను గోల్పోయి అనాథ యగుటకు కారణమేమి? (43) నా ఈ కుమారుడు కూడా అత్యంత దరిద్రుడు, ముష్టివాడు అగుటకు కారణమేమి? హే భిక్షు! ఈ ఇద్దరు బాలకులు ఇపుడు నా పుత్రులు. వీరికి సుఖము కలుగు ఉపాయమేది? చెప్పుము .

నందీశ్వర ఉవాచః

ఇతి తస్యా వచశ్శ్రుత్వా స భిక్షుః పరమేశ్వరః ।
విప్రపత్న్యాః ప్రసన్నాత్మా ప్రోవాచ విహసంశ్చ తామ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఆమె యొక్క ఈ మాటలను విని భిక్షుకరూపములో నున్న పరమేశ్వరుడు నవ్వి ప్రసన్నమగు మనస్సు గలవాడై ఆ బ్రాహ్మణ పత్నిని ఉద్దేశించి ఇట్లు పలికెను .

భిక్షువర్య ఉవాచః

విప్రపత్ని విశేషేణ సర్వ ప్రశ్నాన్ వదామి తే ।
శృణు త్వం సావధానేన చరిత్ర మిదముత్తమమ్ ॥
అముష్య బాలస్య పితా స విదర్భ మహీపతిః ।
పూర్వ జన్మని పాండ్యోఽసౌ బభూవ నృపసత్తమః ॥
స శైవ నృపతిర్ధర్మాత్మాపాల యన్నిఖిలాం మహీమ్ ।
స్వప్రజా రంజయామాస సర్వోప ద్రవనాశనః ॥
కదాచిత్స హి సర్వేశం ప్రదోషే పర్యపూజయత్ ।
త్రయోదశ్యాం నిరాహారో దివానక్తవ్రతీ శివమ్ ॥
తస్య పూజయతశ్శంభుం ప్రదోషే గిరిశం రతే ।
మహాన్ శబ్ధో బభూవాథ వికటస్సర్వథా పురే ॥
తమాకర్ణ్య రవం సోఽథ రాజా త్యక్త శివార్చనః ।
రిప్వాగమనశంకాతో నిర్యయౌ భవనాద్బహిః ॥
ఏతస్మిన్నేవ కాలే తు తస్యామాత్యో మహాబలీ ।
గృహీత శత్రుసామంతో రాజాంతికముపాయయౌ ॥

ఆ భిక్షువర్యుడిట్లు పలికెను –

ఓ బ్రాహ్మణపత్నీ! నీ ప్రశ్నలన్నింటికీ వివరముగా సమాధానములను చెప్పగలను. నీవు ఈ ఉత్తమమగు చరిత్రను శ్రద్ధగా వినుము (46). ఈ బాలకుని తండ్రియగు విదర్భమహారాజు పూర్వజన్మలో పాండ్య మహారాజై ఉండెను (47). శివభక్తుడు, ధర్మాత్ముడు అగు ఆ రాజు భూమి నంతనూ పాలించి ఉపద్రవములనన్నిటినీ నశింపజేసి తన ప్రజలను రంజిల్ల జేసెను (48). ఒకప్పుడు ఆయన త్రయోదశినాడు ఉపవసించి రాత్రి యందు పగటియందు కూడ వ్రతనియమమును పాటించి ప్రదోషకాలమునందు సర్వేశ్వరుడగు శివుని పూజించెను (49). ఆయన ప్రదోష కాలమునందు శ్రద్ధతో కైలాసవాసి యగు శివుని పూజించుచుండగా, నగరములో అన్నివైపులనుండియు కర్కశమగు పెద్ద శబ్దము బయలుదేరెను (50). అపుడా రాజు ఆ శబ్దమును విని శత్రువులు దండెత్తి వచ్చినారేమో యను శంకతో శివపూజను విడిచిపెట్టి భవనము బయటకు వచ్చేను (51). అదే సమయములో మహాబలశాలి యగు ఆతని మంత్రి శత్రువు అగు సామంతరాజును చెరబట్టి రాజువద్దకు తీసుకొని వచ్చెను .

తం దృష్ట్వా శత్రు సామంతం మహాక్రోధేన విహ్వలః ।
అవిచార్య వృషం తస్య శిరశ్ఛే దమకారయతి ॥
అసమాప్యేశపూజాం తామశుభిర్నష్టధీర్నృపః ।
రాత్రౌ చకార సుప్రీత్యా భోజనం నష్టమంగలః ॥
విదర్భే సోఽభవద్రాజా జన్మనీహ శివ వ్రతీ ।
శివార్చనాంతరాయణ పరైర్భోగాంతరే హతః ॥
తత్పుత్రో యః పూర్వభవే సోఽస్మిన్ జన్మని తత్సుతః ।
అయమేవ హతైశ్వర్య శివపూజావ్యతి క్రమాత్ ॥
అస్య మాతా పూర్వభవే సపత్నీం ఛద్మనాహరత్ ।
భక్షితా తేన పాపేన గ్రాహేణాస్మిన్ భవే హి సా ॥
ఏషా ప్రవృత్తిరేతేషాం భవత్యై పరికీర్తితా ।
అనర్చితా శివా భక్త్యా ప్రాప్నువంతి దరిద్రతామ్ ॥
ఏష తే తనయః పూర్వజన్మని బ్రాహ్మణోత్తమః ।
ప్రతి గ్రహైర్వయో నిన్యే న యజ్ఞాద్యైస్సుకర్మభిః ॥
అతో దారిద్ర్యమాపన్నః పుత్రస్తే ద్విజభామిని ।
తద్దోషపరిహారార్థం శంకరం శరణం వ్రజ ॥
ఏతాభ్యాం ఖలు బాలాభ్యాం శివపూజా విధీయతామ్ ।
ఉపవీతానంతరం హి శివ శ్శ్రేయః కరిష్యతి ॥

ఆతడు శత్రువగు ఆ సామంతుని పెద్ద క్రోధమువలన వివేకమును గోల్పోయి ధర్మమును విచారించకుండా, ఆతని తలను తీయించెను (53). అమంగళకరమగు ఆలోచనలచే వినష్టమైన వివేకము, పుణ్యము గల ఆ రాజు ఈశ్వరుని పూజను పూర్తి చేయకుండగనే రాత్రియందు మిక్కిలి ప్రీతితో భుజించెను (54). శివవ్రతము గల అతడు ఈ జన్మలో విదర్భాధిపతి ఆయెను. శివార్చనలో అంతరాయమును చేయుటచే ఆతడు భోగములనను భవించుచుండగా శత్రువులచే సంహరింపబడినాడు (55). పూర్వ జన్మలో ఆతని పుత్రుడే ఈ జన్మలో కూడ మరల పుత్రుడైనాడు. శివపూజలో లోపమును చేయుట వలన ఈ బాలుడు ఐశ్వర్యమును కోల్పోయినాడు (56). ఈతని తల్లి పూర్వజన్మలో సవతిని మోసముచే చంపించేను. ఆ పాపముచే ఆమే ఈ జన్మలో మొసలిచే భక్షింపబడినది (57). వీరి అందరి ప్రవృత్తులను నీకు చెప్పితిని. పార్వతీ దేవిని భక్తితో ఆరాధించనివారు దరిద్రులగుదురు (58). ఈ నీ కుమారుడు పూర్వజన్మలో గొప్ప బ్రాహ్మణుడే యైననూ యజ్ఞాది పుణ్యకర్మలను వీడనాడి దానములను పట్టుచూ జీవితమును గడిపెను (59). ఓ బ్రాహ్మణయువతీ! అందువలననే ఈ నీ పుత్రుడు దరిద్రుడైనాడు.. ఆ దోషమును పోగొట్టు కొనుటకై శంకరుని శరణు పొందుము (60). ఈ ఇద్దరు బాలురతో కలిసి ఉపనయనము తరువాత శివ పూజను చేయుము. శివుడు శ్రేయస్సును కలిగించగలడు .

నందీశ్వర ఉవాచః

ఇతి తాముపదిశ్యాథ భిక్షు వర్యతను శ్శివః ।
స్వరూపం దర్శయామాస పరమం భక్తవత్సలః ॥
అథ సా విప్రవనితా జ్ఞాత్వా తం శంకరం ప్రభుమ్ ।
సుప్రణమ్య హి తుష్టావ ప్రేమ్ణా గద్గదయా గిరా ॥
తతస్స భగవాన్ శంభుర్ధృత భిక్షుతనుర్ద్రుతమ్ ।
పశ్యంత్యా విప్రపత్న్యాస్తు తత్రైవాంతరధీయత ॥
అథ తస్మిన్ గతే భిక్షౌ విశ్రబ్ధా బ్రాహ్మణీ చ సా ।
తమర్భకం సమాదాయ సస్వపుత్రా గృహం యయౌ ॥
ఏక చక్రాహ్వయే రమ్యే గ్రామే కృతనికేతనా ।
స్వపుత్రం రాజపుత్రం చ వరాన్నైశ్చ వ్యవర్ధయత్ ॥
బ్రాహ్మణైః కృత సంస్కారౌ కృతోపనయనౌ చ తౌ ।
వవృధాతే స్వగేహే చ శివపూజనతత్పరౌ ॥
తౌ శాండిల్యమునేస్తాత నీదేశాన్నియమస్థితౌ ।
ప్రదోషం చక్రతుశ్శంభోః పూజాం కృత్వా వ్రతం శుభమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

భక్తవత్సలుడు, గొప్ప భిక్షుకుని రూపములో నున్నవాడునగు శివుడు ఈ వి◌ధముగా ఆమెకు ఉపదేశించి, పిదప శ్రేష్ఠమగు తన రూపమును చూపించెను (62). అపుడా బ్రాహ్మణ స్త్రీ ఆ శంకరప్రభుని గుర్తించి చక్కగా ప్రణమిల్లి ప్రేమతో గద్గదమగు వాక్కుతో స్తుతించెను (63). భిక్షురూపమును స్వీకరించి యున్న ఆ శంభుభగవానుడు ఆ బ్రాహ్మణ పత్ని చూచుచుండగనే శీఘ్రముగా అచటనే అంతర్ధానమయ్యెను (64). అపుడా భిక్షువు అంతర్ధానము కాగానే, ఆ బ్రాహ్మణస్త్రీ విశ్వాసమును పొంది ఆ పిల్లవానిని తీసుకొని తన కుమారునితో సహా ఇంటికి వెళ్లెను (65). ఆమె ఏకచక్రమనే సుందరమగు గ్రామములో మకాము చేసి తన పుత్రుని మరియు రాజపుత్రుని శ్రేష్టమగు ఆహారములనిచ్చి పెంచెను (66). వారిద్దరు బ్రాహ్మణులచే చేయబడిన సంస్కారములు మరియు ఉపనయనము గలవారై తమ గృహములో శివపూజయందు నిష్ఠగలవారై పెరుగుచుండిరి (67). వత్సా! వారు శాండిల్యమహర్షియొక్క ఆదేశమునననుసరించి నియమములను పాటిస్తూ శుభవ్రతమును చేబట్టి ప్రదోషములో శంభుని పూజను చేయుచుండిరి .

కదాచిద్ద్విజపుత్రేణ వినాఽసౌ ద్విజనందనః ।
నద్యాం స్నాతుం గతః ప్రాప నిధానకలశం వరమ్ ॥
ఏవం పూజయతోశ్శంభుం రాజద్విజకుమారయోః ।
సుఖేనైవ వ్యతీయాయ త యోర్మాస చతుష్టయమ్ ॥
ఏవమర్చయతోశ్శంభుం భూయోఽపి పరయా ముదా ।
సంవత్సరో వ్యతీయాయ తస్మిన్నేవ తయోర్గృహే ॥
సంవత్సరే వ్యతిక్రాంతే స రాజతనయో మునే ।
గత్వా వనాంతే విప్రేణ శివస్యాను గ్రహోద్విభోః ॥
అకస్మాదాగతాం తత్ర దత్తాం తజ్జనకేన హ ।
వివాహ్య గంధర్వసుతాం చక్రే రాజ్యమకంటకమ్ ॥
యా విప్రవనితా పూర్వం తమపుష్ణాత్స్వపుత్రవత్ ।
సైవ మాతా భవత్తస్య సభ్రాతా ద్విజనందనః ॥
ఇత్థ మారాధ్య దేవేశం ధర్మగుప్తో హ్యాయస్స వై।
విదర్భ విషయే రాజ్ఞ్యా తయా భోగం చకార హ ॥
భిక్షువర్యావతార వర్ణితశ్చ మహాధునా ।
శివస్య ధర్మగుప్తాహ్వ నృపబాల సుఖప్రదః ॥
ఏతదాఖ్యానమనఘం పవిత్రం పావనం మహత్ ।
ధర్మార్థకామమోక్షాణాం సాధనం సర్వకామదమ్ ॥
య ఏతచ్ఛృణుయాన్నిత్యం శ్రావయే ద్వా సమాహితః ।
స భుక్త్వేహాఖిలాన్ కామాన్ సోంతే శివపురం వ్రజేత్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం భిక్షు
వర్యావతారవర్ణనం నామ ఏకత్రింశోఽధ్యాయః ॥

ఒకనాడు బ్రాహ్మణ బాలకుడు రాజకుమారుడు లేకుండగనే నదీస్నానమునకు వెళ్లగా, అచట ధనముతో నిండియున్న ఒక గొప్ప కలశము లభించేను (69). ఇట్లు శంభుని పూజించుచుండగా, ఆ బ్రాహ్మణ రాజబాలకులకు నాలుగు మాసములు సుఖముగా గడిచెను (70). మరల అదే స్వగృహములో పరమభక్తితో శంభుని అర్చించుచుండగా సంవత్సరము గడిచెను (71). ఓ మహర్షీ! సంవత్సరము గడచిన పిదప ఆ రాజకుమారుడు బ్రాహ్మణ బాలకునితో కలిసి అడవిలోనికి వెళ్లెను. అచట సర్వవ్యాపకుడగు శివుని అనుగ్రహముచే (72) అకస్మాత్తుగా గంధర్వకన్య ఒకామె వచ్చెను. ఆ రాజకుమారునకు ఆమె తండ్రి ఆమెను ఇచ్చి వివాహము చేసెను. ఆమెను వివాహమాడి ఆతడు నిష్కంటకముగా రాజ్యమునేలెను (73). ఏ బ్రాహ్మణయువతి పూర్వము ఆతనిని తన పుత్రుని వలె పెంచేనో, ఆమెయే ఆతనికి తల్లి ఆయెను. ఆ బ్రాహ్మణ బాలకుడు సోదరుడాయెను (74). ధర్మగుప్తుడను పేరుగల ఆ క్షత్రియుడు ఈ విధముగా దేవదేవుడగు శివుని ఆరాధించి విదర్భరాజ్యమును పాలిస్తూ ఆ రాణితో కలిసి భోగములననుభవించేను (75). ధర్మగుప్తుడను రాజకుమారునకు సుఖమునొసంగిన శివుని శ్రేష్ఠమగు భిక్షుకావతారమును నేను నీకు ఇపుడు వర్ణించియుంటిని (76). ఈ గాథ పాపములను పోగొట్టి పావనము చేయునది, ధర్మార్థకామమోక్షములకు గొప్ప సాధనము మరియు కోర్కెల నన్నిటినీ ఈడేర్చునది (77). ఎవడైతే నిత్యము దీనిని వినునో, ఏకాగ్ర చిత్తముతో వినిపించునో, వాడు ఇహలోకములో కోర్కెలనన్నిటినీ అనుభవించి, దేహము నశించిన పిదప శివపదమును పొందును .

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు భిక్షువర్యావతార వర్ణనమనే ముప్పది ఒకటవ అధ్యాయము ముగిసినది.

32 - సురేశ్వరావతారము

శృణు తాత ప్రవక్ష్యామి శివస్య పరమాత్మనః।
సురేశ్వరావతారస్తే ధౌమ్యాగ్రజ హితావహమ్ ॥
వ్యాఘ్రపాదసుతో ధీమానుపమన్యుస్సతాం ప్రియః ।
జన్మాంతరేణ సంసిద్ధః ప్రాప్తో మునికుమారతామ్ ॥
ఉవాస మాతులగృహే సమాత్రా శిశురేవ హి ।
ఉపమన్యుర్వ్యాఘ్రపాది స్యాద్దరిద్రశ్చ దైవతః ॥
కదాచిత్ క్షీర మత్యల్పం పీతవాన్మాతులాశ్రమే ।
యయాచే మాతరం ప్రీత్యా బహుశో దుగ్ధలాలసః ॥
తచ్ఛ్రుత్వా పుత్ర వచనం తన్మాతా చ తపస్వినీ ।
సాంతః ప్రవిశ్యాథ తదా శుభోపాయ మరీరచత్ ॥
ఉంఛవృత్త్యర్జితాన్ బీజాన్ పిష్ట్వాలో డ్య జలేన తాన్ ।
ఉపలాల్య సుతం తస్మై సా దదౌ కృత్రిమం పయః ॥
పీత్వా చ కృత్రిమం దుగ్ధం మాత్రా దత్తం స బాలకః ।
నేతత్ క్షీరమితి ప్రాహ మాతరం చారుదత్ పునః ॥
శ్రుత్వా సుతస్య రుదితం ప్రాహ సా దుఃఖితా సుతమ్ ।
సంమార్జ్య నేత్రే పుత్రస్య కరాభ్యాం కమలాకృతిః ॥

వత్సా! పరమాత్ముడగు శివుని సురేశ్వరావతారమును గూర్చి చెప్పెదను వినుము. ఈ అవతారములో శివుడు ధౌమ్యుని అన్నకు హితమును కలిగించెను (1). వ్యాఘ్రపాదుని కుమారుడగు ఉపమన్యుడు బుద్ధిశాలి మరియు సత్పురుషులకు ప్రియమైనవాడు. ఆతడు పూర్వ జన్మయందు సిద్ధిని పొందియుండి ఈ జన్మలో ముని కుమారుడైనాడు (2). వ్యాఘ్రపాద పుత్రుడగు ఉపమన్యుడు దైవవశముచే దరిద్రుడగుటచే చిన్న వయసులో నుండగనే తల్లితో గూడి మేనమామ ఇంట్లో నివసించెడివాడు (3) ఒకనాడు మేనమామ ఇంటిలో ఆతనికి అతి తక్కువ పాలు లభించేను. అపుడాతడు పాలపై మిక్కుటమగు మక్కువ గలవాడై తల్లిని ప్రేమతో యాచించెను (4), పుత్రుని ఆ వచనములను విని తపస్విని యగు వాని తల్లి లోపలకు వెళ్లి ఒక చక్కటి ఉపాయమును చేసెను (5). ఆమె ఉంఛవృత్తి ద్వారా సంపాదించిన గింజలను పిండిచేసి నీటిలో కలిపి ఆ పిండి పాలను పుత్రునకు లాలించి ఇచ్చేను (6). తల్లి ఇచ్చిన ఆ పిండి పాలను త్రాగి ఆ బాలకుడు తల్లితో "ఇవి పాలు కావు' అని పలికి మరల ఏడ్వజొచ్చెను (7). లక్ష్మీ వంటి రూపుగల ఆ తల్లి పుత్రుని ఏడ్పును విని మిక్కిలి దుఃఖించి, 'పుత్రుని కన్నీటిని చేతులతో తుడిచి ఇట్లు పలికెను .

మాతో వాచ।

క్షీరమత్ర కుతోఽస్మాకం వనే నివసతాం సదా ।
ప్రసాదేన వినా శంభోః పయః ప్రాప్తిర్భవేన్న హా ॥
పూర్వజన్మని యత్ కృత్యం శివముద్దిశ్య హే సుత ।
తదేవ లభ్యతే నూనం నాత్ర కార్యా విచారణా ॥
ఇతి మాతృవచశ్శృత్వా వ్యాఘ్రపాదిస్స బాలకః ।
ప్రత్యువాచ విశోకాత్మా మాత్రం మాతృవత్సలః ॥
శోకేనాలమిమం మాత శృంభుర్య ద్యస్తి శంకరః ।
త్యజ శోకం మహాభాగే సర్వం భద్రం భవిష్యతి ॥
శృణు మాతర్వచో మేఽ ద్య మహాదేవోఽస్తి చేత్ క్వచిత్ ।
చిరాద్వా హ్యచిరాద్వాపి క్షీరో దం సాధయామ్యహమ్ ॥

తల్లి ఇట్లు పలికెను -

సర్వదా వనములో నివసించు మనకు పాలు ఎక్కడివి? శంభుని అనుగ్రహము లేనిదే పాలు లభించవు (9). ఓ పుత్రా! పూర్వజన్మలో శివుని ఉద్దేశించి ఎంత ఆరాధన చేసి యుంటిమో, అంత మాత్రమే లభించును. ఇది నిశ్చయము. దీనిలో శంకకు అవకాశము లేదు (10). వ్యాఘ్రపాదుని కుమారుడు, తల్లియందు ప్రేమ గలవాడునగు ఆ బాలకుడు తల్లియొక్క ఈ మాటలను విని శోకముతో నిండిన హృదయము గలవాడై తల్లికి ఇట్లు బదులిడెను (11). ఓ తల్లీ! శోకమును వీడుము. ఓ పుణ్యాత్మురాలా! మంగళకరుడగు శంభుడు ఉన్నచో సర్వము. సుసంపన్నము కాగలదు (12). అమ్మా! ఇపుడు నా మాటను వినుము. మహాదేవుడు ఎక్కడ ఉన్ననూ, శీఘ్రముగా గానీ, చిరకాలమునకు గాని, నేను క్షీరసముద్రమును సాధించెదను .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా స శిశుః ప్రీత్యా శివం మేఽస్త్విత్యుదీర్య చ।
విసృజ్య తాం సుప్రణమ్య తపః కర్తుం ప్రచక్రమే॥
హిమవత్పర్వతగతః వాయుభక్షస్సమాహితః ।
అష్టేష్టకాభిః ప్రాసాదం కృత్వా లింగం చ మృన్మయమ్ ॥
తత్రావాహ్య శివం సాంబం భక్త్యా పంచాక్షరేణ హ ।
పత్ర పుష్పాదిభిర్వన్యైస్సమానర్చ శిశుస్స వై ॥
ధ్యాత్వా శివం చ తం సాంబం జపన్ పంచాక్షరం మనుమ్ ।
సమభ్యర్చ్య చిరం కాలం చచార పరమం తపః ॥
తపసా తస్య బాలస్య హ్యుప మన్యోర్మహాత్మనః ।
చరాచరం చ భువనం ప్రదీపితమభూన్మునే ॥

ఏతస్మిన్నంతరే శంభుర్విష్ణ్వాద్యైః ప్రార్థితః ప్రభుః ।
పరీక్షితుం చ తద్భక్తిం శక్రరూపోఽ భవత్తదా ॥
శివా శచీ స్వరూపాభూద్గణాః సర్వేఽ భవన్ సురాః ।
ఐరావతగజో నందీ సర్వమేవ చ తన్మయమ్ ॥
తతసాంబశివశ్శక్ర స్వరూపస్సగణో ద్రుతమ్।
జగామానుగ్రహం కర్తుముపమన్యోస్తదాశ్రమమ్ ॥
పరీక్షితుం చ తద్భక్తిం శక్రరూపధరో హరః ।
ప్రాహ గంభీరయా వాచా బాలకం తం మునీశ్వర ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ బాలుడు ప్రీతి పూర్వకముగా నీట్లు పలికి 'నాకు మంగళమగుగాక!' అని పలికి ఆమెకు చక్కగా ప్రణమిల్లి ఆమెను విడచి తపస్సును చేయనారంభించెను (14). ఆతడు హిమాలయములకు పోయి ఎనిమిది ఇటుకలతో ఒక మందిరమును మట్టితో లింగమును చేసి వాయువు మాత్రమే ఆహారముగా గలవాడై ఏకాగ్రమైన మనస్సుతో (15) ఆ లింగమునందు పార్వతీ సమేతుడగు శివుని ఆహ్వానించి భక్తితో ఆరాధించెను. ఆ బాలకుడు పంచాక్షరమంత్రమును పఠిస్తూ వనమునందు లభించే పత్రపుష్పాదులతో చక్కగా ఆరాధించెను (16). ఆతడు పంచాక్షర మంత్రమును జపిస్తూ పార్వతీ సమేతుడగు శివుని ధ్యానిస్తూ చిరకాలము శివుని ఆరాధిస్తూ గొప్ప తపస్సును చేసెను (17). ఓ మహర్షీ! బాలకుడు, మహాత్ముడు అగు ఆ ఉపమన్యుని తపస్సుచే స్థావరజంగమాత్మకమగు జగత్తు అంతయూ తేజోమయమయ్యెను (18). ఇదే కాలములో విష్ణువు మొదలగు వారిచే ప్రార్థింపబడిన శంభు ప్రభుడు ఆతని భక్తిని పరీక్షించుటకై ఇంద్రరూపమును దొల్చెను (19). పార్వతీదేవి శచీరూపమును దాల్చెను. గణములందరూ దేవతలైరి. నందీశ్వరుడు ఐరావతగజము ఆయెను. ఇతరము సర్వము ఇంద్రలోక సంబంధిరూపమును దాల్చెను (20). అపుడు పార్వతీసమేతుడగు శివుడు ఇంద్రరూపములో గణములతో గూడి వెంటనే ఉపమన్యుని అను గ్రహించుటకై ఆతని ఆశ్రమమునకు విచ్చే సెను (21). ఓ మహర్షీ! ఆ బాలకుని భక్తిని పరీక్షించుటకై ఇంద్రుని రూపమును దాల్చిన శివుడు గంభీరమగు వాక్కుతో ఆతనిని ఉద్దేశించి ఇట్లు పలికెను .

సురేశ్వర ఉవాచః

తుష్టోఽస్మి తే వరం బ్రూహి తపసానేన సువ్రత ।
దదామి చేప్సితాన్ కామాన్ సర్వాన్నా త్రాస్తి సంశయః ॥
ఏవముక్తస్స వై తేన శక్రరూపేణ శంభునా ।
వరయామి శివే భక్తి మిత్యువాచ కృతాంజలిః ॥
తన్నిశమ్య హరిః ప్రాహ మాం న జానాసి లేఖపమ్ ।
త్రైలో క్యాధిపతిం శక్రం సర్వదేవ నమస్కృతమ్ ॥

మద్భక్తో భవ విప్రర్షే మామేవార్చయ సర్వదా ।

దదామి సర్వం భద్రం తే త్యజ రుద్రం చ నిర్గుణమ్ ॥

రుద్రేణ నిర్గుణే నాలం కిం తే కార్యం భవిష్యతి ।

దేవజాతి బహిర్భూతో యః పిశాచత్వమాగతః ॥

సురేశ్వరుడిట్లు పలికెను –

ఓ యీ మహాతపస్వీ! నీ ఈ తపస్సుచే నేను సంతసించితినీ. వరమును కోరుకొనుము. నీవు కోరిన కోర్కెలనన్నింటినీ తీర్చెదను. సందేహము వలదు (23). ఇంద్రరూపములో నున్న శంభుడు ఇట్లు పలుకగా ఆతడు చేతులను జోడించి "శివునియందు భక్తిని గోరుచున్నాను' అని పలికెను (24). ఆ మాటను విని ఇంద్రుడిట్లు పలికెను. నీవు నన్ను ఎరుంగవు. దేవతలను రక్షించువాడను నేనే. ముల్లోకములకు ప్రభువు, దేవతలందరిచే నమస్కరింపబడువాడు అగు ఇంద్రుడను నేనే (25). హే విప్రర్షీ! నీవు నా భక్తుడవై సర్వదా నన్ను ఆరాధించుము. నీకు సర్వమునిచ్చెదను. నీకు మంగళమగు గాక! నిర్గుణుడగు రుద్రుని విడిచిపెట్టుము (26). నిర్గుణుడగు రుద్రుని ఆరాధించి ప్రయోజనమేమున్నది? ఈ ఆరాధనను చాలించుము. రుద్రుడు దేవ జాతినుండి బహిష్కరింపబడి పిశాచమైనాడు .

నందీశ్వర ఉవాచః

తచ్ఛ్రుత్వాస మునేః పుత్రో జపన్ పంచాక్షరం మనుమ్ ।

మన్యమానో ధర్మవిఘ్నం ప్రాహ తం కర్తుమాగతమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఆ మాటలను విని ఆ మునిపుత్రుడు ఇంద్రుని తన ధర్మమునకు విఘ్నమును కలిగించుటకై వచ్చిన వానినిగా లెక్కగట్టి పంచాక్షరమంత్రమును జపిస్తూ ఇట్లు పలికెను.

ఉపమన్యురువాచ।

త్వయైవం కథితం సర్వం భవనిందారతేన వై।

ప్రసంగాద్దేవదేవస్య నిర్గుణత్వం పిశాచతా ॥

త్వం న జానాసి వై రుద్రం సర్వదేవేశ్వరేశ్వరమ్ ।

బ్రహ్మా విష్ణుమహేశానాం జనకం ప్రకృతేః పరమ్ ॥

సదసద్వ్యక్త మవ్యక్తం యమాహుర్బ్రహ్మా వాదినః ।

నిత్యమేక మనేకం చ వరం తస్మాద్వృణో మ్యహమ్ ॥

హేతువాద వినిర్ముక్తం సాంఖ్యయో గార్థదం పరమ్ ।

యముశంతి హి తత్త్వజ్ఞా వరం తస్మా ద్వృణోమ్యహమ్ ॥

నాస్తి శంభోః పరం తత్త్వం సర్వకారణ కారణమ్ ।

బ్రహ్మా విష్ణ్వాది దేవానాం శ్రేష్ఠో గుణపరాద్విభోః ॥

నాహం వృణే వరం త్వత్తో న విష్ణోర్బ్రహ్మణోఽపి వా ।
నాన్యస్మాదమరాద్వాపి శంకరో వరదోఽస్తు మే ॥
బహునాత్ర కిముక్తేన వచ్మి తత్త్వం మతం స్వకమ్ ।
న ప్రార్థయే పశుపతేరన్యం దేవాదికం స్ఫుటమ్ ॥
మద్భావం శృణు గోత్రారే మయాద్యానుమితం త్విదమ్ ।
భవాంతరే కృతం పాపం శ్రుతా నిందా భవస్య చేత్ ॥
శ్రుత్వా నిందాం భవస్యాథ తత్క్షణాదేవ సంత్యజేత్ ।
స్వదేహం తన్నిహత్యాశు శివలోకం స గచ్ఛతి ॥
ఆస్తాం తావన్మ మేచ్ఛేయం క్షీరం ప్రతీ సురాధమ ।
నిహత్య త్వాం శివాస్త్రేణ త్యజామ్యేతత్క లేవరమ్ ॥

ఉపమన్యువు ఇట్లు పలికెను -

ఆ దేవదేవుడగు శివుని ప్రసంగమును మొదలిడి శివనింద యందు అభిరుచి గల నీవు ఆ నిర్గుణత్వము, పిశాచత్వము మొదలగు గుణములనన్నిటినీ ఈ విధముగా చెప్పియుంటివి (29). దేవ ప్రభువులందరికీ ప్రభువు, బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు తండ్రి, ప్రకృతికంటే అతీతుడు అగు రుద్రుని నీవు ఎరుగవు. (30), రుద్రుడు కార్యకారణ స్వరూపుడనియు, వ్యక్తమగు జగత్తు అవ్యక్తమగు ప్రకృతి ఆయన స్వరూపమేననియు, నిత్యుడనియు, అద్వితీయుడనియు, అనేక రూపుడనియు బ్రహ్మవేత్తలు చెప్పుచున్నారు. నేను అట్టి రుద్రుని నుండి వరమును కోరెదను (31). రుద్రుడు "హేతువాదమునకు దొరకడనియు, జ్ఞానయోగఫలము అగు మోక్షమును ఇచ్చువాడనియు, పరమాత్ముడనియు తత్త్వవేత్తలు చెప్పు చున్నారు. నేను అట్టి రుద్రుని నుండి వరమును కోరెదను (32). శంభుని మించిన తత్త్వము లేదు. శంభుడే సర్వకారణకారణుడు, బ్రహ్మ విష్ణువు మొదలగు దేవతలందరి కంటే శ్రేష్ఠుడు, గుణాతీతుడు మరియు సర్వవ్యాపి (33). నేను నీనుండి గాని, బ్రహ్మ విష్ణువులనుండి గాని, ఇతర దేవతలనుండి గాని వరమును గోరుట లేదు. నాకు శివుడు వరమునిచ్చుగాక! (34) ఇన్ని మాటలేల? నా నిశ్చయమును యథార్థముగా చెప్పుచున్నాను. శివుని తక్క ఇతర దేవతలనుండి వరమును నిశ్చయముగా కోరుట లేదు (35). ఓ ఇంద్రా! నా అభిప్రాయమును వినుము. నేనీనాడు ఇట్లు ఊహించితిని. పూర్వజన్మలో పాపముచేసి యుండుటచే ఇపుడు శివనిందను వినవలసి వచ్చినది (86). శివనిందను విన్న వ్యక్తి వెంటనే ఆ దేహమును విడువవలెను. అట్లు చేసినచో వెంటనే శివలోకమును పొందును (87). ఓ దేవతాధమా! పాలను గురించి నాకు గల ఇచ్ఛను ప్రక్కకు పెట్టి శివాస్త్రముచే నిన్ను సంహరించి నేనీ దేహమును పరిత్యజించెదను .

నందీశ్వర ఉవాచః

ఏవముక్త్వో పమన్యుస్తం మర్తుం వ్యవసితస్స్వయమ్ ।
క్షీరే వాంఛామపి త్యక్త్వా నిహంతుం శక్ర ముద్యతః ॥
భస్మాదాయ తదాధారాదఘోరాస్త్రాభి మంత్రితమ్ ।
విసృజ్య శక్రముద్దిశ్య ననాద స మునిస్తదా ॥
స్మృత్వా స్వేష్ట పదద్వంద్వం స్వదేహం దగ్ధు ముద్యతః ।
ఆగ్నేయీం ధారణాం బిభ్రదుపమన్యురవస్థితః ॥
ఏవం వ్యవసితే విప్రే భగవాన్ శక్రరూపవాన్ ।
వారయామాస సౌమ్యేన ధారణాం తస్య యోగినః ॥
తద్విసృష్టమ ఘోరాస్త్రం నందీశ్వర నియోగతః ।
జగృహే మధ్యతః క్షిప్తం నందీ శంకరవల్లభమ్ ॥
స్వరూపమేవ భగవానాస్థాయ పరమేశ్వరః ।
దర్శయామాస విప్రాయ బాలేందు కృతశేఖరమ్ ॥
క్షీరార్ణవసహస్రం చ దధ్యాదే రర్ణవం తథా ।
భక్ష్య భోజ్యార్ణవం తస్మై దర్శయామాస స ప్రభుః ॥
ఏవం స దదృశే శంభుర్దేవ్యా సార్ధం వృషోపరి ।
గణేశ్వరై స్త్రీ శూలాద్యై ర్దివ్యా స్త్రైరపి సంవృతః ॥
దివి దుందు భయో నేదుః పుష్పవృష్టిః పపాత హ ।
విష్ణు బ్రహ్మేంద్ర ప్రముఖైర్దేవైశ్ఛన్నా దిశో దశ ॥
అథోపమన్యురానంద సముద్రోర్మిభిరావృతః ।
పపాత దండవద్భూమౌ భక్తి నమ్రేణ చేతసా ॥
ఏతస్మిన్ సమయే తత్ర సుస్మితో భగవాన్ భవః ।
ఏహ్యే హీతి సమాహూయ మూర్ధ్న్యాఘ్రాయ దదౌ వరాన్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఉపమన్యుడు ఇట్లు పలికి పాలయందలి కోర్కెను కూడ విడిచిపెట్టి స్వయముఃగా ఇంద్రుని సంహరించుటకు పూనుకొనేను (39). ఆ మహర్షి అపుడు శివలింగము యొక్క పీఠమునుండి భస్మను తీసుకొని అఘోరాస్త్రముతో అభిసంధించి దానిని ఇంద్రునిపైకి విడిచిపెట్టి సింహనాదమును చేసెను (40). ఆ ఉపమన్యుడు తన ఇష్టదైవము యొక్క పాదపద్మములను స్మరించి ఆగ్నేయాస్త్రమును ధారణచేసి తన "దేహమును తగుల బెట్టుటకు సంసిద్ధుడాయెను (41). ఆ బ్రాహ్మణుడిట్లు సంసిద్ధుడు కాగా, ఇంద్ర రూపములోనున్న శివుడు సౌమ్యమగు రూపమును దాల్చి ఆ యోగియొక్క అగ్నిధారణను శమింపజేసెను (42). ఆతనిచే విడువబడిన, శంకరునకు ప్రియమైన అఘోరాస్త్రమును నందీశ్వరుని ఆదేశముచే నంది మధ్యలో పట్టుకొని ఆవల పారవేసెను (43). పరమేశ్వరుడు నిజరూపమును దాల్చెను. ఆ బ్రాహ్మణుడు

చంద్రవంకచే అలంకరించబడిన శిరస్సు గల భగవానుని దర్శించెను (44). ఆ ప్రభుడు ఆ బాలకునకు పాలు, పెరుగు, భక్ష్యములు, భోజ్యములు మొదలగు వాటి సముద్రములను చూపించెను (45). పార్వతీదేవితో గూడి నందీశ్వరుని అధిష్ఠించి గణాధ్యక్షులచే సేవింపబడుతూ త్రిశూలాది దివ్యాస్త్రములను ధరించియున్న శంభుని ఆ బాలకుడు ఈ తీరున గాంచెను (46). ద్యులోకము నందు దుందుభులు మ్రోగినవి. పుష్పవృష్టి గురిసెను. విష్ణువు, బ్రహ్మ మొదలగు దేవతలచే పది దిక్కులు నిండి పోయెను (47). అపుడు ఉపమన్యుని హృదయములో ఆనంద సముద్రముయొక్క తరంగములు ఉద్భవించెను. ఆతడు భక్తితో వినయముతో గూడిన మనస్సు గలవాడై సాష్టాంగ ప్రణామము నాచరించెను (48). అదే సమయములో అచట చిరునవ్వుతో ప్రకాశించే శివభగవానుడు 'రమ్ము రమ్ము' అని ఆ బాలకుని దగ్గరకు పిలిచి లలాటముపై ముద్దిడి వరములనిచ్చెను.

శివ ఉవాచః

వత్సోపమన్యో తుష్టోఽస్మి త్వదాచరణతో వరాత్ ।
దృఢభక్తోఽసి విప్రర్షే మయా జిజ్ఞాసితోఽధునా ॥
భక్ష్యభోగ్యాన్ యథాకామం బాంధవైర్భుంక్ష్వ సర్వదా ।
సుఖీ భవ సదా దుఃఖ నిర్ముక్తో భక్తి మాన్మమ ॥
ఉపమన్యో మహాభాగ తవాంబైషా హి పార్వతీ ।
మయా పుత్రీకృతో హ్యద్య కుమారస్త్వం సనాతనమ్ ॥
దుగ్ధదధ్యా జ్యమధునామర్ణ వాశ్చ సహస్రశః ।
భక్ష్య భోజ్యాది వస్తూ నా మర్ణవా శ్చాఖిలాస్తథా ॥
తుభ్యం దత్తం మయా ప్రీత్యా త్వం గృహ్ణీష్వ మహామునే ।
అమరత్వం తథా దక్ష గాణపత్యం చ శాశ్వతమ్ ॥
పితాఽహం తే మహాదేవో మాతా తే జగదంబికా ।
వరాన్ వరయ సుప్రీత్యా మనోఽభిలషితాన్ పరాన్ ॥
అజరశ్చామరశ్చైవ భవ త్వం దుఃఖవర్జితః ।
యశస్వీ వరతేజస్వీ దివ్య జ్ఞానీ మహాప్రభుః ॥

శివుడిట్లు పలికెను –

ఓ వత్సా! ఉపమన్యూ! నీ శ్రేష్ఠమగు ఆచరణము వలన నేను సంతసించితిని. ఓ విప్రర్షీ! నీవు దృఢమగు భక్తి గలవాడవు. నేను నిన్ను ఈనాడు పరీక్షించగోరితిని (50). నీవు సర్వకాలములలో యథేచ్ఛగా బంధువులతో గూడి భక్ష్యములను భుజించి భోగములననుభవించుము. నీవు సర్వదా దుఃఖమునుండి విముక్తిని పొంది నాకు భక్తుడవై సుఖమును పొందుము (51). ఓ మహాత్మా! ఉపమన్యూ! ఈమె నీ తల్లియగు పార్వతి. నేను నిన్ను ఈనాడు శాశ్వతముగా నా కుమారునిగా స్వీకరించు చున్నాను (52). పాలు, పెరుగు, తేనే, నేయి, ఇత్యాది సర్వ భక్ష్య వస్తువుల సముద్రములను అసంఖ్యాకముగా (53) నేను నీకు ప్రీతితో ఇచ్చు చున్నాను. ఓ మహర్షీ! స్వీకరించుము. ఓయీ! నీవు సమర్థుడవు. నీకు నేను

అమరత్వమును, శాశ్వతమగు గణాధ్యక్షత్వమును ఇచ్చు చున్నాను (54): మహాదేవుడనగు నేను 'నీకు తండ్రిని. జగన్మాత నీ తల్లి. నీవు నీ మనస్సునకు నచ్చిన శ్రేష్ఠమగు వరములను ఆనందముతో కోరుకొనుము (55). నీవు దుఃఖమును విడనాడి జరామరణములు లేని వాడవై, యశస్సును పొంది, గొప్ప తేజశ్శాలివై, దివ్యజ్ఞానమును పొంది మహాప్రభుడవు కమ్ము .

అథ శంభుః ప్రసన్నాత్మా స్మృత్వా తస్య తపో మహత్ ।

పునర్దశ వరాన్ దివ్యాన్ మునయే హ్యుపమన్య వే ॥

వ్రతం పాశుపతం జ్ఞానం వ్రతయోగం చ తత్త్వతః ।

దదౌ తస్మై ప్రవక్తృత్వం పాటవం చ నిజం పదమ్ ॥

ఏవం దత్త్వా మహాదేవః కరాభ్యాముపగృహ్య తమ్ ।

మూర్ధ్న్యాఘ్రాయ సుతస్తేఽయమితి దేవ్యై న్యవేదయత్ ॥

దేవీ చ శృణ్వతీ ప్రీత్యా మూర్ధ్ని దేశే కరాంబుజమ్ ।

విన్యస్య ప్రదదౌ తస్మై కుమారపదమక్షయమ్ ॥

క్షీరాబ్ధిమపి సాకారం క్షీరస్వాదుకరో దధిః ।

ఉపాస్థాయ దదౌ తస్మై పిండీభూత మనశ్వరమ్ ॥

యోగైశ్వర్యం సదా తుష్టం బ్రహ్మ విద్యామనశ్వరామ్ ।

సమృద్ధిం పరమాం తస్మై దదౌ సంతుష్టమానసః ॥

సోఽపి లబ్ధ్వా వరాన్ దివ్యాన్ కుమారత్వం చ సర్వదా ।

తస్మాచ్ఛివాచ్చ తస్యాశ్చ శివాయా ముదితోఽభవత్ ॥

తతః ప్రసన్నచేతస్క స్సు ప్రణమ్య కృతాంజలిః ।

యయాచే స వరం ప్రీత్యా దేవదేవాన్మహేశ్వరాత్ ॥

అపుడు శంభుడు ప్రసన్నమగు అంతఃకరణము గలవాడై ఉపమన్యు మహర్షి యొక్క గొప్ప తపస్సును గుర్తు చేసుకొని మరల ఆతనికి పది దివ్యములగు వరముల నిచ్చేను (57). పాశుపతవ్రతమును, వ్రతముతో ఈశ్వరుని పొందగలిగే జ్ఞానయోగమును, ప్రవచన శక్తిని మరియు తన ధామమును ఆతనికి ఇచ్చెను (58). మహాదేవుడు ఇట్లు ఆతనికి వరములనిచ్చి రెండు చేతులతో ఆతనిని దగ్గరకు తీసుకొని లలాటముపై ముద్దిడి, 'ఈతడు నీ కుమారుడు' అని పార్వతీదేవికి విన్నవించెను (59). ఆ మాటను విని పార్వతీదేవి ప్రేమతో పద్మము వంటి హస్తమును శిరస్సుపై నుంచి ఆతనికి అక్షయమగు కుమారపదమునిచ్చెను (60). క్షీరమువలె మాధుర్యముతో నిండిన హృదయముగల దయాసముద్రుడగు శివుడు అవినాశియగు క్షీరసముద్రమును పిండముగా చేసి ఆకృతిని కలిగియున్న ఆ సముద్రమునాతనికి ఇచ్చేను (61). సంతసించిన మనస్సు గల శివుడు ఆతనికి యోగశక్తినీ, నిత్యానందమును, 'అవినాశియగు బ్రహ్మవిద్యను మరియు పరమ సమృద్ధినీ ఇచ్చెను (62). ఆతడు కూడా ఆ శివపార్వతులనుండి దివ్యవరములను, శాశ్వతమగు కుమారత్వమును పొంది ఆనందించెను (63). అపుడాతడు ప్రసన్నమగు మనస్సు గలవాడై దేవదేవుడగు మహేశ్వరునకు ప్రణమిల్లి ప్రేమతో చేతులు జోడించి వరమును కోరేను .

ఉపమన్యు రువాచ ।

ప్రసీద దేవదేవేశ ప్రసీద పరమేశ్వర।
స్వభక్తిం దేహి పరమాం దివ్యామ వ్యభిచారిణీమ్ ॥
శ్రద్ధాం దేహి మహాదేవ స్వ సంబంధిషు మే సదా ।
స్వదాస్యం పరమం స్నేహం స్వసాన్నిధ్యం చ సర్వదా ॥

ఉపమన్యువు ఇట్లు పలికెను -

ఓ దేవదేవా! ప్రసన్నుడవు కమ్ము, పరమేశ్వరా! ప్రసన్నుడవు కమ్ము, నీయందు హెచ్చుతగ్గులులేని పరమదివ్యభక్తిని నాకు ఇమ్ము (65), ఓ మహాదేవా! సర్వదా నీకు భక్తుల యందు శ్రద్ధను, నీ దాస్యమును, పవిత్రమగు నీ స్నేహమును, నీ సాన్నిధ్యమును నాకు ఇమ్ము .

నందీశ్వర ఉవాచః

ఏవముక్త్వా ప్రసన్నాత్మా హర్షగద్గదయా గిరా ।
తుష్టావ స మహా దేవముపమన్యుర్ద్విజోత్తమః ॥
ఏవముక్త శ్శివస్తేన సర్వేషాం శృణ్వతాం ప్రభుః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మో పమన్యుం సకలేశ్వరః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ బ్రాహ్మణ శ్రేష్ఠుడగు ఉపమన్యుడు ఇట్లు పలికి ప్రసన్నమగు అంతఃకరణము గలవాడై హర్షముతో బొంగురు వోయిన కంఠముతో మహాదేవుని స్తుతించెను (67). ఉపమన్యుడు ఇట్లు స్తుతించగా సర్వేశ్వరుడగు శివప్రభుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై అందరు వినుచుండగా ఇట్లు బదులిడెను .

శివ ఉవాచః

వత్సో పమన్యో ధన్యస్త్వం మమ భక్తో విశేషతః ।
సర్వం దత్తం మయా తే హి యద్వృతం భవతానఘ ॥
అజరశ్చామరశ్చ త్వం సర్వదా దుఃఖవర్జితః ।
సర్వపూజ్యో నిర్వికారీ భక్తానాం ప్రవరో భవ ॥
అక్షయ బాంధవాశ్చైవ కులం గోత్రం చ తే సదా ।
భవిష్యతి ద్విజశ్రేష్ఠ మయి భక్తిశ్చ శాశ్వతీ ॥
సాన్నిధ్యం చాశ్రమే నిత్యం కరిష్యామి మునే తవ ।
తిష్ఠ వత్స యథా కామం నోత్కంఠాం చ కరిష్యసి ॥

శివుడిట్లు పలికెను -

ఓ వత్సా! ఉపమన్యూ! నీవు ధన్యుడవు, విశేషించి నా భక్తుడవు. ఓ పుణ్యాత్మా◌ా! నీవు కోరిన వరములనన్నిటినీ నీకు ఇచ్చియుంటిని (69). నీవు జరామరణములు లేని వాడవు, సర్వకాలములలో దుఃఖరహితుడవు, సర్వులచే పూజింపబడువాడవు, వికారములు లేనివాడవు, మరియు భక్తులలో శ్రేష్టుడవు కమ్ము (70). ఓ బ్రాహ్మణ శ్రేష్టా! నీ బంధువులు, కులము మరియు గోత్రము వినాశము లేనివి కాగలవు. నీకు నాయందలి భక్తి శాశ్వతమగును (71). ఓ మహర్షీ! నేను నీ ఆశ్రమములో నిత్యము నివసించెదను. వత్సా! ఆనందముగా జీవించుము. బెంగ పెట్టుకొనకుము .

నందీశ్వర ఉవాచః

ఏవముక్త్వా స భగవాంస్తస్మై దత్త్వా వరాన్ వరాన్।
సాంబశ్చ సగణస్సద్య స్తత్రైవాంతర్దధే ప్రభుః ॥

ఉపమన్యుః ప్రసన్నాత్మా ప్రాప్య శంభో ర్వరాన్ వరాన్ ।
జగామ జననీస్థానం మాత్రే సర్వమవర్ణయత్ ॥

తచ్ఛ్రుత్వా తస్య జననీ మహాహర్షమవాప సా ।
సర్వపూజ్యోఽ భవత్సోఽపి సుఖం ప్రాపాధికం సదా ॥

ఇత్థం తే వర్ణితస్తాత శివస్య పరమాత్మనః ।
సురేశ్వరావతా రో హి సర్వదా సుఖదస్సతామ్ ॥

ఇదమాఖ్యానమనఘం సర్వకామ ఫలప్రదమ్ ।
స్వర్గ్యం యశస్య మాయుష్యం భక్తి ముక్తి ప్రదం సతామ్ ॥

య ఏత చ్ఛృణు యాద్భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
ఇహ సర్వసుఖం భుక్త్వా సోంతే శివగతం లభేత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం సురేశ్వరావతార వర్ణనం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఇట్లు పలికి జగన్నాథుడగు ఆ భగవానుడు ఆతనికి శ్రేష్ఠమగు వరములనిచ్చిన పిదప పార్వతితో మరియు గణములతో గూడి అచటనే అంతర్ధానమాయెను (73). ఉపమన్యుడు శంభుని నుండి శ్రేష్ఠమగు వరములను పొంది ప్రసన్నమగు మనస్సు గలవాడై తల్లి ఉన్న స్థానమునకు వెళ్లి సర్వమును తల్లికి వర్ణించి చెప్పెను (74). ఆ వృత్తాంతమును విని ఆతని తల్లి మహానందమును పొందెను. ఆతడు అందరిచే పూజింపబడినవాడై నిత్యము అధికసుఖమును పొందెను (75). వత్సా! సత్పురుషులకు సర్వదా సుఖమునిచ్చే, శివుని సురేశ్వరావతారమును నీకు ఈ తీరున వర్ణించి చెప్పితిని. పరమాత్మయగు శివుని ఈ గాథ పవిత్రమైనది, కోర్కెల నన్నిటినీ ఈడేర్చునది, స్వర్గమును యశస్సును ఆయుర్దాయమును ఇచ్చునది. ఈ గాథ సత్పురుషులకు భుక్తిని ముక్తిని కూడ ఇచ్చును (76,77). ఎవడైతే దీనిని భక్తితో వినునో, లేదో ఏకాగ్రచిత్తముతో వినిపించునో, అట్టివాడు ఇహలోకములో సర్వసుఖముల ననుభవించి మరణించిన పిదప శివపదమును పొందును .

శ్రీ శివమహాపురాణములోని శతరుద్రసంహితయందు
సురేశ్వరావతారవర్ణనమనే ముప్పది రెండవ అధ్యాయము ముగిసినది.

33 – జటిలావతారము

నందీశ్వర ఉవాచః

సనత్కుమార సుప్రీత్యా శివస్య పరమాత్మనః ।
అవతారం శృణు విభోర్జటిలాహ్వం సుపావనమ్ ॥
పురా సతీ దక్షకన్యా త్యక్త్వా దేహం పితుర్మఖే ।
స్వపిత్రాఽనాదృతా జజ్ఞే మేనాయాం హిమ భూధరాత్॥
సా గత్వా గహనేఽరణ్యే తేపే సువిమలం తపః ।
శంకరం పతిమిచ్ఛంతీ సఖీభ్యాం సంయుతా శివా ॥
తత్తపస్సుపరీక్షార్థం సప్తర్షీన్ ప్రైషయచ్ఛివః ।
తపస్థానం తు పార్వత్యా నానా లీలా విశారదః ॥
తే గత్వా తత్ర మునయః పరీక్షాం చక్రురాదరాత్ ।
తస్యాస్సు యత్నతో నైవ సమర్థా హ్యభవంశ్చ తే ॥
తత్రాగత్య శివం నత్వా వృత్తాంతం చ నివేద్య తత్ ।
తదాజ్ఞాం సమను ప్రాప్య స్వర్లో కం జగ్మురాదరాత్ ॥
గతేషు తేషు మునీషు స్వస్థానం శంకరస్స్వయమ్ ।
పరీక్షితుం శివావృత్తమైచ్ఛత్సూతికరః ప్రభుః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓ సనత్కుమారా! సర్వవ్యాపకుడు, పరమాత్మయగు శివుడు పరమపవిత్రమగు జటిలావతారమును దాల్చెను. నీవా గాథను పరమ ప్రీతితో వినుము (1). పూర్వం దక్షుని కుమార్తె యగు సతీదేవి తండ్రియొక్క యజ్ఞములో తన తండ్రిచే అవమానింపబడి మేనాహిమవంతులకు కుమార్తెయై జన్మించెను (2). ఆ పార్వతి శంకరుని భర్తగా పొందగోరి సఖురాండ్రతో గూడి దట్టమగు అడవిలోకి వెళ్లి గొప్ప తపస్సును చేసెను (3), అనేకలీలలను ప్రకటించుటలో పండితుడగు శివుడు పార్వతి యొక్క తపస్సును పరీక్షించుట కొరకై ఆమె తపస్సు చేయుచున్న స్థలమునకు సప్తర్షులను పంపించెను (4). ఆ మహర్షులు ఆచటకు వెళ్లి ఆమెను ఆదరపూర్వకముగా పరీక్షించిరి. వారు అధిక ప్రయత్నమును చేసియూ ఆమెలో దోషమును కానరైరి (5). అపుడు వారు కైలాసమునకు వెళ్లి శివునకు ప్రణమిల్లి ఆ వృత్తాంతమును విన్నవించి ఆయన అనుమతిని, పొంది ఆదరముతో స్వర్గలోకమునకు వెళ్లిరి (6). వారు తమ స్థానములకు వెళ్లిన పిదప, లీలాకరుడగు శంకరప్రభుడు పార్వతీదేవి యొక్క ప్రవృత్తిని స్వయముగా పరీక్షించగోరెను.

సుప్రసన్న స్తపస్వీవ్యాశమనాదయమీశ్వరః ।
బ్రహ్మచర్య స్వరూపోఽభూత్త దాద్భుతతరః ప్రభుః ॥
అతీవ స్థవిరో విప్రదేహధారీ స్వతేజసా ।
ప్రజ్వలన్మనసా హృష్టో దండీ ఛత్రీ మహోజ్జ్వలః ॥
ధృత్వైవం జాటీలం రూపం జగామ గిరిజావనమ్ ।
అతిప్రీతియుత శ్శంభుశ్శంకరో భక్తవత్సలః ॥
తత్రాపశ్యత్ స్థితాం దేవీం సఖీభిః పరివారితామ్ ।
వేదికోపరి శుద్ధాం తాం శివామివ వీధోః కలామ్ ॥
శంభుర్నిరీక్ష్య తాం దేవీం బ్రహ్మచారి స్వరూపవాన్ ।
ఉపకంఠం యయౌ ప్రీత్యా చోత్సుకీ భక్తవత్సలః ॥
ఆ గతం సా తదా దృష్ట్వా బ్రాహ్మణం తేజసాద్భుతమ్ ।
అంగేషు లో మశం శాంతం దండచర్మ సమన్వితమ్ ॥
బ్రహ్మ చర్యధరం వృద్ధం జటిలం సకమండలుమ్ ।
అపూజయత్పరప్రీత్యా సర్వ పూజోపహారకైః ॥
తతస్సా పార్వతీ దేవీ పూజితం పరయా ముదా ।
కుశలం పర్యపృచ్ఛత్తం బ్రహ్మచారిణ మాదరాత్ ॥
బ్రహ్మచారి స్వరూపేణ కస్త్వం హీ కుత ఆగతః ।
ఇదం వనం భాసయసి వద వేదవిదాం వర ॥

అపుడు అద్భుతమగు లీలలను ప్రదర్శించే ఆ శంకరప్రభుడు కోరికలు తొలగిపోవుటచే ప్రసన్నమగు మనస్సు గలవాడు, తపశ్శాలి అగు బ్రహ్మచారి రూపమును దాల్చెను (8). ఆయన మిక్కిలి ముదుసలియగు బ్రాహ్మణుని వేషమును దాల్చెను. ఆయన స్వీయమగు తేజస్సుతో ప్రకాశిస్తూ, ఆనందముతో నిండిన మనస్సును కలిగియుండెను. ఆయన కర్రను, గొడుగును చేతబట్టి అతిశయించిన కాంతితో ప్రకాశించెను (9). మంగళకరుడు, భక్తవత్సలుడు అగు శంకరుడు అతిశయించిన ప్రేమ గలవాడై ఈ విధముగా జటాధారియగు బ్రహ్మచారిరూపమును దాల్చి పార్వతీదేవియొక్క తపోవనమును ప్రవేశించెను (10). అచట వేదికపై చెలికత్తెలతో చుట్టువారబడి, చంద్రుని మంగళకరమగు స్వచ్ఛమైన కళవలె ప్రకాశించే పార్వతీదేవిని చూచెను (11). బ్రహ్మచారి రూపములో నున్న భక్తవత్సలుడగు శంభుడు ఆ దేవిని చూచి, ప్రేమతో మరియు ఉత్కంఠతో దగ్గరకు వెళ్లెను (12). అపుడు తేజస్సుతో అద్భుతముగా ప్రకాశించుచున్నవాడు, రోమములతో నిండిన అవయవములు గలవాడు, ప్రసన్నుడు, కర్ర మరియు మృగచర్మము గలవాడు, బ్రహ్మచారి, ముదుసలి, కమండలమును పట్టుకున్నవాడు అగు ఆ బ్రాహ్మణుడు తన వద్దకు వచ్చుటను గాంచి, ఆమె పరమ ప్రీతితో ఆయనను సకలములగు పూజాద్రవ్యములతో పూజించెను (13, 14). ఈ విధముగా పూజలనందుకున్న ఆ బ్రహ్మచారిని తరువాత ఆమె పరమప్రీతితో మరియు ఆదరముతో కుశలప్రశ్నలనడిగేను (15). ఓయీ ! నీవు బ్రహ్మచారివలె కన్పట్టుచున్నావు. నీవెవరివి ? ఎక్కడనుండి వచ్చితివి ? చెప్పుము. వేదవేత్తలలో శ్రేష్ఠుడవగు నీచే ఈ వనము భాసించుచున్నది .

నందీశ్వర ఉవాచః

ఇతి పృష్టస్తు పార్వత్యా బ్రహ్మచారీ స వై ద్విజః ।
ప్రత్యువాచ ద్రుతం ప్రీత్యా శివాభావపరీక్షయా ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

పార్వతి ఇట్లు ప్రశ్నించగా, బ్రహ్మచారియగు ఆ బ్రాహ్మణుడు ఆమె భక్తిని పరీక్షింపగోరి వెంటనే ప్రేమతో ఇట్లు సమాధానమును చెప్పెను .

బ్రహ్మ చార్యువాచ ।

అహమిచ్ఛాభిగామీ చ బ్రహ్మచారీ ద్విజస్స వై ।
తపస్వీ సుఖదోఽన్యేషాముపకారీ న సంశయః ॥

బ్రహ్మచారి ఇట్లు పలికెను –

నేను యథేచ్ఛగా సంచరించే బ్రహ్మచారిని, బ్రాహ్మణుడను. తపశ్శాలినగు నేను ఇతరులకు ఉపకారము చేసి, సుఖమును కలిగించుచుందుననుటలో సందేహము లేదు .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా బ్రహ్మచారీ స శంకరో భక్తవత్సలః ।
తస్థివానుపకంఠం స గోపయన్ రూపమాత్మనః ॥

నందీశ్వరుడిట్లు పలికెను–

బ్రహ్మచారి రూపములోనున్న భక్తవత్సలుడగు ఆ శంకరుడు ఇట్లు పలికి, తన యథార్థస్వరూపమును రహస్యముగా నుంచి, ఆమెకు దగ్గరలో నిలబడెను.

బ్రహ్మచార్యువాచ।

కిం బ్రవీమి మహాదేవి కథనీయం న విద్యతే ।
మహానర్థకరం వృత్తం దృశ్యతే వికృతం మహత్ ॥
నవే వయసి సద్భోగసాధనే సుఖకారణే ।
మహోపచార సద్భోగైర్వృథైవ త్వం తపస్యసి ॥
కా త్వం కస్యాసి తనయా కిమర్థం విజనే వనే ।
తపశ్చరసి దుర్ధర్షం మునిభిః ప్రయతాత్మభిః ॥

బ్రహ్మచారి ఇట్లు పలికెను –

ఓ మహాదేవీ ! ఏమి చెప్పగలను? చెప్పదగినది ఏదీ లేదు. గొప్ప హానిని కలిగించే మహావికృతమగు దృశ్యము నాకు కనబడుచున్నది. (20). మంచి భోగములకు సాధనము, గొప్ప పరిచర్యలతో మరియు చక్కని భోగములతో సుఖమునకు హేతువు అగు నవయౌవనములో నీవు.. వ్యర్థముగా మాత్రమే తపస్సును చేయుచున్నావు (21). నీవెవరివి ? ఎవరి దానవు ? ఈ నిర్జనమగు వనములో నీవు సమాహితమనస్కులగు మహర్షులు కూడ చేయలేని కఠోరమగు

తపస్సును చేయుటకు కారణమేమి ?

నందీశ్వర ఉవాచః

ఇతి తద్వచనం శ్రుత్వా ప్రహస్య పరమేశ్వరీ ।
ఉవాచ వచనం ప్రీత్యా బ్రహ్మచారిణ ముత్తమమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ పరమేశ్వరి ఉత్తముడగు ఆ బ్రహ్మచారియొక్క ఆ మాటను విని నవ్వి ప్రీతిపూర్వకముగా ఇట్లు పలికెను .

పార్వత్యువాచ ।

శృణు విప్ర బ్రహ్మచారిన్ మద్వృత్తమఖిలం మునే ।
జన్మ మే భారతే వర్షే సాంప్రతం హిమవద్గృహే ॥
పూర్వం దక్షగృహే జన్మ సతీ శంకరకామినీ ।
యోగేన త్యక్త దేహోహం తాతేన పతినిందినా ॥
అత్ర జన్మని సంప్రాప్య సుపుణ్యేన శివో ద్విజ ।
మాం త్యక్త్వా భస్మసాత్కృత్య మన్మథం స జగామ హ ॥
ప్రయాతే శంకరే తాపా ద్వ్రీడితాహం పితుర్గృహాత్ ।
ఆగచ్ఛమత్ర తపసే గురువాక్యేన సంయుతా ॥
మనసా వచసా సాక్షాత్కర్మణా పతిభావతః ।
సత్యం బ్రవీమి నోఽసత్యం సంవృతశ్శంకరో మయా ॥
జానామి దుర్లభం వస్తు కథం ప్రాప్యం మయా భవేత్ ।
తథాపి మన సౌత్సుక్యాత్తప్యతే మే తపోఽధునా ॥
హిత్వేంద్ర ప్రముఖాన్ దేవాన్ విష్ణుం బ్రహ్మాణమప్యహమ్ ।
పతిం పినాకపాణిం వై ప్రాప్తుమిచ్ఛామి సత్యతః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ బ్రాహ్మణ బ్రహ్మచారీ ! నా వృత్తాంతమునంతనూ వినుము. ఓ మునీ ! నేను ఈ జన్మలో భారతదేశములో హిమవంతుని ఇంట్లో పుట్టితిని (24). పూర్వజన్మలో దక్షుని కుమార్తెనై జన్మించి శంకరుని చేబట్టితిని. నా తండ్రి నా భర్తను నిందించగా, నేను యోగాగ్నిచే దేహమును విడిచిపెట్టితిని (25). ఓ బ్రాహ్మణుడా ! గొప్ప పుణ్యముచే ఈ జన్మలో ఆ శంకరుని కనుగొంటిని. కాని, ఆయన మన్మథుని బూడిద చేసి, నన్ను విడిచి వెళ్లినాడు (26). శంకరుడు నిష్క్రమించిన పిదప నేను దుఃఖమును పొంది, సిగ్గుపడినదాననై, గురువుయొక్క ఉపదేశమును స్వీకరించి, తపస్సును చేయుటకై తండ్రిగారి ఇంటివద్దనుండి ఇక్కడకు వచ్చితిని (27). నేను సత్యమును చెప్పుచున్నాను. నేను మనోవాక్కాయకర్మలతో సాక్షాత్తుగా శంకరుని భర్తగా వరించితిని. ఇది అసత్యము కాదు (28). పొంద శక్యము కాని వస్తువును నేను ఎట్లు పొందగలను ? అయినప్పటికీ, నేను ఇప్పుడు మనస్సుయొక్క ఉత్సుకత

కారణముగా తపస్సును చేయుచున్నాను (29). ఇంద్రుడు మొదలగు దేవతలను మాత్రమే గాక, బ్రహ్మవిష్ణువులను కూడ విడిచి పెట్టి నేను పినాకమనే ధనస్సును ధరించే శంకరుని భర్తగా పొందగోరుచున్నాను. ఇది యథార్థము .

నందీశ్వర ఉవాచః

ఇత్యేవం వచనం శ్రుత్వా పార్వత్యా హి సునిశ్చితమ్ ।
మునే స జటిలో రుద్రో విహసన్ వాక్యమబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓ మునీ ! పార్వతియొక్క ఈ నిశ్చితమగు వచనమును విని జటాధారియగు ఆ రుద్రుడు నవ్వి ఇట్లు పలికెను .

జటిల ఉవాచః

హిమాచలసుతే దేవి కా బుద్ధిస్స్వీకృతా త్వయా ।
రుద్రార్థం విబుధాన్ హిత్వా కరోషి విపులం తపః ॥
జానామ్యహం చ తం రుద్రం శృణు త్వం ప్రవదామి తే ।
వృషధ్వజస్స రుద్రోహి వికృతాత్మా జటాధరః ॥
ఏకాకీ చ సదా నిత్యం విరాగీ చ విశేషతః ।
తస్మాత్త్వం తేన రుద్రేణ మనో యోక్తుం న చార్హసి ॥
సర్వం విరుద్ధరూపాది తవ దేవి హరస్య చ ।
మహ్యం న రోచతే హ్యేతద్య ధీచ్ఛసి తథా కురు ॥

ఆ జటాధారి ఇట్లు పలికెను –

ఓ హిమవత్పుత్రీ ! దేవీ ! నీవు ఎట్టి బుద్ధిని కలిగియున్నావు ? దేవతలను కాదని రుద్రుని కొరకై కఠోరమగు తపస్సును చేయుచున్నావు (32). ఆ రుద్రుడు నాకు తెలిసినవాడే. నేను చెప్పెదను. నీవు వినుము. వృషభము ధ్వజమునందు గల ఆ రుద్రుడు జటలతో వికృతమగు దేహమును కలిగియుండును (33). సర్వకాలములలో ఏకాకిగా ఉండే ఆయన విశేషించి పూర్ణమగు వైరాగ్యము గలవాడు. కావున, నీవు నీ మనస్సును ఆ రుద్రునిపై ప్రసరింప జేయుట తగదు (34). ఓ దేవీ! నీకు, ఆ శివునకు రూపము మొదలగు సర్వము విరుద్ధముగ నుండును. ఇది నాకు నచ్చలేదు. నీకు తోచినట్లు నీవు చేయుము

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా చ పునా రుద్రో బ్రహ్మచారి స్వరూపవాన్।
నినింద బహుధాత్మానం తదగ్రే తాం పరీక్షితుమ్ ॥
తచ్ఛ్రుత్వా పార్వతీ దేవీ విప్రవాక్యం దురాసహమ్ ।
ప్రత్యువాచ మహాక్రుద్ధా శివనిందాపరం చ తమ్ ॥
ఏతావద్ధి మయా జ్ఞాతం కశ్చిద్ధన్యో భవిష్యతి ।
పరం తు సకలం జ్ఞాతమవధ్యో దృశ్యతేఽధునా ॥

బ్రహ్మచారి స్వరూపేణ కశ్చిత్త్వం ధూర్త ఆ గతః ।
శివనిందా కృతా మూఢ త్వయా మన్యురభూన్మమ ॥
శివం త్వం చ న జానాసి శివాత్త్వం హి బహిర్ముఖః ।
త్వత్పూజా చ కృతా యన్మే తస్మాత్తా పయుతాఽభవమ్ ॥
శివనిందాం కరోతీహ తత్త్వమజ్ఞాయ యః పుమాన్ ।
ఆజన్మసంచితం పుణ్యం తస్య భస్మీభవత్యుత ॥
శివవిద్వేషిణం స్పృష్ట్వా ప్రాయశ్చిత్తం సమాచరేత్ ॥
రే రే దుష్ట త్వయా ప్రోక్త మహం జానామి శంకరమ్ ।
నిశ్చయేన న విజ్ఞాతశ్శివ ఏవ పరః ప్రభుః ॥
యథా తథా భవే ద్రుద్రో మాయయా బహురూపవాన్ ।
మమాభీష్ట ప్రదోఽత్యంతం నిర్వికారస్సతాం ప్రియః ॥
ఇత్యుక్త్వా తం శివా దేవీ శివతత్త్వం జగాద సా ।
యత్ర బ్రహ్మతయా రుద్రః కథ్యతే నిర్గుణోఽవ్యయః ॥
తదాకర్ణ్య వచో దేవ్యా బ్రహ్మచారీ స వై ద్విజః ॥
పునర్వచన మాదాతుం యావదేవ ప్రచక్రమే ॥
ప్రోవాచ గిరిజా తావత్ స్వసఖీం విజయం ద్రుతమ్ ।
శివాసక్తమనో వృత్తి శ్శివ నిందా పరాఙ్ముఖీ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఈ విధముగా పలికి బ్రహ్మచారిరూపములో నున్న రుద్రుడు మరల ఆమె యెదుట ఆమెను పరీక్షించుట కొరకై తనను తాను పలువిధములుగా నిందించుకొనెను (36). సహింప శక్యము కానీ ఆ బ్రాహ్మణుని వచనములను విని ఆ పార్వతీదేవి గొప్ప కోపమును పొంది శివుని నిందించుటయే ప్రధానకర్తవ్యముగా గల ఆయనను ఉద్దేశించి ఇట్లు బదులు చెప్పెను (37). నాకు ఇంతమాత్రము తెలిసినది. శివనిందను చేసినవాడెవడైనా వధకు అర్హుడు అగును. కాని నాకు అంతయు తెలిసినది. నీవు వధకు అర్హుడవు కావని నాకు తోచుచున్నది (38). బ్రహ్మచారిరూపములో వచ్చిన నీవు ఊరు పేరు లేని ధూర్తుడవు. ఓయీ మూర్ఖా ! నీవు శివుని నిందించి నాకు కోపమును తెప్పించినావు (39). నీకు శివుడు తెలియదు. నీవు శివతత్త్వము విషయములో బహిర్ముఖుడవు. నేను నిన్ను పూజించినాను అనే విషయము నాకు మనస్తాపమును కలిగించుచున్నది (40). ఈ లోకములో ఏ మానవుడు సత్యము తెలియనివాడై శివుని నిందించునో, వాని పూర్వజన్మార్జితమైన పుణ్యము అంతయు భస్మమగును (41). శివుని ద్వేషించువానిని ముట్టుకున్నచో, ప్రాయశ్చిత్తమును చేసుకొనవలెను (42). ఓరీ దుష్టా ! నాకు శంకరుడు తెలిసినవాడేననీ నీవు చెప్పియుంటివి. కానీ పరమప్రభుడగు ఆ శంకరుని నీవు ఖచ్చితముగా యెరుగవు(43). ఆ రుద్రుడు మాయచే వివిధములగు రూపమును దాల్చుచుండును. వికారములు లేనివాడు, సత్పురుషులకు ప్రియుడు అగు ఆయన నిశ్చయముగా (44). ఆ పార్వతీదేవి ఆ బ్రహ్మచారితో ఇట్లు పలికి, మరల ఈ విధముగా శివతత్త్వమును బోధించెను. నిర్గుణము, వినాశము లేనిది

అగు పరబ్రహ్మమే సగుణోపాధియందు రుద్రుడు అని పిలువబడుచున్నది (45). ఆ బ్రాహ్మణబ్రహ్మచారి ఆ దేవియొక్క మాటలను విని, మరల మాటలాడుటకు సిద్ధపడుచుండెను (46). అంతలో శివునియందు లగ్నమైన మనోవృత్తులు గల పార్వతి శివనిందను భరించలేనిది, తన సఖురాలగు విజయతో వెంటనే ఇట్లు పలికెను .

గిరిజోవాచ।

వారణీయః ప్రయత్నేన సఖ్యయం హి ద్విజాధమః ।
పునర్వక్తు మనాశ్చాయం శివనిందాం కరిష్యతి ॥
న కేవలం భవేత్పాపం నిందాకర్తు శ్శివస్య హి ।
యో వై శృణోతి తన్నిందాం పాపభాక్ స భవేదిహ ॥
శివనిందాకరో వధ్యస్సర్వథా శివకింకరైః ।
బ్రాహ్మణశ్చేత్స వై త్యాజ్యో గంతవ్యం తత్ స్థలాద్ద్రుతమ్ ॥
అయం దుష్టః పునర్నిందాం కరిష్యతి శివస్య హి ।
బ్రాహ్మణత్వాదవధ్యశ్చ త్యాజ్యో ఽ దృశ్యశ్చ సర్వథా ॥
స్థలమేతద్ద్రుతం హిత్వా యాస్యామోఽన్యత్ర మా చిరమ్ ।
యథా సంభాషణం న స్యా దనేనావిదుషా పునః ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓ సఖీ ! నీవు ప్రయత్నపూర్వకముగా ఈ బ్రాహ్మణాధముని ఆపుము. ఈతడు మరల ఏదో చెప్పబోవుచున్నాడు. మరల శివుని నిందించగలడు (48). ఈ లోకములో శివుని నిందించువానికి మాత్రమే గాక, ఆ నిందను విను వానికి కూడ పాపము సంక్రమించును (49). శివనిందను. చేయువాడు వధకు అర్హుడు. శివభక్తులు వానిని వధించవలెను. కాని వాడు బ్రాహ్మణుడైనచో, వదలి పెట్టవలెను. కాని, అచ్చోటనుండి వెంటనే దూరముగా పోవలెను (50). ఈ దుష్టుడు మరల శివుని నిందించగలడు. కాని, బ్రాహ్మణుడు గనుక వధార్హుడు కాడు. కావున, మరల కంటికి కానరాని విధముగా, వీనికి మనము దూరముగా పోవలెను (51). కావున ఆలస్యము చేయవద్దు. మనమీ స్థలమును వెంటనే విడిచిపెట్టి దూరముగా పోయెదము. ఈ మూర్ఖునితో మనకు మరల సంభాషణము వద్దు .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా చోమయా యావత్పదముత్ క్షిప్యతే మునే ।
అసౌ తావచ్ఛివ స్సాక్షాదాలలం బే పటం స్వయమ్ ॥
కృత్వా స్వరూపం దివ్యం చ శివా ధ్యానం యథా తథా ।
దర్శయిత్వా శివాయై తామునాచావాఙ్ముఖీం శివః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మునీ ! పార్వతి ఇట్లు పలికి కాలును ముందుకు వేయునంతలో ఈ శివుడు సాక్షాత్తుగా స్వయముగా ఆమె కొంగును పట్టుకొనెను (53). ఆ పార్వతి ధ్యానములో ఏ రూపమును దర్శించెడిదో, అట్టి దివ్యరూపమును శివుడు ఆమెకు చూపించి, తలను వంచుకొనియున్న ఆమెతో నిట్లనెను .

శివ ఉవాచః

కుత్ర త్వం యాసి మాం హిత్వా న త్వం త్యాజ్యా మయా శివే ।
మయా పరీక్షితాసీ త్వం దృఢభక్తాసి మే నఘే ॥
బ్రహ్మచారి స్వరూపేణ భావమిచ్ఛుస్స్వ దీయకమ్ ।
తవోప కంఠమాగత్య ప్రావోచం వివిధం వచః ॥
ప్రసన్నోఽస్మి దృఢం భక్త్యా శివే తవ విశేషతః ।
చిత్తేప్సితం వరం బ్రూహి నాదేయం విద్యతే తవ ॥
అద్య ప్రభృతి తే దాసస్తపోభిః ప్రేమనిర్భరే ।
కృతోఽస్మి తవ సౌందర్యాత్ క్షణ ఏకో యుగాయతే ॥
త్యజ్యతాం చ త్వయా లజ్జ మమ పత్నీ సనాతనీ ।
ఏహి ప్రియే త్వయా సాకం ద్రుతం యామీ స్వకం గిరిమ్ ॥
ఇత్యుక్తవతి దేవేశే శివాతి ముదమాప సా ।
తపోదుఃఖం తు యత్సర్వం తజ్జహౌ ద్రుతమేవ హి ॥
తతః ప్రహృష్టా సా దృష్ట్వా దివ్యరూపం శివస్య తత్ ।
ప్రత్యువాత ప్రభుం ప్రీత్యా లజ్జయాధోముఖీ శివా ॥

శివుడు ఇట్లు పలికెను -

ఓ పార్వతీ ! నన్ను విడిచి ఎక్కడకు వెళ్లుచుంటివి ? నీవు నన్ను విడిచి వెళ్ళ:ల్లరాదు. నేను నిన్ను పరీక్షించితిని. ఓ పుణ్యాత్మురాలా ! నీకు నాయందు దృఢమగు భక్తి గలదు (55). నీ భక్తిని తెలుసుకొనుటకై నేను బ్రహ్మచారి రూపములో నీ వద్దకు వచ్చి అనేకములగు పలుకులను పలికితిని (56). ఓ పార్వతీ ! నీ భక్తిచే నేను విశేషించి ప్రసన్నుడనైతిని. నీ మనస్సునకు నచ్చిన వరమును కోరుకొనుము. నీకు ఈయరానిది లేదు (57). ప్రేమతో నిండిన హృదయము గల ఓ పార్వతీ ! నీవు నన్ను నీ తపస్సుతో కొనివేసితివి. నేను ఈ నాటినుండి నీ సౌందర్యమునకు దాసుడనైతిని. నీవు లేని క్షణము ఒక యుగముగా తోచుచున్నది (58). నీవు సిగ్గును విడువుము. నీవు నాకు శాశ్వతధర్మపత్నివి. ఓ ప్రియురాలా ! రమ్ము. నేను నిన్ను తీసుకొని వెంటనే నా కైలాసపర్వతమునకు వెళ్లేదను (59). ఆ దేవదేవుడు ఇట్లు పలుకగా, పార్వతి మహానందమును పొందెను. ఆమె వెంటనే తపస్సులో తనకు కలిగిన క్లేశమునంతనూ మరచి పోయెను (60). శివుని ఆ దివ్యరూపమును గాంచి మహానందమును పొందియున్న శివపత్నియగు ఆ పార్వతి అప్పుడు ప్రేమతో మరియు సిగ్గుతో తలను వంచుకున్నదై ఇట్లు బదులు చెప్పెను .

శివోవాచ।

యది ప్రసన్నో దేవేశ కరోషి చ కృపాం మయి ।
పతిర్మే భవ దేవేశ ఇత్యుక్తశ్శివయా శివః ॥
గృహీత్వా విధివత్పాణిం కైలాసం స తయా యయౌ ।
పతిం తం గిరిజా ప్రాప్య దేవకార్యం చకార సా ॥
ఇతి ప్రోక్తస్తు తే తాత బ్రహ్మచారి స్వరూపకః ।
శివావతారో హి మయా శివా భావపరీక్షకః ॥
ఇదామాఖ్యానమనఘం పరమం వ్యాహృతం మయా ।
య ఏతచ్ఛృణుయాత్ప్రీత్యా స సుఖీ గతిమాప్నుయాత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం జటిలావతార వర్ణనం నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓ దేవదేవా ! నీవు ప్రసన్నుడవైనచో, నాయందు దయను చూపుము. ఓ దేవదేవా ! నీవు నాకు భర్తవు కమ్ము, పార్వతి శివునితో ఇట్లు పలికెను (62). ఆయన ఆమెను యథావిధిగా వివాహమాడి, ఆమెను తీసుకొని కైలాసమునకు వెళ్లాను. ఆ పార్వతి ఆయనను భర్తగా పొంది దేవకార్యమును చేసెను (63). ఓయీ కుమారా ! ఈ విధముగా పార్వతియొక్క భక్తిని పరీక్షించిన శివుని బ్రహ్మచారి అవతారమును గురించి నేను నీకు చెప్పితిని (64). నేను నీకు చెప్పిన ఈ పరమపవిత్రమగు గాథను ఎవడైతే ప్రీతితో వినునో, అట్టివాడు సుఖములననుభవించి మోక్షమును పొందును .

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహిత యందు శివుని జటిలావతారమును వర్ణించే ముప్పది మూడవ అధ్యాయము ముగిసినది.

34 – నటావతారము

నందీశ్వర ఉవాచః

సనత్కుమార సర్వజ్ఞ శివస్య పరమాత్మనః ।
అవతారం శృణు విభోస్సునర్తకనటాహ్వయమ్ ॥
యదా హి కాలికా దేవీ పార్వతీ హిమవత్సుతా ।
తేపే తపస్సు విమలం వనం గత్వా శివాప్తయే ॥
తదా శివః ప్రసన్నోఽభూత్త స్యా స్సుతపసో మునే ।
తద్వృత్త సుపరీక్షార్థం వరం దాతుం ముదా యయౌ ॥
స్వరూపం దర్శయామాస తస్మై సుప్రీతమానసః ।
వరం బ్రూహీతి చోవాచ తాం శివాం శంకరో మునే ॥

నందీశ్వరుడిట్లు పలికెను " ఓ సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. సర్వవ్యాపకుడు, పరమాత్మయగు శివుడు నాట్యమును చేయు నటుని అవతారమును దాల్చిన గాథను వినుము (1). కాళిక, హిమవత్పుత్రికయగు పార్వతీ దేవి శివుని పొందగోరి అడవికి వెళ్లి కఠోరమైన తపస్సును చేయగా (2), శివుడు ఆమె యొక్క గొప్ప తపస్సునకు ప్రసన్నుడాయెను. ఓ మునీ! ఆయన ఆమెయొక్క భావమును దృఢముగా పరీక్షించి వరమునొసంగుటకై ఆమె వద్దకు వెళ్లెను (3), మిక్కిలి సంతసిల్లిన మనస్సు గల శంకరుడు ఆమెకు తన రూపమును చూపించెను. ఓ మునీ! అపుడాయన ఆమెతో వరమును కోరుమని పలికెను .

తచ్ఛ్రుత్వా శంభువచనం దృష్ట్వా తద్రూపముత్తమమ్ ।
సు జహర్ష శివాతీవ ప్రాహ తం సుప్రణమ్య సా ॥

శంభుని ఆ వచనమును విని, ఆయన యొక్క ఉత్తమమగు రూపమును చూసి, ఆ పా(ః)ర్వతి ఆయనకు చక్కగా నమస్కరించి, మహానందమును పొంది, ఆయనతో ఇట్లు పలికెను .

పార్వత్యువాచ ।

యది ప్రసన్నో దేవేశ మహ్యం దేయో వరో యది ।
పతిర్భవ మమేశాన కృపాం కురు మమోపరి ॥
పితుర్గేహే మయా సమ్యగమ్యతే త్వదనుజ్ఞయా ।
గంతవ్యం భవతా నాథ మత్పితుః పార్శ్వతః ప్రభో ॥
యాచస్వ మాం తతో భిక్షుః ఖ్యాపయంశ్చ యశశ్శుభమ్ ।
పితుర్మే సఫలం సర్వం కురు ప్రీత్యా గృహాశ్రమమ్ ॥
తతో యథోక్త విధినా కర్తు మర్హసి భో ప్రభో ।
వివాహం త్వం మహేశాన దేవానాం కార్యసిద్ధయే ॥
కామం మే పూరయ విభో నిర్వికారో భవాన్ సదా ।
భక్తవత్సలనామా హి తవ భక్తాస్మ్యహం సదా॥

పార్వతి ఇట్లు పలికెను -

ఓ దేవదేవా ! నీవు నాపై ప్రసన్నుడవైనచో, నాకు వరమునీయ దలచినచో, నాకు భర్తవు కమ్ము. ఓ ఈశ్వరా ! నాపై దయను చూపుము (6) నీ ఆజ్ఞననుసరించి నేను చక్కగా మాతండ్రి గారి ఇంటికి వెళ్లుచున్నాను. ఓ నాథా ! ప్రభూ ! నీవు నా తండ్రి వద్దకు తప్పక వెళ్లవలెను (7). నీవు భిక్షుకుడవై నీ శుభకరమగు కీర్తిని విస్తరింప జేయుచూ నా గురించి కోరుము. నీవు ప్రేమతో నా తండ్రియొక్క గృహస్థాశ్రమమును, పూర్ణముగా సార్థకము చేయుము (8). ఓ ప్రభూ ! ఆ తరువాత నీవు యథావిధిగా వివాహమును చేసుకొన దగుదువు. ఓ మహేశ్వరా ! నీవు దేవతల కార్యమును ఈ విధముగా సిద్ధింప జేయుము (9). ఓ ప్రభూ ! నీవు నా కోరికను నెరవేర్చుము. నీయందు ఏ కాలములోనైననూ వికారములు లేవు. నీకు భక్తవత్సలుడు అను పేరు గలదు. నేను సర్వదా నీకు భక్తురాలను

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తస్స తయా శంభుర్మహేశో భక్తవత్సలః ॥
తథాస్త్వితి వచః ప్రోచ్యాంతర్హితస్స్వగిరిం యయౌ ॥
పార్వత్యపి తతః ప్రీత్యా స్వసఖీభ్యాం వయోఽన్వితా ।
జగామ స్వపితుర్గేహం రూపం కృత్వా తు సార్థకమ్ ॥
పార్వత్యాగమనం శ్రుత్వా మేనయా స హిమాచలః ।
పరివారయుతో ద్రష్టుం స్వసుతాం తాం యయౌ ముదా ॥
దృష్ట్వా తాం సుప్రసన్నాస్యా మానయామాతుర్గృహమ్ ।
కారయామాసతు: ప్రీత్యా మహానందౌ మహోత్సవమ్ ॥
ధనం దదౌ ద్విజాదిభ్యో మేనా గిరివరస్తథా ।
మంగలం కారయామాస స వేదధ్వనిమాదరాత్ ॥
తతస్స్వకన్యయా సార్థమువాస ప్రాంగణే ముదా ।
మేన చ హిమవాన్ శైలస్నాతుం గంగాం జగామ సః ॥
ఏతస్మిన్నంతరే శంభుస్సులీలో భక్తవత్సలః ।
సునర్తకనటో భూత్వా మేనకాసన్నిధిం యయౌ ॥
శృంగం వామే కరే ధృత్వా దక్షిణే డమరుం తథా ।
పృష్ఠే కంథాం రక్త వాసా నృత్య గాన విశారదః ॥
తతస్తు నటరూపోఽసౌ మేనకా ప్రాంగణే ముదా ।
చక్రే స నృత్యం వివిధం గానం చాతిమనోహరమ్ ॥
శృంగం చ డమరుం తత్ర వాదయామాస సుధ్వనిమ్ ।
మహోతిం వివిధాం ప్రీత్యా స చకార మనోహరామ్ ॥

నందీశ్వరుడు ఇట్లు పలికెను -

నందీశ్వరుడు ఇట్లు పలికెను -

ఆమె ఇట్లు పలుకగా, మహేశ్వరుడు మరియు భక్తవత్సలుడు అగు శంభుడు, అటులనే అగుగాక ! అని పలికి, అంతర్ధానమును చెంది తన పర్వతమునకు వెళ్లెను (11). తరువాత నవయౌవనవతి అగు పార్వతి కూడ తన చెలికత్తెలతో కూడినదై, ప్రీతిపూర్వకముగా తన తండ్రిగారి ఇంటికి వెళ్ళేను. ఆమె తన సౌందర్యమునీ విధముగా సార్థకము చేసుకొనెను (12). పార్వతి తిరిగి వచ్చినదని తెలిసి, మేనాహిమవంతులు పరివారముతో గూడి, తమ అట్టి కుమార్తెను చూచుటకు ఆనందముతో వెళ్ళిరి (13). వారు మిక్కిలి ప్రసన్నమగు ఆ పార్వతిని చూచి ఇంటికి తీసుకువెళ్లి, మహానందమును పొంది, ప్రీతితో గొప్ప ఉత్సవమును చేసిరి (14). మేనాహిమవంతులు ఇద్దరు బ్రాహ్మణులు మొదలగు వారికి ధనమునిచ్చిరి. ఆయన మంగళకరమగు వేదఘోషను సాదరముగా ఏర్పాటు చేసెను (15). తరువాత మేన కుమార్తెతో గూడి ఇంటి వాకిట్లో ఆనందముగ నుండగా, ఆ హిమవత్పర్వతుడు స్నానమును చేయుటకు గంగకు వెళ్లను (16). ఇంతలో చక్కని లీలలను ప్రకటించువాడు, భక్తవత్సలుడు అగు శంభుడు చక్కని నాట్యగాని వేషమును వేసుకొని మేనకవద్దకు వెళ్లెను (17). నాట్యము మరియు గానము అను కళలలో నిపుణుడగు ఆ శివుడు ఎడమ చేతిలో కొమ్ము బూరాను, కుడి చేతిలో డమరువు (బుడబుక్కల వాద్యము) ను పట్టుకొని, భుజముపై బొంతను వేసుకొనీ, ఎర్రని వస్త్రమును ధరించియుండెను (18). తరువాత నటుని రూపములో నున్న ఈ శివుడు మేనయొక్క ఇంటి వాకిట్లో ఆనందముతో రకరకముల నాట్యమును చేయుచూ, మిక్కిలి మనోహరమగు పాటలను పాడెను (19). ఆయన అచట కొమ్ము బూరాను, డమరువును చక్కని ధ్వని కలుగునట్లుగా వాయించెను. ఇంతే గాక ఆయన మిక్కిలి మనోహరములగు రకరకముల గొప్ప లీలలను ప్రీతిపూర్వకముగా ప్రకటించెను .

తం ద్రష్టుం నాగరాస్సర్వే పురుషాశ్చ స్త్రియస్తథా ।
ఆ జగ్ముస్సహసా తత్ర బాలా వృద్ధా అపి ధ్రువమ్ ॥
శ్రుత్వా సుగీతం తం దృష్ట్వా సున్నృత్యం చ మనోహరమ్ ।
సహసా ముముహుస్సర్వే మేనాపి చ తదా మునే ॥
తతో మేనాశు రత్నానీ స్వర్ణ పాత్ర స్థితాని చ ।
తస్మై దాతుం యయౌ ప్రీత్యా తదూతి ప్రీతమానసా ॥
తాని న స్వీ చకారాసౌ భిక్షాం చేతే శివాం చ తామ్ ।
పునస్సున్నృత్యం గానం చ కౌతుకాత్కర్తు ముద్యతః ॥
మేనా తద్వచనం శ్రుత్వా చుకోపాతి సువిస్మితా ।
భిక్షుకం భర్త్సయామాస బహిష్కర్తుమియేష సా ॥
ఏతస్మిన్నంతరే తత్ర గంగాతో గిరిరాడ్యయౌ ।
దదర్శ పురతో భిక్షుం ప్రాంగణస్థం నరాకృతిమ్ ॥
శ్రుత్వా మేనాముఖాద్వృత్తం తత్సర్వం సుచుకోప సః ।
ఆజ్ఞాం చకారానుచరాన్ బహిః కర్తుం చ భిక్షుకమ్ ॥

మహాగ్నిమివ దుస్స్పర్శం ప్రజ్వలంతం సుతేజసమ్ ।
న శశాక బహిః కర్తుం కోఽపి తం మునిసత్తమ ॥
తతస్స భిక్షుకస్తాత నానాలీలా విశారదః ।
దర్శయామాస శైలాయ స్వప్రభావమనంతకమ్ ॥
శైలో దదర్శ తం తత్ర విష్ణురూపధరం ద్రుతమ్ ।
తతో బ్రహ్మ స్వరూపం చ సూర్యరూపం తతః క్షణాత్ ॥

మరియు నగరములోని స్త్రీపురుషులు, పిల్లలు, వృద్ధులు అందరు వెంటనే అచటకు ఆ నిస్సంకోచముగా విచ్చేసిరి (21). ఆ చక్కని గానమును విని, మనోహరమగు నాట్యమును చూసి, పౌరందరు శీఘ్రముగా మోహమును పొందిరి. ఓ మునీ ! మేన కూడ ఆ సమయములో మోహమును పొందెను (22). తరువాత మేన ఆతని లీలలచే ప్రీతిని పొందిన మనస్సు గలదై ఆయనకు ఇచ్చుటకై వెంటనే బంగరు పాత్రలో రత్నములను ప్రీతితో తెచ్చెను (23). కానీ, ఆయన వాటిని తీసుకొన లేదు. ఆయన పార్వతిని భిక్షగా కోరెను. ఆయన ఉత్సాహముతో మరల చక్కని నాట్యమును చేయుటకు, పాటను పాడుటకు సంసిద్ధుడాయెను (24). ఆయన మాటను విని మేన చాల కోపమును, ఆశ్చర్యమును పొందెను. ఆమె ఆ భిక్షుకుని మెడపట్టుకొని బయటకు గెంటవలెనని తలపోసెను. ఆమె ఆయనను నిందించి భయపెట్టెను (25). ఇంతలో పర్వతరాజగు హిమవంతుడు గంగనుండి తిరిగి వచ్చి, తన ఇంటి వాకిట్లో భిక్షుకుని రూపములో మానవదేహమును దాల్చియున్న శివుని చూచెను (26). ఆయన మేన చెప్పగా ఆవృత్తాంతమునంతను విని చాల కోపించి, ఆ భిక్షుకుని మెడ పట్టుకొని బయటకు గెంటుడని సేవకులను ఆజ్ఞాపించెను (27). ఓ మహర్షీ! మండే పెద్ద నిప్పు వలె స్పృశించ శక్యము కానివాడు, గొప్ప తేజస్సు గలవాడు అగు ఆ శివుని బయటకు గెంటుటకు ఎవ్వరికీ శక్తి లేకపోయెను (28). ఓ కుమారా ! తరువాత అనేకలీలలను చేయుటలో నిపుణుడగు ఆ భిక్షుకుడు తన అనంతమగు ప్రభావమును హిమవంతునకు చూపించెను (29). ఆ సమయములో ఆయన హిమవంతునకు విష్ణురూపములో, మరల వెంటనే బ్రహ్మరూపములో, దాని తరువాత మరల క్షణకాలములో సూర్యరూపములో కానవచ్చెను .

తతో దదర్శ తం తాత రుద్రరూపం మహాద్భుతమ్ ।
పార్వతీసహితం రమ్యం విహసంతం సుతేజసమ్ ॥
ఏవం స బహురూపాణి తస్య తత్ర దదర్శ సః ।
సువిస్మితో బభూవాశు పరమానంద సంప్లుతః ॥
అథాసౌ భిక్షువర్యో హి తస్మాత్తస్యా శ్చ సూతికృత్ ।
భిక్షాం యయాచే దుర్గాం తాం నాన్యజ్జగ్రాహ కించన ॥
తత శ్చాంతర్దధే భిక్షుస్వరూపః పరమేశ్వరః ।
స్వాలయం స జగామాశు దుర్గావాక్య ప్రణోదితః ॥
తదా బభూవ సుజ్ఞానం మేనాశైలే శయోరపి ।
ఆవాం శివో వంచయిత్వా గతవాన్ స్వాలయం విభుః ॥



అస్మై దేయా స్వకన్యేయం పార్వతీ సుతపస్వినీ ।

ఏవం విచార్య చ తయోశ్శివభక్తి రభూత్పురా ॥

ఓ వత్సా! తరువాత గొప్ప ఆశ్చర్యమును కలిగించువాడు, పార్వతితో గూడి నవ్వుచున్న సుందరుడు, గొప్ప తేజస్సు గలవాడు అగు రుద్రుని రూపములో ఆయన హిమవంతునకు కనబడెను (31). అపుడు ఆయన ఈ విధముగా శివుని ఆనేకరూపములను చూచి మహాశ్చర్యమును పొందెను. వెనువెంటనే ఆయన హృదయము పరమానందముతో నిండిపోయెను (32). తరువాత చక్కని లీలలను చేసే ఆ భిక్షుకశ్రేష్ఠుడు ఆ మేనాహిమవంతులనుండి ఆ దుర్గను భిక్షగా కోరెను. మరియొక భిక్షను దేనినీ ఆయన స్వీకరించలేదు (133), తరువాత భిక్షురూపములో నున్న ఆ పరమేశ్వరుడు దుర్గయొక్క వచనముచే ప్రేరేపించబడిన వాడై, అంతర్ధానమును చెంది, వెంటనే తన నివాసమునకు వెల్లెను (34). శివవిభుడు మనలను మోసగించి తన నివాసమునకు వెళ్లినాడు అనే చక్కని జ్ఞానము అపుడు మేనాహిమవంతులకు కూడ కలిగెను (35). మనము గొప్ప తపస్సును చేసిన ఈ కన్యయగు పార్వతిని ఈ శివునకు ఈయవలేనని వారు నిశ్చయించుకొనిరి. పూర్వమునందు వలెనే వారిరువురిలో శివభక్తి నెలకొనెను.

అతో రుద్రో మహోతీశ్చ కృత్వా భక్తముదావహమ్ ।

వివాహం కృతవాన్ ప్రీత్యా పార్వత్యా స విధానతః ॥॥

ఇతి ప్రోక్త స్తు తే తాత సునర్తకనటాహ్వయః ।

శివావతారో వా మయా శివావాక్య ప్రపూరకః ॥

ఇదమాఖ్యానమనఘం పరమం వ్యాహృతం మయా ।

య ఏతచ్ఛృణుయాత్రీత్యా స సుఖీ గతి మాప్నుయాత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం నటావతార వర్ణనం నామ చతుస్త్రాంశోఽధ్యాయః॥

తరువాత గొప్ప లీలలను ప్రదర్శించే రుద్రుడు భక్తులకు ఆనందమును కలిగించువాడై పార్వతిని ప్రీతితో యథావిధిగా వివాహమాడెను (37). వత్సా! శివుడు ఈ తీరున పార్వతీ దేవి యొక్క మాటను నిలబెట్టుటకై సుందరమగు నటుని అవతారమును దాల్చి నర్తించేను. ఈ వృత్తాంతమును నేను నీకు చెప్పియుంటిని (38). నేను నీకు చెప్పిన ఈ పరమ పవిత్రమగు గాథను ఎవడైతే ప్రీతితో వినునో, వాడు సుఖమును, పుణ్యగతిని పొందును

శ్రీ శివమహాపురాణములోని శతరుద్రసంహితయందు నటావతార వర్ణనమనే ముప్పది నాలుగవ అధ్యాయము ముగిసినది.

35 - ద్విజావతారము

నందీశ్వర ఉవాచః

సనత్కుమార సర్వజ్ఞ శివస్య పరమాత్మనః ।
అవతారం శృణు విభోస్సాధువేష ద్విజాహ్వయమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. సర్వసమర్థుడు, పరమాత్మయగు శివుడు సత్పురుషుడగు బ్రాహ్మణుని అవతారమును దాల్చెను. ఆ గాథను వినుము .

మేనాహిమాలయోర్భక్తిం శివే జ్ఞాత్వా మహోత్తమామ్ ।
చింతామాపుస్సు రాస్సర్వే మంత్రయామాసు రాదరాత్ ॥
ఏకాంతభక్త్యా శైలశ్చేత్కన్యాం దాస్యతి శంభవే ।
ధ్రువం నిర్వాణతాం సద్య స్సంప్రాప్స్యతి శివస్య వై ॥
అనంత రత్నాధారోఽసౌ చేత్ప్రయాస్యతి మోక్షతామ్ ।
రత్నగర్భాభిధా భూమి ర్మిథ్యైవ భవితా ధ్రువమ్ ॥
అస్థిరత్వం పరిత్యజ్య దివ్యరూపం విధాయ సః ।
కన్యాం శూలభృతే దత్వా శివలోకం గమిష్యతి ॥
మహాదేవస్య సారూప్యం ప్రాప్య శంభోరనుగ్రహాత్ ।
తత్ర భుక్త్వా మహాభోగాంస్తతో మోక్షమవాప్స్యతి ॥
ఇత్యాలోచ్య సురాస్సర్వే జగ్ముర్గురుగృహం మునే ।
చక్రుర్నివేదనం గత్వా గురవే స్వార్థ సాధకాః ॥

శివుని యందు మేనాహిమవంతులకు గల సర్వోత్కృష్టమగు భక్తిని గురించి తెలుసుకొని, దేవతలందరు చింతను పొంది సాదరముగా సలహా సంప్రదింపులను చేసిరి (2). హిమవంతుడు ఏకాంతమగు భక్తితో శివునకు తన కన్యను ఇచ్చినచో, నిశ్చయముగా వెంటనే మోక్షమును పొంది శివలోకమును చేరుకొన గలడు (3). లెక్క లేనన్ని శ్రేష్ఠ వస్తువులకు ఆధారమగు ఈ హిమవంతుడు మోక్షమును పొందినచో, రత్నగర్భ అనే పేరుగల భూమికి ఆ పేరు నిశ్చయముగా అసత్యమగును (4). ఆయన తన కదలని రూపమును విడిచిపెట్టి దివ్యరూపమును దాల్చి కన్యను శూలపాణియగు శివునకు సమర్పించి శివలోకమును పొందును (5). ఆయన శంభుని అనుగ్రహముచే ఆ మహాదేవుని సారూప్యమును పొంది అచటనే మహాభోగములననుభవించి, తరువాత మోక్షమును పొందగలడు (6). ఓ మునీ ! స్వార్థమును సాధించుకునే దేవతలందరు ఈ విధముగా ఆలోచించి, బృహస్పతి ఇంటికి వెళ్లి, ఆయనకు విన్నవించిరి .

దేవా ఊచుః ।

గురో హిమాలయగృహం గచ్ఛాస్మత్కార్యసిద్ధయే ।
కృత్వా నిందాం మహేశస్య గిరి భక్తిం నివారయ ॥
స్వశ్రద్ధయా సుతాం దత్వా శివాయ స గిరిర్గురో ।
లభేత ముక్తిమత్రైవ ధరణ్యాం సహి తిష్ఠతు ॥
ఇతి దేవవచశ్శ్రుత్వా ప్రోవాచ చ విచార్య తాన్ ॥

దేవతలిట్లు పలికిరి –

ఓ బృహస్పతీ ! మన కార్యమును సాధించుటకై నీవు హిమవంతుని ఇంటికి వెళ్లిలి, మహేశ్వరుని నిందించి హిమవంతునకు ఆయనపై గల భక్తిని తొలగించుము (8). ఓ బృహస్పతీ । ఆ హిమవంతుడు స్వయముగా శ్రద్ధతో కన్యను శివునకు సమర్పించినచో, ఆయనకు మోక్షము లభించును. కానీ ఆయన ఈ భూమిపైననే ఉండవలెను (9). ఆయన దేవతల ఈ మాటను విని, ఆలోచించి, వారితో నిట్లనెను .

గురురువాచ ।

కశ్చిన్మధ్యే చ యుష్మాకం గచ్ఛేచ్ఛైలాంతికం సురాః ।
సంపాదయేత్స్వాభిమతమహం తత్కర్తుమక్షమః ॥
అథవా గచ్ఛత సురా బ్రహ్మలోకం సవాసవాః ।
తస్మై వృత్తం కథయ స్వం సవః కార్యం కరిష్యతి ॥

బృహస్పతి ఇట్లు పలికెను –

ఓ దేవతలారా । మీలో ఒకడు హిమవంతుని వద్దకు వెళ్లి, మీ కార్యమును సాధించుకొన వచ్చును. ఆ పనిని చేసే సామర్థ్యము నాకు లేదు (11). ఓ దేవతలారా ! లేదా, మీరు ఇంద్రునితో కలిసి బ్రహ్మలోకమునకు వెళ్లుడు. ఆయనకు విషయమును చెప్పుడు. ఆయన మీ పనిని చేయ గలడు.

నందీశ్వర ఉవాచః

తచ్ఛ్రుత్వా తే సమాలోక్య జగ్ముర్బ్రహ్మసభాం సురాః ।
సర్వం నివేదయామాసుస్తద్వృత్తం పురతో విధేః ॥
అపోచత్తాన్విధిశ్రుత్వా తద్వచస్సువిచింత్య వై।
నాహం కరిష్యే తన్నిందాం దుఃఖదాం కహరాం సదా ॥
సురా గచ్ఛత కైలాసం సంతోషయత శంకరమ్ ।
ప్రస్థాపయత తం దేవం హిమాలయగృహం ప్రతి ॥
స గచ్ఛేదథ శైలేశమాత్మనిందాం కరోతు వై ।
పరనిందా వినాశాయ స్వ నిందా యశసే మతా ॥

నందీశ్వరుడిట్లు పలికెను –



ఆ దేవతలు ఆ మాటను విని ఒకరినొకరు చూచుకొని, బ్రహ్మగారి సభకు వెళ్ళి, ఆయన యెదుట ఆ వృత్తాంతమునంతనూ విన్నవించు కొనిరి (13). వారి మాటను విని, బ్రహ్మ బాగా ఆలోచించి, వారితో నిట్లనెను. నేను శివుని నిందను చేయను. శివుని నిందించు వారికి సుఖము శాశ్వతముగా దూరమై దుఃఖము కలుగును (14). ఓ దేవతలారా ! మీరు కైలాసమునకు వెళ్లి, శంకరుని సంతోష పెట్టుడు. ఆ దేవుని హిమవంతుని ఇంటికి పంపుడు (15). ఆయన హిమవంతుని వద్దకు వెళ్లి, తనను తాను నిందించుకొను గాక ! ఇతరులను నిందించినచో వినాశము, తనను తాను నిందించుకున్నచో కీర్తి కలుగునని మహర్షులు చెప్పుచున్నారు .

నందీశ్వర ఉవాచః

తతస్తే ప్రయయుశ్శీఘ్రం కైలాసం నిఖిలాస్సురాః ।
సుప్రణమ్య శివం భక్త్యా తద్వృతం నిఖిలా జగుః ॥
తచ్ఛ్రుత్వా దేవవచనం స్వీచకార మహేశ్వరః ।
దేవాన్ సుయాపయామాస తానాశ్వాస్య విహస్య సః ॥
తతస్స భగవాన్ శంభుర్మహేశో భక్తవత్సలః ।
గంతుమైచ్ఛ చ్ఛైలమూలం మాయేశో న వికారవాన్ ॥
దండీ ఛత్రీ దివ్యవాసా బిభ్రత్తిలకముజ్జ్వలమ్ ।
కరే స్ఫటికమాలాం చ శాలగ్రామం గలే దధత్ ॥
జపన్నామ హరేర్భక్త్యా సాధువేషధరో ద్విజః ।
హిమాచలం జగామాశు బంధువర్గై స్సమన్వితమ్ ॥
తం చ దృష్ట్వా సముత్తస్థౌ సగణోఽపి హిమాలయః ।
ననామ దండవద్భూమౌ సాష్టాంగం విధిపూర్వకమ్ ॥
తతః పప్రచ్ఛ శైలేశస్తం ద్విజం కో భవానితి।
ఉవాచ శీఘ్రం విప్రేంద్రస్స యోగ్యాద్రిం మహాదరాత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

అపుడు ఆ దేవతలందరు వెంటనే కైలాసమునకు వెళ్ళి, శివునకు భక్తితో చక్కగా నమస్కరించి, ఆ విషయమును ఆయనకు చెప్పిరి (17). ఆ మహేశ్వరుడు ఆ దేవతల మాటను విని వారి కోరికను అంగీకరించి వారిని ఓదార్చి నవ్వి, వారిని చక్కగా సాగనంపెను (18). తరువాత భక్తవత్సలుడు, మహేశ్వరుడు, మాయకు అధీశ్వరుడు, వికారములు లేనివాడు అగు ఆ శంభుడు హిమవంతుని గృహమునకు వెళ్లగోరెను (19). ఆయన కర్రను, గొడుగును పట్టుకొని, దివ్యమగు వస్త్రములను ధరించి, మెరిసి పోయే తిలకమును దిద్ది, చేతిలో స్ఫటికమాలను, కంఠములో శాలగ్రామమును ధరించెను (20). ఆయన ఈ విధముగా సాధుబ్రాహ్మణవేషమును ధరించి, హరినామమును జపిస్తూ, వెంటనే బంధువర్గములతో కూడియున్న హిమవంతుని వద్దకు వెళ్లెను (21). హిమవంతుడు ఆయనను చూచి తన పరిజనముతో సహా లేచి నిలబడి, యథావిధిగా సాష్టంగ

నమస్కారమును చేసెను (22). తరువాత ఆ పర్వతరాజు ఆ బ్రాహ్మణుని, నీ వెవరు ? అని ప్రశ్నించేను. ఆ బ్రాహ్మణ శ్రేష్టుడు యోగ్యుడగు ఆ హిమవంతునకు వెంటనే గొప్ప ఆదరముతో ఇట్లు బదులిడను .

సాధుద్విజ ఉవాచః

సాధుద్విజాహ్వశ్శైలాహం వైష్ణవః పరమార్థదృక్ ।
పరోపకారీ సర్వజ్ఞ స్సర్వగామీ గురోర్బలాత్ ॥
మయా జ్ఞాతం స్వవిజ్ఞానాత్ స్వస్థానే శైలసత్తమ ।
తచ్ఛృణు ప్రీతితో వచ్మి హిత్వా దంభం తవాంతికమ్ ॥
శంకరాయ సుతాం దాతుం త్వమిచ్ఛసి నిజోద్భవామ్ ।
ఇమాం పద్మసమాం రమ్యామజ్ఞాతకులశీలినే ॥
ఇత్థం మతిస్తే శైలేంద్ర న యుక్తా మంగలప్రదా ।
నిబోధ జ్ఞానినాం శ్రేష్ఠ నారాయణ కులోద్భవ ॥
పశ్య శైలాధిపత్యం చ న తస్మై కోఽస్తి బాంధవః ।
బాంధవాన్ స్వాన్ ప్రయత్నేన పృచ్ఛ మేనాం చ స్వప్రియామ్ ॥
సర్వాన్ సంపృచ్ఛ యత్నేన మేనాదీన్ పార్వతీం వినా ।
రోగిణే నౌషధం శైల కుపథ్యం రోచతే సదా ॥
న తే పాత్రానురూపశ్చ పార్వతీ దానకర్మణి ।
మహాజనస్మేరముఖ శ్రుతి మాత్రోద్భవిష్యతి ॥
నిరాశ్రయస్సదాఽసంగో విరూపో నిర్గుణోఽవ్యయః ।
శ్మశానవాసీ వికటో వ్యాలగ్రాహీ దిగంబరః ॥
విభూతి భూషణో వ్యాలవరావేష్టితమస్తకః ।
సర్వాశ్రమ పరిభ్రష్టస్య విజ్ఞాతగతి స్సదా ॥

ఆ సాధుబ్రాహ్మణుడు ఇట్లు పలికెను –

ఓ పర్వతరాజా ! నేను పరమార్థమునెరింగిన వైష్ణవుడను, నా పేరు సాధుద్విజుడు. నేను గురువు యొక్క అనుగ్రహము వలన సర్వమును తెలుసుకొని, అన్ని స్థలములకు వెళ్లుచూ, ఇతరులకు ఉపకారము చేయుచుందును (24). ఓ పర్వతరాజా ! నేను ఉన్నచోటనే ఉండి నా బుద్ధిశక్తిచే ఒక విషయమును తెలుసుకుంటిని. నేను దంభము (నేనే ధర్మాత్ముడను అనే అహంకారము) ను విడిచిపెట్టి, నీ యెదుట దానిని ప్రేమపూర్వకముగా చెప్పెదను. వినుము (25). లక్ష్మీదేవితో సమానురాలగు సుందరియైన ఈ నీ కుమార్తెను నీవు శంకరునకు ఇచ్చి వివాహమును చేయగోరుచున్నావు. కాని, నీకు ఆయన కులము గానీ, స్వభావము గానీ తెలియవు (26). ఓ పర్వతరాజా ! నారాయణుని వంశములో జన్మించిన నీవు జ్ఞానులలో శ్రేష్ఠుడవు. అమంగళకరమగు ఇట్టి ఆలోచన నీకు తగదు. తెలుసుకొనుము (27). ఓ పర్వతరాజా ! నీవు గమనించుము, ఆ శివునకు బంధువులు ఎవ్వరూ లేరు, నీ బంధువులను, నీ ప్రియురాలగు మేనను ప్రయత్నించి సంప్రదించుము (28). పార్వతిని మినహాయించి, మేన మొదలగు వారిని అందరినీ

సంప్రదించుము. ఓ పర్వతరాజా ! రోగికి ఏ నాడైననూ మందు రుచించదు. కాని, చెడు పథ్యము మాత్రము రుచించును (29). నీవు పార్వతిని కన్యాదానము చేయుటకు నిర్ణయించుకున్న శివుడు దానికి యోగ్యమగు పాత్ర కాడు. ఈ సంగతిని విన్న వెంటనే పెద్దలు చాటుమాటుగా నవ్వేదరు (30). ఆశ్రయము లేనివాడు, సర్వదా సంసారమునందు ఆసక్తి లేనివాడు, కురూపి, గుణములు లేనివాడు, వికారములు లేనివాడు, శ్మశానమునందు నివసించువాడు, భయంకరాకారుడు, పాములను పట్టుకొనువాడు, దిగంబరుడు (31), భస్మయే అలంకారముగా గలవాడు, తల చుట్టు భయంకరమగు-పాములను చుట్టుకున్నవాడు, ఆశ్రమములన్నింటినుండి భ్రష్టమైనవాడు అగు ఆ శివుని స్థితిగతులు ఏనాడైననూ ఎవ్వరికైననూ తెలియవు .

బ్రహ్మోవాచ।

ఇత్యాద్యుక్త్వా వచస్తథ్యం శివనిందా పరం స హ ।
జగామ స్వాలయం శీఘ్రం నానాలీలా కరశ్శివః ॥

బ్రహ్మ ఇట్లు పలికెను -

అనేక లీలలను చేస్తూ ఉండే ఆ శివుడు ఖచ్చితముగా శివనిందతో కూడిన ఇట్టి వచనములను పలికి వెంటనే తన నివాసమునకు వెళ్లెను .

తచ్ఛ్రుత్వా విప్రవచనమభూతాం చ తనూ తయోః ।
విపరీతానర్థపరే కిం కరిష్యామమహే ధ్రువమ్ ॥
తతో రుద్రో మహోతిం చ కృత్వా భక్త ముదావహామ్ ।
వివాహయిత్వా గిరిజాం దేవకార్యం చకార సః ॥
ఇతి ప్రోక్తస్తు తే తాత సాధువే షో ద్విజాహ్వయః ।
శివావతారో ఏ మయా దేవ కార్య కరః ప్రభో ॥
ఇద మాఖ్యానమనఘం స్వర్గ్యమాయుష్యముత్తమమ్ ।
యః పఠేచ్ఛృణుయాద్వాపి స సుఖీ గతిమాప్నుయాత్ ॥
ఇతి శ్రీశివమహాపురాణే శతరుద్రసంహితాయాం సాధు
ద్విజావతారవర్ణనం నామ పంచత్రింశోఽధ్యాయః.

ఆ బ్రాహ్మణుని ఈ వచనములను విని మేనా హిమవంతులిద్దరి దేహములు విపరీతమైన పీడకు గురియైనవి. వారిద్దరు ఏమిచేయవలెనో తోచక బాధపడిరి (34). అపుడా రుద్రుడు భక్తులకు ఆనందమును కలిగించు గొప్ప లీలను ప్రకటించి పార్వతిని వివాహమాడి దేవకార్యమును చేసెను (35). వత్సా! ప్రభూ! ఈ విధముగా శివుడు సాధువగు బ్రాహ్మణుని వేషమును దాల్చి దేవకార్యమును చేసిన తీరును నీకు చెప్పి యుంటిని (36). పవిత్రమైనది, ఇహలోకములో ఆయుర్దాయమును, మరియు స్వర్గమును ఇచ్చునది అగు ఈ ఉత్తమమగు వృత్తాంతమును ఎవరైతే పఠించెదరో, లేక వినెదరో వారు సుఖములనను భవించి, ఉత్తమగతిని పొందెదరు (37).

36 - అశ్వత్థామావతారము

నందీశ్వర ఉవాచః

సనత్కుమార సర్వజ్ఞ శివస్య పరమాత్మనః ।
అవతారం శృణు విభోరశ్వత్థామాహ్వయం పరమ్ ॥
బృహస్పతే ర్మహా బుద్ధేర్దేవర్షేరంశతో మునే ।
భరద్వాజాత్సముత్పన్నో ద్రోణోఽయోనిజ ఆత్మవాన్ ॥
ధనుర్భృతాం వరశ్శూరో విప్రర్షి స్సర్వశాస్త్ర విత్ ।
బృహత్కీర్తిర్మహాతేజా యస్సర్వాస్త్ర విదుత్తమః ॥
ధనుర్వేదే చ వేదే చ నిష్ణాతం యం విదుర్బుధాః ।
వరిష్ఠం చిత్రకర్మాణం ద్రోణం స్వకులవర్ధనమ్ ॥
కౌరవాణాం స ఆచార్య ఆసీత్స్వబలతో ద్విజ ।
మహారథిషు విఖ్యాతః షట్ సు కౌరవమధ్యతః ॥
సాహాయ్యార్థం కౌరవాణాం స తేపే విపులం తపః ।
శివముద్దిశ్య పుత్రార్థీ ద్రోణాచార్యో ద్విజోత్తమః ॥
తతః ప్రసన్నో భగవాన్ శంకరో భక్తవత్సలః ।
ఆవిర్బ భూవ పురతో ద్రోణస్య మునిసత్తమ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. విభుడు, పరమాత్మయగు శివుని అశ్వత్థామ యను గొప్ప అవతారమును గూర్చి వినుము (1). ఓ మునీ! మహాబుద్ధిశాలి, దేవర్షియగు బృహస్పతి అంశ వలన భరద్వాజునకు ద్రోణుడను అయోనిజుడగు కుమారుడు కలిగెను. ఆయన స్వాభిమానము గలవాడు (2). ధనుర్ధారులలో శ్రేష్ఠుడు, శూరుడు, వేదాధ్యయనమును చేసిన ఋషి, అస్త్రవేత్తలందరిలో శ్రేష్ఠుడు (3). ధనుర్వేదమునందు మరియు వేదమునందు ఆయన నిష్ణాతుడని పండితులు అంగీకరించెదరు. శ్రేష్టుడగు ద్రోణుడు చిత్రమగు కర్మలనాచరించి తన కులమును వృద్ధికి తీసుకొనివచ్చేను (4). ఓ బ్రాహ్మణా! ఆతడు తన బలప్రభావముచే కౌరవులకు ఆచార్యుడాయెను. కౌరవులలోని ఆర్గురు మహారథులలో ఆయన ఒకడని ప్రసిద్ధిని గాంచేను (5). బ్రాహ్మణ శ్రేష్టుడగు ఆ ద్రోణాచార్యుడు కౌరవుల సాహాయ్యము కొరకై పుత్రుని గోరి శివుని ఉద్దేశించి కఠినమగు తపస్సును చేసెను (6). ఓ మహర్షీ! అపుడు భక్తవత్సలుడగు శంకరభగవానుడు ప్రసన్నుడై ద్రోణుని యెదుట ఆవిర్భవించెను .

తం దృష్ట్వా స ద్విజో ద్రోణస్తుష్టావాశు ప్రణమ్య తమ్ ।
మహా ప్రసన్నహృదయో నతకస్సుకృతాంజలిః ॥
తస్య స్తుత్యా చ తపసో సంతుష్టశ్శంకరః ప్రభుః ।
వరం బ్రూ హీతి చోవాచ ద్రోణం తం భక్తవత్సలః ॥
తచ్ఛ్రుత్వా శంభువచనం ద్రోణః ప్రాహాథ సన్నతః ।
స్వాంశజం తనయం దేహి సర్వాజేయం మహాబలమ్ ॥
తచ్ఛ్రుత్వా ద్రోణవచనం శంభుః ప్రోచే తథాస్త్వితి ।
అభూదంతర్హితస్తాత కౌతుకీ సుఖకృన్మునే ॥
ద్రోణోఽప్యగచ్ఛత్స్వం ధామ మహాహృష్టో గతభ్రమః ।
స్వపత్న్యై కథయామాస తద్వృత్తం సకలం ముదా ॥
అథావసరమాసాద్య రుద్రస్సర్వాంతకః ప్రభుః ।
స్వాంశేన తనయో జజ్ఞే ద్రోణస్య స మహాబలః ॥
అశ్వత్థామేతీ వీఖ్యాతస్స బభూవ క్షితౌతో మునే ।
ప్రవీరః కంజపత్రాక్షశ్శత్రు పక్షక్షయం కరః ॥

బ్రాహ్మణుడగు ఆ ద్రోణుడు ఆ శివుని గాంచి మిక్కిలి ప్రసన్నమగు హృదయము ్ు గలవాడై వెంటనే చేతులు జోడించి మోకరిల్లి ఆయనను స్తుతించేను (8). భక్తవత్సలుడగు శంకరప్రభుడు ఆతని స్తుతికి, తపస్సునకు సంతసిల్లి ఆ ద్రోణునితో వరమును కోరుకొమ్మని పలికెను (9). శంభుని ఆ వచనమును విని ద్రోణుడు నమస్కరించి, 'సర్వులకు జయింప శక్యము కానివాడు, నీ అంశచే జన్మించువాడు, మహాబలశాలి యగు పుత్రుని ఇమ్ము' అని కోరెను (10). ఓ మహర్షీ! శివుడు ద్రోణుని ఆ మాటను విని, 'అటులనే అగుగాక!' అని పలికి. అచటనే అంతర్హితుడాయెను. ఓ కుమారా! సుఖకరుడగు శివుని లీల ఉత్కంఠను కలిగించును (11). భ్రమలు తొలగిన ద్రోణుడు మహానందముతో తన ఇంటికి వెళ్లి జరిగిన వృత్తాంతమునంతనూ ఆనందముతో తన భార్యకు చెప్పెను (12). అటుపిమ్మట సరియగు సమయమునందు, సర్వవినాశకరుడగు శంకరప్రభుడు తన అంశచే మహాబలశాలియగు ద్రోణపుత్రుడై జన్మించెను (13). ఓ మహర్షీ! ఆతడు లోకములో అశ్వత్థామయను పేర ప్రసిద్ధిని గాంచెను. మహావీరుడు, పద్మ పత్రముల వంటి నేత్రములు గలవాడు అగు అశ్వత్థామ శత్రుపక్షమును నాశనము చేయగల సమర్థుడు .

యో భారతే రణే ఖ్యాతః పితురాజ్ఞామవాప్య చ ।
సహాయకృద్బభూవాథ కౌరవాణాం మహాబలః ॥
యమాశ్రిత్య మహావీరం కౌరవాస్తు మహాబలాః ।
భీష్మాదయో బభూవుస్తు జేయా అపి దివౌకసామ్ ॥
యద్భయాత్పాండవాస్సర్వే కౌరవాన్ జేతుమక్షమాః ।
ఆసన్నష్టా మహావీరా అపి సర్వే చ కోవిదాః ॥
కృష్ణోపదేశతశ్శంభోస్తపః కృత్వాతిదారుణమ్ ।
ప్రాప్య చాస్త్రం శంభువరాజ్జిగ్యే తానరునస్తతః ॥
అశ్వత్థామా మహావీరో మహాదేవాంశజో మునే ।
తథాపి తద్భక్తి వశస్స్వప్రతాప మదర్శయత్ ॥
వినాశ్య పాండవసుతాన్ శిక్షితానపి యత్నతః ।
కృష్ణాదిభిర్మహావీరైరని వార్య బలః పరైః ॥
పుత్ర శోకేన వికల మాపతంతం తమర్జునమ్ ।
రథేనాచ్యుతవంతం హి దృష్ట్వా స చ పరాద్రవత్ ॥
అస్త్రం బ్రహ్మశిరో నామ తదుపర్యస్సృజత్స హి ।
తతః ప్రాదురభూత్తేజః ప్రచండం సర్వతో దిశమ్ ॥
ప్రాణాపద మ ఖప్రేక్ష్య సోఽర్జునః క్లేశసంయుతః ।
ఉవాచ కృష్ణం విక్లాంతో నష్టతేజా మహాభయః ॥

మహాబలుడగు అశ్వత్థామ తండ్రి అనుజ్ఞను పొంది భారతయుద్ధములో కౌరవు(ౖ)లకు సాహాయ్యమొనర్చి విఖ్యాతిని గాంచెను (15). మహావీరుడగు అశ్వత్థామను ఆశ్రయించుటచే మిక్కిలి బలశాలురగు భీష్మాది కౌరవులు దేవతలకు అజేయులై నిలచిరి (16). పాండవులందరు మహావీరులు, యుద్ధవిశారదులు అయిననూ ఆతని భయము వలన కౌరవులను జయించు శక్తి లేనివారై నాశమును పొందిరి (17). అపుడు అర్జునుడు కృష్ణుని ఉపదేశము ననుసరించి శంభుని కొరకై మిక్కిలి తీవ్రమగు తపము నాచరించి శంభుని వరము వలన అస్త్రమును పొంది వారిని జయించెను (18). ఓ మునీ ! మహావీరుడగు అశ్వత్థామ మహాదేవుని అంశచే జన్మించిన వాడైననూ మహాదేవుని యందలి భక్తికి వశుడై తన ప్రతాపమును ప్రదర్శించెను (19). ప్రయత్నపూర్వకముగా శిక్షణను పొందియున్న పాండవపుత్రులనాతడు సంహరించెను. శత్రు పక్షములోని మహావీరులగు కృష్ణాదులు ఆతని బలమును నిలువరించ లేకపోయిరి (20). పుత్రశోకముచే పీడితుడై అచ్యుతునితో గూడి రథముపై దండెత్తి వచ్చుచున్న అర్జునుని గాంచి ఆతడు పారిపోయెను (21). అపుడాతడు ఆతనిపై బ్రహ్మ శిరోనామకాస్త్రమును ప్రయోగించేను. దాని నుండి ఉద్భవించిన ప్రచండమగు తేజస్సు దిక్కులన్నిటియందు వ్యాపించేను (22). మిక్కిలి అలసి, తేజస్సును నష్టపోయి, మహాభయమును పొంది, ఆపదలోనున్న ఆ అర్జునుడు ప్రాణములకు రానున్న ముప్పును గాంచి శ్రీ కృష్ణునితో నిట్లనెను .

అర్జున ఉవాచః

> కిమిదం స్విత్కుతో వేతి కృష్ణ కృష్ణ న వేద్మ్యహమ్ ।
> సర్వతో ముఖమాయాతి తేజశ్చేదం సుదుస్సహమ్ ॥

అర్జునుడిట్లు పలికెను -

ఓ కృష్ణా! కృష్ణా! ఇదియేమి? ఎచటనుండి వచ్చుచున్నది? నాకు తెలియకున్నది. సహింప శక్యము కాని ఈ గొప్ప తేజస్సు అన్నివైపులనుండి వచ్చుచున్నది .

నందీశ్వర ఉవాచః

> శ్రుత్వార్జునవచశ్చేదం స కృష్ణ శ్శైవసత్తమః ।
> ద ధ్యౌ శివం సదారం చ ప్రత్యాహార్జున మాదరాత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

అర్జునుని ఈ మాటను విని శివభక్తులలో అగ్రగణ్యుడగు ఆ కృష్ణుడు పార్వతీ పరమేశ్వరులను ధ్యానించి అర్జునుని ఉద్దేశించి సాదరముగా నిట్లు పలికెను .

కృష్ణ ఉవాచః

> వేత్థేదం ద్రోణపుత్రస్య బ్రాహ్మమస్త్రం మహోల్బణమ్ ।
> న హ్యస్యాన్యతమం కించి దస్త్రం ప్రత్యవ కర్శనమ్ ॥
> శివం స్మర ద్రుతం శంభుం స్వప్రభుం భక్తరక్షకమ్ ।
> యేన దత్తం హి తే స్వాస్త్రం సర్వకార్యకరం పరమ్ ॥
> జహ్యస్త్ర తేజ ఉన్నద్ధం త్వం తచ్చై వాస్త్ర తేజసా ।
> ఇత్యుక్త్వా చ స్వయం కృష్ణ శ్శివం దధ్యౌ తదర్థకః ॥
> తచ్ఛ్రుత్వా కృష్ణవచనం పార్థః స్మృత్వా శివం హృది ।
> స్పృష్ట్వా పస్తం ప్రణమ్యాశు చిక్షేపాస్త్రం తతో మునే ॥
> యద్యప్యస్త్రం బ్రహ్మ శిరస్త్వమోఘం చాప్రతిక్రియమ్ ।
> శైవాస్త్ర తేజసా సద్యస్సమ శామన్మహామునే ॥
> మంస్థా మా హ్యేతదాశ్చర్యం సర్వచిత్ర మయే శివే ।
> యస్స్యశక్త్యా ఖిలం విశ్వం సృజత్యవతి హంత్యజః ॥
> అశ్వత్థా మా తతో జ్ఞాత్వా వృత్తమేతచ్ఛివాంశజః ।
> శైవం న వివ్యథే కించిచ్ఛివేచ్ఛా తుష్టధీర్మునే ॥



కృష్ణుడిట్లు పలికెను -

ద్రోణపుత్రుడు మహాశక్తి యుతమగు బ్రహ్మ శిరోనామకాస్త్రమును ప్రయోగించినాడని ఎరుంగుము. అదియే ఇది. దీనికి ప్రతీకారమును చేయగల అస్త్రము మరియొకటి లేదు (26). మంగళస్వరూపుడు, నీకు ప్రభువు, భక్తులను రక్షించువాడు అగు శివుని వెంటనే స్మరించుము. శివుడు కార్యములనన్నిటినీ సాధించే తన పరమాస్త్రమును నీకు ఇచ్చియున్నాడు (27). నీవు ఆ శివుని అస్త్రముయొక్క తేజస్సుచే ప్రజ్వరిల్లుచున్న ఈ అస్త్ర తేజస్సును శాంతింపజేయుము. ఇట్లు పలికి కృష్ణుడు అదే ప్రయోజనమును గోరి తాను స్వయముగా శివుని ధ్యానించెను (28). శ్రీ కృష్ణుని ఆ మాటలను విని అర్జునుడు హృదయములో శివుని స్మరించెను. ఓ మునీ ! అపుడాతడు నీటిని స్పృశించి శివునకు ప్రణమిల్లి వెంటనే అస్త్రమును విడిచిపెట్టెను (29). బ్రహ్మశిరోనామకాస్త్రము అమోఘము, ప్రతిక్రియ లేనిది అయిననూ, ఓ మహర్షీ! అది శివుని అస్త్రము యొక్క తేజస్సుచే వెంటనే శాంతించెను (30). సర్వాశ్చర్యములకు నిధానమగు శివుని విషయములో ఇది ఆశ్చర్యమని తలంచకుము. పుట్టుక లేని ఆ శివుడు తన శక్తిచే జగత్తునంతనూ సృజించి, రక్షించి, ఉపసంహరించు చున్నాడు (31) ఓ మునీ! శివుని అంశవలన జన్మించిన అశ్వత్థామ అపుడీ వృత్తాంతమునెరింగి శివుని ఇచ్ఛచే సంతసిల్లిన బుద్ధి గలవాడై శివ భక్తునకు ఏమియూ హానిని కలిగించ లేదు .

అథ ద్రౌణి రిదం విశ్వం కృత్స్నం కర్తుమపాండవమ్ ।
ఉత్తరాగర్భగం బాలం నాశితుం మన ఆదధే ॥
బ్రహ్మాస్త్ర మనివార్యం తదన్యే రస్త్రైర్మహా ప్రభమ్ ।
ఉత్తరాగర్భముద్దిశ్య చిక్షేప స మహాప్రభుః ॥
తతశ్చ సోత్తరా జిష్ణువధూర్వికల మానసా ।
కృష్ణం తుష్టావ లక్ష్మీశం దహ్యమానా తదస్త్రతః ॥
తతః కృష్ణశ్శివం ధ్యాత్వ హృదా నుత్వా ప్రణమ్య చ ।
అపాండవమిదం కర్తుం ద్రౌణేరస్త్రమబుధ్యత ॥
స్వరక్షార్థేంద్ర దత్తేన తదస్త్రేణ సువర్చసా ।
సుదర్శనేన తస్యాశ్చ వ్యధాద్రక్షాం శివాజ్ఞయా ॥
స్వరూపం శంకరా దేశాత్కృతం శైవవరేణ హ ।
కృష్ణేన చరితం జ్ఞాత్వా విమనస్కశ్చనైరభూత్ ॥
తతస్స కృష్ణః ప్రీతాత్మా పాండవాన్ సకలానపి ।
అపాతయత్త దంష్ట్రోస్తు తుష్టయే తస్య శైవరాట్ ॥

అపుడు అశ్వత్థామ సమస్త జగత్తులో పాండవులు లేకుండగా చేయుటకొరకై ఉత్తతరాగర్భమునందున్న బాలుని సంహరించుటకు నిశ్చయించెను (33). ఇతరాస్త్రములచే నివారింప శక్యము కానిది, గొప్ప కాంతి గలది అగు బ్రహ్మాస్త్రమును గొప్ప సమర్థుడగు ఆ అశ్వత్థామ ఉత్తరాగర్భమునుద్దేశించి ప్రయోగించెను (34). విజయియగు అభిమన్యుని పత్నియగు ఉత్తర అపుడు

వికలమైన మనస్సు గలదై, ఆ అస్త్రముచే పీడను పొందినదై లక్ష్మీపతియగు కృష్ణుని స్తుతించెను (35). అపుడు శ్రీ కృష్ణుడు హృదయములో శివుని ధ్యానించి స్తుతించి ప్రణమిల్లి, ఈ జగత్తులో పాండవులు లేకుండగా చేయుటకొరకై అశ్వత్థామ అస్త్రమును ప్రయోగించినాడని, తెలుసుకొనెను (36). అపుడు ఆయన శివుని ఆజ్ఞను పొంది తన రక్షణ కొరకు శివునిచే ఈయబడిన, గొప్ప తేజస్సుగల సుదర్శనాస్త్రముతో ఆ గర్భమును రక్షించెను (37.). శివభక్తాగ్రగణ్యుడగు కృష్ణుడు శంకరుని ఆదేశముచే తన అస్త్రమును వ్యర్థము చేసినాడని ఎరింగి అశ్వత్థామ మెల్లగా తన మనస్సులోని వైమనస్యమును తొలగించేను (38). అపుడు శివభక్తాగ్రగణ్యుడగు శ్రీ కృష్ణుడు సంతోషముతో నిండిన హృదయము గలవాడై ఆతనిని సంతోషపెట్టుటకై పాండవులనందరినీ ఆతని కాళ్లపై పడవేసెను .

అథద్రౌణిః ప్రసన్నాత్మా పాండవాన్ కృష్ణమేవ చ ।
నానావరాన్ దదౌ ప్రీత్యా సోఽశ్వత్థామానుగృహ్య చ ॥
ఇత్థం మహేశ్వరస్తాత చక్రే లీలాం పరం ప్రభుః ।
అవతీర్య క్షితౌ ద్రౌణి రూపేణ మునిసత్తమ ॥
శివావతా రోఽశ్వత్థామా మహాబలపరాక్రమః ।
త్రైలోక్య సుఖదోఽద్యాపీ వర్తతే జాహ్నవీతటే ॥
అశ్వత్థామావతారస్తే వర్ణితశ్శంకర ప్రభోః ।
సర్వసిద్ధి కరశ్చాపి భక్తా భీష్ట ఫలప్రదః ॥
య ఇదం శృణు యాద్భక్త్యా కీర్తయేద్వ సమాహితః ।
స సిద్ధిం ప్రాప్నుయాదిష్టామంతే శివపురం వ్రజేత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం అశ్వత్థామావతార వర్ణనం నామ షట్ త్రింశోఽధ్యాయః.

అపుడు ద్రోణపుత్రుడగు అశ్వత్థామ ప్రసన్నమగు మనస్సు గలవాడై పాండవులను శ్రీ కృష్ణుని అనుగ్రహించి ప్రేమతో అనేకవరములనిచ్చెను (40). వత్సా మహర్షీ! ఈ తీరున మహేశ్వర ప్రభుడు భూమిపై అశ్వత్థామ రూపములో అవతరించి గొప్ప లీలను చేసెను (41). మహాబలపరాక్రమములు గలవాడు, శివావతారుడు, ముల్లోకములకు సుఖమునిచ్చువాడు అగు అశ్వత్థామ ఈ నాటికీ గంగాతీరమున నున్నాడు (42). సర్వసిద్ధులనిచ్చునది, భక్తులకు అభీష్టఫలములనిచ్చునది. అగు శంకర ప్రభుని అశ్వత్థామావతారమును నీకు వర్ణించితిని (43). ఎవడైతే దీనిని భక్తితో వినునో, లేదా సమాహితచిత్తుడై కీర్తించునో, వాడు ఇష్టసిద్ధిని పొంది, దేహమును వీడిన తరువాత శివుని ధామమును పొందును .

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు అశ్వత్థామావతార వర్ణనమనే ముప్పది ఆరవ అధ్యాయము ముగిసినది.

37 – కిరాతావతారము – వ్యాసోపదేశము

నందీశ్వర ఉవాచః

శృణు ప్రాజ్ఞ కిరాతాఖ్యమవతారం పినాకినః ।
మూకం చ హతవాన్ ప్రీతో యోఽర్జునాయ వరం దదౌ ॥
సుయోధన జితాస్తే వై పాండవాః ప్రవరాశ్చ తే।
ద్రౌపద్యా చ తయా సాధ్వ్యా ద్వైతాఖ్యం వనమాయయుః ॥
తత్రైవ సూర్యదత్తాం వై స్థాలీమాశ్రిత్య తే తదా ।
కాలం చ వాహయామాసుస్సు ఖేన కిల పాండవాః ॥
ఛలార్థం ప్రేరితస్తేన దుర్వాసా మునిపుంగవః ।
సుయోధనేన విప్రేంద్ర పాండవాంతికమాదరాత్ ॥
ఛాత్త్రైస్స్వైరాయుతైస్సార్ధం యయాచే తత్ర తాన్ముదా ।
భోజ్యం చిత్తేప్సితం వై స తేభ్యశ్చైవ సమాగతః ॥
స్వీకృత్య పాండవేస్తైస్తై స్స్నానార్థం ప్రేషితాస్తదా ।
దుర్వాసః ప్రముఖాశ్చైవ మునయశ్చ తపస్వినః ॥
అథ తే పాండవాస్సర్వే అన్నా భావాన్మునీశ్వర ।
దుఃఖితాశ్చ తదా ప్రాణాంస్త్యక్తుం చిత్తే సమాదధుః ॥
ద్రౌపద్య చ స్మృతః కృష్ణ ఆగతస్తత్ క్షణాదపి ।
శాకం చ భక్షయిత్వా తు తేషాం తృప్తిం సమాదధత్ ॥
దుర్వాసాశ్చ తదా శిష్యాంస్తృప్తాన్ జ్ఞాత్వా యయౌ పునః ।
పాండవాః కృచ్ఛ్ర నిర్ముక్తాః కృష్ణస్య కృపయా తదా ॥
అథ తే పాండవాః కృష్ణం పప్రచ్ఛుః కిం భవిష్యతి ।
బలవాన్ శత్రురుత్పన్నః కిం కార్యం తద్వద ప్రభో ॥
ఇతి పృష్టస్తదాతైస్తు శ్రీకృష్ణః పాండవైర్మునే ।
స్మృత్వా శివపదాంభోజౌ పాండవానిదమబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓయీ ప్రాజ్ఞా! పినాకధారియగు శివుడు కిరాతావతారమును దాల్చి మూకుని సంహరించి అర్జునునకు ప్రేమతో వరమునిచ్చిన గాథను వినుము (1). పాండవవీరులు సుయోధనునిచే ఓడింపబడి పతివ్రతయగు ద్రౌపదితో గూడి ద్వైతవనమునకు వెళ్లిరి (2). పాండవులపుడు అచటనే సూర్యునిచే ఈయబడిన అక్షయపాత్రను. ఆధారముగా చేసుకొని సుఖముగా కాలమును గడుపుచుండిరి (3). ఓ బ్రాహ్మణశ్రేష్ఠా! సుయోధనుడు మోసబుద్ధితో ప్రేరేపించగా దుర్వాసమహర్షి పాండవుల వద్దకు సాదరముగా విచ్చేసెను (4). ఆతడు తన పదివేలమంది శిష్యులతో గూడి అచటకు ఆనందముగా వచ్చి వారిని కలిసి తమ మనస్సునకు నచ్చిన భోజనమునిమ్మని కోరెను (5). పాండవులాతని కోర్కెను స్వీకరించి

స్నానముకొరకు పంపెను. అపుడు దుర్వాసుడు, మునీశ్వరులు తపశ్శాలురు అగు ఆతని శిష్యులు స్నానమునకు వెళ్లిరి (6). ఓ మహర్షీ! అపుడు ఆ పాండవులందరు అన్నము లేకుండుటచే దుఃఖితులై ప్రాణములను వీడుటకు మనస్సులో నిర్ణయించుకొనిరి (7). అపుడు ద్రౌపది స్మరించగా శ్రీకృష్ణుడు తత్క్షణమే అచటకు వచ్చి కూరను తిని వారందరికీ తృప్తిని కలిగించేను (8). తన శిష్యులందరు తృప్తులైనారనీ ఎరింగి దుర్వాస మహర్షి మరలిపోయేను. అపుడా విధముగా కృష్ణుని దయచే పాండవులు కష్టమునుండి గట్టెక్కిరి (9). అపుడా పాండవులు శ్రీ కృష్ణుని "ఏమి జరుగనున్నది? బలవంతుడగు శత్రువు సంప్రాప్తమైనాడు. ఏమి చేయవలెను? ప్రభూ! ఆ విషయమును చెప్పుము' అని ప్రశ్నించిరి (10). ఓ మునీ! ఆ పాండవులిట్లు ప్రశ్నించగా అపుడు శ్రీ కృష్ణుడు శివుని పాదపద్మములను స్మరించి పాండవులతో నిట్లు పలికెను .

శ్రీకృష్ణ ఉవాచః

శ్రూయతాం పాండవాశ్రేష్ఠా శ్శృత్వా కర్తవ్యమేవ హి ।
మద్వృత్తాంతం విశేషేణ శివసేవా సమన్వితమ్ ॥
ద్వారకాం చ మయా గత్వా శత్రూణాం విజిగీషయా ।
విచార్య చోపదేశాంశ్చ ఉపమన్యోర్మహాత్మనః ॥
మయా హ్యారాధితశ్శంభుః ప్రసన్నః పరమేశ్వరః ।
బటుకే పర్వత శ్రేష్ఠే సప్తమాసం సుసేవితః ॥
ఇష్టాన్ కామానదాన్మహ్యం విశ్వేశశ్చ స్వయం స్థితః।
తత్ప్రభావాన్మయా సర్వసామర్థ్యం లబ్ధముత్తమమ్ ॥
ఇదానీం సేవ్యతే దేవో భుక్తి ముక్తి ఫలప్రదః ।
యూయం సేవత తం శంభుమపి సర్వ సుఖావహమ్ ॥

శ్రీకృష్ణుడిట్లు పలికెను -

శ్రేష్ఠులగు పాండవులారా! శివుని సేవతో నిండియున్న నా గాథను శ్రద్ధగా విని చెప్పిన విధముగా ఆచరించుడు (12). నేను శత్రువులను జయించే కోరికతో ద్వారకకు వెళ్లి, మహాత్ముడగు ఉపమన్యుని ఉపదేశములను విచారించి (13), పర్వతరాజమగు బటుకమునందు ఏడు మాసములు పరమేశ్వరుడగు శంభుని చక్కగా ఆరాధించి ప్రసన్నుని చేసుకొంటినీ (14). విశ్వేశ్వరుడు స్వయముగా సాక్షాత్కరించి నాకు నచ్చిన కోర్కెల నిచ్చెను. వాటి ప్రభావము చేతనే నేను ఉత్తమమైన సర్వసామర్థ్యమును పొందియున్నాను (15). భుక్తి మరియు ముక్తి అను ఫలములనిచ్చు ఆ దేవుని నేను ఇప్పుడు కూడా సేవించుచున్నాను. మీరు కూడ సర్వసుఖములనిచ్చే ఆ శంభుని సేవించుడు .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వాంతర్దధే కృష్ణ ఆశ్వాస్యాథ చ పాండవాన్ ।
ద్వారకామగమచ్ఛీఘ్రం స్మరన్ శివపదాంబుజమ్ ॥
పాండవా అథ భిల్లం చ ప్రేషయామాసురో జసా ।
గుణానాం చ పరీక్షార్థం తస్య దుర్యోధనస్య చ ॥
సోఽపి సర్వం చ తత్రత్యం దుర్యోధన గుణోదయమ్ ।
సమీచీనం చ తద్ జ్ఞాత్వా పునః ప్రాప ప్రభూన్ ప్రతి ॥
తదుక్తం తే నిశమ్యైవం దుఃఖం ప్రాపుర్మునీశ్వర ।
పరస్పరం సమూచుస్తే పాండవా అతిదుః ఖితాః ॥
కిం కర్తవ్యం క్వ గంతవ్యమస్మాభిరధునా యుధి।
సమర్థా అపి వై సర్వే సత్యపాశేన యంత్రితాః ॥
ఏతస్మిన్ సమయే వ్యాసో భస్మ భూషితమస్తకః ।
రుద్రాక్షాభరణశ్చాపియాజ్జటాజూట విభూషితః ॥
పంచాక్షరం జపన్మంత్రం శివప్రేమ సమాకులః ।
తేజసాం చ స్వయం రాశిస్సాక్షాద్ధర్మ ఇవాపరః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

శ్రీకృష్ణుడిట్లు పలికి పాండవులనోదార్చి అంతర్ధానమును జెంది శివుని పాదపద్మములను స్మరిస్తూ వెంటనే ద్వారకకు చేరెను (17). తరువాత వెంటనే పాండవులు ఆ దుర్యోధనుని గుణములను పరీక్షించుటకొరకై ఒక భిల్లుని పంపించిరి (18). ఆ భిల్లుడు ఆ రాజ్యములో దుర్యోధనుని గుణముల వికాసమును బాగుగానెరింగి అచటి వృత్తాంతమునంతనూ చక్కగా సేకరించి మరల పాండవుల వద్దకు తిరిగివచ్చెను (19). ఓ మహర్షీ! ఆతడు చెప్పిన వార్తను విని పాండవులు మిక్కిలి దుఃఖమును పొందిన వారై పరస్పరము సంప్రదించుకొనిరి (20). ఎచటకు పోవలెను? యుద్ధము విషయములో మనమిపుడు ఏమి చేయవలెను? మనమందరము సమర్థులమే అయిననూ, సత్యమనే పాశముచే బంధింపబడి యున్నాము (21). ఇదే సమయములో అచటకు విభూతితో అలంకరింప బడిన లలాటము గలవాడు, రుద్రాక్షలే ఆభరణములుగా గలవాడు, జటాజూటముతో ప్రకాశించువాడు, శివుని యందలి ప్రేమతో నిండిన హృదయము గలవాడు, తేజోమూర్తి, ధర్మమే స్వయముగా రూపుదాల్చినదా యన్నట్లు ఉన్నవాడు నగు వ్యాసుడు విచ్చేసెను .

తం దృష్ట్వా తే తదా ప్రీతా ఉత్థాయ పురతః స్థితాః ।
దత్త్వాసనం తదా తస్మై కుశాజిన సుశోభితమ్ ॥
తత్రోపవిష్టం తం వ్యాసం పూజయంతి స్మ హర్షితాః ।
స్తుతిం చ వివిధాం కృత్వా ధన్యాస్స్మ ఇతి వాదినః ॥
తపశ్చైవ సుసంతప్తం దానాని వివిధాని చ ।
తత్సర్వం సఫలం జాతం తృప్తాస్తే దర్శనాత్ప్రభో ॥
దుఃఖం చ దూరతో జాతం దర్శనాత్తే పితామహ ।
దుష్టైశ్చైవ మహాదుఃఖం దత్తం నః క్రూరకర్మభిః ॥
శ్రీమతాం దర్శనే జాతే దుఃఖం చైవ గమిష్యతి ।
కదాచిన్న గతం తత్ర నిశ్చయోఽయం విచారితః ॥
మహతామాశ్రమే ప్రాప్తే సమర్థే సర్వకర్మణి ।
యది దుఃఖం న గచ్ఛేత్తు దైవమేవాత్ర కారణమ్ ॥
నిశ్చయేనైవ గచ్ఛేత్తు దారిద్ర్యం దుఃఖకారణమ్ ।
మహతాంతిం చ స్వభావోఽయం కల్పవృక్షసమో మతః ॥

అపుడు వారు ఆయనను గాంచి ఆనందముతో లేచి ఆయన యెదుట నిలబడి దర్భలు మరియు లేడి చర్మముతో శోభిల్లే ఆసనమును ఆయనకు సమకూర్చిరి (24). దానియందు కూర్చున్న వ్యాసుని వారు ఆనందముతో పూజించి వివిధ స్తోత్రములను గావించి "మేము ధన్యులమైతిమి' అని పలికిరి (25). ఓ ప్రభూ! మేము చేసిన గొప్ప తపస్సు మరియు వివిధ దానములు ఈ సర్వము నీ దర్శనముచే సఫలమైనవి. మేము తృప్తిని చెందితిమి (26). ఓ పితామహా! నీ దర్శనముచే మా దుఃఖము దూరమైనది. దుష్టులు క్రూరమగు కర్మలు నాచరించి మాకు మహాదుఃఖమును కలిగించిరి (27). మహాత్ముల దర్శనముచే దుఃఖము దూరమగును. ఒకచో అప్పుడు కూడా దుఃఖము దూరము కానిచో, ఈ విధముగా విచారణ చేసి నిశ్చయించవలెను (28). మహాత్ముల సన్నిధి సర్వకర్మలను సిద్ధింపజేయును. అట్టి సన్నిధిలో కూడ దుఃఖము దూరము కానిచో, ఆ దుఃఖమునకు దైవమే కారణమని నిశ్చయించవలెను (29). దారిద్ర్యము దుఃఖమునకు హేతువు అయినచో, అది తప్పక తొలగిపోవును. మహాత్ములు కల్పవృక్షము వంటి వారు. దారిద్ర్యమును తొలగించి వేయుట వారికి అతి సహజమగు పని .

తద్గుణానేవ గణయన్మహతో వస్తుమాత్రతః ।
ఆశ్రయస్య వశాదేవ పుంసో వై జాయతే ప్రభో ॥
లఘుత్వం చ మహత్త్వం చ నాత్ర కార్యా విచారణా ।
ఉత్తమానాం స్వభావోఽయం యద్దీన ప్రతిపాలనమ్ ॥
రంకస్య లక్షణం లోకే ఖ్యాతి శ్రేయస్కరం మతమ్ ।
పురోఽస్య పరయత్నో వై సుజనానాం చ సేవనమ్ ॥

అతః పరం చ భాగ్యం వై దోషశ్చైవ న దీయతామ్ ।
ఏతస్మాత్కారణా త్స్వామింస్త్వయి దృష్టే శుభం తదా ॥
త్వదాగమన మాత్రేణ సంతుష్టాని మనాంసి నః ।
దినోపదేశం యేనాశు దుఃఖం నష్టం భవేచ్చ నః ॥
ఇత్యేతద్వచనం శ్రుత్వా పాండవానాం మహామునిః ।
ప్రసన్నమానసో భూత్వా వ్యాసశ్చైవా బ్రవీదిదమ్ ॥
హే పాండవాశ్చ యూయం వై న కష్టం కర్తుమర్హథ ।
ధన్యాస్స్థ కృతకృత్యాస్స్థ సత్యం నైవ విలోపితమ్ ॥

ఓ ప్రభూ! మహాత్ముడగు వ్యక్తి సర్వప్రాణులకు ఆశ్రయమగు ఆత్మవస్తువును మాత్రమే దర్శించును. దాని ప్రభావముచే ఆతడు ఇతరులలోని గుణములను మాత్రమే పరిగణనలోనికి తీసుకొనును (31). మహాత్ములు ఇతరుల లోని చిన్న పెద్ద తేడాలను విచారించరు. దీనులను రక్షించుట మహాత్ములకు స్వభావమై యున్నది (32). దారిద్ర్యము కూడ లోకములో మానవునకు గొప్ప శ్రేయస్సు నిచ్చునని చెప్పబడినది. అట్టివాడు తన వద్ద నున్న అవకాశమును వినియోగించుకొని సత్పురుషులను సేవించవలెను (33) ఆ పైన భాగ్యముపై నాధారపడును. దాని విషయమై దోషమును పట్టుట కుదరదు. ఈ కారణముచే నీ దర్శనము శుభకరమని చెప్పవచ్చును. ఓ స్వామీ! (34) నీ రాక మాత్రముచే మా మనస్సులు సంతోషముతో నిండియున్నవి, మా దుఃఖమును శీఘ్రముగా పోగొట్టే ఉపదేశమును మాకు చెప్పుము (35). పాండవుల ఈ మాటలను విని వ్యాసమహాముని ప్రసన్నమగు మనస్సు గలవాడై ఇట్లు పలికెను (36). ఓ పాండవులారా! మీరు ఇట్లు కష్టముల పాలగుటకు తగరు. అయిననూ మీయందు సత్యము లోపించలేదు. మీరు ధన్యులు, కృతార్థులు .

సుజనానాం స్వభావోఽయం ప్రాణాంతేఽపి సుశోభనః ।
ధర్మం త్యజంతి నైవాత్ర సత్యం సఫల భాజనమ్ ॥
అస్మాకం చైవ యూయం చ తే చాపి సమతాం గతాః ।
తథాపి పక్షపాతో వై ధర్మిష్ఠానాం మతో బుధైః ॥
ధృతరాష్ట్రేన దుష్టేన ప్రథమం చ హ్యచక్షుషా ।
ధర్మస్త్యక్తస్స్వయం లో భాద్యుష్మాకం రాజ్యమాహృతమ్ ॥
తస్య యూయం చ తే చాపి పుత్రా ఏవ న సంశయః ।
పితర్యుపరతే బాలా అనుకంప్యా మహాత్మనః ॥
పశ్చాత్పుత్రశ్చ తేనైవ వారితో న కదాచన ।
అనర్థోనైవ జాయేత యచ్చైవం చ కృతం తదా ॥
అతః పరం చ యజ్జాతే తజ్జాతం నాన్యథా భవేత్ ।
అయం దుష్టో భవంతశ్చ ధర్మిష్ఠాస్సత్యవాదినః ॥
తస్మాదంతే చ తస్యైవాశుభం హి భవితా ధ్రువమ్ ।
యచ్చైవ వాపితం బీజం తత్ప్రరోహో భవేది హ ॥

తస్మాద్దుః ఖం న కర్తవ్యం భవద్భిస్సర్వథా ధ్రువమ్ ।
భవిష్యతి శుభం వో హి నాత్ర కార్యా విచారణా ॥
ఇత్యుక్త్వా పాండవాస్సర్వే తేన వ్యాసేన ప్రీణితాః ।
యుధిష్ఠిర ముఖాస్తే చ పునరేవాబ్రువన్ వచః ॥

జీవితమునకు సార్థక్యమును కలిగించే ధర్మమును సత్యమును ప్రాణాపాయస్థితిలో నైననూ విడనాడక పోవుట సత్పురుషుల సుశోభనమగు స్వభావమై యున్నది (38). మాకు పాండవులయందు, కౌరవులయందు సమానమగు భావము గలదు. అయిననూ ధర్మాత్ములయందు పక్షపాతమును కలిగియుండుట విద్వాంసులకు సమ్మతము (39). ధృతరాష్ట్రుడు దుష్టుడు, ఆదినుండియు అంధుడు. ఆతడు ధర్మమును విడనాడి లోభముచే స్వయముగా మీరాజ్యమునపహరించినాడు (40). వానికి మీరు, వారు కూడ పుత్రులే యగుదురనుటలో సందేహము లేదు. మీ తండ్రి స్వర్గస్థుడైన పిదప మహాత్ములగు మీపై ప్రేమను చూపవలసియుండును (41). ఆ తరువాత ఆతడు తన పుత్రుని ఏనాడైనను దురాగతముల నుండి వారించలేదు. ఆనాడు అట్లు వారించి యున్నచో ఈ అనర్థము కలిగియుండెడిది గాదు (42). ఈ పైన విధి ఎట్లున్నదో అట్లు జరుగగలదు. దుర్యోధనుడు దుష్టుడు. మీరు ధర్మాత్ములు, సత్యవాదులు (43). అంతములో వానికి వినాశము తప్పదు. ఎట్టి బీజమును నాటిదమో, అట్టి అంకురమే వచ్చును గదా! (44) కావున మీరు ఎట్టి పరిస్థితులలో నైనా దుఃఖించవలదు. మీకు శుభము కలుగగలదు. దీనిలో సందేహము లేదు (45). వ్యాసుడిట్లు పలుకగా యుధిష్ఠిరుడు మొదలుగా గల పాండవులందరు సంతసించి మరల 'ఇట్లు పలికిరి .

పాండవా ఊచుః ।

సత్యముక్తం త్వయా నాథ దుష్టైదుః ఖం నిరంతరమ్ ।
దుష్టాత్మభిర్వనే చాపి దీయతే హి ముహుర్ముహుః ॥
తన్నాశయాశుభం తేఽద్య కించిద్దేయం శుభం విభో ।
కృష్ణేన కథితం పూర్వమారాధ్యశ్శంకరస్సదా ॥
ప్రమాదశ్చ కృతోఽస్మాభిస్తద్వచ శ్శిథిలీకృతమ్ ।
స దేవ మార్గస్తు పునరిదానీముపదిశ్యతామ్ ॥

పాండవులిట్లు పలికిరి –

ప్రభూ! మీరు సత్యమును పలికితిరి. ఆ దుర్మార్గులు నిరంతరముగా వనములో కూడా దుఃఖమును కలిగించుచునే యున్నారు (47). ఓ విభూ! కావున, నీవు అశుభమును నశింపజేయుము. శుభమార్గమునుపదేశింపుము. సర్వదా శంకరుని ఆరాధించవలెనని పూర్వము కృష్ణుడు చెప్పియున్నాడు (48). మేము పొరపాటు చేసితిమి. ఆ మాటను సరిగా పాటించలేదు. ఓ దేవా! "అదే మార్గమును మరల ఇపుడు ఉపదేశించుడు .

నందీశ్వర ఉవాచః

ఇత్యేతద్వచనం శ్రుత్వా వ్యాసో హర్షసమన్వితః ।
ఉవాచ పాండవాన్ ప్రీత్యా స్మృత్వా శివపదాంబుజమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఈ మాటలను విని వ్యాసుడు మిక్కిలి ఆనందించి శివుని పాదపద్మములను స్మరించి ప్రీతితో పాండవుల నుద్దేశించి ఇట్లు పలికెను .

వ్యాస ఉవాచః

శ్రూయతాం వచనం మేఽద్య పాండవా ధర్మబుద్ధయః ।
సత్యముక్తం తు కృష్ణేన మయా సంసేవ్యతే శివః ॥
భవద్భి స్సేవ్యతాం ప్రీత్యా సుఖం స్యాదతులం సదా ।
సర్వదుఃఖం భవత్యేవ శివాఽసేవాత ఏవ హి ॥

వ్యాసుడిట్లు పలికెను -

ధర్మ బుద్ధిగల పాండవులారా!, ఇపుడు నా మాటను వినుడు. శ్రీ కృష్ణుడు సత్యమును పలికినాడు: నేను కూడ శివుని చక్కగా సేవించుచున్నాను (51). మీరు ప్రీతితో సేవించుడు. మీకు సర్వదా సాటిలేని సుఖము కలుగును. శివుని సేవించక పోవుటచేతనే దుఃఖములన్నియు' కలుగును సుమా.

నందీశ్వర ఉవాచః

అథ పంచసు తేష్వేవ విచార్య శివపూజనే ।
అర్జునం యోగ్యముచ్చార్య వ్యాసో మునివరస్తథా ॥
తపస్స్థానం విచార్యైవం తతస్స మునిసత్తమః ।
పాండవాన్ ధర్మ సన్ని ష్ఠాన్ పునరేవా బ్రవీదిదమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

వ్యాసమహర్షి విచారణ చేసి ఆ అయిదుగురిలో శివపూజయందు అర్జునుడు యోగ్యుయుడని నిర్ధారించెను (53). తరువాత ఆ మహర్షి తపస్సు చేయదగిన స్థానమును నిర్ణయించి ధర్మనిష్ఠులగు పాండవులతో మరల నిట్లు పలికెను .

వ్యాస ఉవాచః

శ్రూయతాం పాండవాస్సర్వే కథయామి హితం సదా ।
శివం సర్వం పరం దృష్ట్వా పరం బ్రహ్మ సతాం గతిమ్ ॥
బ్రహ్మాది త్రిపరార్ధాంతం యత్ కించి ద్దృదృశ్యతే జగత్ ।
తత్సర్వం శివరూపం చ పూజ్యం ధ్యేయం చ తత్పునః ॥
సర్వేషాం చైవ సేవ్యోఽసౌ శంకరస్సర్వదుః ఖహా ।
శివస్స్వల్పేన కాలేన సంప్రసీదతి భక్తితః ।
సుప్రసన్నో మహేశో హి భక్తేభ్యసకలప్రదః ।
భుక్తిం ముక్తి మహాముత్ర యచ్ఛతీతి సునిశ్చితమ్ ॥
తస్మాత్సేవ్యస్సదా శంభుర్భుక్తి ముక్తి ఫలేప్సుభిః ।
పురుషశ్శంకర స్సాక్షాదుష్టహంతా సతాం గతిః ॥
పరం తు ప్రథమం శక్రవిద్యాం దృఢమనా జపేత్ ।
క్షత్రియస్య పరాఖ్యస్య చేదమేవ సమాహితమ్ ॥
అతోఽర్జునశ్చ ప్రథమం శక్రవిద్యాం జపేద్దృఢః ।
కరిష్యతి పరీక్షాం ప్రాక్ సంతుష్టస్తద్భవిష్యతి ॥
సుప్రసన్నశ్చ విఘ్నాని సంహరిష్యతి సర్వదా ।
పునశ్చైవం శివస్యైవ వరం మంత్రం ప్రదాస్యతి ॥

వ్యాసుడిట్లు పలికెను -

పాండవులారా! మీరందరు వినుడు. నేను సర్వదా హితమును పలికెదను. సర్వము శివుడే. పరబ్రహ్మ సత్పురుషులకు శరణ్యుడు అగు శివుని దర్శించుటయే పరమగతి (55). బ్రహ్మతో మొదలిడి అనంతము వరకు ఏ జగత్తు కానవచ్చుచున్నదో, ఆ సర్వము శివస్వరూపమేయని ఎరింగి పూజించి ధ్యానించవలెను (56). సర్వదుఃఖములను పోగొట్టు శివుడు సర్వులకు సేవనీయుడు. మంగళకరుడగు శివుడు భక్తిచే స్వల్పకాలములో ప్రసన్నుడగును (57). మహేశ్వరుడు ప్రసన్నుడై భక్తులకు ఇహలోకములో భుక్తిని, దేహత్యాగము తరువాత ముక్తిని మరియు సర్వఫలములను ఇచ్చుననుట సునిశ్చితము (58). కావున భుక్తి ముక్తి ఫలములను గోరువారు సత్పురుషులకు శరణ్యుడు, దుష్టశిక్షకుడు, సాక్షాత్తు పురుషుడు అగు శంకరుని సర్వదా సేవించవలెను (59). కాని క్షత్రియుడు ముందుగా దృఢమగు మనస్సుతో ఇంద్రవిద్యను జపించవలెను. గొప్ప కీర్తి గల క్షత్రియునకు ఇదియే గొప్ప హితమును చేగూర్చును (60). కావున అర్జునుడు ముందుగా ఇంద్రవిద్యను దృఢమనస్కుడై జపించవలెను. ఇంద్రుడు ముందుగా పరీక్ష చేయును. దానిలో నెగ్గినచో, ఆయన సంతోషమును పొందును (61). ఇంద్రుడు ప్రసన్నుడై సర్వదా విఘ్నములను తొలగించి, మరియు శివుని యొక్క శ్రేష్ఠమగు మంత్రమును ఈయగలడు .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వార్జున మాహూయోపేంద్ర విద్యాముపాశత్ ।
స్నాత్వా చ ప్రాఙ్ ముఖో భూత్వా జగ్రాహార్జున ఉగ్ర ధీః ॥
పార్థివస్య విధానం చ తస్మై మునివరో దదౌ।
ప్రత్యువాచ చ తం వ్యాసో ధనంజయ ముదారధీః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

వ్యాసుడిట్లు పలికి అర్జునుని తన వద్దకు పిలిచి ఇంద్రవిద్యను ఉపదేశించెను. అర్జునుడు దృఢనిశ్చయము గలవాడై స్నానము చేసి తూర్పువైపు కూర్చుండి స్వీకరించెను (63). విశాలహృదయుడగు వ్యాసమహర్షి ధనంజయునకు పార్థివలింగ పూజావిధానమును కూడ ఉపదేశించి ఇట్లు పలికెను .

వ్యాస ఉవాచః

ఇతో గచ్ఛాధునా పార్థ ఇంద్రకీలే సుశోభనే ।
జాహ్నవ్యాశ్చ సమీపే వై స్థిత్వా సమ్యక్తపః కురు ॥
అదృశ్యా చైవ విద్యా స్యాత్ సదా తే హితకారిణీ ।
ఇత్యాశిషం దదౌ తస్మై తతః ప్రోవాచ తాన్మునిః ॥
ధర్మమాస్థాయ సర్వే వై తిష్ఠంతు నృపసత్తమాః ।
సిద్ధిస్స్యాత్సర్వథా శ్రేష్ఠా నాత్ర కార్యా విచారణా ॥

వ్యాసుడిట్లు పలికెను –

ఓ అర్జునా! ఇచట నుండి ఇపుడు అతి సుందరమగు ఇంద్రకీల పర్వతమునకు వెళ్లుము. గంగానదికి సమీపములో నుండి చక్కగా తపస్సును చేయుము (65). ఈ విద్య కంటికి కానరానిదై సదా నీవెంట ఉండి హితమును చేయును. ఆ మహర్షి ఇట్లాతనిని ఆశీర్వదించి తరువాత ఆ పాండవులతో నిట్లనెను (66). ఓ రాజశ్రేష్ఠులారా! మీరందరు ధర్మమార్గములో స్థిరముగా నడువుడు. మీకు సర్వవిధములుగా శ్రేష్ఠమగు సిద్ధి కలుగును. ఈ విషయములో సందేహము లేదు .

నందీశ్వర ఉవాచః

ఇతి దత్త్వాశిషం తేభ్యః పాండవేభ్యో మునీశ్వరః ।
స్మృత్వా శివపదాంభోజం వ్యాసశ్చాంతర్దధే క్షణాత్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం కిరాతావతారే
వ్యాసోపదేశ వర్ణనం నామ సప్తత్రింశోఽధ్యాయః॥

నందీశ్వరుడిట్లు పలికెను –

వ్యాసమహర్షి ఆ పాండవులకు ఇట్లు ఆశీస్సులనొసంగి శివపాదపద్మములను స్మరించి క్షణములో అంతర్ధానమాయెను .

38 – అర్జునుని తపస్సు

నందీశ్వర ఉవాచః

అర్జునోఽపి తదా తత్ర దీప్యమానో వ్యదృశ్యత ।
మంత్రేణ శివరూపేణ తేజశ్చాతులమావహన్ ॥
తే సర్వే చార్జునం దృష్ట్వా పాండవా నిశ్చయం గతాః ।
జయోఽస్మాకం ధ్రువం జాతం తేజశ్చ విపులం యతః ॥
ఇదం కార్యం త్వయా సాధ్యం నాన్యేన చ కదాచన ।
వ్యాసస్య వచనాద్భాతి సఫలం కురు జీవితమ్ ॥
ఇతి ప్రోచ్యార్జునం తే వై విరహౌత్సుక్యకాతరాః ।
అనిచ్ఛంతోఽపి తత్రైవ ప్రేషయామాసురాదరాత్ ॥
ద్రౌపదీ దుఃఖసంయుక్త నేత్రా శ్రూణి నిరుధ్య చ ।
ప్రేషయంతీ శుభం వాక్యం తదోవాచ పతివ్రతా ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

అపుడు అచట శివరూపమగు మంత్రముచే సాటిలేని తేజస్సును కలిగియున్న అర్జునుడు, ప్రకాశిస్తూ కానవచ్చెను (1). ఆ పాండవులందరు అర్జునుని గాంచి, 'ఈతనియందు ఇంతటి గొప్ప తేజస్సు కలదు గాన, మనకు విజయము తథ్యము' అని భావించిరి (2). ఈ పనిని నీవు మాత్రమే చేయగలవు. ఇతరులు ఎన్నడైననూ చేయజాలరు. వ్యాసుని వచనముచే ఈ సత్యము స్పష్టమగుచున్నది. నీ జీవితమును సఫలము చేసుకొనుము (3). వారు ఇట్లు పలికి విరహ దుఃఖముచే భయపడుతూ, ఇష్టములేకున్ననూ అర్జునుని సాదరముగా అచటకు పంపిరి (4). పతివ్రతయగు ద్రౌపది దుఃఖముతో నిండిన హృదయము గలదై కన్నీటిని ఆపుకొని ఆయనకు వీడ్కోలు చెపుతూ అపుడు ఈ శుభవచనములను పలికెను .

ద్రౌపద్యువాచ ।

వ్యాసోపదిష్టం య ద్రాజంస్త్వయా కార్యం ప్రయత్నతః ।
శుభప్రదోఽస్తు తే పంథాశ్శంకరశ్శంకరోఽస్తు వై ॥
తే సర్వే చావసంస్తత్ర విస్సృజ్యార్జు నమోదరాత్ ।
అత్యంత దుఃఖమాపన్నా మీలిత్వా పంచ ఏవ చ ॥
స్థితాస్తత్ర వదంతి స్మ శ్రూయతామృషిసత్తమ ।
దుః ఖేఽపి ప్రియసంగో వై న దుఃఖాయ ప్రజాయతే ॥
వియోగే ద్విగుణం తస్య దుఃఖం భవతి నిత్యశః ।
తత్ర ధైర్యధరస్యాపి కథం ధైర్యం భవేదిహా ॥

ద్రౌపది ఇట్లు పలికెను -

ఓ రాజా! నీవు వ్యాసుని ఉపదేశమును శ్రద్ధగా పాలించుము. నీకు మార్గము శుభప్రదమగు గాక! శంకరుడు నీకు మంగళమును చేయుగాక! (6) ఆ పాండవులు నల్గురు ద్రౌపది కలిసి అర్జునునకు వీడ్కోలు చెప్పి మహాదుఃఖమును పొందిన వారై అచటనే నివసించిరి (7). ఓ మహర్షీ! వారచట ఉన్నవారై తమలో తాము ఇట్లు మాటలాడు కొనిరి. వినుము. ప్రియుని సన్నిధిలో దుఃఖము కలిగిననూ అది అధికముగా పీడించదు (8). ప్రియవియోగములో నుండగా దుఃఖము కలిగినచో, అది నిత్యము రెండు రెట్లు అధికపీడను కలిగించును. ధైర్యము గలవాని కైననూ ఆ స్థితిలో ధైర్యము ఎట్లు నిలబడును ?

నందీశ్వర ఉవాచః

కుర్వత్స్వేవ తదా దుఃఖం పాండవేషు మునీశ్వరః ।
కృపాసింధుశ్చ స వ్యాస ఋషివర్యస్సమాగతః ॥
తం తదా పాండవాస్తే వై నత్వా సంపూజ్య చాదరాత్ ।
దత్త్వాసనం హి దుఃఖాఢ్యాః కరౌ బద్ధ్వా వచో బ్రువన్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ పాండవులు అట్లు దుఃఖించుచుండగా ఆ సమయములో దయానిధియగు వ్యాసమహర్షి విచ్చేసెను (10). అపుడా పాండవులు ఆయనకు నమస్కరించి, సాదరముగా పూజించి ఆసనముపై కూర్చుండ బెట్టి దుఃఖముతో నిండిన హృదయములు గలవారై చేతులు జోడించి ఇట్లు పలికిరి .

పాండవో ఊచుః ।

శ్రూయతామృషిశ్రేష్ఠ దుఃఖదగ్ధా వయం ప్రభో ।
దర్శనం తేఽద్య సంప్రాప్య హ్యానందం ప్రాప్నుమో మునే ॥
కియత్కాలం వసాత్రైవ దుఃఖనాశాయ నః ప్రభో ।
దర్శనాత్తవ విప్ర శ్రేష్ఠస్సర్వదుఃఖం విలీయతే ॥

పాండవులిట్లు పలికిరి -

ఓ మహర్షీ! ప్రభూ! వినుడు. మేము దుఃఖముచే పీడితులమై ఉన్నాము. ఓ మునీ! ఈ నాడు నీ దర్శనముచే మాకు ఆనందము కలుగుచున్నది (12). ఓ ప్రభూ! మా దుఃఖమును పోగొట్టుట కొరకై మీరు కొంతకాలము ఇచటనే నివసించుడు. ఓ ఋషీ! నీ దర్శనముచే దుఃఖమంతయూ దూరమగును .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తస్స ఋషిశ్రేష్ఠో వ్యవసత్తత్సు ఖాయ వై ।
కథాభిర్వివిధాభిశ్చ తద్దుః ఖం నోదయంస్తదా ॥
వార్తాయాం క్రియమాణాయాం తేన వ్యాసేన సన్మునే ।
సుప్రణమ్య వినీతాత్మా ధర్మరాజోఽ బ్రవీదిదమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

వారిట్లు కోరగా ఆ మహర్షి అచట నివసించి వివిధ గాథలతో వారి దుఃఖమును పోగొట్టి సుఖమును కలిగించెను (14). ఓ మహర్షీ ! ఆ వ్యాసుడు ఇట్లు ఒకనాడు వ్యాఖ్యానించుచుండగా వినయశీలుడగు ధర్మరాజు ప్రణమిల్లి ఇట్లు పలికెను .

ధర్మరాజ ఉవాచః

శృణు త్వం హి ఋషిశ్రేష్ఠ దుః ఖశాంతిర్మతా మమ ।
పృచ్ఛామి త్వాం మహాప్రాజ్ఞ కథనీయం త్వయా ప్రభో ॥
ఈ దృశం చైవ దుఃఖం చ పురా ప్రాప్తశ్చ కశ్చన ।
వయమేవ పరం దుఃఖం ప్రాప్తి వై నైవ కశ్చన ॥

ధర్మరాజు ఇట్లు పలికెను -

ఓ మహర్షీ! నీవు వినుము. నేను ఈ దుఃఖముయొక్క శాంతిని అపేక్షించుచున్నాను. నీవు మహాప్రజ్ఞాశాలివి. నేను నిన్ను - ప్రశ్నించుచున్నాను. ఓ ప్రభూ! నీవు చెప్పవలెను (16). ఇట్టి దుఃఖమును పూర్వము ఎవరైననూ పొందినారా? మేమే మహాదుఃఖమును పొందుచున్నామా ? ఇతరులకు ఎవ్వరికైననూ ఇంత దుఃఖములేదు .

వ్యాస ఉవాచః

రాజ్ఞస్తు నలనామ్నో వై నిషధాధిపతేః పురా ।
భవద్దుః ఖాధికం దుఃఖం జాతం తస్య మహాత్మనః ॥
హరిశ్చంద్రస్య నృపతే ర్జాతం దు: ఖం మహత్తరమ్ ।
అకథ్యం తద్విశేషేణ పరశోకావహం తథా ॥
దుఃఖం తథైవ విజ్ఞేయం రామస్యాప్యథ పాండవ ।
యచ్ఛ్రుత్వా స్త్రీ నరాణాం చ భవేన్మోహో మహత్తరః ॥
తస్మాద్వర్ణయితుం నైవ శక్యతే హి మయా పునః ।
శరీరం దుఃఖరాశిం చ మత్వా త్యాజ్యం త్వయాధునా ॥
యేనేదం చ ధృతం తేన వ్యాప్తమేవ న సంశయః ।
ప్రథమం మాతృగర్భే వై జన్మ దుఃఖస్య కారణమ్ ॥
కౌమారేఽపి మహద్దుః ఖం బాలలీలానుసారితమ్ ।
తతోఽపి యావనే కామాన్ భుంజానో దుఃఖరూపిణః ।
గతాగతైర్దినానాం హి కార్య భారైరనేకశః।
ఆయుశ్చ క్షీయతే నిత్యం న జానాతి హ తత్పునః ॥
అంతే చ మరణం నైవ మహాదుఃఖమతః పరమ్ ।
నానా నరకపీడాశ్చ భుజ్యంతేఽజైర్నరైస్తదా ॥
తస్మాదిదమసత్యం చ త్వం తు సత్యం సమాచర ।
యేనైవ తుష్యతే శంభుస్తథా కార్యం నరేణ చ ॥

వ్యాసుడిట్లు పలికెను –

పూర్వము నిషధదేశాధిపతియగు నలమహారాజునకు మీకంటే అధికమగు దుఃఖము కలుగగా, ఆ మహాత్ముడు దానిని సహించెను (18). హరిశ్చంద్ర మహారాజునకు అంత కంటే అధికమగు దుఃఖము కలిగెను. మహా దుఃఖమును కలిగించే ఆయన కష్టములను వివరించి చెప్పుట సంభవము కాదు (19). ఓ ధర్మరాజా! అదే విధముగా రామునకు కూడ మహాదుఃఖము కలిగెను. ఆ దుఃఖమును గురించి విన్న స్త్రీ పురుషులు మహామోహమును పొందెదరు (20). కావున ఆ దుఃఖమును మరల వర్ణించే శక్తి నాయందు లేదు. ఈ శరీరము దుఃఖనిలయము. నీవీ సత్యమునెరింగి దుఃఖమును విడనాడుము (21). ఏ పరమేశ్వరుడు ఈ జగత్తును ధరించుచున్నాడో, ఆయనయే దీనినంతనూ వ్యాపించి యున్నాడు. దీనిలో సందేహము లేదు. ముందుగా తల్లి గర్భములో ప్రవేశించుటయే దుఃఖహేతువు అగును (22). బాలచేష్టలతో గూడియుండు బాల్యావస్థయందు కూడా మహాదుఃఖము గలదు. ఆ తరువాత మానవుడు యౌవనములో దుఃఖాత్మకములగు కోర్కెలను అనుభవించును (23). రాత్రింబగళ్లు ఒకదాని తరువాత మరియొకటి క్రమముగా వచ్చిపోవుచుండును. అనేక కార్యముల భారము నెత్తిపై పడును. ప్రతిదినము ఆయుర్దాయము క్షీణించుచుండును. కాని మానవుడు ఆ సత్యమును తెలియకున్నాడు (24).

ఆయుర్దాయము పూర్తి కాగానే మరణము సంప్రాప్తమగును. దాని తరువాత అజ్ఞానులగు జీవులు అనేక నరక పీడలననుభవించెదరు (25). కావున ఈ జగత్తు మిథ్య. నీవు సత్యము ననుష్ఠించుము. ఏ పనిని చేసినచో, శంభుడు సంతుష్టుడగునో, మానవుడా పనిని చేయవలెను .

నందీశ్వర ఉవాచః

ఏవం వివిధవార్తాభిః కాలనిర్యాపణం తదా ।
చక్రుస్తే భ్రాతర స్సర్వే మనోరథపథైః పునః ॥
అర్జునోఽపి స్వయం గచ్ఛన్ దుర్గాద్రిషు దృఢవ్రతః ।
యక్షం లబ్ధ్వా చ తేనైవ దస్యూన్నిఘ్నన్ననేకశః ॥
మనసా హర్ష సంయుక్తో జగామాచల ముత్తమమ్ ।
తత్ర గత్వా చ గంగా యాస్సమీపం సుందరం స్థలమ్ ॥
అశోకకాననం యత్ర తిష్ఠతి స్వర్గ ఉత్తమః।
తత్ర తస్థౌ స్వయం స్నాత్వా నత్వా చ గురుముత్తమమ్ ॥
యథోపదిష్టం వేషాది తథా చైవాకరోత్స్వయమ్ ।
ఇంద్రియాణ్యపకృష్యాదౌ మనసా సంస్థితో భవత్ ॥
పునశ్చ పార్థివం కృత్వా సుందరం సమసూత్రకమ్ ।
తదగ్రే ప్రణిదధ్యే స తేజోరాశిమనుత్తమమ్ ॥
త్రికాలం చైవ సుస్నాతః పూజనం వివిధం తదా ।
చకారోపాసనం తత్ర హరస్య చ పునః పునః ॥
తస్యైవ శిరసస్తే జో నిస్సృతం తచ్చరాస్తదా ।
దృష్ట్వా భయం సమాపన్నాః ప్రవిష్టశ్చ కదా హ్యయమ్ ॥
పునస్తే చ విచార్యైవం కథనీయం బిడౌజసే ।
ఇత్యుక్త్వా తు గతాస్తే వై శక్ర స్యాంతికమంజసా ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ సోదరులందరు ఈ విధముగా వివిధగాథలను వింటూ మనోధాజ్యములో విహరిస్తూ కాలమును గడుపుచుండిరి (27). దృఢవ్రతుడగు అర్జునుడు దుర్గమములగు పర్వతములయందు పయనిస్తూ దారిలో ఒక యక్షుని కలుసుకొని దాని ద్వారా చాలమంది బందిపోటు దొంగలను సంహరించెను (28). ఆతడు మనస్సులో హర్షము గలవాడై ఉత్తమమగు ఇంద్రకీల పర్వతమును చేరుకొని అచట గంగానదికి సమీపములో అందమగు స్థలమునందు మకాము చేసెను (29). అశోక వనముతో గూడియున్న ఆ స్థానము స్వర్గము కంటే ఉత్తమముగా నుండెను. ఆతడు గంగానదిలో స్నానమాడి గురువునకు నమస్కరించి (30), గురువు ఉపదేశించిన విధంబున వేషాదులను దాల్చి ఉపాసనను మొదలిడెను. ముందుగా ఇంద్రియములను ఉపసంహరించి మనస్సును ఏకాగ్రము చేసెను (31). ఆతడు చక్కని ఆసనముపై కూర్చుండెను.

సుందరము, సమపరిమాణము గలది అగు పార్థివ లింగమును చేసి దాని ఎదుట కూర్చుండి సర్వశ్రేష్ఠుడు, తేజోరాశియగు శివుని ధ్యానించెను (32). ఆతడు మూడు కాలములలో స్నానమును చేయుచూ శివుని పలుతెరంగుల పూజించి ఉపాసించెను (33). ఆతని శిరస్సునుండి తేజస్సు బయల్వెడలు చుండెను. దానిని చూచి ఇంద్రుని అనుచరులు భయపడిరి. ఈతడు ఎప్పుడు ఇచట ప్రవేశించినాడు? అని వారు ఆశ్చర్యమును పొందిరి (34). వారు మరల ఆలోచించుకొని ఇంద్రునకు చెప్పవలెనని నిశ్చయించి వెంటనే ఇంద్రుని వద్దకు వెళ్లిరి .

చరా ఊచుః ।

దేవో వాథ ఋషిశ్చైవ సూర్యో వాథ విభావసుః ।
తపశ్చరతి దేవేశ న జానీమో వనే చ తమ్ ॥
తస్యైవ తేజసా దగ్ధా ఆగతాస్తవ సన్నిధౌ।
నివేదితం చరిత్రం తత్ క్రియతాముచితం తు యత్ ॥

అనుచరులిట్లు పలికిరి -

ఓ దేవేంద్రా! అడవిలో ఒక వ్యక్తి తపస్సు చేయుచున్నాడు. ఆతడు ఋషియా, దేవతయా, సూర్యుడా, లేక అగ్నియా అను విషయము మాకు తెలియకున్నది (36). ఆతని తేజస్సుచే పీడింపబడిన మేము నీ సన్నిధికి వచ్చితిమి. ఆ వృత్తాంతమును నీకు నివేదించితిమి. ఉచితమగు ప్రతిక్రియను నీవు ఆచరింపుము .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త సైశ్చరైస్సర్వం జ్ఞాత్వా పుత్ర చికీర్షితమ్ ।
స గోత్రపాన్ విసృజ్యైవ తత్ర గంతుం మనో దధే ॥
స వృద్ధ బ్రాహ్మణో భూత్వా బ్రహ్మచారీ శచీపతిః ।
జగామ తత్ర విప్రేంద్ర పరీక్షార్థం హి తస్య వై ॥
తమాగతం తదా దృష్ట్వాకర్షిత్పూజాం చ పాండవః ।
స్థితోఽగ్రే చ స్తుతిం కృత్వా క్వాయాతోఽసి వదాధునా ॥
ఇత్యుక్తస్తేన దేవేశో ధైర్యార్థం తస్య ప్రీతితః ।
పరీక్షా గర్భితం వాక్యం పాండవం తం తతోఽబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ అనుచరులిట్లు పలుకగా ఇంద్రునకు తన కుమారుని సంకల్పము అవగతమయ్యెను. ఆయన ఆ పర్వత రక్షకులను పంపించి, తాను అచటకు వెళ్లవలెనని నిశ్చయించుకొనెను (38). ఆ శచీపతియగు ఇంద్రుడు అర్జునుని పరీక్షించుటకొరకై వృద్ధ బ్రాహ్మణ బ్రహ్మచారి రూపమును దాల్చి అచటకు వెళ్లెను. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా! (39) అర్జునుడు అచటకు విచ్చేసిన ఆ బ్రాహ్మణుని గాంచి పూజించి ఎదుట నిలబడి స్తుతించి 'అయ్యా! ఎచటనుండి ఇపుడిచటకు వచ్చినారు?' (40) అని ప్రశ్నించగా, ఇంద్రుడు ప్రేమతో ఆతనిని పరీక్షించి

ధైర్యమును కలిగించుటకొరకై, ఆ పాండు పుత్రునితో గర్వముతో గూడిన ఈ వాక్యమును పలికెను .

బ్రాహ్మణ ఉవాచః

నవే వయసి వై తాత కిం తపస్యసి సాంప్రతమ్ ।
ముక్త్యర్థం వా జయార్థం కిం సర్వధౌతత్తపస్తవ ॥

బ్రాహ్మణుడిట్లు పలికెను –

వత్సా! నీవు ఇపుడు యౌవనములో నున్నావు. తపస్సు చేయుటకు కారణమేమి? ఈ నీ తపస్సునకు ప్రధానప్రయోజనము ముక్తియా? లేక యుద్ధములో జయమా?

నందీశ్వర ఉవాచః

ఇతి పృష్టస్తదా తేన సర్వం సంవేదితం పునః ।
త చ్ఛ్రుత్వా స పునర్వాక్యమువాచ బ్రాహ్మణస్తదా ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఆ బ్రాహ్మణుడిట్లు ప్రశ్నించగా అర్జునుడు సర్వమును విన్నవించేను. అపుడా బ్రాహ్మణుడు ఆ మాటలను విని మరల ఇట్లు పలికెను .

బ్రాహ్మణ ఉవాచః

యుక్తం న క్రియతే వీర సుఖం ప్రాప్తుం చ యత్తపః ।
క్షాత్రధర్మేణ క్రియతే ముక్త్యర్థం కురు సత్తమ ॥
ఇంద్రస్తు సుఖదాతా వై ముక్తి దాతా భవేన్న హి ।
తస్మా త్త్వం సర్వథా శ్రేష్ఠ కర్తుమర్హసి సత్తపః ॥

బ్రాహ్మణుడిట్లు పలికెను –

ఓ వీరా! నీవు క్షత్రియధర్మమగు యుద్ధముచే సుఖమును పొందగోరి తపస్సును◌ు చేయుట ఉచితము కాదు. ఓ సత్పురుషా! ముక్తి కొరకు తపస్సును చేయుము (44). ఇంద్రుడు సుఖమునిచ్చువాడే గాని ముక్తిని ఇచ్చువాడు కాదు. ఓ వీరా! కావున నీవు సద్రూపుడగు పరమేశ్వరుని ఉద్దేశించి తపస్సును చేయుట నిశ్చితముగా ఉచితమగు తపస్సు అగును .

నందీశ్వర ఉవాచః

ఇదం తద్వచనం శ్రుత్వా క్రోధం చ క్రేఽర్జునస్తదా ।
ప్రత్యువాచ వినీతాత్మా తదనాదృత్య సువ్రతః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఆతని ఈ మాటలను విని అర్జునునకు అపుడు కోపము వచ్చెను. గొప్ప వ్ర◌ితముగల అర్జునుడు ఆ కోపమును తొలగించుకొని వినయముతో నిండిన మనస్సు గలవాడై ఇట్లు బదులిడెను .

అర్జున ఉవాచః

రాజ్యార్థం న చ ముక్త్యర్థం కమర్థం భాషసే త్విదమ్ ।
వ్యాసస్య వచనేనైవ క్రియతే తప ఈదృశమ్ ॥
ఇతో గచ్ఛ బ్రహ్మచారిన్ మా పాతయితు మిచ్ఛసి ।
ప్రయోజనం కిమత్రాస్తి తవ వై బ్రహ్మచారిణః ॥

అర్జునుడిట్లు పలికెను -

నేను రాజ్యము కొరకు తపస్సును చేయుచున్నాను; ముక్తి కొరకు కాదు. నీ(ీ)వు ఇట్లేల మాటలాడుచుంటివి? ఈ తపస్సును నేను వ్యాసుని ఆదేశముచే మాత్రమే చేయుచున్నాను (47). ఓ బ్రహ్మచారీ! నీవు ఇచటనుండి తొలగిపొమ్ము. నన్ను పతితుని చేయు ఇచ్ఛను విడనాడుము. బ్రహ్మచారివి అగు నీకు ఇచట పని యేమున్నది?

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తస్తు ప్రసన్నోఽ భూత్సుందరం రూపమద్భుతమ్ ।
స్వోపకరణసంయుక్తం దర్శయామాస వై నిజమ్ ॥
శక్రరూపం తదా దృష్ట్వా లజ్జితశ్చార్జునస్తదా ।
స ఇంద్రస్తం సమాశ్వాస్య పునరేవ వచోఽబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆతడిట్లు పలుకగా ఇంద్రుడు ప్రసన్నుడై వజ్రాద్యాయుధములతో గూడియున్న తన అద్భుత సుందరరూపమును ఆతనికి చూపించెను (49). అపుడు అర్జునుడు ఇంద్రుని రూపమును గాంచి తన వచనములకు సిగ్గుపడుచుండగా, ఇంద్రుడు ఆతనికి నచ్చజెప్పి మరల ఇట్లు పలికెను .

ఇంద్ర ఉవాచః

వరం వృణీష్వ హే తాత ధనంజయ మహామతే ।
యదిచ్ఛసి మనోఽ భీష్టం నాదేయం విద్యతే తవ ॥
త చ్ఛ్రుత్వా శక్రవచనం ప్రత్యువాచార్జునస్తదా ।
విజయం దేహి మే తాత శత్రుక్లిష్టస్య సర్వథా ॥

ఇంద్రుడిట్లు పలికెను -

ఓ వత్సా! ధనంజయా! నీవు మహాబుద్ధిశాలివి. నీ మనస్సునకు నచ్చిన అభీష్టమగు వరమును కోరుకొనుము. నీకు ఈయదగని వరము లేదు (51). అపుడు అర్జునుడు ఇంద్రుని మాటను విని 'తండ్రీ! నేను అన్ని విధములుగా శత్రువులచే క్లేశములకు గురి చేయబడి యున్నాను; నాకు విజయము నిమ్ము' అని బదులిడెను .

శక్ర ఉవాచః

బలిష్ఠాశ్శత్రవస్తే చ దుర్యోధనపురస్సరాః ।
ద్రోణో భీష్మశ్చ కర్ణశ్చ సర్వే తే దుర్జయా ధ్రువమ్ ॥
అశ్వత్థామా ద్రోణపుత్రో రౌద్రాంశో దుర్జయోఽతి సః ।
మయా సాధ్యా భవేయుస్తే సర్వథా స్వహితం శృణు ॥
ఏత ద్వీర జపః కర్తుం న శక్తః కశ్చనాధునా ।
వర్తతే హి శివో వర్య స్తస్మాచ్ఛంభోర్జపోఽధునా ॥
శంకరస్సర్వలోకేశశ్చరాచరపతి స్స్వరాట్ ।
సర్వం కర్తుం సమర్థోఽస్తి భుక్తి ముక్తి ఫలప్రదః ॥
అహమన్యే చ బ్రహ్మాద్యా విష్ణుస్సర్వవరప్రదః ।
అన్యే జిగీషవో యే చ తే సర్వే శివపూజకాః ॥
అద్య ప్రభృతి తన్మంత్రం హిత్వా భక్త్యా శివం భజ ।
పార్థివేన విధానేన ధ్యానేనైవ శివస్య చ ॥
ఉపచారైరనే కై శ్చ సర్వభావేన భారత ।
సిద్ధిస్స్యాదచలా తేఽద్య నాత్ర కార్యా విచారణా ॥

ఇంద్రుడిట్లు పలికెను –

నీకు శత్రువులగు దుర్యోధన, ద్రోణ, భీష్మ, కర్ణాదులందరు బలవంతులు, దుర్జయులు అను మాట నిశ్చయము (53). ద్రోణపుత్రుడు, రుద్రాంశసంభూతుడునగు అశ్వత్థామను జయించుట మిక్కిలి కష్టమైన పని. నేను వారిని జయించు ఉపాయమును పరిశీలించెదను. నీకు సర్వవిధములుగా హితము కలిగే మార్గమును చెప్పెదను వినుము (54). ఓ వీరా! ఇపుడు ఈ జపమును చేయగల వీరుడు లేడు. శివుడు దేవతలలో శ్రేష్ఠుడు. కావున ఇపుడు శంభుని మంత్రమును జపించుము (55), శంకరుడు సర్వలోకములకు ప్రభువు, స్థావరజంగమాత్మ కమగు జగత్తునకు నియంత, దేవతాసార్వభౌముడు, సర్వమును చేయ సమర్థుడు మరియు భుక్తి ముక్తి ఫలములను ఇచ్చువాడు (56). నేను, బ్రహ్మాది ఇతర దేవతలు, అందరికీ వరములనిచ్చే విష్ణువు మాత్రమే గాక, విజయమును కాంక్షించువారందరు శివుని పూజించెదరు (57). ఈనాటి నుండియు ఆ ఇంద్రమంత్రమును పరిత్యజించి శివుని సేవించుము. పార్థివలింగమును పూజించి శివుని ధ్యానించుము (58). ఓ భారతా! శివునకు అనేక ఉపచారములనర్పించి సర్వభావముతో పూజింపుము. నీకు నిశ్చయముగా సిద్ధి కలుగును. ఈ విషయములో సంశయమునకు తావు లేదు .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా చ చరాన్ సర్వాన్ సమాహూయా బ్రవీదిదమ్ ।
సావధానేన వై స్థేయమేతత్వం రక్షణే సదా ॥
ప్రబోధ్య స్వచరానిం ద్రోఽర్జున సంరక్షణాదికమ్ ।
వాత్సల్యపూర్ణహృదయః పునరూచే కపిధ్వజమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఇట్లు పలికి ఇంద్రుడు తన అనుచరులనందరినీ సమావేశపరిచి "మీరు నిత్యము సావధానులై ఉండి ఈతనిని రక్షించుడు' అని ఆదేశించెను (60). ప్రేమతో నిండిన హృదయము గల ఇంద్రుడు ఈ విధముగా తన అనుచరులకు అర్జునుని సంరక్షించుట ఇత్యాది కార్యములనప్పగించి మరల అర్జునునితో నిట్లనెను .

ఇంద్ర ఉవాచః

రాజ్యం త్వయా ప్రమాదాద్వై న కర్తవ్యం కదాచన ।
శ్రేయసీ భద్ర విద్యేయం భవేత్తవ పరంతప ॥
ధైర్యం ధార్యం సాధకేన సర్వథా రక్షకశ్శివః ।
సంపత్తీశ్చ ఫలం తుల్యం దాస్యతే నాత్ర సంశయః ॥

ఇంద్రుడిట్లు పలికెను -

నీవు పొరబడి ఎన్నడైననూ రాజ్యమును చేయవలదు. వత్సా! శత్రువులను తపింప జేయువాడా! ఈ విద్య నీకు శ్రేయస్సును కలిగించును (62). సాధకుడు ధైర్యమును కలిగియుండవలెను. శివుడు అన్ని విధములుగా రక్షించి, సంపత్తులను కర్మానురూపమగు ఫలమును ఇచ్చుననుటలో సంశయము లేదు .

నందీశ్వర ఉవాచః

ఇతి దత్త్వా వరం తస్య భారతస్య సురేశ్వరః ।
స్మరన్ శివపదాంభోజం జగామ భవనం స్వకమ్ ॥
అర్జునోఽపి మహావీరస్సు ప్రణమ్య సురేశ్వరమ్ ।
తపస్తేపే సంయతాత్మా శివముద్దిశ్య తద్విధమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం అర్జున తపోవర్ణనం నామ అష్ట త్రింశోఽధ్యాయః.

నందీశ్వరుడిట్లు పలికెను -

ఇంద్రుడు ఈ తీరున ఆ అర్జునునకు వరములనిచ్చి శివుని పాదపద్మమును స్మరిస్తూ తన భవనమునకు వెళ్లెను (64). మహావీరుడగు అర్జునుడు దేవేంద్రునకు ప్రణమిల్లి ఆయన చెప్పిన విధముగా మనస్సును నియమించి శివుని ఉద్దేశించి తపస్సును చేసెను (65).

39 - మూకాసురవధ

నందీశ్వర ఉవాచః

స్నానం స విధి వత్ కృత్వా న్యాసాది విధివత్తథా ।
ధ్యానం శివస్య సద్భక్త్యా వ్యాసోక్తం యత్తథాఽకరోత్ ॥
ఏకపాద తలేనైవ తిష్ఠన్మునివరో యథా ।
సూర్యే దృష్టిం ని బద్ధ్యైకాం మంత్రమావర్తయన్ స్థితః ॥
తపస్తేపేఽతి సంప్రీత్యా సంస్మరన్మ నసా శివమ్ ।
పంచాక్షరం మనుం శంభోర్జపన్ సర్వోత్తమోత్తమమ్ ॥
తపసస్తేజ ఏవాసీద్యథా దేవా వి సిస్మియుః ।
పునశ్చైవ శివం యాతాః ప్రత్యూచుస్తే సమాహితాః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆతడు యథావిధిగా స్నానమాచరించి, న్యాసాదులననుష్ఠించి, వ్యాసుడు ఉపదేశించిన తీరున మంచి భక్తితో శివుని ధ్యానించెను (1). ఆతడు మహర్షి వలె ఒంటి కాలిపై నిలబడి సూర్యునియందు దృష్టిని ఏకాగ్రము చేసి మంత్రమును జపించెను (2). ఆతడు మనస్సులో శివుని స్మరిస్తూ సర్వ శ్రేష్ఠమగు పంచాక్షరీ మంత్రమును జపిస్తూ శివుని పై మహాప్రీతితో తపస్సును చేసెను (3).. ఆతడు తపస్సును చేయుచుండగా బయల్వెడలిన తేజస్సును గాంచి ఆ దేవతలు చకితులై మరల శివుని వద్దకు వెళ్ళి సమాహిత మనస్కులై ఇట్లు పలికిరి .

దేవా ఊచుః ।

నరేణైకేన సర్వేశ త్వదర్థే తప ఆహితమ్ ।
యదిచ్ఛతి నరస్సోఽయం కిం న యచ్ఛతి తత్ప్రభో ॥

దేవతలిట్లు పలికిరి -

ఓ సర్వేశ్వరా! ఒక నరుడు నీ కొరకై తపస్సును చేయుచున్నాడు. ప్రభో! ఆతని కోర్కెను నీవు ఏల తీర్చరాదు?

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా తు స్తుతిం చక్రుర్వివిధాం తే తదా సురాః।
తత్పాదయోర్దృశః కృత్వా తత్ర తస్థుస్థిరాధియః ॥
శివస్తు తద్వచశ్శ్రుత్వా మహా ప్రభురుదారధీః।
సువిహస్య ప్రసన్నాత్మా సురాన్ వచనమబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

అపుడు దేవతలిట్లు పలికి అనేకస్తుతులను చేసి శివుని పాదములపై చూపు:ను నిలిపి ఏకాగ్రమగు మనస్సు గలవారై అచట నిలబడి యుండిరి (6) ఉదారబుద్ధి గలవాడగు శివమహాప్రభుడు వారి మాటలను విని ప్రసన్నమగు అంతఃకరణము గలవాడై నవ్వి దేవతలతో నిట్లు పలికెను .

శివ ఉవాచః

స్వస్థానం గచ్ఛత సురాస్సర్వే సత్యం న సంశయః।
సర్వథాఽహం కరిష్యామి కార్యం వో నాత్ర సంశయః ॥

శివుడిట్లు పలికెను –

దేవతలారా! మీరందరు మీ స్థానములకు వెళ్లుడు. ఇది నిశ్చితము. సందేహము వలదు. మీ కార్యమును నేను అన్ని విధములుగా పూర్తి చేయగలను. సంశయము వలదు

నందీశ్వర ఉవాచః

తచ్ఛ్రుత్వా శంభువచనం నిశ్చయం పరమం గతాః।
పరావృత్య గతాస్సర్వే స్వస్థానం తే హి నిర్జరాః ॥
ఏతస్మిన్నంతరే దైత్యో మూకనామాగతస్తదా।
సౌకరం రూపమాస్థాయ ప్రేషితశ్చ దురాత్మనా ॥
దుర్యోధనేన విప్రేంద్ర మాయినా చార్జునం తదా।
యత్రార్జున స్థితశ్చాసీత్తేన మార్గేణ వై తదా ॥
శృంగాణి పర్వతస్యైవ ఛిందన్ వృక్షాననేకశః।
శబ్దం చ వివిధం కుర్వన్ అతివేగేన సంయుతః ॥
అర్జునోఽపి చ తం దృష్ట్వా మూకనామాసురం తదా।
స్మృత్వా శివపదాంభోజం విచారే తత్పరోఽభవత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

శంభుని ఆ వచనములను విని ఆ దేవతలు అందరు దృఢమగు విశ్వాసమును పొందిన వారై వెనుదిరిగి తమ స్థానములకు వెళ్లిరి (9). ఇంతలో అచటకు మూకుడనే రాక్షసుడు సూకరరూపమును దాల్చి వచ్చెను. ఓ బ్రాహ్మణ శ్రేష్ఠా! దుర్బుద్ధి, మాయావి యగు దుర్యోధనుడు వానిని అచటకు పంపియుండెను.

ఆ రాక్షసుడు ఆ మార్గమునననుసరించి అర్జునుడు ఉన్న స్థలమునకు వచ్చి అర్జునునిపై దండెత్తుటకు సిద్ధమాయెను (10, 11). ఆతడు పర్వతశిఖరములను కూలగొట్టుచూ వృక్షములను ముక్కలు చేయుచూ మహావేగముతో కూడినవాడై వివిధ శబ్దములను చేయుచుండెను (12). అర్జునుడు ఆ మూకాసురుని గాంచి, శివుని పాదపద్మములను స్మరించి గాఢముగా ఆలోచించ మొదలిడెను .

అర్జున ఉవాచః

కోఽయం వా కుత ఆయాతి క్రూరకర్మా చ దృశ్యతే ।
మమానిష్టం ధ్రువం కర్తుం సమాగచ్ఛత్య సంశయమ్ ॥
మమ్మైవం మన ఆయాతి శత్రురేవ న సంశయః ।
మయా వినిహతాః పూర్వమనేకే దైత్య దానవాః ॥
తదీయః కశ్చిదాయాతి వైరం సాధయితుం పునః ।
అథవా చ సఖా కశ్చిద్దుర్యోధనహితావహః ॥
యస్మిన్ దృష్టే ప్రసీదేత్తం మనస్సు హితకృద్ధ్రువమ్ ।
యస్మిన్ దృష్టే తదేవ స్యాదాకులం శత్రురేవ సః ॥
ఆచారః కులమాఖ్యాతి వపురా ఖ్యాతి భోజనమ్ ।
వచనం శ్రుతమా ఖ్యాతి స్నేహమాఖ్యాతి లోచనమ్ ॥
ఆకారేణ తథా గత్యా చేష్టయా భాషితైరపి ।
నేత్రవక్త్ర వికారాభ్యాం జ్ఞాయతేంతర్గ్సితం మనః ॥
ఉజ్జ్వలం సరసం చైవ వక్ర మారక్తకం తథా ।
నేత్రం చతుర్విధం ప్రోక్తం తస్య భావం పృథగ్ బుధాః ॥

అర్జునుడిట్లు పలికెను -

ఇది ఎవరు? ఎచట నుండి వచ్చుచున్నది? క్రూరమగు కర్మ కలదివలె కన్పట్టు చున్నది. ఇది నాకు హాని చేయుటకు వచ్చుచున్నదనుట నిశ్చయము; సందేహము లేదు (14). ఇది నాకు శత్రువు అనియే నాకు మనస్సులో తోచుచున్నది. సందేహము లేదు. నేను పూర్వము నందు అనేకులగు దైత్యులను, దానవులను, సంహరించి యుంటిని (15). వారి బంధువులలో ఒకరు మరల పగ తీర్చుకొనుటకు వచ్చియుండును. లేదా, దుర్యోధనుని మిత్రుడు ఆతనికి హితమును చేయగోరి వచ్చియుండును (16). ఎవనిని చూసినచో మనస్సు ప్రసన్నమగునో, ఆతడు హితమును చేయును. ఇది నిశ్చయము. ఎవనిని చూడగనే మనస్సు వ్యాకుల పడునో వాడు శత్రువే అగును (17). ఆచారము కులమును, శరీరము భోజనమును, వచనము జ్ఞానమును, చూపు స్నేహమును స్పష్టము జేయును (18). ఆకారము, నడక, చేష్ట మాటలు, చూపులు, ముఖకవళికలు అనువాటిని బట్టి మనస్సులో దాగియున్న భావమును పసిగట్టవచ్చును (19). ఉజ్జ్వలమైనది, సరసమైనది, వంకర, మిక్కిలి ఎర్రనిది అని కన్ను నాలుగుతెరంగులనున్నది. వీటి భావములు కూడ వేర్వేరుగా నున్నవని పండితులు చెప్పుచున్నారు .

ఉజ్జ్వలం మిత్రసంయోగే సరసం పుత్ర దర్శనే ।
వక్రం చ కామినీ యోగే ఆరక్తం శత్రుదర్శనే ॥
అస్మిన్మమ తు సర్వాణి కలుషిణీంద్రియాణి చ ।
అయం శత్రుర్భవేదేవ మరణీయో న సంశయః ॥
గురోశ్చ వచనం మేఽద్య వర్తతే దుఃఖదస్త్వయా ।
హంతవ్యస్సర్వథా రాజన్నాత్ర కార్యా విచారణా ॥
ఏతదర్థం త్వాయుధాని మమ చైవ న సంశయః ।
విచార్యేతి చ తత్రైవ బాణం సంస్థాయ సంస్థితః ॥
ఏతస్మిన్నంతరే తత్ర రక్షార్థం హ్యర్జునస్య వై ।
తద్భక్తేశ్చ పరీక్షార్థం శంకరో భక్తవత్సలః ॥
విదర్థ భిల్లరూపం హి గణైస్సార్థం మహాద్భుతమ్ ।
తస్య దైత్యస్య నాశార్థం ద్రుతం కృత్వా సమాగతః ॥
బద్ధ కచ్ఛశ్చ బస్త్రీ భిర్బద్ధేశానధ్వజస్తదా ।
శరీరే శ్వేతరేఖాశ్చ ధనుర్బాణయుతస్స్వయమ్ ॥

మిత్రునితోడి కలయికలో కన్ను ఉజ్జ్వలముగను, పుత్రుని చూచినపుడు ప్రేమ పూర్ణము (సరస) గను, ప్రియురాలితో గూడియున్నప్పుడు వక్రముగను, శత్రువును చూచినపుడు మిక్కిలి ఎర్రగను ఉండును (21). వీనిని చూచినంతనే నా ఇంద్రియములన్నియు కలుషితములైనవి. కావున వీడు నిశ్చయముగా శత్రువు అగును. వీనిని నిస్సంశయముగా సంహరించవలెను (22). ఈ విషయములో నాకు గురువు యొక్క అనుమతి గలదు. ఓ రాజా! నీకు దుఃఖమును కలిగించు వానిని నిస్సంశయముగా సర్వవిధోపాయములతో సంహరించుము' అనీ నాకు గురువు చెప్పియున్నాడు (23), అందుకొరకు మాత్రమే నేను ఆయుధములను ధరించి యున్నాను. అర్జునుడిట్లు తలపోసి బాణమునెక్కు పెట్టి అచటనే నిలబడి యుండెను (24). ఇంతలో భక్తవత్సలుడగు శంకరుడు అర్జునుని రక్షించుట కొరకు, ఆతని భక్తిని పరీక్షించుటకు అచటికి విచ్చేసెను (25). ఆయన అత్యద్భుతము, సర్వసమర్థము అగు భిల్ల రూపమును దాల్చి గణములతో గూడి ఆ రాక్షసుని సంహరించుట కొరకై అచటకు శీఘ్రముగా విచ్చేసెను (26). ఆతడు పంచను గట్టిగా బిగించి కట్టెను. వస్త్ర శకలములతో ఈశాన ధ్వజమును బంధించెను. ఆయన శరీరమునందు తెల్లని రేఖలు ఉండెను. ఆయన స్వయముగా ధనుర్బాణములను ధరించి యుండెను .

బాణానాం తూణకం పృష్ఠే ధృత్వా వై స జగామ హ ।
గణశ్చైవ తథా జాతో భిల్లరాజోఽభవచ్ఛివః ॥
శబ్దాంశ్చ వివిధాన్ కృత్వా నిర్యయౌ వాహినీపతిః ।
శూకరస్య సనస్సారాథ శబ్దశ్చ ప్రదిశో దశ ॥
వనేచరేణ శబ్దేన వ్యాకులశ్చార్జునస్తదా ।
పర్వతా ద్యా శ్చ తైశ్శబ్దైస్తే సర్వే వ్యాకులాస్తదా ॥
అహో కిం ను భవేదేష శివశ్శుభకరస్త్విహా ।
మయా చైవ శ్రుతం పూర్వం కృష్ణేన కథితం పునః ॥
వ్యాసేన కథితం చైవం స్మృత్వా దేవైస్తథా పునః ।
శివశ్శుభకరః ప్రోక్తశ్శివస్సుఖకరస్తథా ॥
ముక్తిదశ్చ స్వయం ప్రోక్తో ముక్తిదానాన్న సంశయః ।
తన్నామస్మరణాత్పుంసాం కల్యాణం జాయతే ధ్రువమ్ ॥
భజతాం సర్వభావేన దుఃఖం స్వప్నేఽపి నో భవేత్ ।
యదా కదాచిజ్జాయేత తదా కర్మసముద్భవమ్ ॥

ఆయన బాణముల తూణీరమును వెనుక దాల్చి ముందుకు సాగెను. శివుడీ తీరున భిల్లరాజై నడువగా గణములు కూడ అటులనే సంసిద్ధమయ్యేను (28). సేనాధ్యక్షుడగు శివుడు వివిధశబ్దములను చేయుచూ బయల్వెడలెను. ఇంతలో సూకరము యొక్క శబ్దము పదిదిక్కులలో వ్యాపించెను (29). ఆ సూకరము యొక్క ధ్వనిని విని అర్జునుడు కలవరపడెను. పర్వతములు ప్రతిధ్వనించేను. ఇతర ప్రాణులన్నియు కలవరపడెను (30). ఏమి ఈ ఆశ్చర్యము! ఇది ఏమై ఉండును. ఇచట శివుడు శుభమును చేయునని పూర్వము నేను కృష్ణుడు చెప్పగా విని యుంటిని (31). వ్యాసుడు స్మరణకు దెచ్చుకొని అటులనే చెప్పియుండెను. శివుడు శుభమును, సుఖమును కలిగించునని దేవతలు కూడ మరల చెప్పియుండిరి (32). ఆయన స్వయముగా ముక్తిని ఇచ్చుట వలన ఆయన ముక్తిదుడైనాడు. సందేహము లేదు. ఆయన యొక్క నామమును స్మరించు మానవులు కల్యాణమును పొందెదరనుట నిశ్చయము (33). ఆయనను సర్వాత్మభావముతో భజించువారికి స్వప్నములోనైననూ దుఃఖము కలుగదు. లేనిచో ఎప్పుడైననూ దుఃఖము సంప్రాప్తమైనచో, అది కర్మజనితమని తెలియవలెను

భావి తద్భవ్యాపి జ్ఞేయం నూనమల్పం న సంశయః ।
ప్రారబ్ధస్యాథవా దోషో నూనం జ్ఞేయో విశేషతః ॥
అథవా బహు చాల్పం హి భోగ్యం నిర్ధీర్య శంకరః ।
కదాచిదిచ్ఛయా తస్య దూరీకుర్యాన్న సంశయః ॥
విషం చైవామృతం కుర్యాదమృతం విషమేవ వా ।
యదిచ్ఛతి కరోత్యేవ సమర్థః కిం నిషిధ్యతే ॥
ఇత్థం విచారమాణోఽపి భక్తీరన్యైః పురాతనైః ।
భావిభిశ్చ సదా భక్తైరిహానీయ మనస్థిరమ్ ॥
లక్ష్మీర్గచ్ఛేచ్చావతిష్ఠేన్మరణం నికటే పురః ।
నిందాం వాథ ప్రకుర్వంతు స్తుతిం వా దుఃఖసంక్షయమ్ ॥
జాయతే పుణ్యపాపాభ్యాం శంకరస్సుఖదస్సదా ।
కదాచిచ్చ పరీక్షార్థం దుఃఖం యచ్ఛతి వై శివః ॥
అంతే చ సుఖదః ప్రోక్తో దయాలుత్వాన్న సంశయః ।
యథా చైవ సువర్ణం చ శోధితం శుద్ధతాం వ్రజేత్ ॥

అట్టి కర్మఫల రూపమగు దుఃఖము అధికముగా నుండదగిన స్థితిలో అల్పముగ నుండుననుటలో సందేహము లేదు. లేదా, అది నిశ్చయముగా ప్రారబ్ధము యొక్క దోషమనీ ఎరుంగవలెను (35). లేదా శంకరుడు అధికముగా గాని అల్పముగా గాని దుఃఖమును అనుభవింపజేసి, అప్పుడప్పుడు తన ఇచ్ఛచే ఆ దుఃఖమును పురుషునకు దూరము చేయుననుటలో సందేహము లేదు (36). శివుడు విషమును అమృతముగను, అమృతమును విషముగను ఎట్లు తోచినచో అట్లు చేయగలడు. సమర్థుడగు శివుని ఎవరు నిషేధించగలరు? (37) పూర్వజులగు భక్తులు ఎందరో ఈ తీరున విచారణను చేసియున్నారు. భవిష్యత్కాలములో కూడా భక్తులు మనస్సును ఈ జ్ఞానమునందు సుస్థిరము చేయవలెను (38). లక్ష్మి ఉండవచ్చును; పోవచ్చును; మరణము ఎదుట నిలబడి యుండవచ్చును; జనులు నిందించ వచ్చును; స్తుతించవచ్చును; కాని భక్తిని చేసినచో దుఃఖము నశించితీరును (39). మానవుడు పుణ్యపాపములచే సుఖదుఃఖములను పొందును. శంకరుడు సర్వదా సుఖమునే ఇచ్చును. కాని శివుడు అప్పుడప్పుడు పరీక్షను చేయుటకొరకై దుఃఖమునిచ్చును (40). ఆయన దయామయుడు గనుక అంతములో సుఖము నిచ్చుననుటలో సందేహము లేదు. బంగారమును పుటము పెట్టి కాల్చినచో మరింత శుద్ధిని పొందును గదా!

ఏవం చైవ మయా పూర్వం శ్రుతం మునిముఖాత్తథా ।
అతస్తద్భజనేనైవ ల ప్స్యేఽహం సుఖముత్తమమ్ ॥
ఇత్యేవం తు విచారం స కరోతి యావదేవ హి ।
తావచ్చ సూకరః ప్రాప్తో బాణసంమోచనావధి ॥
శివోఽపి పృష్ఠతో లగ్నో హ్యాయాతస్సూకరస్య హి ।
తయోర్మధ్యే తదా సోఽయం దృశ్యతే శృంగమద్భుతమ్ ॥
తస్య ప్రోక్తం చ మాహాత్మ్యం శివశ్శీఘ్రతరం గతః ।
అర్జునస్య చ రక్షార్థం శంకరో భక్తవత్సలః ॥
ఏతస్మిన్ సమయే తాభ్యాం కృతం బాణవిమోచనమ్ ।
శివబాణస్తు పుచ్ఛే వై హ్యర్జునస్య ముఖే తథా ॥
శివస్య పుచ్ఛతో గత్వా ముఖాన్నిస్సృత్య శీఘ్రతః ।
భూమౌ విలీన సంయాతస్తస్య వై పుచ్ఛతో గతః ॥
పపాత పార్శ్వతశ్చైవ బాణశ్చై వార్జునస్య చ ।
సూకరస్తత్‌క్షణం దైత్యో మృతో భూమౌ పపాత హ ॥
దేవా హర్షం పరం ప్రాపుః పుష్పవృష్టిం చ చక్రిరే ।
జయపూర్వం స్తుతికరాః ప్రణమ్య చ పునః పునః ॥

నేను పూర్వము మహర్షుల ముఖమునుండి ఇట్టి వచనములనే విని యుంటిని. కావున నేను శివుని మాత్రమే భజించి ఉత్తమ సుఖమును పొందెదను (42). ఈ విధముగా ఆతడు ఆలోచించుచుండగనే ఆ సూకరము బాణము వేయదగిన పరిధిలోనికి వచ్చెను. దాని వెనుకనే దానినే చూస్తూ శివుడు కూడా వచ్చెను. వారిద్దరి మధ్యలో ఆ సూకరము అద్భుతమగు పర్వతశిఖరమువలె కానవచ్చెను (43, 44). దాని గొప్ప దనము ఇంతకు ముందు వర్ణించ బడియుండెను. మంగళకరుడు, భక్తవత్సలుడు అగు శివుడు అర్జునుని రక్షణకొరకు మరింత వేగముగా ముందుకు సాగెను (45). అదే సమయములో వారిద్దరు బాణములను విడిచి పెట్టిరి. అర్జునుడు ముఖమును, శివుడు తోకను లక్ష్యముగా చేసి బాణములను ప్రయోగించిరి (46). శివుని బాణము వేగముగా పుచ్ఛమునుండి దూసుకు పోయి ముఖమునుండి బయటకు వచ్చి భూమిలో కలిసి పోయెను. అర్జునుని బాణము పుచ్ఛము వైపు నుండి బయటకు వచ్చి ప్రక్కనే పడెను. సూకర రూపములోనున్న ఆ రాక్షసుడు వెంటనే మరణించి నేల గూలెను. (47,48). దేవతలు పరమానందమును పొంది పుష్పవృష్టిని గురిపించిరి. వారు అనేక పర్యాయములు ప్రణమిల్లి జయధ్వానములను, స్తోత్రములను చేసిరి .

శివస్తుష్టమనా ఆసీదర్జునస్సుఖమాగతః ।
దైత్యస్య చ తదా దృష్ట్వా క్రూరం రూపం చ తౌ తదా ॥
అర్జునస్తు విశేషేణ సుఖినా ప్రాహ చేతసా ।
అహో దైత్యవరశ్చాయం రూపం తు పరమాద్భుతమ్ ॥
కృత్వాఽగతో మద్వధార్థం శివేనాహం సురక్షితః ।
ఈశ్వరేణ మమాద్యైవ బుద్ధిర్దత్తా న సంశయః ॥
విచార్యేత్యర్జునస్తత్ర జగౌ శివ శివేతి చ।
ప్రణనామ శివం భూయస్తుష్టావ చ పునః పునః ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం మూకాసుర వధో నామ ఏకోన చత్వారింశోఽధ్యాయః.

అపుడా రాక్షసుని క్రూరరూపమును గాంచి శివుడు సంతసిల్లిన మనస్సు కలవాడాయెను. అర్జునుడు సుఖమును పొందెను (50). అత్యంత సుఖముతో నిండిన మనస్సు గలవాడై అర్జునుడు ఇట్లు పలికెను. ఆశ్చర్యము! ఈ రాక్షసశ్రేష్ఠుని రూపము పరమాద్భుతముగనున్నది. (51). ఈతడు నన్ను వధింప నిశ్చయించుకొని వచ్చినాడు. శివుడు నన్ను రక్షించినాడు. వీడు శత్రువు అని నా బుద్ధికి తోపింప జేసినవాడు ఈశ్వరుడే ననుటలో సందేహము లేదు (52). అర్జునుడిట్లు తలపోసి శివుని నామమును స్మరించి శివునకు అనేక పర్యాయములు ప్రణమిల్లి మరల మరల స్తుతించేను (53).

శ్రీ శివ మహాపురాణములోని శతరుద్ర సంహితయందు మూకాసుర వధయను ముప్పది తొమ్మిదవ అధ్యాయము ముగిసినది.

40 – అర్జున కిరాత సంవాదము

నందీశ్వర ఉవాచః

సనత్కుమార సర్వజ్ఞ లీలాం శృణు పరాత్మనః ।
భక్త వాత్సల్యసంయుక్తాం తద్దృఢత్వ విదర్భితామ్ ॥
శివోఽప్యథ స్వభృత్యం వై ప్రేషయామాస స ద్రుతమ్ ।
బాణార్థే చ తదా తత్రార్జునోఽపి సమగాత్తతః ॥
ఏకస్మిన్ సమయే ప్రాప్తౌ బాణార్థం తద్గణార్జునౌ ।
అర్జునస్తం పరాభర్త్స్య స్వబాణం చాగ్రహీత్తదా ॥
గణః ప్రోవాచ తం తత్ర కిమర్థం గృహ్యతే శరః ।
బాణ శ్చైవాస్మదీయో వై ముచ్యతాం ఋషిసత్తమ ॥
ఇత్యుక్తస్తేన భిల్లస్య గణేన మునిసత్తమః ।
సోఽర్జునశ్శంకరం స్మృత్వా వచనం చ తమబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఓ సనత్కుమారా! నీవు సర్వజ్ఞుడవు. పరమాత్మయొక్క లీలను వినుము. ఈ లీలలో భక్తులు యందు శివునకు గల దృఢమగు ప్రేమ నిండియున్నది (1), అపుడా శివుడు బాణము కొరకై తన అనుచరుని వెంటనే పంపెను. అపుడచటకు అర్జునుడు కూడా చేరెను (2), బాణము కొరకై శివానుచరుడు మరియు అర్జునుడు అచటకు ఏకకాలములో చేరిరి. అర్జునుడాతనిని గద్దించి అపుడు తన బాణమును స్వీకరించెను (3). అపుడా శివకింకరుడిట్లు పలికెను: ఓ మహర్షీ! ఈ బాణము మాది. నీవు దానినీ ఏల తీసుకొనుచున్నావు? దానిని విడిచిపెట్టుము (4). ఆ భిల్ల ప్రభుని అనుచరుడు ఇట్లు పలుకగా, మహర్షియగు అర్జునుడు శంకరుని స్మరించి ఆతనితో నిట్లు పలికెను.

అర్జున ఉవాచః

అజ్ఞాత్వా కిం చ వదసి మూర్ఖోఽసి త్వం వనేచర ।
బాణశ్చ మోచితో మేఽద్య త్వదీయశ్చ కథం పునః ॥
రేఖారూపం చ పిచ్ఛాని మన్నామాంకిత ఏవ చ ।
త్వదీయశ్చ కథం జాతస్స్వభావో దుస్త్యజస్తవ ॥

అర్జునుడిట్లు పలికెను –

ఓ వనచరా! నీవు తెలియకుండగా ఏదియో మాటలాడు చున్నావు. నీవు మూర్ఖుడవు. నేను ఇప్పుడే బాణమును ప్రయోగించి యుంటిని. ఆ బాణము నీది ఎట్లు అగును? (6) దీని రేఖారూపము మరియు పిచ్ఛములపై నా పేరు వ్రాసియున్నది. ఇది నీది ఎట్లు అగును? నీవు నీ స్వభావమును విడనాడలేకపోతివి

నందీశ్వర ఉవాచః

ఇత్యేవం తద్వచశ్శ్రుత్వా విహస్య స గణేశ్వరః ।
అర్జునం ఋషిరూపం తం ఖిల్లో వాక్యము పాదదే ॥
తాపస శ్రూయతాం యే త్వం న తపః క్రియతే త్వయా ।
వేషతశ్చ తపస్వీ త్వం న యథార్థం ఛలాయతే ॥
తపస్వీ చ కథం మిథ్యా భాషతే కురుతే నరః ।
నైకాకినం చ మాం త్వం చ జానీహి వాహినీ పతిమ్ ॥
బహుభిర్వనభిల్లైశ్చ యుక్తస్స్వామీ స ఆసతే ।
సమర్థస్సర్వథా కర్తుం నిగ్రహానుగ్రహౌ పునః ॥
వర్తతే తస్య బాణోయం యో నీతశ్చ త్వయాఽధునా ।
అయం బాణశ్చ తే పార్శ్వే న స్థాస్యతి కదాచన ॥
తపఃఫలం కథం త్వం చ హాతుమిచ్ఛసి తాపస ।
చౌర్యాచ్ఛలార్థ్యమానాచ్చ విస్మయాత్సత్య భంజనాత్ ॥
తపసా క్షీయతే సత్యమేతత దేవ మయా శ్రుతమ్ ।
తస్మాచ్చ తపసస్తేద్య భవిష్యతి ఫలం కుతః ॥
తస్మాచ్చ ముచ్యతే బాణాత్ కృతఘ్నస్త్వం భవిష్యసి ।
మమైవ స్వామినో బాణస్తవార్థే మోచితో ధ్రువమ్ ॥
శత్రుశ్చ మారితస్తేన పునర్ప్రాణశ్చ రక్షితః ।
అత్యంతం చ కృతఘ్నోఽసి తపోశుభకరస్తథా ॥
సత్యం న భాషగే త్వం చ కిమతస్సిద్ధిమిచ్ఛసి ।
ప్రయోజనం చేద్బాణేన స్వామీ చ యాచ్యతాం మమ ॥
ఈ దృశాంశ్చ బహూన్ బాణాంస్తదా దాతుం క్షమస్స్వయమ్ ।
రాజా చ వర్తతే మేఽద్య కిం త్వేవం యాచ్యతే త్వయా ॥
ఉపకారం పరిత్యజ్య హ్యపకారం సమీహసే ।
నైతద్యుక్తం త్వయాద్యైవ క్రియతే త్యజ చాపలమ్ ॥
ఇత్యేవం వచనం తస్య శ్రుత్వా పార్థోఽర్జునస్తదా ।
క్రోధం కృత్వా శివం స్మృత్వా మితం వాక్యమథాబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

గణాధ్యక్షుడగు ఆ భిల్లుడు ఋషిరూపములోనున్న అర్జునుని ఆ మాటలను విని ఆతనితో నిట్లనెను (8). ఓరీ తాపసా! వినుము. నీవు తపస్సును చేయుట లేదు. నీవు తాపసవేషమును దాల్చియున్నావు. ఇది వాస్తవము కాదు. నీవు మోసగాడివి (9). తపశ్శాలియగు వ్యక్తి అసత్యమునేల పలుకును? నేను ఒంటరినని తలంచుకుము. నేను సైన్యాధ్యక్షుడనని యెరుంగుము (10). మా ప్రభువు అనేకమంది వనవాసులగు భిల్లులతో గూడి యున్నాడు. ఆయన దండించుటకు గాని, అనుగ్రహించుటకు గాని అన్ని విధములుగా సమర్థుడు (11). ఇపుడు నీవు ఇచటనుండి తీసిన బాణము ఆయనది. ఆ బాణము నీవద్ద చాలసేపు ఉండబోదు (12). ఓ తాపసా! నీవు తపః ఫలమును వ్యర్థము చేసుకొనుటకు ఏల యత్నించుచున్నావు? ఇతరుల సొత్తును అపహరించుట, మోసముచే ఇతరులను పీడించుట, గర్వించియుండుట మరియు సత్యమును విడనాడుట (13) అను వాటిచే తపస్సు క్షీణమగుననీ నేను వినియున్నాను. ఇది యథార్థము. కావున ఇపుడు నీ తపస్సునకు ఏమి ఫలము లభించును? (14) నీవు ఆ బాణమును తీసుకున్నచో తపఃఫలమునుండి వంచితుడవై కృతఘ్నుడవు కాగలవు. ఆ బాణము నా స్వామిది మాత్రమే యగును. ఆయన నిన్ను రక్షించుట కొరకే దానిని ప్రయోగించినాడు. ఇది నిశ్చయము (15). ఆయన ఈ బాణముతో శత్రువును సంహరించుట మాత్రమే గాక, బాణము కూడ భద్రముగనుండు నట్లు చేసినాడు. నీవు మిక్కిలి కృతఘ్నుడవు. మరియు నీవు తపస్సును చేయుచూ అశుభము నాచరించుచున్నావు (16). నీవు సత్యమును పలుకుట లేదు. ఈ తపస్సు వలన నీవు ఎట్టి సిద్ధిని కోరుచున్నావు? నీకీ బాణముతో పనీ యున్నచో, మా ప్రభువును యాచించుము (17). ఆయన ఇట్టి అనేక బాణములను నీకు స్వయముగా ఈయ సమర్థుడు. మా ప్రభువు ఇపుడు ఇచటనే యున్నాడు. నీవు ఇట్లు నన్ను యాచించుటకు కారణమేమి? (18) నీవు ఉపకారమును విడనాడి అపకారమును చేయ గోరుచున్నావు. నీవీన్లోడు చేయ బూనిన పని యోగ్యమైనది కాదు. ఈ చాపల్యమును విడనాడుము (19). ఆతని ఈ మాటలను విని అపుడు కుంతీపుత్రుడగు అర్జునుడు కోపించి శివుని స్మరించి, తరువాత మితముగా నిట్లు పలికెను.

అర్జున ఉవాచః

శృణు భిల్ల ప్రవక్ష్యామి న సత్యం తవ భాషణమ్ ।
యథా జాతిస్తథా త్వాం చ జానామి హి వనేచర ॥
అహం రాజా భవాన్ చౌరః కథం యుద్ధప్రయుక్తతా ।
యుద్ధం మే సబలైః కార్యం నాధమైర్హి కదాచన ॥
తస్మాత్తే చ తథా స్వామీ భవిష్యతి భవ్యశః ।
దాతారశ్చ వయం ప్రోక్తాశ్చౌరా యూయం వనేచరాః ॥
కథం యాచ్యో మయా భిల్లరాజ ఏవం చ సాంప్రతమ్ ।
త్వమేవ యాచసే నైవ బాణం మాం కిం వనేచర ॥
దదామి తే తథా బాణాన్ సంతి మే బహవో ధ్రువమ్ ।
రాజా చ గ్రహణం చైవ న దాస్యతి తథా భవేత్ ॥
కిం పునశ్చ తథా బాణాన్ ప్రయచ్ఛామి వనేచర ।
యది మే యా చికీర్షా స్యాత్కథం నాగమ్యతేఽధునా ॥
యయాగచ్ఛతు తే భర్త కిమర్థం భాషతేఽధునా ।
ఆగత్య చ మయా సార్ధం జిత్వా యుద్ధే చ మాం పునః ॥
నీత్వా బాణమిమం భిల్ల స్వామీ తే వాహినీ పతిః ।
నిజాలయం సుఖం యాతు విలంబః క్రియతే కథమ్ ॥

అర్జునుడిట్లు పలికెను –

ఓ భిల్లా! చెప్పెదను వినుము. నీ వచనములు సత్యదూరములు. ఓ వనచరా! నీవు నీ జాతికి తగినట్లు ప్రవర్తించుచున్నావు. నీ స్వభావమును నేను ఎరింగితిని (21). నేను రాజును. నీవు చోరుడవు. నేను నీతో యుద్ధమును చేయుట ఎట్లు ఘటిల్లును? నేను బలవంతులతో మాత్రమే యుద్ధమును చేసెదను. అధములతో ఎన్నడైననూ చేయను (22). నీ ప్రభువు కూడ నీవంటి వాడే అగును కాబోలు! మేము దాతలమని చెప్పబడినది. వనచరులగు మీరు చోరులు (23). ఇపుడు నేను భిల్లరాజును ఏమని యాచించ వలెను? ఓ వనే చరా! నీవే నన్ను బాణము కొరకు యాచించుట లేదా? (24) మరియు నేను నీకు బాణముల నిచ్చెదను. నా వద్ద నిశ్చయముగా చాల బాణములు గలవు. రాజు వస్తువులను ఇచ్చునే గాని ఎన్నడునూ తీసుకొనడు (25). ఓ వనచరా! ఈ ఒక్క బాణమేల? ఇంకనూ అనేక బాణముల నిచ్చెదను. కానీ నీ . ప్రభువు ఇచటకు రావలయును. నీవు ఇంకనూ ఇచటనే ఉన్నావేల? వెళ్లుము. నాతో యుద్ధమును చేయు కోరిక నీ ప్రభువునకు ఉండునా? నీవు ఇచట బహువచనములనేల పలుకుచున్నావు? నీ ప్రభువు ఇచటకు వచ్చి యుద్ధములో నన్ను జయించవలెను (26,27). ఆ పైన సైన్యాధ్యక్షుడగు నీ. భిల్ల ప్రభువు ఈ బాణమును స్వీకరించి సుఖముగా తన ఇంటికి వెళ్లదగును. నీవింకనూ 'విలంబము చేయుచున్నావేమి?

నందీశ్వర ఉవాచః

మహేశ్వర కృపా ప్రాప్త సద్బల స్యార్జునస్య హి ।
ఇత్యేతద్వచనం శ్రుత్వా భిల్లో వాక్య మథా బ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

ఆ మహేశ్వరుని అనుగ్రహముచే పొందబడిన గొప్ప బలముగల అర్జునుని ఈ మాటను విని, తరువాత భిల్లుడిట్లు పలికెను .

భిల్ల ఉవాచః

అజ్ఞోఽసి త్వం ఋషిర్నాసి మరణం త్వీహసే కథమ్ ।
దేహి బాణం సుఖం తిష్ఠ త్వన్యథా క్లేశభాగ్భవేః ॥

భిల్లుడిట్లు పలికెను –

నీవు అజ్ఞానివి. నీవు ఋషివి కావు. నీవు మరణమునేల కోరుచున్నావు? బాణమునిచ్చి సుఖముగా నుండుము. లేనిచో కష్టముల పాలగుదువు .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తస్తేన భిల్లేన శివసచ్ఛక్తి శోభినా ।
గణేన పాండవస్తం చ ప్రాహ స్మృత్వా చ శంకరమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

శివుని గొప్ప శక్తిచే ప్రకాశించే ఆ భిల్లుడిట్లు పలుకగా, అర్జునుడు శంకరుని స్మరించి భిల్లరూపములోనున్న ఆ గణాధ్యక్షునితో నిట్లనెను .

అర్జున ఉవాచః

మద్వాక్యం తత్త్వతో భిల్ల శృణు త్వం చ వనేచర ।
ఆగమిష్యతి తే స్వామి దర్శయిష్యే ఫలం తదా ॥
న శోభతే త్వయా యుద్ధం కరిష్యే స్వామినా తవ ।
ఉపహాసకరం జ్ఞేయం యుద్ధం సింహ శృగాలయోః ॥
శ్రుతం చ మద్వచస్తేఽద్య ద్రక్ష్యసి త్వం మహాబలమ్ ।
గచ్ఛ స్వ స్వామినం భిల్ల యథేచ్ఛసి తథా కురు ॥

అర్జునుడిట్లు పలికెను –

ఓ భిల్లో! వనచరా! నా వాక్యమును. విని సారమును గ్రహించుము. నీ ప్రభువు రాగానే, నీ ఈ మాటల ఫలమును అప్పుడు చూపించేదను (32). నేను నీతో యుద్ధమును చేయుట శోభిల్లదు. నీ ప్రభువుతో యుద్ధమును చేసెదను. సింహమునకు, నక్కకు మధ్యలో యుద్ధము అపహాస్యము పాలగును (33). నీవు నా పలుకులనిప్పుడు వినియున్నావు. నా గొప్ప బలమును చూడగలవు. ఓయీ భిల్లా! నీ ప్రభువు వద్దకు పొమ్ము, నీకు నచ్చిన విధముగా చేసుకొనుము .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తస్తు గతస్తత్ర భిల్లః పార్థేన వై మునే ।
శివావతారో యత్రాస్తే కిరాతో వాహినీ పతిః ॥
అథార్జునస్య వచనం భిల్లరాజాయ విస్తరాత్ ।
సర్వం నివేదయామాస తస్మై భిల్ల పరాత్మనే ॥
స కిరాతేశ్వర శ్శృత్వా తద్వచో హర్షమాగతః।
ఆ జగామ స్వసైన్యేన శంకరో భిల్ల రూపధృక్ ॥
అర్జునశ్చ తదా సేనాం కిరాతస్య చ పాండవః ।
దృష్ట్వా గృహీత్వా సశరం ధనుస్సమ్ముఖ ఆయయౌ ॥
అథో కిరాతశ్చ పునః ప్రేషయామాస తం చరమ్ ।
తన్ముఖేన జగౌ వాక్యం భారతాయ మహాత్మనే ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! అర్జునుడిట్లు పలుకగానే ఆ భిల్లుడు సైన్యాధ్యక్షుడగు కిరా◌ాతుని రూపములో శివుడు అవతరించియున్న స్థలమునకు వెళ్లెను. (35). అపుడాతడు భిల్లరాజు రూపములో నున్న పరమాత్మకు అర్జునుని వచనములనన్నిటినీ విస్తరముగా చెప్పెను (36). ఆ కిరాతప్రభువు ఆ మాటలను విని ఆనందమును పొందెను. భిల్లరూపములో నున్న శంకరుడు తన సైన్యమును దోడ్కొని అచటకు విచ్చేసెను (37). పాండు పుత్రుడగు అర్జునుడపుడు కిరాతుని సేనను గాంచి ధనుర్బాణములను చేతబట్టి ఎదురేగెను (38). అపుడు కిరాతరాజు మరల ఆ సేవకుని భరతవంశజుడు, మహాత్ముడునగు. అర్జునుని వద్దకు పంపించి, ఆతని ముఖము ద్వారా ఈ వాక్యములను చెప్పించెను .

కిరాత ఉవాచః

పశ్య సైన్యం తపస్వింస్త్వం ముంచ బాణం వ్రజాధునా ।
మరణం స్వల్పకార్యార్థం కథమిచ్ఛసి సాంప్రతమ్ ॥
భ్రాతరస్తవ దుఃఖార్తాః కలత్రం చ తతః పరమ్ ।
పృథివీ హస్తతస్తేఽద్య యాస్యతీతి మతిర్మమ ॥

కిరాతుడిట్లు పలికెను -

ఓ తపస్వీ! నీ వీ సైన్యమును చూడుము. బాణమును విడిచిపెట్టి ఇప్పుడే వెళ్లిపొమ్ము. చిన్న పని కొరకు ఇపుడు మరణమునేల కోరెదవు? (40). నీ సోదరులు దుఃఖముచే పీడింపబడెదరు. నీ భార్య అంతకంటే అధికముగా దుఃఖితురాలగును. నీవు అట్లు చేయనిచో రాజ్యభ్రష్టుడవగుదువని నాకు తోచుచున్నది .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తం పరమేశేన పార్థదార్ఢ్య పరీక్షయా ।
సర్వథార్జున రక్షార్థం ధృతరూపేణ శంభునా ॥
ఇత్యుక్తస్తు తదాగత్య సగణ శ్శంకరస్య తత్ ।
విస్తరాద్వృత్తమఖిల మర్జునాయ న్యవేదయత్ ॥
తచ్ఛృత్వా తు పునః ప్రాహ పార్థస్తం దూతమాగతమ్ ।
వాహినీ పతయే వాచ్యం విపరీతం భవిష్యతి ॥
యద్యహం నైవ తే బాణం యచ్ఛామి చ మదీయకమ్ ।
కులస్య దూషణం చాహం భవిష్యామి న సంశయః ॥
భ్రాతరశ్చైవ దుఃఖార్తా భవంతు చ తథా ధ్రువమ్ ।
విద్యాశ్చ నిష్ఫలా మే స్యు స్తస్మాదాగచ్ఛ వై ధ్రువమ్ ॥
సింహశ్చైవ శృగాలద్వా భీతో నైవ మయా శ్రుతః ।
తథా వనే చరా ద్రాజా న బిభేతి కదాచన॥
ఇత్యుక్తస్తం పునర్గత్వా స్వామినం పాండవేన సః ।
సర్వం నివేదయామాస తదుక్తం హి విశేషతః ॥
అథ సోఽపి కిరాతాహ్వో మహాదేవస్ససైన్యకః ।
తచ్ఛృత్వా సైన్యసంయుక్తో హ్యర్జునం చాగమత్తదా ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం కిరాతార్జున సంవాదో నామ చత్వారింశోఽధ్యాయః.

నందీశ్వరుడిట్లు పలికెను -

అన్ని విధములుగా అర్జునుని రక్షించుటకై అవతరించిన పరమేశ్వరుడగు శంభుడు పార్థుని దృఢదీక్షను పరీక్షించుటకై ఇట్లు పలికెను (42). శంకరుడిట్లు చెప్పగానే శంకరుని అనుచరుడు అర్జునుని వద్దకు వచ్చి ఆ వివరములనన్నిటినీ ఆతనికి విన్నవించెను (43). ఆ సందేశమును విని అర్జునుడు తన వద్దకు వచ్చిన దూతతో మరల ఇట్లనెను: మీ సేనాధ్యక్షునకు చెప్పుము. అంతా విపరీతము కాగలదు (44), నేను నీకు నా బాణము నిచ్చినచో, నేను నా కులమును చెడగొట్టిన వాడనగుదును. దీనిలో సందేహము లేదు (45). నా సోదరులు దుఃఖపీడితులైనచో అగుదురు గాక! కానీ నా విద్యలు వ్యర్థమగుట నాకు సమ్మతము కాదు. ఇది నిశ్చయము. కావున రమ్ము (46). సింహము నక్కవలన ఎన్నడైననూ భయపడదని నేను వినియున్నాను. అదే విధముగా రాజు వనచరుని వలన ఎన్నటికీ భయపడడు (47). అర్జునుడిట్లు పలుకగా ఆ అనుచరుడు మరల తన ప్రభువు వద్దకు వెళ్లి అర్జునుని వచనములను జాగరూకతతో సర్వమును విన్నవించెను (48), అపుడు కిరాతరూపములో నున్న మహాదేవుడు ఆ మాటలను విని తన సైన్యముతో గూడి అర్జునునిపై దండెత్తెను .

శ్రీ శివమహాపురాణములోని శతరుద్ర సంహితయందు కిరాతార్జున సంవాదమనే నలుబదియవ అధ్యాయము ముగిసినది.

41 – కిరాతార్జునీయము

తమాగతం తతో దృష్ట్వా ధ్యానం కృత్వా శివస్య సః ।
గత్వా తత్రార్జునస్తేన యుద్ధం చక్రే సుదారుణమ్॥
గణైశ్చ వివిధైస్తీక్ష్ణైరాయుధైస్తం న్యపీడయత్ ।
తైస్తదా పీడితః పార్థస్సస్మార స్వామినం శివమ్ ॥
అర్జునశ్చ తదా తేషాం బాణావలి మథాచ్ఛినత్ ।
యదా యుద్ధం చ తైః క్షిప్తం తతఃశర్వం పరామృశత్ ॥
పీడితాస్తే గణాస్తేన యయుశ్చైవ దిశో దశ ।
గణేశా వారితాస్తే చ నాజగ్ము స్స్వామినం ప్రతి ॥
శివశ్చైవార్జునశ్చైవ యయుధాతే పరస్పరమ్ ।
నానావిధైశ్చాయుధైర్హి మహాబల పరాక్రమౌ ॥
శివోఽపి మనసా నూనం దయాం కృత్వార్జునం హ్యగాత్ ।
అర్జునశ్చ దృఢం తత్ర ప్రహారం కృతవాంస్తదా ॥
ఆయుధాని శివస్సో వై హ్యర్జునస్యాచ్ఛినత్తదా ।
కవచాని చ సర్వాణి శరీరం కేవలం స్థితమ్ ॥
తదార్జునశ్శివం స్మృత్వా మల్లయుద్ధం చకార సః ।
వాహినీ పతినా తేన భయాత్ క్లిష్టోఽపి ధైర్యవాన్ ॥
తద్యుద్ధేన మహీ సర్వా చకంపే ససముద్రకా ।
దేవా దుఃఖం సమాపన్నాః కిం భవిష్యతి వా పునః ॥
ఏతస్మిన్నంతరే దేవ శ్శివో గగనమాస్థితః ।
యుద్ధం చకార తత్రస్థ స్సోఽర్జునశ్చ తథాఽకరోత్ ॥

తరువాత అర్జునుడు అచటకు భిల్లరాజు వచ్చుటను గాంచి శివుని ధ్యానించి ఆతని వద్దకు వెళ్లి అతనితో మిక్కిలి దారుణమగు యుద్ధమును చేసెను (1). వివిధ గణములు పదునైన ఆయుధములతో ఆతనిని పీడించిరి. ఆ విధముగా వారిచే పీడకు గురి చేయబడిన అర్జునుడు శివప్రభుని స్మరించెను (2). అపుడు అర్జునుడు మనస్సులో శివుని స్మరించి యుద్ధములో వారిచే విడువబడిన బాణములచే పీడింపబడిన వాడై ఆ బాణసమూహములను ఛేదించెను (3). ఆతనిచే పీడకు గురి చేయబడిన ఆ గణములు పది దిక్కులకు పరుగులెత్తిరి. గణాధ్యక్షులు శివునిచే వారింపబడిన వారై ఆ ప్రభువుకు తోడుగా వెళ్లలేదు (4). శివార్జునులు ద్వంద్వయుద్ధమును చేసిరి. మహాబల పరాక్రమములు గల వారిద్దరు అనేకవిధములగు ఆయుధములను ప్రయోగించుచుండిరి (5). శివుడు మనస్సులో దయ గలవాడై అర్జునుని సమీపించగా, అర్జునుడు అపుడు ఆయన పై పెద్ద ప్రహారమును కొట్టెను (6). మరియు శివుడపుడు అర్జునుని ఆయుధముల నన్నింటిని, మరియు కవచములను ఛేదించగా, అర్జునుడు కేవల శరీరముతో నిలబడెను (7). అపుడు అర్జునుడు శివుని స్మరించి భయపీడితుడై ననూ

ధైర్యమును వహించి ఆ భిల్లరాజుతో మల్లయుద్ధమును చేసెను (8). ఆ యుద్ధముచే సముద్రములతో సహా భూమి అంతయూ కంపించేను. "ఏమి కాబోవుచున్నదో' యని దేవతలు దుఃఖమును పొందిరి (9). ఇంతలో శివప్రభుడు ఆకసమునకెగురగా, అర్జునుడు కూడ అటులనే చేసి ఆకాశములో నున్నవాడై యుద్ధమును చేసెను .

ఉడ్డీయోడ్డీయ తౌ యుద్ధం చక్రతుర్దేవ పార్థివౌ ।

దేవాశ్చ విస్మయం ప్రాపూ రణం దృష్ట్వా తదాద్భుతమ్ ॥

అథార్జునోత్తరం జ్ఞాత్వా స్మృత్వా శివపదాంబుజమ్ ।

దధార పాదయోస్తం వై తద్ధ్యానాదాప్త సద్బలః ॥

ధృత్వా పాదౌ తదా తస్య భ్రామయామాస సోఽర్జునః ।

విజహాస మహాదేవో భక్తవత్సల ఊతికృత్ ॥

దాతుం స్వదాసతాం తస్మై భక్త వశ్యతయా మునే ।

శివేనైవ కృతం హ్యేతచ్చరితం నాన్యథా భవేత్ ॥

పశ్చాద్విహస్య తత్రైవ శంకరో రూపమద్భుతమ్ ।

దర్శయామాస సహసా భక్త వశ్యతయా శుభమ్ ॥

యథోక్తం వేదశాస్త్రేషు పురాణే పురుషోత్తమ ।

వ్యాసోపదిష్టం జ్ఞానాయ తస్య యత్సర్వసిద్ధిదమ్ ॥

తద్దృష్ట్వా సుందరం రూపం ధ్యాన ప్రాప్తం శివస్య తు ।

బభూవ విస్మితోఽతీవ హ్యర్జునో లజ్జితస్స్వయమ్ ॥

అహో శివశ్శివస్సోఽయం యో మే ప్రభుతయా వృతః ।

త్రిలోకేశస్స్వయం సాక్షాద్ధా కృతం కిం మయాఽధునా ॥

ప్రభోర్బల వతీ మాయా మాయినామపి మోహినీ ।

కిం కృతం రూపమాచ్ఛాద్య ప్రభుణా ఛలితో హ్యహమ్ ॥

ధియేతి సంవిచార్యైవం సాంజలిరతమస్తకః ।

ప్రణనామ ప్రభుం ప్రీత్యా తదోవాచ స ఖిన్నధీః ॥

శివార్జునులిద్దరు ఆకాశములో ఇటునటు ఎగురుచూ యుద్ధమును చే(?)రేయు చుండిరి. అపుడా అద్భుతమగు యుద్ధమును గాంచి దేవతలు ఆశ్చర్యమును పొందిరి (11). అపుడు అర్జునుడు తన తరువాతి కర్తవ్యమునెరింగి శివుని పాదపద్మములను ధ్యానించి అవకాశమునెరింగి శివుని ధ్యానించుటచే కలిగిన మహాబలము గలవాడై ఆయనను పాదముల యందు పట్టుకొనెను (12). ఆ అర్జునుడు అపుడాయన పాదములను పట్టుకొని గిరగిర త్రిప్పెను. భక్తవత్సలుడు, లీలలను ప్రకటించువాడు అగు మహాదేవుడు నవ్వుచుండెను (13). ఓ మునీ! భక్తపరాధీనుడగు శివుడు ఆతనికి తన దాస్యము నీయదలచి స్వయముగా ఈ చరితమును ప్రవర్తిల్ల జేసెను. ఈ చరితమునకు మరియొక కారణము లేదు (14). తరువాత భక్తపరాధీనుడగు శంకరుడు నవ్వి మంగళకరము అద్భుతము అగు రూపమును వెంటనే చూపించెను (15). ఓ పురుష శ్రేష్ఠా!- వేదశాస్త్రములయందు

పురాణములలో వర్ణింపబడినది, ఉపాసన కొరకై వ్యాసునిచే ఉపదేశింపబడినది, అర్జునునకు సర్వ సిద్ధులను ఇచ్చినది, ధ్యానములో ఆతనిచే దర్శింపబడునది అగు శివుని ఆ సుందరరూపమును గాంచి అర్జునుడు అత్యంతము ఆశ్చర్యమును పొందిన వాడై స్వయముగా చాల సిగ్గు పడెను (16, 17). ఆశ్చర్యము! శివుడు! ఈయన శివుడు. నేను. ఈయనను నా ప్రభువుగా స్వీకరించి యుంటిని. ముల్లోకములకు ప్రభువగు ఈయన స్వయముగా ప్రత్యక్షమైనాడు. అయ్యో! ఇప్పుడు నేను చేసిన పని యేమి? (18) శివప్రభుని మాయ బలవత్తరమైనది. అది మాయావులను కూడ మోహింపజేయును. ప్రభుడు తన యథార్థరూపమును కప్పిపుచ్చి నన్ను మోసగించి ఎంతపని " చేసినాడు? (19) అర్జునుడు తన మనస్సులో ఇట్లు తలపోసి చేతులు జోడించి తలవంచి ఆ ప్రభునకు ప్రేమతో నమస్కరించెను. అపుడాతడు ఖేదముతో నిండిన హృదయము గలవాడై ఇట్లు పలికెను .

అర్జున ఉవాచః

దేవ దేవ మహాదేవ కరుణాకర శంకర ।
మమాపరాధం సర్వేశ క్షంతవ్యశ్చ త్వయా పునః ॥
కిం కృతం రూపమాచ్ఛాద్య ఛలితోఽస్మి త్వయాధునా ।
ధిజ్ మాం సమరకర్తారం స్వామినా భవతా ప్రభో ॥

అర్జునుడిట్లు పలికెను –

ఓ దేవదేవా! మహాదేవా! కరుణానిధీ! శంకరా! ఓ సర్వేశ్వరా! నీవు నా అపరాధమునును మన్నించవలెను (21). ఓ ప్రభూ! నీవు నీ రూపమును కప్పిపుచ్చి ఎంత పని చేసితివి? నేనీనాడు నీచే మోసగించబడితిని. స్వామివి అగు నీతో యుద్ధమును చేసిన నాకు నిందయగు గాక .

నందీశ్వర ఉవాచః

ఇత్యేవం పాండవస్సోఽథ పశ్చాత్తాపమవాప సః ।
పాదయోర్నిపపాతాను శంకరస్య మహాప్రభోః ॥
అథేశ్వరః ప్రసన్నాత్మా ప్రత్యువాచార్జునం చ తమ్ ।
సమాశ్వాస్యేతి బహుశో మహేశో భక్తవత్సలః ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

అపుడు ఆ అర్జునుడు ఈ తీరున పశ్చాత్తాపమును పొందినవాడై వెంటనే శంకరమహాప్రభుని పాదములపై పడెను (23). అపుడు భక్తవత్సలుడు, మహేశ్వరుడు అగు శంకరుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై అర్జునుని పరిపరి విధముల ఓదార్చి ఆతనితో నిట్లనెను .

శంకర ఉవాచః

న ఖిద్య పార్థ భక్తోఽసి మమ త్వం హి విశేషతః ।
పరీక్షార్థం మయా తేఽద్య కృతమేవం శుచం జహి ॥

శంకరుడిట్లు పలికెను -

ఓ అర్జునా! దుఃఖించకుము. నీవు నాకు మహాభక్తుడవు. నేను నిన్ను పరీక్షించుట కొరకు మాత్రమే ఈ నాడిట్లు చేసితిని. దుఃఖమును విడనాడుము .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా తం స్వహస్తాభ్యాముత్థాప్య ప్రభురర్జునమ్ ।
విలజ్జం కారయామాస గణైశ్చ స్వామినో గణైః ॥
పునశ్శివో ర్జునం ప్రాహ పాండవం వీరసమ్మతమ్ ।
హర్షయన్ సర్వథా ప్రీత్యా శంకరో భక్త వత్సలః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

శివుడు ఇట్లు పలికి తన చేతులతో అర్జునుని పైకి ఎత్తి తాను స్వయముగ చెప్పుటయే గాక గణములచే చెప్పించి అర్జునుడు లజ్జను విడనాడునట్లు చేసెను (26). మంగళకరుడు, భక్తవత్సలుడు నగు శివుడు వీర పూజ్యుడు, పాండుపుత్రుడునగు అర్జునుని ప్రేమతో అన్ని విధములుగా హర్షయుక్తుని చేసి మరల ఇట్లు పలికెను .

శివ ఉవాచః

హే పార్థ పాండవ శ్రేష్ఠ ప్రసన్నోఽస్మి వరం వృణు ।
ప్రహారైస్తాడనైస్తే ఽద్య పూజనం మానితం మయా ॥
ఇచ్ఛయా చ కృతం మేఽద్య నాపరా ధస్తవాధునా ।
నాదేయం విద్యతే తుభ్యం యదిచ్ఛసి వృణీష్వ తత్ ॥
తే శత్రుషు యశో రాజ్యస్థాపనాయ శుభం కృతమ్ ।
ఏతద్దుఃఖం న కర్తవ్యం వైక్లబ్యం చ త్యజాఖిలమ్ ॥

శివుడిట్లు పలికెను -

ఓ పార్థా! నీవు పాండవులలో శ్రేష్ఠుడవు. ప్రసన్నుడనైతిని. వరమును కోరుకొనుము. ఈనాడు నేను దెబ్బలను తాడనములను పూజారూపములో స్వీకరించుచున్నాను (28). ఈ నాటి చరిత్ర అంతయు నా ఇచ్ఛచే జరిగినది. దీనిలో నీ అపరాధము లేదు. నీకు ఈయరానిది లేదు. నీకు ఏది నచ్చునో, దానిని కోరుకొనుము (29). నీవు శత్రువులను జయించి కీర్తిని రాజ్యమును స్థాపించుట కొరకై శుభకరమగు తపస్సును చేసితివి. నీవు ఈ తీరున దుఃఖించకుము. నీలోని నీరుత్సాహమును పూర్తిగా విడిచిపెట్టుము .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త స్సర్జునస్తేన ప్రభుణా శంకరేణ సః ।
ఉవాచ శంకరం భక్త్యా సావధానతయా స్థితః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ శంకరప్రభుడిట్లు పలుకగా ఆ అర్జునుడు సావధానమనస్కుడై శంకరుని ఉద్దేశించి భక్తితో నిట్లు పలికెను .

అర్జున ఉవాచః

భక్త ప్రియస్య శంభోస్తే సుప్రభో కిం సమీహితమ్ ।
వర్ణనీయం మయా దేవ కృపాలుస్త్వం సదాశివ ॥
ఇత్యుక్త్వా సంస్తుతిం తస్య శంకరస్య మహాప్రభోః ।
చకార పాండవస్సోఽథ సద్భక్తిం వేదసంమతామ్ ॥
నమస్తే దేవ దేవాయ నమః కైలాసవాసినే ।
సదాశివ నమస్తుభ్యం పంచవక్త్రాయ తే నమః ॥
కపర్దినే నమస్తుభ్యం త్రినేత్రాయ నమోస్తు తే ।
నమః ప్రసన్నరూపాయ సహస్రవదనాయ చ ॥
నీలకంఠ నమస్తేస్తు సద్యోజాతాయ వై నమః ।
వృషధ్వజ నమస్తేస్తు వామాంగ గిరిజాయ చ ॥
దశదోష నమస్తుభ్యం నమస్తే పరమాత్మనే ।
డమరు కపాలహస్తాయ నమస్తే ముండమాలినే ॥
శుద్ధస్ఫటిక సంకాశ శుద్ధకర్పూర వర్ష్మణే ।
పినాకపాణయే తుభ్యం త్రి శూలవరధారిణే ॥
వ్యాఘ్రచర్మోత్తరీయాయ గజాంబరవిధారిణే ।
నాగాంగాయ నమస్తుభ్యం గంగాధర నమోఽస్తు తే ॥
సుపాదాయ నమస్తే ఽస్తు ఆరక్త చరణాయ చ ।
నంద్యాది గణసేవ్యాయ గణేశాయ చ తే నమః ॥
నమో గణేశరూపాయ కార్తికేయానుగాయ చ।
భక్తిదాయ చ భక్తానాం ముక్తిదాయ నమో నమః ॥
అగుణాయ నమస్తేఽస్తు సగుణాయ నమో నమః ।
అరూపాయ సరూపాయ సకలాయాకలాయ చ ॥
నమః కిరాతరూపాయ మదనుగ్రహకారిణే।
యుద్ధప్రియాయ వీరాణాం నానాలీలానుకారిణే ॥

అర్జునుడిట్లు పలికెను -

ఓ మహాప్రభూ! భక్త ప్రియుడవగు నీకు కోరదగినది ఏమి గలదని నేను చెప్పవలెను? ఓ దేవా! సదాశివా ! నీవు దయామూర్తివి (32). అర్జునుడు అపుడు ఇట్లు పలికి గొప్ప భక్తితో శంకరమహాప్రభుని ఉద్దేశించి వేద ధర్మమునకు అను రూపమగు చక్కని స్తుతిని చేసెను (33). దేవదేవుడు, కైలాసవాసి, సదాశివుడు, అయిదు మోములవాడు (34), జటాజూటధారి, ముక్కంటి, ప్రసన్నమగు రూపము గలవాడు, అనంతముఖములు గలవాడు (35), నీలకంఠుడు, సద్యోజాతుడు, వృషభధ్వజుడు, ఎడమ భాగమునందు పార్వతిని ధరించిన వాడు (36), పది భుజములు గలవాడు, పరమాత్మ, డమరువును కపాలమును చేతియందు ధరించినవాడు, కపాలమాలను దాల్చినవాడు (37), స్వచ్ఛమగు స్ఫటికము వలె కర్పూరము వలె తెల్లని దేహము గలవాడు, పినాకమును చేతబట్టినవాడు, గొప్ప త్రిశూలమును ధరించువాడు (38), వ్యాఘ్రచర్మమే ఉత్తరీయముగా గలవాడు, గజచర్మమును దాల్చినవాడు, పాములను శరీరావయవములయందు దాల్చినవాడు, గంగాధరుడు (39), ఎర్రని అందమైన పాదములు గలవాడు, నంది మొదలగు గణములచే సేవింపబడువాడు, గణాధ్యక్షుడు అగు నీకు అ నమస్కారములు (40). కార్తికేయునిచే అనుసరింపబడే గణపతి నీ స్వరూపమే. భక్తులకు భక్తిని ముక్తిని కూడ ఇచ్చువాడు (41), నిర్గుణుడు, సగుణుడు, నీరూపుడు, సరూపుడు, నిరంశుడు, అంశములు గలవాడు (42), కిరాతరూపమును దాల్చి నన్ను అనుగ్రహించినవాడు, వీరులతో యుద్ధమును చేయుటలో ప్రీతి గలవాడు, అనేక లీలలను ప్రకటించువాడు నగు నీకు పునః పునః నమస్కారము .

యత్కించిద్ దృశ్యతే రూపం తత్తేజస్తావకం స్మృతమ్ ।
చిద్రూపస్త్వం త్రిలోకేషు రమసేఽన్వయభేదతః ॥
గుణానాం తే న సంఖ్యాస్తి యథా భూరజసామిహ ।
ఆకాశే తారకాణాం హి కణానాం వృష్ట్యపామపి ॥
న తే గుణాంస్తు సంఖ్యాతుం వేదా వై సంభవంతి హి ।
మందబుద్ధిరహం నాథ వర్ణయామి చ కం పునః ॥
సోఽసి యోఽసి నమస్తేఽస్తు కృపాం కర్తు మహర్హసి ।
దాసోఽహం తే మహేశాన స్వామీ త్వం మే మహేశ్వర ॥

ఈ ప్రపంచములో ఏ రూపము కానవచ్చిననూ, అది నీ తేజస్సు మాత్రమే ననని చెప్పబడినది. చిద్రూపుడవగు నీవు ఉపాధిభేదముచే ముల్లోకములయందు రమించుచున్నావు. (44). భూమి యొక్క రేణువులు, ఆకాశమునందలి నక్షత్రములు మరియు వర్షమునందలి జలకణములు వలె నీ గుణములు అసంఖ్యాకములు (45). నీ గుణములను లెక్కించుటకు వేదములు కూడ సమర్థములగుట లేదు. ఓ నాథా! అట్టి స్థితిలో మందబుద్ధినగు నేను ఏ గుణమును వర్ణించదగును? (46) నీవు ఏదియో అదియే అగుదువు. నీకు నమస్కారము. నన్ను దయ చూడుము. నేను నీ దాసుడను. ఓ మహేశ్వరా! నీవు నా ప్రభుడవు .

నందీశ్వర ఉవాచః

ఇతి శ్రుత్వా వచస్తస్య పునః ప్రోవాచ శంకరః ।
సుప్రసన్నతరో భూత్వా విహసన్ ప్రభురర్జునమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

అర్జునుని ఈ మాటను విని శంకరప్రభుడు మిక్కిలి ప్రసన్నుడై నవ్వి మరల అతనితో నిట్లనెను .

శంకర ఉవాచః

వచసా కిం బహూక్తేన శృణుష్వ వచనం మమ ।
శీఘ్రం వృణు వరం పుత్ర సర్వం తచ్చ దదామి తే ॥

శంకరుడిట్లు పలికెను –

అధికమగు పలుకులతో పనియేమి? నామాటను వినుము. ఓ పుత్రా! శీఘ్రముగా వరమును కోరుకొనుము. నీవు కోరిన సర్వమును నీకు ఇచ్చేదను .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్తశ్చార్జునస్తేన ప్రణిపత్య సదాశివమ్ ।
సాంజలిర్నతకః ప్రేమ్ణా ప్రోవాచ గద్గదాక్షరమ్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను –

సదాశివుడిట్లు పలుకగా అర్జునుడు చేతులు జోడించి తలను వంచి ఆయనకు ప్రణమిల్లి ప్రేమతో బొంగురువోయిన కంఠముతో నిట్లు పలికెను .

అర్జున ఉవాచః

కిం బ్రూయాం త్వం చ సర్వేషామంతర్యామితయా స్థితః ।
తథాపి వర్ణితం మే ఽద్య శ్రూయతాం చ త్వయా విభో ॥
శత్రూణాం సంకటం యచ్చ తద్గతం దర్శనాత్తవ।
ఐహికీం చ పరాం సిద్ధిం ప్రాప్నుయాం వై తథా కురు ॥

అర్జునుడిట్లు పలికెను –

నేనేమి చెప్పవలెను? నీవు సర్వప్రాణులలో అంతర్యామివై ఉన్నావు. అయిననూ, ఓ విభూ! నేను వర్ణించు విషయమును నీవు ఇపుడు వినుము (51). నీ దర్శనము వలన శత్రువుల సంకటము తొలగిపోయినది. నాకు ఇహలోకములో సర్వశ్రేష్టమగు సిద్ధి కలుగునట్లు చేయుము .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా తం నమస్కృత్య శంకరం భక్తవత్సలమ్ ।
నతస్కంధోఽర్జునస్తత్ర బద్ధాంజలి రుపస్థితః ॥
శివోఽపి చ తథా భూతం జ్ఞాత్వా పాండవమర్జునమ్ ।
నిజభక్తవరం స్వామి మహాతు ష్టో బభూవ హ ॥
అస్త్రం పాశుపతం స్వీయం దుర్జయం సర్వదా ఖిలైః ।
దదౌ తస్మై మహేశానో వచనం చేదమబ్రవీత్ ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

అర్జునుడు భక్తవత్సలుడగు శంకరునకు తలవంచి నమస్కరించి ఇట్లు పలికి చేతులు కట్టుకొని అచట నిలబడెను (53). పాండుపుత్రుడు, తన భక్తులలో శ్రేష్టుడు అగు అర్జునుడు అట్లు నిలబడుటను గాంచి శివస్వామి మహానందమును పొందెను (54). మహేశ్వరుడు ఏ కాలమునందైననూ ఎవరి చేతనైననూ జయింప శక్యము కాని తన పాశుపతాస్త్రమును ఆతనికి ఇచ్చి ఇట్లు పలికెను .

శివ ఉవాచః

స్వం మహాస్త్రం మయా దత్తం దుర్జయస్త్వం భవిష్యసి ।
అనేన సర్వశత్రూణాం జయకృత్యమవాప్నుహీ ॥
కృష్ణం చ కథయిష్యామి సాహాయ్యం తే కరిష్యతి ।
స వై మమాత్మ భూతశ్చ మద్భక్తః కార్యకారకః ॥
మత్ప్రభావద్భారత త్వం రాజ్యం నిష్కంటకం కురు ।
ధర్మాన్నానావిధాన్ భ్రాత్రా కారయ త్వం చ సర్వదా ॥

శివుడిట్లు పలికెను -

నేను నీకు నా మహాస్త్రము నిచ్చుచున్నాను. నీవు దుర్జయుడవు కాగలవు. దీని ప్రభావముచే శత్రువులనందరినీ జయించుము (56). నేను కృష్ణునితో చెప్పెదను. ఆయన నీకు సాహాయ్యమును చేయగలడు. ఆయన నాకు ఆత్మ, నా భక్తుడు మరియు కార్యకుశలుడు (57). ఓ అర్జునా! నా ప్రభావముచే నీవు రాజ్యములోని శత్రువులనందరినీ ఏరి వేయుము. నీవు సర్వదా మీ అన్నగారిచే అనేక విధముల ధర్మమునను ష్ఠింప జేయుము .

నందీశ్వర ఉవాచః

ఇత్యుక్త్వా నిజహస్తం చ ధృత్వా శిరసి తస్య సః ।
పూజితో హ్యర్జునేనాశు శంకరోంతరధీయత ॥
అథార్జునః ప్రసన్నాత్మా ప్రాప్యాస్త్రం చ వరం ప్రభోః ।
జగామ స్వా శ్రమే ముఖ్యం స్మరన్ భక్త్యా గురుం శివమ్ ॥
సర్వే తే భ్రాతరః ప్రేతాస్తన్వః ప్రాణమివాగతమ్ ।
మీలిత్వా తం సుఖం ప్రాపుర్ద్రౌపదీ చాతి సువ్రతా ॥
శివం పరం చ సంతుష్టం పాండవాస్సర్వ ఏవ హి।
నాతృప్యన్ సర్వవృత్తాంతం శ్రుత్వా హర్షముపాగతాః ॥
ఆశ్రమే పుష్పవృష్టిశ్చ చందనేన సమన్వితా ।
పపాత సుకరార్థం చ తేషాం చైవ మహాత్మనామ్ ॥
ధన్యం చ శంకరం చైవ నమస్కృత్య శివం ముదా ।
అవధిం చాగతం జ్ఞాత్వా జయశ్చైవ భవిష్యతి ॥
ఏతస్మిన్నంతరే కృష్ణశ్శ్రుత్వార్జునమథా గతమ్ ।
మేలనాయ సమాయాత శ్శ్రుత్వా సుఖముపాగతః ॥
అతశ్చైవ మయాఖ్యాత శ్శంకరస్సర్వ దుఃఖహా ।
స సేవ్యతే మయా నిత్యం భవద్భిరపి సేవ్యతామ్ ॥
ఇత్యుక్తస్తే కిరాతాహ్వోఽవతార శ్శంకరస్య వై ।
తం శ్రుత్వా శ్రావయన్ వాపి సర్వాన్ కామానవాప్నుయాత్ ॥

ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్ర సంహితాయాం కిరాతావతార వర్ణనం
నామ ఏక చత్వారింశోఽధ్యాయః ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఆ శంకరుడిట్లు పలికి తన చేతిని అర్జునుని శిరస్సుపై నుంచి అర్జును◌ునిచే పూజింపబడిన వాడై వెంటనే అంతర్హితుడాయెను (59). అపుడు అర్జునుడు ప్రసన్నమగు మనస్సు గలవాడై శివప్రభుని నుండి అస్త్రమును వరమును పొంది, ప్రముఖగురువు అగు శివుని భక్తితో స్మరిస్తూ తన ఆశ్రమమునకు వెళ్లెను (60). ఆ నల్గురు సోదరులు మరియు మహాపతివ్రతయగు ద్రౌపది ఆతనితో కలిసి తమ శరీరముల లోనికి ప్రాణము మరలి వచ్చినదా యన్నట్లు సుఖమును పొందిరి (61). శివుడు మిక్కిలి సంతుష్టుడగుట ఇత్యాది వృత్తాంతమునంతనూ విని ఆ సోదరులందరు గొప్ప ఆనందమును పొందిరి. ఎంత విన్ననూ వారికి తనివి తీరలేదు (62). మహాత్ములగు ఆ సోదరుల సౌభాగ్యము కొరకై ఆశ్రమములో చందనముతో గూడిన పుష్పములు వర్షించేను (63). సంపదలనిచ్చి మంగళములను చేయు శివుని వారు ఆనందముతో. నమస్కరించి అజ్ఞాతవాసమునకు అంతము సమీపించినదని యెరింగి విజయము లభించగలదని ఆశించిరి (64). ఇంతలో, అర్జునుడు సుఖముగా తిరిగి వచ్చినాడని విని ఆతనిని కలియుటకై శ్రీ కృష్ణుడు విచ్చే సెను (65). ఇందువలననే, శంకరుడు సర్వదుఃఖములను పోగొట్టుననియు, నేను నిత్యము ఆయనను సేవించుచున్నాను గనుక, మీరు కూడ ఆయనను సేవించుడనియు నేను చెప్పియుంటినని శ్రీ కృష్ణుడు చెప్పెను (66). నేనింతవరకు శివుని కిరాతావతారమును వర్ణించితిని. దీనిని విన్నవారు, వినిపించిన వారు తమ కోర్కెల నన్నిటినీ పొందెదరు (67).

శ్రీ శివమహాపురాణములోని శతరుద్ర సంహితయందు

కిరాతావతారవర్ణనమనే నలుబదీ ఒకటవ అధ్యాయము ముగిసినది.

42 - ద్వాదశ జ్యోతిర్లింగములు

నందీశ్వర ఉవాచః

అవతారాన్ శృణు విభోర్ద్వాదశప్రమితాన్ పరాన్ ।
జ్యోతిర్లింగ స్వరూపాన్ వై నానోతి కారకాన్మునే ॥
సౌరాష్ట్రే సోమనాథశ్చ శ్రీ శైలే మల్లికార్జునః ।
ఉజ్జయిన్యాం మహాకాల ఓంకారే చామరేశ్వరః ॥
కేదారో హిమవత్పృష్ఠే డాకిన్యాం భీమ శంకరః ।
వారాణస్యాం చ విశ్వేశస్త్ర్యంబకో, గౌతమీతటే ॥
వైద్యనాథశ్చితా భూమౌ నాగేశో దారుకావనే ।
సేతుబంధే చ రామేశో ఘుశ్మేశశ్చ శివాలయే ॥
అవతారద్వాదశకమేతచ్ఛంభోః పరాత్మనః ।
సర్వానందకరం పుంసాం దర్శనస్పర్శ నాన్మునే ॥
తత్రా ద్యస్సోమనాథో హి చంద్రదుః ఖక్షయంకరః ।
క్షయకుష్ఠాదిరో గాణాం నాశకః పూజనాన్మునే ॥
శివావతారస్సోమేశో లింగరూపేణ సంస్థితః ।
సౌరాష్ట్రేఏ శుభదేశే చ శశినా చ పూజితః పురా ॥

నందీశ్వరుడిట్లు పలికెను -

ఓ మహర్షీ! శ్రేష్ఠమైనవి, జ్యోతిర్లింగ రూపములో నున్నవి, అనేక లీలలను ప్రదర్శించునవి అగు పన్నెండు పరమేశ్వరావతారములను గూర్చి వినుము (1). సౌరాష్ట్ర దేశములో సోమనాథుడు, శ్రీశైలములో మల్లికార్జునుడు, ఉజ్జయినిలో మహాకాలుడు, ఓంకారములో అమరేశ్వరుడు (2), హిమవచ్ఛిఖరముపై కేదారేశ్వరుడు, డాకినిలో భీమశంకరుడు, వారాణసిలో విశ్వేశుడు, గౌతమీ తీరమునందు త్ర్యంబకుడు (3), చితాభూమిలో వైద్యనాథుడు, దారుకావనములో నాగేశుడు, సేతు బంధములో రామేశుడు, శివాలయములో ఘుశ్మేశుడు (4) అనునవి పరమాత్మయగు శంభుని పన్నెండు, అవతారములు. ఓ మునీ! ఈ లింగములు మానవులకు స్పృశించుటచే మరియు దర్శించుటచే సర్వానందములనిచ్చును (5). ఓ మునీ! వాటిలో మొదటిది సోమనాథుడు. ఆయన చంద్రుని దుఃఖమును పోగొట్టినాడు. ఆయనను పూజించినచో 'క్షయ, కుష్ఠ ఇత్యాది రోగములు తొలగిపోవును (6), శివుడు పూర్వము మంగళకరమగు సౌరాష్ట్రదేశములో లింగరూపములో ఆవిర్భవించగా చంద్రుడు ఆయనను అర్చించెను .

చంద్రకుండం చ తత్రైవ సర్వపాప వినాశకమ్ ।
తత్ర స్నాత్వా నరో ధీమాన్ సర్వరోగైః ప్రముచ్యతే ॥
సోమేశ్వరం మహాలింగం శివస్య పరమాత్మకమ్ ।
దృష్ట్వా ప్రముచ్యతే పాపాత్ భక్తిం ముక్తిం చ విందతి ॥
మల్లికార్జున సంజ్ఞశ్చావతారశ్శంకరస్య వై।
ద్వితీయశ్శ్రీగిరౌ తాత భక్తాభీష్టఫలప్రదః ॥
సంస్తుతో లింగరూపేణ సుతదర్శన హేతుతః ।
గతస్తత్ర మత్ప్రీత్యా స శివస్స్వగిరేర్మునే ॥
జ్యోతిర్లింగం ద్వితీయం తద్దర్శనాత్పూజనాన్మునే ।
మహాసుఖకరం చాంతే ముక్తిదం నాత్ర సంశయః ॥
మహాకాలాభిధస్తా తావతార శ్శంకరస్య వై।
ఉజ్జయిన్యాం నగర్యాం చ బభూవ స్వజనావనః ॥
దూషణా ఖ్యాసురం యస్తు వేదధర్మ ప్రమర్దకమ్ ।
ఉజ్జయిన్యాం గతం విప్రద్వేషిణం సర్వనాశనమ్ ॥
వేద విప్ర సుతధ్యాతో హుంకారేణైవ స ద్రుతమ్ ।
భస్మసాత్కృతవాంస్తం చ రత్నమాల నివాసినమ్ ॥
తం హత్వా స మహాకాలో జ్యోతిర్లింగ స్వరూపతః ।
దేవైస్స ప్రార్థితోఽ తిష్ఠత్స భక్తపరిపాలకః ॥

అచటనే సర్వపాపములను పోగొట్టే చంద్రకుండము గలదు. బుద్ధిమంతుడగు మానవుడు దానియందు స్నానము చేసి, రోగములన్నిటినుండి విముక్తిని పొందవచ్చును (8). పరమాత్మ స్వరూపమగు శివుని సోమేశ్వరమహాలింగమును దర్శించు మానవుడు పాపమునుండి విముక్తిని భక్తిని మరియు ముక్తిని పొందును (9). వత్సా! భక్తుల అభీష్టఫలములనిచ్చు శంకరుడు శ్రీగిరియందు మల్లికార్జునుడను పేరుతో అవతరించెను. ఇది రెండవ జ్యోతిర్లింగము (10). పుత్రసంతానమును కోరువారు లింగరూపములో నున్న మల్లికార్జునుని స్తుతించెదరు. ఓ మునీ! శివుడు తన కైలాసమునుండి శ్రీ శైలమునకు మహానందముతో విచ్చేసెను (11). ఓ మునీ! ఆ రెండవ జ్యోతిర్లింగమును దర్శించి, పూజించువారికి మహాసుఖములు కలుగుటయే గాక మరణించిన పిదప ముక్తి లభించుననుటలో సందియము లేదు (12). వత్సా! తన భక్తులను మహాకాలుడను పేర కాపాడే శివుని అవతారము ఉజ్జయినీ నగరములో ఆవిర్భవించేను (13). దూషణుడను రాక్షసుడు వేదధర్మమును నశింపజేయువాడై బ్రాహ్మణులను ద్వేషిస్తూ ఉజ్జయినిలో గల సర్వమును నాశనము చేసెను. అపుడు బ్రాహ్మణులు వారి పుత్రులు వేదములతో శివుని ప్రార్థించగా ఆయన వెంటనే రత్నమాల నగర నివాసియగు ఆ దూషణుని హుంకారముచే భస్మము చేసెను (14, 15). తన భక్తులను రక్షించే ఆ మహాకాలుడు దేవతలచే ప్రార్థింపబడినవాడై అచటనే జ్యోతిర్లింగరూపములో ఆవిర్భవించి స్థిరముగా నుండెను .

మహాకాలాహ్వయం లింగం దృష్ట్వాభ్యర్చ్య ప్రయత్నతః ।
సర్వాన్ కామానవాప్నోతి లభతే పరతో గతిమ్ ॥
ఓంకారః పరమేశానో ధృతశ్శంభోః పరాత్మనః ।
అవతారశ్చతుర్థో హి భక్తా భీష్టఫలప్రదః ॥
విధినా స్థాపితో భక్త్యా స్వలింగాత్పార్థివాన్మునే ।
ప్రాదుర్భూతో మహాదేవో వింధ్యకామప్రపూరకః ॥
దేవైస్సంప్రార్థితస్తత్ర ద్విధారూపేణ సంస్థితః ।
భుక్తిముక్తి ప్రదో లింగరూపో వై భక్త వత్సలః ॥
ప్రణవే చైవ చోంకార నామాసీల్లింగముత్తమమ్ ।
పరమేశ్వరనామాసీత్పార్థివశ్చ మునీశ్వర ॥
భక్తాభీష్టప్రదో జ్ఞేయో యోఽపి దృష్టోఽర్చితో మునే ।
జ్యోతిర్లింగే మహాదివ్యేవ్య వర్ణితే తు మహామునే ॥
కేదారేశోఽవతారస్తు పంచమః పరమశ్శివః ।
జ్యోతిర్లింగ స్వరూపేణ కేదారే సంస్థితస్స చ ॥

మహాకాలేశ్వర లింగమును దర్శించి శ్రద్ధతో అర్చించు మానవుడు సమస్తమైన అభీష్టములను పొందుటయే గాక, మరణించిన పిదప ఉత్తమ గతిని పొందును (17). శంభుపరమాత్మ ఓంకారేశ్వరుని రూపములో కూడ అవతరించినాడు. ఈ నాల్గవ అవతారము భక్తులకు , ఫలము నిచ్చి కోర్కెల నీడేర్చుచున్నది (18). వింధ్యుడు యథావిధిగా శివలింగమును స్థాపించి భక్తితో అర్చించెను. ఓ మునీ! ఆ పార్థివలింగము నుండి మహాదేవుడు ఆవిర్భవించి వింధ్యుని కోర్కెను తీర్చెను' (19). లింగరూపములో భక్తులకు భుక్తిని ముక్తిని ఇచ్చువాడు, భక్తప్రియుడు నగు శివుడు దేవతల ప్రార్థనను మన్నించి అచట రెండు రూపములలో ఆవిర్భవించెను (20). ఓ మహర్షీ! వాటిలో ఒకటీ ఓంకారములో ఓంకారేశ్వరుడను పేర ఆవిర్భవించిన ఉత్తమలింగము. పరమేశ్వరుడు అను పేరు గల పార్థివలింగము రెండవది (21). ఓ మహర్షీ! పైన వర్ణింపబడిన మహాదివ్యములగు ఈ రెండు జ్యోతిర్లింగములలో ఏ ఒక్కదానినైననూ దర్శించి అర్చించు భక్తుల అభీష్టములను పరమేశ్వరుడు తీర్చును (22). పరమశివుడు కేదారమునందు కేదారేశ్వరుడను పేర అయిదవ జ్యోతిర్లింగముగా అవతరించి యున్నాడు .

నరనారాయణాఖ్యౌ యావవతారౌ హరేర్మునే ।
తత్రార్థితశ్శివస్తత్ స్థైః కేదారే హిమభూధరే ॥
తాభ్యాం చ పూజితో నిత్యం కేదారేశ్వరసంజ్ఞకః ।
భక్తా భీష్ట ప్రదశ్శంభుర్దర్శనాదర్చ నాదపి ॥
అస్య ఖండస్య స స్వామీ సర్వేశోఽపి విశేషతః ।
సర్వకామ ప్రదస్తాత సోఽవతార శ్శివస్య వై ॥
భీమశంకర సంజ్ఞస్తు షష్ఠశ్శంభో ర్మహా ప్రభోః ।
అవతారో మహాలీలో భీమాసురవినాశనః ॥
సుదక్షిణాభిధం భక్తం కామరూపేశ్వరం నృపమ్ ।
యో రరక్షాద్భుతం హత్వాసురం తం భక్తదుఃఖదమ్ ॥
భీమశంకరనామాస డాకిన్యాం సంస్థితస్స్వయమ్ ।
జ్యోతిర్లింగస్వరూపేణ ప్రార్థితస్తేన శంకరః ॥
విశ్వేశ్వరావతారస్తు కాశ్యాం జాతో హి సప్తమః ।
సర్వ బ్రహ్మాండరూపశ్చ భుక్తి ముక్తి ప్రదో మునే ॥

ఓ మహర్షీ! హిమవత్పర్వతము నందలి కేదారములో హరియొక్క అవతారములగు నరనారాయణులు గలరు. వారు మరియు అచటనున్న ఇతరులు ప్రార్థించగా శివుడు అచట కేదారేశ్వరనామముతో అవతరించి ప్రతిదినము వారిద్దరి పూజలనందుకొనుచున్నాడు. కేదారేశ్వరుని దర్శించి అర్చించు భక్తుల కోర్కెలను శంభుడు నెరవేర్చును (24,25). వత్సా! శివుడు సర్వేశ్వరుడే అయిననూ, ఈ అవతారములో విశేషించి ఆ ప్రాంతమునకు ప్రభువై వెలసినాడు, ఈ శివావతారము కోర్కెల నన్నిటినీ ఈడేర్చునని ప్రసిద్ధి (26). గొప్ప లీలలను నేరపు శంభుమహాప్రభుడు భీమశంకరుడను పేర ఆరవ సారి అవతరించి భీమాసురుని సంహరించినాడు (27). సుదక్షిణుడను పేరుగల భక్తుడగు కామరూప దేశప్రభువును, భక్తులకు దుఃఖమును కలుగజేయు భయంకరుడగు భీమాసురునీ బారినుండి ఆయన రక్షించెను (28). ఆ రాజుయొక్క ప్రార్థనను మన్నించి శంకరుడు డాకినీ నగరములో భీమశంకరుడను పేర జ్యోతిర్లింగమై స్వయముగా వెలసియున్నాడు (29). ఓ మునీ! సర్వ బ్రహ్మాండస్వరూపుడు, భుక్తిని ముక్తిని ఇచ్చువాడు నగు శంకరుడు కాశీనగరములో విశ్వేశ్వరుడై ఏడవ జ్యోతిర్లింగముగా అవతరించినాడు .

పూజితస్సర్వదేవైశ్చ భక్త్యా విష్ణ్వాదిభిస్సదా ।
కైలాసపతినా చాపి భైరవేణాపి నిత్యశః ॥
జ్యోతిర్లింగ స్వరూపేణ సంస్థితస్తత్ర ముక్తిదః ।
స్వయం సిద్ధస్వరూపో హి తథా స్వపురి స ప్రభుః ॥
కాశీ విశ్వేశయోర్భక్త్యా తన్నామజపకారకాః ।
నిర్లిప్తాః కర్మభిర్నిత్యం కైవల్యపదభాగినః ॥
త్ర్యంబకాఖ్యోఽవతారో యస్సోఽష్టమో గౌతమీతటే ।
ప్రార్థితో గౌతమేనావిర్బభూవ శశిమౌలినః ॥
గౌతమస్య ప్రార్థనయా జ్యోతిర్లింగ స్వరూపతః ।
స్థితస్తత్రాచల: ప్రీత్యా తన్మునేః ప్రీతికామ్యయా ॥
తస్య సందర్శనాత్ స్పర్శాద్దర్శనాచ్చ మహేశితుః ।
సర్వే కామాః ప్రసిధ్యంతి తతో ముక్తిర్భవేదహో ॥
శివానుగ్రహతస్తత్ర గంగానామ్నా తు గౌతమీ ।
సంస్థితా గౌతమప్రీత్యా పావనీ శంకరప్రియా ॥

విష్ణువు మొదలగు సర్వదేవతలు, కైలాసగిరీశుడు మరియు భైరవుడు కూడ ఆయనను నిత్యము భక్తితో పూజించెదరు (31), ముక్తి దాతయగు శివప్రభుడు స్వీయనగరములో స్వయంభూ జ్యోతిర్లింగ స్వరూపుడై వెలసియున్నాడు (32). ఎవరైతే కాశీనగరమును, విశ్వేశ్వరుని ఆరాధించి భక్తితో శివుని నామమును జపించెదరో వారు సర్వదా కర్మ బంధమునుడి విముక్తులై కైవల్యపదమును పొందెదరు (33). చంద్రమౌళి యొక్క ఎనిమిదవ త్ర్యంబకావతారము గౌతమ మహర్షి ప్రార్థించగా గౌతమీ నదీ తీరమునందావిర్భవించెను (34). గౌతమ మహర్షి ప్రార్థనచే ఆ మహర్షికి ప్రీతిని కలిగించ గోరి శివుడు జ్యోతిర్లింగ రూపములో అచట స్థిరముగా నున్నాడు (35). ఆశ్చర్యము! ఆ మహేశ్వరుని దర్శించి స్పృశించువారలకు కోర్కెలన్నియూ ఈడేరుటయే గాక, దేహ త్యాగము తరువాత ముక్తి కలుగును (36). శివునకు ప్రియురాలు పావని యగు గంగ శివుని అనుగ్రహము వలన గౌతమునకు ప్రీతిని కలిగించుటకై అచట గౌతమి యను పేరుతో ప్రవహించేను .

వైద్యనాథావతారో హి నవమస్తత్ర కీర్తితః ।
ఆవిర్భూతో రావణార్థం బహులీలాకరః ప్రభుః ॥
తదానయనరూపం హి వ్యాజం కృత్వా మహేశ్వర: ।
జ్యోతిర్లింగస్వరూపేణ చితాభూమౌ ప్రతిష్ఠితః ॥
వైద్యనాథేశ్వరో నామ్నా ప్రసిద్ధోఽ భూజ్జగత్రయే ।
దర్శనాత్పూజనాద్భక్త్యా భుక్తిముక్తి ప్రదస్స హి ॥
వైద్యనాథేశ్వరశివమాహాత్మ్యమను శాసనమ్ ।
పఠతాం శృణ్వతాం చాపి భుక్తిముక్తిప్రదం మునే॥
నాగేశ్వరావతారస్తు దశమః పరికీర్తితః ।
ఆవిర్భూతస్స్వభక్తార్థం దుష్టానాం దండదస్సదా ॥
హత్వా దారుకనామానం రాక్షసం ధర్మఘాతకమ్ ।
స్వభక్తం వైశ్యనాథం చ త్రిరక్షత్సు ప్రియాభిధమ్ ॥
లోకానాముపకారార్థం జ్యోతిర్లింగ స్వరూపధృక్ ।
సంతస్థౌ సాంబికశ్శంభుర్బహులీలాకరః ప్రభుః ॥

ఆ జ్యోతిర్లింగములలో తొమ్మిదవ అవతారము వైద్యనాథుడు. అనేకలీ◌ీలలను ప్రకటించు ఆ ప్రభుడు రావణుని కొరకై ఆ రూపములో ఆవిర్భవించినాడు (38). రావణుడు తనను గొని పోవుట అను మిషను ఆధారముగా చేసుకొని మహేశ్వరుడు చితాభూమియందు జ్యోతిర్లింగ స్వరూపములో వెలసి యున్నాడు (39). వైద్యనాథేశ్వరుని పేరు ముల్లోకములలో ప్రసిద్ధిని గాంచెను . ఆయనను భక్తితో దర్శించి పూజించు వారలకు ఆయన భుక్తినీ ముక్తిని కూడ ఇచ్చును (40). ఓ మహర్షీ! వైద్యనాథేశ్వరుని రూపములో అవతరించిన శివుని మాహాత్మ్యమును మరియు ఈ ఉపదేశమును పఠించువారలకు మరియు వినువారలకు కూడ భుక్తి, ముక్తి లభించును (41). పదియవ అవతారము నాగేశ్వరుడని కీర్తింపబడినాడు. సర్వదా దుష్టులను శిక్షించు శివుడు తన భక్తుని కొరకై ఆ రూపములో ఆవిర్భవించినాడు (42). ఆయన ధర్మవిధ్వంసియగు దారుకాసురుని సంహరించి వైశ్య ప్రభువు, తనకు భక్తుడు అగు సుప్రియుని రక్షించెను (43). అనేక లీలలను ప్రకటించు ఆ శంభు ప్రభుడు లోకములకు ఉపకారమును చేయుట కొరకై పార్వతితో గూడి జ్యోతిర్లింగరూపములో ప్రకటమై స్థిరముగా నెలకొనెను .

తద్దృష్ట్వా శివలింగం తు మునే నాగేశ్వరాభిధమ్ ।
వినశ్యంతి ద్రుతం చార్చ్య మహాపాతకరాశయః ॥
రామేశ్వరావతారస్తు శివస్యైకాదశః స్మృతః ।
రామచంద్ర ప్రియకరో రామసంస్థాపితో మునే ॥
దదౌ జయవరం ప్రీత్యా యో రామాయ సుతోషితః ।
ఆవిర్భూతస్సలింగస్తు శంకరో భక్తవత్సలః ॥
రామేణ ప్రార్థితోఽత్యర్థం జ్యోతిర్లింగ స్వరూపతః ।
సంతస్థౌ సేతుబంధే చ రామసంసేవితో మునే ॥
రామేశ్వరస్య మహిమాద్భుతోఽభూద్భువి చాతులః ।
భుక్తి ముక్తి ప్రదశ్చైవ సర్వదా భక్తకామదః ॥
తం చ గంగాజలేనైవ స్నాపయిష్యతి యో నరః ।
రామేశ్వరం చ సద్భక్త్యా స జీవన్ముక్త ఏవ హి ॥
ఇహ భుక్త్వాఖిలాన్ భోగాన్ దేవతాదుర్లభానపి ।
అంతః ప్రాప్య పరం జ్ఞానం కైవల్యం మోక్షమాప్నుయాత్ ॥

ఓ మునీ! నాగేశ్వరుడను పేరు గల ఆ శివలింగమును చూచి అర్చించినచో, వెంటనే మహాపాపముల గుట్టలైననూ పూర్తిగా నశించును (45). శివుని పదకొండవ అవతారము రామేశ్వరుడని స్మరింపబడినది, ఓ మునీ! రామునిచే స్థాపించ బడిన ఆ రామేశ్వరుడు రామచంద్రునకు హితమును కల్గించినాడు (46). భక్త ప్రియుడగు ఆ శంకరుడు లింగరూపములో ఆవిర్భవించి మిక్కిలి సంతసించినవాడై రామునకు విజయమును వరముగా నిచ్చెను (47). ఓ మునీ! రామునిచే సేవింపబడిన ఆ శివుడు రామునిచే అధికముగా ప్రార్థింపబడి సేతుబంధమునందు స్థిరముగా వెలసెను (48). రామేశ్వరుని మహిమ అద్భుతమైనది. భూలోకములో దాని సాటి మరియొకటి లేదు. రామేశ్వరుడు, సర్వదా భక్తులకు కామములను, భుక్తిని, ముక్తిని కూడ ఇచ్చుచుండును (49). ఏ మానవుడు ఆయనను గంగా జలముతో మహాభక్తి పూర్వకముగా అభిషేకించునో, ఆ మానవుడు ఆ రామేశ్వరుని అనుగ్రహముచే జీవన్ముక్తుడగును (50). అట్టివాడు ఇహలోకములో దేవతలకు కూడ దుర్లభమగు భోగములనన్నిటినీ అనుభవించి దేహత్యాగానంతరము పరమ జ్ఞానమును మోక్షమును పొందును .

ఘుశ్మేశ్వరావతారస్తు ద్వాదశశ్శంకరస్య హి।
నానాలీలాకరో ఘుశ్మానందదో భక్తవత్సలః ॥
దక్షిణస్యాం దిశి మునే దేవశైల సమీపతః ।
ఆవిర్బభూవ సరసి ఘుశ్మా ప్రియకరః ప్రభుః ॥
సుదేహయామారితం ఘుశ్మాపుత్రం సాకల్యతో మునే ।
తుష్టస్తద్భక్తితశ్శంభుర్యోఽరక్షద్భక్తవత్సలః ॥
తత్ప్రార్థితస్స వై శంభుస్తడాగే తత్ర కామదః ।
జ్యోతిర్లింగ స్వరూపేణ తస్థౌ ఘుశ్మేశ్వరాభిధః ॥

తం దృష్ట్వా శివలింగం తు సమభ్యర్చ్య చ భక్తితః ।
ఇహ సర్వసుఖం భుక్త్వా తతో ముక్తిం చ విందతి ॥
ఇతి తే హి సమా ఖ్యాతా జ్యోతిర్లింగావలీ మయా ।
ద్వాదశప్రమితా దివ్యా భుక్తి ముక్తి ప్రదాయినీ ॥
ఏతాం జ్యోతిర్లింగ కథాం యః పఠేచ్ఛృణుయాదపి ।
ముచ్యతే సర్వపాపేభ్యో భుక్తిం ముక్తిం చ విందతి ॥
శతరుద్రాభిధా చేయం వర్ణితా సంహితా మయా ।
శతావతారసత్కీర్తి స్సర్వకామఫలప్రదా ॥
ఇమాం యః పఠతే నిత్యం శృణుయాద్వా సమాహితః ।
సర్వాన్ కామానవాప్నోతి తతో ముక్తిం లభేద్ధ్రువమ్ ॥
ఇతి శ్రీ శివమహాపురాణే శతరుద్రసంహితాయాం ద్వాదశ జ్యోతిర్లింగ వర్ణనం నామ ద్విచత్వారింశోఽధ్యాయః.

॥ సమాప్తా శతరుద్రసంహితా ॥

శంకరుని పన్నెండవ అవతారము ఘుశ్మేశ్వరుడు. భక్తవత్సలుడగు శివుడు అనేక లీలలను ప్రకటించి ఘుశ్మకు ఆనందమును కలిగించెను (52). ఓ మునీ! దక్షిణ దిక్కునందు దేవశైలమునకు సమీపములో శివుడు సరస్సునందు ఆవిర్భవించి ఘుశ్మకు ప్రీతిని కలిగించినాడు (53). ఓ మహర్షీ! సుదేహ ఘుశ్మయొక్క పుత్రుని సంహరించగా, ఆమె భక్తికి భక్త వత్సలుడగు శంభుడు సంతసించి ఆతనిని పూర్తిగా రక్షించెను (54). ఆమె ప్రార్థించగా ఆ శంభుడు ఆమె కోర్కెను ఈడేర్చువాడై అచటి సరస్సులో ఘుశ్మేశ్వరుడను పేర జ్యోతిర్లింగరూపుడై వెలసెను (55). ఆ శివలింగమును దర్శించి భక్తితో ఆరాధించు వ్యక్తి ఇహలోకములో సుఖములనన్నిటినీ అనుభవించి తరువాత ముక్తిని కూడా పొందును (56). ఈ తీరున నేను నీకు భుక్తిని ముక్తిని ఇచ్చే దివ్యమగు పన్నెండు జ్యోతిర్లింగముల క్రమమును చక్కగా చెప్పియుంటిని (57). ఈ జ్యోతిర్లింగవృత్తాంతమును ఎవడు పఠించునో, లేక వినునో వాడు పాపములన్నింటి నుండి విముక్తుడై భుక్తిని మరియు ముక్తిని పొందును (58). నేను ఇంతవరకు శతరుద్రసంహితను వర్ణించితిని. కోర్కెలనన్నిటినీ ఈడేర్చి ఫలములనిచ్చే ఈ సంహితయందు వంద అవతారముల పుణ్య కీర్తి వర్ణింపబడినది (59). ఎవడైతే దీనిని నిత్యము పఠించునో లేదా సమాహితచిత్తుడై వినునో, వాడు అభీష్టముల నన్నింటినీ పొంది పిదప నిశ్చయముగా ముక్తిని పొందును (60).

శ్రీ శివమహాపురాణములో శతరుద్ర సంహితయందు ద్వాదశజ్యోతిర్లింగ వర్ణనమనే నలుబది రెండవ అధ్యాయము ముగిసినది .

॥ శతరుద్ర సంహిత ముగిసినది ॥

హరిః ఓం తత్సత్

శ్రీకృష్ణార్పణమస్తు

★★★★★